
# అడివి బాపిరాజు రచనలు -6



## అడవిశాంతిశ్రీ ✦ అంశుమతి

చారిత్రాత్మక నవలలు

Blank Page

# అడివి బాపిరాజు రచనలు

## 6

❖ అడవి శాంతిశ్రీ

❖ అంశుమతి

• చారిత్రాత్మక నవలలు •

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 01.

*ADIVI BAPI RAJU RACHANALU vol - 6*

**ADAVI SANTHISREE , AMSUMATHI *(Historical Novels)***

ప్రచురణ నెం. : 2350/255

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2010

© కె. బాపిరాజు

**వెల : రూ. 160**

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,**
విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : 24744580/24735905
**E-mail : visalaandhraph@yahoo.com,**
www.visalandra.vcomnet.co.in

**విశాలాంధ్ర బుక్ హౌస్,**
అబిడ్స్ & సుల్తాన్ బజార్ - హైదరాబాదు, విజయవాడ, అనంతపురం, విశాఖపట్నం, హన్మకొండ, గుంటూరు, తిరుపతి, కాకినాడ, కరీంనగర్, ఒంగోలు, శ్రీకాకుళం.

**హెచ్చరిక:** ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంతగానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణకర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా, కాపీరైట్ చట్టరీత్యా నేరం. - **ప్రచురణకర్తలు**

ముద్రణ : **శ్రీ కళాంజలి గ్రాఫిక్స్**, హైదరాబాద్

# అడివి బాపిరాజు జీవిత సువర్ణ రేఖలు

| | | |
|---|---|---|
| అక్టోబరు 8, 1895 | : | జననం (భీమవరం, ప.గో. జిల్లా) |
| 1903 | : | ప్రాథమిక విద్య, కొవ్వూరు |
| జూన్ 5, 1915 | : | వివాహం, కూర్లేగారి శిష్యత్వం ప్రారంభం |
| 1917 | : | ఇంటర్ |
| 1920 | : | బి.ఎ., జాతీయ కాంగ్రెస్‌లో సభ్యత్వం |
| 1921 | : | (సహాయ నిరాకరణోద్యమంలో) అరెస్టు, పుత్ర వియోగం. |
| 1922 | : | సత్యాగ్రహం, అరెస్టు |
| 1923 | : | చిత్రకళా విద్యార్థిగా ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోదకుమార ఛటోపాధ్యాయ శిష్యత్వం |
| 1924 | : | "గయా కాంగ్రెస్"లో పాల్గొన్నారు |
| 1931 | : | బి.ఎల్ |
| 1934 | : | ఆంధ్ర విశ్వకళాపరిషత్ నిర్వహించిన నవలా పోటీలో 'నారాయణరావు' నవలకు శ్రీ విశ్వనాథవారి "వేయి పడగలు"తో పాటు ప్రథమ బహుమతి |
| 1935 | : | బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాల్ పదవి |
| 1936 | : | భార్య సుభద్రమ్మ గారికి అనారోగ్యం ప్రథమ పుత్రిక రాధా వసంత గారికి పోలియో |
| 1949 | : | కుమార్తెలు రాధా వసంత, ప్రేమకుమారి గార్ల వివాహం. |
| 1950 | : | కనకాభిషేకం; మద్రాసు తెలుగు భాషా సమితి ఆధ్వర్యాన తయారైన తెలుగు విజ్ఞాన సర్వస్వానికి, సాహిత్యం, భాష, కళలు, విద్య మొదలైన విషయాలకు సంబంధించిన సంపుటం తయారు చేసే ఉపసంఘంలో సభ్యత్వం. |
| 1951 | : | సింహళంలోని సిగిరియా గుహల్లో గల కుడ్య చిత్రాల ప్రతిరూపాల చిత్రణకై పరిశీలన యాత్ర. |
| సెప్టెంబరు 22, 1952 | : | మరణం. |

**జననం : 8-10-1895 : : మరణం : 22-9-1952**

# అడివి బాపిరాజు సృజనా వైజయంతిక

## నవలలు :

**సాంఘిక :** నారాయణరావు (1934), తుపాను (1945), కోనంగి (1946), నరుడు (1946), జాజిమల్లి (1951).

**చారిత్రక :** హిమబిందు (1944), గోన గన్నారెడ్డి (1945), అడవి శాంతిశ్రీ (1946), అంశుమతి (1951).

**అముద్రితాలు :** మధురవాణి (పూరణ : దిట్టకవి శ్యామలాదేవి), శిలారథం (అసంపూర్ణం), కైలాసేశ్వరుడు (అసంపూర్ణం).

**కథా సంపుటాలు :** అంజలి (6), తరంగిణి (7), తూలికా నృత్యం (3),
**(వాటిలో కథల సంఖ్య)** భోగీర లోయ (6), రాగమాలిక (9), వింధ్యాచలం (4).

**మొత్తం కథలు 41 :** (ఆరు సంపుటాల్లో - 35, లభ్యం అయినా అముద్రితం - 1, అసంపుటీకృతం - 1, అసంపూర్ణం - 1, రేడియో కోసం రాసింది - 1, నారాయణరావు నవలలో పాలేరు చెప్పిన కథ - 1, అలభ్యం (పంజరం అనేది) - 1).

## కవితా సంపుటాలు :

**ప్రచురణ అయినవి :** తొలకరి (1922), గోధూళి (1938), శశికళ (1954)

**ప్రచురణ కానివి :** అంజలి (19), చిగురుటాకులు (21), జ్యోతి (32), బాపు (43), ఆంధ్ర (51), దీపమాల (44), శిల్ప బాల (23), సుషమా చంద్రికలు (63), బాపిరాజు వచనాలు (13), గడ్డిపూల పల్లెము (32), ఇతర గేయాలు (42) జానపద గేయాలు (27), జంగం కథలు (6).

## నాటికలు :

**రేడియో నాటికలు :** భోగీర లోయ, నారాయణరావు, శైలబాల, ఉషాసుందరి, పారిజాతం, నవోదయం, దుక్కిటెద్దులు, ఏరువాక.

**ఏకాంకికలు :** ఆంధ్ర సామ్రాజ్ఞి (1944), కృతి సమర్పణం (1944), బొమ్మలు (1946), గుడ్డిపిల్ల (1954 – మరణానంతర ప్రచురణ).

## వ్యాసాలు :

ముద్రితాలు - తెలుగు (57), ఇంగ్లీషు (3)
అముద్రితాలు - తెలుగు (8), ఇంగ్లీషు (2).

**రేడియో ప్రసంగాలు :** 7

**పత్రికలు, సంపాదకత్వం :** తెలుగు : అభినవాంధ్ర సాహిత్యం (1915 - రాజమండ్రి), మీజాన్ (1944-1947), హైదరాబాదు; ఇంగ్లీషు : త్రివేణి (మచిలీపట్నం - సబ్ ఎడిటర్)

**అనువాద గ్రంథం :** "నా పడమటి ప్రయాణం"

**సాహిత్య లేఖలు :** సుమారు 50

## చిత్రకళాకేళి :

**చలనచిత్ర "కళాదర్శకత్వం" :** సతీ అనసూయ - ధ్రువ విజయం (1935), మీరాబాయి (1940), పల్నాటి యుద్ధం (1944).

**జలవర్ణ చిత్రాలు** (47), **తైలవర్ణ చిత్రాలు** (2), **రేఖా చిత్రాలు :** విశ్వనాథ సత్యనారాయణ- కిన్నెరసాని పాటలు - **ముఖచిత్రం : లోపలి చిత్రాలు** (4), శృంగార వీథి (1), నండూరి సుబ్బారావు - ఎంకి పాటలు (2), **పత్రికలలో కథలకు :** నాగరాజు (భారతి - జనవరి 1927), అతిథి దేవుడు (భారతి - మే 1927), హిమాలయరశ్మి (భారతి - జనవరి - 1937), నాగలి (భారతి), భోగీర లోయ (భారతి), తూలికానృత్యం (భారతి), **పెన్సిల్ స్కెచ్‌లు :** కడలూరు జైలులో ఉన్నప్పుడు వేసినవి, ఫిడేలు నాయుడుగారి కచ్చేరి, రామప్ప గుడిలోని "నాగినీ నృత్యం" చూసి, సాలార్‌జంగ్ మ్యూజియంలోని "నవాబుల హుక్కా" చూసి (ఇంకా చాలా ఉన్నాయని రాధా వసంత గారు తెలియజేస్తున్నారు).

### బాపిరాజు రచనలు విషయంగా పిహెచ్.డి., ఎమ్.ఫిల్. వ్యాసాలు

డా॥ ధనిరెడ్డి విజయలక్ష్మీదేవి (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) 1980, డా॥ వి. తిరుపతయ్య (ఉస్మానియా విశ్వవిద్యాలయం) 1982, డా॥ మన్నవ సత్యనారాయణ (నాగార్జున విశ్వవిద్యాలయం) 1984, డా॥ వి. సిమ్మన్న (ఆంధ్ర యూనివర్సిటీ) 1985, శ్రీ శెట్టి వెంకట నారాయణ (కాకతీయ విశ్వవిద్యాలయం) 1987, శ్రీమతి వి. వనజ (కాకతీయ విశ్వవిద్యాలయం) 1984, శ్రీమతి రమారాణి (కాకతీయ విశ్వవిద్యాలయం) 1986.

### బాపిరాజు సంస్మరణ సంచికలు

1. కులపతి (1954) : సంపాదకత్వం - శ్రీ రావులపర్తి భద్రిరాజు, 2. చుక్కాని (1962) : సంపాదకత్వం - శ్రీ కంచి వాసుదేవరావు, 3. నాదబిందు శశికళ (1985) సంపాదకత్వం - డా॥ దిట్టకవి శ్యామలాదేవి, 4. అడివి బాపిరాజు - శతవార్షిక కళా-సాహిత్య ప్రత్యేక సంచిక (1995), సంపాదకత్వం - భ.రా.గో.

* * *

## మీరు చదివారా!

# అడివి బాపిరాజు గారి రచనలు 7 సంపుటాల్లో...

| | | | |
|---|---|---|---|
| 1. మొదటి సంపుటం | : | నారాయణరావు (సాంఘిక నవల) | రూ. 160 |
| 2. రెండవ సంపుటం | : | హిమబిందు (చారిత్రాత్మక నవల) | రూ. 150 |
| 3. మూడవ సంపుటం | : | తుపాను (సాంఘిక నవల) | రూ. 150 |
| 4. నాల్గవ సంపుటం | : | గోన గన్నారెడ్డి (చారిత్రాత్మక నవల) | రూ. 125 |
| 5. అయిదవ సంపుటం | : | కోనంగి (సాంఘిక నవల) | రూ. 150 |
| 6. ఆరవ సంపుటం | : | అడవి శాంతిశ్రీ, అంశుమతి (చారిత్రాత్మక నవలలు) | రూ. 160 |
| 7. ఏడవ సంపుటం | : | నరుడు, జాజిమల్లి (సాంఘిక నవలలు) | రూ. 100 |

మనవి : అడివి బాపిరాజు గారి – **కథా సంపుటాలు** : తరంగిణి, తూలికా నృత్యం, భోగీర లోయ, వింధ్యాచలం, **కవితా సంపుటాలు** : అంజలి, చిగురుటాకులు, జ్యోతి, బాపు, ఆంధ్ర, దీపమాల, శిల్పబాల, సుషమా చంద్రికలు, గడ్డిపూల పళ్ళెం, గోధూళి, తొలకరి, శశికళ, జంగం కథలు, జానపద గేయాలు – ఇతర గేయాలు మాకు లభించలేదు. కావున వారి మిత్రులు, అభిమానుల వద్ద వుంటే పంపి సహకరించప్రార్థన.

– **ప్రకాశకులు**

# అడవి
# శాంతిశ్రీ

• చారిత్రాత్మక నవల •

Blank Page

# అడవి శాంతిశ్రీ

• చారిత్రాత్మక నవల •

ఉపక్రమణిక

## కన్నబెన్నా

మహాబలేశ్వర జటామకుటవినిర్గత సుందరీ! కన్నబెన్నా! పశ్చిమాద్రితనయా! మలయసానుజా! శీతలవాయుదేవ సహోదరీ, నీలనదీ మృగమదము గదంబించే నీ నీలనీరాలలో విజయపుర ఇక్ష్వాకురాజాంతఃపుర వక్షోజ చందన చర్చలు కలసి కదలిపోతున్నవి.

ఏనాటి కాంతవు! యుగయుగాల నుండి నీవు గంభీరంగా ప్రవహిస్తున్నావు నువ్వు. గంగా సింధు యమునా బ్రహ్మపుత్రలు నీకు కడగొట్టు చెల్లెళ్ళు. నీవూ, గోదావరి కవల పిల్లలు. నీవే జంబూనదివి. నీ ఇసుకలో బంగారు కణికలు, బంగారు రజను మిలమిల మెరసిపోయేది. ఈనాటికి నీ తీరాన స్వర్ణగిరి నిలిచి ఉంది. బంగారు గనులు నీ యొడ్డుల తలదాచుకొన్నవి. నీ గంభీర గర్భములో జగమెరుగని వజ్రాలు రత్నాలు నిదురిస్తున్నవి. నీది రతనాలబొజ్జ.

కృష్ణవేణీ! నీలనదీ! ప్రేమమయీ! అనేకాంధ్ర సార్వభౌమ సహచరీ! ఆంధ్రాంగనా! నీవు నీలవపుషవై, లోకానికి నిత్యత్వాన్ని ఉపదేశిస్తూ ఉంటావు. నీవు నిర్మలాంగివై, నిత్యసృష్టిని లోకానికి పాటపాడి వినిపిస్తూ ఉంటావు. ప్రతియామినీ నీరవఘటికలలో నీ అక్క గోదావరితో హృదయమార వాకోవాక్యాలు పలుకుతూ ఉంటావు. నీవు ఆంధ్ర వసుంధరా నీల మేఖలవు.

గోదావరి ఏకావళి. మహానదీ తపతులు ఆయమ్మ బాహువులు. నర్మద చెంపసరులు. కావేరి వేగైలు ఆమెకు మంజీరాలు.

కృష్ణవేణీ! దివ్యసుందరీ! మనోహర నృత్యవిలాసినీ! నమోనమస్తే.

# ఆంధ్రి

**కొ**న్ని కోట్లకోట్ల సంవత్సరాల క్రిందట నువ్వు రూపెత్తి ఉంటావు ఆంధ్రదేవీ! ఆ దినాలలో, ఆ వేడిలో, ఆ ఉబికిపోయే అగ్నికుండాలలో, ఆ మెట్టలలో, పల్లాలలో, ఆ ఉబ్బలిలో, ఆ మట్టల మహారణ్యాలలో ప్రయాణం చేసే నీ బిడ్డలు గోదావరీ కన్నబెన్నాది వాహినులు నీతోపాటే అవతరించిన సముద్రుణ్ణి చేరడానికి ఎంత ఆయాసపడిపోయినవో!

లక్షలు లక్షలు సంవత్సరాలు నీవు బాలగండాలుదాటి, చల్లబడిన వెనుక జంబూద్వీపపు టొడిలో ఆడుకొంటూ, ఉదయ సముద్రతీరాల ఇసుకలతో బొమ్మరిళ్ళు కట్టుకునేదానవు. ఆ నాళ్ళలో నీవు శూన్యకటీరవు. ఆంధ్రభూమీ! ఇంకను లక్షల సంవత్సరాలు గడిచాయి సుమా! నీ నదుల ఒడ్డులతో అడవులు భూగర్భంలో ఇంకి బొగ్గుగనులవుతున్న ఘడియలవి. వికృతరూపాలతో వీర విహారంచేసే ఆ సరీసృపాలు నశించాయి. కొత్త జంతువులు క్రిములు, కీటకాలు ఉద్భవించాయి. ఆ దినాల్లోనే తమః ప్రధానుడైన మానిసి నీ అంకతలాన ఆడుకొన్నాడు. ఆ రెండుకాళ్ళ జంతువుకు ఏ కొంచెమో మనస్సు ఉంది. అతడు రాత్రించరుడు, ఆతడు మాంసా శనుడు.

ఇంకా లక్షల సంవత్సరాలు గడిచినాయి. సాత్విక రాజసులైన అసురులు సముద్రతీరాల రాజ్యాలు ఏర్పరుచుకొన్నారు. వారు పొడుగరులు, తెల్ల మేనులవారు, పైడివన్నె కేశపాశాలవారు. ఆర్షమూ అనార్షమూ అయిన భగవద్విచారము చేయగలవారు.

ఓ గోదావరీ, ఓ కృష్ణవేణీ! మీరు వీరప్రసవిణులు. సంస్కార ప్రియులైన ఆ అమరసంతతులు మీ తీరాల అనేక నగరాలు నిర్మించారు. వారి నగరాలు జగత్ప్రసిద్ధి పొందినవి. వారు శివపూజాధురంధరులు. గోదావరీ కన్నబెన్నల వెన్నుదన్ని పుట్టిన సింధునదీ తీరాలలో ఎంతో నాగరికత వృద్ధిచేసుకొని, హిమాలయ లోయలనుండి దిగివచ్చిన ఆర్యజాతులవారి వలన ఆ అసురులు ఓడిపోయారు. అంతట పశ్చిమ జంబూ ద్వీపం పొడుగునా వారు సముద్రయానం చేస్తూ పశ్చిమసముద్రంలో లంక మొదలయిన దీవులలో కొందరు ఆగిపోగా, మిగిలినవారు ఇంకా దక్షిణానికి పోయి ఆ దినాలలో ఇంకా పేరులేని కన్యకాగ్రం చుట్టివచ్చారు. వారిలో కొందరు కావేరీ ముఖద్వారంలో ఆగిపోయారు. ఇంకా కొందరు ఉత్తరంగా వచ్చి దక్షిణ పినాకిని ముఖద్వారంలో ఆగారు. ఇంకా కొందరు ఉత్తర పినాకిని కన్నబెన్నా గోదావరీ ముఖద్వారాలలో ఆగినారు దేవీ!

ఇంకా కొన్ని వేల సంవత్సరాలు గడచినాయి. అసురుల అన్నదమ్ములైన ఆర్యులలో విభేదాలు పొడమి, ఆంధ్రు లనేవారు విడిపోయి మెట్ట దారిని వింధ్యను దాటి ఉత్తరకళింగం, అక్కడనుండి గోదావరీతీరం చేరుకొన్నారు. ఆంధ్రులలో కొందరు తెలుగునదీతీరాన ఆగిపోయినారు. కొందరు గోదావరి తీరాన ఆగిపోయినారు. కొందరు కన్నబెన్నా తీరానకు వచ్చి ఇదివరకే అచట వృద్ధిపొంది ఉన్న అసురులతో యుద్ధాలు సలపడం ప్రారంభించారు. ఆంధ్రరాజయిన విష్ణువునకు, అసురుడగు నిశుంభునకు ఎంతకాలమో యుద్ధం జరిగింది. నిశుంభాసురుడు హతుడైనాడు. ఆంధ్ర వంశ్యులు ప్రభువులైనారు. ఓ ఆంధ్రవసుంధరా! అంత నీపైడి కడుపున ఆంధ్రబాల అవతరించింది.

# చంద్రకళ

**త**ల్లీ, ఆంధ్రవసుంధరా! నువ్వు చంద్రకళాదేవివి! యుగ యుగాలనుండి అసురులకు చంద్రకళే దేవి. ఐసీస్, ఇస్తారతీ! ఈశానీ! ఈజిప్టులో, అసురదేశంలో

(అస్సీరియా) సింధుతీరంలో చంద్రకళాదేవి తన జ్యోత్స్నామందహాసాలలో బిడ్డలను ఓలలాడించి, వారి జీవితాలు అమృతమయాలు ఆనందపులకితాలు చేసినది.

ఆంధ్రమాతా! నీరూపము స్నిగ్ధపూర్ణ కౌముదీస్వచ్ఛము. నీ వామహస్తాన పుండరీకాలు శ్వేతకుముదాలు లీలాపుష్పాలై విలసిల్లుతున్నవి. నువ్వు త్రిభంగమూర్తివి. నీ అమృత పయస్సులను గోదావరీ కృష్ణవేణ్ణా పినాకినీ నాగావళీ తెలివాహ నదులలో ఆస్వాదిస్తున్నారు ఆంధ్రులు. భద్రాచల వేదాద్రులు నీ ఉత్తుంగ పయోధరాలు. నీవు సదాకోటి పత్రాల స్వర్ణ పద్మాసీనవు.

ఆంధ్రదేవీ! నీ సౌందర్యము చూచి ముగ్ధుడై నీ అంకమైన శ్రీశైల మునందే వసించినాడు మల్లికార్జునుడు. ఆనందమయీ! అమృతమయీ! ఆంధ్రమాయీ! నువ్వు చంద్రకళాదేవివి అవడంచేత కళలన్నీ నీ పెదవులలో నీ భ్రూ యుగ్మంలో, నీ హస్తాంగుళులలో వికసించుతున్నవి. నీ కంఠము మధురాతిమధుర గాంధర్వము! నీ దివ్యవాక్కు మహాకావ్యము "ఓ దినం సుందరీ! నీ తనయులు జగదేకసుందరులు. నీ సుతులు లోకరాధ్యులైన! ప్రజ్ఞావంతులు. కత్తిపట్టినా గంటముపట్టినా కుంచె పట్టినా గొడ్డలి పట్టినా విల్లు పట్టినా విపంచి తాల్చినా నీ పుత్రుల ఎదుట నిలువ గలిగినవారేరీ? వేద మాత నీతనయుల ముఖమందే వసిస్తూంది.

ఆంధ్రమాతా, భరతమాతకు అనుగుబిడ్డవు అపరాజితాదేవివి. అఖండ కీర్తి విశారదవు, ఓ ఆంధ్రదేవీ! నువ్వు తెలుగు తల్లివి, నీది తీయతీయని తెలుగుభాష. పూర్ణవర్ణ మాలాశోభితయై వేదాన్నే మధురంగా పాడగలిగిన మంత్రభాష. పరుషధ్వనులు నీచే సారళ్యమాధుర్యాలు అలవరచుకొన్నవి. ఓ ఆంధ్రమాతా! నీ కుమారుడు ఆపస్తంబుడు, బ్రహ్మర్షి సుమా! ఆతడు అతని సోదరుడు బోధాయనుడు!,

చంద్రకళాదేవి వయిన ఆంధ్రీ! శాతవాహనులు నీ అనుగు బిడ్డలు శ్వేతతారాదేవి వయిన ఓ తెలుగుతల్లీ, సిద్ధ నాగార్జునుడు నీకు గారాపు బిడ్డడు. మాధ్యమికవాదం నీయందుదయించి లోకాన్ని ఉద్ధరించింది. ఓ దివ్యసుందరీ! నీ బాలికలయిన గౌతమీ వాసిష్టదేవులు లోకైక సుందరులు. వారి బిడ్డలయిన శాతకర్ణి పులమావి చక్రవర్తులు ఆంధ్ర తేజస్సును తారాపథాని కందించినారు. త్రిలోకమోహినులైన నీ యాడుపడుచుల అందానికి, అలంకారకౌశలం పూలకు తావిలా సహజంగా అబ్బింది. ప్రసాధన శిల్పంలో సర్వస్త్రీజగత్తుకు వారిది ఆచార్యపీఠం.

ఆంధ్రదేవీ! నీ యనుగుకూతుళ్ళు పురుషులతో సమానంగా విద్యలూ. వీర వ్యవసాయ దీక్షలూ, లలితకళా కౌశలమూ నేర్చిన వీరసతులూ, వీరమాతలు. ఆనందమూర్తీ! ఆంధ్రమూర్తీ! నీ కన్నులలో లోకాల వెలిగించు వెలుగు, నీ నవ్వులో దేశాల తేలించు ఆనందము, నీ నడకలో సీమసీమల నాగరీకాలు దిద్దే ఒయ్యారమూ.

ఆంధ్రీ! నీవు కలువకంటివి, చిలుకల కొలికివి, తేనెవాతెఅదానవు తీగ చేతుల దానవు, పూబంతి గుబ్బెతవు, నీ నుదుట వెన్నెలవెలుగులు, నీ నోట కోకిలాలాపాలు, నువ్వు కులుకు మిటారివి, కటారి కత్తివి.

ఆంధ్రీ! నీ బిడ్డలు నిన్ను ప్రేమింతురు. నిన్ను పూజింతురు, నీ ఎదపై వ్రాలుదురు. నీకై తమ సర్వమూ అర్పింతురు.

తెలుగుతల్లీ! నీకు ఏటికోళ్ళు.

# ప్రథమ భాగం

# విజయ పురం

**అ**డవి బ్రహ్మదత్తప్రభువు ఉత్తమ కవి, ఉత్తమ సేనాపతి, ఉత్తమ రాజనీతి విశారదుడు. అతనికి కవిత్వావేశం కలిగితే ఆంధ్రప్రాకృతంలో, దేవభాషలో అనర్గళంగా గాథలు, కావ్యాలు సృష్టిస్తాడు. ఆటువంటి సమయాల్లో అతడు తన రాజనీతిని సేనాపతిత్వాన్ని మరచిపోతాడు.

అడవి బ్రహ్మదత్తప్రభువు ఆపస్తంబ సూత్రుడు, కృష్ణయజుర్వేద శాఖాధ్యాయి, విశ్వామిత్ర అఘమర్షణ దేవరాతత్రయార్షేయ సాంఖ్యాయనస గోత్రజుడు. బ్రహ్మదత్తుని తండ్రి ధనకమహారాజ అడవి ప్రియబల మహా సేనాపతి, దేవదత్తాభిధానుడు. బ్రహ్మదత్తప్రభువు తల్లి భరద్వాజ గోత్రోద్భవ, పల్లవబుద్ధీ చంద్రప్రభువు తనయ సాంఖ్యాయనస గోత్రము కౌశిక గోత్రోద్భవము.

ఆంధ్ర శాతవాహనులు కౌశిక గోత్రోద్భవులు. విశ్వామిత్ర సంతతి వారు. కాబట్టే వారు తమతో సంబంధాలు చేయుటకని భరద్వాజులను వాసిష్ఠులను కాశ్యపులను మాద్గల్యులను హరితసులను కుటుంబాలుగా కృష్ణా గోదావరీ తీరాలకు తీసుకొని వచ్చినారు. వారందరు మహేంద్రులైనారు.

కౌశికులలో రానురాను రెండు వంశాలు ఎక్కువ ప్రాముఖ్యము సముపార్జించు కొన్నవి. ఒక వంశము ఆ కాలంలోనే కృష్ణవేణ్ణకు ఎగువ అడవులు నిండి ఉన్న శ్రీపర్వత ప్రాంతాల ఆశ్రమాలు ఏర్పరచి, ఆటవిక ప్రభువుల లోబరచుకొని, ఆర్యనాగరికత వారి కలవరచి, క్షత్రియత్వమిచ్చినారు. కొందరికి శూద్రత్వ మిచ్చినారు. ఆటవికులలో మంత్ర వేత్తలకు వైశ్యత్వ మిచ్చినారు. వారి దేశము ధనకదేశము, వారు ధనకులై నారు. వారు చక్రవర్తులగు శాతవాహనులతో విడపడ్డవారు అన్న గుర్తుగా సాంఖ్యాయనగోత్రం తీసుకొన్నారు.

ఈ కౌశిక గోత్రికులు విశ్వామిత్ర వంశంనుండి సూటిగా వచ్చినవారు. తమ వంశఋషి దర్శించిన గాయత్రి మంత్రమునకున్న సాంఖ్యాయనస గోత్రమును వారు గ్రహించిరి. అడవిని సస్యశ్యామలంగా, బహుజనాకీర్ణంగా చేసినారు. గనుక ఈ సాంఖ్యాయనులకు అడవివారు అను బిరుదనామం వచ్చింది. ఆ అడవి ఫలభూమి అవడంవల్లను అక్కడ అనేక బంగారుగనులు రత్నాలగనులు ఉండడంవల్లను, అది ధనకదేశం అయింది. వీరే కృష్ణాతీరంలో ధనకటక నగరం నిర్మించారు.

శ్రీపర్వతము వీరి పర్వతము. కృష్ణవేణ్ణ ప్రవహించే ఆ లోయ అడవి వారిది. వారు ఆ సీమకంతకు ఋషులు, ప్రభువులు. ఈ అడవి సాంఖ్యాయనులే విజయపురము నిర్మించారు. వీరే శ్రీశైలమునందు మల్లికార్జునదేవుని ప్రతిష్ఠించినారు.

శాతవాహన సామ్రాజ్యము స్థాపించిన ప్రథమార్య ఋషి కౌశిక గోత్రోద్భవుడైన దీపకర్ణి కుమారుడు శాతవాహనుడు. ఆ శాతవాహనులు విజృంభించి తమ ప్రథమాంధ్ర ముఖ్యపట్టణమైన శ్రీకాకుళము వదలి సాంఖ్యాయనులు శుభప్రదము కావించిన శ్రీపర్వతానికి దిగువ వారు నిర్మించిన ధాన్యకటక మహానగరమును, ధనకులకోరికమీద ముఖ్యనగరం చేసుకొన్నారు. ఆ భూమి బంగారు పంటలు పండేది. కాబట్టి ఆ నగరం ధాన్యకటక నగరం అన్న పేరు పొందింది.

శాతవాహన సామ్రాజ్యము విజృంభించిన కొలది అడవి సాంఖ్యాయనుల ప్రాబల్యము తగ్గి, శాతవాహనులకు వారు సామంతులై ధనకటకాన్ని శాతవాహనుల కర్పించినారు.

శాతవాహనులలో శ్రీముఖుడు పాటలీపుత్రపురం రాజధానిగా మగధ రాజ్యమూ, సకల భూమండలము సార్వభౌముడై ఏలిన సుశర్మ కాణ్వాయన చక్రవర్తిని ఓడించి, తాను ఆంధ్రదేశానికే కాకుండా సర్వభూమండలానికి చక్రవర్తి అయి మగధ సింహాసనం ఎక్కినాడు.

సూర్యచంద్రుల సంతతివారై కృతయుగ కాలంనుంచి మనుష్యానంద రూపులైన చక్రవర్తులు సకలభూమండలం ఏలుతూ ఉండేవారు. ప్రథమంలో ఇక్ష్వాకు వంశస్థులు అయోధ్యలో చక్రవర్తి సింహాసనం స్థాపించారు. అలా కృత త్రేతాయుగాలు గడిచి పోయినాయి. ఆ వెనుక కురువంశరాజు హస్తినాపురంలో ద్వాపర యుగంలో చక్రవర్తి సింహాసనల నెలకొల్పినారు. అభిమన్యు సుతుడు పరీక్షిత్తు తర్వాత జనమేజయుడు మొదలయిన చక్రవర్తులకు బిమ్మట చక్రవర్తిత్వం శిశునాగవంశజులయిన మహా పద్మనందులకు సంక్రమించినది. వారు పాటలీపుత్రంలో చక్రవర్తి సింహాసనం స్థాపించారు. నందుల నాశనంచేసి మౌర్యులూ, వారిని నాశనం చేసి శృంగులూ వారిని నాశనంచేసి కాణ్వాయనులూ వరుసగా చక్రవర్తు లయ్యారు.

ఈ మధ్య రెండు పర్యాయాలు కౌశాంబిలో ఉదయనుని కాలంలో చక్రవర్తిత్వం ఉదయనుడు, ఆయన కుమారుడు నరవాహన దత్తుడు అనుభ వించారు. కాని సింహాసనం పాటలీపుత్రంలోనే ఉండిపోయినది.

కాణ్వాయనుల నుక్కడగించి శ్రీముఖశాతవాహనుడు జంబూద్వీప చక్రవర్తి అయిన వెనుక, ఆంధ్రక్షత్రియులలో గుప్తవంశంవారు శాతవాహనులకు రాజప్రతినిధులుగా ఉండి శాతవాహన సామ్రాజ్యం విచ్ఛిన్నం కాగానే స్వాతంత్ర్యం వహించి ఉత్తర భారతీయ చక్రవర్తు లయ్యారు.

ఇప్పుడు శాతవాహన చక్రవర్తి యజ్ఞశ్రీశాతకర్ణి రాజ్యం చేస్తూ ఉన్నారు. అడవిస్కంధ విశాఖాయనక బ్రహ్మదత్త ప్రభువు తండ్రి ప్రియబల దేవదత్తుడు తపస్సు చేసుకొనుటకు శ్రీ శైలక్షేత్రాటవులకు వెడలిపోయినాడు. తల్లి భారద్వాజనియైన నాగసిరిదేవి కుమారునకు వివాహము కాగానే తానూ భర్తగారి యాశ్రమమునకు తాపసిగా పోవ సంకల్పించుకొని విజయపురమునందే ఆగిపోయినది.

"నాయనా! మీ తండ్రిగారు కోరికోరి విసుగెత్తిపోయి, చివరికి వారి కోరిక నెరవేర కుండగనే, తపస్సుకు వెళ్ళిపోయినారు. ఎక్కడ ఉన్నదయ్యా మా కోడలు?"

"మీ కోడలా అమ్మా, నాకేమి తెలియును? నేను గాథలు పాడుతూ కలలుకంటాను, యుద్ధంచేస్తూ కలలు కంటాను, రాజసభలో కూర్చుని కలలు కంటాను. కలలు కనేవానికి పెళ్ళి ఎందుకు?"

"కలలుకనడం అందరికీ సామాన్యమే. అందరూ పెళ్ళిళ్ళు చేసికొనడం మానివేశారా?"

"అందరూ కలలు కంటారు. అయితే నన్ను తారసిల్లే స్వప్నాలు అవేవో చిత్రంగా ఉంటాయి."

"చిత్రంగా కలలుకాంచేవాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోరా?"

"అదికాదమ్మా! కలలకు పెళ్ళికి సంబంధం ఉందనికాదు, నా విషయంలో కొన్ని చిత్ర విచిత్ర భావాలు నన్ను పొదివికొని ఉన్నాయి. వానికీ నాపెళ్ళికీ సంబంధం ఉంది."

"ఇదేమి చిత్రమైనవాదమ్మా! ఎక్కడి మనుష్యుడివి నాయనా!" అడవి బ్రహ్మదత్త ప్రభువునకు ఇరువది ఒకటవ సంవత్సరము వచ్చింది. "గృహస్థువైగాని ధనకసింహాసనం ఎక్కకు నాయనా!" అని తండ్రి ఆదేశించడంవల్ల బ్రహ్మదత్తునికి ఇంకా రాజ్యాభిషేకం జరుగలేదు. ధనకరాజ్యానికి ముఖ్యనగరం గురుదత్తపురం.

స్కంధవిశాఖాయనక బ్రహ్మదత్తుడు ఏదో ఆవేదన పడుతున్నట్లు మహాసామంతులు చూసినారు. ఆతని తండ్రి మహారాజు శాంతిమూలునికి మహామంత్రి, మహాసేనాపతి, మహాదండనాయకుడు. ఆ ప్రియబల దేవదత్త ప్రభువు శ్రీశైలం వెళ్ళిపోగానే తానే ఇక్ష్వాకు మహారాజునకు మహామంత్రీ, మహాసేనాపతీ, మహాతలవరి, మహాదండనాయకుడు కావలసి వచ్చింది.

శాతవాహనులకు మహాతలవరియై, మహాదండ నాయకుడై, తాతగారు ధనక విజయశ్రీ ప్రభువు తన చిన్నతనంలో తనకు విద్యగరపుతూ "నాయనా! మా తాతగారినుండి విన్న శాతవాహన గాథలు జగదద్భుతములు. శాతవాహన సామ్రాజ్యము తూర్పు తీరంనుండి, పడమటి తీరానికి వ్యాపించి ఉండేది" అన్నారు.

"ఆ స్థితిని దాయాదులమూ, సామంతులమూ అయిన మనం సర్వదా కాపాడాలి" అన్నారు.

నాగర్జునదేవుడు విజయపురంలో నూటపది సంవత్సరాలు ఏమీ ఆరోగ్యం చెడకుండా, కృష్ణవేణ్ణకు ప్రక్కనున్న శ్రీపర్వతాశ్రమంలో ఉన్నారు. చిన్న తనంనుంచీ దేశాలు తిరిగి ఇక్కడే తపస్సుచేసి ఇక్కడే మహాసంఘారామం స్థాపించి పార్వతీయ సంప్రదాయం నెలకొల్పినారు. ఆ సంఘారామ పర్వతం ప్రక్కనే విజయపురం వెలిసింది. ఆ బోధిసత్వుని పేరనే ఆ పర్వతాలకు నాగార్జున పర్వతాలు అని పేరు వచ్చింది.

తన తాతగారు శ్రీ నాగార్జునదేవుడు శివుని అవతారమని బోధించినారు, మల్లికార్జునుడే నాగార్జునుడని వారు చెప్పుచుండేవారు. బౌద్ధులు వారిని బుద్ధావతార మంటారు. ఆ పరమ మహర్షి తనకు గురువులైనారు.

ఎందుకు తనకీ ఆవేదన? తాను ధనకరాజ్యంలో ధర్మం నాలుగు పాదాల నడిచేటట్లు చూస్తున్నాడు. ఇక్ష్వాకురాజ్యంలో బందిపోటులు లేవు. పంటలు పండుతున్నాయి. ధర్మం నాలుగు పాదాలా నడుస్తున్నది. తక్కిన సామంత దేశాలు సుభిక్షంగానే ఉన్నాయి. అయినా దేశంలో ఏదో అశాంతి, ఏదో ఆవేదన నిండిపోయింది. వేడిగాలులతో నిండి ఊపిరాడని వేసవికాలంలా ఉన్నది.

బ్రహ్మదత్తుడు ఉదయం లేస్తాడు. స్నానాదికాలు నిర్వహించి, సంధ్యావందనం అర్పించి, అగ్నిహోత్రార్చన నెరవేర్చి, స్కందజపమాచరించి, రాజ భవనంలోనికి వచ్చి ఒక ముహూర్తకాలం రాచకార్యాలు నిర్వహించుకొని సభనుండి లేస్తాడు. వెంటనే ఉత్తమాజానేయ మధివసించి అనుచరుల గూడి నగరసంచారం చేసి రెండుయామాలు పూర్తి కాకమునుపే కోటలోనికి వేంచేస్తాడు. మరల స్నానాదికాలు నిర్వహించి మధ్యాహ్నిక సంధ్యావందనం చేసి మహాఋషులు, పండితులు, చుట్టాలు, భిక్కులు తన పంక్తిని భుజింపగా భోజనం నిర్వహించి అందరి సెలవు అందుకొని, తాను రెండు విఘడియలు విశ్రమిస్తాడు. ఆ రెండు విఘడియలు భగవంతుని ధ్యానము చేస్తూ ఉంటాడు.

అక్కడనుండి ఆ ప్రభువు పండితులతో, ఋషులతో, భిక్కులతో విద్యావ్యాసంగము చేస్తారు. కవులు తమ రచనలను వినిపిస్తారు. ఈ పండిత గోష్ఠి అర్ధయామము జరుగుతుంది. బ్రహ్మదత్త ప్రభువు తనకు తోచిన పారితోషికాలు పండితులు మొదలయిన వారి కర్పించి సభ చాలిస్తాడు.

అచటనుండి మరల రాజసభ జరుగుతుంది. తన కడకు వచ్చిన అన్ని నేర నివారణలు ఆయన పండితుల సహాయంతో సలిపి, తీర్పులు చెప్పి అక్కడ నుండి అనేక రాజవ్యవహారాలు సమాలోచిస్తాడు. లేకపోతే మహారాజు శాంతిమూలుని కోటకు వెడతాడు. మహారాజు అపుడు మంత్రి దండనాయకులతో కలసి మంత్రాలోచన సభ జరుపుతాడు.

ఎక్కడెక్కడ పంటలు పండలేదో, ఎక్కడెక్కడ ప్రజలకు సహాయము కావలసి యున్నదో చర్చించి, ఈ విధముగా చేయవలెనని నిర్ణయించి, తాను లోనికి వెళ్ళిపోతాడు. బ్రహ్మదత్తప్రభువు మరల సంధ్యావందనము చేయును. జపతపాలు అయిన వెనుక ప్రభువు నూత్న విషయాలు శాస్త్రాలు చదువుకుంటాడు. భోజనాలవుతాయి. కొంతకాలానికి ప్రభువు తన శయన మందిరానికి వెళ్ళిపోవును.

దేశం అంతా సుభిక్షమై ఉన్నప్పుడు, దేశంలో ధర్మం ఆనంద నాట్యం చేస్తున్నప్పుడు, రాజులు నూతనాలయాలు, చైత్యాలు, గుహలు, నూత్న రాజపథాలు, సత్రములు, వైద్యశాలలు నిర్మిస్తారు. ఇప్పుడు ఆంధ్ర మహాసామ్రాజ్యములో యజ్ఞశ్రీ తన పూర్వీకులనాటి ధర్మం నిర్వహిస్తున్నాడు.

ఆదవిబ్రహ్మదత్తప్రభువునకు నిద్రపట్టదు. ఆయన ఆలోచిస్తూ తన శయన మందిర ప్రాంగణానకు వచ్చి, అచ్చటనుండి మెట్లమీదుగా పూలతోటలోనికి దిగి, ఆ తోటలో ఇటునటు నడయాడుతూ, గాథలు పాడుకుంటూ, రామాయణాది మహాకావ్యాలనుండి శ్లోకాలు చదువుకుంటూ ఏదియో ఆలోచిస్తూ చివరకు రెండుయామాలయిన వెనుక భగవంతుని ప్రార్థించి శయన తల్పం చేరుతాడు.

# 2

విజయపురం ఒక మహానగరం. ఈ నగరం చుట్టూ ఎత్తయిన కొండలున్నాయి. కొండలపైకి ఒక్కటేదారి ఉంది. ఈ మహానగరానికి తూర్పుగా ఉన్న కొండలలో ఒకచోట కొంత ఎత్తు తక్కువ ప్రదేశం ఉంది. అక్కడికి ఒక రాజపథం నిర్మించారు. అక్కడే ఒక పెద్దకోట గోడ, నాలుగు పెద్ద బురుజులు ఉన్నాయి. తక్కిన కొండలపైన అక్క దక్కడ బురుజులు మాత్రం ఉన్నాయి. ఈ మహానగరానికి కృష్ణవైపున రెండు లోయలున్నాయి. నగరంలో నూరు మహాకూపాలున్నవి. అమృతంవంటి నీటితో నిండి ఉంటాయి ఆ నూతులు.

కృష్ణ ఒడ్డువరకు రెండు లోయలలోను నగరం ఉన్నది. నగరం మధ్యనుంచి రెండు పెద్దరాజవీధులు కృష్ణ ఒడ్డునకు వెడతాయి. నగరం చుట్టి ఉన్న ఉత్తుంగగిరులపైన పడిన వాన నగరం మధ్యకు ప్రవహించి, రెండు వాగులై వస్తుంది. రెండు వాగులు రెండు లోయలగుండా పోయి కృష్ణలో కలుస్తాయి. వాన వచ్చినప్పుడు తప్ప ఈ వాగులలో నీరుండదు. ఈ రెండు వాగులకు నగరానికి దక్షిణంగా ఒక పెద్ద చెరువు నిర్మించారు నగర ప్రభువులు. ఆ చెరువునుండి అనేకమైన కాలువలు భూమిలో నిర్మించినారు. నగరమంతట ఉన్న తోటలకు, కేళాకూళులకు, క్రీడావనాలకు, సంఘారామాలకు ఆ కాలువలగుండా నీరు వస్తుంది. ఈ కాలువల నిర్మాణం వాస్తు శాస్త్రజ్ఞులు అద్భుతంగా నిర్వహించారు. భూమిలో లోతుగా కాల్వలు త్రవ్వినారు. ఆ కాలువలలో గట్టిరాళ్ళు దిమిస చేసిరి. ఆ రాళ్ళపైన చిన్నకాలువగా గాంధారించిన గట్టిరాళ్ళను వరుసగా పేర్చిరి. ఆ రాళ్ళపైన గాంధారించిన రాళ్ళను బోర్లింపగా, వాని మధ్య నలుపలకల గొట్టము ఏర్పడినది. ఆ పైన రాళ్ళతో నింపి కాలువ పూడ్చి సాధారణ భూమిని చేతురు.

విజయపుర మనగా ఆరామనగరమని ఆ కాలంలో పేరు మ్రోగిపోయింది. ఆ మహానగరంలో ఫలవృక్షముల తోటలు, తోటల మధ్య భవనములు ఉన్నవి. రాజవీధుల కీవలావల మనుష్యపథములు, వానికి పక్కగా ఫలపుష్ప వృక్షములున్నవి. నీలవర్ణములైన పర్వతాలపైనుండి క్రిందికి చూచినచో నగరమంతయు దివ్యవనవాటికవలె దర్శనమిచ్చును. దేవతలుకూడ ఆకాశ సంచారముమాని ఈ దివ్యనగరము చూడవత్తురట.

విజయపుర మహాచైత్యం జగత్ప్రసిద్ధము. కాబట్టే దేశదేశాల నుండి బౌద్ధభిక్షువులు విజయపురమునకు వచ్చి అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొన్నారు. ధాన్యకటక మహాచైత్యంలోవలె విజయపురమహాచైత్యంలోనూ తథాగతుని దివ్యధాతువు నిక్షిప్త మైనదట. విజయపురంలో ఎన్ని సంప్రదాయాలవారో సంఘారామాల నిర్మించుకొని ఉన్నారు. కాబట్టే జంబూద్వీపం అన్ని మూలలనుండి బౌద్ధభిక్షువులు ధాన్యకటకంతోపాటు విజయపురం కూడా దర్శించిపోతూ ఉంటారు.

సింహళ భిక్షువులు నగరానికి వాయవ్యాన ఉన్న శ్రీపర్వతంమీద సంఘారామాలు, చైత్యాలు నిర్మించుకొన్నారు. ఆ పర్వతంమీద ఇంకో చిన్న నగరం వెలిసింది. (ఈ దినాలలో శ్రీపర్వతానికి నల్లరాళ్ళబోడు అని పేరు.)

అడవిప్రియ బలదేవదత్త ప్రభువు ఇక్ష్వాకులకు దండనాయకుడు, మహాతలవరి. విజయపుర పరిపాలకుడు ఇక్ష్వాకు మహాప్రభువు పల్లవ భోగానికి, నాగమహావిషయమునకు మహారాజై శాతవాహనులకు మహాసామంతుడుగా పేరు పొందినాడు. దేవదత్తుని అనంతరమందు అడవి ధనకవంశజుడు స్కంధవిశాఖాయనక బ్రహ్మదత్తప్రభువు విజయపుర నగరపాలనాధికారం వహించగానే శ్రీశ్రీ శాంతిమూల మహారాజు బ్రహ్మదత్తునికి వీరఖడ్గము ప్రసాదించినారు.

బ్రహ్మదత్తప్రభు వాఖడ్గము ధరించి తన ఉత్తమాజానేయ, మధివసించి ఆ ఫాల్గుణ శుద్ధ విదియ ఉదయాన రెండవముహూర్త ప్రారంభంలో మహారాజు కోటగోపురం కడకు సపరివారుడై వెళ్ళినాడు. బ్రహ్మదత్తుని చూడగానే గోపుర ద్వారపాలకులు దళపతులు వీర నమస్కారాలిడినారు. బ్రహ్మదత్తుడు తిన్నగా కక్ష్యాంతరాలు దాటుచు మహాసభా భవనం ఎదుట గోపురంకడ తనవారువం దిగి లోనికి పాదచారియై వెళ్ళినాడు. అక్కడ దళపతులు, రక్షకులు బ్రహ్మదత్తునికి వంగి నమస్కారాలుచేసి సగౌరవంగా లోనికి "ఇటు ఇటు దేవా!" అని దారి చూపినారు.

బ్రహ్మదత్త ప్రభువు మహాసభామందిరం ప్రవేశించినాడు. సభలోని వారందరు లేచి ప్రభువునకు నమస్కారా లర్పించారు. బ్రహదత్తుడు ప్రతి నమస్కారాలిస్తూ సింహాసన వితర్దికకు కుడివైపున చిన్న పాలరాతి వితర్దికపై అధివసించినాడు. సభ్యులందరు ఆసీనులైరి. ఇంతలో తొమ్మిది శంఖాలు, మూడు కాహళాలు, మూడు విజయభేరులు వైతాళికుల జయజయధ్వానాలు వినవచ్చినవి. విప్రాశీర్వాదాలు, బౌద్ధభిక్షుకాశీర్వాదాలు వినబడుతూన్నవి. బ్రహ్మదత్తుడు, తక్కిన సభ్యులు ఒక్కుమ్మడి నిలబడినారు. సభాభవనానికి మహారాజు ప్రవేశించే సింహద్వారంలోంచి పండిత భిక్షుకాది పరివేష్ఠితుడై, వైతాళికులు బిరుదాలుపాడ మహారాజు విజయం చేసిరి.

"జయ జయ జయ శ్రీ ఇక్ష్వాకువంశ చూడమణీ! జయ జయ మహాతలవర, మహాసేనాపతి, మహాదండనాయక! జయ జయ ఆంధ్రశాతవాహన సార్వభౌమ ప్రసాదాత్త సింహాసన! జయ జయ! విరోధి మత్తగంకుంభ విదారణ పంచాననా! జయ జయ! వాసిష్ఠీపుత్ర శ్రీ శాంతిమూల మహారాజా! జయ జయ జయ!" అని విజయధ్వానాలు మిన్ను ముట్టినాయి. ఇక్ష్వాకు శాంతి మూల మహారాజు సింహాసనం అధివసించారు.

శాంతిమూల మహారాజుది బొద్దయిన విగ్రహం. తప్తకాంచన వర్ణుడు. మహా వీరుడు. ధనువుపై గుప్పెడు పొడవుండును. వెడద వక్షము. కోలమోము. గుప్పెడు మీసాలతో గంభీరమైన వదనము, విశాలఫాలము గల శుద్ధసత్వుడా మహారాజు.

## 3

**శాం**తిమూల మహారాజు సింహాసనం అధిష్టించగా సభ్యులంతా కూర్చున్నారు.

**మహారాజు:** బ్రహ్మదత్తప్రభూ! చక్రవర్తి ధాన్యకటకానికి ససైన్యంగా రమ్మని, శాత్రవులు శాతవాహనులపై దండెత్తుతున్నారని వేగు వచ్చిందికదా! మీరు సన్నాహంలో ఉన్నారు కదా?

**బ్రహ్మ:** చిత్తం మహాప్రభూ! పూంగి రాష్ట్ర ప్రభువులనూ వేంగి వారిని ససైన్యంగా వచ్చి కలుసుకోమని వార్త పంపించగలవాడను. ఈలోగా మన సైన్యం అంతా సిద్ధం చేయగలను.

**మహారాజు:** బ్రహ్మదత్తప్రభూ! మీకు బ్రహ్మదత్త బిరుదము, తమ తండ్రిగారికి దేవదత్త బిరుదము ఊరికే రాలేదు. మీ ఆలోచన మాకు అవశ్యం ఆచరణీయము. శ్రీయజ్ఞశ్రీ చక్రవర్తి వృద్ధులైనారు. సామ్రాజ్యంలో ఎక్కడి ప్రభువులక్కడ స్వాతంత్ర్యం వహించాలని కాబోలు మహారాజ బిరుదాలు వహిస్తున్నారు. ఈనాడు ఈ హీనమతులవల్ల మన భారం అధికమవుతున్నది.

**బ్రహ్మ:** మహాప్రభూ! తాము నాయందున్న ప్రేమచే అలా సెలవిస్తున్నారు. నేను తమకు ఆలోచన చెప్పగలవాణ్ణికాను. ఈనాడు తాము కదా శాతవాహన సామ్రాజ్యం నిలబెట్టుతున్నది! ఒకనాడు ఇక్ష్వాకు వంశం సకలజగత్తును ఏలింది. హిమాచలంనుంచి గౌతమి వరకూ కోసలదేశం రెక్కలు చాచి ఉండేది. మహాప్రభూ! మొదటినుండీ తమ వంశీయులు ధర్మాన్ని రక్షిస్తూనే ఉన్నారు.

**మహారాజు:** ప్రభూ! ఆ ఇక్ష్వాకుల ప్రతిష్టే ఇప్పుడు మాకు ఆవేదన కారణమయింది.

**బ్రహ్మదత్తు:** మహాప్రభూ! ఇప్పుడు సర్వదేశాలలోని పరిస్థితి ఆవేదన కారణమవుతున్నది. ధర్మరక్షణకొరకు యుద్ధాలు తప్పవు. బుద్ధదేవుడు లోకంలో యుద్ధాలు లేకుండా చేయాలని ప్రయత్నం చేశారు. కాని మానవ ప్రకృతిని ఎవరు మారుస్తారు? మానవుడు కూడా ఒక్కొక్కప్పుడు ద్విపాద పశువు అయిపోతాడు.

సభ పూర్తి అయ్యేవరకూ మహారాజు శాంతిమూలుడూ, దండనాయకుడూ, సేనాపతీ అయిన బ్రహ్మదత్తుడూ ఏవేవో మాట్లాడుతునే ఉన్నారు. సభలోని వారు కదలరాదు. మాట్లాడరాదు. అయితే ఎందుకు మహాప్రభువు ఒడ్డోలగమున్నారో తెలియలేదు. సభ్యులందరు మహారాజు ఆజ్ఞలకు, ఆలోచనకు ఎదురు చూస్తూ ఉండిరి.

మహారాజు కొన్ని విఘడియలు బ్రహ్మదత్తులతో మాట్లాడుచుండిరి. ఆ వెనుక బ్రహ్మదత్తప్రభువు సభ్యుల కనుగొని "మహారాజులవారు ససైన్యంగా ధాన్యకటకపురం వెడుతున్నారు. శ్రీ సార్వభౌములు యజ్ఞశ్రీ మహారాజు కోరడంచే అలా వెళ్ళవలసి వచ్చింది. మహారాజులవారితో నేను సేనాపతిగా వెడుతున్నాను. ఈలోగా రాజప్రతినిధిగా యువరాజులవారుంటారు. పూంగీయ రాష్ట్రపతి స్కంధశ్రీప్రభువు యువరాజులవారికి బాసటగా విజయపురంలో రాజ్యం చూస్తూ ఉంటారు" అని తెలిపినాడు.

యువరాజులైన శ్రీ వీరపురుషదత్తప్రభువు ఆనందార్హతుల ఆశ్రమంలో ధర్మగిరి విహారంలోనే చదువుకొంటున్నారు. ఆ ప్రభువున్ను ధర్మగిరి దిగి మహాసభకు వేంచేసినారు. వారికి పదునెనిమిది సంవత్సరాలు. వారు శ్రీ శాంతిమూల మహారాజు సింహాసనమునకు ఎడమచేతివైపున యువరాజు సింహాసనం అధివసించి ఉన్నారు. బ్రహ్మదత్తప్రభువు మహారాజు భావాలు తెలియజేయగానే యువరాజు వీరపురుషదత్తప్రభువు లేచి తండ్రిగారి పాదాల వ్రాలి "మహాప్రభూ! నాకున్నూ తమ సేనతో రావడానికి అనుజ్ఞ ఇవ్వాలని ప్రార్థిస్తున్నా" అని కోరినారు. మహారాజు చిరునవ్వుతో కుమారుని లేవనెత్తి అర్ధసింహాసనాన కూర్చుండబెట్టుకొన్నారు.

మహారాజు కుమారుణ్ణి చూచి "ప్రభూ! మీరు తప్పక రావలసిందే కాని, మీరు ముఖ్యంగా ఉజ్జయిని వెళ్ళవలసి ఉన్నది. ఇక్కడ వసంతోత్సవాలు అయినగాని మేము కదలము. రుద్రసేన మహారాజు మిమ్ము చూడాలనీ, మిమ్ము తమ హృదయానికి అదుముకోవాలనీ రాయబారము పంపినారు. మీరు మా ప్రతినిధులుగా పదివేల సైన్యం తీసుకొని ఉజ్జయిని వెళ్ళాలి" అని చిరునవ్వు మోమును వెలిగింప పలికినారు. వసంతోత్సవాలు ఫాల్గుణ శుద్ధ పంచమి నుండి పూర్ణిమ వరకు జరుగుతవి. ఇంక రెండు దినాలే ఉన్నది.

శాంతిమూల మహారాజు మాటలు ఎప్పుడూ గంభీరంగా ఉంటాయి. యుద్ధంలో ఎంత శుద్ధసత్వంతో విజృంభిస్తారో తదితర సమయాలలో అంత శాంతమూర్తిగా ప్రత్యక్షమౌతారు. దేవదత్తబిరుదాంకితుడూ, ఉత్తమ బ్రాహ్మణుడూ, సాంఖ్యాయనస గోత్రీకుడూ, ధాన్యకటకానికి తూర్పున ఉన్న ధనక రాష్ట్రధిపుడు, ధనకవంశజుడు అయిన అడవిప్రియబల దేవదత్తప్రభువూ, శాంతి మూలమహారాజు సహాధ్యాయులు. శాంతిమూల మహారాజునకు నలుబది అయిదు సంవత్సరాలున్నవి. ఆయన విశాలఫాలంలో ప్రజాప్రియత్వం అమృత శాంతిమయమై ప్రజ్వలిస్తూ ఉంటుంది.

తండ్రి మాటలు యువరాజశ్రీ వీరపురుషదత్త ప్రభువునకు అర్థం కాలేదు. ఎందుకు తాను ఉజ్జయిని పోవాలి? రుద్రసేన మహారాజు తన్ను చూడాలని కోరడంలో ఉద్దేశం ఏమిటి? వీరపురుషదత్త ప్రభువు అంత కన్న ఆలోచింప దలచుకొనలేదు. మాఠరిగోత్రజ అయిన మహారాణి తన తల్లి సారసికాదేవితో తానీ విషయం మాట్లాడి, తన గురువు ఆచార్య ఆనందులవారి సెలవుపొంది, ససైన్యంగా ఉజ్జయిని వెళ్ళవలసి ఉంది. ఈ ఆలోచనలతో తన ప్రాణస్నేహితుడైన బ్రహ్మదత్త ప్రభు వైపు చూచినాడు యువరాజు. ఆ సేనాపతి చిరునవ్వుతో "ప్రభూ! నేను ముహూర్తంపెట్టి సేవను సిద్ధంచేసి, సేనాపతిని నియమించి తమకు వార్త పంపుతాను" అని పలికినాడు.

సభ్యులెవ్వరికీ మాళవమహారాజు శ్రీ వీరపురుషదత్త ప్రభువును తమ కడకు రాయబారిగా ఎందుకు పంపుమని కోరినారో అర్థంకాలేదు. మహారాజు సాభిప్రాయంగా బ్రహ్మదత్త ప్రభువువైపు చూడగానే అచ్చట అధివసించియున్న పండితులు లేచి శ్రీశాంతిమూల మహారాజును, వీరపురుషదత్త ప్రభువును, ధర్మప్రభువైన సేనాపతి స్కంధ విశాఖాయనక ప్రభువును, ఇక్ష్వాకులను, రాజకుటుంబాలను, సర్వలోకాన్ని ఆశీర్వదించారు.

అందరు లేచి తథాస్తనిరి. మహారాజు సింహాసనంనుండి లేచి యువకుడైన స్కందవిశాఖ ప్రభువు భుజంపై కుడిచేయిమోపి, యువరాజు వీరపురుషదత్తుని మహారాజ ప్రాసాదానికి రమ్మనికోరి వారిరువురితో వెడలిపోయినారు.

బ్రహ్మదత్తప్రభువుది సుందరమైన విగ్రహం. ఆ ప్రభువు ధనుః ప్రమాణము (ఈనాడు ఆరడుగులు) కంటె ఒక అంగుష్టము ఎక్కువ పొడుగువాడు. పెద్దతల, విశాలస్కంధము. ఏనుగుల మూర్ధాలవంటి భుజాలు, కొండచరియవంటి వక్షం, మధ్యమమైన కోలమోమూ, గోమూర్ధకటీ, తీర్చిన కనుబొమలు, ఎత్తైన నాసికామూలం, గరుడచంపక నాసికల సంశ్లేషమైన ముక్కు, సమానమయిన ఉత్తరాధరోష్ఠాలు, కమలకల్మల చిబుకమూ, అంబకర్ణాలు, పోతపోసిన కంచుకంఠము, సమమైన చెంపలు, స్నిగ్ధఫాలం ఏనితో వెలిగిపోతూ ఉండే ఆతడు వేద వేదాంగ పారంగతుడు, బ్రహ్మజ్ఞుడు. కనుకనే ఆ ప్రభువును బ్రహ్మదత్తుడనే వారు.

విశాఖాయనక ప్రభువు నడక సింహపు నడక. మాట గంభీరము. పైశాచీ ప్రాకృతపాలీ సమ్మిశ్రితమైన ఆంధ్రభాషలో అనర్గళధారగా కావ్యసృష్టి చేస్తాడు. ఆ కావ్యాలు వీణపై అతడు పాడుతూంటే రాళ్ళు కరిగిపోతాయని ప్రజలు చెప్పుకుంటారు. విశాఖాయనకప్రభువు శాంతిమూల మహారాజుతో కలిసి కక్ష్యంతరాలు దాటి, మహారాజ ప్రాసాదాంతర్గతి సభామందిరం చేరాడు. మహారాజు విశాఖాయనక ప్రభువును అచట నిలిపి, దౌవారికులు దారి చూపుతూ ఉండగా పరిచారకులు కొలుస్తూ ఉండగా యువరాజుతో కలిసి లోనికి వెళ్ళిపోయినారు.

మహారాజు వెళ్ళిపోగానే బ్రహ్మదత్తప్రభువు మందిరం మధ్యనున్న సింహాసనానికి కొంచెం దూరంగా ఉత్తర కుడ్యం ప్రక్కనున్న ఆసనంపై అధివసించినాడు. ఆ మందిరము సంపూర్ణాలంకారయుతమై కుబేరభవనాన్ని మించి ఉంది. గోడలన్నీ చిత్రాలతో నిండి ఉన్నాయి. అయినా ఆ భవనంలో అతిత్వమేమీలేదు. మహారాజు బ్రాహ్మణ భక్తి కలవాడు. అగ్నిష్టోమ మాచరించిన క్రతుకర్త, ఉత్తమ బ్రాహ్మణ క్షత్రియుడు. బ్రహ్మదత్తుడు ఆ మందిరంలో ఒంటిగా కూర్చుండి, ఏవేవో ఆలోచించుకొంటూ ఉన్నాడు. ప్రజలు భగవత్స్వరూపులు, రాజులు ధర్మస్వరూపులు, ఋషులు పుణ్యస్వరూపులు. ఇంక బౌద్ధభిక్షువులు కర్మానుష్ఠాన స్వరూపులా!

ఇంతలో కొందరు చెలులు కూడ రా ఒక సఖియ భుజంపై చేయి వేచి, పదియారేళ్ళ జవ్వని ఒకర్తు ఆ సభామందిరంలోనికి గంభీరంగా నడుస్తూ వచ్చినది. ఆ యువతి మందిరంలోని రాగానే బ్రహ్మదత్తుడు లేచి నిలబడినాడు. ఆమె బ్రహ్మదత్త ప్రభువును చూచింది. ఆమెను బ్రహ్మదత్తుడు చూచి తల వాల్చుకొన్నాడు. ఆయమ సౌందర్యము అనన్యము. అతని సౌందర్యము అద్భుతము. ఆమె తెల్లబోయి ఆగిపోయినది. వెంటవచ్చే సఖివైపు ఎవరు వీరు అన్నట్లుగా చూచింది. ఆమె ఆ మందిరంలోనే ఉండవలసినదని మహారాజు ఆజ్ఞ.

# 4

ఎవరు ఈ బాలిక? ఇంత దివ్యసౌందర్య సమన్విత, ఎవరు ఈ బాలిక! ఇంత వర్ణనాతీత ఎవరు? అని అడవి బ్రహ్మదత్త ప్రభువు అనుకున్నాడు.

ఎవరు ఈయన? అని ఆ బాలిక అనుకొన్నది. అక్కడ ఉండుటా, వెళ్ళిపోవుటా? మహారాజు నన్నిచట ఉండుమనిరికదా? ఈ ప్రదేశం స్త్రీ జన సంచార యోగ్యమని మహారాజు ఎరుగరా?

ఇంతలో ప్రతీహారి వచ్చి, నిలువబడి ఉన్న స్కంధవిశాఖాయనక ప్రభువు వారివైపు వంగి చేతులు జోడించి, "ప్రభూ!" మహారాజకుమారి! మహారాజుల వారు వేంచేస్తున్నారు" అని మనవి చేసుకున్నాడు.

"ప్రభూ!" అని హృదయంలో ప్రశ్నించుకొన్నదా బాలిక. "మహారాజకుమారి! ఏమి శాంతిశ్రీ రాజకుమారియా" అనుకొన్నాడు బ్రహ్మదత్తుడు. ఈమె సౌందర్యము దేశాలలో రాష్ట్రాలలో కథలుగా చెప్పుకుంటారు. ఈమెను తనకీయవలసిందని ముసిక నగరప్రభువు పులమావి రాయబారము పంపినాడు.

ఇంతలో మహారాజు లోనికి వచ్చినారు. "అదేమి, నిలుచునే ఉన్నారు బ్రహ్మదత్తప్రభూ! తల్లీ! నిలుచునే ఉంటివేమమ్మా!" అని మహారాజు చిరునవ్వుతో ఇరువురినీ పలుకరించి, ఆసనంపై అధివసించి, ఎడం ప్రక్క ఆసనంపై బ్రహ్మదత్త ప్రభువుని కుడిప్రక్క ఆసనంపై ఆ బాలికనూ కూర్చుండ నియమించారు.

వారిరువురు ఉపవిష్టులైన పిమ్మట మహారాజు; బహ్మదత్తప్రభూ! మా అమ్మాయి యీ బాలిక. శాంతిశ్రీకుమారి. చిన్నతనాన్నుంచీ బద్ధదేవునిపై మహాభక్తి. ఆచార్య ఆనందదేవుల శిష్యురాలు. ఈమెకు ఆర్షధర్మ పరిచయం లేదు. సంగీతాది విద్యలూ రావు. తాము ఈ బిడ్డకు గురువులు కావాలని కోరడానికే మాతో కూడా తీసుకొని వచ్చినాము.

బ్రహ్మదత్తుడు ఆశ్చర్యమంది తానీ బాలికకు గురుత్వం చేయుటా! అని అక్కజం పడినాడు.

**మహారాజు**: తల్లీ! ఈ ప్రభువు ధనకవంశశుక్తముక్తాఫలము. మహాపండితులు.

**శాంతిశ్రీ** : మహాప్రభూ! నేను అన్నీ విన్నాను.

సిగ్గు ఏమీ ఎరుగని శిశువువలె ప్రత్యుత్తరం ఇచ్చింది. ఆమె కంఠము అమృతపూర్ణ మనుకొన్నాడు బ్రహ్మదత్తుడు.

**మహారాజు** : అవును తల్లీ! బ్రాహ్మదత్త ప్రభువునుగూర్చి వినవి వారెవ్వరు!

**బ్రహ్మ** : భర్తృదారిక విద్య విషయం....

**మహారాజు** : బ్రహ్మదత్తప్రభూ! మేము బాగా ఆలోచించాము. భర్తృదారిక చదువునుగూర్చి మహారాణుల కోరికపైనే తమ్ము మేము కోరుట.

**బ్రహ్మదత్తుడు** : మహాప్రసాదము.

బ్రహ్మదత్తుడు శాంతిమూల మహారాజు సెలవంది తన కోటకు వెడలి పోయినాడు.

"ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు కొన్ని వందల సంవత్సరాల నుంచి రాజ్యం చేస్తున్నారు. వారు ధాన్యకటకం రాజధానిగా, కురవ, చోళవాడి, హిరణ్యారాష్ట్రం, కర్ణరాష్ట్ర, ముండరాష్ట్ర, వేంగిరాష్ట్ర, పూంగీరాష్ట్ర కర్మరాష్ట్ర, ధనకరాష్ట్ర, దక్షిణకళింగాది ఆంధ్ర రాష్ట్రాలనూ, కుంతల, అశ్మక, ములక, అపరాంతక, మాళవ, మధ్యకళింగాది ఇతర దేశాలను పాలిస్తు ఉండిరి. మగధ చక్రవర్తి సింహాసనం ఎక్కిరి. నేపాలం జయించిరి. యువ, సువర్ణ, క్రౌంచ, ప్లక్షాది ద్వీపాలలో శాతవాహన వంశంవారు రాజ్యాలు స్థాపించారు. అలాంటిది నేడు, శాతవాహన సామ్రాజ్యము ముక్కలైపోతుంది అని భయంగా ఉంది. యజ్ఞశ్రీ శాతవాహన చక్రవర్తి దేశదేశాల సైన్యాలను ఆహ్వానించిరి. కప్పాలు అందుకొని వాజిపేయం చేసిన చక్రవర్తి నేడు వృద్ధులయ్యారు. వారికి ఇక్ష్వాకు ప్రభువులంటే ఉన్న నమ్మకం ఎవరిమీదా లేదు. అందుకని మహారాజును ససైన్యంగా రావలసిందని ఆహ్వానం పంపినారు. కుసుమలతాదేవి చక్రవర్తి కొమరిత అయినందున మహారాజుల వారిని త్వరలో ధాన్యకటకం వెళ్ళవలసిందిగా కోరుతున్నారు. ఇదీ రహస్యం" అని బ్రహ్మదత్త ప్రభువు భోజన సమయంలో తన తల్లికి నివేదించారు.

"అవును తండ్రీ! అయితే చక్రవర్తి మహారాజులవారిని ఏమి కోరుతారు? రాజ్యం రక్షించవలసిందనీ, తమ కొమారులు యువరాజులవారైన శ్రీ విజయ శాతవాహన ప్రభువును తమ తదనంతరం సింహాసనం ఎక్కించి సహాయం చెయ్యవలసిందనీ కోరతారు. అంతేనా?"

"నిజం అమ్మగారూ"

"విజయశ్రీ ప్రభువు విషయంలో భయపడడానికి కారణం?"

"ఆ ప్రభువు చక్రవర్తివలె బుద్ధిబలం కలవారు కారు. అమిత స్త్రీ లోలుపులు."

"కావచ్చు. అంతమాత్రాన భయమెందుకు?"

"విజయశ్రీ ప్రభువుకు ఏబది ఏళ్ళుపైన ఉన్నాయి. వారి పెద్దకుమారుడు చంద్రశ్రీ ప్రభువుకు ముగ్గురు భార్యలు, నలుబది మంది...."

"ఇంతకూ "

"ఇంతకూ వీరి దాయది పులమావి ప్రభువు నక్కజిత్తులవాడు. చంద్రశ్రీకి కొమరులు పుట్టరని పులమావి ప్రభువుకు తెలుసును అమ్మగారూ!"

అడవిస్కంద విశాఖాయనక ప్రభువు తల్లిగారితో ఇష్టాగోష్ఠి మాట్లాడి ఆలోచనా మందిరానికి వెళ్ళినారు.

ఆ మధుమాసంలో ఆ రాత్రి మూడంతస్తుల మేడపైన ఉప్పరిగమీద చల్లగాలి వీస్తున్నది. ఆ గాలిలో ఏవో మధురమనోహర మత్తతలు రంగరింపై ఉన్నాయి. తాను ఆ బాలికకు చదువు చెప్పాలని ఆ గాలులన్నవి. తన క్రీడావనంలో మల్లిక, మాలతి. మాధవి విరిసి మలయపవనాలకు మరీ మత్తతలు చేకూర్చినాయి.

తన రాష్ట్రము మళ్ళీ ఇంకొకసారి చూస్తాడు ప్రభువు. ధనక వంశ్యులు మొదటినుండి శాతవాహనులకు నమ్మకమైన సామంతులు. వారు గురుదత్తపురం (నేటి గురజాల) రాజధానిగా ధనకరాష్ట్రం రాజ్యంచేస్తూ ఉండిరి. ఇక్ష్వాకులు తమతోపాటు ఒకనాడు

ప్రతీపాలపురంలో సామంతులు. ముండకాది, పార్వతీయుల టక్కు అణగించి తమ రాజ్యమును స్థిరం చేయుడని అవతారపురుషుడైన శ్రీముఖ శాతవాహన మహారాజు కోరడం చేత ఇక్ష్వాకు మహారాజు విజయపురం నిర్మించి ఈ పార్వతీయరాజ్యం ఏర్పరచారు. ధనక కుటుంబంలోని తమ పూర్వీకులందరినీ చక్రవర్తి అటవీరాష్ట్రమైన కురవ దేశాన్ని ఓడించి రాజ్యం సుస్థిరం చేయవలసిందన్నారు. అందుకనే తన వంశంవారికి అటవిధనక ప్రభువు అని పేరు వచ్చింది. తనకు ఈ పురాతన చరిత్రాలోచన లెందుకు? మహారాజు తన బిడ్డకు నన్ను చదువు చెప్పమన్న మాత్రాన ఈ ఆలోచనలు కలగడం ఏమిటి? చదువు చెప్పడానికి కుటుంబ చరిత్రలకూ సంబంధం ఏమిటి? బ్రహ్మదత్తుడు అధివలసించి యున్న మంచము పైనుండి లేచెను.

ఆ బాలిక సౌందర్యము మానవాతీతం. ఆమె బౌద్ధధర్మాభిరత. ఆమె వదనమునందు శాంతతేజస్సు వికసించి ఉన్నది. ఆ మోము శారదపూర్ణిమనాడు ఆకాశంలా ఉన్నది. అంత అందము మనుష్యులలో ఉండుట విచిత్రమే. ఆ బాలిక వికసించి లోకాన్ని దివ్యసురభిళాలతో నింపడం అద్భుత సంఘటనే! మహారాణి సారసికాదేవి సౌందర్యం నిరుపమానం. మహారాజూ అందకాడే. కాని ఈ అతిలోక సౌందర్యం ఎక్కడనుండి వచ్చింది రాజకుమారికి?

బ్రహ్మదత్త ప్రభువు ఉప్పరిగనుండి తన తోటలోనికి దిగినాడు. తోటలో ఏమో పరిశీలించు వానివలె ప్రతి పూలవృక్షమును ఆయన చూస్తూన్నాడు. ఎందుకీ మల్లియలు, చంపకాలు? ఎందుకీ పూలు? ఇవి చక్కని పండునైనా ఈయలేవు. మామిడిపూవు సువాసన గలది. నీటిచుక్క కన్న చిన్నపూవు. అయినా చంద్రబింబమంతటి పండును కూడా మనుష్యునికి అర్పిస్తుంది. తామరపూవు చంద్రబింబమంత ఉండి కూడా ఫలాన్ని ఇవ్వలేదే! ఎందుకీ పుష్పాలు? జంబుపుష్పము చిన్నది. అయినా దాని నల్లని ఫలం మధురమైంది.

## 5

**శాంతి**శ్రీ రాజకుమారి లోకైకసుందరి. ఆమె అద్భుత సౌందర్యము దక్షిణాపథ మందేకాక ఉత్తరాపథమందును ప్రసిద్ధి పొందినది. ఆ బాలికను వైజయంతీ మహారాజు కొమరుడు యువరాజు చూటకులచంద్రుడు విష్ణుస్కంద శాతకర్ణి ప్రభువు వివాహం చేసుకోవాలని ఉవ్విళ్ళూరిపోతున్నాడు. యజ్ఞశ్రీ శాతవాహన సార్వభౌముని తమ్ముని మనుమడైన పులమావి ప్రభువు శాంతిశ్రీ అందము విని ఆమెకోసం మరులుకొని విరహతాపం పడుతున్నాడు. మగధలో ఉన్న గుప్తమహారాజులు కూడా ఈ బాలికను వాంఛించారు. అపరాంతకపతి అభీరకులార్ణవ చంద్రుడున్ను, పిష్టపుర ప్రభువు కౌశికీపుత్ర ఈశ్వరసేన మహారాజు శాంతిశ్రీ అందము విని ఆబాలిక తనకు మహారాణి కావాలని వాంఛిస్తున్నాడు.

ఆ బాలికకు తాను జగదద్భుత సుందరినని మాత్రం తెలియదు. ఆమెకు తన అందాన్నిగూర్చి విచారణ చేసుకొనేబుద్ధే కలుగలేదు. చెలికత్తెలు చెప్పుతూ ఉంటారు మహారాజు బాలికకు. స్త్రీలకూ, పురుషులకూ ఒక విషయం వినగానే అది చెప్పడం వారి

ప్రకృతి. అది మార్పులతో విన్పించడం వికృతియైన ప్రకృతి. ఆ విషయాన్ని కవిత్వంలా చెప్పడం అద్భుత ప్రకృతి.

మహారాణుల శుద్ధాంతాలిలో అనేకం వినబడుతాయి. ద్వారపాలికలు, పారిపార్శ్వికలు, దాసీలు మహారాజు హర్మ్యంలో అనేకం వింటారు. అక్కడ ఉండే కంచుకులు, ద్వారపాలకులు, చారులు ఏవో చెప్పుకుంటారు. ఇవన్నీ రాజకుమారికలకు, రాణులకు తెలుస్తాయి. అలాగే శాంతిశ్రీ రాజ కుమారికకు ఎందరో యువరాజులు, మహారాజులు పరోక్షంగా తన్ను భార్యగా వాంఛించి రాయబారాలు పంపున్నారని తెలిసింది.

రాజకుమారిక అందంవంటి అందం ఒక్కొక్కశకానికి ఒకసారి రెండుసార్లుమాత్రం ప్రత్యక్షమౌతుంది.

రాజకుమారుడు వీరపురుషదత్తుడు చాల అందమైనవాడు. అతడు శాంతిశ్రీ అన్న. వీరిరువురు కవలలులా ఉంటారు. శాంతిశ్రీ అందానికి ఒక వీసపాలులో వీసపాలు తక్కువ రాజకుమార వీరపురుషదత్తుని అందము.

వీరిరువురి తల్లి మాఠరిగోత్రజ అయిన సారసికాదేవి. శ్రీ మాఠరి సారసికాదేవి, శాంతిశ్రీ అద్దాల శిశువుగా ఉన్నప్పటినుంచీ దృష్టికొడుతుందనే భయంచేత ఇతరుల కంటబడనిచ్చేదికాదు. తాను తేరిపార చూచుటకే భయపడేది.

సారసికాదేవి బౌద్ధధర్మ పరాయణులైన కళింగాంధ్ర ప్రభువుల ఆడుబడుచు. పిష్ఠపురం రాజధానిగా ఈ మాఠరీగోత్రజులైన మహారాజులు శాతవాహనులకు ముఖ్యసామంతులై రాజ్యం చేస్తూ ఉండిరి. వారి ఆడబడుచు సారసికాదేవి. బుద్ధదేవుని యందు పరమభక్తితో మాఠర గోత్రజుడు శుభశ్రీ మహారాజు నూరేండ్ల క్రిందట బుద్ధగయనుండి ఒక బోధివృక్షశాఖ ఉత్సవాలలో పవిత్ర స్వర్ణపాత్రలో సప్తమృత్తికలు కలిపి ఫల్గుణినదీ జలాభిషేకం చేస్తూ కొనివచ్చి పిష్ఠపురంలో మహాసంఘారామం ప్రక్కను మహాచైత్యానికి తూర్పుగా పవిత్ర వితర్దిక మధ్యను పాదుకొల్పినాడు.

ఈలాంటి శాఖే పూజ్య శ్రీ సంఘమిత్ర భిక్షుని శ్రీ మహేంద్ర భిక్కులు తామ్రపర్ణి ద్వీపంలో నెలకొల్పినారు. ఆనాటినుండి పిష్ఠపురానికి పాద బౌద్ధమనీ, పాదగయ అనీ పేరు వచ్చింది.

మాఠరీ ప్రజలకు శాతవాహనులంటే అమితభక్తి. తరువాత శాతవాహనులు బౌద్ధధర్మము పరిత్యజించినా మాఠరీ ప్రభువులు మాత్రం ఆ ధర్మము పరిత్యజించలేదు. వారు ధాన్యకటక మహాచైత్యము, కంటకశైల మహా చైత్యము, ప్రతిపాలపుర చైత్యము సిద్ధనాగార్జున ప్రతిష్ఠాపిత మహాచైత్యము దర్శిస్తూ ఉండిరి. వారికీ, శాతవాహనులకూ, ఇక్ష్వాకులకూ ఎన్నెని సంబంధాలు ఉండేవి.

సారసికాదేవి బుద్ధధర్మపరాయణ. శాంతిమూల మహారాజు పట్టమహిషి. ఆమె బుద్ధభక్తి విషయంలో మహారాజు ఏ విధమైన అభ్యంతరమూ పెట్టలేదు. ఆమె బౌద్ధధర్మాభిరతియై కొమరుని, కొమరితను తన గురువైన ఆనందార్హతుల పాదాలకడ చదువుకై అప్పగించింది.

మహారాజు శాంతిమూల మహాప్రభువు ఆర్షధర్మ పరాయణుడు. గౌతమపుత్ర శ్రీశాతకర్ణి చక్రవర్తి కాలంనుంచీ ఇక్ష్వాకులు ఆర్షధర్మాభిరతు లయ్యారు. శాంతిమూలుడు ఉత్తమ బ్రాహ్మణుడై అగ్నిష్టోమంకూడా చేశాడు. అయినా కరుణాత్మకుడైన ఆ మహాప్రభువు సర్వధర్మరతులను సమాన ప్రేమతో చూసేవాడు.

ఆనందార్హతులు నాగార్జున బోధిసత్వుల శిష్యులు. ఆర్యసంఘ సంప్రదాయ, దిఘ, మజ్జిమ నికాయ పారంగతుడు, పంచమాతులుక మహానుష్ఠానపరుడు, యోగీంద్రుడు.

శాంతిశ్రీకి చిన్నతనాన్నుంచీ అహింస, అష్టమార్గములు అంటే నమ్మకం. అవి ఆచరిస్తేనేగాని మనుష్యునకు గతిలేదని ఆమె చిన్ని హృదయానికి నమ్మకం. మాటలు వచ్చినప్పటినుంచి ఆ బాలిక ఒక్క పరుష వాక్యం అయినా పలికి ఎరుగదు. "వెఱ్ఱిబాగుల తల్లి!" అని మహారాజులున్నూ, మహారాణియు అనుకునేవారు బుద్ధపూజలు, చైత్య నిర్మాణాలు ఆటలలో, నందసుందరీ గాథలు మహాభిష్క్రమణ గాథలు వింటూ ఉండేది.

తండ్రి ఆర్షసంప్రదాయంగా జపతపాలు, గార్హస్థ్యాగ్న్యర్చననిత్యమూ జరుపుతూ ఉండేవారు. తమ పూర్వీకుడు అవతారమూర్తి అయిన రామచంద్రుని సర్వదా పూజించేవారు. పూర్వఇక్ష్వాకుల మహోత్తమ స్థితి, వారి తపస్సు వారి శక్తి, వారి దిగ్విజయ ప్రతిభ శాంతిమూలునికి పులకలు కలిగించేవి.

కొమరిత శాంతిశ్రీ ఎవ్వరితో వాదించేదికాదు. మేనత్తలు ఇద్దరూ ఇక్ష్వాకుల ఆడబడుచులు అయినందుకు అన్నగారి రామభక్తి వారికీ అబ్బింది. అయినా వారికిగాని, శాంతిమూల మహారాజుకుగాని, బౌద్ధధర్మమన్న అయిష్ట మేమీ లేదు. ఆనందులవారు ఆరు సంవత్సరాల క్రిందటనే పమ్నుగ్రామం నుంచి పవిత్రప్రదేశమైన నాగార్జున దేవపవిత్రమైన విజయపురం విచ్చేసినారు.

శాంతిశ్రీకి బౌద్ధ ధర్మాభిరతులైన పిష్టపురాధీశులు మేనమామలు. మాఠరి యైన తల్లి పోలిక తెచ్చుకున్నది. తండ్రి తన్ను ఆ దండనాయకుడైన, స్కంద విశాఖాయనక ప్రభువుచెంత భగవద్గీత, రామాయణము, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు చదువుకొమ్మని నంతనే ఆమె ఆశ్చర్యమందినది. తనకును, ఆ ఆర్షధర్మ గ్రంథాలకు సంబంధమేమి? తనకు గురువు కాబోవు ఆ మహాపురుషుడు అంత యువకుడే! వారు తనకు గురువు లగుట ఏమి? తండ్రిగారి ఉద్దేశమేమి?

బ్రహ్మజ్ఞాన సంపన్నులు, ఉత్తమ బ్రాహ్మణులు, సాంఖ్యాయనస గోత్రజులయిన ప్రియబలదేవదత్త ప్రభువు ఖ్యాతి ఆమె విన్నది. బౌద్ధభిక్షాచార్యులకు, దేవదత్తప్రభువులకు జరిగిన వాదోపవాదాలు, అందులో దేవదత్తుడు వాదమునందు అప్రతిమానుడై ఆచార్యుల నందరిని ఓడించిన సంగతీ తన గురువులు ఆనందులవారు తన కుపదేశించారు. దేవదత్తప్రభువు తనయులు బ్రహ్మదత్త ప్రభువులు. పండితలోకము ఆయనకు బ్రహ్మదత్త బిరుదం ఇచ్చెనట. తండ్రితో సమమైన విద్యావంతులు. తండ్రికన్న మించిన జ్ఞానమూ ఉపజ్ఞా కలవారు. యుద్ధంలో తన తండ్రికి కుడిచేయి. బ్రహ్మదత్త ప్రభువు నెదిరించగల మేటి ఈ జంబూద్వీపంలోనే లేరు అంటారు. ఎంత శాంత తేజస్సు! అంత చిన్నవారయ్యు ఆ ప్రభువు విద్యలో అంత వృద్ధులట. ఆ ప్రభువును తనకు గురువుగా చేయుటలో జనకుల ఉద్దేశమేమి?

శాంతిశ్రీ తన మందిరంలో ఆలోచించుకొనుచు కూర్చున్నది. ఆమె మేనత్త పూంగీయ మహారాణి కొమరిత శాంతశ్రీ కుమారి స్నేహితురాలిని చూడటానికి వచ్చింది.

"ఏమమ్మా శాంతిశ్రీ వదినా! ఏమిటి ఆలోచిస్తున్నావు."

"ఏమీ ఆలోచనలేదు, మహారాజు నాకో నూతన గురువును ఏర్పాటు చేశారు."

"వాసవదత్తకు ఉదయనుని ఏర్పాటు చేసినారా?" పూంగీయ శాంతశ్రీ చిరునవ్వు నవ్వింది.

"అంటే నీ భావం?" ఆమె చిన్న బిడ్డలా ఆ ప్రశ్న వేసింది.

"ఏముంది భావం? ఏదో బృహత్కథ జ్ఞాపకం వచ్చింది."

"నేను ఆర్షధర్మం అభ్యసించలేదని మహారాజు...."

"అవును, వాసవదత్తా అంతే వదినా. ఆమెకు వీణపాట అంటే వల్లమాలిన ఇష్టం. మాళవంలో ఉన్న గురువులంతా నేర్పారట. కాని ఇంకా నేర్చుకోవలసిన సంగీత మహావిద్య చాలా ఉందట. అది నేర్చడానికి ఉదయన మహారాజు ఒక్కడేనట సకల ధరాతలంలోనూ ఉన్నది. అందుకని మాయా హస్తివ్యాజాన ఉదయనుని చండమహాకాళుడు అనే చండసేన మహారాజు బంధించి ఉజ్జయినికి కొనివచ్చి కొమరితకు గురువును చేసినాడు.

"నేను బృహత్కథ ఎరుగను శాంతా! మీ అమ్మగారు క్షేమంగా ఉన్నారా?"

"బమ్మాదత్త ప్రభువులు నీకు గురువులు కాబోతున్నారనీ మా అమ్మ గారే చెప్పినారు."

"నువ్వు వచ్చి ఒకపక్షం దినాలయినది కాదూ, ఇక్కడకు ఇంత వరకు రాలేదేమి?"

"మామయ్యగారిని చూచాము, అత్తయ్యగార్లను చూచినాము. నువ్వు అక్కడ లేకపోయావు. అలా మూడు పర్యాయాలయినది."

"నేను ఈమధ్య ఆనందార్హతులకడకు పాఠానికి వెళ్ళుతూ ఉంటిని."

"అవును. ఈ మధ్య బావగారు మా పట్టణం వచ్చారు కాదూ?"

"యువరాజుగారి విషయం నాకంత తెలియదు."

"యువరాజు మహాదండనాయక, మహాప్రభువులు. ఆయన విషయమే నీకు తెలియదూ! మీ అన్నగారి విషయమే నీకు తెలియదంటావు వదినా!"

ఇంతలో హమ్మశ్రీదేవి పెద్దకొమరిత బాపిశ్రీరాకుమారి అచటికి వచ్చెను. హమ్మశ్రీ శాంతిమూల మహారాజు రెండవ చెల్లెలు. పల్లవరాజు కోడలు.

## 6

**బాపిశ్రీ** మేనమామ కొమరితను చూచి, "వదినా! నీకు బ్రహ్మదత్త ప్రభువు చదువు చెపుతారటగా?" అని ప్రశ్నించింది.

**శాంతిశ్రీ:** మీ నగరులోనూ తెలిసిందీ ఈ వార్త, బాపిశ్రీకుమారీ!

బాపిశ్రీ కోపం అభినయించి "మేమిద్దరమూ నిన్ను వదినా అని పిలుస్తాము. నువ్వు మమ్మల్ని పేరులుపెట్టి పిలుస్తావు! నీకు ఆపేక్షలే లేవుసుమా" అన్నది. ఇక్ష్వాకు శాంతిశ్రీ తెల్లబోయింది.

అప్పుడు పూంగీయశాంతశ్రీ "అమ్మగారి శుద్ధాంతంలో తెలిసింది. బాపిశ్రీకి తెలియదా? పిన్నిగారు హమ్మశ్రీకి తెలియదా?"

**బాపిశ్రీ:** వదినా! మీ విజయపురం వసంతోత్సవానికి నే వస్తే

**పూంగీయశాంతశ్రీ:** మీ అన్నయ్యగారు ఉజ్జయినికి వెళ్ళుతున్నారటగా? వారు లేని వసంతపంచమి శిశిరపంచమే అవుతుందని భయంగా ఉంది వదినా?

**బాపిశ్రీ:** మూగదేవుడులా బదులు చెప్పవు. నీకు హృదయము ఏమి అర్థము అవుతుందీ?

**శాంతిశ్రీ:** చెల్లీ మామయ్యగారు గురువును ఏర్పాటు చేశారు, వదిన ఇక మనతో మాట్లాడదులే!

**బాపిశ్రీ:** అదికాదే అక్కా! గురువు దగ్గర అంచక్కగా చమత్కారాలూ అవి నేర్చుకొని ఇక మనలను మాటాడనే మాటాడ నివ్వదు.

**పూంగీయశాంతశ్రీ:** అవునవును. చదువుల సరస్వతై పోతుంది కాబోలు.

**బాపిశ్రీ:** అప్పుడు రతీదేవికే పాఠాలు నేర్పుతుందేమో?

**ఇక్ష్వాకుశాంతిశ్రీ:** ఏమో మీ మాటలు నాకు తెలియవుగాని నిజం చెబుతాను వినండి. నాకు ఆనందులవారి దగ్గర చదువుతప్ప ఇంకో చదువు అక్కరలేదు. అయినా మహారాజు ఆజ్ఞ పరిపాలింపక తప్పదు.

బాపిశ్రీ పూంగీయశాంతశ్రీ లిద్దరు శాంతిశ్రీ మాటలకు తెల్లబోయి నారు. వరి వారి తల్లుల అంతఃపురాలలో వినవచ్చిన విషయం ఒకరీతిగా, ఇప్పుడు శాంతిశ్రీ అనే విషయం వేరుగా ఉంది అనుకున్నారు. శాంతిశ్రీ వేళాకోళా లెరుగదు. ఎంత వేళాకోళం చేసినా, ఆ హాస్యాన్ని నిజము క్రింద భావించుకొంటుంది.

శాంతిశ్రీకి సంగీతం నేర్పుకొనుట తప్పుగా తోచినది. ఆవిద్య ఏనాడూ నేర్చుకోవాలని కోరలేదు. పాటలంటే విసుగువచ్చేది. కవిత్వమంటే ఆమెకు తలనొప్పి, కాని బోధిసత్త్వుని పరమపవిత్ర జాతక గాథలు ఎంతో ఆపేక్షగా చదువుకొంటుంది. సంగీతమూ, శిల్పమూ, చిత్రమూ బుద్ధదేవుని అర్చించడానికే అయితే సరేనట. అట్లు ఉపచరించని సంగీతము, నాట్యము బుద్ధధర్మాధిరతులకు పనికిరావట. అయినా శాంతిశ్రీ మహారాజకుమారి కంఠంలో అమృతాలు వాకలు కట్టుతవి. ఆమె మాటలే మధురము. ఆమె ఏదో రాగధోరణిగా వినయాది త్రిపీఠకాలు, ధర్మసూత్రాలు చదువుతూ ఉంటే వినేవారు 'ఇంతకన్న దివ్యగాంధర్వం ఏమి కావాలి?' అని తన్మయులై పోదురు.

వాసిష్టీ పుత్రిక శ్రీపూంగిరాణి శాంతశ్రీదేవికీ, ఆమె చెల్లెలు హమ్మశ్రీదేవికీ భౌద్ధధర్మం అంటే వెఱ్ఱి ఆపేక్ష లేదు గాని బుద్ధదేవునియందు భక్తి మాత్రం ఎక్కువే. వాసిష్టీ పుత్రిక శాంతశ్రీదేవి కొమరిత శాంతశ్రీ రాజకుమారికిన్నీ హమ్మశ్రీదేవి కొమరితలు బాపిశ్రీ షష్టిశ్రీ రాకొమరితలకున్నూ ఏదేవునియందు అంత భక్తిలేదు. శాంతశ్రీ బాపిశ్రీలు ఎలజవ్వనులు; షష్టిశ్రీ ఇంకా జవ్వనంలో అడుగుపెట్టుచున్నది.

అల్లరిపిల్ల శాంతశ్రీ రాకుమారి మహారాజకుమారిని చూచి, "వదినా ఒక్కపాట పాడవమ్మా" అన్నది. మహారాజపుత్రి శాంతిశ్రీని రెప్పవాల్చకుండా అయిదు నిమేషాలు చూచి నిట్టూర్చి, రెప్పలు వాల్చి, "వదినా! నాకు సంగీతమంటే ఇష్టంలేదు. మీరు భరత సూత్రాలు కూడా నేర్చుకున్నారు. మీరు ఆ విద్యలవే సభారం జనం చేయగలరు. నాకా

గొడవలేదు. సంగీతం మారుని ఆయుధాలలో ఒకటి" అన్నది అస్పష్ట వాక్కులతో. శాంతశ్రీ బాపిశ్రీలు చిరునవ్వులు నవ్వినారు.

**బాపిశ్రీ:** వదినా నీకు సంగీతం ఇష్టంలేదంటే నేను నమ్మను. అయినా ఇష్టంలేదని అన్నావు గనుక అడుగుతాను, సంగీతానికి ఏమి దోషం వచ్చిందీ?

**శాంతిశ్రీ:** దోషం లేకపోలేదు. ఆ దోషం మనం చేసే భోజనంలో, ధరించే వస్త్రాలలో, అలంకరించుకొనే భూషణాదులలో, ఉపయోగించే సుగంధవస్తువులలో, నాసంచేసే ఈ మహాద్భుత అంతఃపురాలలో, జీవించే జీవితంలోనూ అంతటా ఉన్నది.

**బాపిశ్రీ:** బాగుంది వదినా, స్త్రీ పురుషులందరూ సన్యాసం పుచ్చుకోవాలంటావు నువ్వు.

**శాంతిశ్రీ:** పుచ్చుకుంటేనేకాని నిర్వాణం లేదుకదా?

**శాంతశ్రీ:** ఇంక సృష్టి ఎట్లాగు?

**శాంతిశ్రీ:** సృష్టి అంతా నిర్వాణానికి పోవలసిందే కదా! ఇవాళ కాకుంటే ఏనాటికైనా అది తప్పనిదే.

**బాపిశ్రీ:** భోజనం?

**శాంతిశ్రీ:** నిర్వాణ పథం కనుక్కునే వరకూ దేహపోషణ చెయ్యాలి. తర్వాత భోజనం ఎందుకు?

**శాంతశ్రీ:** వర్ధమాన జినమతం బోధిస్తున్నావా వదినా? నిరాహార దీక్షావ్రతుడై ప్రాణం బలి ఇచ్చిన వానికి సద్గతి లభించి తీరుతుందంటారు జనులు.

**శాంతిశ్రీ:** నా మాటలకు అదికాదు అర్థం.

**బాపిశ్రీ:** కాకపోవచ్చును. కాని తాత్పర్యం ఒకటే కదా? శరీర ధారణం ఎలాంటిదో సర్వవిద్యలూ అలాంటివి కావా? ధాన్యకటక శిల్పం మాట ఏమంటావు?

**శాంతిశ్రీ:** విద్యలు తథాగతుని అర్చించడానికే అయితే తప్పు లేదంటినిగా.

**బాపిశ్రీ:** సంగీతంతో ఎందుకు అర్చించకూడదు?

**శాంతిశ్రీ:** సంగీతం మనం స్వీయానందానికే పాడుకొంటున్నాము. హృదయానందం ప్రాపంచికం. అష్టమార్గాలకు ప్రాపంచికానందం వ్యతిరేకం కాదా?

**బాపిశ్రీ:** చూచినావా అక్కా, వదిన మాటలు?

**శాంతశ్రీ:** వదిన భిక్కుణి అవుతుందని విన్నాము కాదటే, అది నిజం అని ఇప్పుడు తేలిపోయింది.

## 7

**ము**వ్వురు రాజకుమారికలు మాట్లాడుచుండగనే ఒక పరిచారిక అక్కడకు వచ్చి "జయము జయము రాజకుమారికలకు! పూజ్యశ్రీ రాజ వసిష్ఠులవారు మహారాజకుమారి నూతన విద్యారంభం, మాఘశుద్ధ పంచమినాడు వసంతోత్సవ ప్రారంభంలో ఉదయం ఘటికా తొమ్మిది విఘడియలకు మేషలగ్న పుష్కర కాలంలో అని సెలవిచ్చినారట. మహారాణి శ్రీశ్రీ సారసికాదేవి మహారాజకుమారికి నివేదింప నాకు ఆజ్ఞ ఇచ్చినారు" అని విన్నవించినది.

మహారాజకుమారి శాంతిశ్రీ తల ఊపినది. "జయము జయము, రాజ కుమారికలకు! నాకు అనుజ్ఞ దయచేయించండి" అనినంత శాంతిశ్రీ తల ఊపినది. ఆ చారిణి వెళ్ళిపోయినది.

**బాపిశ్రీ:** మామయ్యగారు వెంటనే ముహూర్తము పెట్టించినారే!

**శాంతశ్రీ:** నీకు ఈ ముహూర్త బలమువల్ల చదువు బాగా సాగుతుంది వదినా!

**శాంతిశ్రీ:** సాగినా, సాగకున్నా నాకు ఒకటే శాంతశ్రీ!

**బాపిశ్రీ:** మా వదిన ద్వంద్వాతీతురాలు. కనుకనే చుట్టాలను బొద్దు కోసినట్లు పేరుపెట్టి పిలుస్తుందేకాని వరుసలు పెట్ట పిలువదు.

**శాంతశ్రీ:** వదినను హాస్యం చేయకు చెల్లీ!

**బాపిశ్రీ:** అయితే వదినకు చదువు సాగదని నీకు అనుమానం ఎందుకు అక్కా?

**శాంతిశ్రీ:** మా నాయనగారు వచ్చారని తెలుసా నీకు, చెల్లీ!

**బాపిశ్రీ:** తెలుసును. మామయ్యగారు తమ సైన్యాలన్నీ చేకూర్చు కుని ధాన్యకటకం రావలసిందని ధాన్యకటకంనుంచి చక్రవర్తి ఆజ్ఞ!

**శాంతశ్రీ:** మామయ్యగారి సైన్యాన్ని నడిపే సేనాపతి ఎవరు?

**బాపిశ్రీ:** సేనాపతి బ్రహ్మదత్త ప్రభువులేకదా అక్కా!

**శాంతశ్రీ:** వారే! వదినకు నూతన విద్యాగురువులు వారేకదా? అందుకనే వదినను నీ చదువు ఎల్లాసాగుతుంది అని అడిగాను.

**బాపిశ్రీ:** వదినా! మామయ్యగారు వసంతోత్సవాలైన వెనుక వెడతారు కదా, ఎప్పుడు తిరిగివస్తారు?

**శాంతిశ్రీ:** యుద్ధయాత్రకు వెళ్ళినవారు ఎన్నాళ్ళకు వస్తారో ఎలా తెలుస్తుంది?

అక్కడికి ఒక దౌవారిక వచ్చి, "మహారాజకుమారీ, మహారాజ కుమారులు తమ్ము చూడడానికి వచ్చినారు. లోనికిరా అనుజ్ఞ కోరినారు" అని విన్నవించింది. శాంతశ్రీ, బాపిశ్రీలవైపు వారి అభిప్రాయార్థము శాంతిశ్రీ చూచినది. వారి మొగాలు జేవురించినవి.

**శాంతశ్రీ :** బావగారు వస్తే భయమేమిటి?

**బాపిశ్రీ:** నాకు కొంచెం సిగ్గు అక్కా!

**శాంతి:** నీకు సిగ్గు ఎందుకు బాపిశ్రీకుమారీ?

**శాంతశ్రీ:** బాగా అన్నావు వదినా! బావగారిని ప్రవేశపెట్టుమను.

**శాంతిశ్రీ:** రాజకుమారులు రావచ్చునని విన్నవించు.

**శాంతిశ్రీ:** ఆమాటలు అనుచు శాంతిశ్రీ లేచి ఆ మందిరము గుమ్మము కడకు వెళ్ళినది బాపిశ్రీ లేచి వీరందరూ అధివసించిన పీఠముల తావు వదలి ఆ మందిర వాతాయనాలకడ ఉన్న భూర్జర తాళపత్ర లిఖితగ్రంథ మంజూషల కడకు పోయి, ఒక్కొక్క గ్రంథము పరిశీలించుచున్నది.

వాసిష్ఠి శాంతశ్రీ కొమరిత హారీతి శాంతశ్రీ చిరునవ్వు నవ్వుకొనుచు బావగారిరాకకు ఎదురుచూచుచున్నది. మహారాజకుమారి మాఠరి శాంతిశ్రీ గుమ్మముదాటి తన విద్యామందిరాన్ని అంటిఉన్న సభాగృహంలోనికిపోయి, అది దాటి, ఆవలనున్న మందిర

యానశాలకు పోయినది. అప్పటికి అప్పుడే యువమహారాజు మాఠరీపుత్ర వీరపురుషదత్త ప్రభువు నూరు మన్మథుల అందముతో నడిచి వస్తున్నాడు. అన్నగారు దగ్గరకు రాగానే శాంతిశ్రీ వారి పాదాలకు వంగి నమస్కరించింది. చెల్లెలిని భుజములు పట్టి వీరపురుష దత్తుడు లేవదీసి "చెల్లీ, నీతో మాట్లాడవలసిన విషయాలు చాలా ఉండి వచ్చాను" అన్నాడు. "శాంతశ్రీకుమారీ బాపిశ్రీకుమారీ నా చదువుల గదిలో ఉన్నారు" అని ఆమె అన్నతో ననెను. "మరీమంచిది. పదచెల్లీ!" అని రాజకుమారుడు ప్రత్యుత్తర మిచ్చినాడు.

అన్నయు చెల్లెలును లోనికి విచ్చేసినారు. పూంగీయ రాజకుమారి శాంతశ్రీయు, బాపిశ్రీ రాకుమారియు చిరునవ్వులతో సిగ్గు గదురు నెమ్మోములతో నిలుచుండి బావగారికి నమస్కారాలు చేసినారు. వారిని చూచి వీరపురుషదత్తుడు ప్రతినమస్కారాలిడి "మా మరదళ్ళు మేనమామ కొమారితతో ఏకాంత మున్నట్లున్నారు" అని సంతోషాన వికసించిన మోముతో పలికినాడు. శాంతశ్రీ బాపిశ్రీలు మాటలాడకుండ నిలుచుండిరి. శాంతిశ్రీ నవ్వుచు "వదినలు కూర్చోండి! నిలుచున్నారేమి, బావగారు కొత్తవారు కదా?" అనెను.

ఇక్ష్వాకువంశపు ఆడబిడ్డలు, ఇక్ష్వాకు రాజకుమారులు అందాలకు జంబూ ద్వీపం అంతట ప్రసిద్ధి పొందిరి. వీరపురుషదత్తుని అందము జగత్ప్రసిద్ధము. ఆయనను అపరమన్మథుడని కవులు వర్ణింతురు. అతని మేనత్తలిరువురువారి యవ్వనంలో వేవురు రాజకుమారుల హృదయాలలో ప్రణయాలు ఉద్దీపింపజేసిరి. వారి కొమరితలకూ ఆ అందాలు అబ్బినవి. ఆనలువురదిదేవతలను కురూపులనుగా చేయజాలిన అందము. బాపిశ్రీ మోమించుకగుండ్రము, శాంతశ్రీ మోమించుకకోల. బాపిశ్రీ నుదురు అర్ధచంద్రము. శాంతశ్రీ నుదురు విశాల విశాలము. బాపిశ్రీ కనుబొమలు రెండు ఎక్కుబెట్టిన ధనస్సుకు పూర్వఉత్తరార్ధ దండభాగముల వంటివి, శాంతశ్రీ కనుబొమలు ఆకాశపు వంపుల వంటివి. బాపిశ్రీ నాసిక తిలపుష్పము, శాంతశ్రీ నాసిక శుకనాసిక. బాపిశ్రీ పెదవులు చిన్నవి, పక్వబింబాలు. శాంతశ్రీ పెదవులు మధ్యమాలు. కాశ్మీరకుసుమ రాసులు. బాపిశ్రీ, శాంతశ్రీలు కవలలవలె ఉంటారు. తీర్చిన రేఖలతో పోత పోసిన బంగారు విగ్రహాలు వారివి.

వీరపురుషదత్తుని ఈ బాలికలిద్దరు ప్రేమించుచుండిరి. వీరిరువురను ఆ యువరాజు ప్రేమిస్తున్నాడు. ప్రజాపతులు దక్షిణనాయకులు. పరమేశ్వరీ పరమేశ్వరు అర్ధనారీశ్వరులు. ఇక్ష్వాకు శ్రీశాంతిమూల మహారాజు గూడ దక్షిణ నాయకుడే. బ్రహ్మదత్తు దేకనాయకుడు. వీరపురుషదత్తుడు సౌందర్యజిత లోలుడు. వీరవిక్రమ విహారంలోను స్కందదేవ సమానుడు. అతని హృదయాన శాంతశ్రీ బాపిశ్రీలు ఇరువురు సమాన స్థానాలు ఆక్రమించినారు.

ఇక్ష్వాకు శాంతిశ్రీ అన్నగారికి శాంతశ్రీని బాపిశ్రీని వేలుపెట్టి చూపించింది. "ఈ ఇద్దరు మహారాజకుమారుని హృదయం దొంగిలించారు. మీ ఇద్దరూ ఒక్కరే ఇద్దరయ్యారా, ఇద్దరూ ఒకటయ్యారా!" అని చిరునవ్వు నవ్వింది.

"వదినా! ఈ అల్లరి ఎక్కడ నేర్చావు? మరి నేనేమి ఎరగనంటావు. నువ్వు ప్రతిజ్ఞాయౌగంధరాయణం చదవడం మరిచిపోకు. నీ గురువుగారినే చెప్పమను."

**వీరపురుష:** శాంతా! చిన్ననాటినుండి నువ్వు అల్లరిపిల్ల వే! బాపిశ్రీ గడుసరిది. నాతో పందేలువేసి నిరుడు వసంతోత్సవాలలో నువ్వు ఓడిపోయావుగాని ఈఏడు బాపిశ్రీ వీణపాటలో నన్ను ఓడిస్తుంది.

శాంతిశ్రీ "ఈ ఇరువురితో పందెంవేసి మీరెప్పుడు జయించలేరు" అన్నది అన్నతో.

వీరపురుష ఓటమి నిశ్చయం కనుకనే వసంతోత్సవాల అనంతరం నేను ఉజ్జయిని వెళుతున్నాను.

వసంతోత్సవాల అనంతరము తమ వసంతుడు ఉండడు కాబోలునని శాంతశ్రీ బాపిశ్రీల హృదయాలలో పిడుగులు పడినవి. బాపిశ్రీ వదనము వాడిపోయింది. ఆమె కన్నుల అశ్రువులు తిరిగినవి. శాంతశ్రీ తనలో ఒక్కసారిగా భయంకర తృణావర్తము ఉద్భవించి హృదయమును మనస్సును మెదడును దూదిపింజలు చేసి ఎగురవేసినా, మోమునందు గంభీరత వీడకుండా "చెల్లీ! అలా కంటనీరు పెట్టుకొంటావేమిటి? యువరాజులవారికి రాజకీయ వ్యవహారాలకంటే మనతో ఆటలు ప్రియమటే! చిన్ననాటి నుండీ మనతో ఊసుపోక బాల్యక్రీడలు ఆడినారేకాని యువరాజులవారి కిపుడు మనం కావలెనటే వెఱ్ఱిదానా! వారిని నువ్వూ నేను ఆపగలమా?" అన్నది. ఆమె మాటలలో హృదయము కృంగిపోవుట ప్రత్యక్షమయినది.

శాంతిశ్రీ బాపిశ్రీలమధ్య అరమరలు లేవు. ఇరువురు గాఢంగా యువమహారాజ వీరపురుషదత్తప్రభువును ప్రేమిస్తున్నట్లు ఇరువురు నెరుగుదురు. ఒకరి రహస్య మొకరికి దెలిసినదేయనికూడ వారెరుగుదురు. ఇరువురకు ఓర్వలేనితనంలేదు. అతన్ని ప్రేమించడంలో తామిరువురూ ఒకే ఆత్మలోని రెండు ఛాయలనుకున్నారు. శాంతశ్రీ పూంగీప్రోలు మహాపట్టణంలో ఉన్నా బాపిశ్రీని తలవని నిమిషం ఉండదు. బాపిశ్రీ విజయ పురంలో ఉంటూ శాంతశ్రీని తలవని నిమేషం ఉండదు. ఇరువురూ యువ రాజును తలపోయని క్షణమంటు ఉండదు. ఆ యిరువురకు వీరపురుషదత్తుడు కుమారస్వామీ, బోధిసత్వుడూ! అతని దివ్యసౌందర్యం వారికి పూర్ణ చంద్రికా ప్రకాశం. అతని మహాశౌర్యం అఖండ సూర్యతేజస్సు. వారిరువురు వీలయినప్పుడు కలుసుకుంటారు. ఇరువురూ తమ జీవిత మధ్యస్థుడైన యువరాజును గురించే మాట్లాడుకుంటూ ఉంటారు.

ఆ బాలికలు చిన్ననాటి నుండి విజయపుర వసంతోత్సవాలలో యువరాజునే వసంతునిచేసి తాము పుష్పమహారాణులై అతనితో ఆనంద పరవశులై ఆటలాడు కొనేవారు. ఇంతవరకు ఒక సంవత్సరమైనా తప్పిపోక ఈ ముప్వురు వసంతోత్సవానికి అవసంత కుసుమాలై ఆడుకొంటున్నారు. నేడు ఆ వసంతోత్సవము మళ్ళీ అరుదెంచినది. తమ వసంతుడు తమ మన్మథుడు తమ భగవానుడు మళ్ళీ వసంతుడు కావాలి, తాము వనదేవీ, వాసంత కావాలి. మహారాజ పుత్రితో శాంతశ్రీ "వదినా, మేమిరువురమూ, సెలవు పుచ్చుకొంటాము" అన్నది వినీ వినరాని నిట్టూర్పుతో.

**శాంతిశ్రీ:** అప్పుడే వెడతారా వదినలిద్దరూ? ఎల్లుండి ప్రారంభించబోయే వసంతోత్సవాలకు వాసిష్ఠిభట్టిదేవి రాకుమారి కళింగమునుండి దాసదాసీజన పరివృతయై మహా వైభవంగా వస్తుందని వారికి అంతకుముందే తెలిసినది. వాసిష్ఠులకు ఇక్ష్వాకులైన

హారీతసులకు ఎన్నితరాలనుండో సంబంధాలు ఉన్నవి. అదివరకే అంతిపురాలలో చాలా కాలంనుండి వాసిష్టి భట్టిదేవిరాకుమారుని వీరపురుషదత్తుని కల్పింప సంకల్పించిఉన్నారు. శాంతి మూలుని కోర్కె అది. యువరాజు ఉజ్జయిని వెళ్ళుచున్నాడు అంటే క్షాత్రప రాజకుమారిని చూచుటకే అని ఆ రాజకుమారికల కిరువురకు తోచినది. ఈ ఆలోచనలతో వారిరువురూ క్రుంగిపోయినారు.

బాపిశ్రీని, శాంతశ్రీని వీరపురుషదత్తుడు తేరిపారచూచాడు. ఆ బాలిక లిరువురూ, వెన్నెలా వెలుగూ, పుష్పమూ సుగంధమూ, గీతమూ రాగమూలా మూర్తించి ప్రకాశించినారు. సాధుహృదయ అందాలబాల బాపిశ్రీ వేడిగాడ్పు తగిలిన కలువపూవువలె వడిలిపోయింది, సూర్యకాంతి తగిలిన వజ్రమువలె శాంతశ్రీ మండిపోయినది.

చెల్లెలు ప్రక్కనున్నదని మరిచిపోయి, వానలు కురిసినప్పుడు ఉప్పొంగే నదిలా యువరాజు లేచినాడు. బాపిశ్రీ కదకుపోయి ఆ బాలికను తన కుడిచేతితో ప్రక్కకు లాగికొని బిగియార వామహస్తాన చుట్టివేసినాడు. శాంతశ్రీ కదకుపోయి పొంకాలు తిరిగిన దక్షిణ బాహువుచే ఆమెను చుట్టి ఇద్దరిని ఒక్కసారిగా తన హృదయాన కదుముకొన్నాడు.

"శాంతా! బాపిశ్రీనికా! నేను మహారాజుల ఆజ్ఞచొప్పున ఉజ్జయిని వెళ్ళవలసి వచ్చింది. వెంటనే తిరిగివస్తాను. ఒక్కటే నామాట నమ్మండి. మీ ఇద్దరికీ నా హృదయం మన బాల్యంనుంచీ అర్పించుకొన్నాను. రాజ్యావసరాల కొలది ఇతర రాకొమరికలు నా జీవితంలో ప్రవేశింతురుగాక; వారిపట్ల ధర్మం నిర్వహిస్తాను అంతే!" అని రాకొమరుడు వారి మూర్ధములను ఇటు అటు తిరిగి చుంబించినాడు.

శాంతశ్రీ ఆశ్చర్యం పొందింది. బాపిశ్రీ ఆనందంతో ఉప్పొంగిపోయి త్రపావతియై తలవాల్చింది. వారిరువురు నెమ్మదిగా యువరాజు కౌగిలిలోనుండి ఈవలకు వచ్చినారు. మహారాజకుమారికి అన్నగారిమాటలు, మూర్ధాఘ్రాణాలు మొదలే అర్థము కానివి. శాంతిశ్రీయు, బాపిశ్రీయు బావగారికి నమస్కరించి, శాంతిశ్రీని కౌగిలించుకొని, వారిరువురి అనుమతి నడిగి వెళ్ళిపోయినారు. వారిని ఆ మందిర కవాటంవరకు యువరాజు, ఆయన చెల్లెలు సాగనంపి వచ్చారు.

"చెల్లీ! నువ్వా ఆసనం అలంకరించు. శ్రీ నాయనగారి తల్లి పుట్టిన రాజ్యం ఎరుగుదువుగా, మధ్యకళింగం? దేవరాష్ట్రాధిపతులు వాసిష్ఠులు మనతాతగారి అత్తవారు. మన మేనమామలు మాఠరులకు, ఆ వాసిష్టలకు ఎన్నాళ్ళనుంచో సంబంధ బంధవ్యాలున్నాయి. ఆ వాసిష్టులు మధ్యకళింగానికీ, మాఠరులు దక్షిణకళింగానికీ మహారాజులు. చక్రవర్తికి మనతోపాటు మహాసామంతులు. కానీ నాయనగారిది దూరదృష్టి. చక్రవర్తి అవసాన దశలో ఉన్నారు. చక్రవర్తి కొమరుడు, మనుమడు ఇద్దరూ ప్రజ్ఞారహితులు. వారు సింహాసనం ఎక్కినా నామకఃమాత్రమే! మహాసామ్రాజ్యము ఎవరు కాపాడేది? ఆ మహాభారము భరించవలసినది మన ఇక్ష్వాకు వంశమే!

"అందుకే రాజ్యబలంకోసం అనేక రాజకుటుంబాలతో వియ్యాలంద బోతున్నారు నాయనగారు. పిష్టపురంనుంచి మాఠరులూ, దేవపురంనుంచి వాసిష్టులూ మనకు బలం చేకూరుస్తారు. వారు తమబాలిక భట్టిదేవిని నాకు ఉద్వాహం చేయాలని సంకల్పించి

రాయబారం పంపించారు. నా హృదయం శాంతశ్రీ, బాపిశ్రీలకు దత్తమైనది. నువ్వుతప్ప నాకు ఆలోచన చెప్పేవారులేరు. ధనకప్రభువు ఆలోచనపైననే, మహారాజు నాకడకు పూంగీయప్రభువును రాయబారము పంపించారు. ఆ మామయ్యగారు, తమ కొమరిత విషయం ఎరిగి ఉండి కూడా అత్తయ్యగారి సంప్రదింపుతోనే నాదగ్గిరకు వచ్చారుట!" అని చెల్లెలి వేపు యువరాజు దీనంగా చూచాడు.

"వాసిష్ఠీ రాజకుమారిని మీరు వివాహం చేసుకోవాలని రాజధర్మం విధిస్తున్నది."

"ఉజ్జయినీవారు మన సహాయం అర్థిస్తున్నారు. వారి సామంతులు వాకాటులూ, నలులూ తిరుగుబాటు చేస్తున్నారు. మృగ రాజుబలం తగ్గగానే చిన్న చిన్న జంతువులన్నీ తలలెత్తుతాయి. చక్రవర్తి దిగ్విజయంచేసి పది సంవత్సరాలయింది. దేశంలో ప్రతి మహాసామంతుడు చక్రవర్తి కావలెననే! అందులో చక్రవర్తి దాయాది పులమావిప్రభువు ప్రతి చిన్న సామంతునితోను కుట్ర చేస్తున్నాడు. అందుకే మాళవమహారాజు మన సహాయం అర్థించి ఉండవచ్చు."

"అన్నయ్యగారూ! మీరు చెప్పింది నిజం."

శాంతిశ్రీ సర్వశాస్త్రాలూ చదువుకొన్నదానివలె ఇరువైపుల హెచ్చు తగ్గులు సరిచూచి చెప్పినట్లు తీరుపు చెప్పినది.

## 8

**వీ**రపురుషదత్త యువరాజు ఆశ్చర్యమున చెల్లెలివంక చూచినాడు.

**వీర:** మనకు క్షాత్రవులు చుట్టాలు. వెనక శ్రీ పులమావి చక్రవర్తి క్షాత్రప రాకుమారిని ఉద్వాహమైనాడు. క్షాత్రపరుద్రసేన మహారాజుకు శ్రీరుద్ర దేవభట్టారకకుమారి అను సౌందర్యనిధియైన పదునారేండ్ల బాలిక ఉన్నది.

"అన్నగారూ! ఈ రాచకార్యాలకు, పెళ్ళిమనువులకు ముడిపెట్టడం నావల్ల నేమవుతుంది? నేనేమి ఆలోచన చెప్పగలను? మీరు ఆనందార్హతాచార్యులతో ఆలోచించండి."

"ఇంతకు నేను ఉజ్జయిని వెళ్ళడం?

"వసంతోత్సవము వెళ్ళగానే మీరు వెళ్ళుతున్నారు కాదా?"

"అది రాజాజ్ఞ!"

"అలాగే వెళ్ళిరండి. ఇంక ఒకవిషయం; నాకు ఆనందార్హత గురుదేవుల శుశ్రూషమానడం ఇష్టంలేదు."

"నిన్నెవరు మానుమన్నారు తల్లీ?"

"మహారాజులు, శ్రీబ్రహ్మదత్త ప్రభువుకడ ఆర్షధర్మాలు, దర్శనాలు నేర్చుకోవలసిందని ఆజ్ఞ ఇచ్చారు.

"స్కందవిశాఖాయనక ప్రభువు ఇంకా యువకులు. ఆయన చెంత శుశ్రూష ఉచితమా అని సందేహిస్తున్నాను. ఆయన జగద్విఖ్యాత పండితులనేది నిజమే కాని నాకేమో మనస్కరించడంలేదు. అయినా కారణంలేకుండా మహారాజు ఇలాంటి ఏర్పాటు చేస్తారా?"

"చదువు ప్రారంభానికి శుభముహూర్తం కూడా నిశ్చయించారు!"

"నీకు యిష్టంలేదా?"

"లేదు."

"ఎందువల్ల? ఇందులో భయపడవలసిందేముంది?"

"భయం కాదండీ, ఇంత బుద్ధధర్మమూ చదివి, మళ్ళీ ఆర్షధర్మమా?"

"తల్లీ! ఎంత వెఱ్ఱిదానవు. నాయనగారు శ్రీరామచంద్రుని భక్తులు. దేవతల ప్రీతికోసం క్రతువులొనర్చి సర్వప్రజాసౌభాగ్యంకోసం కర్మయోగం సలిపే రాజర్షులు. వారి కొమరితకు ఆర్షధర్మం విజాతీయం కాదుకదా?"

"వినండి."

"అవధారు!"

"ఏదో దిగులుగా ఉన్నది నాకు."

"ఒక్కవిషయం చెప్పుతున్నాను విను శాంతీ! మనుష్యులందరూ సర్వధర్మాలు నేర్చుకోవాలి. నేర్చుకున్నంత మాత్రాన మనకు ప్రీతిపాత్రమగు ధర్మము మనలో నీరసించిపోయే టట్లయితే, ఆ ధర్మము ఉన్నాఒక్కటే, లేకపోయినా ఒకటే! ఏ ధర్మమూ నిత్యముకాదు. లోకంలో అనేక ధర్మాలు యుగయుగానికీ శకశకానికి మారుతూ ఉంటాయి. బౌద్ధధర్మమే ఎన్ని రూపాలు తాల్చలేదు తల్లీ! ఈ ధర్మాలలో బలముకలవి కొన్ని తరాల వరకు ఉంటాయి. కొన్ని వెంటనే నశించిపోతాయి. ఆర్షధర్మం అంటే భయమా అని నేను ప్రశ్న అందుకనే వేసినాను. ధనక ప్రభువును గురువుగా ఒప్పుకో చెల్లీ!" యువరాజు చెల్లెలు నమస్కరింప ఆశీర్వదించి, ఆమెను దరికి చేర్చుకుని తలపై చేయివైచి కురులు సవరించి, "ఆర్షధర్మాలు నేర్చుకోనని పట్టుబట్టకు తల్లీ!" అని వెడలిపోయినాడు.

ఆ జగదద్భుతసుందరి స్నానమాడి శుభ్రవస్త్రాలు ధరించి కచ భాగ్యము తలపై పరిష్కారిణులు ముడిగా రచింప బుద్ధపూజా గృహానికి పూజకై పోయినది.

మగవారు మరచిపోయినా స్త్రీ లోకం ధర్మాన్ని మరవలేదు. ఆంధ్ర మహాదేశంలో బౌద్ధధర్మం కొంచెం తగ్గిపోయి, మరల ఆర్షధర్మం నూతన రూపంలో మొలకెత్తినది. అయినా ఆంధ్ర వనితామణులు బుద్ధారాధన కొనసాగిస్తూ, సంఘారామాలకూ, స్థూపాలకూ విరివిగా దానధర్మాలు చేస్తున్నారు. శిథిలములయ్యే చైత్యాలను బాగు చేయిస్తూనూ ఉన్నారు.

పురుషులలో బౌద్ధభక్తి పూర్తిగా నాశనము కాకున్నను శాతవాహను నాటి అఖండభక్తి తగ్గిపోయింది. వారూ బౌద్ధారాధనలు చేస్తూ దానధర్మాలు చేస్తూనే ఉన్నారు. తమ స్త్రీలు భక్తితో చేసే ఆరాధనలకు, దానధర్మాలకూ ఆనందిస్తూ ఉన్నారు.

మాఠరి సారసికాదేవి శాంతహృదయ, పరమబౌద్ధ భక్తురాలు. అయినా భర్తసలుపు అగ్నిసోమక్రతువున ఆమెయే సోమిదమ్మ అయినది. శాంతిమూల మహారాజు చెల్లెండ్రు, శాంతిశ్రీ హమ్మశ్రీలు వదినగారి యందు భక్తికలవారు. తమ చిన్నతనంనుండి బౌద్ధధర్మాభిరతలై ఉన్నా బౌద్దధర్మ బోధనలను అంతగా చవిచూచి ఎరుగరు. సారసికా దేవి సకల విద్యాపారంగతురాలు. బౌద్ధధర్మ నిష్ణాత కాబట్టి మరదండ్రకు బౌద్ధ నికాయాలూ, పిటకాలూ, అభిధర్మసూత్రములు తెలియజెప్పేది.

వాసిష్ఠీ పుత్రికలు శాంతిశ్రీ, హమ్మశ్రీ లిద్దరు బుద్ధారాధన చేసిరి. మాఠరీ పుత్రి శాంతిశ్రీ ఆరాధన సామాన్యమయినది కాదు. అటు తల్లీ, మేనత్తలూ గురుత్వం చేసినదలా ఉండగా ఆ బాలికకు ఆనందార్హతలు ముఖ్య గురువులై బౌద్ధధర్మ సర్వస్వం కరతలామలకం చేసిరి. అట్టి శాంతిశ్రీకి ఈ బ్రహ్మదత్తప్రభువు గురువగుట యెట్లు? ఆయన ఎంత పండితుడైనా, సద్గుణ సంపన్నుడైనా నిమతాభిమాని కదా. బుద్ధదేవా, అహింసా పరమావతారా నువ్వు తప్పింపలేవా, నాకీక్రూరవిధి సంఘటన!" అని ఆమె పూజా గృహంలో మహాశ్రమణక విగ్రహం ముందు సమాలింగిత భూతల అయింది.

## 9

**మ**హారాజు ఆజ్ఞ అనుల్లంఘనీయము. రాజకీయాలలో పాల్గొంటూ, రాజ్యాలు పాలిస్తూ పవిత్ర బ్రాహ్మణవంశాలు నీచగతి పొందాయి. ఒక్కసారి శతవృద్ధుడైన అవతారమూర్తి నాగార్జునదేవుని కలుసుకొని, ఆ మహాత్ముని ఆజ్ఞను గ్రహించడం ఉత్తమమని విశాఖాయనక ప్రభువు రథారూఢుడై శ్రీ పర్వత పాదానికపోయి, కొండ గుహలలోనుంచి కొండచరియపైకి, కొండ చరియపై నుండి శైలగర్భానికి తొలిచియున్న మెట్లనెక్కుచు శిల్పాలు చిత్రలేఖనాలు గమనింపకుండా, ఆ ధనకప్రభువు శైలశిఖర సమతలంపైన మహోత్కృష్ట ప్రజ్ఞతో ఆంధ్రబ్రాహ్మణ శిల్పవంశంవారు రచించిన మహా సంఘారామ విహార భవనాలకు పోయినాడు. ఆ భవనాల క్రిందిభాగము శైలశిఖరభాగమే, పై అంతస్థును మాత్రం సమతలంపైన పెద్దయిటుకలతో నిర్మించారు. ఈలాంటి అంతస్థులు నాలుగున్నాయి.

నాలుగవ అంతస్తులో కొండ లోయలన్నీ పరికించి చూడడానికి అనువుగా ఒక విహారమందిరం, ఆ మందిరానికి నాలుగువైపులా ద్వారా లున్నాయి. ఒకవైపు విజయపురి రాచనగళ్ళూ, కోటా కనిపిస్తవి. వేరొకవైపు కృష్ణానదీ, ఇంకో వైపు నగరము, నాలుగో వైపు కృష్ణానదిన్నీ, ఆ విహార మందిరంలో మొగలి ఆకు చాపలు నేలపై మంచాలపై, పరచిఉన్నవి. ఆ చాపలన్నీ నూలువస్త్రాలకన్న మెత్తవై, కంబళులకన్న దళసరై ఉన్నాయి. ఆ మందిరంలో ఒక బంగారు బుద్ధవిగ్రహం తూర్పువైపుగా ఉంది. పడమటి గోడచెంత ఎఱ్ఱగంధపు చెక్క మంచముపై పరచిన తూలికామృదుల కృష్ణమృగాజినముపై నొక శతవృద్ధు కూర్చుండి ఉన్నాడు. ఆయనకు నూట పదిహేను సంవత్సరాలున్నవి. ఆ దివ్యపురుషుని దేహము ఈ షణ్మాత్రము వదలినట్లు లేదు. ఇంక ఆ విహారమందిరంలో ఏ వస్తువులు లేవు. శ్రీ నాగార్జునదేవుడు ఆరడుగుల పొడవువాడు. దక్షిణకోసలస్థమైన ఆంధ్రబ్రాహ్మణ వంశంలో ఉద్భవించిన అవతారమూర్తి నాగార్జునదేవుడు. ఆయన బోధిసత్త్వుడని ప్రజల విశ్వాసము.

సర్వవిద్యాపారంగతుడు. అవధిలేని జ్ఞానం రూపొందినమూర్తి. సకల జంబూ ద్వీపము, త్రివిష్టప చీనాదేశాలు, యవసువర్ణప్లక్ష శాకశాల్మవి కుశక్రౌంచ పుష్కరాది సప్తద్వీపములు తిరిగి వచ్చినాడని ప్రతీతి. ఆర్షానార్ష ధర్మములు బుద్ధధర్మమూ అత దవగాహించెను. బుద్ధదేవునితో పాటు నాగార్జునదేవుని భక్తిమై ఎల్లరు స్మరించేవారు.

ఆయన జుట్టు పూర్తిగా నెరిసిపోయింది. దేహాన అనవసరమైన కండలేమీలేవు. చర్మపు కాంతి తగ్గిపోక దివ్యమై మెరుస్తున్నది. ఆయన మోమున దరహాస కాంతులు అతిలోక తేజస్సుల లీనమై సర్వ విశ్వాసాలను అమృతపు గలయంపి చల్లుతున్నవి. ఆయన రూపమే దివ్యమందాకిని.

నాగార్జునదేవుడు కోసలరాష్ట్ర బ్రాహ్మణుడై, మహావిద్వాంసుడని ఎనిమిదేండ్ల వటువుగానే పేరుపొందడంచేత, ఆంధ్రశాతవాహన చక్రవర్తి ఆ బాలకుని మంజుశ్రీ దేవుడని యెంచి పూజించెనట, ఆ మహాభాగుడు సర్వ విద్యాక్షేత్రములు సేవించి తిరిగి ఆంధ్రదేశానికివచ్చి ధాన్యకటక మహా సంఘారామంలో తాను రచించిన మాధ్యమికవాద సూత్రాలను శిష్యులకు నేర్పజొచ్చినాడు. ఆ మహాభాగుడు వాదనిష్ఠురుడు.

ఆశ్రమ నియమాలు ఉల్లంఘించిన పదివేవురు భిక్షులను వైశాలి నగర మహా సంఘసభ వెడలగొట్టినది. వారిలో ఆరువేలమంది ధాన్యకటక సంఘారామ, ప్రతీపాలపుర, కంటకశిలా సంఘారామాది వివిధ సంఘారామాలకు చెందిన భిక్షులు. వీరే మహా సాంఘికులని పేరుపెట్టుకొన్నారు. వీరికి వ్యతిరేకము మహాస్థ విహారవాదము. ఆంధ్ర మహాసాంఘికులను అంధక సాంఘికులని భారతీయ బౌద్ధ సంఘాలు పిలిచేవి. నిరీశ్వర వాదమైన భౌద్ధము నానాటికి శుష్కమై సాధారణ ప్రజలకు రుచించడంలేదు. ప్రజాసామాన్యమునకు తర్కముతో బనిలేదు. వారిభక్తికి ఆధారము లేకపోయినది. కావుననే వారు బుద్ధధాతువులు నిక్షిప్తమైన చైత్యాలను, బుద్ధదేవ చిహ్నాలయిన పాద, బోధివృక్ష, ధర్మచక్ర, పూర్ణకలశ చైత్యములను పూజించి, చివరకు బుద్ధునే దేవుడన్నారు.

అది అదనుగాగొని ఆర్షధర్మవాదులు, బౌద్ధమతాన్ని ఖండించి, మరల ఆర్షధర్మము పునరుద్ధరింప సాగినారు. ఈ రెంటినీ సమన్వయించు వాదము మాధ్యమికము. దీనినే మహాయాన మంటారు. ఈ పూర్ణ పురుషుడైన నాగార్జున దేవుడు బౌద్ధధర్మాని అశోకుని తర్వాత రెండోసారి పునరుద్ధరించినాడు. ఈయన జంబూద్వీపం అంతా తిరిగి ధర్మ దిగ్విజయముచేసి, మళ్ళీ ధాన్యకటక పురిలో తన ఆశ్రమానికి చేరుకొనేసరికి, వాసిష్ఠీపుత్ర పులమావి చక్రవర్తి సర్వ దక్షిణాపథాన్ని ఏకచ్ఛత్రాధిపతిగా ఏలుచుండెను. అప్పటికి నాగార్జునునకు నలుబది సంవత్సరాలు.

వాసిష్ఠీపుత్ర పులమావి అటు ఆర్షధర్మ మవలంబించి అశ్వమేధాది క్రతువులు చేస్తూఉండెను. ఆయన తనతండ్రి గౌతమీపుత్ర శాతకర్ణి వలన అమిత గౌరవం పొందిన ఆచార్య నాగార్జున పరమార్హతులను పూజించెను. సర్వ ధర్మాలు ఆయాచార్యదేవునిడు నేర్చుకొన్నాడు. నీతివిశేషాలను గూడ నాగార్జున దేవునివలన గ్రహిస్తూ ఉండెను. సర్వదక్షిణాపథంలో ఉన్న వందల కొలది మహాసంఘారామాలకు ఆచార్యదేవుడు ముఖ్యాచార్యుడయినాడు.

కొంతకాలనికి ఆ మహాతపస్వి అటవీ ప్రదేశానికి సమీపంగా తనకొక గ్రామాశ్రమం నిర్మింపుమని చక్రవర్తిని కోరినాడు. ఆ వాసిష్ఠీ పుత్రుడు అటవీ రాజ్యమైన కొరవి రాష్ట్రానికి చోరరాష్ట్రానికి ధనకరాష్ట్రానికి పల్లవ భోగానికి మహాసామంతులయిన ఇక్ష్వాకు ప్రభువులు నిర్మించిన విజయపురికడ శ్రీపర్వత శిఖరంపై నాగార్జునదేవునికొక పవిత్రాశ్రమం నిర్మించెను.

## 10

**వి**జయపురి నాగార్జునాచార్యుల కాలంలోనే పెద్దనగరమైనది. ఎటు చూచినా రెండు గోరుతాలుంటుం దానగరం. కృష్ణానదీతీరాన యోజనదూరం వ్యాపించినది. ఈ మహాపట్టణానికి ఉపగ్రామాలు ఇరువది ముప్పది ఉన్నాయి. ఈ మహానగరానికి ధనకుల శేఖరుడైన బ్రహ్మదత్తుడే పాలకుడు. ఈ విశాఖాయనకులలో ఒక కుటుంబంవారు ఇప్పటికి రెండు మూడు వందల సంవత్సరాలనుంచి వేంగీరాష్ట్రానికి మహాసామంతులు, మహాతలవరులు, మహాసేనాపతులుగా ఉన్నారు. బ్రహ్మదత్తుని తాతతండ్రులు, ఇక్ష్వాకు శాంతి మూలమహారాజున్నూ మహాచార్యబోధిసత్వ నాగార్జునదేవుని శిష్యులు.

నాగార్జునదేవుని మిత్రుడైన వాసిష్ఠీపుత్ర పులమావి చక్రవర్తి ఇరవై ఎనిమిది సంవత్సరాలు అఖండ సామ్రాజ్యము పాలించి దివంగతులయ్యారు. వారి మామగారు ఉజ్జయిని మహాక్షాత్రపుడు అల్లుని లోకువ చేసి ఆంధ్ర సామ్రాజ్యంనుంచి విడిపోయి, అల్లునితోడనే యుద్ధం సాగించాడు. అప్పుడు నాగార్జునదేవుడు ఇరువాగులవారికి సంధిచేసి, మామగారిచే అల్లుని చక్రవర్తిత్వం ఒప్పించారు.

వాసిష్ఠీపుత్ర పులమావిపుత్రులు భారద్వాజీపుత్ర శివశ్రీ ఛత్రపాణి నాగార్జునదేవుని ప్రియశిష్యుడై, తండ్రి నిర్యాణానంతరం చక్రవర్తి సింహాసనం అధిష్టించి పదమూడు సంవత్సరాలు రాజ్యంచేసి పుత్రుడైన గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణిని నాగార్జునదేవునికి అప్ప చెప్పి, భగవంతునిల్ో లీనమైపోయినాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి సార్వభౌమ సింహాసనాసీనుడైనాడు. ఛత్రపాణి చక్రవర్తి మహాభక్తుడై రాజ్యపాలనంలో ఎక్కువ శ్రద్ధవహించక మేనమామలయిన క్షాత్రపులు స్వాతంత్ర్యం పొందినా, చూటు శాతకర్ణులు, మహాభోజ కాదంబులు, మహారథులు, అభీరులు, స్వాతంత్ర్యం పొందినా ఊరుకొనెను. ఉత్తరాంధ్రనాగులు, వాకాటులు, మాఠరులు, వాసిష్ఠులుగూడ స్వాతంత్ర్యం పొందినారు. ఇటు వేంగీపుర సాలంకాయనులు, గూడూరుపుర బృహత్పాలాయనులు, ఇంద్రకీల విష్ణుకుండినులు, ధనదుపుర ధనకులు, పూంగీప్రోలుపుర గౌతములు మాత్రం విజయపుర ఇక్ష్వాకులతోపాటు మహాసామంతులయి రాజ్యం రక్షిస్తూ ఉండిరి.

యజ్ఞశ్రీ శాతకర్ణి చక్రవర్తి సింహాసనం ఎక్కగానే ఇక్ష్వాకు శాంతిమూలుడు సర్వసేనాపతిగా, దేవదత్తుడు సేనాపతిగా సాలంకాయనాది సామంతులు కొలువ అఖండసైన్యం చేకూర్చుకొని, ఒక్కసారి దిగ్విజయానికి బయలుదేరినంత స్వాతంత్ర్యం పొందిన రాజ్యాలన్నీ దాసోహమని కప్పం గట్టినవి. ఆ దిగ్విజయం పూర్తికాగానే ధాన్యకటకం తిరిగివచ్చి, యజ్ఞశ్రీ అశ్వమేధం, వాజపేయం చేసినారు. నేడు యజ్ఞశ్రీ వృద్ధుడైపోయినాడు. ఇంక దక్షిణా పథం అంతా ముక్కలు కావలసిందేనా అని అనుకుంటూ బ్రహ్మదత్తప్రభువు ఆ మహాచైత్య మందిరంలో దిగువ అంతస్తులందు భిక్షులకడకు వచ్చినాడు.

ఆ భిక్షులందరూ బ్రహ్మదత్తునిపై నాగార్జునదేవునికి ఉన్న ప్రేమ ఎరుంగుదురు. బ్రహ్మదత్తుడు, ఆనందార్హతులు, శాంతిమూలుడు, చక్రవర్తి యజ్ఞశ్రీ మాత్రమే నియమిత దినాలలో, నియమితకాలాల ఆ బోధిసత్వుని దర్శింపవచ్చు.

బ్రహ్మదత్తుడు భిక్షులకు నమస్కరించినాడు. అప్పుడొక వృద్ధ శ్రమణకుడు బ్రహ్మదత్తుని స్నానగృహానికి కొనిపోయినాడు. బ్రహ్మదత్తుడు ఆ స్నాన గృహ కుడ్యమందున్న గోముఖాన వినిర్గమించే ప్రసవణం క్రింద స్నానంచేసి ఆ శ్రమణకు డందిచ్చు చీనాంబరాలను ధరించినాడు.

అప్పుడు అర్హతులొకరు వచ్చి మాటలాడక స్కందవిశాఖాయన ప్రభువును చివర అంతస్తులోనికి తీసుకొనిపోయినాడు. అడవి స్కంద విశాఖాయనక ప్రభువు నాగార్జునాచార్యుని ఎదుట సాష్టాంగము పడినాడు.

"నాయనా, దగ్గిరకు వచ్చి కూర్చో" అని అతి మధురములై, దివ్యామృతధారలైన మాటలు స్పష్టముగా వినంబడినవి. బ్రహ్మదత్తప్రభువు ఆనంద వికసితమైన మోముతో లేచి, నాగార్జునదేవునికడకు వచ్చి వారి మంచముదాపున క్రింద మొగలియాకు చాపపై కూర్చుండినాడు. నాగార్జున దేవుని వదనాన మందహాసము సంపూర్ణ జ్యోత్స్నలు విరియుచున్నది.

"ధనకప్రభూ! మీ నాయనగారు శ్రీశైలారణ్యాశ్రమంలో క్షేమంగా ఉన్నారా?" నాగార్జునదేవుడు మాట్లాడునప్పుడు పెదవులు కదలినట్లు కానరావు.

"క్షేమంగా ఉన్నట్లు వార్తలు వస్తూనే ఉన్నవి భగవాన్!"

"కాలం మనలోనే ఉంది. దానినుంచి మనం ఎంతదూరం పరుగెత్తగలం?"

"చిత్తము."

"మూడుగా కనుపిస్తూ ఏకమైనకాలం అనంతమై, మనుష్యుని అణువణువూ పొదువుకొని ఉంటుంది."

"చిత్తం భగవాన్!"

"శాతవాహన యుగం అస్తమిస్తున్నది. దేశంలో ధర్మనాశనం కలుగుతుంది అనుకుంటున్నావు."

"చిత్తం భగవాన్."

"ఆనాటి ఇక్ష్వాకు వంశంలోనిదే ఈ విజయపురి శాఖ."

"చిత్తం."

"నాయనా, ఇక్ష్వాకులమీదే ఈ మహాదేశ రక్షణభారం పడుతుంది. ఆ ఇక్ష్వాకుల భారం నీపైన ఎక్కువ మొగ్గుతుంది. ధర్మనిర్వహణానికి దారిచూపే వెలుగు మనలోనే ఉంది."

"భగవాన్! నేను కృతార్థుణ్ణి.

"నాయనా! నువ్వు ధాన్యకటకంనుండి రాగానే, ఇక్కడికి ఒక్కసారి రా."

ఆనందంతో, అనిర్వచనీయ మహాభక్తితో బ్రహ్మదత్తుడు భగవాన్ నాగార్జునదేవునకు సమాలింగితభూతభూతలుడై నమస్కరించి, నెమ్మదిగా నడిచి వెడలి పోయినాడు. నాగార్జునదేవుని చిరునవ్వులు విశ్వమున ప్రసరించినట్లయి పోయినవి. ఆశీర్వచన సమ్మిశ్రితమగు చూపులు బ్రహ్మదత్తుని గుమ్మము వరకు సాగనంపినవి.

బ్రహ్మదత్తప్రభువు కొరకు బహిర్మందిరంలో ఎనలేని ఓర్పుతో కనిపెట్టుకొని యున్నాడు ఆ వృద్ధశ్రమణకుడు. బ్రహ్మదత్తుడు ఆశ్రమణకుని వెంటనే బయలుదేరి అంతస్తులు దిగి, అక్కడ ఉన్న భిక్షులకందరకు నమస్కరించి వారి సెలవుపొంది వెడలి పోయినాడు. త్రికాలజ్ఞులైన మహనీయుల దర్శనమే సర్వసంశయాలకు నివారకమను కొన్నాడు బ్రహ్మదత్తుడు. మహాత్ములు బోధింపనవసరములేదు. శుద్ధసాత్త్వికులను సకలమార్గములూ మూలకారణానికే కొంపోవును.

ప్రపంచంలోని అపశ్రుతులు మానవహృదయాన్ని సంశయానిలం చేస్తవి. స్థిరమైన పట్టు దొరకదు. సంతతమైన ఈ జగత్పరిణామం అతిచిత్రమైనది. కనుకనే ఇది మాయగా గోచరిస్తుంది. ఉపనిషద్విచారణ మార్గాన్ని బౌద్ధవిచారణ పరిపూర్తి చేసిందనుకుంటే, బౌద్ధధర్మకూడా హీనమైపోవడమేమిటి! ఎన్నో చిన్న చిన్న సిద్ధాంతాలు ఈ ధర్మ సమన్వయానికే భగవాన్ నాగార్జునదేవులు అవతరించారు. శ్రీకృష్ణపరమాత్మే బుద్ధదేవుడు, ఆయనే నాగార్జునదేవుడు అనుకుంటూ బ్రహ్మదత్తుడు కొండ దిగి, రథమెక్కి కృష్ణాతీరానికి వెళ్ళి, ఓడలరేవు చేరినాడు.

శాంతిమూల మహారాజు కృష్ణానది పడవల రేవును చలవ నాపరాళ్ళ వితర్దికగా నిర్మాణ మొనర్పజేసెను. ఆ వసంత కాలంలోకూడా విజయపురి చెంత కృష్ణలో వేలకొలది ఓడలు, నావలు, పడవలు, తరణులు అన్నీ కునికిపాటుపాడే వృద్ధులవలె, ఆ నదీ తరంగాలలో ఊగిసలాడుతున్నవి. బ్రహ్మదత్తుడు రేవు దగ్గరకు పోయేసరికి ఒక ఓడలోనుంచి సరుకు దిగుతోంది.

## 11

బ్రహ్మదత్తుడు రథము దిగి రేవులోని ఓడల పరిశీలింప వెడలినాడు. ఈ ఓడలు సాగరికములుకావు. నదులలో ప్రయాణంచేసే తరణులు. ఇవి సముద్రంవరకు ప్రయాణం చేస్తాయి. కొలందియలు అన్న ఓడలు నదుల ముఖద్వారంలోనూ లోతు నదులలోనూ సముద్రతీరం వెంబడినీ ప్రయాణం చేస్తాయి. నదిలో మాత్రమే యానం చేసేని నావలు. సముద్రంలో మాత్రం యానంచేసే ఓడలనే సాగరికములనీ, నౌకలనీ పిలిచేవారు. కృష్ణాముఖ ద్వారము చెంత పెద్ద ఓడలలో నుంచి సరుకులన్నీ తాము ఎగుమతి చేసుకొని, ఈ ఓడలు నదీతీర పట్టణాలలో దిగుమతి చేయవలసిన సరకులను దిగుమతి చేస్తూ ప్రయాణం సాగిస్తాయి. శ్రీపార్వతీయాంధ్ర ప్రదేశంవరకూ కృష్ణలో ఒక్కనడివేసవి కాలంలో తప్ప తక్కినకాలాల్లో ఈ పెద్ద ఓడలు ప్రయాణం చేస్తూనే ఉంటాయి.

బ్రహ్మదత్తప్రభువు దిగుమతి అయ్యే మిరియాలు, లవంగాలు, ఏలకులు, దాల్చిన చెక్క, ముత్యాలు, లక్క, కెంపులు, చీనాపట్టు, బంగారము పరీక్షించెను. శ్రీకాకుళంలోనే వర్తకులు సుంకాలు చెల్లించి సరకులు ఓడలో ఎక్కించుకొన్నారు. సుంకాలు పుచ్చుకొన్నట్లు శాతవాహన ముద్రికలు ఓడ నాయకునికడ ఉన్నాయి. ఏ ఏ వస్తువునకు ఎంత సుంకమిచ్చిరో ఆ వివరాలను సముద్రవర్తకాధికారి రాగి రేకుమీద చెక్కించి ఆ ఓడ నాయకునికి ఇచ్చినాడు. వానినెల్ల ఆ ప్రభువు పరీక్షించినాడు.

విజయపురంనుంచి వజ్రాలు, బియ్యము మొదలగు ధాన్యాలు, నూలు, కంబళ్ళు, ఉన్నివస్త్రాలు, పొత్తుబట్టలు, బంగారు వెండినగలు, కత్తులు, ఫలకములు, వర్ణములు, నువ్వులు మొదలగు నూనెవస్తువులు, పూగీఫలాలు, సంగీతవాద్య విశేషాలు, దూది, గాజులు, దంతపుశిల్పాలు, చింతపండు, ఉప్పు, సారాయములు సరుకు ఎగుమతి అవుతవి.

ఆంధ్రదేశ వణిక్కులు, ఆంధ్రశిల్ప బ్రాహ్మణులు జగత్ప్రసిద్ధి నొందినారు. ఆంధ్ర నేతపని లోకపూజ్యము. అన్ని కుటుంబాలవారు వడికేవారు. సర్వసాధారణంగా ఆంధ్రులు వడకిన నూలు సాలిపురుగు దారాలకన్న సన్నంగా ఉక్కు తీగలకన్న బలంగా ఉండేది. కొన్ని మడతలుపెట్టి కట్టుకొన్నా ఒళ్ళు కనబడేది ఆంధ్ర స్త్రీలు వడికిన వలువలలో. అలాంటి నూలును నేయడంలో, ఆ నూలుకు రంగులద్ది చిత్రవర్ణ వస్త్రాలు నేయడంలో ప్రపంచంలో ఆంధ్రతంతుకారకుల మించిన వారింకొకరు లేనేలేరు. తెల్లని వస్త్రములు చేసిన వెనుక వర్ణకారకులు రంగులు అత్యంత మనోహరంగా అద్ది పూవులు లతలు మొదలయిన అలంకార శిల్పాలుగా సిద్ధం చేసేవారు. వస్త్రాలు లాతి విలాతులవారు ఎగనెత్తుకుపోయేవారు ఈ గొఱ్ఱెలను పెంచి ఉన్ని తీసి, ఆ ఉన్నిని ఓషధీరసంతో కడిగి శుభ్రంచేసి చిత్రవిచిత్రంగా కంబళ్లు, రత్నకంబళ్ళు, శాలువలు మొదలయినవి అల్లేవారు ఆంధ్రభూమిలో, రజితమును నూలుపై పోతపోసిన దారము రజని అని పారశీకులు సిద్ధంచేసేవారు దానిని సరజ లేక సరిగ అనే వారు ఆంధ్రులు. ఆ సరిగ వస్త్రాలలో అంచులు పువ్వులు లతాదికాలూ నేసేవారు. ధాన్యకటకము, విజయపురి మొదలయిన మహాపురాలలో ఈ వస్త్రశిల్పం విరివిగా చిరకాలమునుండి జరుగుతున్నది. బ్రహ్మదత్తునికి ఆంధ్రశిల్పులన్నా, ఆంధ్రవస్త్రకారులన్నా అపరిమితాదరం. రోమక, యవన, నీలాది ద్వీపాలలో భారతీయ వస్త్రాలకు, శిల్పపుపనికి ఉన్న గౌరవము విన్నప్పుడు బ్రహ్మదత్తుడు ఉప్పొంగిపోయేవాడు.

ఓడలు అనంతమైన సముద్రంలో నిర్భయంగా తేలిపోతున్నాయి. వరుణ దేవునికి కోపం రాకుండా ఉంటే ప్రయాణంలో ఓడలకేమీ ముప్పం లేదు. గాలివేగము వానికి తోడవుతుంది. ఓడలకు మహాసముద్ర మధ్యమందుండే ప్రవాహ భేదాలు సహాయమవుతాయి. లేదా, తెడ్లు వేసుకొని, ఆంధ్ర నౌకలు ప్రయాణం చేస్తాయి. ఓడలు నడపటంలో ఆంధ్ర నావికులు పేరుపొందినారు. నాలుగువందల గోరుతాల సముద్రతీరం పొడవునా వరుణదేవుడు ఆంధ్ర నావికులను వాత్సల్యంతో చూస్తాడు. అహో! వీరుకదా వరుణదేవుళ్ళు అని బ్రహ్మదత్తుడు అనుకున్నాడు.

తెరచాపలన్నీ ఎత్తి, సముద్రాన్నే ఆకాశంచేసి, ఓడ రాజహంస అయి తేలిపోతూ ఉంటుంది. నావికులు పాటపాడుతూ ఉంటారు. లోపల యాత్రికులు ఉంటారు. యవద్వీప భాషలో నావికా నాయకుణ్ణి "సరాంగు" అంటారట. ఆ నాయకుడే ఓడకు కళ్ళు. మెదడూను. వారి పాట ఎంతో మధురంగా ఉంటుంది. భూమి మనుష్యుల తల్లి. సముద్రుడు నావికుల తండ్రి, వారికి తల్లి ఆకాశం, నక్షత్రాలు సహోదరీమణులు. సూర్య దేవుడు సోదరుడూ, గురువూ. చంద్రుడు ప్రియురాలు. ఓడ రెక్కలు చాచి ఎగిరిపోతోంటే

బ్రహ్మదత్తుడు చిన్నతనంలో తాను తామ్రలిప్తినుండి తామ్రపర్ణి వరకు ప్రయాణం చేసిన విషయం జ్ఞాపకం తెచ్చుకున్నాడు. మొదటి దినాలలో భయంవేసింది. భోజనాదికాలు ఓడమీదనే. ఎక్కడా భూమి కనబడలేదు. ఆ సముద్రమధ్యంలో నావికులు తమ దారి తెలుసుకోవడం అత్యద్భుతమైన విషయం వారు నక్షత్రాలు చూచేవారు రాత్రులు. సూర్యుణ్ణి చూచేవారు పగలు. మేఘాలు ఆకాశం నిండిపోతే గాలివెళ్లే తీరు మొదటినుంచి గమనిస్తూ ఓడ నడుపుతుంటారు.

## 12

బ్రహ్మదత్తప్రభువు నదీతీరంనుండి రథముపై రాచనగళ్ళవైపు వెళ్ళినాడు. ఆ మరునాడే తాను మహారాజకుమారికకు విద్య ప్రారంభింపవలసిన శుభముహూర్తము. నగరమున అన్ని వీధులు రథపథములు కావు. కాబట్టి పెద్దవీధుల వెంటనే రాచనగళ్లున్న కోట ప్రక్కనుండి మరల కృష్ణ ఒడ్డుకు వచ్చి, రెండు గోరుతముల దూరముపోయి, తన పండ్లతోటను చేరినాడు. అచ్చటి వనాలలో సమస్త ఫలజాతులు పండుతవి. మామిళ్ళు విరివిగా పిందెలతో నిండి ఉన్నవి. పనసపిందెలు దిగుతున్నవి. అరటిచెట్లకు మనిషి ఎత్తుగెలలు వ్రేలాడుతున్నవి. అవి ఎప్పుడూ గెలలు వేస్తూనేఉంటాయి. నిమ్మలు పూలతో పిందెలతో నిండి ఉన్నవి. పెద్ద నేరేడులు పూతతో పిందెలతో నిండి ఉన్నవి. ద్రాక్షపళ్ళు పిందెలతో నిండి ఉన్నాయి. పూగీ వృక్షాలు గెలలు దిగుతున్నవి. శీతాఫలములు కాపు కాస్తున్నవి. నదీతీరం పొడుగునా పెద్దదోసపాదులు పందెళ్ళపై పాకుతున్నవి. నాగ రంగములు బంగారు ఎరుపు పళ్ళతో నిండి ఉన్నవి. నారికేళాలు ఆకాశం అంటుతూ జటలు దెసలక్రమ్మాగా నాట్యంచేసే శైవులులా ఉన్నవి.

బ్రహ్మదత్తుడు తిన్నగా తోటలోనికిపోయి భవనం ముందు రథము దిగినాడు. బ్రహ్మదత్తప్రభువు వస్తూ ఉండగానే తోటమాలీలు నమస్కారాలు చేస్తూ ఉండిరి. ఆ ప్రభువు రథము దిగగానే సూతుడు రథము తోలుకొని పోయినాడు. కృష్ణకు, నూరు నివర్తనములున్న ఆ తోటకు ఒక నగపంక్తి అడ్డమున్నది. ఒక్క దిక్కుననే తోటలోనుండి కృష్ణవరకూ లోయదారి. ఆ లోయనడుమ సంతతము ప్రవహించే చిన్న సెలఏరు ఉంది. ఆ నూరు నివర్తనముల తోటలోను ఎన్నో కూపాలూ, ఒక క్రీడాసరస్సూ, ఒక నడబావి. సరస్సుచుట్టూ సమస్త పుష్పజాతుల వృక్షాలున్నాయి. బ్రహ్మదత్త ప్రభువు ఆ సరస్సు ప్రక్కనే ఉన్న తిన్నెపై కూర్చుండినాడు. సూర్యుడు అప్పుడే ఆకాశం మధ్యకు వస్తున్నాడు. భోజనం వేళ అయినా, ఆయన కాగొడవే తట్టలేదు.

చక్రవర్తి మహావృద్ధు. అవసాన దినాలు; కుమారుడు వీరసుదు. ఇక్ష్వాకు మహారాజే దేశాలలో ధర్మం నడుపగల మేటి వీరుడు. ఆయన చక్రవర్తి అల్లుడు. పులమావి కుట్రలు చేస్తున్నాడు. ఆయనకు అభీరులూ, క్షాత్రవులూ సహాయం చేస్తామంటున్నారు. పులమావికి శ్రీశాంతిశ్రీ మహారాజకుమారికను వివాహం చేసుకుందామని ఉన్నది. శాంతిశ్రీ కుమారి త్రిజగన్మోహిని. బాలలకు అంత అందము ఉండడంవల్ల ఒక్కొక్కప్పుడు రాజకీయాలలో కష్టములు సంభవిస్తాయి. ఆ బాలకు తాను చదువు చెప్పాలట. రేపే ఆ శుభముహూర్తము.

ఆ బాల భిక్కుని కావాలని సంకల్పము పూనినదంటారు. ఆమె హృదయంలో కామగంధము లేదట. తల్లిదండ్రులన్నా ప్రేమలేదట. వారియెడ గౌరవంతో సంచరిస్తుందట. ఆమె హృదయం శుద్ధశూన్యం, తెల్లటి రాయి అంటారు. కాని ఆమె స్వభావము సాత్వికమట. రాతి హృదయానికి సాత్విక గుణమెలా అలవడుతుంది? శుద్ధసత్వంకూడా తమస్సులా కనిపిస్తుంది. అంతే. ఓహో ఏమి అందం! అలౌకికమా సౌందర్యం. ఆ పరమసుందరికి తాను యువకుడు, అవివాహితుడు ఎలా చదువు చెప్పడం?

ఆ సమయంలో తోటమాలి పరుగునవచ్చి, బ్రహ్మదత్తప్రభువు కడ మోకరించి, "ప్రభూ, శ్రీ మహారాజులవారి కడనుండి కంచుకి వచ్చి తమ దర్శనము అపేక్షిస్తున్నారు" అని మనవి చేసుకొన్నాడు.

"అలాగా! వెంటనే ప్రవేశ పెట్టు."

కంచుకివచ్చి బ్రహ్మదత్తునికి నమస్కరించి, "ప్రభూ! మహారాజుల వారికి ధాన్యకటకంనుండి గజవార్త వచ్చింది, తమ్ము వెంటనే ఆలోచనా మందిరానికి రమ్మన్నారు. అక్కడనే పూంగీయ స్కందశ్రీమహాప్రభువూ ఉన్నారు. శ్రీమహారాజకుమారులవారూ అచ్చటనే ఉన్నారు" అని మనవి చేసినాడు.

"సరే నేనూ వస్తున్నాను" అని బ్రహ్మదత్తప్రభువు లేచి తన వీపున వ్రేలాడు శంఖంతీసి "భోం, భోం" అని ఊదినాడు. ఆ వెంటనే రథాన్ని తోలుకొని సూతు దక్కడకు వచ్చినాడు. బ్రహ్మదత్తప్రభువు రథారోహణం చేయగానే ఆ రెండు గుఱ్ఱాలూ వాయువేగంతో విజయపురంవైపు సాగినాయి. కన్నుమూసి తెరిచేలోపల రాచకోట వచ్చినది. కోటగోపుర ద్వారం దాటి, రథం రాజభవనం సమీపించి, ఆగిపోయినది. వెంటనే బ్రహ్మదత్తుడు రథావతరణంచేసి మృగరాజువలె లోనికి నడిచిపోయినాడు. మహాకంచుకి ఉత్తమాజానేయ మధివసించి రథము వెంటనే వచ్చి, బ్రహ్మదత్త ప్రభువు రథావతరణ చేయకమునుపే గుఱ్ఱం దిగి, అచ్చట ఉన్న సారథికి కళ్లెమందిచ్చినాడు. వారిరువురు సమాలోచన మందిరానికి వెళ్ళిపోయినారు. బ్రహ్మదత్తుడు మహారాజునకు స్కందశ్రీ ప్రభువునకు నమస్కరించినాడు. మహారాజ కుమారుడు వీరపురుషదత్త ప్రభువు లేచి బ్రహ్మదత్తునకు నమస్కరించినాడు. బ్రహ్మదత్త ప్రభువు మహారాజకుమారుడూ ఆసనాలధివసించినారు.

**మహారాజు:** బ్రహ్మదత్త ప్రభూ! పులమావి ప్రభువు తాను ముసిక నగర రాజప్రతినిధి అయినా ధాన్యకటకంలోనే ఉంటున్నాడుకదా! ఈ మధ్య ఆతని కుట్రలెక్కువ కాగా, సార్వభౌములు పులమావిప్రభువును ధాన్యకటకం వదలిపోవద్దని ఆజ్ఞ ఇచ్చినారు. ఆలాంటి సమయంలో నిన్నరాత్రి అతడు ముసికనగరం ప్రయాణమై పోయినాడట.

**బ్రహ్మదత్తు:** ఈ వార్త పంపించింది ఎవరు మహాప్రభూ?

**స్కందశ్రీ:** మహామంత్రి శివశ్రీ పంపించినారు.

**బ్రహ్మ:** మహాప్రభూ! పులమావిని ముసిక నగరమే వెళ్ళనీయండి. ధాన్యకటకంలో ఉండి కుట్రలు చేయడంకన్న మనకు దూరంగా ఉండడము ఉత్తమం కాదా?

**వీరపురుష:** బ్రహ్మదత్తప్రభూ! ముసికలో ఉంటే పులమావికి ఇతరులతో కలవడం సులభం కాదా?

బ్రహ్మ: సులభమే. కానివ్వండి. చక్రవర్తి వారసుడైన ఒక రాజకుమారుని మనం ధర్మపరంగా ఏమిచేయగలం? అతడు మంచివాడైతే పూజార్హుడే! కాక రాజద్రోహం సలుపడానికి కుట్రలుచేస్తే భయంకర ధర్మగ్లాని అవుతుంది. ఆతడు శిక్షార్హుడు.

**వీరపురుష:** తమ ఆలోచన బాగున్నది.

**బ్రహ్మ:** ఈ విషయం చక్రవర్తికి తెలియునా?

**స్కందశ్రీ:** చక్రవర్తి చాలా జబ్బుగా ఉన్నారు. అందుచే తెలియనీయలేదట.

**బ్రహ్మ:** చిత్తం నేను వెంటనే మన అపసర్పులలో దిట్టలను ముసిక నగరం పంపి పులిమావి శాతవాహన ప్రభువు అక్కడ ఏమిచేస్తున్నదీ తెలిసికొంటాను.

**మహారాజు:** ధనక ప్రభు! మీరు వెంటనే మన సైన్యాలను ఆయత్తం చేయించి ఉంచండి. ఏ సమయానికి మనం యుద్ధాభిముఖులం కావలసివస్తుందో?

మహారాజు లేవగానే, మంత్రులు, సామంతులు, మహారాజకుమారులు లేచినారు.

## 13

విఘ్ననాధుని, సరస్వతిని, స్కందుని, బుద్ధదేవుని, విష్ణుని, శివుని పూజించి బ్రహ్మదత్తప్రభువు శాంతిశ్రీ రాజకుమారికి చదువు ప్రారంభించారు. ఆమె కీచదువుపై, ఈ గురువుపై భక్తిలేదు. తల్లిదండ్రుల ఆజ్ఞలను ఉల్లంఘించ కూడదన్న నియమమే ఆమె నీ చదువుకు ఒప్పింపచేసింది. మహారాజ కుమారికి చదువు చెప్పేటప్పుడు ఆమె చెలులు ముగ్గురు దగ్గరనే ఉన్నారు.

స్కందవిశాఖాయనక ప్రభువు ఆరంభమందే ఆత్మ అంటే ఏమిటి? అని ప్రశ్నించారు.

"స్వామీ! ఆత్మ అంటే ఉపనిషన్మత ప్రకారం సత్ పదార్థము. తక్కినవన్నీ ఆ పదార్థానికి అభాసలు."

"బౌద్ధధర్మ ప్రకారం ఆత్మ ఉన్నదా?"

"బౌద్ధంలో ఆత్మ సత్యము కాదు."

"బౌద్ధధర్మంలో సత్ పదార్థమేది?"

"బౌద్ధంలో రెండు సంప్రదాయాలున్నాయి. హీనయానమునందు పురుష వ్యక్తిని తెలియజేసేది ఆత్మ. దీనిని మహాస్థ విరవాదమంటారు. వ్యక్తులు తమ నిర్మాణం తాము చూచుకోవాలి. ఈవాదంలో మహాసాంఘికులు మానవ సంఘానికంతకూ విముక్తి తీసుకురావాలంటారు. ఈ సాంఘిక వాదంలో ముక్తి సత్యం, బుద్ధుడు శాశ్వతుడు."

"ప్రథమావాదంలో బుద్ధు డెట్టివాడు?"

"ఆ వాదంలో సంయుకీ సంబుద్ధుడు అలౌకిక పురుషుడుమాత్రం."

"మహా సాంఘికవాదంలో రెండు శాశ్వాతపదార్థములు ఉన్నట్లు తేలుతోంది కదా. రెండు శాత్వతములు విశ్వంలో ఏలా ఇముడుతాయి?"

"ఆ రెండూ ఒక సత్తునే చెప్పుతవి."

"సత్ భావన ఏలాంటిది?"

"బుద్ధుడె పరమసత్యం."

"మహాయానంలో బౌద్ధ త్రిరత్నాలకు ప్రాముఖ్యం ఉన్నది. ధర్మ, బుద్ధ, సంఘాలు మూడు త్రిరత్నాలు."

"అవును."

"అందులో ధర్మము సత్ అనిన్నీ, అదే ప్రజ్ఞ అనిన్నీ, ఆ ప్రజ్ఞను సంపాదించుకొనే ఉపాయమే బుద్ధుడనీ చెప్పుతారు. ధర్మం శాశ్వతమంటే ధర్మాచరణం చేసే పురుషుడూ శాశ్వతుడు కావాలికదా! పురషుడు దేహం వీడితే ధర్మమేమయింది? ధర్మంచేత వాడేమయినాడు?"

"ధర్మం ఎప్పుడూ ఉంటుంది."

"అధర్మమో?"

"అశాశ్వతము."

"అహింసాది ధర్మాలు సాపేక్షములు కదా, సాపేక్షవలన గుణమత్త ఏర్పడుతుంది కదా, ధర్మానికి?"

"ధర్మం గుణయుక్తమే."

"గుణములు శాశ్వతమా?"

"సద్గుణములు శాశ్వతములు."

"ఆ సత్ గుణములు అశాశ్వతములని ఏర్పడుతుంది. వెలుగు శాశ్వతమై, చీకటి అశాశ్వతమెలా అవుతుంది? చీకటి అనేది వెలుగు యొక్క అభావమే కదా? ఈ ద్వంద్వాలలో ఒకటి శాశ్వతమై రెండోది అశాశ్వతమెలా అవుతుంది?"

ఈ విధంగా బ్రహ్మదత్తుడు చదువు ప్రారంభించాడు. శాంతిశ్రీ నిశ్చలతతో తొణకని నిర్మలతతో ప్రత్యుత్తరాలు ఇస్తున్నది. బ్రహ్మదత్తుని అఖండ శేముషి శాంతిశ్రీకి పూర్తిగా తెలియును. అయినా ఆమె ఇసుమంత కూడా చకితహృదయ కాలేదు. చెక్కిన విగ్రహంలా ఆమె శిష్యపీఠంపై గురువున కెదురుగా అధివసించి ఉంది.

శిష్యులు ప్రశ్నించటం ఆచార్యులు ఉపదేశించడం సాధారణ విధానం. కాని ఈ విచిత్రమైన విద్యాభ్యాసంలో గురువే పృచ్ఛచేయడం శిష్యురాలు ప్రత్యుత్తరాలు ఇవ్వడం జరిగింది. ప్రథమదినం పూజలైన తర్వాత రెండు ఘటికలు మాత్రమే బ్రహ్మదత్త ప్రభువు శాంతిశ్రీతో చర్చించినాడు.

"రాజకుమారీ! నేను సెలవు తీసుకుంటాను."

"చిత్తం, స్కందవిశాఖాయనక ప్రభూ!"

అంతే. ఆ వెనుక బ్రహ్మదత్తుడు వెడలిపోయినాడు. బ్రహ్మదత్త ప్రభువు నగరి వెనుక ఉపవనం ఉంది. ఆ తోటమధ్య శిల్పసౌందర్య విలసితమైన బ్రహ్మ విద్యాశ్రమం ఉంది. దేశదేశాలనుండి ఈ బ్రాహ్మణ క్షత్రియుని పాదాలకడ ఆర్షవిద్యలు నేర్చుకొనడానికి పండితులూ, విద్యాప్రియులూ, కళావేత్తలూ వస్తూ ఉంటారు. ఈ విద్యాశ్రమానికి బ్రహ్మదత్త ప్రభువు కులపతి. వీరు కాక వివిధ విద్యాసాగరులైన మహాపండితు లనేకులు విద్యా గురువులుగా ఆ ఆశ్రమంలో ఉన్నారు. కాని ఇంతవరకు బ్రహ్మదత్తుడు ఒక్క

బాలికకైనా చదువు చెప్పలేదు. బాలికకు చదువు చెప్పటానికి ఆ యువక ప్రభువు కొంచెం సిగ్గుపడ్డాడు. అందులో మహారాజకుమారిక! తాను వృద్ధుడైతే భయములేకపోవును. యువకుడు, బ్రహ్మచారి, ఆవల పెళ్ళి కాని బాలిక! మహారాజు ఈ విచిత్రస్థితి ఎందుకు కొనివచ్చినారు? ఆ బాలిక తెలివయినదీ, ప్రజ్ఞావంతురాలు అవును. కానీ ఎంతసేపూ ధర్మము, భిక్షుకత్వము, అష్టమార్గాలు అంటూ కూర్చుంటుందనీ విన్నాడు. తాను మధ్య మధ్య ఇంచుక పరిహాసముగా మాటలాడినా ఆమె ఈషణ్మాత్రం స్పందించ లేదు. నవ్వలేదు. ఆమె మోము వెన్నెలలో కైలాస పర్వత శిఖరంలా ఉన్నది. ఆ మోమున కదలిక లేదు. అది స్థాణుత్వమేనా అని ప్రశ్నించుకొన్నాడు బ్రహ్మదత్త ప్రభువు.

## 14

ఈ చదువు హాస్యభాజనమనిగాని, అర్థము లేనిదనిగాని శాంతిశ్రీ రాకుమారి నిరసించలేదు. ఆ చదువు తనకు పనికిరాదనిగాని ధర్మబోధకమనిగాని ఆ బాలిక క్రోధపూరిత కాలేదు. ఆమె చిన్ననాటినుండి కోపతాపములు ఎరుగదు. ఇంత శిశువై ఉన్న కాలంనుంచి ఆమెకు కోరికలు లేవు, ప్రేమ లేదు. ఆమెకు ఆనందం లేదు, విచారం లేదు. ఆమె అద్దాలనాటినుండి నవ్వి ఎరుగదు. ఆనందముచేగాని విచారంవల్లగాని కంటిచుక్కలు ఆమె రాల్చ లేదు. ఆమె ఎప్పుడు మంకుపట్టు ఎరుగదు, సులభంగా లొంగిపోనూలేదు.

పొత్తిళ్ళనాడే ఆమె అందం మంత్రసానులకు తెలిసింది. వాళ్ళు పూట పూటకూ దృష్టి తీసేవారు. ఆ తెల్లటి వళ్ళు ఉష్ణజల స్నానం చేయించినప్పుడు ఎఱ్ఱకమలంలా కందిపోయేది. పనసతొనల బంగారంలో తురిమిన నక్షత్ర కాంతి రంగరించిన శిశువై పెరుగుతూ ప్రపంచాన్ని శూన్యవిలోకనాల చూచే ఆ బాలికను కనుగొని, ఆకలి యైనప్పుడు మాత్రం ఏడిచే ఆ బిడ్డను అవలోకించి కౌగిలించుకొన్నా స్పందింపక మోమున ఏమాత్రమూ మార్పురాని ఆకొమరితను పారకించి, ముద్దులకు మోముముడిచి విసుగు చూపించి, పలకరిస్తే ఇంచుకయినా ప్రత్యుత్తరమీయని ఆ విసుగును పరిశీలించి మహారాజూ, మహారాణీ ఇద్దరూ వెర్రిబాలిక ఏమో అని పైకిపొంగని బెంగపెట్టుకొన్నారు.

మహారాజు ఎన్ని విచిత్రాలైన ఆటవస్తువులు ఇచ్చినా ఆ బాలికలో ఏమీ మార్పు వచ్చేదికాదు. కిలకిల నవ్వేదికాదు. చప్పట్లుకొడుతూ కొడుతూ గంతులువేసేది కాదు. "నాయనగారు నాకివి ఇచ్చారు" అని తల్లితో చెప్పేది కాదు. బొమ్మలను 'పాపాయి!' అని ఎత్తుకొనేదికాదు. ఆ పాపాయికి నీళ్ళు పోసేదికాదు. దంతపుబొమ్మ రథాలు నడిపింపలేదు. లాక్షావర్ణ విచిత్రలతా విన్యాససుందరమైన ఆటపడవల తన బొమ్మ కాలువలలో ఆమె ప్రయాణింప చేయలేదు. తోటి బాలికలు మేనత్తల కొమరితలు శాంతశ్రీ బాపిశ్రీలతో ఆ బాలికకు నేస్తమూలేదు. కయ్యమూ లేదు. చీనాంబరాలుకట్టి ముద్దులు గులిగే నగలు తల్లి ధరింపజేసినా శాంతిశ్రీలో ఏమీ సమ్మోదములేదు. ఆమెకు నగలు ధరించాలని ఇచ్ఛలేదు. సాధారణపు నగలు, సాధారణ వస్త్రాలు ధరించి ఉండేది. ఆమెను మహారాజు కొమారికగా అలంకరిస్తే అవసరమున్నంతవరకే అవి ఉంచి తర్వాత తీసివేసేది.

వైద్యులు ఆమెకు వెర్రికాదన్నారు. అయిదవ సంవత్సరమున చదువు ప్రారంభించి నప్పటినుండీ ఆమె గురువులు ఆమె విపరీత మేధకు, ఆమె గ్రహణశక్తికీ ఆశ్చర్యపూరితు లయ్యారు. ఆమె విద్యాగురువుల ద్వారాలన్నీ దాటి సర్వ విద్యాపరిపూర్ణయై, ఆర్యశ్రీ ఆనందార్హతులకడ శిష్యురాలయినది. బౌద్ధధర్మ శిక్షితురాలై నప్పటినుంచి ఆమెకు చైతన్యము వచ్చినది. ఆమె చిరునవ్వులు మోమున తొంగిచూడ నారంభించినవి. ఆమె సుకుమారమైన హాస్యముకూడా చేయడం సాగించినది. ఆమెకు కాశ్మీరకుసుమవర్ణ వస్త్రాలంటే ఇష్టమయినవి. మిరియములు, జీలకఱ్ఱ, నల్లజీల కఱ్ఱ, అల్లము, శొంఠి, శర్కర, గుడములేని ఆహారము లామెకు ఇష్టమైనవి.

నానాటికి ఆమె సౌందర్యము విజృంభించి, ఆమె యవ్వనము పొడసూపి, ఆమె పెదవుల అమృతాలు చెమరించి, ఆమె వక్షావలి కుచము లుప్పొంగి, ఆమెకటి విస్తరింప మొదలుపెట్టి, ఆమె పిరుదులు ఘనత వహింప నారంభించి ఆమెలో ఏవియో మసృణకాంతులు ప్రసరింప నారంభించినవి. ఆ దినాలలో అట్లు విజృంభించు ఆ సౌందర్య విషయమే ఆమెకు తెలియదు. వైరాగ్యమననేమో తెలియదామెకు. భిక్కుని అగుట మంచిదనే బౌద్ధధర్మం ఆమెకు తెలియును. భిక్కునికావడం ఎందుకో ఆమెకు తెలియదు. విజ్ఞాన విషయంగా వైరాగ్యాన్నిగూర్చి ఆమె చర్చింపగలదు, కాని వైరాగ్య మహాభావం ఆమెకు ప్రత్యక్షము కాలేదు. తనది వైరాగ్య జీవితమే అని ఆమెకు తెలియదు. చిన్నతనంనుంచీ విచిత్రమైన ఈ వైరాగ్య జీవితం తనకెందుకు అలవడిందో ఆమె యెరుగదు. అనేక వసంతోత్సవాలు వెళ్ళిపోయినాయి. మధుమాస పరిమళించే ఆమె ఒక్కక్షణమైనా పులకిత కాలేదు. ఆమెకీనాడు బ్రహ్మదత్త ప్రభువు చదువు ప్రారంభించినారని పెద్ద ఆశ్చర్యమూ కలుగలేదు. విసుగు చెందనూ లేదు. ఆ చదువుకు పూర్వం ఎంత నిశ్చలయై ఉన్నదో ఆ పిమ్మటను అంతే నిశ్చలత.

ఆమె నెమ్మదిగాలేచి లోనికి వెళ్ళిపోయింది. తన పూజాగృహంలో బుద్ధదేవుని ఎదుట పద్మాసనాసీనయై ఆర్య ఘోషుని బుద్ధచరిత్రనుండి అనేక ఘట్టాలు పఠించింది. కాని ఆమెకు భక్తితన్మయత కలుగలేదు.

చదవడం మానివేసింది. మనస్సు నిశ్చలతనందింది. శూన్య మనస్సుతో అలా కూర్చుండిపోయింది. ఆమె మందిరంలో ఉన్న బుద్ధవిగ్రహములు అలాగే ఉన్నాయి. దీపాలు చిరుగాలులకు ఇటూఅటూ కదులుతున్నాయి. చిత్రాలేమీ లేని ఆ గోడపైన వెలుగునీడల ఛాయలుమాత్రం ఆడుతున్నాయి. కదలికలేని క్షణాలుమాత్రం కదలి పోతున్నాయి. ఆ బాలికా సౌందర్యకాంతిలోని ప్రతితేజఃకణమూ ప్రతిక్షణంతోను వియ్యమంది, అనంత సృష్టిసౌందర్య లేశాతిలేశంలోనూ ప్రత్యేక విలీనత నందింది. ఆ విచిత్రత ఆ బాలికకేమి తెలియును! ఆమె అలా నిశ్చలతలోనే స్థాణువై కూర్చున్నది.

## 15

ఇక్ష్వాకుశాంతిమూల మహారాజు అంతులేని ఆలోచనలతో తన ఆనంద గృహాన ఒక బంగారు మచ్చిపీఠముపై త్రిభంగాకృతిని కూరుచుండెను. వెలుపలి మందిరంలో నలుగురు విలాసినులు సంగీతకళాకోవిదలు కాకలీస్వనాలగాన మొనర్చుచుండిరి. ఒకతె

వీణ, ఒకతె ముఖవీణ, ఒకతె మృదంగము ధరించి వ్యాదము సలుపుచు బృందగానంలో గొంతులు కలుపుచుండిరి.

*"ఆరామ తరులతలు*
*ఆలకించిన స్వరము*
*శ్రీరామ పదము లిదు*
*చిరుసవ్వడుల గీతి"*

ఆ పాట తన ఆలోచనలను పొదివికొనగా మహారాజు అనంతమైన ఆ భావాలలో ప్రయాణం చేస్తున్నారు. ఆ ప్రభువునకు తన చక్రవర్తి అవసాన స్థితి అనేక రూపాలలో దర్శనమవుతున్నది. అంతటి శాతవాహన సామ్రాజ్యమూ నేడు ఈలా అయిపోయిందేమి? యజ్ఞశ్రీ సార్వభౌముల విజయపరంపరలకు తన బాహుబలమే ముఖ్యసాధనమైనది. ఆనాడు తాను యువకుడు. అయినా వ్యక్తిగత పరాక్రమంలో ఏమి, వ్యూహరచన విధానంలో ఏమి అతిరథ శ్రేష్ఠుడనిపించుకొని ఆంధ్రరాజ్య శత్రువుల కుక్కలువలె పరిగెత్తించలేదా?

యజ్ఞశ్రీ సార్వభౌముని కొమరిత కుసుమలతాదేవి సుందరీమణి తన్ను వలచివచ్చి స్వయంవరంలో కంఠాన పూలదండ వైచినది. శాతవాహనవంశము నిస్తేజమైపోతే ఎవరు ఈ సర్వదక్షిణాపథమందు ధర్మము అవిచ్ఛన్నంగా నడపగలిగిన మేటి? శాంతిమూల మహారాజు నిట్టూర్పు విడిచినాడు. తరతరాలనుండి ఇక్ష్వాకులు శాతవాహనులకు కుడిచేయివంటి వారు. ఈ రెండు వంశాలకు గాఢమైన బంధుత్వాలూ కలిసినవి. తన పూర్వులు అయోధ్య నేలినారు. తనది రఘుమహారాజు వంశం. ఆ బాలల గాంధర్వంలో ఏవో స్వరమధురాలు ప్రవహించాయి.

*"దండకాటవి మధ్య*
*గండశిలకే తెలుసు*
*దివ్యపదముల స్పర్శ*
*త్రిదశు లెరిగిన స్పర్శ!"*

చక్రవర్తి అంతనీరసుడై పోయినాడేమి? ఆయన సంరక్షణభారం పూర్తిగా తనమీదే పడుతుంది. ఈలోగా తన బావమరిది దాయాది సామంతుల నందరిని కూర్చు కుంటున్నాడు. రాజ్యము ధర్మంగా నడవాలి. ప్రజలు భగవంతుని అవతారము. ప్రజల సంరక్షణ పరమధర్మముగా ఎంచని రాజు లెందుకు? సామ్రాట్టు లెందుకు? ప్రతి మనుష్యుని హృదయంలో అధర్మం ఏమూలనో దాక్కుని ఉంటుంది. మనుష్యుడు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, రాక్షసిలా విరుచుకుపడుతుంది. రామరాజ్యంలో ధర్మపాలనవల్లనే జగత్ప్రసిద్ధి పొందింది.

*"రామచంద్రుని వెంట*
*రమణి సీతాదేవి*
*సీతమ్మ నవ్వులో*
*చేరె కాంతులు కోటి."*

సీతమ్మ ఇక్ష్వాకుల కోడలై ఉభయకులములను పవిత్రం చేసింది. తన బాలిక శాంతిశ్రీకి ఈ స్థాణుత్వ మెక్కడనుండి వచ్చింది? మహారాజు పక్క నున్న జేగంటపై నెమ్మదిగా స్పృశించారు. వెంటనే ఇద్దరు అంతఃపుర రక్షక స్త్రీలు అక్కడికి గాలులవలె తేలుతూ వచ్చారు. "మేము రాజకుమారి క్షేమం విచారించుటకు వస్తున్నా" మన్నారు మహారాజు.

ఆ రక్షక స్త్రీలు వెంటచే మాయమయ్యారు. మహారాజు ఆ మఞ్చపీఠము నుండిలేచి, ఆలోచనతోనే నడుస్తూ తమ నగళ్ళుదాటి రాజకుమారి శాంతిశ్రీ నగరికి పోయినారు. ఆమె నగరిలోకి మహారాజు వచ్చి పూజా గృహం ప్రక్కగృహంలో కూర్చుండి ఉన్న శాంతిశ్రీని తారసిల్లారు. తండ్రిగారు వస్తున్నారని పరిచారికలు వార్త తీసుకునిరాగానే శాంతిశ్రీ ఆనందమూ పొందలేదు, ఆశ్చర్యమూ పొందలేదు. ఆమె లేచి తండ్రిగారి పాదాలకు నమస్కరించింది. మహారాజు కొమరిత నాశీర్వదించి పీఠంపై అధివసించెను.

## 16

**మ**హారాజు రాజకుమారికవైపు తేరపార చూచి "తల్లీ, చదువు బాగుగ ప్రారంభమైనదా?" అని ప్రశ్నించినారు.

"మహాప్రభూ! చదువు ప్రారంభమైనది."

"ప్రస్తుతము మీ గురువుగారేమి చెబుతున్నారు?"

"ఏవిషయమూ ప్రారంభించలేదు. ధర్మాలనుగూర్చి ఏవో ప్రశ్నలు వేసినారు వానికి నేను ప్రత్యుత్తరా లిచ్చినాను."

"మంచిది తల్లీ! చదువు అలాగే ప్రారంభించు. విజ్ఞానవంతులు శిష్యులై నప్పుడు గురువులు ఎక్కడో ప్రారంభిస్తారు."

"కావచ్చును మహాప్రభూ!"

"తల్లీ! నీకు సంగీతమంటే ఎంతో అభిరుచికదా, ఆ ఉత్తమవిద్య ఎందుకు వృద్ధిచేసుకోవు?"

"నాకు సంగీతమంటే ఎందుకో ఇష్టంలేదు."

"శిల్పం?"

"శిల్పం తథాగతుని సేవచెయ్యడానికి పనికివస్తుంది. అయినా ఆ విద్యపై మనస్సు పోలేదు."

"బ్రహ్మదత్త ప్రభువు గొప్ప చిత్రకారులుకూడా తల్లీ! వారి దగ్గర చిత్ర లేఖనం నేర్చుకోవచ్చునుకదా. వారి సంగీత విద్యాశేమషీసంపన్నత సకల జంబూద్వీపంలోనూ కీర్తిని కన్నది. దేవభాషలో, ప్రాకృతాలలో, మన ఆంధ్ర ప్రాకృతంలో ఆ ప్రభువు మహాకవి."

"నాయనగారూ! నాకు ఏ విద్యమీదా కోర్కె కలగడంలేదు."

"రాజకుమారిక లందరు నేర్చుకోవలసిన విద్యలుకదా ఇవి?"

"కావచ్చును మహాప్రభూ! నా మనస్సు వానిపై ప్రసరించదు."

మహారాజు నిట్టూర్పు విడిచి లేచినాడు. మర్యాద ననుసరించి, ఆ బాలిక తండ్రివెంట తనమందిర కవాటంవరకూ సాగనంపి వెనుకకు వచ్చింది.

ఆమె కంఠము మధురమైంది. ఆమెకు నేర్పకుండానే సంగీతం అలవడింది. ఆమె భూర్జపత్రాలపై వ్రాసిన ధర్మసూత్రలు ముత్యాలకోవలే. మషీపాత్రలో కుంచెముంచి, ఆమె మహావేగంతో అందాలు కరిగించి పోతపోసిన వ్రాత వ్రాస్తుంది. ఆమె బొమ్మలు వేస్తుంది కాని ఆ రచన భక్తివల్ల చేసేదికాదు. అయిన ఆ బొమ్మలు అందం ఒలుకుతూ ఉంటవి. వానిలో పరిణతి లేకపోయినా మంచి ప్రజ్ఞ కనిపిస్తుంది.

ఈ ఆలోచనతో మహారాజు తన నగరు చేరెను. శాంతిశ్రీ హృదయంలో పరివర్తన ఎప్పటికైనా కలగదా? ఆమెల్లో ప్రేమ ఉద్భవింపదా? ఆమెకు కోపము తాపము ఆవేశము పుల్కరింపు ఒకనాటికైనా తలచూపవా? తన ఈ అందాలబిడ్డ, ఈ జగదద్భుతసుందరి, చిత్రించిన పారిజాత కుసుమమయి పోవలసిందేనా? ధర్మదత్త ప్రభువు తాను ఈ బాలిక విషయమై ప్రశ్న అడిగినప్పుడు "ప్రభూ! ఈ బాలికలోని మహోత్తమ మానవత్వము భూమి లోతుగా రాళ్ళకింద పరవళ్ళెత్తి ప్రవహించే పాతాళగంగలా ఉన్నది. ఒకనాడు ఆ రాళ్ళను బద్దలుకొట్టి పాతాళగంగను భాగీరథి చేయగలిగిన మహాపురుష డెవ్వడో ఆమె జీవితంలో తారసిల్లుతాడు. అప్పుడే ఈమె సంపూర్ణ స్త్రీ అవుతుం" దని వాక్రుచ్చినాడు.

విజ్ఞానంలో, ప్రతిభలో, మహాపురుషత్వంలో, అతిరథ శూరత్వంలో బ్రహ్మదత్త ప్రభువు మేరుశిఖరంవంటివాడు. వీరిరువురిని ఒకరికోస మొకరిని బ్రహ్మ సృష్టించినాడు. తాను వారిద్దరిని విద్యవ్యాజా సంధానించినాడు. ఆ పైన భగవదిచ్ఛ.

తండ్రి వెళ్ళినప్పటినుండి శాంతిశ్రీ మహారాజు ఎందుకు వచ్చినారు అనుకొన్నది. ఆమె చెలికత్తె ఒకర్తవచ్చి "మహారాజకుమరీ, మిమ్ము శాంతశ్రీ ఆహ్వానించింది. వేళ అవుతున్నది. కోటభేరీ అప్పుడే మూడవ యామపు మ్రోత మ్రోయించినది" అని మనవి చేసినది.

## 17

విజయపురిలో వసంతతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆనాడు సకల భారతవర్షమూ నవ్యజీవనంతో కలకలలాడి పోతుంది. కామదేవుడు దివ్యతపోజనిత నేత్రాగ్నితో మసి అయిపోతాడు. ఆ దినాన ప్రజలు కామ దహనోత్సవంచేసి, విషణ్ణ వదనాలతో ఘడియలు గడుపుతారు. ఆ మరునాడు మనుష్యుని నిత్యయౌవనశక్తి నూత్న జీవన మార్గాన్ని అన్వేషించ కోరుతుంది. ఆ కాంక్షకు సిద్ధి రతీదేవి. సిద్ధి కార్యదీక్షను వాంఛిస్తుంది. కార్యదీక్ష కామదేవుడు, మనుష్యుని నిత్యత్వానికై కాముడు తిరిగి ఉద్భవించాలి. నూత్నచైతన్యం కటికచీకటిలో కాంతికణంలా ఉద్భవిస్తుంది. ఎండిపోయిన చెట్టు కోరికలనే కెంజిగుళ్ళు ధరిస్తుంది. ఎక్కడో అస్పష్టంగా "కో" యని వినబడుతుంది. కామ జననం అయింది. పసంతకాలం ప్రారంభించింది. చిగురులు పెరుగుతున్నాయి. ఫెళ్లున తోటలు అడవులు, చెట్లు, పొదలు జేగురుపసిమి రంగులతో విరిసిపోయినాయి. దిరిసెనలు, తంగేడులు, మోదుగలు కోర్కెచివుళ్ళు తొడగకుండానే పూలమొగ్గలతో నిండిపోయాయి. యువతీ యువకులు తమలో ఉదయిస్తున్న ప్రేమరాగానికి చిహ్నంగా వసంతకాలం అంతా పాటలతో, ఆటలతో, నాట్యాలతో ఉప్పొంగిపోతారు.

"కరడు కట్టిన నీరు కరగి ప్రవహించింది.
కొత్త ఉప్పొంగుతో కొత్త కెరటాలతో"

వారు ధరించిన వస్త్రాలు కళాస్వరూపాలు. వారి అలంకారాలు సౌందర్య స్వప్నాలు. వారేరసాధిదేవతలు. యువరాజు వీరపురుషదత్తుడు వసంతమూర్తి అయినాడు. పూంగీయ శాంతశ్రీయు, బాపిశ్రీయు వనదేవతా, కుసుమదేవత అయినారు. నగరంలోని, దేశంలోని యువతీ యువకులు మహోద్యానవనంలోనే చేరి అచ్చటనే వివిధ మందిరాలలో నివసిస్తారు. పగలూ రాత్రీ ఆటలపరవళ్ళలో ప్రవహించిపోతారు.

ఒకదినం వసంతవరణోత్సవము. ఆ దినం కొన్ని నూరుల నివర్త నాల వైశాల్యమున ఆ తోటంతా దేశంలోని వీరులు, చదువుకొన్నవారు, అందమైనవారు, సర్వకళా కుశలులు అయిన బ్రహ్మచారులు కూడిపోయినారు. వారిలోనుండి మరల ఉదయించిన కామదేవుని, అతని అనుగు చెలికాడు వసంతుని ఎన్నుకోవాలి. వీరిద్దరిలో మొదటి ఎన్నిక వసంతదేవునిదే. ఈ ఏడు వసంతుడు ఉత్తమ గాంధర్వనిధి అయ్యుండాలన్నారు. ఆ నిర్ణయానికి ఒక పండితుడు, ఒక యువకుడు, ఒక యువతి పరీక్షకులు. శాంతిమూల మహారాజు ముగ్గురు పరీక్షకులను నియమించారు. పరీక్షలు నాలుగుదినాలు జరిగినవి. ఎందరో యువకులా పరీక్షకు నిలిచిరి. సంగీత ప్రదర్శనం కాగానే పరీక్షకులు ఆలోచించుకొని శ్రీశ్రీ వీరపురుషదత్తప్రభువు ఉత్తమ గాయకుడని నిర్ణయించారు. యువరాజు వీరపురుషదత్తుడు రావణహస్తము మ్రోయిస్తూ, గాత్రంతో గంభీరముగా పాటలు పాడినాడు.

*"పూలకై భృంగమే పుట్టేనో*
*పూలె భృంగానికై పుట్టేనో*
*వనములే ఎరుగున్,*
*భూమిచీల్చుకు మొక్కవచ్చును*
*మొక్కపూయును మంజులతలన్*
*పూలఎదలో మధురగంధము*
*భూమిలోనే గంధముండేనా?"*

యువరాజు మోమున చంద్రిక లలముకొన్నవి. ఆ యువక ప్రభువు దేహమంతా ఏదో ఒక ఆనందముతో పుష్పపూర్ణ వృక్షములా అయినది. ఆ ప్రభువు కంఠంలో తేనెలు నిండినవి. లోయలో సెలయేరు నిండిపోయి ప్రవహించినట్లా మహారాజకుమారుని గొంతుకలో విమలగాంధర్వము పొంగిపోయింది. వసంతరాగ మాలాపించి ఆ సుందరమూర్తి తన కంఠాన్ని పూవుపూవుకూ పోయే భృంగమూర్తిని చేసినాడు. ఆకాశాన సంతోషంతో తిరిగే పతంగ మూర్తిని చేసినాడు. అగాధశూన్యంలో పయనించే నక్షత్రాన్ని చేసినాడు. విపుల వక్షుడు, ప్రస్ఫుట రేఖా సమన్విత దృఢాంగ సుభగుడైన ఆ ప్రభువు మనోహర వదనము పారిజాత కుసుమంలా కలకలలాడిపోయినది. రావణహస్త విపంచిపై ప్రసరించే వ్రేళ్ళు నీళ్ళలో ఈదులాడే మీనాలులా ఉన్నవి. వ్రేళ్ళ కదలికలో

సంగీత ముద్భవిస్తున్నదో, సంగీత మహా ప్రవాహంలో అవి కదులుతున్నవో? ఆ ప్రభువు కంఠము హృషీ కేశంలోని గంగాప్రవాహంలా గంభీరం.

*"నిత్యమృత్యువు జగము ప్రాణులు*
*నిత్యజీవము జగము ప్రాణులు*
*మృత్యువున జీవమ్ము నిత్యము*
*అమృతత్వ మనంత విశ్వపు*
*నిత్య లీలయట!"*

## 18

వసంతుడై శ్రీ వీరపురుషదత్తకుమారప్రభువు వనదేవతను వరించాలి. అతనిని వసంత దేవునిగా బాలికలందరూ అలంకరించారు. పూవుల కంఠమాలలు, పూవుల దండకడియాలు, కంకణాలు, పూవుల మొలనూలు, పూవుల మంజీరాలు, చిత్రచిత్ర రూపాలుగా రచించి, యువరాజును పూవుల ఆసనంపై అధివసింప జేసినారు. అతని చూట్టూ ఆ బాలికలు నాట్యంచేస్తూ కళ లుట్టిపడ రచించిన పూలకిరీట ముంచినారు.

*"జయ జయ జయ జయవసంత*
*జయ మధుదేవా*
*జయ వసంత*
*జయ నవజీవిత రథసారథి*
*రావోయీ స్వప్న మూర్తి*
*రావోయీ కామమూర్తి.*
*విరియబోవు హృదయకుసుమ*
*దళములలో గంధమూర్తి*
*రావోయీ!*
*రావోయీ!*
*జయ జయ జయ జయవసంత*
*జయ మధుదేవా!*
*లోకంలో శ్రుతి ఉందో*
*రాకాసగు శ్రుతిభంగమొ*
*ఓ మధుమాసాధిప*
*మా మనసులు వికల మొందె*
*జయ జయ జయ జయవసంత*
*జయ మధుదేవా!*
*గజ గజ వణకించు నెలలు*
*గడచినవయ్యా నేటికి*

*జరఠత్వము సమసిపోయె*
*విరియబూచె నవకాంక్షలు*
*జయ జయ జయ జయవసంత*
*జయ మధుదేవా!*
*చిగిరించెను మ్రోదుమ్రోక*
*రగిలించెను కోర్కె రేక*
*నీ కొరకే ఎదురు చూచు*
*మా కన్నులు కాంతినిండె*
*జయ జయ జయ జయవసంత*
*జయ మధుదేవా!"*

ఆ బాలలు సుగంధజలముల వసంతునకు అభిషేకము చేసినారు. లక్షలకొలది మల్లెలు, మొల్లలు, మాలతులచే వీరపురుషప్రభుని పూజించినారు. వసంతదేవాభిషేక మహోత్సవము అత్యంత వైభవంగా జరిగింది. వసంత దేవుడంత చెలికత్తెలు కూడరా బయలుదేరి ఉద్యానవనం అంతా నాట్యాన పరిభ్రమించడం ప్రారంభించాడు.

ఆంధ్రసామ్రాజ్య మహాసామంతుల తనయలు, మహాతలవరుల తనయలు, మహాదండనాయకుల తనయలు, అనేకు లీయేటి వసంతోత్సములకు విజయపురికి వేం చేసినారు. శ్రీ వీరపురుషదత్తప్రభువు తనకు అనుగు చెలికాడైన విదూషకునితో, తానే ఎన్నుకొన్న మలయపవనదేవునితో, భృంగదేవునితో సరససల్లాపాలాడుతూ ఆవేదనపడుతూ వనరమకై వెదుకుతున్నాడు.

శాంతిమూల మహారాజు మేనమామలు ఉత్తరకళింగాధిపతులైన వాసిష్ఠులు యశోవర్మ మహారాజు, ఆ మేనమామ కొమరుడు దుర్జయవర్మ, దుర్జయ వర్మకొమరిత భట్టిదేవి.

విజయపురిలో జరిగే ఈ వసంత మహోత్సవాలకు దుర్జయవర్మ మహారాజు కొమరితతో, తన మహారాణితో సపరివారుడై విచ్చేసినాడు. ఈ ఉత్సవంలో భట్టిదేవి తన చెలికత్తెలతో వచ్చి పాల్గొంటున్నది. భట్టి అందాల బాల. ఆమె మోము గుండ్రనై పద్మాకారంగా ఉంటుంది. ఆమె విశాలనయన, సంతత హాస ప్రఫుల్ల వదన. గడుసరి కాదు. అమాయిక, భట్టిదేవి అందము కామధేనువు అందము. ఆమె ఆనాడు వీరపురుషదత్త ప్రభువును వసంత దేవునిగా అలంకరించిన బాలికలలో ఒకరిత.

ఆమె తక్కిన బాలలతోపాటు తన్ను అలంకరిస్తున్నప్పుడే వీరపురుషదత్తప్రభువు ఎవరా ఈ బాలికయని ఆశ్చర్యం నిండిన ప్రశ్న వేసుకొన్నాడు. భట్టిదేవి మోమున పూంగీయ శాంతశ్రీ మోమునవెలిగే విద్యాకాంతులు లేవు కాని, పూర్ణశ్రీ కాంతులు, గంధపు తరువును చందన పరిమళ మలమిపోయినట్లే అలమిపోయి ఉన్నవి. ఆ బాలిక ప్రతి అవయవమూ యౌవనరాగాన్ని సౌందర్యశ్రుతిలో పాడే విపంచికాతంత్రి అయినది. ఆ బాలిక ఎదుట నిలుచుండిపోయినాడు యువరాజు. యువరాజు వెంట వచ్చే నంది యువరాజు నుద్దేశించి "జయము జయము మహాప్రభూ! ఈ దివ్యసౌందర్యగాత్ర అయిన రాజకుమారి ఉత్తరకళింగ

మహారాజులైన దుర్జయవర్మ మహాప్రభువుల తనయ వాసిష్టీగోత్రజ భట్టిదేవి" అని మనవి చేసెను.

వెంటనే తన తండ్రి శాంతిమూల మహారాజు వాక్యాలుగా బ్రహ్మదత్త ప్రభువు తనతో చెప్పిన మాటలు రాజకుమారునకు జ్ఞాపకం వచ్చాయి. ఆయన చిరునవ్వుతో "రాజకుమారీ! మాకు వనలక్ష్మిగా అవతరించావు" అని పలికినాడు. రాజకొమరిత చెలి ఒకర్తు నవ్వుతూ చేతులుమోడ్చి "మహారాజ కుమారా! మీరు మా భర్తృదారికను వనరమగా ఎన్నుకొని రసజ్ఞ శేఖరత్వం ప్రకటించారు. రాకుమారి తమచే బహూకృత అయింది" అని విన్నవించుకొన్నది. ఈ సంఘటన గమనిస్తున్న పూంగీయ రాకుమారి శాంతశ్రీకి పట్టరాని కోపమువచ్చి విసవిస నడిచి రథమెక్కి తనచెలులు కొలిచిరా భవనానిక వెళ్ళిపోయింది.

## (19)

**మ**హారాజకుమారి భట్టిదేవిని వనలక్ష్మిగా ఎన్నుకోగానే ఆ మహోద్యానవనములో వివిధ ప్రాంతాలలో ఉన్న వందలకొలది బాలికలు ఆమె చుట్టూ మూగినారు. పాటలు పాడుతూ నాట్యమాడినారు. పూలతో లతలతో అలంకరించినారు. బాలకులందరూ వసంతుని పొదివికొని నాట్యమాడుతూ, పాటలు పాడుతూ తీసుకొని వచ్చి వనమధ్యాన లతలతో పూలతో మనోహరంగా అలంకరించిన పూలవేదికపై అధివసింపచేశారు. ఇంతలో బాలికలందరూ పాటలు పాడుతూ, నాట్యమాడుతూ వనదేవిని తీసికొని వచ్చి వసంతుని ఎడమ పక్క ఉన్న కుసుమాసనంపై అధివసింప చేసిరి. యువతీ యువకులందరూ కలిసి కుసుమభృంగ నాట్యం కావించారు. నాట్యం పూర్తికాగానే బాలికలందరూ మన్మథుని ఎన్నుకోవాలి.

ఈ నాట్యాలు, ఈ ఆనందం గమనిస్తూ చిరునవ్వు నవ్వుకుంటూ కొంచెం దూరంగా బ్రహ్మదత్తప్రభువు నిలిచి ఉన్నాడు. అతని బాపిశ్రీ రాకుమారి గమనించింది. ఆమె కేమి బుద్ధి పుట్టిందో ఆ ప్రభువు వంక తీక్షణవీక్షణాలు పరపింది. అతని సమున్నత రూపమూ, దృఢాంగ బలము, అఖండ జ్ఞానవికాంతివిలసిత సుందరవదనమూ చూచింది. ఇన్ని దినాలనుండి ఆ ప్రభువు ఈ వేడుకలలో పాల్గొనుటలేదు. ఈ ప్రభువు వట్టి విరాగి. జీవితం ప్రక్కనుంచి తప్పుకొని పోవాలని చూచే యువకుడు. ఈయన తనకు అన్న అయితే ఎంత బాగుండును అని బాపిశ్రీ అనుకున్నది. బాపిశ్రీ తన మేనమామ శాంతిమూలమహారాజును భగవంతునిగా పూజిస్తుంది. ఆయన హృదయము పూగీయ శాంతశ్రీతోపాటు ఈ బాలికయు అర్థముచేసుకొన్నది. తమ వదిన శాంతిశ్రీ ఏ యోగినీ లోకం నుంచో దారి తప్పి వచ్చింది. ఆ అందాలరాణిని ధనక ప్రభువైన స్కంద విశాఖాయనక బ్రహ్మదత్తునికీయ మహారాజు సంకల్పించి ఉన్నాడని బాపిశ్రీ శాంతశ్రీలు గ్రహించారు. ఇట్లు యోగివంటి ఈ ప్రభువు అటు యోగినివంటి తమవదిన అనుకొన్నది బాపిశ్రీ. తన పెత్తల్లి కొమరిత పూంగీయరాకుమారి శాంతశ్రీ ఎందుకు కోపంవచ్చి వెళ్ళిపోయిందో తనకు అప్పుడే అర్థమైంది. తామిద్దరూ యువరాజును సమంగా ప్రేమించారు. తమనిద్దరినీ యువరాజు సమంగా ప్రేమిస్తున్నాడు. అలాంటిది వనదేవతగా

అక్క శాంతశ్రీని ఎన్నుకోకుండా వాసిష్ఠి భట్టిదేవిని బావగారు ఎన్నుకోడం అక్కగారికి కోప కారణమైనది. అక్కకు కోపం వచ్చినట్లు తనకు కోపం రావలసిందే. కాని సౌందర్యంలో అక్క శాంతశ్రీతో ఎవరు దీటుకా గలరు! తన్ను యువరాజు కమల పుష్పముగా మాత్రము ఎన్నుకుంటారని ఆమె అనుకున్నది.

ఈ ఆలోచనలతోనే బాపిశ్రీ బ్రహదత్త ప్రభువునుచూచి, ఈ ప్రభువును కామ దేవునిగా ఎన్నుకుంటే, ఈయనే అక్కకూ, తన బావగారికీ సామరస్యం కుదర్చగలరు అని ఆలోచించుకున్నది. ఆ భావము ఒక బాలిక చెవులో వేసింది. అది అలా అలా పాకిపోయింది బాలిక లందరిలో.

*"మధుమాసదేవునకు మదనదేవుడు హితుడు*
*మదనదేవుందేడి మదవతులు వెదకరే!"*

అని పాడుతూ బాలికలు బ్రహ్మదత్తప్రభువును చుట్టుముట్టినారు.

*"ఇదుగిదుగొ చెలియరో ఇక్కడే వెలిసాడె*
*పడుచువారల దాడిసలుప నున్నాడే!"*

బ్రహ్మదత్తుడు తెల్ల పోయినాడు.

*"రావోయి మన్మథా*
*రావోయి శుకరథా!*
*నీవె సృష్టికి మూల మీవె జీవాత్ముడవు*
*రావోయి మన్మథా*
*రావోయి శుకరథా!*
*కామేశ్వరుడ వీవె*
*కావేశ్వరుడ వీవె*
*ఈవె యవ్వన జీవితేశ్వరుడవు కావె*
*రావోయి మన్మథా*
*రావోయి శుకరథా!"*

పాటలు పాడుతూ మహావేగాన నృత్యమొనరించినారు. బాలురు, బాలికలు, వృద్ధులు వసంతుని ఎన్నిక సమయంలోవలె అత్యంత సంతోషము వెల్లడించారు. బ్రహ్మదత్త ప్రభువు మాట్లాడుటకు వీలే లేకపోయింది. ఆయనను కొనిపోయి వసంతదేవుని పూలవేదిక ప్రక్కనున్న వేదికపైన పూలసింహాసనంపై అధివసింపచేశారు. యువతీ యువకులు ఆయనకు పూలకిరీటం పెట్టినారు. ఇక్షు కోదండమూ, పూవుల బాణాలతో అలంకరించారు.

*"వెదకరే మన రతీదేవిని*
*వెదకరే శృంగారదేవిని*
*ఆనంద పులకితదూ!"*

అని పాడినా రా బాలలు. బ్రహ్మదత్తునకు చటుక్కున ఒక దృఢనిశ్చయం కలిగింది. ఆ ప్రభువు ఆ బాలికల నందరిని కలియచూచినాడు. చిరునవ్వు నవ్వుకొన్నాడు. మహారాజు

కొమరిత శాంతిశ్రీ తండ్రిగారి శిబిరములకడ వెలసిన తన శిబిరములనుండి పైకిరాదు. ఆమె యువతీ యువకులు పాల్గొను ఆ ఉత్సవాలు చూచి అసహ్యించుకొన్నది.

ఇంతకు పూర్వము సంవత్సరాలలో యవ్వనవతి అయినను ఆ రాజకుమారి వసంతోత్సవములలో పాల్గొనేదికాదు. ఈ సంవత్సరోత్సవము దక్షిణాపథాన కంతకూ శిరోమణిగా మహారాజు సంకల్పించినారు. దేశ దేశాల రాజకుమారులూ, రాకుమారికలూ ఆహూతులై విజయపురికి వచ్చినారు. కాబట్టి మహారాజు కొమరిత మర్యాదకై వసంతోత్సవానికై రాక తప్పిందికాదు.

బ్రహ్మదత్తుని బాలలందరు మన్మథునిగా ఎన్నుకొన్న సమయంలో శాంతిశ్రీ రాజకుమారి తన శిబిరానికి దాపున ఉన్న ఒక నికుంజపు నీడలో ప్రతిమాకారయై కూరుచుండి ఉన్నది. ఇంతలో యువతీయువకులు పాటలు పాడుతూ పూవులు జల్లుతూ కొలిచిరా ధనకస్కంద విశాఖాయనక బ్రహ్మదత్తుడు అచ్చటకు వచ్చి ఆ బాలికను సమీపించి ఆమె మెడలో దండవైచెను.

## 20

బ్రహ్మదత్తప్రభువు మాఠరీపుత్రి శాంతిశ్రీ మెడలో దండ వేస్తాడని ఎవ్వరూ అనుకోలేదు. మహారాజు కొమరిత విరాగిని వంటిది. ఏ ఉత్సవాలలో పాల్గొనని బాలికను బ్రహ్మదత్తుడు రతిగా వరిస్తాడని ఎవ్వరనుకుంటారు?

పుష్పదామము మెళ్ళోబడగానే ఆ బాలిక చటుక్కున కళ్ళు తెరచింది. ఆ కళ్ళు విశాలములు పరమ మనోహరములు. ఆ కళ్ళ పక్ష్మములు దీర్ఘ వినీలములు. ఆ కళ్ళలోని కాంతి మధురార్ద్ర శాంతియుతము. ఆ కాంతిని చూచి యౌవన పులకితులైన యా మదవతులు వెరగుపడి, పాటలు మాని, నాట్యము మాని నిలుచుండిపోయిరి. యువకులు సిగ్గుపడి, భయపడి, వెనుకంజ వేసినారు. కాని బ్రహ్మదత్తప్రభువు మాత్రం చిరునవ్వు నవ్వుతూ.

"శాంతిశ్రీదేవీ! మిమ్ము రతీదేవిగా ఆహ్వానిస్తున్నాను" అని చేతులు సగం చాపి ఆహ్వానించినాడు. శాంతిశ్రీ నిద్రమేల్కొన్న బాలికవలె ఏమియు అర్థముకాక అటుయిటు చూచి, మళ్ళీ బ్రహ్మదత్తునివంక చూస్తూ కళ్లు చిట్లించుకొన్నది. ఆమె తెల్లని దుకూలాలు ధరించి ఉన్నది. కొలది భూషణాలు మాత్రమే ఆమె అలంకరించుకొని ఉన్నది. ఆమె మన్మథుడు ఫాలనేత్రాగ్నిచే భస్మమైన వెనుక యోగినీవేషము తాల్చిన రతీదేవివలెనే ఉన్నది. ఆమె అనుపమ సౌందర్యము శాంతతేజః ప్రవాహమై ఆ వనమంతా పరవళ్లెత్తినది.

"రాకుమారీ! నన్నీ యువతీయువకులు మన్మథునిగా ఎన్నుకొన్నారు. నేను మిమ్ము రతీదేవిగా ఎన్నుకొన్నాను. వచ్చి ఈ ఉత్సవంలో పాల్గొనవలసిందని నేనూ ఈ యువతీ యువకులం ప్రార్థిస్తున్నాము."

"ఏ ఉత్సవము?" ఆమె మాటలు తెల్లబోయిన చిన్నబిడ్డ మాటల్లా ఉన్నాయి.

"ఇది వసంతోత్సము."

"అవును."

"మీరు రతీదేవి."

"నేను రతీదేవినా!" ఆమె మోము వైవర్ణ్యమొందినది. ఇటు నటు చూచింది. "నేనా రతీదేవిని? బుద్ధుని ఓడించి నాశనం చేయడానికి ప్రయత్నించిన మారరాక్షసుని భార్య రతీదేవినా నేను!" ఆమె దీనవదనము చుట్టూ ఉన్న బాలబాలికల హృదయాలను క్రుంగ చేసింది.

బ్రహ్మదత్తుడు మహోత్తమ ప్రేమ స్పందించు మాటలతో "భర్తృ దారికా! నువ్వు మారభావాన్నీ, మన్మథభావాన్నీ విపరీతంగా అర్థం చేసుకొంటున్నావు" అన్నాడు.

"నాకు ఆ రెండు భావాలకూ భేదము కనబడదు ప్రభూ!"

"మారభావము దురాశ అతికాంక్ష, అతిప్రాపంచిక వాసనను తెలియజేస్తుంది. మన్మథభావం నిత్యసృష్టీ, యౌవనమూ, ఆనందమూ."

"నిత్యసృష్టి మాత్రం దురాశకాదా?"

"ఆధ్యాత్మిక దృష్టినే కావచ్చును. ప్రపంచంలో ఉన్న శుద్ధోదనునకూ, మాయాదేవికీ సిద్ధార్థబోధిసత్త్వుదుద్భవించి జగత్తును తరింపచేసే మార్గ ముప దేశించాడు. మన్మథభావం లేకపోతే అది ఎట్లా సాధ్యం?"

"ఆ మన్మథభావం పూర్తిగా పోవాలనికదా సమంతభద్రుని ఉపదేశం."

"అవునుకాని ఆ పరమశ్రమణకుదు గృహస్థులు కూడా బౌద్ధదీక్ష పుచ్చుకోవచ్చునని అనుమతించిన కారణం ఆలోచించుకొన్నావా రాకుమారీ."

ఈ సంభాషణ అంతా ఆశ్చర్యపడుతూ ఆ యువతీ యువకులంతా వింటున్నారు. ఉత్సవస్థలంలో యువతీయువకులూ, వసంతుడూ, వనలక్ష్మి రతీ మన్మథులకోసం ఎదురు చూస్తున్నారు. ఆలశ్యం అయిందేమో అని వసంతుడైన వీరపురుషత్తుడు భట్టిదేవి చేయిపట్టుకొని లేచాడు. వసంత వేదికనుండి దిగి, యువతీ యువకులు కొలిచిరా వనరమా వసంతు లిరువురు రతీమన్మథులున్న స్థలానికి వచ్చారు.

*"ఏదమ్మ జగదేక సుందరాకార రతి?*
*ఏదమ్మ ప్రణయయోగాసనావిర్భూత?*
*ఏది మాదేవి రతి?*
*ఏదమ్మ ఏది?"*

అని బాలికలు పాడినారు. వీరపురుషదత్తుడు, బ్రహ్మదత్తప్రభువు తన చెల్లెలిని రతిగా ఎన్నుకొన్న పరమార్థము వెంటనే గ్రహించాడు. మహారాజు కొమరి తమ మహారాజు ఆజ్ఞలేక రతిగా ఎన్నుకొనడానికి ధైర్యమెవ్వరికి ఉంటుంది, బ్రహ్మదత్తునకు తప్పితే? యువకుడై, బ్రహ్మచారియైన బ్రహ్మదత్త ప్రభువును చెల్లికి గురువుగా నియమించడంలోని అర్థం వీరపురుషదత్తుడప్పుడే గ్రహించాడు.

**వసంతుడు:** మీనకేతనదేవా! రతీదేవి రావడానికి ఆలస్యం చేయడం కారణం?

**మన్మథుడు:** వసంతదేవా! అతనుడై మన్మథుడు మళ్ళీ తనువు తాల్చి వచ్చినాడని రతీదేవి గ్రహించలేకుండా ఉన్నది.

**వనరమ:** చెల్లీ, రతీదేవి! నీవింకా యోగినీ హృదయంతో ఈలా తపస్సు చేసుకోవడం మంచిదికాదు. మన్మథదేవులే స్వయంగా వచ్చి నిన్ను అర్థిస్తున్నారు.

**బాలికలు:** అవునుదేవీ, శుభముహూర్తం దాటి పోతున్నది.

**బాలురు:** వసంతకాలం నిత్యమైనా క్షణికం. మాకింతలో కౌమారదశ వస్తుందన్న భయం ఆవరిస్తున్నది.

శాంతిశ్రీ రాకుమారి వెలవెలబోయే చూపులతో వీరందరినీ కలియ జూచింది.

## 21

**శాంతి**శ్రీ మోము చూస్తూ బ్రహ్మదత్తుడు క్రుంగిపోయాడు. ఈ బాలికను తాను ప్రేమించినాడు. ఈ బాలికే తన ఆత్మేశ్వరి! ఈ ప్రణయరహిత హృదయ, ఈ జన్మయోగిని, తన ప్రేమ నిధానము. ఇంత లోకోత్తర సౌందర్యవతి అయిన ఈమె జీవితంలో ప్రేమరసార్ద్రత లేనేలేదే! తేనెలేని పుష్పమా ఈమె! ఈమెకు భగవద్భావంకూడా లేదా! ఇది ఈమెలో దోషమా లేక అవస్థా దోషమా? తాను ఈ బాలికను రతీదేవిగా ఎన్నుకొని ధర్మద్రోహము చేసినాడా? ధర్మజ్ఞుడయ్యూ తాను ఈ విషయంలో ఇంత ధర్మగ్లాని ఒనర్చినాడేమి? వైరాగ్యాభిరతమగు తన హృదయంలో స్త్రీ కాంక్ష అంతరాంతరాలలో అణిగి ఉన్నదా? స్త్రీ పురుష సంయోగము దుష్టమని పరిత్యజించ దగినదా? బ్రహ్మదత్తుని ఆలోచనా నిమగ్నత గమనించిన ఆ యువతీ యువకులు చటుక్కున నిశ్శబ్దత వహించారు.

శాంతిశ్రీ రాకుమారి బ్రహ్మదత్తుని గమనించింది. బ్రహ్మదత్తుని మోము నిశ్చలత వహించింది. అతని మోము శీతకాలాన హిమాలయ శిఖర రూపం తాల్చింది. అతని మోము సంపూర్ణామవాస్య రాత్రి నిశ్చిలాకాశంలోని గంభీరత వహించింది.

"శాంతిశ్రీ రాకుమారీ! నన్ను క్షమించు. నీ దివ్య సౌందర్యానికి నేను ముగ్ధుడనయి నిన్ను రతీదేవిగా ఎన్నుకొన్నాను. ఆకాశాన్ని ఆడుకొనేందుకు కావాలని పోరుపెట్టిన బాలకుణ్ణి నేను."

"ఆర్యా! నేనే క్షంతవ్యురాలిని. మీ యందు దోషమేముందీ? మిమ్మీ యువతీ యువకులు మన్మథునిగా ఎన్నుకొన్నారు. నన్ను మీరు ఎన్నుకొన్నారు."

ఆమె మాటలలో, ఆశ్చర్యముగాని, కోపముగాని, దయగాని, ఆనందముగాని, హాస్యముగాని, విచారముగాని ఏమీలేదు. ఆమె మాటలు ఆకాశవాణి మాటలులా ఉన్నాయి.

"రాజకుమారీ! ఇందులో నీదోషమూ లేదు. నాదోషమూ లేదు. వీరందరి దోషమూలేదు. విధిదీ, కాలముదీ దోషం. సెలవు." బ్రహ్మదత్తుడు తలవంచుకొని విసవిస నడిచి తన రథము కడకుబోయి తానే తన గుఱ్ఱములు రథానికిపూన్చి విజయపురంవైపు వెళ్ళిపోయాడు.

అతడు వెళ్లిపోవడం చూస్తున్న శాంతిశ్రీ ఏమీ ఆశ్చర్యం పొందలేదు. ఈ యువకుడు అలా వెళ్లి పోయినాడేమిటి? ఆమె శాస్త్రప్రకారం కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులంటే ఏమిటో తెలుసుకొన్నది. కాని వాని అనుభవం ఆ బాలకేమి తెలుసు? కొలదిగా విసుగు రావడం. ఎక్కడో మనసు లోతులలో కొంచెం కృతజ్ఞత. ఆ లోతులకు

ఇంకా దిగువను అదొకరకపు సంతోషం కలగడం. ఇవి అప్పుడప్పుడు ఆమె జీవితంలో సంభవించిన ఘట్టాలు. నేడు బ్రహ్మదత్తప్రభువు విచార వదనంతో వెళ్ళిపోవడం చూచి ఆమెకు ఆశ్చర్యం కలిగిందేమో ఆమె మనస్సు లోతుల్లో అదిమాత్రం ఆమెకు తెలియదు.

ఈ నాటకమంతా శాంతిమూల మహారాజు తన శిబిరంలోనుండి గమనించాడు. తన కొమరిత మోముపై ఆశ్చర్యరేఖలైనా తోచకపోవడం చూచి, శాంతిమూలుని మోము మేఘాలు కమ్ముకొన్న కొండచరియై పోయింది. ఎలాగు తానీ బాలికలో చైతన్యం కలిగించడం? ఆమెకు ప్రేమ ఉద్భవింపనే ఉద్భవింపదా? ఆమె యోగినియై దేశాల సంచరిస్తుందా? వివాహం చేసుకోదా? మహారాజువదనం విచారంతో ముడుచుకొని పోయిన పుష్పంలా అయింది.

ఆర్యధర్మంలో స్త్రీకి సన్యాసం విధించి ఉండలేదు. పురుషుడైనా బ్రహ్మచర్య, గృహస్థాశ్రమాలు నిర్వహిస్తేగాని వానప్రస్థ, సన్యాసాశ్రమాలు ఆశ్రయించకూడదు. స్త్రీకి వైధవ్యంలోనూ, వృద్ధాప్యంలోనూ మాత్రమే.

తనకు ఒక్కరితే ఈ కొమరిత. ఈ బాలికకు బౌద్ధధర్మమే ఈ అకాల వైరాగ్యం కల్పించిందా? తల్లి బౌద్ధ ధర్మాభిరత అవడంవల్ల పుట్టుక తోడనే ఈ జడభావం అబ్బిందా లేక తన బాలిక వట్టివెఱ్ఱిబాగులదా?

వెఱ్ఱిదే అయితే అంత జ్ఞానసముపార్జనా ప్రతిభెల్లా వచ్చింది! ఏలాంటి గహన విషయమైన నిమేషంలో అర్థం చేసుకోగలదే!" ఈమె జీవితాన్ని, భవిష్యత్తునుగూర్చిన సందేహాలు ఎప్పుడూ మహారాజును భాధిస్తునే వచ్చాయి.

వీరపురుషదత్తుడూ, బట్టిదేవీ ఈ సంఘటన చూచి ఎంతో నిరుత్సాహ పడిపోయారు. యువరాజు వీరపురుషదత్తుడు వీరుడు. అతి ప్రణయి విలాస పూరితుడూ, ధర్మహృదయుడూ, తన సేవకై నియమింపబడిన సౌందర్యవతులగు బాలల నాతడు కన్నెత్తి చూడడు. ఇరువది సంవత్సరాల ఈడువాడు. అయినా మహారాజు కొమరునకు వివాహం మాట తలపెట్టలేదు.

ఆ దినాలలాంటివి శాతవాహన చక్రవర్తి యజ్ఞశ్రీ అవసానదశలో ఉన్నాడు. అఖండ శాతవాహన సామ్రాజ్యం విచ్ఛిన్నమైపోతున్నది. శాతవాహన యువరాజు నీరసుడని మహాసామంతులందరికీ తెలుసును. ఆ సామంతులందరు స్వతంత్రరాజ్యాలు స్థాపించి శాతవాహన ఛత్రచ్ఛాయలనుండి తొలగిపోవాలని సంకల్పించుకున్నారని శాంతి మూలునకు వేగులు వస్తున్నాయి.

దేశంలో ధర్మం నిలబెట్టిన శాతవాహనుల చల్లని సామ్రాజ్యం నశించ నున్నదని శాంతిమూలుడు నిలువునా కలగిపోయినాడు. తాను శాతవాహనులకు అల్లుడును అయి ఉండడంవల్ల ఆ సామ్రాజ్యం నిలబెట్టవలసిన బాధ్యత తన మీదనే సంపూర్ణంగా ఉంది. అందుకై ఇతర మహాసామంతుల బాంధవ్యం ఎంతో ముఖ్యం. బాంధవ్యంవల్లనే పులమావి క్షాత్రపుల నెదిరి నిలువగలుగుతున్నాడు. తాను అలాంటి బాంధవ్యం కోసమే ఇంతమంది దేవేరులను చేసుకొన్నాడు. తన కొమరుడూ అలాగే దక్షిణనాయకుడు కావలసి ఉన్నది.

## ద్వితీయ భాగం

# చైత్రయాత్ర

సర్వసేనాధిపతి బ్రహ్మదత్తప్రభువు ఇక్ష్వాకు సైన్యాలతో ధాన్యకటక నగరం చేరినాడు. అంతకుముందే మహారాజు ద్వితీయ భార్యతో ధాన్యకటకం చేరెను. శ్రీశ్రీయజ్ఞశ్రీ శాతవాహన చక్రవర్తి స్మృహలోలేడు. మహావైద్యులు వైద్యం చేస్తున్నారు. బౌద్ధాచార్యులు త్రిశరణములు పఠిస్తున్నారు. ఆర్యపండితులు పౌష్టిక మంత్రాలు పఠిస్తున్నారు.

చక్రవర్తికి చైతన్యం వచ్చి అల్లుడు శాంతిమూలుని పిలిచి అస్పష్ట వాక్యాలతో, "ప్రభూ! మా అవసానదశలో నీ బాహుబలమే ఈ సామ్రాజ్యాన్ని సంరక్షిస్తున్నది. ఈ రాజ్యంపై మాక్రొత్త ఏల్బడిలో వివిధ సామంతులు తిరుగబడినప్పుడు మీరు చూపిన మహావిక్రమము, మా రాజ్యం నిష్కంటకం చేసింది. మేము ఇంక గడియకో, అర్థగడియకో వెళ్ళి పోతాము. మీ బావమరిది విజయశాతకర్ణిని మీ చేతులలో పెట్టి వెళ్ళుతున్నాము ప్రభూ" అని దాపున ఉన్న కొమరుని పిలిచి, అతనిచేయి శాంతి మూలుని చేతిలో పెట్టి "స్కంద దేవాయనమః, బుద్ధదేవాయనమః" అంటూ చిరునవ్వుతో ప్రాణం వదిలాడు.

శాతవాహన మహాచక్రవర్తులలో తుది చక్రవర్తి నిర్యాణం పొందినాడు; చక్రవర్తి వపువును చందనాది తరుకాండాలతో బూది చేసినారు. కుమారుడు నలుబది అయిదేండ్లవాడు. విజయశాతకర్ణి మహారాజు తండ్రికి ఉత్తరక్రియలు సలిపి పితౄణము తీర్చుకొన్నాడు. ఆ వెనుక శుభమూహూర్తంలో శ్రీశ్రీ విజయ శాతకర్ణి నవకోటి బంగారుపణముల విలువగల ఆంధ్రసింహాసనంపై పట్టాభిషిక్తుడైనాడు.

ఉత్తర కళింగాధిపతులు వాసిష్ఠులు, దక్షిణ కళింగాధిపతులు, మాఠరులు, వేంగీరాష్ట్రాధిపతులు, సాలంకాయనులు, మంజీర రాష్ట్రాధిపతులు, గౌతములు, గృధ్రరాష్ట్రాధిపతులు, బృహత్పలాయనులు, క్రమక రాష్ట్రాధిపతులు, ధనకులు, పూంగీ రాష్ట్రపతులు, చటుక రాష్ట్రాధిపతులు, కదంబులు, నాగదేశాధిపతులు, చూతకుల శాతకర్ణులు, ములకరాష్ట్రాధిపతులు, ఆశ్మకులు, ఆభీరులు, మాళవులు, కురవులు, మంజీరాధిపతులు మొదలయిన వారి ప్రతినిధులు నూత్న చక్రవర్తి అభిషేకానికి ఆహూతులై వచ్చారు. ఆవెంటనే మా ఏవులు, అభీరులు తమ స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నారు. వనవాసాధిపతులు, చూతకుల శాతకర్ణులు కూడా స్వాతంత్ర్య ప్రకటన చేసారు. ఆంధ్రసామ్రాజ్యము చిన్న చిన్న చక్రవర్తులతో నిండిపోయింది.

ఇక్ష్వాకు శాంతిమూలమహారాజు బ్రహ్మదత్త ప్రభువుని చూచి, "స్కందవిశాఖాయనక ప్రభూ! మీరు మన సైన్యాలతో మా బావగారికి బాసట కావలసిం"దని ఆదేశమిచ్చినాడు.

చక్రవర్తిని కనుంగొని "మహాప్రభూ! మీరు సైన్యాలతో వానాకాలమైనా సరే, బయలుదేరి ఒక్కసారి దిగ్విజయ యాత్రచేయండి. తమ కుడి చేయిగా మా ధనకప్రభువు

ఉండగలరు. మీరు ఈ సమయంలో ఈదిగ్విజయం చేయకపోతే, ధాన్యకటక రాష్ట్రం నీరసించిపోతుంది" అని ఖండితంగా మనవి చేశాడు.

"చక్రవర్తి తన బావమరిదితో "ప్రభూ! మీరు మా బదులు సైన్యాధిపతులై దిగ్విజయం చేసి రాకూడదా?" అని పృచ్ఛ చేసినాడు.

"చక్రవర్తి స్వయంగా వెళ్ళటం శాతవాహన సామ్రాజ్యానికి అవసరం మహాప్రభూ."

"మేము ప్రస్తుతం ధాన్యకటకాన్నుంచి కదిలే వీలు కన్పించడంలేదు. తాము మాకు ప్రతినిధులుగా వెళ్ళిరండి."

శాంతిమూల మహారాజు సరే అని శుభమూహూర్తాన సర్వాంధ్రసైన్యాలకు మహాసేనాపతి అయి ఉత్తరాభిముఖుడై వెళ్ళినాడు. వేంగీసాలంకాయనులు కప్పముగట్టి శాంతిమూలుని ఎంతో గౌరవం చేసినారు. వేంగినుండి పయనించి గోపాదక్షేత్రముకడ గోదావరిదాటి ఉత్తరంగా పిష్ఠపురంపోయి తన అత్తవారయిన మాఠరుల సన్మానముపొంది, వారి కప్పముగొని, మేనమామ లయిన వాసిష్ఠులకడకు పోయినాడు. అచ్చట కప్పముగొని ఉత్తరంనుంచి ఈశాన్యాభిముఖుడై శైలోద్భవుల కొంగోద పట్టణము చేరినాడు శాంతి మూలుడు. శైలోద్భవులు కప్పముగట్టి శాంతిమూలుని ఎంతయో గౌరవించి అచ్చటనుండి ఆయనను పశ్చిమంగా సాగనంపినారు. శాంతిమూల మహారాజు సైన్యాలతో నైఋతికి తిరిగి శరభపురముకడ దండు విడిసినాడు. వారు ఆంధ్ర సామ్రాజ్యానికి కప్పము గట్టినారు. శాంతిమూలుడు అతివేగంగా ప్రయాణాలు చేసి మాళవరాజధాని ఉజ్జయిని చేరినాడు.

## 2

**మా**ళవ రాజ్యాధిపతి, రుద్రసేన మహారాజు శాంతిమూల మహారాజును ఎంతేని గౌరవించి సర్వమర్యాదలు నెరపినాడు. వారిద్దరు ప్రత్యేకంగా మంతనం సలిపే సమయంలో మాళవప్రభువు శాంతిమూలుని చూచి,

"మహాప్రభూ! నీరసించిపోయిన గుఱ్ఱము అశ్వశాలకైనా అందం కాదు" అన్నారు.

"అయినా ఇదివరకా గుఱ్ఱం చేసిన సేవకు మనమేమి చేసినా దాని ఋణం తీర్చుకోలేము కాదా మహారాజా!"

"తాము చెప్పింది నిజమే. ఇంతకూ మా మనవి తాము చిత్తగించాలి. మా అమ్మాయి రుద్రభట్టారిక ఈడు వచ్చిన బాలిక. ఆ కుమారిని విజయ చక్రవర్తి కొమరుడైన మా మేనల్లునకు ఈయవలసిందని పరోక్షంగా మాకు ఆలోచనలు వచ్చినవి మహాప్రభూ! కాని అమ్మాయికి ఏమీ ఇష్టంలేదు."

"బాలికకు ఇష్టంలేని సంబంధం తలపెట్టడం ఉత్తమంకాదు మహా ప్రభూ."

"తాము అభీరులపైకి వెళ్ళడం నిశ్చయమేనా?"

"చిత్తం, అభీరులు ఎప్పుడూ ఈ సామ్రాజ్యానికి ప్రక్కబల్లెము వంటివారు మహారాజా! కాబట్టి ఏ చక్రవర్తి అయినా అభీరులను విజృంభింప నీయకూడదు."

"భరుకచ్ఛం మీ రాజ్యాలకు చాలా ముఖ్యమైన రేవుపట్టణం కాదా మహాప్రభూ!"

"అవును మహాప్రభూ! పారశీక, యవన, రోమకదేశాల వర్తకానికి భరుకచ్ఛం ఉండితీరాలి. లేకపోతే ఈ మహాసామ్రాజ్యానికి ఎంతో నష్టం సంభవిస్తుంది."

మాళవ మహారాజు రుద్రసేనుడు తన సైన్యం కొంత తన సేనాపతి నడుపుతుండగా ఆంధ్ర సైన్యాలతో పంపించినారు. అభీరులు తమ సైన్యాలతో ఆంధ్రులకు నర్మదాతీరాన అడ్డువచ్చారు. శాంతిమూల మహారాజు శాతవాహనుల దళాలతో సైన్యమధ్యభాగమును, బ్రహ్మదత్తుడు ఇక్ష్వాకు సైన్యాలతో ఎడమ భాగమును, మాళవసైన్యాలు మాళవ సేనాధిపతి నాయకత్వంతో కుడిప్రక్కకు నిలిచారు. ఎదుట అభీరులు నర్మదానదికి నదీతీర రాజపథం పక్క కొండలను మూడుక్రోశాలు ఆక్రమించుకొన్నారు. భరుకచ్ఛానికి పోవాలంటే ఈ దారికన్న వేరు మార్గం లేదు. అభీరులాక్రమించిన ఆ దుర్గమ ప్రదేశం మీదకు తమ సైన్యాలను నడపడం వినాశన హేతువని శాంతిమూల మహారాజు నిమేషంలో గ్రహించినాడు.

ఆంధ్రసైన్యాలు తమ శిబిరాలను అభీరసైన్యాలకు ఎదురుగా ఉన్న కొండలమీద నిర్మించుకొని, ఆ కొండలప్రదేశం కోటలా సిద్ధం చేసుకొన్నారు. వెనుకనుంచి అభీరులు వచ్చి తాకకుండా మాళవసైన్యాలు రాజపథమునకు పొడుగునా ఈవలావల ఎత్తైన ప్రదేశంలో మూడుయోజనాల దూరంవరకూ ఆక్రమించాయి.

యుద్ధరంగం స్తంభించింది. అప్పుడు బ్రహ్మదత్త ప్రభువు శాంతి మూల మహారాజుకడకు వచ్చి "మహాప్రభూ! నేను మన సైన్యాలతో వెనకకేగి, కొండలుదాటి, నర్మదానదిని ఎగువభాగంలో దాటి తపతీనది తీరాన్నే అడవులలో, కొండలలో చొచ్చిచని బరుకచ్ఛాన్ని ముట్టడిస్తాను. ఆ వార్త వచ్చిన వెంటనే ఈ శత్రుసైన్యాలు భరుకచ్ఛ రక్షణకు రావాలి. లేదా మీతో యుద్ధానికి తలపడాలి" అని మనవి చేసెను.

"అభీరులలో కొంతమంది మాత్రమే మిమ్ము వెనుకనుంచి వచ్చి తాకితే?"

"మాళవ వేగులను అభీరులను కనిపెడుతూ ఉండమనండి. అభీర సైన్యాలలో కొంతభాగం భరుకచ్ఛం సాగితే మాళవ సైన్యాలను నాకు సహాయంగా పంపించండి."

"మీ ఆలోచన బాగుంది స్కందవిశాఖ ప్రభూ!"

శాంతిమూలుడు బ్రహ్మదత్తునికి ఆనతి ఇచ్చినంతట బ్రహ్మదత్త ప్రభువు కొండలుదాటుతూ, అడవులవెంట వేగంగా సాగిపోయి భరుకచ్ఛం ముట్టడించాడు. ఎంత రహస్యంగా వెళ్ళినా బ్రహ్మదత్తుడు వస్తున్న వార్త ముందుగానే భరుకచ్ఛవాసులకు తెలిసింది. అందుకనే వారు సర్వసిద్ధంగా ఉండి బ్రహ్మదత్తుని కోటదగ్గరకు రానీయకుండా చేయగలిగినారు. ధనక విశాఖాయనక ప్రభువు ఇలా జరుగునుందని ఇదివరకే అనుకున్నాడు.

దారి పొడుగునా బ్రహ్మదత్తుడు భరుకచ్ఛపు కోటను పట్టుకొనే విధానం ఆలోచిస్తూనే వచ్చాడు. ఖరుకచ్ఛం మహాపట్నం. ఆ పట్నంలో, ఆ పట్టణం చుట్టుప్రక్కల ప్రదేశాలలో రోమకులు, పారశీకులు, బాహ్లీకులు, యవనులు, ఇగుప్తులు ఎంతమందో కాపురాలుండి వర్తకాలు చేస్తూ ఉంటారు. కాబట్టి పట్నం కోటచుట్టూ పది గోరుతముల పొడవు ఉంటుంది. పట్నంలో ఎన్నో చిన్న చిన్న కోటలు చాలా ఉన్నాయి.

# 3

**రా**జ్యాలు అవసరమా? కృతయుగంలో ఆశ్రమాలు, నగరాలు, నగరాలలో వ్యవహార దక్షులయిన ఆర్యులు సంఘాలు స్థాపించి క్షత్రియత్వం తమ జాతినీ యజ్ఞయాగాది క్రతువులను, ధర్మాన్ని రక్షించడం అంతేగదా ఆర్యమానవ జీవితం. మూడుయుగాలలో ఎంత మారిపోయింది మానవ జీవితం? రాజ్యాలు స్థాపించడం అవసరమైంది. వృద్ధిపొందే మానవజాతికి సాత్విక, రాజసిక, తామసిక గుణసమేతులైన మానవులు మహాసంఘాలను స్థాపించారు. రక్షణకు, శాంతికీ వృద్ధికీ, బడాయికీ, అభిమానానికీ, ఆశకూ రాజ్యస్థాపన, రాజ్యాభివృద్ధి, సాంకేతిక విద్యలూ కారణాలు అయ్యాయి. ఈ సంస్థాపనకై ప్రజానాశనము తప్పదా? ప్రజారక్షణా, ప్రజాశాంతీ, ప్రజాభివృద్దీ – ఇవే ఆశయాలయినప్పుడు ఆ ఆశయాలకు ప్రజాహింసా, ప్రజాసంక్షోభం, ప్రజానాశనమూ ఏలా మార్గాలు అవుతాయి?

బ్రహ్మదత్తప్రభువు ఈ ఆలోచనలతో సంక్షుభిత మనస్కుడై స్కంధావారం మధ్య తన శిబిరంలో కృష్ణాజినాసనస్థుడై వణకిపోయినాడు. ఈ యువక ప్రభువున కిదే మొదటి పర్యాయము జైత్రయాత్రలకు రావడం. తన విక్రమం, విజ్ఞానం, విజయతృష్ణ తనకు విజయం చేకూర్చవచ్చు, లేదా తన్ను నాశనం చేయవచ్చు. కాని ఈలోపున ఎందరు ఆంధ్రవీరులు, ఎందరు అభీరులు నాశనం అయిపోవాలి! ఆంధ్రులే ఈలా సర్వసామ్రాజ్యాధినేతలు ఎందుకు కావాలి? అభీరులు ఈ రాష్ట్రం ఆక్రమించి, ఇక్కడే నివసించి, ఇక్కడే పుట్టి, పెరిగి, ఇక్కడే మట్టిలో కలుస్తున్నారు. ఇక్కడ ఉండే ప్రకృతిలో వారు భాగం; వారిలో ఈ ప్రకృతి భాగం. ఈ మహానదాలు రెండూ, ఈ వింధ్యాంత శ్రేణీ ఈ ఫలవత్తర భూమీ, ఈ సముద్రమూ, ఈ రేవుపట్టణమూ వీరివి. ఇందులో భాగం పంచుకోడానికి శాతవాహనులకు ఇక్ష్వాకులకు ఏమి స్వత్వం ఉంది?

ఆలోచనలోపడి ఏదీ నిశ్చయం చేసుకోని స్కందవిశాఖాయనక ప్రభువు కడకు యవనులు, పారశీకులు ఆర్యులు కొందరు రాయబారానికి వచ్చినారు. బ్రహ్మదత్త సేనానాయకుని అంగరక్షాధిపతులు వారిని సగౌరవంగా బ్రహ్మదత్తునికడకు కొనివచ్చారు. బ్రహ్మదత్తప్రభువు లేచి వారిని ఎదుర్కొని ఉచితాసనాల కూర్చుండబెట్టి "తాము దయచేసినపని ఏమి?" అని పృచ్ఛ చేసినాడు.

భరుకచ్ఛంకోటలో యవనులకు, రోమకులకు, పారశీకులకు, యూదులకు వర్తకం చేసుకొనే మహాభవనాలున్నాయి. అవి చిన్న చిన్న కోటలవంటివి. ఆర్యవర్తకులకు అట్టి చిన్న కోటలున్నవి. బ్రహ్మదత్తుని కడకు రాయబారానికి వచ్చిన వారంతా అలాంటి కోటలకు యజమానులు.

**యవనవర్తకుడు:** శాతవాహనప్రభూ! ధాన్యకటక మహారాజులు మాకు ఇక్కడ ఆశ్రయం ఇచ్చి మా వర్తకం సర్వవిధాలా వృద్ధిపొందేటట్లు చూచినారు. మాకు వారెన్నో రక్షణలు కల్పించిరి.

**పారశీకవర్తకుడు:** శ్రీయజ్ఞశ్రీ చక్రవర్తికీ జబ్బుగా ఉంది అని తెలిసినప్పటినుంచీ ఈ అభీరసామంతులకు ఎక్కడలేని ధీరత్వమూ వచ్చి మాబోటి వర్తకులనందరిని బాధిస్తున్నారు.

**ఐగుప్తవర్తకుడు:** మా "పారోఆ" చక్రవర్తులతో దీటైనవారు మీ చక్రవర్తులు. "పారోఆ" చక్రవర్తుల రాజ్యాలు పోయాయి, టోలమీ చక్రవర్తులు వచ్చారు. అయినా మా వర్తకులకు వారూ సహాయం చేస్తున్నారు. కాని ఈ అభీరరాజులు మా రాబడులలో తమకు సగం పంచి ఇమ్మంటారు.

**యూదువర్తకుడు:** మా కోటలు పడగొట్టి తక్కిన ప్రజలతోపాటు ఉండమంటారు.

**రోమకవర్తకుడు:** నెమ్మది నెమ్మదిగా మా వర్తకాలన్నీ అభీరుల కిచ్చి మేము మా దేశాలకు వెళ్ళిపోవాలట.

**ఆర్యవర్తకుడు:** అభీరులకు వర్తకులంటే కోపం. మా వస్తువులు విదేశాలకు వెళ్ళడంగాని, విదేశవస్తువులు దిగుమతి చేయించడానికిగాని వీలు లేదట.

**యవన:** కాబట్టి మీరు సైన్యాలతో రావడం మాకు మహోపకారం.

**బ్రహ్మదత్తుడు:** ఇంతకూ మీరంతా రాయబారం రావడానికి కారణం?

**యవన:** తమ ఆశ్రయిం కోరి వచ్చాము.

**బ్రహ్మదత్తుడు:** అభీరులను నేను ఓడిస్తే మీకందరకూ ఉపకారం జరుగుతుంది. నేను వచ్చిందే అందుకు. మీరందరూ రాయబారం వచ్చినా సరే, రాకపోయినా సరే. జరిగే ఉపకారం ఎల్లాగా జరిగి ఉండునే.

**యవన:** కాదు, సేనానాయకా! మీరు పట్టణంమీద విరుచుకుపడకుండా ఉంటే, పట్టణాన్ని మీకు లోబరుస్తాము. అదీ మా మనవి.

**బ్రహ్మదత్తుడు:** మీరు అభీరుల పాలనలో ఉండి, అభీరులకు ద్రోహం చేస్తామంటే నేనెలా ఒప్పుకోగలను?

**యవన:** మేము ద్రోహం చేసేవాళ్ళము కాము. మేము అభీర నాయకునితో చెప్పనే చెప్పినాము. భరుకచ్ఛము ఆంధ్రులకు తిరిగి అప్పచెప్పవలసినదనీ, లేకపోతే ఆంధ్రులకు మేము సహాయం చేయవలసి వస్తుందనీ.

**బ్రహ్మదత్తుడు:** అయినా మీ ధర్మం మాకు నచ్చలేదు, మీరూ మాకూ మాకూ జరిగే యుద్ధాలలో పాల్గొనకూడదు.

ఇంతలో అంగరక్షక దళపతి వచ్చి బ్రహ్మదత్తునకు నమస్కరించి,

"ప్రభూ! అభీరనాయకులు తమ ఆజ్ఞకై వేచి ఉన్నారు" అని మనవి చేసెను.

**బ్రహ్మ:** ప్రవేశపెట్టు.

అభీరనాయకులు లోనికివచ్చి బ్రహ్మదత్తప్రభువునకు నమస్కరించి వారిచే అనుజ్ఞాతులై ఉచితాసనాల కూరుచున్నారు.

## 4

"ప్రభూ! మేమెప్పుడూ శాతవాహన చక్రవర్తుల బిడ్డలము. ఇన్నివందల సంవత్సరాలుగా వారికి శక్తివంచనలేకుండా సేవ చేశాము. సామ్రాజ్యాన్ని మాళవులు మొదలయిన విరోధులు ఆక్రమించకుండా మా స్వాతంత్ర్యం మేము కాపాడదలచు కొన్నాము. తామూ, శ్రీ ఇక్ష్వాకుమహారాజు శ్రీశాంతి మూల మహా ప్రభువూ, శాతవాహన

సార్వభౌముల ప్రతినిధులుగా వచ్చారని మాకు నమ్మకం కలుగగానే తమ సన్నిధికి మా ప్రభుభక్తిని అణకువతో ఉద్ఘాటించడానికి వచ్చాము" అని అభీరనాయకులు బ్రహ్మదత్త ప్రభునకు విన్నవించెను. బ్రహ్మదత్తప్రభువు చిరునవ్వు నవ్వుతూ యవన పారశీకాది వణిజులను చూచి "మీ కోరికా, నా ఆశయమూ ఫలించాయి" అంటూ, అభీరులను చూచి గంభీరంగా, "మేము మా సైన్యాలతో భరుకచ్ఛం ఆక్రమించుకుంటాము" అని తెలిపినాడు.

ఆ దినమందే బ్రహ్మదత్తప్రభువు భరుకచ్ఛం ఆక్రమించుకున్నాడు. బ్రహ్మదత్తుని కడనుండీ భరుకచ్ఛపట్టణ నాయకులకడనుండీ చారులు, భరుకచ్ఛం లోబడిన విషయం వార్తలు కొనిపోయినారు. భరుకచ్ఛనాయకులు కట్టవలసిన కప్పము కట్టివేసినారు. కతిపయదినాల్లో శాంతిమూలమహారాజు సైన్యాలతో, భరుకచ్ఛ సేనాపతులతో సేనలతో భరుకచ్ఛం చేరిరి. నగరంలో నూతన్న శాతవాహన చక్రవర్తి సామ్రాజ్యాభిషేకోత్సవాలు వైభవంగా అభీరులు జరిపినారు.

భరుకచ్ఛంనుంచి శాంతిమూల మహారాజు దక్షిణంగా మరలి కుంతల దేశం చేరుకున్నారు. చూతశాత కర్ణాట ప్రభువు యుద్ధం చేయడానికి ఇష్టం లేక తానీయవలసిన కప్పం కట్టి, తన అకుంఠితభక్తి తెలిపినాడు. వైజయంతీ పురంనుంచి శాంతిమూల మహారాజు ముసికనగర ముఖ్యనగరస్థమైన శాతవాహనపథం దాటి కాంచీపురం చేరుకొని, కాంచీపురాధిపతులకడ, తొండమండలాధిపతులకడ కప్పముగొని, తిరిగి ప్రయాణాలు సలుపుతూ ధాన్యకటక నగరం విచ్చేసినారు. ఈ యాత్ర సంవత్సరానికి పూర్తియైనది. సామంతులందరూ యుద్ధం అవసరం చేకుండా కప్పముకట్టిన సంగతి విని విజయశ్రీ శాతకర్ణి చక్రవర్తి ఎంతో సంతోషించినారు. శాంతిమూల మహారాజు కప్పమంతా చక్రవర్తికి అప్పగించి, తాను విజయపురం వెళ్ళినాడు. బ్రహ్మదత్త ప్రభువు తాను యుద్ధం చేయవలసిన అవసరం లేకుండా ఈ జైత్రయాత్ర పూర్తి అయినందుకు భగవదనుగ్రహాన్ని కొనియాడుకొన్నాడు.

శాంతిమూలమహారాజు ఈ జైత్రయాత్ర ఇంత సులభంగా జరిగిపోయినందుకు ధాన్యకటక మహేశ్వర దేవాలయంలో అర్చనలు చేయించి, మహా చైత్యానికి వేయి దీపములు అర్పించుకున్నాడు. బ్రహ్మదత్తప్రభువు మహారాజు శాంతిమూలునితో ఏ తీర్థయాత్రకో వెళ్ళివచ్చినట్లు జైత్రయాత్ర చేసి వచ్చినందుకు ఆశ్చర్యం చెందినాడు. యజ్ఞశ్రీశాతవాహన చక్రవర్తి కాలంలో ఆ సార్వభౌముడు అభీరులతో, మాళవులతో యుద్ధములు చేసినాడు. కుంతలములో నాగదేవులతో మహాయుద్ధ మొనరింపవలసి వచ్చింది. యజ్ఞశ్రీ దేవుని తండ్రి నీరసుడవడంవల్ల శాతవాహన సామ్రాజ్యము క్రుంగి కృశించిపోయినది.

యజ్ఞశ్రీప్రభువు విక్రమ ప్రజ్ఞలవల్ల తండ్రితరాన ముక్కలైపోయిన సామ్రాజ్యము తిరిగి తాతగారయిన పులమావి, వారితండ్రి గౌతమిపుత్ర శాతకర్ణులనాటి మహోత్తమదశకు వచ్చింది.

బ్రహ్మదత్తుడు శాతవాహనవంశంలో అట్టి చంద్రవిక్రముడు ఇంక రాడు అనుకున్నాడు. శాతవాహనవంశ ప్రభువులనేకులు వలసవెళ్ళి శాతవాహన రాష్ట్రము స్థాపించినారు. తుంగభద్రా కృష్ణవేణ్ణా సంగమస్థానంలో వారిలోగాని, మరి ధాన్యకటకాది ప్రదేశాల చిన్న చిన్న సామంతులలోగాని, కళింగంలో శాలివాహన గుండరాజ్య ప్రదేశాల సామంతరాజ్యాలు స్థాపించిన వారిలోగాని ఒక్కడైనా శక్తిమంతుడైన శాతవాహన వీరుడు లేడు. విజయశ్రీ మహారాజే కడగొట్టుపిందె. ఆయన కొమరుడు తండ్రికన్న నీరసుడు.

బ్రహ్మదత్తుడు యువరాజు వీరపురుషదత్తుని కలుసుకొన్నాడు. వీర పురుషదత్త ప్రభువు మాళవంనుండి అంతకుమున్నే విజయపురికి వేంచేసినారు. మాళవాధిపతియైన రుద్రసేనప్రభువు తన ముఖ్యమంత్రిని శ్రీవీరపురుషదత్త ప్రభువును ఉజ్జయినికి ఆహ్వానించడానికి పంపినాడు. ఆ సమయంలో భరుకచ్ఛంలో మహారాజు శాంతిమూలుడు విడిసి ఉన్నాడు. మహారాజు యువరాజునకు తమతో వచ్చిన ఇక్ష్వాకుమంత్రి నొకరిని పంపి తమ అనుఘతిని తెలియజేసినారు. శీతకాలం ప్రారంభమైన దినాలలో ఉజ్జయిని వెళ్ళితిననీ, ఆనాడు ఉజ్జయిని కన్నుల వైకుంఠంలా అలంకరించారనీ యువరాజు బ్రహ్మదత్తునితో చెప్పినాడు.

**బ్రహ్మదత్తుడు:** ప్రభూ! మాళవ రాజపుత్రిక రుద్రభట్టారిక అపరిమిత సౌందర్యవతి అని నేను ఉజ్జయినిలో విన్నాను.

**యువరాజు:** ఈ యువరాజు ఈలా అపరిమిత సౌందర్యవతులను ఎంతమందిని చూడవలసి ఉంటుంది?

**బ్రహ్మ:** ప్రభువులు సర్వసాధారణంగా దక్షిణ నాయకులు. రాజధర్మ సంరక్షణకై దక్షిణ నాయకత్వమును పూనవలసి ఉంటుంది.

**యువ:** బలవంతుడైన రాజునకు దక్షిణ నాయకత్వం అవసరమా అనుకొంటాను.

**బ్రహ్మ:** దక్షిణ నాయకత్వమే ప్రభువులకు బలమిస్తుంది. క్రిందటి వసంతోత్సవంలో పూంగీయ రాకుమారికకు కోపం వచ్చింది కదా ప్రభూ?

## 5

వీరపురుషదత్తుడు బ్రహ్మదత్తుని ఒక నిమేషం తీక్ష్ణంగా గమనించి "ధనకప్రభూ! ఆ దినాన వసంతోత్సవంలో జరిగిన గజిబిజి ఇదివరకెన్నడూ జరగలేదు. మా చెల్లెలు రతీదేవిగా ఉండలేకపోవడం, మీరు వెళ్ళిపోవడమూ జరిగింది. రాజకుమారి బాపిశ్రీ రహస్యంగా కన్నుల నీరునింపడం నేను చూచాను. దక్షిణ నాయకత్వ ప్రభావం అప్పుడే నాకు అవగతం అయింది."

"ప్రభూ! మళ్ళీ వసంతోత్సవాలు వస్తున్నవి."

"మా మరదలు శాంతశ్రీ రాకుమారి ఈ ఏడు వసంతోత్సవాలకు ఉండదలచుకోక తల్లిదండ్రులను ప్రోత్సహించి పూంగిప్రోలు వెళ్ళిపోయింది."

"ప్రభూ! మేము ఉత్తరకళింగ రాజధానికి పోయినప్పుడు వాసిష్ఠ ప్రభువు క్రిందటి వసంతోత్సవాన ఆరంభించిన రాయబారాన్ని పూర్తిచేసినారు. అందుకు మహారాజుగారు ఒప్పుకున్నారు."

"రాజుల బ్రతుకులు రాజనీతి పాశబద్ధాలై కనిపిస్తవి."

"అలా కాకపోతే ప్రజలకు ధర్మం ఏలా సన్నిహితం అవుతుంది?"

"అవును ప్రభూ! సాధారణ మనుష్యుడు భరించవలసిన బరువు ఏమి ఉంటుంది! భూమి భరించే శేషునిలా భారం భూపతే భరించవలసి ఉంటుంది. అయితే మా చెల్లెలు విషయం మీకు తెలిసి ఉండదు."

"ప్రభూ! ఈ ఏడు వసంతోత్సవం జరిపే కార్యక్రమం ఏర్పాటు చేసినారా?"

"ఈఏడు వసంతోత్సవం జరపాలనే ఉత్సాహమేలేదు. నిరుటి వసంతోత్సవంలో శాంతిశ్రీ రాకుమారి తన్ను రతీదేవిగా మీరు ఆహ్వానించినప్పుడు గజగజ వణికింది. ఏ విషయం వచ్చినా పట్టించుకోనిది ఆనాడామె ఎంతో బాధపడింది. ఆ బాధ చూచిన మా కందరకు ఎంతో ఆనందం కలిగింది, బాధచే ఆమెలో చైతన్యం పొటమరించింది కదా అని."

"ప్రభూ! రాకుమారి శుద్ధ సాత్వికమూర్తి. శుద్ధసాత్వికులకు అవస్థా భేదములుండవు. ఆ శుద్ధసాత్విక స్థితికి ఏదైనా విపరీతావరోధము వచ్చినప్పుడు వారు యింకా పైకన్నా వెడతారు. లేకపోతే కొంచెం క్రిందికి దిగి బాధపడతారు."

"మా మరదలు పూంగీయ రాజకుమారికి నేనెన్ని రాయబారాలను పంపినా ఆమె అన్నీ పెడచెవిని బెట్టింది" అంటూ యువరాజు మోము చిట్లించుకొని "మహారాజుగారి ఆదేశంవల్ల భట్టిదేవి రాకుమారిని వనరమగా ఎన్నుకొంటిని. శాంతశ్రీ ఇక్ష్వాకుల దౌహిత్రి. ఆమెకు రాజనీతి పరమైన ఆలోచన లేకపోలేదు. వనలక్ష్మి కానంత మాత్రాన ఆమె అందానికి లోటు వచ్చిందా? నేను స్వయంగా వెళ్ళి బ్రతిమాలినాను. ఆమెపై రచించిన గాథా గీతికలు చదివాను; చిత్ర చిత్రాలైన ప్రాభృతాలు పంపినాను. కాని ఆమె నాతో మాట్లాడలేదు. బాపిశ్రీ రాకుమారి నాకుగా దౌత్యంచేసి ఎంతో బ్రతిమాలుకుందట. నాల్గు నెలలు శాంతశ్రీ నాతో మాట్లాడలేదు. ఇంతలో నేను ఉజ్జయిని వెళ్ళినాను. అచ్చటనే రెండునెలలు గడచింది. తిరిగి నేను వచ్చిన తర్వాతకూడా పూంగీప్రోలు (నేటి ఒంగోలు) ఆ బాలకు రాయబారాలు పంపినాను" అని తెలిపినాడు.

వీరపురుషదత్తుడు పరాక్రమశాలి. సుగుణ సౌందర్యములాతని వరించినవి. రాజనీతిలో వక్రబుద్ధిలేని ధీమంతుడా రాకుమారుడు. దక్షిణా పథమందు శాతవాహన రాజ్యము అంతరించిపోతున్నదనీ, తన తండ్రిగారే దక్షిణాపథస్వామి కావలసివస్తుందని వీరపురుషదత్త రాకుమారునకు నిశ్చితాభిప్రాయం కలిగింది. తండ్రిగారికి రాజ్యకాంక్ష లేదు. కాని ధర్మనిర్వహణార్థం సామ్రాజ్యభారం వహించవలసివస్తే వెనుదీయరనీ, ఆ భారంవారు వహించవలసిస్తుందని నిర్ధారణ చేసుకొనే ఈలా తనకు దక్షిణ నాయకత్వం తప్పనిసరి చేశారని వీరపురుషదత్త ప్రభువునకు పూర్తిగా అర్థమైంది.

బ్రహ్మదత్తుని భుజంమీద చేయివైచి "దేశానికీ యుద్ధక్షోభం తప్పదా?" అని అడిగినాడు.

**బ్రహ్మదత్తుడు:** పశుధర్మం ఏదోరూపంగా మానవజీవితం అడుగున ఉండనే ఉంటుంది. సంపూర్ణ మానవత్వం మానవులలో దీపించినంత కాలము ఈ యుద్ధాలూ, ఈ నాశనాలూ, ఈ రక్తపాతాలు తప్పవు.

**వీర:** ఎప్పటి కా ఉత్తమస్థితి?

బ్రహ్మ? ఈ ప్రపంచం విశ్వంలో లయమైనప్పుడే.

## 6

బ్రహ్మదత్తప్రభువు అంగరక్షకసైన్యం పదునైదువందల వీరులతో విలసిల్లుతూ ఉంటుంది. వీరంతా ఒకధనస్సు (ఈ నాటి ఆరడుగులు) పొడుగుంటారు. అందరు బలసంపన్నులు, సంశప్తకులు. ఆయుధ విద్యలో వీరికి దీటయిన శూరులరుదు. విజయ పురానికి అయిదుగోరుతాల దూరంలో ఉన్న సాలగ్రామవాసి నాగదత్తుడు ఈ దళానికి నాయకుడు సాలగ్రామం ధర్మగిరికి ఎదురుగా కృష్ణకావల రెండుగోరుతాలలో ఉన్న చిన్న గ్రామం.

ఇక్ష్వాకు సైన్యాలు జైత్రయాత్ర చాలించి విజయపురం రాగానే నాగదత్తుడు తన సేనాపతి అనుమతి తీసుకొని సాలగ్రామం వెళ్ళాడు. నాగదత్తుని తండ్రి బుద్ధనాగడు అరువది ఏళ్ళవాడయినా జవసత్వాలుడుగని పోటుమానిసి. అతనికి సాలగ్రామంలో రెండు పెద్దఇళ్లు ఉన్నాయి. ఆ రెండు ఇళ్ళలో అతడూ భార్యలూ, అతని అయిదుగురు సంతానమూ ఉంటారు.

అతని పెద్దభార్య కన్నసిరి సంతానంలో ముగ్గురుకొడుకులు, ఇద్దరు కూతుండ్రు. కన్నసిరి మూడవ కొడుకు నాగదత్తుడు. కన్నసిరి పెద్దకొడుకు దుగ్గసామికి నలుగురు సంతానం రెండవకొడుకు గోదత్తునికి ఇద్దరు సంతానం. మూడవ కొడుకు నాగదత్తునికి వివాహమేలేదు. పెద్దకూతురు నాగసిరి రెండవ సంతానం. ఆమెకు పెండ్లయి అత్తవారూరయిన కోంబ్రోలకు పోయింది. ఆ గ్రామం సాలగ్రామానికి మూడు గోరుతాలుంటుంది. ఈమెకు అయిదుగురు సంతానం.

బుద్ధనాగుని రెండవ అమ్మాయి మహారాజకుమారి శాంతిశ్రీకడ అంగరక్షకి. ఆమె పేరు యశోదనాగిని. యశోదనాగినితో ఉన్న రెండవ అంగరక్షకి తారానిక. తారానిక తండ్రిగారి ఊరు విజయపురానికి దిగువను కృష్ణానది ఒడ్డునవున్న ఏటిరాయి గ్రామం. తారానిక తండ్రి ఏటిరాయి గ్రామణికుడైన సప్తనాగుని రెండవపుత్రుడై, శాంతిమూల ప్రభువు తండ్రికి అంతఃపుర రక్షకుడుగావచ్చి అంతిపురాలు కాస్తూ ఉండెను. అతని పెద్ద కొమరిత తారానిక.

తారానికకు ఇప్పుడు పదునెనిమిదేండ్లున్నవి. అంగరక్షకులుగా ఉన్నంత కాలం స్త్రీలు వివాహం చేసుకోకూడదు. వివాహం చేసుకోవాలంటే అంతఃపురోద్యోగం వదలి తండ్రి ఇంటికి వచ్చి పెళ్ళి చేసుకోవలసిందే.

తారానికా యశోదనాగిని లిరువురూ దేహబలమూ, సౌందర్యమూ, బుద్ధిబలమూ, సుగుణసంపత్తీ ఉన్న బాలికలు. యశోదనాగినికి పదిహేడేండ్లు. యశోదనాగినికకూ తారానికకూ పువ్వునకూ సువాసనకు ఉన్నంత స్నేహం. ఇద్దరూ కలిసి భోజనం చేయవలసిందే. ఇద్దరూ ఒకే రంగు చీరెలూ, వల్లెలూ, స్తనవల్కలాలూ, ఒకే దినుసు నగలూ ధరించవలసిందే. ఇద్దరూ మొలనూళ్ళకు దిగువను ఛురికలు ధరిస్తారు. యశోద

నాగనిక శాంతిశ్రీ రాకుమారిక కడకు వెళ్ళవలసివస్తే ఆమె వెనుకనే తారానిక ఉన్నదన్నమాట. తారానిక రాకుమారిక పనికోసం ఎక్కడికేని వెళ్ళినచో యశోదనాగనిక కూడా వెళ్ళిందన్నమాటే. అంగరక్షకస్వామిని ఈ ఇద్దరిని ఒకర్తెగానే భావించి విధుల నేర్పాటుచేస్తూ ఉంటుంది. వీరిద్దరిపైనా ఉన్న నమ్మక మాస్వామినికి ఇతరులపై లేదు. రాకుమారిక ప్రార్థనా మందిరం ముందరగాని శయనమందిర ప్రాంగణంలోగాని కాపుగా ఉండేది ఈ బాలిక. ఒక్కొక్క పండుగకు ఒక్కొక్క జట్టు పరిచారికలు తమ తమ గ్రామాలకు ఒకనెల దినాలపాటు వెళ్ళివస్తూ ఉంటారు. రాబోయే వసంతోత్సవాలకు యశోదనాగనికా తారానికలు సాలగ్రామం వెళ్ళుదమనుకుని స్వామిని ఆనతిని పుచ్చుకున్నారు. శుభముహూర్తం చూచి బాలికలిద్దరూ రాకుమారిక పాదాలకెరగి ఆమె అనుమతి నందుకొని కోట్యరథము కృష్ణకావల నెక్కి సాలగ్రామం బయలుదేరారు.

*యశోద నాగరిక:* *ఏమే వదినా!*
*తారానిక:* *ఎందుకే సుదతీ!*
*యశో:* *ఏమిటే ఆలోచిస్తున్నావు?*
*తారా:* *నీ అందాన్ని గూర్చి.*
*యశో:* *నా అందమా?*
*తారా:* *నీ అందమే వదిన*
*నీ అందమే! సుదిన*
*మే నేను నినుచూచి*
*చూచినప్పుడో కాణాచి!*
*యశో:* *కాణాచి నేనై తే*
*జాణ వీవగుదువే*
*అంగజుని బాణమా*
*చందురుని కిరణమా?*

రథాశ్వాలు వీరి పాటలు వింటూ నెమ్మదిగా నడుస్తున్నవి.

## 7

**య**శోదనాగనిక తలవంచుకొని దారిలో కాల్చిన జొన్నకంకుల ఊచబియ్యం నములుతూ "ఈ చేను లేగాపుది. అందుకనే జొన్నబియ్యం మారుచిగా ఉంది. పైరు పొలాలన్నీ ఏపుగా వస్తున్నాయి. సంక్రాంతి పండుగ ముందరనే కోతలైపోతాయి" అని చెప్పి తలెత్తి తారానికను చూచింది.

తారానిక నవ్వుతూ "మంచి రుచిగా ఉంది. ఈ ఊచబియ్యం పంట దినాల్లో పొలాలకు పోయి బాలబాలికలు ఈలా తింటూ ఉంటారా?" అని ఆ బాల యశోద నాగనికను ప్రశ్నించింది.

"వానాకాలంలో పొలాలకు పని ఉన్నవాళ్ళు తప్ప మరి ఎవరూ వెళ్ళరు. శీతకాలం వచ్చిందీ అంటే మా పల్లెటూళ్ళ వాళ్ళందరూ పొలాలలోనే కాపురాలు పెడ్తారు."

"అప్పుడు తినే ఫలహారాలు ఏమిటి యశోదా?"

"లేత కందికాయలు కాల్చుకుని గింజలు వలుచుకు తింటాము. అలాగే సెనగలు, పెసలు, బొబ్బర్లూ, ఊచబియ్యమూ తింటాము. ఒసేతారా, అప్పుడు బంతిపూలు, చేమంతులు, పొగడబంతులు, సీతామ్మవారి జడపూలు, పొద్దుతిరుగుడులు మా పొలాలంతా నిండి ఉంటాయి. ఆ పూలు జడలో కుట్టుకుంటాము. చెవులలో పెట్టుకుంటాము. జడకుచ్చులకు అలంకరిస్తాము.

"మీ పల్లెటూరి జీవితము వింటే నాకు నోరు ఊరుతోంది. ఇంకా పొలాల్లో జనులు కాపురాలు ఉన్నారే?"

"ఆ! చాలామంది వేసవికాలంకూడా పొలాల్లో గడిపివేస్తారు. ఆ తాటాకుల పాకలన్నీ అందుకే."

"తాటాకుల ఇళ్ళు అసహ్యంగా ఉండవూ?"

"ఎంత చల్లగా ఉంటాయనుకొంటావు! మా మోటబావులలో నుంచి చల్లటినీరు తోడుతూ ఉంటారు. పొలాల్లో దిమ్మలమీద మామిడితోటలూ, నాగరంగం తోటలూ ఉంటాయి. పొలాల కంచెలలో సీతాఫలము, కలిమి కాయలు విరివిగా ఉంటాయి."

"నన్ను ఊరించేస్తున్నావే!"

"ఈపాటికి మా అన్నయ్య యుద్ధయాత్రనుంచి తిరిగివచ్చి ఇల్లు చేరి ఉంటాడు."

"ఆ సైన్యంలో మీ అన్న ఉన్నారా?"

"అవునే! బ్రహ్మదత్తప్రభువు అంగరక్షకులలో ఉన్నాడుగా!"

"అయితే ఇంటికి ఏలాగు రావడం?"

"యుద్ధయాత్రలు లేనిదినాల్లో స్వగ్రామాలకు వెళ్ళవచ్చునుగా?"

"మీ అన్నగారు ఇంటికి వెడుతున్నానని విజయపురంలో నిన్ను కలుసుకొని తెలిపినారా?"

"నీవు దగ్గరలేకుండా నన్ను ఎవరు కలుసుకున్నారే?"

"అయితే నీకు ఏలా తెలిసింది?"

"నాకు ఏలా తెలుస్తుంది? ప్రతిసంవత్సరమూ వసంతోత్సవాలకు మా అన్న మాగ్రామం వెడుతూ ఉంటాడు."

"నువ్వూ వెడుతూ ఉండేదానవుగా?"

"అదుగో అప్పుడే మా చిట్టన్నను కలుసుకోవడము."

***తారానిక : ఎవరే ఆ చిట్టన్నా***
***ఆ పొట్టన్నా?***
***ఎంత పొట్టిగా ఉంటాడే?***
***ఎంత చిట్టిగా ఉంటాడే?***
***యశోద : నీ చిన్న కొంగులో ఇమిడేనే***
***మాచిట్టన్న***
***మా గట్టన్న***

*నీ కొప్పు పూలలో తుమ్మెదలా*
*నీ చెవులను వెలిగే తమ్మటలా*
*మా చిట్టన్నా*
*మా గట్టన్నా!*

"మీ అన్న నా కొప్పుపూవులో తుమ్మెద అయితే ఉప్పన ఊదేస్తా."

"నీ పెదవి కుట్టి వదులుతాడు."

"ఈ అల్లరి మాటలు చాలించు."

"నీకు అంతకోపంవస్తే గడ్డంక్రింద బెల్లం గెడ్డ పెట్టి బ్రతిమాలు కుంటాలే."

రథం సాలగ్రామం ఊరిబయటకు వచ్చింది. సాలగ్రామంలోనూ, గ్రామం చుట్టూ పొలాలోనూ తాళవృక్షాలు నిండి ఉన్నాయి. ఆ చెట్లను వింతగా చూస్తూ తారానిక, ఈ చెట్ల ఆకులు పాకలూ, పందిళ్ళూ వేసుకోడానికి పనికివస్తవి కాబోలు అంతేనా?" అని అడిగింది.

"ఈ చెట్టు నిలువునా ఉపయోగం తారా! తాటిపళ్ళు వానాకాలంలో తింటాము. వేసంకాలంలో లేతనీటిముంజెలు అమృతమే. ఈ చెట్ల దొలకలూ కమ్మలూ చక్కని వంటసరుకుగా ఉపయోగిస్తాయి. పళ్ళలోఉండే టెంకలు చెట్ల విత్తనాలు ఈ విత్తనాలు పాతినప్పుడు మొక్క రాబోతున్నప్పుడూ అవి బద్దలుకొడితే అమృతమువంటి బుఱ్ఱగుంజు వస్తుంది. లేతమొక్కలు అకులు వెయ్యకమునుపు తేగలంటారు. అవి కాల్చుక తింటే పిండివంట లెందుకూ పనికిరావు. నువ్వు వట్టి పట్నంవాసం దానవు. నీకేమి తెలుసు మా పల్లెటూరి జీవితాల అందమూ, రుచీ!"

"మళ్ళా నోరు ఊరించేస్తున్నావు."

"ఉండు. మా పశువులుదొడ్డిలో, జొన్నచొప్ప, వట్టిగడ్డి, కందికంప నిలవ చేసుకొనే పెద్దదొడ్డిలో ఒకపక్క తేగలపాతళ్లు ఉన్నాయి. ఆ పాతళ్లలో తేగలు, బుఱ్ఱగుంజూ దొరుకుతాయి. రుచి చూద్దువు కాని."

రథం యశోదనాగనిక ఇంటిముందు ఆగింది. ఇంటిలోనుంచి పిల్లలు, "చిన్నత్త వచ్చిందో" అంటూ రథందగ్గరకు పరుగెత్తుక వచ్చారు. ఇంటి చాకళ్ళువచ్చి సామాను లోపలికి చేరవేశారు. యశోదనాగనిక తల్లి వచ్చి ఇరువురు బాలికలకు పారాణినీరు దృష్టితీసి లోనికి తీసుకుపోయింది. "పట్నం నుంచి ఏమి పట్టుకువచ్చావు చిన్నత్తా" అని ఒక చిన్న బాలకుడు. యశోద ఒక బిడ్డ తరువాత ఇంకోబిడ్డను ఎత్తుకొని ముద్దులాడి, రాకుమారి మహానస గృహానవుండే అపూపాలు మొదలయినవి లక్కబరిణలలో నుంచి తీసిబిడ్డలకు పెట్టనారంభించింది. ఇంతలో ఆగది గుమ్మందగ్గరకు ఒక ఆజాను బాహుడగు యువకుడు అందాల మిసిమివయసువాడు వచ్చి "చెల్లీ, ఎప్పుడు వచ్చావే?" అని ప్రశ్నించినాడు.

## 8

"అదుగో మా చిట్టన్న" అని కలకలలాడుతూ యశోదనాగనిక అన్న చెంతకు ఉరికింది. నాగదత్తుడు చెల్లెలిని హృదయమునకు చేర్చి, భుజములుపట్టి సువ్వున పైకి ఎత్తివేసినాడు. యశోదే మంచి ఒడ్డూ పొడుగూ గల దిట్టరిపిల్ల. ఆ బాలిక అన్నగారిముందు చిన్న బిడ్డలా ఉంటుంది. ఒక్క ఎగురు ఎగరవేసి ఆ బాలికను క్రిందికి దింపాడు. ఇందతా ఆశ్చర్యంగా తారానిక చూస్తూ నిలుచుంది.

"చిట్టన్నా! ఈ అమ్మాయి తారానిక. నా స్నేహితురాలు. మేమిద్దరం రాజకుమారిగారి నగరులో కవలపిల్లలం" అని యశోదనాగనిక నవ్వుతూ స్నేహితురాలి దగ్గరకు పరుగెత్తి "తారా! మా చిట్టన్నయ్యను చూచావా? ఈయనగారు గొప్పవీరుడు" అన్నది.

తారానికను రెప్పవాల్చకుండా నాగదత్తుడు చూస్తూ అలాగే నిల్చున్నాడు. అతని చూపులలోని తైక్ష్ణ్యము చూచి తారానిక తల వంచేసింది. ఆమె మోము కెంపువారింది. ఈ బాలిక ఎంత అందంగా ఉంది! ఈమె కృష్ణానది కెరటం కాదుగదా అని నాగదత్తుడను కొన్నాడు. ఈ బాలిక ఇన్నాళ్లనుంచీ ఎక్కడ ఉంది? ఈమె మహాయుద్ధంలో విజయం పొందిన సేనాపతి నవ్వులా ఉంది. మెరుగుపెట్టిన కృపాణంలా ఉంది. ఈమె సావాసంచేసి తన చెల్లెలు ఎంత అదృష్టవంతురాలయింది. ఈమె మహావేగంతో వెళ్ళేపారశీకాశ్వం యొక్క నడకలాఉంది. ఈ బాలిక తన ఇంటికిరావడంవల్ల ఈ ఏటి వసంతోత్సవం నిజమైన వసంతోత్సవం కాబోతున్నది. ఈమె వసంత వనంలో పూచిన పూవులన్నీ ఒకచోట ప్రోగుచేసినట్లుగా ఉంది అనుకున్నాడు.

ఏమిటీ ఇంత అందంగా ఉన్నాడు! పల్లెటూళ్లలో ఇంత అందమైన పురుషులు ఉంటారా? ఎంతబలమో అతనికి, ఎంతచక్కని సోగమీసాలు! అ విశాలమైన వక్షం ఏనుగు నుదురు జ్ఞాపకం తెస్తోంది. సింహవక్షంలా ఉన్నది. సింహమంత బలమైనవాడా? అని తారానిక ఆలోచించుకొంది.

పల్లెటూరంత అందమైన ప్రదేశం ఇంకోటి లేదనుకొంది తారానిక. దినమూ తారానిక గదిలోనికి తంగేడూపూలు, అడవిమల్లెలు, కలిమిపువ్వులు, సూర్యకాంతాలు, చేమంతులు, చెట్టుసంపెంగ పువ్వులు దొంతర్లు దొంతర్లు వచ్చేవి. ఇవి ఎక్కడనుంచి వస్తున్నాయో తారానికకు తెలుసును. తారానికకు చలిదిఅన్నము, ఊరగాయ, గేదెపెరుగు అలవాటయింది. ఉదయమే స్నానం చేసేది. స్నేహితురాలూ తనూ తల దువ్వుకొనేవారు. చక్కని వస్త్రాలు కట్టుకొని చలిదిబువ్వలు ఆరగించడానికి పోయేవారు. తిరిగి వారిరువురూ గదిలోనికి వచ్చేసరికి తారానిక మంచంమీద పూలగుత్తులుండేవి. తారానికకు ఈ పూలు ఎల్లా వస్తున్నాయో స్వయంగా చూడాలని బుద్ధిపుట్టింది. ఒకరోజు యశోద భోజనం చేస్తూంటే తారానిక, "తింటూ ఉండు పని ఉంది యశోదా"అని ఆరగించకుండా పరుగున వచ్చి తమ గదిలో మంచంక్రింద దూరి కూర్చుంది.

అలా దాక్కొందో, లేదో నెమ్మదిగా అడుగువేసుకుంటూ నాగదత్తుడా గది చొచ్చి, తారానిక దాగిన మంచం దగ్గరకువచ్చి, తిరిగి నెమ్మదిగా అడుగు లిడుచు వెళ్ళిపోతూ

ఆగినాడు. అతని పాదాలు ఆమె తోలు పెట్టెకడకు దారి తీసినాయి. భోజనానికి వెళ్ళుతూ తారానిక పెట్టెతాళ్లు ముడివేయలేదు. నాగదత్తుడు పెట్టెకడ వంగి పెట్టెతెరచి, అందులో నుండి ఏదో తీసుకొని, మళ్ళీ పెట్టెమూత నెమ్మదిగా వేసి, పిల్లి అడుగులు వేసుకుంటూ గదిగుమ్మందాటి వెళ్ళిపోయినాడు.

తారానిక చటుక్కున మంచంక్రిందనుంచి వచ్చి పెట్టెతెరచి ఏమి తీసుకొనివెళ్లి ఉంటాడు అని వెదకింది. తాను ప్రయాణమై వచ్చిన దినాన కట్టుకొన్నస్తనవల్కల మామె కాపెట్టెలో కనిపించలేదు. ఆ బాలిక చిరునవ్వు నవ్వుకుంటూ గుండె కొట్టుకుంటూ ఉండగా భోజనాల సావిడికడకు పరుగెత్తింది. యశోద భోజనం చేయకుండా కూర్చుని ఉంది.

**యశోద:** ఎందుకే వెళ్ళావు? ఇంతసేపు చేశావు?

**తారానిక:** నా వల్కలం ఒకటి ఎక్కడుందా అని జ్ఞాపకం వచ్చి వెళ్ళి వెదికాను. ఎక్కడా కనబడలేదు.

**యశో:** చాకిరేవుకు పోయిందేమో!

**తారా:** అబ్బే, అది మొన్ననే చాకలిది పట్టుకువచ్చింది.

**యశో:** ఎక్కడ పెట్టావు?

**తారా:** తోలు పెట్టెలో.

**యశో:** ఆహఁ! చిత్రంగా ఉందే! మా ఇంటిలో ఏవీ పోవే. తిన్నగా వెదికావా?

**తారా:** ఆ.

**యశో:** నేను వచ్చి వెదుకుతా ఉండు. ముందర భోజనంచేయి.

ఇద్దరూ భోజనం చేసినారు. తరువాత ఇద్దరూ వెళ్ళి గది అంతా వెదకినారు. ఇల్లంతా వెదకినారు. ఆ స్తనవల్కలం ఎక్కడా కనబడలేదు. లోపల నవ్వుకుంటూ తారానిక స్నేహితురాలితో కలసి ఇల్లంతా వెదికింది. ఎక్కడ కనబడుతుందో ఆమెకే తెలుసును. తారానికకు అల్లరిచేయాలని బుద్ధిపుట్టి, నాగదత్తుడు పొలానికి వెళ్ళి ఒక దినం అదను చూచి, నాగదత్తుని గదిలోనికి పోయి అతని అయుధాలలో ఒక చక్కని ఛురికతీసి, తన గదికి కొనివచ్చి, ఆమె అలంకారపు చందుగలో దాచుకొన్నది. ఆ మరునాడు నాగదత్తుడు అన్నబిడ్డలను, వసంతోత్సవానికై వచ్చిన తన పెద్దతోబుట్టువు బిడ్డలను, అన్నలను, యశోదను, తల్లిని ఇంట్లో పనివాళ్ళను అందరినీ తన చిన్న కత్తిని తీసినారా అని అడగడం, గడబిడ చేయడం చూచింది. తనలో తాను చిరునవ్వు నవ్వుకుంది. తన గదిలో ఏమీ ఎరుగనిదానిలా పువ్వులు గుచ్చుకుంటూ కూర్చుంది. నాగదత్తుడూ చెల్లెలు యశోదా మాట్లాడే మాటలు వింటూంది.

**నాగదత్తుడు:** ఎల్లా పోయింది చెల్లీ?

**యశోద:** అదే నాకు ఆశ్చర్యం వేస్తూంది.

**నాగ:** ఆ ఛురిక చాలా మంచిది సుమా.

**యశోద:** సేనాపతి నీకు ఇచ్చినది కాబోలు

**నాగ:** అంతకన్నా ముఖ్యం. విజయదశమి వీరోత్సవాలలో మొదటి వాణ్ణిగా నెగ్గినందుకు మహారాజుగారిచ్చిన బహుమతితోపాటు ధనక ప్రభువు తను ఛురికనే నాకిచ్చారు.

## 9

తాను బ్రహ్మదత్త ప్రభువుతో సలిపిన జైత్రయాత్రా విశేషాలు నాగదత్తుడు చెల్లెలికి, చుట్టాలకు చెపుతూ ఉంటే, తారానిక విననట్లు నటిస్తూ అంతా తన చిన్నారి అందాల చెవులు రెండూ దోరవిప్పి వింటున్నది. తారానికి వినడంలేదని మొదట నాగదత్తుడు కించపడ్డాడు. కాని కొంచెం ఎత్తువేసి చూద్దామని బుద్ధిపుట్టి, కథ చటుక్కున ఆపినాడు. తారనిక తలెత్తి నాగదత్తుని వైపు చూచింది. నాగదత్తుడు సోగమీసాలపై చిరునవ్వుతో ఆమె వైపే చూస్తున్నాడు. ఆమె చకితయై తలవంచేసింది. నాగదత్తుడు 'దొంగాదొరికావు, అని మనసులో అనుకొని, "ఆంధ్రులంటే రాజులకూ, వారి సైన్యాలకూ అడలు. మేము వస్తున్నాము అని వినేసరికి కప్పాలు సరిచేసుకొని, మాకు అర్పించేందుకు సిద్ధంగా ఉండేవారు" అని నాగదత్తు డన్నాడు.

కొంటెపిల్ల తారానిక తలవంచుకునే, "ధనిక ప్రభువుగారి అంగరక్షక సైన్యం అంటే రాజులు కిరీటాలు పారేసి, మడమలకు బుద్ధి చెప్పి అడవులకు ఉడాయిస్తారు" అన్నది. నాగదత్తుడు తెల్ల బోయి, ఒక్క నిమేషం చెప్పడంమాని, ఆ బాలిక హాస్యం అర్థం చేసుకొని, పకపకనవ్వి "విజయపురం కోటలో ఒక చిన్న దుర్గాదేవి వెలిసి రాకుమారిక మందిరంలో ఉందని ఆ రాజులకు తెలిసి, కలగుండుపడి, బిలబిలా పరుగెత్తి నారు" అన్నాడు.

**తారానిక:** (తలవంచుకునే) ఆ దుర్గప్రక్కనే మహాకాళికాదేవి సంరక్షిస్తూ ఉండడంవల్ల, ఆ దుర్గ అంటే అందరికీ భయం.

**యశోద:** నేను కాళినటే తారా?

**తారా:** నేను దుర్గను కాబోలు.

**నాగదత్తుడు:** అది నాకు తెలియదుకాని నేను మాత్రం వీరభద్రుణ్ణి కాను.

అందరూ పకపక నవ్వారు. నాగదత్తుడు తాను చూచిన దేశాలు, ఆ దేశాల ఆ వారాలు, అక్కడి వివాహ విధానాలు, స్త్రీ పురుషుల వర్ణనలు, భాషలు, ఆయా దేశాలలలోని విచిత్రాలు, అక్కడక్కడ తాను విన్న కథలు చెప్పాడు. ఇంత సంతోషంగా నాగదత్తుడు ఉండటానికి కారణం లేకపోలేదు.

బహుమానం పొందిన ఛురికపోయిందని అతడు బెంగపెటుకొని మతిలేని వానిలా తిరిగి ఊరి పురోహితుని ప్రశ్న అడిగినాడు. ఊరికావల ఉన్న ఎరుకలవారి కుటుంబాలలో ఉన్న గట్టుసిరి అనే ముసలిదాన్ని సోది అడిగాడు. గట్టుసిరి పోయిన వస్తువులు పశువులు, ఎక్కడ ఉన్నాయో జోస్యం చెప్పడంలో ఆ చుట్టుపక్కల రాష్ట్రాలన్నిటిలో ప్రసిద్ధి కెక్కింది.

"ఓయి తండ్రీ, నీ సేతిలో యివాహరేకలు దగ్గిర వొచ్చినాయిరా!"

"ఓయి తండీ కొండ దేవత పేరు చెప్పి, కులం దేవతకు దణ్ణమెట్టి సెప్పుతుండానురా!"

"ఓరి బాబయ్యా! నీ కత్తే నీ సత్తి. నీ సత్తే నీ కత్తి బాబయ్యా!

"ఓరి అప్పా! ఒక యేలుకాదూ, రెండేళ్ళుకావు ఏళ్ళ మద్దెనె ఉంది నీ కళ్ళకాణాసీ!"

"ఓరి తండ్రీ! ఎరుకది సెప్తా ఉండది ఇనుకోరా! నీ సిన్న కత్తికీ, సిన్నదానికీ సంబంధం ఉంది కాదట్రా! నీ సిన్నకత్తే సిన్నదైతే, సిన్నదానిని నేలుకోవంట్రా!"

ఈ విధంగా గట్టుసిరి సోదె చెప్పింది. ఆ ముసలి ఎరుక చెప్పిన మాటలవల్ల అతని హృదయం మరీ అగమ్యగోచర స్థితిలో పడింది. తన చిన్నకత్తికి, చిన్న దానికి సంబంధమేమి అని ఆలోచించుకుంటూ నాగదత్తుడు ఇంటికి వచ్చి, గుఱ్ఱం దిగి గుఱ్ఱపువానికి అప్పగించినాడు ఇంట్లో ఎవ్వరూ లేరు. వంటలూ, భోజనాలూ పొలంలోనే అని పాలేరు చెప్పినాడు. వెంటనే నాగదత్తుడు లోనికిపోయి వస్త్రాదికాలు సేకరించుకొని పొలానికి పట్టుకుపొమ్మని ఆజ్ఞ యిచ్చి, తాను ఆలోచించుకుంటూ పొలము వెళ్ళినాడు.

ఆ పొలంలో వంటలు జరుగుతున్నాయి. పిల్లలు ఆడుకొంటున్నారు. యశోద నాగనిక, తారానిక ఎక్కడా కనబడలేదు. వాళ్ళిద్దరు ఎక్కడున్నారని తన మేనగోడలి నొక బాలిక నడిగి, వీరి పొలం ప్రక్కప్రవహించే చిన్న కొండ ఊటవాగువైపు పోయినారని తెలుసుకుని, వారిని వెదుక్కుంటూ వెళ్ళినాడు. ఆ వసంతం ముందు మాఘమాసోదయ శీతలతపోయి, మత్తయిన ఉదయపు ఎండ కాస్తున్నది. ఆ ఉదయం జాము ప్రొద్దు ఎక్కింది. నాగదత్తు డా చిన్నవాగుదగ్గరకు పోయినాడు.

ఆ చిన్న వాగు కీవలావల దట్టంగా చెట్లు పెరిగి ఉన్నాయి. నాగదత్తుని తండ్రి ఆ వాగుప్రక్కనే తములపాకుల తోటలు వేయించాడు. ఆ తోటలోని ఆకు ఆ ఊరివారికే కాకుండా ఆ చుట్టుప్రక్కల గ్రామాలన్నిటికీ ఎగుమతి అవుతుంటాయి. ఆ తమలపాకుల తోటల ఎదుట వాగు. వాగు కావలిగట్టు పక్కగ్రామం వారిది. అక్కడా ఎన్నో తమలపాకుల తోటలున్నాయి. ఆ తోటలలో నాగదత్తుడు వెదకుతున్నాడు. అతనికి ఎక్కడా కనబడలేదు.

ఆ చిన్నవాగు గలగలా రాళ్ళమధ్య ప్రవహిస్తున్నది. చిరుపాటలు పాడుకుంటున్నది.

*"జగమంత ఆటలే*
*జగమంత పాటలే*
*అందచందాల ఆనందమే జగము"*

అని వాగు పాడుతున్నదనుకొన్నాడు. ఆ పాటలో ఏదో గుసగుసలు వినిపించాయి.

**మొదటి గుసగుస:** అందుకని దాచానూ.

**రెండో గుసగుస:** మంచిపని చేశావు. మా అన్నయ్య బెంగపెట్టుకున్నాడు, నిజంగా పోయిందనుకుని.

**మొదటి:** నా వల్కలం తీసి దాచవచ్చు నేం పాపం?

**రెండో:** ఎందుకు దాచాడో మరి?

**మొదటి:** నేనూ అందుకే.

నాగదత్తుని గుండె జల్లుమంది. ఎక్కడ నీ గుసగుసలు? నెమ్మదిగా అతడా చుట్టుప్రక్కల ప్రదేశం వెదక నారంభించాడు. ఆ వాగుమధ్య అనేకమైన బండరాళ్లు పడిఉన్నాయి. ఓ పెద్ద బండరాయి చాటున నీళ్ళలో ఉన్న ఒక రాతిమీద కూర్చుండి యశోదా, తారా మాట్లాడుకోవడం గమనించాడు. నాగదత్తుడు చప్పుడు కాకుండా ఆ పెద్దరాతికి ఈవలప్రక్క చేరి గొంతు కెత్తినాడు.

## 10

*పట్నవాసంపిల్ల*
*పల్లెటూరొస్తేను*
*ఊరంత విరగబడి*
*తారుమారై పోయె.*

*నగరవాసంపిల్ల*
*నవ్వితే ముత్యాలు*
*నాట్యమాడే కళ్ళు*
*నక్షత్రకాంతులే.*

*నగరవాసంపిల్ల*
*సొగసుదిద్దినపిల్ల*
*వగలుపోయేపిల్ల*
*నగవు కులికే పిల్ల.*

అని పాడినాడు. వెంటనే రాగమూ వరసా మార్చి –

*"ఓ అందాలా దేవకన్యా*
*చందురూనే ఎక్కిరిస్తా ?*
*మందు పెట్టీ మనసూ లాగేవా?*
*మాయచేసీ మాటాలాదేవా?* ఓ అందాలా....

*ఓ పట్నవాసం బంగారుపిల్లా*
*పల్లెటూరూ రాజ్యంచేశావా?*
*ఘల్లుమంటూ గంతూ వేసేవా?* ఓ అందాలా....

*ఓ దొంగవారీ రాచకన్నే*
*దోచుతావ మనసూ ప్రాణాలూ?*
*దాచుతావ మనసూ మర్మాలు* ఓ అందాల....

*ఓ చిన్నారి వయసుదానా*
*వన్నెల చిన్నాదానా*
*ఎక్కడీవే నీకీ అందాలూ*
*చుక్కల్లో తేలివచ్చావా?*
*ఓ అందాల దేవకన్నే?*

అని గలగల నవ్వినాడు.

ఈ పాట ఒళ్ళు పరవశం అయిపోగా విన్నది తారానిక. తా మెక్కడ ఉన్నదీ నాగదత్తునికి తెలియకూడదని యశోద నాగనిక నోరు మూసి "ష్" అని చేయితీసివేసింది.

ఇంకా దొంగమాటున ఉండదలచుకుందనీ, తన చెల్లెలినికూడా మాట్లాడవద్దన్నదనీ నాగదత్తుడు క్షణికంలో గ్రహించాడు. అతనిలో మత్తులు తాండవించాయి. కన్నులు బరువెక్కాయి.

*"ఘలఘలఘల కదిలిరావ*
*ఢళఢళఢళ తరలిరావ*
*పసిడి వొంటి పడుచుదాన*
*మిసిమి వయసు సోకుదాన."*

యశోద పట్టలేక పకపకమని నవ్వింది. తారానిక కొండవాగులా మిల మిలల తళతళల నవ్వు నవ్వింది. నాగదత్తుడు "హహో, ఓహో" అని ఉరుము లురిమినట్లు నవ్వాడు. బాలిక లిద్దరూ లేచి నిలిచినారు.

**తారానిక:** పెద్దపులి వచ్చిందేమో అని అడిలిపోయాను.
**నాగదత్తు:** కోకిల గుంపు వచ్చిందేమో అని ఉప్పొంగిపోయాను.
**యశోద:** మీ ఇద్దరికీ మతిపోయిందేమోనని బేజారయ్యాను.
**నాగదత్తు:** ఇంతకీ నా చిన్నకత్తి తీసిన అందాలదొంగ దొరికింది. అదే సంతోషం.
**తార:** నా వల్కలం తస్కరించుకొని పోయిన ముచ్చు దొరికాడు. అదీ నాకు విచారం.
**యశోద:** అన్నయ్యకు సంతోషం ఏమిటీ, నీకు విచారం ఏమిటీ?
**నాగ:** నా కత్తి నాకు దొరికినందుకు సంతోషం, కాదుటే చెల్లీ!
**తార:** ఆడవాళ్ళ వల్కలం మొగవాళ్లు ఎత్తుకుపోవడం విచారం కాదుటే నాగవల్లీ!
**యశోద:** మా అన్నయ్య వీపుతట్టనా, నీకు కన్నీరు తుడవనా?
**తార:** పాపం మీ అన్నగారి వీపుతట్టు లేకపోతే నవ్వి నవ్వి వీరులకు పొరమారుతుంది.
**నాగ:** మీ స్నేహితురాలు కన్నీళ్ళు తుడు ముందు. లేకపోతే ఆ నీళ్ళతో ఈ వాగుపొంగి మన ఊళ్ళన్నీ మురిగిపోతాయి.
**యశోద:** ఉండండి ఇక్కడే. తట్టటానికీ తుడవడానికీ కావలసిన వస్తువులు పట్టుకువస్తాను, అంటూ తుఴ్ఖున పారిపోయింది. "నేనూ వస్తాను ఉండవే" అని తారానిక ఆమెవెంట పారిపోబోతూంటే, నాగదత్తుడు చేయి పట్టి ఆపినాడు.

"నా చేయి వదలండి."

"ఇది నాచేయి."

"మీ చేయి ఏలాగు?"

"నేను వరించిన చేయి నాదికాదా ఏమిటి?"

"అయితే మీకు ఎన్ని చేతులు దక్కి ఉంటాయో?"

"రెండే రెండు చేతులు తారా!"

"నా పేరు తారానిక."

"నా పేరు నాగదత్తుడు. అయితే ఏమి, నేను నాగయ్యను. నువ్వు నాకు దారి చూపే చుక్కల రాణివి."

"మీరు చుక్కల్లో చంద్రుడు."

"నాకు ఒక్కటే చుక్క, చక్కని చుక్క."

"మీ ముక్కలు మాబాగున్నాయి. నేను చుక్కనేగాని వెలుగులేని చుక్కను."

"నా జీవితమంతా వెలిగే చుక్కవు."

"నా చెయ్యి వదలరా ఏమిటి?"

"క్షమించు. ఏదో పువ్వు చేత్తో పట్టుకున్నట్టుంది."

"చూడండి, నా మణికట్టు ఎలా కందిపోతోందో."

"ఆమె నవ్వుతూ పెదవులు పూవులా ముడిచింది.

"అయ్యో ఎఱ్ఱటిగాజు ధరించినట్టు కందింది. నేను వట్టి బండవాణ్ణి."

"ఎవరండీ మిమ్మల్ని బండవారనేది? మీ చెల్లెల్ని పువ్వులా ఎత్తేశారు."

"నిన్నూ ఎత్తుతాను చూడా."

నాగదత్తుడు ఆమె నడుం రెండుచేతులతో పట్టి సువ్వున పైకి ఎత్తి వేశాడు.

"నన్ను దింపండి. నాకు భయమేస్తోంది, ఎవరన్నా వస్తారు."

"ఎవరు చూడవస్తారు" అని ఆమెను తన హృదయం మీదకు దింపుకొని, గట్టిగా అదుముకొని, ఆమె పెదవులను గాఢంగా చుంబించినాడు. ఆ బాలిక కళ్ళు మూసుకుని మళ్ళీ ముద్దులిచ్చింది. అతడామెను ఎత్తుకొని తన చెల్లెలూ ఆమే కూర్చుండిన రాతిమీదకు తీసుకువెళ్ళి అక్కడ కూర్చుండ పెట్టి ఆమె ప్రక్కనే కూర్చున్నాడు.

"మీరు ఒక పరాయి అమ్మాయిని ఈలా చేయవచ్చునా?"

"నేను ఇదివరకు ఏ అమ్మాయినీ ఈలా చేయలేదు. నువ్వు నాకు పరాయి అమ్మాయివి కావు. మనం క్షత్రియులం. నా ఖడ్గాన్ని నువ్వు దాచావు. నీ వల్కలాన్ని నేను దాచాను. ఇంతకన్న గాంధర్వ వివాహం ఏం కావాలి?"

"మనిద్దరికీ వివాహమే అయిపోయిందా! ఇదెక్కడ శాస్త్రమండీ?"

"ఆపస్తంభుల సూత్రం. వివాహంకాని బాలిక స్తనవల్కలం తీసుకొన్నవాడు ఆమెను వివాహానికై అడిగినట్లు, ఆమె ఖడ్గం తీసుకుంటే ఒప్పుకున్నట్లు. ఇదే గాంధర్వం."

"అమ్మయ్యో! మా నాన్నగారు నన్ను చీల్చివేస్తారు."

"ఎందుకు?"

"గాంధర్వ వివాహం చేసుకొని..."

"చేసుకునీ?"

"చేసుకుని.... ఆ.... భర్త.... భార్యను గట్టిగా హృదయానికి అదుముకోనందుకు."

"ఆసి దొంగా!" అతడామెను గాఢంగా కౌగిలించుకొని ఒళ్ళు వేడెక్కి మత్తెక్కి ఆమె తలను తన చెంపలకు గాఢంగా అదుముకొన్నాడు. ఇంకా కొంత సేపు ఇద్దరూ ఉంటే ఏమవుతుందో అని ఆ బాలికా, అతడూ ఒక్కసారిగా అనుకొని ఒక్కసారిగా లేచారు. యశోద "తారా! అన్నా!" అంటూ కేకవేసుకుంటూ వచ్చింది.

★ ★ ★

## తృతీయభాగం

# రతీదేవి

అడవి బ్రహ్మదత్తుడు మహారాజకుమారికకు మరల విద్య ప్రారంభించవలెనా, వలదా? పదినెలలు అంతరాయం వచ్చింది. తాను ఏమొగం పెట్టుకొని వెళ్ళి ఆమెకు పాఠం చెప్పగలడు? వసంతుడైన పురుషుడు వనరముగా ఒక బాలికను ఎన్నుకుంటే, ఆ బాలికను భార్యగా ఎన్నుకొన్నాడన్నమాటే. ఆ స్వయంవరాన్ని పెద్దలుకూడా కాదనలేరు. సగోత్రీకురాలిని ఎన్నుకొనగూడదు. తాను వివాహంకాదలచుకొన్న బాలికనే ఎన్నుకోవాలి. మన్మథుడుగా ఎన్నాకైనవాడు రతీదేవిని ఎన్నుకొన్నా అంతే. బ్రహ్మదత్త ప్రభువు రతీదేవిగా రాజకుమారి ఇక్ష్వాకు శాంతిశ్రీని ఎన్నుకొని లోకానికి ఆమెనే తాను ప్రేమించినది అని నిరూపించినాడు. అది ఎంత ద్రోహము, ఎంత నీచకార్యము? లోకంతో సంబంధం లేక యోగినీహృదయంతో జీవించే ఒక బాలికను, సమస్త బాలికాలోకం ఎదుట రతీదేవిగా ఎన్నుకొని తాను సలిపిన పాపానికి నివృత్తి లేదు.

ఆ దినాన తనకట్టి హీనబుద్ధి కలగడానికి కారణమేమి? తన హృదయాంత రాళాలలో ఆమెపై వలపు ఉన్నదన్న మాటేగదా? ఆ వాంఛను దాచుకో లేని, వాంఛను నాశనం చేయలేని దుర్బలత్వం తనలో ప్రవేశించింది. అది తథ్యము. ఎంత అంద మా బాలికకు? లోకంలో యుగానికొక బాలిక అంత అతిలోక సౌందర్యవతిగా ఉద్భవిస్తుం దేమో? అదివరకు మహారాజు తనయ జగదద్భుత సుందరి అని చెప్పుకొనే మాటలు విన్నప్పుడు తన కేవిధమైన స్పందనమూ కలుగలేదు. కాని, తన్ను మహారాజు ఆ బాలికకు గురువుగా ఉద్దేశించి తమ రాజహర్మ్యానికి తీసుకొని వెళ్ళినప్పుడు, ఆ దివ్యసుందర గాత్రను చూచినప్పుడు, తన కళ్ళు మిరుమిట్లయి తక్కిన లోకం అగోచరమై పోయింది.

ఆ బాలిక అందం హిమాచలశృంగస్వరూపమైంది. ఆ అందం మానవ మాత్రులకెట్లు సన్నిహితం కాగలదు? ఆమె హృదయం వజ్రాయుధపు తునకలు కరిగించి పోతుపోసి ఉండవచ్చును. సూర్యబింబాన్ని తన కొమరితకై తురిమినప్పుడు ఆ తురుముడు పోగుచేసి ఆమె మెదడు చేసి ఉంటాడు దాత. ఆమెలో రక్తం ప్రవహిస్తూ ఉంటుందా, లేక కరిగించిన సూర్యకిరణాలు ప్రవహిస్తూ ఉంటాయా? తాను వెఱ్ఱిబాగుల వానిలా ఆ బాలికను రతీదేవిగా ఎన్నుకొన్నంత మాత్రాన ఆమెలో మానవ చైతన్యం తీసుకువచ్చి, స్వచ్ఛమైన ఆమె చెంపలలో కల్హారాలు విరియపూయిద్దా మనుకున్నాడు.

బ్రహ్మదత్తుడు ఉస్సురని లేచినాడు. ఈ పదినెలలు ఆ యువప్రభువు పడినవేదన వర్ణనాతీతము. ప్రేమను దగ్గరకు రానీయక శ్రీకృష్ణ భగవద్బోధితమయిన స్థితప్రజ్ఞత్వము తన ఆశయంగా పెట్టుకొని సన్యాసాశ్రమ స్వీకారము త్వరలో పొందదానికి నిశ్చయించుకొన్న తనకు ఎక్కడనుండి వచ్చినదీ అవస్థ? ఆ బాలికకు ఆ దినాన ఏదో నిర్వేదము కలిగినందుకు తామందరు సంతోషించినామని వీరపురుషదత్తుడు తెలిపినాడు.

చైతన్యరహితయై నిర్గుణగా ఉండే బాలికకు తనచేష్ట ఎంత అవమానమో కలుగజేసి ఉండాలి. లేకపోతే ఆమె అంతబాధ ఏలాపడి ఉంటుంది?

తాను యుద్ధయాత్రకు పోయి యుద్ధం అంటే భయపడినాడు. ఇది వరకు చిన్నతనంలో తానుచేసిన యుద్ధా లేమంత ఘనమైనవి ఉన్నాయి? తనకు ఎప్పుడు ఇతికర్తవ్యతామూఢత్వమే! ఇతికర్తవ్యతామూఢులు "అవునా కాదా?" అనే కావడికుండల ఒడుదుడుకులలో పడిపోతూ ఉంటారు. తన తాతలు ధీరులు, జ్ఞానసంపన్నులు. ఆదిశేషులులా ప్రజాభారం మోస్తూ ఉండేవారు. తాను భారమే మోయలేని మామూలు నాగమ్మ అయి చక్కా పోయాడు. తన రక్తనాళాలలో రక్తమేనా ప్రవహించేది, లేక పారాణి నీళ్ళా? తన తలలో ఉన్నది మెదడా లేక ఊకఉండా?

రాకరాక తన హృదయంలో ప్రేమ ప్రవేశించింది. ప్రేమ అనే వస్తువు అవసరం లేకుండా తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన బాలికను వివాహం చేసుకొని, సంసారధర్మం నిర్వహిస్తారు ఉత్తమ యువకులు. అట్లుకాక, ప్రేమ అనే రోగం దాపురిస్తే అన్నీ అడ్డం తిరుగుతాయి. శాంతిశ్రీలో చైతన్యం కలిగిందని నమ్మక మేముంది? ఆమెకు ఇష్టములేనిచో తానెట్లా ఆమెను ఉద్వాహం అవడం? ఆమెను విడిచి ధర్మప్రకారం వేరొకబాలికను తానెట్లా వివాహం చేసుకోగలడు? తన హృదయం, బుద్ధి, అహంకారము ఆ బాలికను కోరినాయి. అవి వేరుగా ప్రసరించనేరవు. తాను మనస్సులో నైనా అలా ఊహించలేదు. ఆ బాలిక తండ్రిమాట జవదాటక వివాహానికి ఒకవేళ ఒప్పుకొన్నా తానట్టి వివాహాన్ని ఎలా అంగీకరిస్తాడు?

బ్రహ్మదత్తుడు ఆ బాలిక దివ్యసౌందర్యమూర్తిని తలంచుకొన్నాడు. ఆమె చూపులు తనకు కలిగించిన వేదనను స్మృతికి తెచ్చుకున్నాడు. తానూ, మహారాజూ ఆ బాలికకు బాధను కలుగజేస్తున్నారు. సాధారణ భోజనం విషయంలోనే ఇష్టంలేని పదార్థం తినిపిస్తే పడేబాధ ఇంతింత అని కాదు. అలాంటప్పుడు. వివాహం విషయంలో ఒక బాలికను వ్యథలో ముంచడం కంటె హైన్యం ఏముంటుంది?

త్వరలోనే నామెను భార్యగా కోరననీ ఆమెకు చదువు చెప్పుటకూడా మానివేస్తాననీ మహారాజుకు వార్త పంపాలని బ్రహ్మదత్తుడు నిశ్చయించుకున్నాడు. ఆ నిశ్చయానికి రావడంతోటే పట్టలేని ఆనందమూ భరింపరాని వేదనా రెండూ కలిగినాయి. తన ధర్మము ఏ మాత్రమూ స్వలాభం ఆలోచించకుండా నిర్వహించగలుగుతున్నందుకు, ఒక బాలికకు నిర్మలానందం సమకూర్చడానికి తాను కారకుడు కావడానికీ అతనికి ఎంతో సంతోషం కలిగింది.

ధర్మము పురుషునకై, జీవితము పురుషునకై, రాజ్యము పురుషునకై, మోక్షము పురుషునకై, ఎంతకాలము పురుషులు ఈలా స్త్రీలను తమలో భాగం చేసుకొని తామే సర్వమూ అయి మెలగడం? స్త్రీ పురుషులు సంపూర్ణ సమాన భాగస్వామ్యం పొందడం ఎన్నాళ్ళకో? వేదవిహిత ధర్మాలు ఆచరణలో పెట్టలేని మానవలోకం స్త్రీ విషయంలో ధర్మనిర్వహణం ఏమి చేయగలదు? రాకుమారి తన చదువువలననే బాధపడుతున్నట్లు కనిపించింది. తండ్రిమాట జవదాటకూడదని నిశ్చయించుకొన్న బాలిక కావున తన

గురుత్వం ఒప్పుకొన్నది. కాబట్టి తాను మహారాజుతో రాకుమారికకు చదువు చెప్పుట ధర్మముకాదని తెలపాలి, అని ఆలోచించుకొన్నాడు బ్రహ్మదత్తుడు. ఆ నిశ్చయానికి రాగానే బ్రహ్మదత్తుని హృదయభారం తీసివేసినట్లే అయింది.

ఆనందంతో ఆ సాయంకాలము సముచిత వేషంలో స్కందవిశాఖాయ నక బ్రహ్మదత్త ప్రభువు కోటలోనికి వెళ్ళి మహారాజు దర్శనము నర్థిస్తూ ఆలోచనా మందిరం లోనికి వెళ్ళేసరికి ఇక్ష్వాకు శాంతిశ్రీ రాకుమారి అక్కడ నిలిచి ఉన్నది.

## 2

ఇక్ష్వాకు శాంతిశ్రీ రాకుమారిని ఆంధ్రశాతవాన చక్రవర్తి దాయాది అయిన పులమావిశాతవాహన కుమారుడు రెండేండ్లనాటి వసంతోత్సవాలలో చూచినాడు. ఆ రాకుమారునకప్పుడు ఇరువది అయిదు సంవత్సరాలుంటాయి. వివాహమయినది. బృహత్పాలాయన సామంతుల కొమరితను చేసుకొన్నాడు. ఇరువురు బిడ్డల తండ్రి. ఇరువురు ఆడపిల్లలే.

వాసిష్ఠీపుత్ర శ్రీ పులమావి చక్రవర్తి రెండవకొమరుని మనుమడు. యజ్ఞశ్రీ శాతకర్ణి దివంగతుడు కాగానే తానే రాజ్యం ఆక్రమించుకొందామని దృఢసంకల్పం పూనినాడు పులమావి రాకొమరుడు. అందుకై బృహత్పాలాయనులను, పల్లవులను సాయం అర్థించాడు. కాని మహామండలేశ్వరుడైన ఇక్ష్వాకు శాంతిమూల మహారాజు శ్రీవిజయశాతకర్ణిని చక్రవర్తినిచేసి, జైత్రయాత్రలు సలిపినాడు. శాంతిమూలుని ఎదిరించగల మగవాడు ఎవడు?

విజయశాతకర్ణికి బావమరది అగుటచేకదా శాంతిమూలుడు సహాయం చేసినాడు. శాంతిమూలునకు తాను అల్లుడే అయితే తనకిక కుడిచేయి ఎడమ చేయీ శాంతిమూలుడే. వీరపురుషదత్తుడుకూడ మహావీరుడు. ఇతన్నెవరు తేరి చూడగలరు అనుకొన్నాడు పులమావి రాకుమారుడు.

శాంతిశ్రీ రాకుమారి రూపజిత రతీదేవి. ఓహో! ఏమి సౌందర్యమది! అలాంటి సౌందర్యంచూచి ముగ్ధుడుకాని పురుషుడు ఉండగలడా? ఈ మహాదాంధ్రపథంలోని కవులంతా ఆ బాలికా సౌందర్యం వర్ణించడమే తమకు జన్మసాఫల్యం అనుకుంటారు.

ఆ నాడు తానామెను చూచిన మరుక్షణంనుంచీ ఆ బాలికను గురించే మాట్లాడడంవల్ల నర్మసచివుడు "మహారాజా! తమకు శాంతిశ్రీ జబ్బు పట్టుకున్నదా?" అని గేలిచేశాడు. తాను చక్రవర్తి అగుట అల్లా ఉంచి, ఆ బాలికను వివాహం చేసుకొని తీరవలెనని ప్రతిజ్ఞపూనినాడు.

పులమావి రాకుమారుడు కొంచెం బొద్దుగా, పొడవుగా ఉంటాడు. విశాలమైన ఫాలం, గరుడనాసిక, లంబకర్ణాలు. కాని పెదవులు రెండు గీతలు గీచినట్లు సన్ననివి. అతని గడ్డము చాల చిన్నది. ఆ గడ్డముకూడ ముడుతలు పడి ఉంది అతనికి చేరెడేసి కళ్ళు. కాని లోచనాంగాలలో సౌమ్యస్థితిలేదు. నల్ల గుడ్లు చిన్నవి. అందుకే అతడెప్పుడు అతికోపంతోనో, అతి భయంతోనో చూస్తూ ఉన్నట్లు ఉంటాడు. పైగా కొంచెం మెల్ల

ఉన్నది. పై రెప్పలు ఒత్తు. ఒత్తైన కనుబొమలు. చటుక్కున చూచినపుడు పులమావి రాజకుమారుడు తీక్ష్ణమైన, మనోహరమైన చూపులుకలవాడని అనుకుంటారు. కాని ఆ కళ్ళలో అతి క్రూరమైన పాముచూపులున్నాయి. అతనికి ఇరుపది ముప్పదిమంది అందమైన ఉంపుడుకత్తెలున్నారు. అతడు సర్వదా స్త్రీలోలుడు.

పులమావి రాకుమారుని హృదయంలో ఎంత క్రౌర్యమున్నా పైకి చిరునవ్వు నవ్వుతూనే ఉంటాడు. చిరునవ్వులు ప్రసరిస్తూ వెంటవెంటనే ఎదుటివాని నాశనాన్ని కోరుతూ ఉంటాడు. ఎదుటివాని భావం గ్రహించాలని అతి ప్రయత్నం చేస్తు ఉంటాడు. అసత్యాలాడటానికి వెరవడు. వెనుక నుండి చురకత్తియతో తన గురువునైనా పొడవగలడు పులమావి రాకుమారుడు. రాజకీయాలలో నిర్వహించవలసిన పని లాభకరమైతే చాలు, మార్గమేదైనా సరే!

పులమావి రాకుమారుని ముసికనగరం (నేటి మస్కీ) రాజధానిగా శాతవాహన రాష్ట్రం పాలిస్తున్నాడు. ముసికనగరంలో తన కేళీ మందిరంలో సువర్ణాసనం అధివసించి పులమావి నర్మసచివుడైన నందిధర్మునితో మాట్లాడుతూ ఉండెను.

**పులమావి:** శాంతిశ్రీని మళ్ళీ ఒకసారి చూడాలి. ఆమెను చూడడమే శృంగార కళాసిద్ధి.

**నందిధర్ముడు:** చిత్తం మహారాజా! ఇంక వివాహం ఎందుకు?

**పుల:** ఓయి వెట్టివాడా! భగవంతుడు ప్రత్యక్షమవడమే దుర్లభం. ప్రత్యక్షమగుటే చాలునని భక్తుదూరకుంటాడా చెప్పు. ఆ భగవంతునిలో లయం కావాలి అని కోరుతాడు

**నంది:** మహాప్రభువులు రాజకుమారిలో లయం కావాలి అని కోరుతున్నారా, లేక శాంతిశ్రీయే మహాప్రభువులో లయం కావాలి?

**పుల:** ఓయి విదూషక చక్రవర్తీ! నువ్వు ఏ ఉపాయం ఆలోచిస్తావో. మేము ఆ రాజకుమారిని ఒక పక్షందినాలలో చూడకపోతే....

**నంది:** పక్షవాతం వచ్చినంతపని అవుతుందంటారు ప్రభువులు.

**పుల:** నీ నొసలు వెక్కిరించక మానవు?

**నంది:** మహాప్రభువుల కళ్ళు తామరపూవుల్ని వెక్కిరించినట్లు.

**పుల:** ఉపాయం?

**నంది:** దేవేంద్రుని ఉపాయం.

**పుల:** దేహమెల్లా కళ్ళయి ఊరుకుంటే?

**నంది :** గౌతము దొకడు ఏర్పడితేకదా మహారాజా!

**పుల:** ఓయి మట్టితలకాయా నేనే ఆ గౌతముణ్ణి కాదలుచుకొన్నాను.

**నంది:** మహారాజా ఇంతకూ ఆమె అహల్య కాకపోయినా, ఆమె పోలికలున్న వంటారు.

**పుల:** అంటే?

**నంది:** మహాప్రభూ! ఆమెకు చైతన్యమే లేదట. ఆమెకు మెదడు ఉంది. హృదయంలేని రాయి అంటారు.

**పుల:** మే మాదినాన చూచినప్పుడు ఎక్కువ అభిమానమూ, గర్వమూ ఉన్నదానివలె కనిపించింది.

**నంది:** ఆమె అపురూపు సౌందర్యంచే మహారాజు కన్నులు మిరుమిట్లుగొని ఇతరమును చూడలేక పోయినవి. నిజానికి ఆ కన్య అతిలోక సౌందర్యవతే. వైకుంఠలో భక్తులు నివేదించే వంటకాలకన్న రుచియైన అందం ఆమెది. కాని ఆ వంటకంలో అమృతమూలేదు, కామ దేనువు వెన్నా లేదు, పాలసముద్రంలో పాలూ లేవు, మందారంలోని మకరందమూ లేదు.

**పుల:** వెఱ్ఱిదికాదు. సర్వశాస్త్రపారంగత!

**నంది:** బుద్ధభక్తి ఉన్నది. తండ్రిమాటకు జవదాటదు.

**పుల:** ఇంతకూ ఆ బాలిక ఎలాంటి దంటావు?

**నంది:** పాలులేని పాలసముద్ర మంటాను.

**పుల:** వెన్నెలలేని పూర్ణచంద్రుడు.

**నంది:** వాసనలేని పారిజాతం.

**పుల:** ఆవిడ ఓ విగ్రహమా?

**నంది:** తారుణ్యం, లావణ్యం, యవ్వనం, సౌందర్యం అన్నీ ఉన్నాయి.

**పుల:** అయితే మనం దేవేంద్రుని ఉపాయమే పూనుదాము. మంచి ముహూర్తం చూడు!

## 3

ఇక్ష్వాకు శాంతిశ్రీకుమారి, అప్పుడు బ్రహ్మదత్తుడు తన్ను రతీదేవిగా ఎన్నుకోగానే ఎంతో ఆవేదనకు లోనయింది. ఆమె అట్టి అవస్థనే ఇదివరకు ఎరగదు. హృదయంలో ఉప్పొంగు, మనస్సుకు మంట ఆమె ఎరగదు. అర్థం కాని ఒక ప్రళయగర్జన విన్న కురంగశాంబకంలా ఆమె గజగజలాడింది. ఒక పెద్దరాయిపడిన నూతిలోని నీరుచుట్టూ గోడకు తాకినట్లు ఆమె హృదయము దడదడ లాడిపోయింది. ఆ బాలిక వసంతోత్సవ వేషధారులై ఉన్న యువతీ యువకులను చూచింది. ఆమె కళ్లు ఏదోభయంతో అతివిస్ఫారితలు అయ్యాయి. కళ్ళనీళ్ళు వేడినీటి ఊటలా జివ్వున ఊరినాయి. కెవ్వున కేకవేయబోయి, కుడిచేతితో పెదవులు బిగించుకుంది. బ్రహ్మదత్తుడు వెంటనే రథమెక్కి వెళ్ళిపోయినాడు. యువతీ యువకులు వెళ్ళిపోయినారు. నీళ్ళలో ఊపిరాడనంతవరకూ మునిగిపోయి పైకి ఎలాగో తేలినట్లనిపించింది ఆ బాలికకు. ఆమె కూడా తిన్నగా యింటికిపోయింది.

నిజంగా ఏమి జరిగింది? బహ్మదత్తప్రభువు తన్ను రతీదేవిగా ఎన్నుకొన్నాడు. ఎన్నుకొంటే తన కెందుకంతభయం కలిగింది? భయం కలగడమేమిటి? శాస్త్రగ్రంథాలలో "భయము, కంటినీరు, వణకుట" వీటిని గురించి నిర్వచనాలున్నాయి. ఆ నిర్వచనాలు మాత్రం మా బాలకు ఏమి తెలియజేస్తాయి? పూలదండ మెళ్ళోవేస్తూ బ్రహ్మదత్తప్రభువు చేయి ఆమెకు తగిలినప్పుడు ఆమె దేహంలో ఏదో మహానది ప్రవహించినట్లయిపోయింది. గ్రంథాలలో చెప్పినట్లు, తన బౌద్ధగురువు సెలవిచ్చినట్లు దేహంలోని నరాలు బాహ్యంగా జరిగిన ఒక సంఘటనవలన స్పందిస్తాయి. ఆ నరాలు దేహకందరాలను కదుపుతాయి. అదే జల్లుమనడానికి కారణమని అంటారు. ఏమిటా సంఘటన? బ్రహ్మదత్తప్రభువు

తనమెడలో దండ వేయడమే సంఘటనా? బాలికలంతా తనతో "మన్మథుడు నిన్ను రతీదేవిగా ఎన్నుకొన్నాడు" అని చెప్పినారు.

రతీదేవిగా ఎన్నుకోడంలో అర్థం చాలా ఉందనికదా తాను విన్నది? మన్మథునిగా ఎన్నుకొన్న పురుషుడు, ఒక స్త్రీని రతీదేవిగా ఎన్నుకొంటే ఆమెను తన భార్యగా వరించినట్లు అనీ, ఆ బాలికకు ఆ పురుషునియందు ఎంత ఇష్టములేకపోయినా, ఆ పురుషుడు కోరినట్లయితే అతని భార్య అయి తీరాలని తన తల్లిగారయిన మహారాణి చెప్పినారు. వివాహం అంటే వైదిక ధర్మము ననుసరించి స్త్రీ పురుషులు ఇరువురు కలిసి గృహస్థాశ్రమం నడపుట అని శాస్త్రాలు చెప్తున్నాయి.

శాంతిశ్రీ శాస్త్రపఠన కుశల. అవి ఆమెకు బుద్ధిస్థమైనవేకాని అనుభవానికి రాలేదు. చిన్న బిడ్డలకు ప్రేమ అంటే ఏమిటో తెలుసును. తల్లి ముద్దు పెట్టుకుంటే శిశువు ఆనందం వెలిబుచ్చుతుంది. శిశువులకు పంతం ఉంది గంతులు వేస్తారు. బాలబాలికలు నవ్వుతారు. ఏడుస్తారు. పౌరుషం సిగ్గు అన్నీ ఉంటాయి వారికి. చిన్నతనాన్నుంచీ శాంతిశ్రీకి ఇవి ఏమీ తెలియవు. పదినెలల శిశువుగా ఉన్నప్పుడు చిటికవేసి నవ్విస్తే నవ్వేదికాదు. వెఱ్ఱిబిడ్డ అని అనుకునేందుకు వీలులేదని పండితులన్నారు.

శాంతిమూల మహారాజు దైవజ్ఞులకూ, పండితులకూ, ఆర్యఋషులకూ, బౌద్ధార్హతులకూ తన బాలిక జాతకము చూపించినారు. వైద్యులచేత ఆ బాలికను పరీక్ష చేయించినారు. అందరు ఈమె ఒక విచిత్ర శిశువన్నారు. శాంతిశ్రీ ఆనాటి వసంతోత్సవం నుండి మరీ మౌనవ్రతం తాల్చింది. ఆమె ఎవరితోను మాట్లాడుట మానివేసింది. తండ్రితో, బౌద్ధచార్యులతో ఏవో రెండు మూడు మాటలు అత్యవసరమైనవి అంటుంది. ఆమె ప్రార్థన చేస్తుంది. ఆ ప్రార్థనలో ఆమె పులకరింపు ఎరుగదు. ఉద్వేగము లేదు. మహారాజు బ్రహ్మదత్త ప్రభువుకు వసంతోత్సవంలో రతీదేవి నిర్ణయవిషయం సూచించలేదు. మంత్రులకు, రాజపురోహితులకు ఏమీ తెలియదు.

ఇంతలో శాంతిమూలమహారాజు, స్కందవిశాఖాయనక బ్రహ్మదత్త ప్రభువూ ధాన్యకటకనగరం వెళ్ళినారు. ఆ వెళ్ళడం వెళ్ళడం వారిరువురు జైత్రయాత్ర సలిపి పదినెలలకు తిరిగి వచ్చినారు. వారు తిరిగివచ్చినప్పటినుండి అంతఃపురాలలో వంతోత్సవ విషయం ఏమవుతుందనే గుసగుస లారంభమయినవి. వసంతోత్సవం వస్తున్నది. పదిదినాలు మాత్రమున్నది. ఏమి జరుగునో ఎవరికీ తెలియదు. శాంతిమూలుని హృదయమూ, ఆకాశపులోతూ ఒకటేనని పెద్దల అభిప్రాయము. ఆ దినాన శాంతిమూల మహారాజు తామే స్వయముగా రాకుమారి అంతఃపురానికిపోయి ఆ బాలికను తన హర్మ్యానికి కొని వచ్చినారు. ఆ బాలిక ఏదో ఆలోచించుకుంటూ తండ్రి ఆలోచనామందిరానికు పోయినది.

## 4

బ్రహ్మదత్తప్రభువు శాంతిశ్రీని చూచి, తెల్లబోయి, నిలుచుండిపోయినాడు. బ్రహ్మదత్తుని చూచి ఆ బాలిక నిర్ఘాంతపడినది. మోము వెలవెల పోయినది. మరుసటి క్షణంలో బ్రహ్మదత్తుడు యథాస్థితినంది చిరునవ్వుతో "ఏమి శిష్యురాలా! మహారాజు మందిరాలకు దయచేసినావు?" అని ప్రశ్నించినాడు.

"ఉదయమే నాయనగారు  నా మందిరానకు వచ్చి నన్ను తమ అంతఃపురానికి తీసుకొని వచ్చినారు. అటూఇటూ తిరిగినాను. ఆలోచనామందిరానికి వచ్చినాను."

బ్రహ్మదత్తునికి తా నాబాలికను మొదటిసారి చూడడం ఆ మందిరంలోనే అన్న విషయం హృదయాన ప్రత్యక్షమయింది. "ఏమిటి ఈ రెండు సంఘటనలకూ అర్థం ?" అనుకున్నాడు ధనక ప్రభువు.

వెనక ఈ స్కందవిశాఖాయనక ప్రభువును ఈ మందిరంలో కలుసుకొనడానికే తన తండ్రిగారు రప్పించినారు. అప్పుడే వారు తనకు గురువగుటకు నిశ్చయింపబడినది. ఈమధ్య కొంచె మెచ్చు తగ్గుగా సంవత్సరంనుండి వీరి దేశికత్వము తనకు తప్పిపోయింది. మరల ఆ దేశికత్వమును కొనసాగించడానికి మహారాజుగారు తన్ను రప్పించినారు కాబోలు అని  రాజకుమారి అనుకున్నది. ఈ ప్రభువు జ్ఞానసముద్రుడు అవి ఆ బాలిక తన మనస్సున ఒప్పుకొన్నది. స్వభావముచే ఆమె జిజ్ఞాసువు. ఈ ధనక ప్రభువు బోధనా కుశలుడని ఆమె గ్రహించింది. వీరికి అడవి అనే ఉపనామ మెందుకు వచ్చిందో! వీరి పూర్వులు అడవి ప్రదేశాలు శాతవాహనులకోసం జయించడంవల్ల వచ్చి ఉంటుంది అనుకొన్నది.

అడవి ఎంత విచిత్రమైనది! అడవిలో ఎన్నిలక్షల జాతుల చెట్లు లతలు, నికుంజాలు, ఓషధులు, ముళ్ళమొక్కలు ఉంటాయి. లక్షలకొలది జంతువులు భయంకరమైనవి, సాధువైనవి, క్రూరమైనవి అడవిలో వాసం చేస్తాయి. మనుష్యులను, ప్రాణికోట్లను బ్రతికించేవి, నాశనం చేసేవి ఓషధులు మొదలయినవి ఉంటాయి అడవిలో. నదులా అడవులలో ప్రవహిస్తాయి. చినచిన్న సెలయేరులు, చెరువులు ఆ అడవులలో ఉంటాయట. అడవులు దావానలంవల్ల మండిపోతూ ఉంటాయట. మనుష్యులను కబళించే రాక్షసులు అడవులలో ఉంటారట. పిశాచులు, శాకినీ, ఢాకినీ మొదలుయిన క్షుద్రదేవతలు అడవులలో వాసంచేస్తూ ఉంటారుట.

అయినా ఈ ప్రభుకుటుంబానికి "అడవి" అని బిరుదనామం వచ్చింది. కాని అడవిలో మహర్షులు జ్ఞానం సంపాదించినారు. ఆ అడవులలో అనేక బౌద్ధసన్యాసులు ఆశ్రమాలు నిర్మించారు. ఈ విజయపురం నిర్మాణం కాకముందు ఇదంతా అడవే. నాగార్జునదేవుని ఆశ్రమం ఏర్పడిన తర్వాతనే ఈ విజయపురి వెలసిందంటారు. ఎంత భయంకరమైనా అడవి దివ్యమూ పవిత్రమూ అంటారు. ఈ అడవి బ్రహ్మదత్తప్రభువుకూడా దివ్యుడూ, పవిత్రుడూ.

ఈ ఆలోచన మనస్సులోతట్టి "ప్రభూ! తాము నాకు మరల చదువు ఎప్పుడు ప్రారంభిస్తారు?" అని శాంతిశ్రీ రాకుమారి ఆయనను అడిగింది. స్కందవిశాఖాయనక ప్రభువు ఆశ్చర్యంలో మునిగిపోయినాడు. ఈ రాజకుమారియేనా ఈ మాటలన్నది? ఈమెకు చదువంటే ఇష్టంకూడా ఉన్నది! బలవంతంచేసి చెప్పిన చదువైనా మహాజ్ఞాపశక్తి కలది అవడంచేత జ్ఞాపకం ఉంచుకోగలదు. కాని చదువంటే కాంక్ష ఉంటుం దీమెకు అవి ఆ ప్రభువు అనుకోలేదు.

"రాజకుమారీ! మీకు చదువులందు కుతూహలం ఉంటే నేనెప్పుడూ సిద్ధమే."

"మీరు పదినెలలు ఇక్కడలేరు. తిరిగివచ్చిన నెలాపదిహేను దినాలు చదువు తిరిగి ప్రారంభించలేదు."

"రాజకుమారీ! రాజధర్మానికి మహారాజుగారివెంట యుద్ధయాత్రకు వెళ్ళాను."

"వచ్చినవెంటనే ఎందుకు ప్రారంభింపలేదు?"

బ్రహ్మదత్తప్రభువునకు ఆశ్చర్యము ఇంకా ఎక్కువై మిన్నుముట్టింది. ఈ బాలికకు యవ్వనవతులగు బాలికలకు ఉండె సహజమైన సిగ్గు లేనేలేదు. సౌందర్యంలో లోకానికే శిఖరము ఈమె! ఈమెను చూసిన క్షణంనుండి తాను ఓడిపోయినాడు. పరమేశ్వరుడే అపరాజితాదేవి. సర్వసృష్టిలో ఈ పరమసౌందర్యమూర్తిని చూచి మన్మథుని పూలబాణాలకు గురిఅయినాడు. రాజకీయ శ్లేష్మంలోపడి కొట్టుకొనే ఈగలా ఉన్న తన బ్రాహ్మణత్వమూ, వైరాగ్యమూ ఈ దివ్యబాల సౌందర్యంముందు ధైర్యం వహించి ఉండగలవా? ఎప్పటికైనా ఈ బాలిక హృదయంలో వలపు అంకురించునా?

"రాజకుమారీ! నేను రహస్యం దాచుకోలేను. క్రిందటి వసంతోత్సవాలకు నన్ను బాలికలందరూ మన్మథునిగా ఎన్నుకొన్నారు నేను రతీదేవిని ఎన్నుకోవలసి ఉండి మిమ్ము ఎన్నుకొన్నాను. మీరు వర్ణనాతీతమైన సౌందర్యవతులు. కాబట్టి మిమ్ము రతీదేవిగా నేనానాడు ఎన్నుకొన్నాను. ఆ ఎన్నుకొనడానికి కారణం మీ అందము. నా కళ్ళు మిరుమిట్లు గొన్నాయి. ఇతికర్తవ్యతా మూఢుడనై వెనువెంటనే మిమ్ము రతీదేవిగా ఎన్నుకొన్నాను."

"ప్రభూ! నన్ను మీరు రతీదేవిగా ఎన్నుకొన్నప్పుడు నాకు ఏదో బాధ కలిగింది" అని శాంతిశ్రీ తలవాల్చింది.

## 5

**శాం**తిశ్రీ తలవాల్చడమేమిటి అవి బ్రహ్మదత్తప్రభువు ఆశ్చర్యమందినాడు. అస్పష్టమైన నిట్టూర్పు ఒకటి ఆ యువక ప్రభువు చెవినిబడి అతనికి మరీ ఆశ్చర్యం కలిగించింది. రెప్పలువాల్చే దేవతలను చూస్తే ఎవరికి ఆశ్చర్యం కలుగదు?

మరుసటి నిమేషంలో శాంతిశ్రీ తలఎత్తి "మీరు శుభముహూర్తము చూచి త్వరలో చదువు మళ్ళీ ప్రారంభించండి. రతీదేవి గొడవ నాకు తెలియదు. వసంతోత్సవము, వసంతుని ఎన్నిక, వనరమును వసంతుడే నిర్ణయించటం, అలాగే మన్మథుని బాలికలు ఏర్పరచుట, అతడు రతిని ఎన్నుకొనుట ఈ ఆచారాలు నాకు తెలుసును. అలా ఎన్నుకోబడిన బాలికలు వారివారికి భార్యలు కావలసి ఉంటుందనీ నాకు తెలుసును. భార్యాభర్తల ధర్మాలను శాస్త్రాలు విపులీకరించాయి. కాని ఆ ధర్మాలలో చెప్పబడ్డ మనోభావాలు ఏలా కలుగుతాయో నాకు తెలియదు ప్రభూ! అందుకని నేను మీకు రతీదేవిని ఎలా కాగలను? నన్ను మీరు వివాహం చేసుకుంటారు. నేను మీకు భార్యనై లాభమేమి? నాకు భార్యాత్వమంటే ఏమిటో తెలియదు. మా నాయనగారు ఆజ్ఞ ఇస్తే, మీరు తప్పదు అంటే, మీకు తప్పక భార్యనౌతాను. కాని ఆ తర్వాత ఏమిటి?"

శాంతిశ్రీ కనుబొమలు ముడిపడినాయి. పాలసముద్రంలో చిరు కెరటాలు ఏర్పడినా సౌందర్యమే భాసిస్తుంది. ముడులుపడిన శాంతిశ్రీ కనుబొమలు కూడా ఆమె సౌందర్యానికి ఇంకా ఎంతో అందం చేకూర్చినాయి.

"రాకుమారీ! ఆ వసంతోత్సవ విషయం మరిచిపోయి, ఆనాటి సంఘటన జరగలేదనుకో! నాకు వివాహం అంటే ఇష్టమని అనుకోకు. వైరాగ్య పథాలలోనే నామనస్సు ఎప్పుడూ విహరిస్తోంది. వివాహం నా హృదయ విహంగానికి బంగారు పంజరమే!"

బ్రహ్మదత్తుడీ మాటలని చిరునవ్వు నవ్వి, ఆమెను తీవ్రంగా పరిశీలిస్తూ, పరిశీలించనట్లు నటిస్తూ "నేను ఆ దినాన నీ దివ్యసౌందర్యానికి ముగ్ధుడనై అలా చేసినాను. నీకు గురుత్వం చేసినపుడు నా మనస్సులో అట్టి వికారం కలుగలేదు. ఆ ముహూర్తంలో బాలికలందరూ నన్ను మన్మథునిగా ఎన్నుకోగానే ఎట్ట ఎదుట శుకమహర్షిని కూడా దాసుణ్ణి చేసుకోగలిగిన నీ సౌందర్యం దివ్యమైగోచరించింది. ఏమిచేస్తున్నానో తెలియకుండానే వచ్చి నీ మెడలో దండవైచినాను. అందువల్ల నాకు సంప్రాప్తించిన స్వత్వాన్ని నేను అత్యంత విచారంతో ఆ వెంటనే వదలివేసినాను" అని నెమ్మదిగా పలికినాడు.

"విచారం ఎందుకు మీకు?"

"సర్వదా శాంతమైన నీ పవిత్రహృదయాన్ని మూర్ఖుడనై కలచివేసినందుకు."

"ప్రభూ! మీరు నా నిమిత్తం ఏమీ మనస్సులో ఉంచుకోకండి! క్షణికమైన నా అందం చూచి మీరు మోసపోయి ఉంటారు."

"ఈ సృష్టిలో క్షణికంకానిదేది రాజకుమారీ?"

"నిర్వాణం."

"నిర్వాణం సృష్టికి అతీతంకదా. క్షణికమైన జీవితంలో ఉంది మనుష్యుడు శాశ్వతమైన నిర్వాణం వాంఛిస్తున్నాడు."

"ఆ వాంఛకూడా గుణమేనా?"

"అదీ గుణమే."

"శుద్ధ నిర్వాణముగాని, శుద్ధ స్థితప్రజ్ఞగాని గుణాతీతత్వాన్ని సూచిస్తుంది" అని తామే సెలవిచ్చినారు ప్రభూ!"

ఆ మాటలు వింటూ బ్రహ్మదత్తుడు నవ్వుతూ "నా పాఠం నాకే అప్పగింత చేసినావా రాకుమారీ?"

ఎప్పటికైనా ఈ బాలికలో స్త్రీత్వము స్పందనమౌతుందా అని బ్రహ్మదత్తుడనుకొన్నాడు. 'గుణాతీతత్వ'మని అన్నది కాని అది ఏమిటీ అని ఆ బాలిక ఆలోచించుకుంటున్నది. ఇంతలో మహారాజు వీరిరువురు పీఠాలపై అధివసించి, మాటలాడు కొనుచుండిన ఆలోచనా మందిరానికి వేంచేసినారు బ్రహ్మదత్తప్రభువూ, శాంతిశ్రీకుమారీ లేచి నిలిచిరి. బ్రహ్మదత్తుడు మహారాజు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదము పొందినాడు. మహారాజు తమ పీఠము అధివసిస్తూ, బ్రహ్మదత్తుడువచ్చి రాకుమారిని కలవడం భగవన్నిర్దేశము. వీరిద్దరూ చక్కగా మాట్లాడుకుంటున్నారు. అదికూడా శుభసూచకం. ఈ ప్రభువులోని మహత్తరమైన శక్తి తన కొమరితను స్త్రీని చేయలేదా అని తలపోసినారు.

**శాంతిమూల మహారాజు:** విశాఖాయనక ప్రభూ! మీరు దయ చేసిన విషయము.

**బ్రహ్మదత్తుడు:** మహాప్రభూ, రాజకీయ విషయాలు కొన్ని చర్చించాలని వచ్చాను. ఇక్కడికి రాగానే మహారాజకుమారిని చూచినాను. వారు నన్ను తిరిగి తమ చదువు ప్రారంభింపుమని కోరినారు.

ఆ మాటలు వింటున్న శాంతిమూలునకు విపరీతమైన అనందం కలిగింది. ఆ ఆనందము పైకి ఏమీ కనబడనియకుండా మహారాజు బ్రహ్మదత్తప్రభువు వైపు తిరిగి, "ధనకప్రభు, రాజకుమారి చదువు మన జైత్రయాత్రమూలాన భంగం అయినందుకు విచారిస్తూ, అమ్మాయి మళ్ళీ చదువు ఎప్పుడు ప్రారంభించగలదో కనుక్కోడానికే ఆమెను ఇక్కడకు తీసుకొనివచ్చాను. ఆ విషయం మా అమ్మాయికి తెలియదు. మా కన్నతల్లి మిమ్ము పాఠాలు ప్రారంభించండి అని అడగడం మాకు ఎంతో సంతోషం కలిగిస్తున్నది "అని సెలవిచ్చినారు.

**శాంతిశ్రీ:** మహాప్రభూ! శుభముహూర్తముచూచి బ్రహ్మదత్త ప్రభువే చదువు మళ్ళీ ప్రారంభిస్తారు.

**శాంతిమూల:** ఇంక ఒక విషయం ఉన్నది. రేపు వసంతోత్సవాలు వస్తున్నవి. ఈలోగా బ్రహ్మదత్తప్రభువు పూంగీప్రోలు పట్టణం పోయి మీ పెద్ద మేనత్త పూంగీరాష్ట్ర మహారాణి శాంతశ్రీనీ, మహారాజును, వారి కొమరిత శాంతశ్రీ రాకుమారిని, వారి బాలుడు రాజకుమారుని తీసుకొనివస్తారు. అలా రాక వారు పూంగీప్రోలులోనే వసంతోత్సవానికి ఏర్పాటులుచేస్తే మనమందరము పూంగీప్రోలే ఆ ఉత్సవాలకోసం వెళ్ళవలసి ఉన్నది.

శాంతిమూల మహారాజు హృదయం వెంటనే బ్రహ్మదత్తుడు అర్థం చేసుకొన్నాడు. 'రాజకుమారీ! నేను పూంగీప్రోలునుండి రాగానే మీకు చదువు ప్రారంభిస్తాను" అని తెలిపినాడు. బ్రహ్మదత్తుడు మహారాజుకడ సెలవుపొంది, శిష్యురాలు నమస్కరించగా ఆశీర్వదించి, మహారాజునకు నమస్కరించి, ఆశీర్వాదం పొంది వెడలిపోయినాడు.

శాంతిమూలుడు కొమరితచెయ్యి పుచ్చుకొని "రాతల్లీ! నా పూజా మందిరానకు. ఆ మందిరంనుండి మహారాణి బుద్ధపూజామందిరానకు వెడుదువుగాని" అని ఆమెను లోనికి కొనిపోయినారు. శాంతిశ్రీ తండ్రి పూజామందిరానికి, తల్లి పూజామందిరానికి వెడుతూ ఉంటుంది. అయినా ఆమెలో భక్తి చైతన్యము ఏమీకలుగలేదు. తానుకూడా పూంగీప్రోలు వసంతోత్సవాలకు వెళ్ళవలసి ఉంటుందా అని ఆమె ఆలోచించుకొన్నది. ఈ బాలిక బ్రహ్మదత్తప్రభువును తారసిల్లినపుడెల్ల ఏదో స్పందించిపోతున్నది. ఈమెను స్త్రీని చేయగల శక్తిమంతుడా యువకుడే అని శాంతి మూలుడు అనుకొన్నాడు.

## 6

బ్రహ్మదత్తప్రభువు మహారాజులో మాట్లాడిన మూడు దినాలకు విజయపురంనుండి సపరివారంగా పూంగీప్రోలు బయలుదేరెను. పూంగీప్రోలు సముద్రతీర పట్నం. విజయరపురినుండి కోటలా ఉన్న కొండలు దాటి, కొండలావల పల్లవభోగముగుండా అరువదిరెండు గోరుతాలు ప్రయాణం చేస్తే పూంగీప్రోలు వస్తుంది. చంద్రవంక, నాగనది, తుంగభద్రల మీదుగా మహారాజపథం, సస్యశ్యామలమైన భూమిగుండా వెళ్ళుతుంది.

ధనకరాష్ట్ర మహాసామంతుడైన అడవి స్కందవిశాఖాయనక బ్రహ్మదత్తప్రభువు విజయపురి వదలిన శుభముహూర్తంలోనే ఒక వర్తకుడు తన స్నేహితుడైన శ్రోత్రియునితో, అంగరక్షకులగు ఏబదిమంది అశ్వికులతో, నాలుగు ఏన్గులతో, పది ఒంటెలతో, ఇరువది కంబళి వ్యాహకములతో, బయలుదేరి కృష్ణదాటి విజయపురికి విచ్చేసినాడు. ఆ రత్నాల వర్తకుని ఉద్యోగులు కొంద రదివరకే వచ్చి పట్టణవర్తక ముఖ్యోద్యోగిని, వణిక్ సంఘ పంచాయతీ సభ్యులను కలుసుకొని, వణిక్ చక్రవర్తికి తగిన విడిదిలు ఏర్పాటు చేసినాడు. ముసికనగర మహాసామంతుడైన పులమావి శాతవాహనప్రభువు ఆ వర్తక చక్రవర్తిని సర్వవిధాల ఆదరింపుడని శాంతిమూల మహారాజునకు సుహృల్లేఖ పంపినాడు.

యౌవనమధ్యస్థుడూ, విలాసమూర్తి అయిన ఆ వర్తకోత్తముడు అనుచరులతో, తనకై వర్తకోద్యోగి ఏర్పాటు చేయించిన విడిది చేరి, స్నానాదికాలు నిర్వర్తించి భోజనంచేసి, కొంతకాలం ప్రయాణపు బడలిక తీరేటట్లు విశ్రమించాడు.

శుభముహూర్తంనాడు విడిదిలోనే వజ్ర, వైఢూర్య, గోమేధిక, పుష్యరాగ, నీల, మౌక్తిక ప్రవాళ, గారుత్మత, పద్మరాగాది రత్నాలు ఉంగరాలుగా, హారాలుగా, బాహుపురులుగా, కంకణాలుగా, మేఖలాలుగా, మంజీరాలుగా రచించిన భూషణాలగానూ విడిగానూ, రత్నవర్తకులకూ ప్రభువులకూ ప్రదర్శింప ప్రారంభించినాడు. ఆ వర్తకుడు స్వయంగా మహారాజదర్శనము చేసుకొని వారికి నవరత్నములు పొదిగిన కంఠమాల ఒకటి సమర్పించెను. మహారాజు ఆ భూషణము ప్రాభృతముగా స్వీకరింప నిరాకరించి కోశాధ్యక్షునిచే మూల్యము నిప్పించెను.

నవరత్నాలే కాకుండా ఆ వర్తక కుమారుడు బంగారపు కణికలను, బంగారపు ఇటుకలనుకూడా విరివిగా అమ్మకము సాగించినాడు. వణిక్ సంఘాధ్యక్షునకు చక్కని ఉంగరము బహుమాన మిచ్చినాడు. విజయపుర ప్రభువైన స్కందవిశాఖాయనక ధనకప్రభువు తాను వచ్చినదినమున పూంగీప్రోలు వెళ్ళినాడని విని ఆ వర్తకోత్తముడు ఎంతో కించపడినాడు. పది దినాలు గడచిపోయినవి.

ఒక రాత్రి తన పడకగదిలో మంచంమీద పండుకొని ఉండగా వినోదుడు రత్నకంబళిపై అధివసించి ఆ వర్తకకుమారునితో మాట్లాడుతూ ఉండెను.

"మహారాజు మన బహుమాన మెందుకు తీసికొనలేదంటావు?"

''మహాప్రభు! మీరు తప్పటడుగు వేసినారు. తెలివితక్కువ అక్కడే ప్రారంభమయింది."

"ఏమిటా తెలివితక్కువ?"

"మీరు ఆ భూషణం ప్రాభృతంగా సమర్పించడంవల్ల మహారాజుకు మీ మీద అనుమానం కలగవచ్చును!"

"అనుమానం ఎందుకు? నేను చేసింది తప్పుపని కాదుగదా?"

"ప్రభూ! వర్తకులు మహారాజులకు అంతటి ప్రాభృతం ఇవ్వడం విపరీతంకాదా?"

"అది అలా ఉంచుగాని మన శాంతిశ్రీకి, యువకుడైన బ్రహ్మదత్తుడు చదువు చెప్పుచుండెనటగా?" అని వర్తకకుమారుడు వినోదుణ్ణి ప్రశ్నించాడు.

"ఓయి వర్తకప్రభూ! ఎవరు చదువు చెప్పితే ఏమి? మీకు అది లాభమే కదా?"

"ఒక యువకునిచే, ఒక యువతికి చదువు చెప్పించడం ఎంతదోషం?"

"ఉదయన మహారాజు వాసవదత్తకు వీణాగానం పాఠాలు చెప్పితే ఏమేమి దోషాలు ఎవరెవరికి సంభవించాయి?"

"ఇక్కడా అదే ఉద్దేశ్యమా?"

"మరేమిటనుకున్నారు వర్తకమహారాజా?"

"ఏల్లాగు దీనికి అడ్డు అస్త్రం తగిలించడం?"

"ఇంతవరకు జరిగినదానికి భయపడ నవసరంలేదు. ఇకముందూ అంత భయపడ నవసరం లేదు!"

"ఏమిటా ధైర్యం?"

"మన అడ్డుఅస్త్రం రాజకుమారి దగ్గరే ఉన్నది."

"అంటే?"

"శాంతిశ్రీ రాకుమారి ప్రకృతి అత్యంత విచిత్రమైనది. ఆమెకు స్త్రీపురుష భేదం తెలియదనీ, ఆమెలో చైతన్యమే లేదనీ, ఆమె ఎవ్వరినీ ప్రేమించలేదనీ, అలా సంభవిస్తే లోకమే తల్లక్రిందులవుతుందనీ మనచారులు, స్త్రీ అపసర్పిణలు వేగు తెచ్చారు."

"అయితే మనకు మాత్రం ఆశ ఏమిటి?

"ఎంత వెఱ్ఱివారండీ ప్రభూ! ఒకసారి పెళ్ళిచేసుకుని మన్మథతల్పం చేర్చండి! ఎవరైనా కరిగి పోరండీ?"

"ఇవి అనుభవంచే చెప్పే మాటలేనా?"

"ఎంతచెట్టు కంతగాలి!"

"అసాధ్యుడవే!"

"అసాధ్యమైన చోట్లకూడా, దారి సాధ్యం చేసుకున్నాను మహా ప్రభూ!"

"ఇదా నీ వినోద ప్రభావం?"

"మహారాజా! నా స్త్రీ వేట ఎంత సేపు అక్కలవాడలలో, బౌద్ధభిక్షుణి ఆశ్రమాలలో, నేను గృహస్థాశ్రమాల జోలికిపోను. అందుకనే నా కున్న గౌరవం వసిష్ఠ మాహర్షికైనా ఉందోలేదో?"

"ఇంతకూ మన కార్యక్రమం?"

"పంచతంత్రం చదివారుకదా! మిత్రలాభ, మిత్రభేద, సంధి విగ్రహాదులయిన తంత్రాలు ప్రయోగించాలి. మిత్రలాభం దాసీ జనాదులపట్ల, మిత్రభేదం మనకు అడ్డువచ్చే వారియందు, కాపలాకాసే వారిపట్ల సంధి, విగ్రహం మహారాజు నమ్మకమైన బంట్ల ఎడ?"

"బాగానే ఉంది. నీ ప్రయోగం ఫలించేవరకు నా విరహతాపం చల్లారడం ఎల్లా? ఆ బాలికను ముందు నేను చూడాలి. చూడకపోతే నిలిచేటట్టులేవు నా ప్రాణాలు."

"ఈ రెండుళ్ళూ ఎల్లా నిలిచి ఉన్నాయి?"

"దగ్గరకు రానంతసేపు స్వప్నసుందరి మాత్రం!"

"దగ్గరకు రాగానే జాగరసుందరి అయి ఊరుకొన్నదా?"

"వెఱ్ఱిప్రశ్నలు వేయక వెంటనే ఉపాయం ఆలోచించు."

"చిత్తం, ఆలోచిస్తున్నా. ఆలోచిందా; ఆలోచించడమేమిటి ఆచరణలో పెట్టినాను."

"ఏమిటది?"

"రాజకుమారిక కడకు దారిలో రెండు సింహిక లుండేవి. అవి లేవు ప్రస్తుతము. ఇప్పుడున్న సింహికలు మన విషయంలో వట్టి మార్జాలికలు."

"అంటే?"

"మనం నగలవర్తకులుగా ఆమెకడకు వెళ్ళే వీలు ఏర్పాటు చేస్తాయా మార్జాలికలు."

"మనకు అంతఃపురాలన్నీ ఇక నివృతద్వారాలే."

"సరే. నీచేతిలో ఉన్నాను."

"జారిపోకుండా ఉండండి. నేను చెప్పిన పాఠాలు మరవకండి. కొంపలు మునిగిపోతాయి."

ఈ యిరువురు మన పాతమిత్రులే అని పఠితలు గ్రహించే ఉంటారు.

## 7

**ఈ** నూత్న వర్తకచక్రవర్తి వినోదకునితో ఇక్ష్వాకు శాంతిశ్రీ రాకుమారిని గూర్చి మాట్లాడిన అయిదు దినాలకు శాంతిశ్రీ రాకుమారి వినయపీఠికల చదువుకుంటూ తన విద్యామందిరంలో కూర్చుండి ఉన్నది. ఇంతలో దౌవారిక ఒకతె ఇద్దరు వర్తకులను మందిర ముఖద్వారానికి లోని భాగంలో నిలుచుండబెట్టి చదువు కొంటున్న రాకుమారి దగ్గరకుపోయి "జయము జయము భర్తృదారికా! వారు వచ్చినారు" అని విన్నవించెను. "ఎవరే?" అని రాకుమారి తన పీఠమునుండి లేచి ద్వారమువైపు చూచినది. "ఎవరువీరు?" అని ఆ బాలిక కనుబొమలు ముడివడ ఆ దౌవారికను ప్రశ్నించింది. "నగలవర్తకులా? నగలవర్తకు లిక్కడి కెందుకు వచ్చినారు?"

"తమకు నగలు చూపించడానికండి"

"నాకు నగలు చూపించడమేమిటి! నేను చూడనని నీకు తెలియదా?" ఆమె కొంచెం విసువు కనబర్చింది.

"తమతో మనవిచేసి తమ అనుమతిపొందే తీసుకవచ్చానండి."

ఇంతలో వణిక్కుమారులిమంత్రి రాజకుమారికవైపు తిరిగి రెండు చేతులు జోడించి, "మహారాజకుమారీ! మేము విదేశాలనుండి వచ్చిన వర్తకులము. మా దగ్గర ఉన్న నగలూ, నవరత్నాలూ, బంగారమూ రెండుమూడు వందలకోట్ల సువర్ణ ఫణాల వెల చేస్తాయి. సువర్ణగిరిలో ఉన్న మా కేంద్ర స్థానంలో ఉన్న నగలూ మొదలైన వాని మూల్యం ఎన్ని కోట్లుంటుందో మాకే తెలియదు. మహారాజులైన ఇక్ష్వాకు శాంతిమూల మహాప్రభువుల అంతఃపుర దేవేరులు రాజకుమారీమణులు మేము తెచ్చిన భూషణాలన్నీ తీసుకొని మమ్మ సన్మానిస్తారనే ఆశతో మీ మహానగరం వచ్చినాము. మహారాణిగారు మూడు లక్షణ ఫణాల నగలు పుచ్చుకొన్నారు" అని మనవిచేసి తలవంచుకొన్నాడు.

ఏమీ మాట్లాడకుండా ఆ వర్తక కుమారుడు శాంతిశ్రీ రాకుమారిని కళ్ళతో కబళిస్తూ నిలుచున్నాడు. శాంతిశ్రీకి ఏమీ అర్థంకాలేదు. చిన్నబిడ్డవలె తెల్లబోయి చూచింది వారిరువురివైపూ. దౌవారికమాత్రం అక్కడనుంచి మాయమైపోయింది. ఏమీ తోచక రాజకుమారి పదిలిప్త లలా ఉండి వెంటనే అక్కడనుంచి తలవంచుకొని వేరొక ద్వారంగుండా తన ప్రార్థనామందిరానికి వెళ్ళిపోయింది.

వర్తకులిద్దరూ ఆశ్చర్యంతో ఒకరి మొగమొకరు చూచుకున్నారు. వారిని తీసుకొని వచ్చిన దౌవారిక ఎక్కడనుంచి వచ్చిందో అక్కడకు పెదవులకడ వేలుంచుకొని, వారిని తనతో రండని తీసుకొని పోయింది. కక్ష్యాంతరాలు గడుస్తూ రాకుమారిభవనాలు రక్షించే మహాకుడ్య గోపురం దాటి బయటపడ్డారు. ఆ బాలిక వారిద్దరనీ గోపురద్వారం బయటవదలి, తిరిగి లోనికి పోయినది.

ఆమె లోనికి వెళ్ళగానే ఒక ప్రతీహారిణివచ్చి "రాజకుమారిగారు సభామందిరంలో ఉన్నారు, నిన్ను రమ్మంటున్నారు" అని దౌవారికతో చెప్పింది. సభామందిరంలో దౌవారిక వెళ్ళగానే, అక్కడ మహారాజ కుమారి సభ తీరిచి ఉన్నది. అంతఃపురపాలకురాలు మహారాజకుమారి ప్రక్క ఒక ఆసనంమీద కూర్చునిఉంది. ఒక ప్రక్కగా బారులుతీర్చి, నలుగురయిదుగురు ప్రతీహారిణులు, పదిమంది దౌవారికలు, ఎనమండుగురు అంగరక్షకురాండ్రు దాసీజనమూ, ముగ్గురు చెలికత్తెలు నిలిచి ఉన్నారు. వీరందరినీ చూడగానే ఆ దౌవారికకు ప్రాణాలు క్రుంగిపోయాయి.

**అంతఃపురపాలకురాలు (ఏఖైఏళ్ళుంటాయి):** ఏమి బౌద్ధాయినీ, ఎవరినీ వర్తకులను తీసుకొని వచ్చినవావుట?

**బౌద్ధాయని:** కా – కాదమ్మా! నేనురాకుమారి గారి అనుమతిమీదనే తీసుకొని వచ్చినాను.

**అంతః:** అనుమతిపొందే తీసుకొని వచ్చి ఉండవచ్చు. కాని విద్యామందిరంలోకి ఎందుకు తీసుకవచ్చావు? అమ్మగారిని చూడడానికి పురుషులెవరైనా వస్తే, నాకు తెలియజేయవద్దూ?

**బౌద్ధాయని:** చిత్తం! కాని ఆవర్తకులు మహారాణులు మొదలయిన వారికే నగలు, నవరత్నాలూ అమ్ముతారు. వారికి చాలా తొందరపని ఉండటంచేత, విద్యామందిరానికి తీసుకొని వెళ్ళాను. తమతో మనవిచేసి తమ అనుమతి పొందడానికి వ్యవధి లేకపోయింది.

**అంతః:** తీసుకొని వచ్చినావు, బాగానే వుంది. ఆ వెంటనే నా దగ్గరకు వచ్చి ఎందుకు చెప్పినావు కావు?

**బౌద్ధా:** చిత్తం ఆ వర్తకులను సాగనంపడానికి వెళ్ళానండి.

**అంతః:** ఆ వర్తకులను విద్యామందిరంలో దిగబెట్టగానే నువ్వు ఆ మందిరం వదలివచ్చి పైన నిలుచుని వున్నావు. అప్పుడు వచ్చి చెప్పలేదేం?

ఆ దౌవారిక మౌనం వహించింది.

**అంతః:** దుర్మార్గులారా! నువ్వు ఆ వర్తకుల దగ్గర కొంతధనం బహుమానం పుచ్చుకొని లోనికి తీసుకొని వచ్చావు అంతవరకూ నాకు తెలిసింది. సరే, నిజం చెప్పు. ఎవరా వర్తకులు. మహారాజుకుమారికను చూడ అవసరం ఏమి కలిగింది?

బౌద్ధాయని కళ్ళనీళ్ళుకారిపోతూ ఉండగా వెక్కి వెక్కి ఏడుస్తూ అంతఃపుర రక్షకురాలి ఎదుట గజ గజ వణుకుతూ సాష్టాంగపడి "రక్షించుతల్లీ! పది బంగారు పణాలూ ఒక నీలిరంగు ఉంగరమూ బహుమానం ఇచ్చారు. మన నగరంలో అందరు రాజకుటుంబాల వారూ కొన్నారట. రాజకుమారికగారుపుచ్చుకొంటారని వారికై ఎన్నో చిత్ర చిత్రభూషణాలు తీసుక వచ్చారట. ఎల్లాగన్నా రాజకుమారిగారి దర్శనం చేయించమన్నారు. అంతే నండి" అని ఘొల్లుమన్నది.

## 8

ఈ మధ్య శాంతిశ్రీ మనస్సులో ఏవో ఆవేదనలు మొలకలెత్తాయి. అవి ఆవేదనలని ఆమెకు తెలియదు. ఆమె కూర్చోలేకపోయింది. నిలుచుండ లేకపోయింది. ఇటూ అటూ పదచారం ఏస్తూ ఉండేది. భోజనం అంత సహించేదికాదు. ఏదో ఆలోచన. ఆ ఆలోచనకు తలాతోకాలేదు. వానిని గుర్చి ఆమెకు ఏమీ తెలియదు.

మహారాజకుమారికి వంట్లో బాగాలేదని అంతఃపురపాలకురాలు భయపడి పోయింది. రాజ్యవైద్యుడు వచ్చి పరీక్షచేసినాడు. ఒంట్లో ఏమీ జబ్బు కనబడలేదు ఆయనకు. రాజకుమారి మనఃప్రవృత్తి ఆ వైద్యునకు పూర్తిగా తెలియును ఆమెకు దుఃఖములు, కాంక్షలు,పట్టుదలలు ఏమీలేవని ఆయన పూర్తిగా గ్రహించే ఉన్నాడు. శాపగ్రస్తయై ఒక దివ్యభూమిని ఈ జన్మ ఎత్తిందని ఆయన నమ్మకం అతి నిశితమైన బుద్ధి కలిగి ఉండీ మనోవికారాలు లేకపోవడానికి ఇంకోకారణంలేదు. ఆ బాలిక పుట్టినప్పటినుండి ప్రతిఘట్టమూ ఆయనకు తెలియును. ఆమె యోగిని అని వైద్యుడెప్పుడూ అనుకోలేదు. మనోవికృతులు ఆమెలో ఉద్భవించడానికి ఓషధీయుక్త తైలాలెన్నో ఆ సద్బ్రాహ్మణుడు పయోగించేవాడు. అందువల్ల ఆమె బుద్ధి మరింత వికసించింది, ఆమె దేహం మరింత ఆరోగ్యవంతమయింది. ఇంక ఆమెలో కామాది వికారాలు ఉదయింపజేసే ఔషధం ఎక్కడ ఉన్నది?

ఈ దినాన రాజకుమారిలో ఏదో ఒకవిచిత్రపరివర్తన ఆమెకు తెలియకుండానే ఉద్భవించి ఉంటుందని వైద్యులవారు ఊహించుకొని పరిచారికలను, సఖులను, అంతఃపుర పాలకురాలినీ విచారణ చేసినాడు. ఇన్నాళ్ళనుంచీ జరిగిన విషయాలాయన ఎరిగినవే అయినా, వానిలో ఉండే పరమార్థ మావైద్యవృషభునకు తెలియలేదు. ఆ వైద్యుడంతట అంతఃపుర పాలకురాలికి ఉపచారవిధులు కొన్ని ఉపదేశించి వెడలిపోయెను.

శాంతిశ్రీదేవి యధాప్రకారం వారాని కొక్కపర్యాయము తన చదువు కోసం బౌద్ధసంఘారామానికి పోవుచున్నదే కాని, ఆమె సంగీతం చిత్రలేఖనమూ నేర్చుకొనదు. బౌద్ధగీతాలూ, జాతకగాథలూ వింటూ ఉంటుంది.

* * * *

ఆ వర్తకులు తమ విడిది చేరారు. వర్తక కుమారునకు లోకభావమే నశించింది. అతడు కనురెప్పలు మూయకుండా శూన్యాన్ని చూస్తూ గడియ లుంటాడు. లేదా, కళ్ళుమూసుకొని పండుకొని ఉంటాడు. నందిధర్ముడు రెండు దినాలు చూశాడు. ఆ

కుమారుడు భోజనం సరిగా చేయడు, మాటలాడడు, రాత్రులు నిద్రపోడు. అస్తమానమూ ఉస్సురంటూ ఉంటాడు. కళ్ళు గుంటలు పడ్డాయి. నందిధర్ముడు కొంచెం భయపడ్డాడు. "ఏమిటిది ప్రభూ?" అని ఒక దినాన వర్తకకుమారుని ఎదురుగుండా నిలుచుండి, అతని భుజాలు పట్టి కదిపివేసి, అడిగినాడు. ఆ యువకుడు మాట్లాడలేదు సరికదా తలవాల్చుకొని, కుంగిపోయి కూలబడి ఉన్నాడు.

"వెనక ఈ బాలికను చూచినప్పుడు ఇంత అందంగా కనబడలేదా? కాకపోతే వెనుకటి అందం అంతా మాయమై సాధారణ మైపోయిందా రాజకుమారి?"

"నన్ను చంపకు."

"అమ్మయ్య! ఇన్నాళ్ళకు మాటొకటి ఊడిపడింది. మహాప్రభువుకు ఇదంతా విరహవేదన కాబోలు. ఉండండి లేత అరటిఆకులు, పన్నీరు, అన్నీ తెప్పించగలను."

"నీకు బుద్ధి ఉందా?"

"ఆ! ఇతరుల సంగతి నేను చెప్పలేను. నాకు ఉన్నదొక్కబుద్ధే. అదే నా ఆస్తీపాస్తీ. నాకేమీ రాజ్యాలులేవు కొట్లులేవు, అమ్మేందుకు భూషణాలులేవు."

"నోరు మూయవోయి ఇంతట."

"ఎవరిది ప్రభూ?"

"నీ విషయం శ్రుతిమించి రాగాన్ని పడుతోందే!"

"మీ విషయం రాగాన్నుంచి మూర్ఛనలోకి ఉరకటంలేదు కాబోలు. అచ్చంగా చంద్రాపీడులయ్యారు. మీ సభలో నాటకాలు వేసేవారు మీ అంత బాగా శృంగారం అభినయిస్తేనా, ఎంత బహుమతి దొరికేదో?"

"నాదంతా అభినయమంటావు?"

"అభినయం కాకపోతే నిజమే అనుకోండి. నా అభ్యంతరమా!"

"ఓరి ఛండాలుడా ఎంతమాట అంటున్నావురా?"

"నన్ను ఓ పదిపూలచెండులు వేసికొట్టరాదూ?"

ఆ బాలకుడు కొంచెం అర్ధహాసం చేసినాడు.

"సరే, ఇంతకూ నీ ఆలోచన ఏమిటి?"

"ప్రభువుల ఆలోచనే నా ఆలోచన."

"మొత్తుకున్నట్లుంది!"

"ఉన్నట్లుండడ మెందుకు? నిజంగ మొత్తుకుంటున్నాను!"

"ఎందుకూ?"

"ఇంతకన్న అందమైన బాలికలున్నారనీ, ఈబాలిక మనకు సాధ్యం కాదనీ."

"ఓయి వెఱ్ఱివాడా! సాధ్యంకానిపని అనేది పులమావి చక్రవర్తి ఎరగడు. ఈ బాలిక సౌందర్యం నామతి పోగొట్టింది. ఈ బాలిక నాకు రాణి కాకపోతే నాకు చక్రవర్తిత్వమూ వద్దు, జీవితమూవద్దు. ఈ బాలిక నా అంతిపురానికి వచ్చిందాకా నాకీ బాధ తప్పదు. ఏమి అందం, ఏమి అందం, ఏమి అందం!"

"చిత్తం! ఎందుకా అందం? వట్టి బంగారుబొమ్మ. ముసికలోనే ఉండి మీరూ ఓ బంగారుబొమ్మను చేయించుకోరాదూ?"

"ఆమె కన్నులు కన్నులా? అవీ...."

"కావు. ఆలి చిప్పలు"

"ఆమె నుదురు, పెదవులు, చెవులు, ఆమె శరీరకాంతి, ఆమె వక్షస్సౌభాగ్యము...."

"మహాప్రభూ! మీకు ఈ బాలికే కావాలంటే...."

"అలా దారికిరా. త్వరగా చెప్పు ఏం చెయ్యాలో."

"మీరు ఆమెను ఎత్తుకొనిపోయి పెళ్ళిచేసుకోవడమే మార్గము."

"ఆ ఎత్తుకుపోవడం ఏలాగు? ఆ తర్వాత ఏమవుతుంది?"

"ఎత్తుకుపోయే ఉపాయాలు పన్నుదాము. వెంటనే వివాహం. ఇంక అల్లుడిపైన కత్తిగడతాడా శాంతిమూలుడు? పెళ్ళయితే ఏలాంటి బాలిక అయినా క్రమంగా అలవడుతుంది."

"అమ్మయ్యా! నా ఉపాయమే నీకూ వచ్చింది. ఇంక మనం ఈ ఊరునుంచి విడిది ఎత్తివేయాలి."

"నేను సిద్ధం మహాప్రభూ! అయినా ఒక్కసారి తాము శాంతిమూల మహారాజును దర్శించి, బేరాలు బాగా సాగినాయి అని మనవిచేసి, వారి కొమరిత మాత్రం నగలేమీ కొనలేదని యాధాలాపంగా చెప్పినట్లు చెప్పి, ఏదో ప్రాభృతం సమర్పించండి. ఆ మరునాడు మనం బయలుదేరిపోదాము."

"బాగానే ఉంది నీ ఉపాయం."

"అయితే వెంటనే ఏర్పాట్లు చేస్తాను. ఆమెను తస్కరించి వచ్చిన క్షణంనుండి మీరు సప్తమేఘాలు ఒకసారి అవతరించినట్లు, ద్వాదశార్కులు ప్రజ్వరిల్లినట్లు పరాక్రమించి దుర్నిరీక్షులయిపోవాలి."

"తథాస్తు!"

## 9

**ఆం**ధ్రశాతవాహనుల మహాసామ్రాజ్యము, ఇక్ష్వాకుల మహారాజ్యము. అయినా బీదతనం ఉంది. కోటీశ్వరులెప్పుడు ఉంటారో బీదవాళ్ళూ అప్పుడే ఉంటారు. కోట్లకొలదీ బంగారుకాసులు చెట్లను పండవు. అయినా బంగారం భూమిలో దొరుకుతుంది; నదీగర్భాలలో దొరుకుతుంది.

బంగారంకోసం పాటుపడాలి. త్రివిష్టపంనుంచీ, హిమాలయాలనుంచీ, మేరు పర్వతంనుంచీ బంగారం వస్తుంది. బంగారం తళతళ లాడుతుంది, కాబట్టి సువర్ణం. శతకుంభ పర్వతంలో దొరుకుతుంది గనుక శాతకుంభం జంబూనదియందు దొరుకుతుంది గనుక జాంబూనదం. ఇంకా ఇది స్వర్ణగిరిలో దొరుకుతుంది. వేణ్ణానదిపుట్టే నంది పర్వతాలలో దొరుకుతుంది. స్వర్ణముఖీనదిలో దొరుకుతుంది. బంగారం ఎంతటివానినైనా మాయలో ముంచగలదు. బంగారానికి దాసులు కానివారెవరు? హరిశ్చంద్రుడు బంగారానికి అమ్ముడుపోయాడు. బ్రహ్మబొడ్డునందు బంగారము దాచుకొన్నాడు. అగ్ని తన కేశముల బంగారుతో రచించుకొన్నాడు. స్వర్ణనది తన కెరటాలలో బంగారు పద్మాలను అలంకరించుకొన్నది.

భరతదేశంలో శాతవాహనుల కాలంలో ముష్టివాళ్ళు ఉండేవారు. ఆ దినాల్లో ముష్టివాళ్ళు ఉండడానికి ముఖ్యమైనవి మూడుకారణాలు. పనిచేయలేని స్థితిలో నా అనేవాళ్ళు లేకపోవడం వల్లా, బద్ధకించి పనిచేయక మనుష్యుల ధర్మప్రకృతిపై ఆధారపడి ముష్టి ఎత్తడమే జీవనోపాధిగా చేసుకోవడంవల్లా, ఉంఛవృత్తిపై ఆధారపడి ముష్టి ఎత్తడమే ధర్మంగా స్వీకరించడంవల్లనూ. కాని బద్ధకంచేత ఉంఛవృత్తి నవలంబించినవాళ్ళు శాతవాహన సామ్రాజ్యంలో ధర్మశాస్త్రరీత్యా కఠిన శిక్షలకు పాలయ్యేవారు.

భిక్కులు, కాపాలికలు, భిక్కునిలు, జైనయోగులు, యోగినులు మొదలైనవారు దేశం అంతా తిరుగుతూ ఉంటారు. పంటలు బాగా పండుతూ ఉన్నాయి. కాబట్టి బిచ్చానికేమీ లోటులేదు. దుర్భిక్షము సంభవించి, కాటకము పిశాచనృత్యం చేస్తే, మూడేళ్ళనుండీ కాటకంకోసం నిలవ ఉంచిన ధాన్యపు గాదులలో నుండి ధాన్యాదులు దేశం అంతా ప్రవహిస్తాయి. ప్రతిగ్రామములో ప్రతినగరంలో ఈ కాటకధాన్యపుగాదులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఇది భారతీయ ధర్మం.

ఒక దినాన విజయపురంలో నలుగురు భిక్కులు "బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి" అంటూ వెడుతున్నారు. ఈ భిక్షావృత్తి వారికా దినానికి సరిపోయేతిండి వచ్చేవరకే. పది ఇళ్ళు తిరిగేసరికి వారి జోలెలు నిండాయి. అంతటితో వారు భిచ్చ మెత్తడం మాని మహాసంఘారామానికి చేరారు. ఎక్కడి బౌద్ధభిక్షువులు వచ్చినా, వారే సంప్రదాయానికి చెందినా మహాసంఘారామం చేరుతారు. అక్కడ అన్ని సంప్రదాయాలవారికి వివిధ విహారగృహాలు ఉన్నాయి. ఈ నలుగురు భిక్షుకులు మహాచైత్యవాదులు. తాము భిక్షనడిగి తెచ్చుకొన్న అన్నము, కూరలు, పప్పు భోజనంచేసి, ఒక తల్లి ఇచ్చిన మజ్జిగత్రాగి, ఒక చోట కూరుచున్నారు.

**మొదటిభిక్కు:** మహారాజకుమారి భవనానికి బిక్షకు వెళ్ళినా ఆమె కనబడలేదు. ఏమిటి ఉపాయం?

**రెండవభిక్కు:** మనం ఆ బాలికను చూచితీరాలి ఆరునూరయినా.

**మూడవభిక్కు:** నేను బొమ్మవేసి తీరాలి.

**నాలుగవభిక్కు:** లేకపోతే మన అపసర్పత గంగకలిసినట్లే!

**మొటటి:** మనం నివేదించినమీదట కదా మహారాజుగారి ఈ నగరం నాగార్జునదేవుని దర్శించడానికి వస్తామన్నారు.

**మూడవ:** ఈ బాలిక అందం అంత లోక ప్రఖ్యాతి పొందిందా?

**నాల్గవ:** ప్రఖ్యాతా! గాంధారరాజు ఈ బాలికను ఆశిస్తున్నాడంటే, మన మగధమహారాజు ఒక లెక్కా?

**మొదటి:** ఇంతకూ మనం ఆ రాజకుమారిని చూడడం ఏలాగు?

**రెండవ:** నిదానంగా, నెమ్మదిగా ఆలోచించాలికదా?

ఆ నలుగురు ఆరితేరిన అపసర్పులు. ఏ వేషమైనా చక్కగా వేసుకోగలరు, వేషం తొందరలో మార్చగలరు. వేసుకొన్న వేషానికి తగిన కార్యకలాపంలో వారు ఉద్ధండ

పండితులు. వారికి జంబూద్వీపంలోని భాషలన్నీ వచ్చును. వారిలో వారు మాట్లాడుకొనే భాష ఇతరదేశాల అపసర్పులకు తెలియదు.

కొంతసేపు వారు ఏమేమో మాట్లాడుకొని, పాలీలో బౌద్ధధర్మ విచారణ ప్రారంభించారు. మొదటి భిక్కు తక్కినవారికి గురువై గంభీర కంఠంలో ఉపదేశం ప్రారంభించాడు. ముప్పురు శిష్యులూ, మధ్య మధ్య ప్రశ్నలు వేస్తూ ఉండడము, ఆచార్యులు దారపు చిక్కు విడదీసినట్లు వారి అనుమానాలు తీర్చడమూ, ఈలా విచారణ జరుగుతూ ఉంటే, అనేకమంది భిక్కులు, సాధారణులు నెమ్మది నెమ్మదిగా సమీపానికి చేరారు. ఆ బౌద్ధాచార్యుల ప్రతిభకు, ఆయన మహాత్మ్యానికి వారు ఆశ్చర్యం చెందుతున్నారు.

## 10

అడవి స్కందవివాఖాయనక బ్రహ్మదత్తప్రభువు పూంగీప్రోలుచేరి అమాత్యులచే ఆహ్వానితుడై కోటలో తన విడిది గృహం చేరినారు.

హారీతసి శాంతశ్రీ రాకుమారి బ్రహ్మదత్తప్రభువు ఎందుకు పూంగీప్రోలు వచ్చినారో వెంటనే గ్రహించుకొన్నది. తన బావగారు వీరపురుషదత్త యువరాజు తన్ను దివ్యప్రేమతో పూజిస్తున్నాడని ఆమెకు బాగా తెలియును. తాను వనదేవతావరణానంతరం కోపంతో ఇంటికివచ్చి, తల్లిదండ్రులను బయలుదేరతీసి పూంగీప్రోలు చేరినప్పటినుంచీ, ఆ యువరాజు అమిత హృదయవేదన అనుభవిస్తున్నాడని శాంతశ్రీ రాకుమారికి తెలుసును. తనకు బావగారు చేసిన అవమాన్నాన్ని ఆమె ఎప్పుడూ మరచిపోలేదు.

వసంతకాలం వచ్చింది. మన్మథుడూ, రతీదేవీ లేకుండా వసంతోత్సవం జరిగిందనీ, ఉత్సవంలో వసంతుడు హేమంతుడైనాడని పూంగీయ శాంతశ్రీకి తెలిసింది.

తానెంత మూర్ఖురాలు! స్త్రీకి వుండే పౌరుషాలూ, అహంభావాలు, ఓర్వలేని తనమూ ఎవరు వర్ణించగలరు? స్త్రీ హృదయం స్త్రీకే తెలియదు. స్త్రీ మాయ అవడంచేత ప్రకృతి అవడంచేత ఆమెలో ఎన్ని విచిత్రాలు ఉన్నాయో ఎవరికి తెలుసును? ఆమె ప్రేమిస్తున్నాను అని చెప్పినా ప్రియుడు ఒక్కొక్కప్పుడు నమ్మలేదు. ఈ దినం తన సర్వస్వమూ ప్రియుని పాదాలకడ పూజా పుష్పాలు చేసిన యువతియే రేపు ఆ ప్రియుని సర్వస్వమూ తన పాదాలకడ పూజాకుసుమాలయినా ఆ పూవులను నిర్దాక్షిణ్యంగా కాలితో నలిపివేయ గలదు.

పతివ్రతా లక్షణాలు శాంతశ్రీకి పూర్తిగా తెలుసును. ఇక్ష్వాకు వంశాన్ని సీతాదేవి పవిత్రం చేసింది. భర్తమాట వేదవాక్కు. భర్తసేవ, భర్తపూజ, భర్తతో జీవనము, భర్తజీవితం ముగింపుతో తన జీవితమూ ముగింపు.

అవును. అవి మహాపతివ్రతా లక్షణాలు అయిఉండవచ్చును. అట్టి పరమోత్తమస్త్రీ మహాకావ్యనాయిక అవుతుంది. లోకంలో తక్కిన స్త్రీలు శాకినిలో, ఢాకినిలో! శ్రీరాముడూ, పరమ శ్రమణకుడూ వంటి మహాపురుషులు దివ్యులు. తక్కినవారు సామాన్యులే అయినా ఆ మహాపురుషులను వారివారికై ఉద్భవించిన స్త్రీలు ప్రేమించడం మానినారా? వారికి తమ సర్వస్వాలు అర్పించడం మానినారా? ఒకస్త్రీకి ఒకేపురుషుడు, ఒక పురుషునకు

ఒకే స్త్రీ. ఈ అఖండ ధర్మము లోకంలో ఎక్కడో నెరవేరుతూ ఉంటుంది. రాజకీయంగానో సంతాన వాంఛార్థమో పురుషుడు ఇరువురు ముగ్గురూ స్త్రీలను వాంఛిస్తాడు. నీరస పురుషుల ప్రేమ ఇర్వురూ, ముగ్గురూ స్త్రీల పైన ప్రసరిస్తుంది. ఆ పురుషుడు ఉత్తముడు అయితే కావచ్చును.

తన బావగారు తన్ను ప్రేమించాడు. ఇంత చిన్ననాటినుండీ తనబావ తన్ను ప్రేమించినాడు. తాము భార్యాభర్తలవలె మెలగేవారు. తనకు అయిదేడులు, యువరాజుకు ఎనిమిదేడులు. ఇరువురూ విజయపురంలో మహారాణి మాతరి సారసికాదేవి హర్మ్యాలలో యువరాజు క్రీడామందిరంలో రాణీరాజు ఆట ఆడుకొన్నారు. ఆ ఆటలో దాదులూ పాలుగొన్నారు.

"దేవీ! మన రాజ్యంలో ప్రజలు క్షేమంగా ఉన్నారు" అని తన బావ అన్నారు.

తాను "ప్రభూ! మన ప్రజల క్షేమం మనమే విచారించాలిగదా!" అన్నది.

తన బావ "నువ్వు చాలా అందమైన దానవు దేవీ!" అన్నారు.

"నాథా! మీరు చాలా అందమైనవారు" అని తానన్నది.

తరువాత తనకు పదునాల్గవఏట నవయౌవనము పొడసూపే సమయంలో తన బావగారూ, తాను మహారాణి విహారోద్యానవనంలో కలుసుకొనడం తటస్థించింది. పదునేడేండ్ల యౌవనప్రారంభ దివ్యసౌందర్యస్నాతుడై తన బావవస్తున్నాడు. తన హృదయం ఎన్నిఘటికలో ఆగిపోయినట్లయింది. ప్రేమ ఎంత విచిత్రము, ఎంత బాధాపూర్ణము, ఎంత ఆనందోన్మాదకరము!

తన్ను చూడగానే తన బావ ఒక్క గంతున తన దగ్గరకు వాలినాడు. తనకెంత సిగ్గు వేసింది? ఆ సిగ్గూ స్త్రీల ఆనందంలో భాగం! తనకు ఈడురావడం మేనమామల మహానగరంలో జరిగింది. నెలదినాలు ఉత్సవాలు జరిగినవి. ఆనాటినుంచీ, తనకు ఎవరిని చూడాలన్నా సిగ్గే! తన పినతల్లి కొమరిత రాకుమారి బాపిశ్రీ "అక్కా!" అని తన్ను ఒక్కక్షణమూ వదిలి ఉండేదికాదు. తానూ, బాపిశ్రీయూ ఏవో పిచ్చిమాటలు, మధుర రహస్యాలూ మాట్లాడుకొనేవారు. ఆ రహస్యాలన్నీ తమబావను గురించే. తమ అందాలబావ వీరపురుషుడు. అందంలో ఆ రాకుమారునితో పోలగలిగిన యువకుడేడీ?

అలాంటి సిగ్గుతో నిండి ఉన్న తన్ను తనబావ, తనదైవము, పరుగున వచ్చి కలుసుకున్నప్పుడు మరీ సిగ్గుతో తాను కుంగిపోయింది. ఆ సిగ్గు బావగారికి ఏమి తెలుస్తుంది? వెంటనే అంతమంది దాదులలోనూ తన రెండు చేతులూ పట్టుకొన్నారు ఆయన కళ్ళల్లో ఏదో కాంతి! ఆయనచుట్టూ ఎంతో వెలుగు!

"నువ్వు ఎంత అందమైనదానవు శాంత?" అన్నాడు బావ.

అంత తీయనిబాధ ప్రేమ! అంత మధురమత్తత ప్రేమ! ప్రేమనిధియై బావ ప్రజ్వరిలు సుందరాకారుడై బావ! ఆనాటి బావ! భట్టిదేవిని వనదేవతగా వరించాడు!

★ ★ ★

## చతుర్థభాగం

# పూంగీ ప్రోలు

**పూం**గీప్రోలు సముద్రతీర మహాపురం. మోసలపురం, శ్రీకాకుళం, శంబరద్వీపము, కళింగపట్టణము, కురంగపురం, తామ్రలిప్తి, కావేరీపట్టణము మొదలగు పెద్ద రేవుపట్టణాల ఒకటి.

అప్పటికి అయిదారు శతాబ్దాలనుంచి కృష్ణాతీరంనుంచి పినాకినీతీరం వరకు ఉన్న సముద్రతీర శాలిభూభాగానికి క్రముక రాష్ట్రమని పేరు. ఈ క్రముక రాష్ట్రం రాను రాను రెండుభాగాలయింది. ఒకటి క్రముక రాష్ట్రమూ, రెండవది పూంగీ రాష్ట్రమూ. కృష్ణానదీ ముఖద్వార దేశము క్రముక రాష్ట్రము, అక్కడనుంచి నైఋతీ భూభాగము పూంగీ రాష్ట్రమూ అయినవి. క్రముకమన్నా, పూంగీ అనినా పోకలనే అర్థం. ఈ పోకదేశం నిండా పోకచెట్లు విరివిగా ఉండేవి. శాతవాహనుల కాలంలో ఈ రెండు పేర్లూ వాడుక లోనికి వచ్చాయి. క్రముకరాష్ట్రం నుండి ధాన్యకటకంవరకు ధనకరాష్ట్రం. ధనకరాష్ట్రానికి పడమట పల్లవభోగము, పల్లవభోగానికి పడమట అడవిరాష్ట్రం; ఆ రాష్ట్రానికి ఉత్తరం కురవదేశమూ, పడమట చోళ రాష్ట్రమూ ఉండేవి.

మోసలపురంలోపాటు పూంగీప్రోలు ప్రసిద్ధ రేవుపట్టణం అవడం చేత ఇక్కడికి సముద్రాలావల ఉన్న అనేక ద్వీపాలనుండి ఓడలు వచ్చేవి వర్తకానికి. రాజ్యాలు స్థాపించడానికి అనేకులాంధ్రులు నౌకాయాత్రలు కావించేవారు. యవన సువర్ణ మలయ బలిద్వీపాలలో రాజ్యాలు స్థాపించిన ఆంధ్రులచుట్టా లాయాద్వీపాలకు వెళ్ళేవారు. వలసపోయిన ఆంధ్రులు మాతృదేశము మళ్ళీ చూడడానికి వచ్చేవారు. బౌద్ధ ఆర్య మతాచార్యులు ఆయాద్వీపవాసులకు దీక్ష ఇవ్వడానికి పోయేవారు.

బ్రహ్మదత్తప్రభువు కోటలో తన విడిదిలో ఉంటూ, ఆ మహాపట్టణం అంతా తిరిగి చూచివచ్చేవారు. చీనావారు, సువర్ణద్వీపవాసులు, యవద్వీప వాసులు ఆ నగరం అంతట నిండి ఉన్నారు. పూంగీప్రోలులోనూ బౌద్ధ చైత్యాలున్నవి. కాని ధాన్యకటక చైత్యాలకు, విజయపుర, ప్రతీపాలపురము మొదలయిన నగరాలలో ఉన్న చైత్యాలకు, ఉన్న మహత్యమూ, ప్రతిష్ఠా వీనికి రాలేదు. ఈ నగరంలోనూ ఏడెనిమిది సంఘారామాలున్నాయి. ఏ సంప్రదాయానికి చెందిన భిక్కులు, ఆయా సంఘారామాలలోకే వెడుతూ ఉండేవారు.

బ్రహ్మదత్తప్రభువు పూర్తిగా ఆర్షసంప్రదాయంవాడు అయినా పూంగీప్రోలు వచ్చిన రెండుమూడుదినాలు నగరం అంతా చుట్టి చూస్తూ అన్ని సంఘారామాలకు వెళ్ళి వచ్చినారు. మహాచైత్యవాదుల సంఘారామం సంఘారామాలన్నిటికీ దూరంగా సముద్రతీరంలో ఉన్నది. బ్రహ్మదత్తప్రభువు సంఘారామ గోపురద్వారం దగ్గర రథం దిగి, పాదచారియై సంఘారామంలోకి వెళ్ళినారు. అదివరకే అపరవనశైల సంప్రదాయానికి

చెందిన ఆ సంఘారామానికి బ్రహ్మదత్తప్రభువు తన అమాత్యుని పంపి కులపతి అయిన వినయ గౌతమ భిక్షాచార్యులను మరునాడుదయం దర్శించుటకు అనుజ్ఞపొందెను.

ఈ దినం ఉదయం బ్రహ్మదత్తప్రభువు ఆ సంఘారామం ప్రవేశించగానే సంఘారామ వ్యవహర్త అయిన భిక్షువు వారిని ఎదుర్కొని, వారి నమస్కృతులంది ప్రతి నమస్కారంచేస్తూ "బుద్ధం శరణం గచ్ఛామి" అని బ్రహ్మదత్తప్రభువును ఆ విహార మందిరాలలో నుండి ఒకచోట పోకవనంలో ఉన్న చిన్న పటకుటీరానికి కొనిపోయినాడు. ఆ పటకుటీరంలో కులపతి వినయగౌతమ భిక్కువాసం. వినయగౌతమభిక్కు చీనాదేశము నుండి వచ్చిన పవిత్రమూర్తి. సంస్కృత, ప్రాకృత, పాలి మొదలగు భాషలన్నీ అనర్గళంగా చదివి, అఖండ పాండిత్యము సంపాదించినాడు. ఆ వృద్ధ చైనీయ భిక్కునకు బ్రహ్మదత్త ప్రభువు నమస్కరించి, ఆయన చూపిన తుంగచాపపై అధివసించెను. బ్రహ్మదత్తప్రభువు చీనా మొదలగు దేశాలు, చైనీయుల ఆచార వ్యవహారాదులన్నీ తెలుసుకొన సాగినారు. వారిరువురకు వేదాంత విచార చర్చ జరిగినది.

స్వామిని ఒకసారి తప్పక విజయపురం దయచేయ మహారాజు శాంతిమూల ప్రభువు, మహారాణి మాఠరిసారసికాదేవీ ప్రార్థించినారని తెలిపెను. వినయగౌతమభిక్కు సంతోషం వెలిబుచ్చుతూ, తామీదివరకే రెండుమూడు పర్యాయాలు శ్రీశ్రీశ్రీ బోధిసత్వ నాగార్జున పరమార్హతుల ధర్శించామనీ, వారిని ఇంకొకపర్యాయం దర్శిస్తామనీ మహారాజునకూ, మహారాణికీ తమ ఆశీర్వాదాలు తెలియజేయండనీ తెలిపినాడు.

బ్రహ్మదత్తుడు సెలవు పుచ్చుకొని విడిదికిపోయి స్నానాదికాలు కావిచ్చి ఆ దినము తాను పూంగీమహారాజు స్కందశ్రీ ప్రభువుతో భోజనం చేయవలసి ఉన్నందున సముచిత వేషుడై, యువరాజు పూంగీయ స్కందసాగరనాగప్రభువు, ఇరువదిఏండ్ల యువకుడు తన్ను ఆహ్వానింప రాగా ఇరువురూ కలిసి మహారాజు అంతఃపురానికి వెళ్ళినారు. బంధు గృహంలో మహారాజు స్కందవిశాఖాయనక ప్రభువును సత్కరించినారు. బ్రహ్మదత్తప్రభువు మహారాజుకు నమస్కరించి దాసీజనము కాలుచేతులు కడిగి, మెత్తని వస్త్రాలచే తడియొత్త భోజనగృహానికి యువరాజు స్కందసాగర ప్రభువుతో జనినాడు.

సుందరాలంకార శోభితమగు భోజనగృహంలో మణులు పొదిగి, బంగారుతీగల పోగారించిన గంధతరు పీఠికలపై వారంద రధివసించినారు. స్కందశ్రీ ప్రభువు గురువులైన శివాచార్యులవారు ఎదురుగా మహాపీఠంపై అధివసించి ఉన్నారు. వారికి నమస్కరించే బ్రహ్మదత్తప్రభువు అసనమలంకరించెను. ఉద్దండపండితులు, యజ్ఞయాగాదులొనర్చిన బ్రాహ్మణులూ వారితోపాటు కూరుచున్నారు. రాజబంధువులనేకులు పీఠాల అలంకరించినారు.

ఆ దినమున స్కందశ్రీప్రభువు బ్రహ్మదత్తప్రభువునకు ఇరువది నాలుగు శాకములు, పదునెనిమిది పచ్చళ్ళు, నూరుపిండివంటలు, ఎనిమిది క్షీరాన్నములు, నాలుగు పులుసులు, మూడువిధాలైన పెరుగులతో దేవతలు మెచ్చే విందు గావించెను. ఆంధ్రులవంట లోకాద్భుతమని అఖిలభారతవర్షమూ చెప్పుకుంటారు. ఆ దినాన వండినవంటకాలు నలభీములకు పాఠాలు నేర్పే మహత్తుకలవి. భోజనాలైనా వెనుక పదహారు విధాల తాంబూలాలు అర్పించారు స్కందశ్రీ ప్రభువు తమ అతిథులకు.

## 2

**తాం**బూలచర్వణం కాగానే, స్కందశ్రీ మహారాజూ, బ్రహ్మదత్త ప్రభువూ ఆలోచనా మందిరాని కేగిరి.

"మహాప్రభూ! మా మహారాజుగారు, తమ్ము సకుటుంబంగా విజయపురంలో జరుగబోయే వసంతోత్సవాలకు ఆహ్వానింప నన్ను పంపినారు. వారి రాయబారిగా మహాప్రభువులను సకుటుంబంగా ఆహ్వానిస్తున్నాను."

"బ్రహ్మదత్తప్రభూ! ఇక్ష్వాకులకు, మాకు అరమరికలు లేవని మీరెరుగనిది కాదు అయినా, చిన్నవారికి రాచకార్యాలు అవగాహనకావు. క్రిందటి వసంతోత్సవంలో అమ్మాయి మనస్సు చాలా బాధపడినట్లుంది. ఈ సంవత్సరం వసంతోత్సవాలు ఇక్కడే చేయాలని ఆమె మరీ మరీ పట్టుపడుతున్నది. యువరాజూ చెల్లెలి మాటే లెస్స అంటున్నారు."

"నేను రాజకుమారితో, యువరాజుగారితో మాట్లాడి వారి మేనమామ ఆహ్వానం వారి కందియ్య దలచుకొన్నాను ప్రభూ!"

స్కందశ్రీ మహారాజు "అది బాగుంది, ప్రభూ!" అని బ్రహ్మదత్త ప్రభువునకు వీడ్కోలిస్తూ వారిని తమ మందిరాల ముఖద్వారం వరకూ సాగనంపినారు.

బ్రహ్మదత్తప్రభువు తమ విడిదికిపోయి, వస్త్రాలు మార్చుకొని, కొందరు గాయనీమణులు వీణాది వాద్యాలపై వాయిస్తూ మధురకంఠాలతో పాడుతూ ఉండగా ఆలకిస్తూ పది లిప్తలు విశ్రమించెను. సాయంకాలం కోటలోని భేరీ పదవ ముహూర్తము మ్రోయించేవేళకు నిద్రలేచి, స్నానంచేసి శుభ్రవస్త్రాలు ధరించి, అలంకారికుడు అలంకరించిన వెనుక, చతుశ్శాలలోనికి, అక్కడనుండి పూర్వసభాగృహంలోనుండి ప్రాంగణానికి వచ్చి, తనకై సిద్ధంగా ఉన్న నాలుగు గుఱ్ఱాల రథాల ఎక్కి, అడవి స్కంద విశాఖాయన బ్రహ్మదత్తప్రభువు యువరాజు దర్శనార్థం వెళ్ళినాడు. తన్నెదుర్కొన వచ్చే పూంగీయ స్కంద సాగరనాగయువరాజును కలుసుకొని, కౌగిలించుకొన్నాడు. ఈ ఇరువురు యువకులు కలిసి క్రీడాగృహానికి వెళ్ళినారు.

**బ్రహ్మదత్తుడు:** ప్రభూ! మీ మేనమామగారు తమ్ము, రాకుమారిని స్కందశ్రీ మహాప్రభువును, మహారాణిని ఈ ఏడు విజయపురంలో జరిగే వసంతోత్సవాలకు ఆహ్వానింప పంపినారు.

**స్కందసాగరనాగ:** బ్రహ్మదత్తప్రభూ! మా సోదరికి ఈ ఉత్సవాలపై అంతగా ప్రతి ఉన్నట్లు లేదు. ఆమె రాకుండా మేము రాగలమా అని ఆలోచిస్తున్నాము.

**బ్రహ్మ:** మీరు చెప్పింది ఆలోచించవలసిందే. రాజధర్మాలు మీ రెరుగనివికావు. రాకుమారి వైమనస్యానికి కారణాలు లేవననుగాని క్షత్రియుత్వం అవలంబించిన బ్రాహ్మణులం మనం. అటు క్షత్రియధర్మమూ నెరపాలి, యిటు బ్రాహ్మణ ధర్మమూ నెరపాలి. శ్రీరామచంద్రుడు రాజధర్మం కోసం కదా సీతాదేవిని అడవులకు పంపించింది.

**స్కంద:** ప్రభూ, ఏమిటా రాజధర్మం?

**బ్రహ్మ:** ప్రజారంజనమూ, శాంతీని.

**స్కంద:** ప్రజాశాంతి అంటే?

**బ్రహ్మ:** ప్రభూ! దినానికో భూపతి వస్తూంటే భూమిలో శాంతి ఏలా ఉంటుంది?
**స్కంద:** నిజమే.
**బ్రహ్మ:** రాజు నీరసిస్తే, పరరాజుకు బలం ఎక్కువౌతుంది.
**స్కంద:** చిత్తం!

"అప్పుడు పరరాజు ఎత్తివస్తాడుకదా?"

"అవును ప్రభూ!"

"అయితే రాజుకు బలమిచ్చే గొప్ప ఓషధి రాజ బంధుత్వాలు!"

"అవును."

"ఈ బంధుత్వాలు ఎక్కువ చేసుకోవాలంటే నలుగురయిదుగురు రాజులతో వియ్యమందాలి. అప్పుడు ఆ రాజుకు ఎంతో బలం! పాండవులు ద్రుపదునితో, మాత్స్యునితో వియ్యమందారు కాదా?"

"చిత్తం నా కర్థమయింది."

"వీరపురుషదత్తప్రభువు పూంగీయ రాజకుమారి శాంతశ్రీని తమ ఆత్మేశ్వరిగా ప్రేమిస్తున్నారు. మనకు వాసిష్ఠుల సహాయం కూడా అవసరం, మాళవుల సహాయమూ అవసరమే."

"చిత్తం. బ్రహ్మదత్తప్రభూ! తమ మాటలు మా చెల్లెలితో చెప్పి ఆమెను విజయపురోత్సవాలకు వచ్చేటట్లు చేయ ప్రయత్నిస్తాను."

బ్రహ్మదత్త ప్రభువు యువరాజు సెలవుపొంది తమ విడిదికి వెడలి పోయినారు.

స్త్రీల హృదయం పురుషునికి తెలుస్తుందా అని బ్రహ్మదత్తు డనుకొన్నాడు. మనుష్యులలోని సర్వశక్తులూ స్త్రీలే అయితే, పురుషునికి స్త్రీ హృదయం ఏలా తెలుస్తుంది! స్త్రీకి పురుషుని హృదయం మాత్రం అర్థం అవుతుందా ఏమి! శ్రీరామచంద్రుడు ఎందుకు సీతను అడవులకు పంపినాడు? ప్రజారాధనంకోసమే కదా! సీతామహాసాధ్వి నెంత ప్రేమించినా ఆ ప్రేమ రాజధర్మాన్ని త్రోసివేయలేదు. కాని శ్రీరామచంద్రుడే వీరపురుష దత్తుడై ఉద్భవిస్తే బహుభార్యాత్వం అంగీకరించునా? తనకీ రాజధర్మ నిర్వహణ తప్పదు. హృదయం విరక్తమైనా రాజులకు ధర్మానురక్తి తప్పనిదే. తన వైరాగ్యానికీ కళంకం ఉద్భవించింది ఇది కళంకమా?

## 3

**పూం**గీయ రాజకుమారి భవనంలో స్కందసాగర నాగప్రభువు ఆమెను కలుసుకొన్నాడు. జగత్ప్రసిద్ధినందిన వాసిష్ఠీపుత్రి ఇక్ష్వాకుశాంతశ్రీ సౌందర్యానికి ముగ్ధులై ఎంతమంది రాజపుత్రులు ఆమె చిన్నతనంలో ఆమె నుద్వాహంకావాలని స్వప్నాలు కనలేదు. కాని అన్నగారైన శాంతిమూల మహాసామంతుని స్నేహితుడు, వీరుడు అయిన పూంగీరాష్ట్ర సామంతునే ఆమె వరించింది.

పూంగీయ స్కందశ్రీ శాంతశ్రీల ప్రేమ కవిలోక ప్రశంస లందుకొన్నది. వారికడుపున యువరాజు స్కందసాగర ప్రభువు, శాంతశ్రీదేవి ఉద్భవించారు. పూంగీయ రాజకుమారి శాంతశ్రీ అపురూప సౌందర్యవతి, శాంతశ్రీ రాకుమారి ప్రత్యూష హిమబిందు స్నాతయైన

చంపకకుసుమంలా వెలిగిపోతూ, తన లీలోద్యానవనంలో పుష్పాచయం చేస్తున్న సమయంలో చెల్లెలితో మాట్లాడడానికి యువరాజు స్కందసాగర ప్రభువు అక్కడకు వేంచేసినారు.

"అన్నయ్యగారూ! ఇంత ప్రొద్దున్నే వచ్చినారు?" అని ఆ బాలిక యువరాజు కడకు పరుగిడి వచ్చి ప్రశ్నించింది.

"బ్రహ్మదత్తప్రభువు నన్ను కలుసుకొని ఎన్నో విషయాలు చెప్పినారు."

"చెప్పరా మరి! మామయ్యగారి రాజకీయాలు మామయ్యగారివి. ఆ రాజకీయాలలో భాగం బ్రహ్మదత్తప్రభువు?"

"అంత సంతోషంగా ఉన్నావు! పారిజాతపుష్పాల ప్రోవులా ఉన్నావు, అదేమి తల్లీ, అలా మాట్లాడుతావు."

"ఎట్లా మాట్లాడాను? నాకా సంతోషం? నేను రూపెత్తిన దుఃఖవతను."

"రాజధర్మము చేయకలిగే విపర్యాయాలు రాచపుట్టువులకు తప్పదమ్మా చెల్లీ."

"మీ కేమి నాన్నగారూ, మీరు మగవారు, అదృష్టవంతులు. మగవారి ధర్మాలులేరు, స్త్రీల ధర్మాలు వేరు. మగవారు ఏమిచేసినా చెల్లుతుంది."

"ఎందుకంత ఉద్వేగం చెల్లీ!"

"బ్రహ్మదత్తప్రభువు రాయబారం నా కర్థం కావటంలేదనా? ఆ నిష్ఠుర రాజధర్మానికి నేను బలికావాలనేకదా వారి రాయబారం."

"చెల్లీ! బావగారు అస్వతంత్రులు."

"బావగారికేం? పాపం అధికస్య అధికం ఫలం. వెనక శ్రీకృష్ణుడు లేడా? ఆ తర్వాత ఉదయనుడు, ఆ తర్వాత అగ్నిమిత్రుడూ, మామయ్యగారూ!"

"అయితే బావగారు అందరితోపాటే."

"అవునండీ మీరు మగవారు. చెల్లెలినయితేనేమి నేను ఆడదానినిగా! అందుకని మీకు చీమయినా కుట్టదు."

"నాకు మతిపోతున్నదమ్మా!"

"నా విషయంలో మీకు మతిపోవడం మంచిదికాదు. నేను బౌద్ధ భిక్కుని కాదలచుకొన్నాను. ఇక్ష్వాకు యువరాజుగారు వారి రాజనీతినీ, ధర్మాన్నీ అడ్డంలేకుండా ఉపయోగించుకోనియ్యండి."

"నిన్ను బావగారు హృదయమార ప్రేమిస్తున్నారని నేను అభిప్రాయం పడ్డానే?"

"హృదయమార ప్రేమిస్తున్నారా? పాపం! నాకు చాలా విచారంగా ఉంది. వారు ఆత్మారగా భట్టిదేవిగారిని, మనస్సారగా ఉజ్జయినీ రాజకుమారిని, ప్రియమారగా బాపిశ్రీ కుమారిని ప్రేమిస్తున్నారు."

"ఆయాస పడకు చెల్లీ. మనం రాచబిడ్డలం కావడంవల్ల మన సౌఖ్యంకంటె దేశసౌఖ్యం ప్రధానం మనకు. ఇంతకంటె ఏమి చెప్పగలను?"

"అన్నగారూ! మీరు కలతపడకండి. ఏదో మతిలేనిదాన్ని. మీరందరూ విజయపురం వసంతోత్సవాలకు వెళ్ళుదామంటే నా అభ్యంతరం లేదు. నాయనగారు ఆనతిస్తే ఏపని అయినా సంతోషంగా చేస్తాను."

ఆ మాటలంటూ ఆ బాలిక అక్కడినుండి మెరుములా మాయమైంది. చెల్లెలి మాటలకు ఆశ్చర్యమందుతూ, ఏదో భయం తన్ను అవహింపగా, కనుబొమలు ముడివడగా, ఆలోచిస్తూ స్కందసాగర యువరాజు అక్కడినుండి వెళ్ళిపోయెను. పూంగీయ శాంతశ్రీ రాకుమారి పరుగున మాధవీ నికుంజంలోనికి పోయి, అక్కడ ఒత్తుగా పడియున్న బండిగురువిందపూలపై బోర్లగిలపండుకొని పట్టజాలని దుఃఖంతో కరిగి పోయింది.

## 4

**ఆం**ధ్రదేశము సస్యశ్యామలము. చంద్రగుప్తుని కాలంనాడున్న ధాన్యకటకము, శ్రీకాకుళము, కంటకశైలం, ప్రతీపాలపురము, ధనదుపురము, మోసలపురము, మహాకాండూరు, కందరపురము, పూంగీప్రోలు, మహానాగపురము, వేంగీపురము, కొలనిపురము, ప్రతిష్ఠానము, వైజయంతి, సప్తగౌతమీపురము, మునిక పురము, గృధ్రహారపురము మొదలగు ముప్పది మహాపురములు నానాటికీ పెరిగి శాంతిమూలుని కాలానికి ఏబది మహానగరాలైనవి. ప్రథమ శాతవాహన మహారాజుల కాలంలోలేని ఎన్నో సామంతరాజ్యాలు ప్రబలినాయి. శాతవాహనుల గురించి గాథలు పెరగిపోయినాయి. బృహత్కథ ఎన్నిప్రతులో వ్రాయించుకొంటూ ఆంధ్రులు దేశాలన్నీ ఆ గాథలచే నింపినారు.

దేశం సుభిక్షం అవడంచేతనూ, రాజులు ఎప్పుడూ ధర్మయుద్ధాలే చేస్తూ ఉండడం వల్లనూ పల్లెటూళ్ళకు ఏమీ ఇబ్బందులు కలుగలేదు. ముట్టడులు జరిగినప్పుడు నగరాన్ని చుట్టి ఉన్న కోటదగ్గరే యుద్ధం జరిగేది. ఏపక్షం వారూ సాధారణ ప్రజలను హింసపెట్టేవారు పైగా వర్తకులకూ, యాత్రికులకూ, సాధారణ ప్రజలకు ఏవిధమైన నిర్బంధము కలుగజేయకుండా వారి దైనందిన జీవితాన్ని సుఖంగా సాగనిచ్చేవారు. వర్తకులు ఇరువాగుల వారితో వర్తకం చేసేవారు. యుద్ధం ముగియగానే, వానవచ్చి వెలిసినట్టు ఉండేదికాని, తుఫాను వచ్చి, వెళ్ళిపోయినట్లు ఉండేదికాదు.

ఆంధ్రదేశంలో పది సంవత్సరాలకో, ఆరు సంవత్సరాలకో అప్పుడప్పుడు గాలి వాన వస్తూ ఉండేది. ఆ సమయంలో పంటలు నాశనం అయ్యేవి. తొలకరికాలంలో వడగళ్ళవానవచ్చేది. పైరు పంటలు కోతలకు వచ్చినవి నాశనం అయ్యేవి. పంటలు నాశనం అయినప్పుడు మహదాంధ్రదేశంలో ఈ గాలివానా, ఈ రాళ్ళవానా అంటని ప్రదేశాలు ఎప్పుడూ ఉండేవి. అవీకాక ప్రతిగ్రామానికీ కరువుగాదెలుండేవి. ప్రతి భూపాలుని కోటలోనూ కరువుగాదెలుండేవి. కాబట్టి వెంటనే ప్రజాసహాయకర్మ అమలులోకి వచ్చేది. ఒక్క కుటుంబంగాని ఒక్క ప్రత్యేక వ్యక్తిగాని ఈతిబాధలేమీ పొందకుండా జరిగి పోయేది.

గ్రామం సంపూర్ణ స్వత్వాలు కలిగిన రాజ్యము వంటిది. ఆ దినాలలో ప్రతి మనుషునకూ రాజకీయ పరిజ్ఞానము కొద్దోగొప్పో ఉంది. ధర్మమంత అక్లిష్టంగా ఉండడమే దీనికి కారణం. విదేశాలకు ఎగుమతి అయ్యే వస్తువులు పట్టణాలలోనే నిర్మించేవారు. వస్త్రాలు, వర్ణాలు, నూనెలు, సుగంధ ద్రవ్యాలు, బంగారము, వెండి మొదలగులోహాలు, లోహపు వస్తువులు పనిముట్లు, ఆయుర్వేద ఔషధాలు మొదలయిన వెన్నియో పెద్దనగరాలనుండి ఎగుమతి అయ్యేవి.

ఆంధ్రదేశంలో నేతనేసే ప్రదేశాలలో కొన్ని పూంగీప్రోలు చూట్టూ ఉన్నాయి. సన్ననినూలు, ముతకనూలు, అతిసన్ననినూలు, గ్రామాదులలో ఒడికి అమ్ముతారు. ఆ నూలు అంతా ప్రోగుచేసి దేవసాలీసంఘంవారు కొంటారు. వారే ఆ నూలుకు రంగులు అద్దించేవారు. నేతవారు చిత్ర చిత్ర నేతలతో వస్త్రాలు విన్యాసం చేస్తారు. వణిక్సంఘంవారు ఆ వస్త్రాలను కొంటారు. అప్పుడని ఎగుమతి అవుతూ ఉంటాయి.

బ్రహ్మదత్తప్రభువు ఇవన్నీ పూంగీప్రోలు పట్టణంలో పరిశీలించారు ఎన్ని చూచినా బ్రహ్మదత్తప్రభువునకు ఏమీ తోచడం లేదు. నిర్మల మయిన మనస్సూ, నిశ్చలమయిన హృదయమూ కలిగిన బ్రహ్మదత్తుడు ఏమి తోచక సంతతమూ తిరగడము ఇవిచూచీ, అవిచూచీ కాలక్షేపం చేయడం ప్రారంభించినారు. ఒకసారి ఆయన ఓడయెక్కి సముద్ర విహారం చేసినాడు. ఇదే ఆయనకు మొదటిసారి సముద్రయానం చేయడం.

బ్రహ్మదత్తుడు ఎక్కిన చిన్నఓడ నాలుగు తెరచాపలు ఎత్తుకొని రివ్వు రివ్వున వెళ్ళిపోతున్నది. కెరటాలు సముద్రదేవుని ఉబికే పక్షంలా ఉన్నాయి. ఆ కెరటాలను చీల్చుకొంటూ రివ్వురివ్వున తేలిపోతూ ముందుకు వంగి, పైకి తేలుతూ నాట్యంచేస్తూ ఆ నౌక ప్రయాణం చేస్తున్నది. ఐదారు యోజనాలు అలా వేగంగా వెళ్ళిపోతూ ఉన్నదా తరణి. బ్రహ్మదత్తప్రభువు ఓడ ముందు భాగంలో నావికుని ప్రక్కనే నిలుచుండి ఆ ఓడ సౌందర్యము, ఉబికే తరంగాలలోని నీలిలోతులు, ఎగిరే చేపలు, పోతవాహకు కేకలు, సముద్రంపై తేలిపోయే పక్షులు, నౌప్రాక్దండము నీళ్ళను చీల్చుకొనిపోయే విచిత్రములన్నీ చూస్తూ నిలబడినాడు. ఓడ కొంతదూరం సాగగానే బ్రహ్మదత్తప్రభువుకు కొంచెం తలతిరిగి, వికారం పుట్టి డోకు వెళ్ళిపోయింది. కాని తన సర్వశక్తులు కేంద్రీకరించుకుని, ఆ వికారాన్ని అణచుకొన్నాడు.

రెండుజాములు గడచినవెనక తరణిలోవచ్చిన వంటబ్రాహ్మణుడు సిద్ధంచేసిన భోజనమారగించి, కొంచెం విశ్రాంతి తీసుకున్నాడు. ప్రొద్దు పడమటికి మళ్ళి జాముకాగానే బ్రహ్మదత్తప్రభువు నౌకోపరిభాగానికి విచ్చేసెను. నావికానాయకుడు ప్రభువునకు నమస్కరించి "ప్రభు, ఓడను తూర్పునుండి ఉత్తరానికి మళ్ళించినాము. ఘడియకు గోరుతవేగంతో వెడుతున్నది. అందుకు కారణం గాలి పడిపోవడమే ప్రభూ!" అని మనవి చేసినాడు.

## 5

బ్రహ్మదత్తునకు పడవ వెనక్కుతిప్పు అనడానికి బుద్ధిపుట్టలేదు. ఏమవునో అవుగాక! వరుణదేవుడే తన హృదయంలోని ఆవేదన తీర్చుగాక అనుకొనినాడు. తీరానికి ఆరుయోజనాల దూరాన ఓడ ఉత్తరాభి ముఖమై పోతున్నది. ఓడలో పది పదినాల వరకు మంచినీరు, భోజన సామాగ్రీ ఉన్నది. ఒకదినము గడిచిపోయినది. ఓడనాయకుడు మరునాడుదయం బ్రహ్మదత్తప్రభువును కలిసికొని "ప్రభూ! మనము కాకుళానికి ఎదురుగుండా ఉన్నాము" అని మనవి చేసెను.

"ఓడను పోనియ్యవయ్యా! గోదావరి ముఖద్వారంవరకు వెళ్ళి తిరిగి వద్దాము."

"చిత్తం మహాప్రభూ!"

ఓడ ప్రత్యూప పవనాలకు ఊగిపోతూ నాట్యకత్తియలా సాగిపోతున్నది. బ్రహ్మదత్తుని హృదయము ఏదో ఆనందంతో నిండి పోయింది.

*ఈ మహాసంద్రమే విశ్వం*
*విశ్వమధ్యమ్ములో ఈనౌక!*
*ఏ తీరమీ మధుర వాతాంకురము పుట్టి*
*ఏ తీరముల చేర నేతెంచు చున్నదో?*
*ఏ మహాజలరాశి నీతరంగా లుద్భ*
*వించి సర్వాశలకు పయనించిపోవునో?*
*ఏ చిత్రలోకాల నీమనసులోకమ్ము*
*ఉదయించి కాలాన పదములిడివచ్చునో?"* అని పాడుకొన్నాడు.

తాను ధనకప్రభువు. తనరాజ్యంలో బంగారం పండుతుంది. తన కోశాగారంలో కోటకొలది సువర్ణఫణాలు రాసులుపడి ఉన్నాయి. తన తండ్రి బుద్ధి బృహస్పతీ, అఖండ వీరుడూ, తమ సైన్యాలు ఇక్ష్వాకురాజ్య సైన్యంలో ముందంజవేసేవి. అందుకనే మహారాజు తనకు కూతునీయ సంకల్పించారు.

తానొక సామాన్యుడైతే మహారాజు తనకు బిడ్డనీయ నెట్లు సంకల్పిస్తారు? కాక, శాంతిశ్రీ రాకుమారి సాధారణ కుటుంబపు బాలిక అయితే నామెను ఉద్వాహం కావడానికి ఒప్పుకుంటాడా తాను? ప్రపంచమంతా ఈలా ధనానికీ, ప్రాభవానికి బానిస అయి ఉన్నదా?

తనకు వివాహం చేసుకోను అనగలిగిన వైరాగ్య భావము లేదు. తన హృదయంలో బౌద్ధ భావాలకు చోటులేదు. తాను ఆర్ష ధర్మ ప్రకారం వివాహం చేసుకోవాలిగదా? అలాంటి సమయంలో మహారాజు తమ కుమార్తెను తనకు ఇస్తామంటున్నారు.

ఈ ఆలోచనకి అడ్డం తగులుతూ, నౌకానాయకుడు పరుగున వచ్చి బ్రహ్మదత్త ప్రభువునకు నమస్కరించి "ప్రభూ! గాలివాన పుట్టే సూచనలు కనబడుతున్నవి. వసంత కాలంలో గాలివానలు రావడం అరుదు. ఇరవై ఐదేళ్ళకో పర్యాయము ఈలాంటి గాలివానలు వస్తూ ఉంటాయి. మనం తీరం చేరడానికి వ్యవధిలేదు! గాలి తీరంవైపునుంచి తూర్పుగా సాగేటట్లున్నది. కాబట్టి మనం ఈశాన్యంగాపోయి మహానదీముఖద్వారం చేరుకోడానికి ప్రయత్నిద్దాము" అని మనవి చేశాడు.

ఆ నాయకుడు అనడం ఏమిటి ఇంతట్లో పడమట దూరంగా చక్రవాళాచలముపై నల్లని కాదంబినీమాల ప్రత్యక్షమైంది, గాలిపూర్తిగా ఆగిపోయింది. ఉక్కపోత ఎక్కువైంది. గాలిపీల్చుకోడం కష్టంగా ఉంది. సముద్రపునీళ్ళల్లో తళుకు ఎక్కువైంది. రాబోయే గాలివానపై గౌరవంతో కెరటాలు అడగిపోయినవి.

బ్రహ్మదత్తుడు చిరునవ్వుతో "నీ ప్రయత్నంలో నువ్వు ఉండు" అన్నాడు.

"ప్రభూ! నేను గాలివానకు సిద్ధంచేయాలి మన నౌకను. తాము గాలి వానలో ఎప్పుడు ఓడమీద ఉన్నవారుకారు."

"ఏమీ భయంలేదయ్యా! ఇప్పుడీ ఝంఝామారుతమే నా స్నేహితుడు, గురువూనూ! ఆయన దర్శనంకోసమే ఉవ్విళ్ళూరుతున్నాను."

ఆ నాయకుడు బ్రహ్మదత్తప్రభువువంక ఆశ్చర్యపడి చూచినాడు. ఆయన మోము ఆనందంతో నిండి ప్రకాశమానమైంది.

నాయకుడు విసవిస వెడలపోయి నావికులతో తెరచాపలూ, ఆకాశాన్ని చుంబించేటట్లున్న స్తంభాలు దింపించివేశాడు. తట్లమీదున్న ప్రతివస్తువు లోపలికి పంపించివేశాడు. చివర పని జరిగిందో లేదో, మేఘాలు పడవపైకి వచ్చి వేసినవి. ఒక మహాకల్లోలము మేఘమంతైవచ్చి ఓడమీద విరుచుకు పడింది. బ్రహ్మదత్తప్రభువు ముందు కానులో ఒక మధ్యకొయ్యను గట్టిగా పట్టుకుని నిలిచి ఉన్నారు.ఆ మహాకల్లోలము ఆకాశమంటివస్తున్నది. నౌక లోనికి ఉరికేందుకు వ్యవధిలేదు. ఆ మహావాయువు రాబోతున్నదని ఊహించి, ఆ ప్రభువు ఉత్తరీయము నడుమునకు బిగించి, నావికులు తమ ధోవతులను పైకి బిగించికట్టినట్లు కట్టుకున్నారు. ఆ కల్లోలము విరుచుకు నౌకమీద పడింది. వెంటనే ఆ కొయ్యను గట్టిగా కౌగిలించి పట్టుకొని, ఊపిరిబిగించుకొన్నాడు. చుక్కాని నడుపు మనుష్యుడు తాడుతో చుక్కాని కొయ్యను తన్నుదా కట్టుకొన్నాడు.

ఓడమీద ఆ మహాకల్లోలం విరుచుకుబడబోయేముందే చుక్కానివాడు ఓడను పక్కగా త్రిప్పివేసినాడు. కాబట్టి ఓడ అడ్డదెబ్బ తినలేదు. నావికులందరు లోనికిపోయి తట్టుతలుపులు లోపల బిగించుకున్నారు. నాయకుడు మాత్రం ముందు భాగాన్న ఉన్న జలదేవతా విగ్రహానికి తన్ను కట్టివేసికున్నాడు. కల్లోలము ఓడపైకి దుమికి ఓడను సముద్రగర్భానికి తీసుకొనిపోయి పైకి తేల్చింది. దైనందినము హఠయోగా మాచరించే బ్రహ్మదత్తప్రభువు కల్లోలము విరుచుకుపడగానే కఱ్ఱలో కఱ్ఱ అయినాడు. ఆయన చిన్నకొయ్యలో కొయ్య అయి ఇనుపగొలుసు బిగించినట్లు భల్లూకం పట్టుపట్టినట్లు కొయ్యను కౌగిలించుకొన్నాడు.

## 6

ఆ కల్లోలము నౌకపైనుండి ఏనుగు లేడికూనను దాటిపోయినట్లు దాటి పోయినది. ఓడవంగిపోయి, తిరిగి సర్దుకుంది. తట్టుపైనఉన్న ముగ్గురు సముద్రంలోనికి కొట్టుకు పోలేదు. కాని ప్రాణంపోవడం తప్పి కన్నులు లొట్టపోయినట్లయింది వారికి. ఆ మహా కల్లోలము వెళ్ళిన దగ్గరనుండీ ఉత్తుంగ తరంగాలు ఓడతో కందుక క్రీడచేస్తున్నాయి. ఓడ మరుసటి ముహూర్తంలో చిన్న చిన్న ముక్కలక్రింద బ్రద్దలుకొట్టేటట్లున్నాయి ఆ భయంకర తరంగాలు. అలాంటి సమయములో ఓడ నడపడం పద్మవ్యూహం చీల్చి వెళ్ళడం వంటిదే! నావికా నాయకుడు, చుక్కానివాడు ఈ లాంటి గాలివానలలో ఎన్నిసారులు ద్వీపాంతరాలకు పోయి వచ్చినారో? కెరటాలకు అడ్డుకోణంగా లేకపోవడంవల్ల గాలికి ఎదురునడవక గాలితో పాటే పోవడంవల్లా ఓడ శర వేగంతో ముందుకు సాగిపోతున్నది.

ఓడ ఎక్కడకు పోతున్నదో? రాచకార్యంకోసంవచ్చి, తీరికూర్చుండి తాను పడవమీద ప్రయాణం చేయడమేమిటి? పూంగీప్రోలులో స్కందశ్రీ ప్రభువుతో తానొకదినము సముద్రవిహారం చేసివస్తాననికదా తెలిపినాడు. ఇంతలో ఈ విశ్వంలో ఏమూల దాగుకొని ఉన్నదో ఈ ప్రళయ ఝంఝమారుతం అదను కనిపెట్టి ఒక్క ఉరుకున తనమీదకు

ఉరికింది. ఇంత చిన్న ఓడ ఈ దాడికి ఆగుతుందని నమ్మకంలేదు. పూంగీమహారాజు, విజయపురానికి వెంటనే గజవార్తలు పంపును. తన్ను గురించి ధుఃఖించేది తన తల్లి. తండ్రికి ప్రపంచ సుఖదుఃఖాలు అంటనే అంటవు. ఇంక శాంతిమూల చక్రవర్తి తన్ను యువరాజుతోపాటు ప్రేమించారు. ఆయన కొంచెం దుఃఖించవచ్చును.

గాలివాన తుంపర మంచుగడ్డల వర్షంలాగ గజగజలాండిచే చలిలో నీటి మట్టానికి సమంగా మహావేగంతో లోకాన్ని ముంచెత్తుతూ ఉంది. కారు మేఘాలు కమ్మిచీకటిపడే సమయంలా ఉన్నది. ఆకాశాన్ని అంటే కల్లోలాలు ఒకదానికొకటి తగిలి ఫెళ్ళున పేలుతున్నాయి. ఆ కల్లోలాల నీటితుంపరలు చేటల కొద్దీ తట్టుపైన పడుతున్నవి. ఒక్కొక్క కల్లోలం కోటిగదాఘాతాల శక్తితో నౌకను మోదుతున్నది. కెరటాల శక్తికి ఓడ మహావేగంగా పూర్వాభి ముఖమై వెళ్ళిపోతున్నది.

బట్టలన్నీ తడిపి, దేహమంతాతడిసి చలి గాఢంగా పొదివికొన్నది. జుట్టు విడిపోయి బ్రహ్మదత్తప్రభువు తలచుట్టు చిన్న చిన్న నీలికాంతులులా ప్రసరించి ఉంది. కాని ఆ యువక రాకుమారుని హృదయంలో ఏదోమహానందం! పైన సర్వలోకమూ ఏదో భయంకర ఘోషతో బాణపాతంవంటి గాలివానతో శ్రుతికలిపి తాండవిస్తున్నది.

*పథములన్నీ ఆవరించిన*
*ప్రళయదేవత తాండవించూ*
*ఫెళ ఫెళారావముల అందెలు*
*ప్రియము నా హృదయానికిన్.*

ఎన్ని ముహూర్తాలు అలాప్రళయంలో భాగమై కోడ ప్రయాణించిందో? బ్రహ్మదత్తప్రభువు లోని భాగానికిపోయే తలుపుతట్టి లోనికి వెడలిపోయేను. నాయకునీ, చుక్కానివానినీ లోనికిపంపేందుకు ఇతరులు వెళ్ళి వాళ్ళస్థలాలు ఆక్రమించినారు. బ్రహ్మదత్తప్రభువు వేడినీరు స్నానమాచరించి రాంకవ వస్త్రాలు ధరించి, భోజనమాచరించి, శయనించి నిదురపోయినాడు. కొన్ని జాములు గాలివానలో భాగమైపోయినందున ఆ ప్రభువునకు ఒళ్ళు తెలియని నిదురపట్టింది. ఎంతకాలము గాలివాన వీచినదో, బ్రహ్మదత్త ప్రభువునకు మెలకువ వచ్చునప్పటికి నిమ్మకునీరు పోసినట్లున్నది. బ్రహ్మదత్తుడు చటుక్కున లేచి ప్రక్కనున్న జయఘంటిక మ్రోగించినాడు. వెంటనే సేవకుడు పరుగెత్తుకొని వచ్చినాడు.

"ప్రభూ!"

"ఎంత ప్రొద్దుపోయింది?"

"ఉదయం మహాప్రభూ!"

"నేను ఆరుయామాలు నిద్రించినానా?"

"చిత్తం దేవా!"

"గాలివాన తగ్గినదా?"

"నిమ్మకు నీరు పోసినట్లున్నది"

"ఓడ!"

"ఒక్కసారి చుక్కాని విరిగిపోయింది. మళ్ళీ ఇంకో చుక్కాని కట్టినారు."

"ఎవరూ నష్టం కాలేదుకదా?"

"అందరూ క్షేమం మహాప్రభూ! ఓడ ఏమీ ఎరుగని నంగనాచిలా ప్రయాణం చేస్తున్నది"

"ఆశ్చర్యమే!"

"చిత్తం."

"స్నానానికి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయా?"

"చిత్తం!"

"మన నౌక ఎక్కడ ఉన్నట్లు?"

"మనం దారితప్పి కొన్నివందల యోజనాలు వచ్చినామట మహాప్రభూ! రావడంవల్ల సువర్ణద్వీపం దరిదరికి వచ్చినామేమోనని, అతని అంచనా ప్రకారం సువర్ణదీవి నలభై యోజనాల దూరంలో ఉంటుందేమోనని. ఇంక మూడున్నర దినాలలో మనం సువర్ణ ద్వీపమో, మలయా ద్వీపమో చేరగలమనీ అన్నాడు."

"అబ్బా! భగవంతుని లీలావిశేషమే!"

బ్రహ్మదత్తప్రభువు స్నానంచేసి సంధ్యావందనాదికా లొనరించి, సముచితవేషంతో తటమీదకు వెళ్ళినాడు. అప్పుడే నావికులందరూ తట్టు మీదికివచ్చి తెరచాపకొయ్యలు ఎత్తివారూ, తెరచాపలు తగిలించువారూ పగ్గాలు బిగించువారునై యుండిరి.

## 7

ఓడ మూడ దినాలకు సువర్ణ దీవితీరాలకు వచ్చింది. తీరంవెంట ఇంద్రదత్తు (నౌకా నాయకుడు) తన చిన్ననౌకను నడుపుకుంటూ మాయామాయా నగరమురేవు చేరెను. ఆ పట్టణంలో సువర్ణులూ, ఆంధ్రులూ కలిసి ఉన్నారు. అక్కడక్కడ కళింగాంధ్రులు, ఉత్తరకళింగులు, మాగధులు, పాండ్యులు కొన్ని కొన్ని కుటుంబాలవారున్నారు. సువర్ణులు నాగవంశీకులు. గుండ్రని పలచనిమోము, మీసాలు తక్కువ, పసుపుపచ్చని ఛాయ, కళ్ళు కొంచెం వంకర, ఒత్తయిన పెదవులు. సువర్ణనాగులలో ఒక విధమైన సౌందర్యం ఉన్నది. ఇక్కడకు వలస వచ్చిన ఆంధ్రులు గుండ్రని తమ పైశాచప్రాకృతలిపి వీరికి నేర్పినారు. సువర్ణులు కొంచెం అనువాసికంగా మాట్లాడువారు. మాయామాయా పట్టణము ఆంధ్ర శాతవాహన కాలంలో నిర్మించినారు. ఆనాటినుండి ఆ పట్టణము దినదినాభివృద్ధినంది ఈనాటికి సువర్ణద్వీపములోని ముఖ్యపట్టణమైనది.

ఇంద్రదత్తుడు ఇదివరకు అనేక పర్యాయాలు మాయామాయా పట్టణానికి విచ్చేసినాడు. మహాఘనము (లంగరు) దింపి ఓడను రేవులో బంధించి ఓడ దగ్గరకు వచ్చిన చిన్ననావలో నెక్కి అందరూ పట్టణం చేరిరి. ఇంద్రదత్తుడు ఒక నాగశిబికను మాటలాడి అందు బ్రహ్మదత్త ప్రభువును ఎక్కించి, తానొక పొట్టిగుఱ్ఱము నధిరోహించి మాయామాయా పట్టణ పాలకుడైన ఆంధ్రప్రభువగు కన్హ శాతవాహనరాజు కడకు కొనిపోయినాడు. కన్హ శాతవాహనప్రభువు అడవి ధనక స్కందవిశాఖాయనక బ్రహ్మదత్తప్రభువు రాక విని ఆశ్చర్యంతో తన సభాభవనానికి విచ్చేసినారు.

"బ్రహ్మదత్త ప్రభువులా! చాలా ఆనందం! ఎంతో ఆనందంగా వుంది. కథలులా విన్నాము మా జన్మదేశం గురించి."

కన్హ శాతవాహనుని భాష బ్రహ్మదత్తప్రభువునకు అర్థం కాలేదు. ఆంధ్రభాష ఎప్పటికప్పుడు మారుతూ ఉన్నది. కన్హ శాతవాహనుని భాష గౌతమీపుత్రుని కాలమునాటి ఆంధ్రముతో సువర్ణ ద్వీపభాష బాగా మిశ్రమం చేసిన భాష. ఆ భాష ఐంద్రదత్తునికి బాగా తెలుసును. ప్రభువులిద్దరూ ఒతరినొకరు నమస్కారం చేసిన తర్వాత ఐంద్రదత్తుడు సగౌరవంగా సమీపాన నిలబడి ఒకరిభాష ఒకరికి తెలియచెప్పుతూ ద్విభాషి అయినాడు.

"ఇక్కడ మన దేశస్థులు ఎంతమంది ఉన్నారు ప్రభూ!"

"ఆంధ్రదేశం వివిధ భాగాలనుండి వచ్చినవారు ఈ చుట్టుప్రక్కల ఇరువదివేల మంది ఉంటారు. అందులో పన్నెండువేల మంది సైనికులే!"

"ఈ శస్థలకూ, మనవారికీ పొత్తు బాగా ఉన్నదా?"

"అవును ప్రభూ! ఈ ద్వీపవాసులకు మాకూ అఖండస్నేహం. చాలాకాలం క్రిందటే ఇక్కడ తథాగత ధర్మం బాగా ప్రాకింది. అంతకు ముందు నుండీ కూడా మనదేశాన్నుండి రత్నవర్తకానికి చాలామంది వణిక్కులు వస్తూ ఉండేవారు. ఇప్పటికి సుమారు రెండువందల సంవత్సరాల క్రితం మా పూర్వీకులయిన ప్రభువు కొన్ని కుటుంబాలతో, వేయి మంది వీరులతో ఈ పట్టణ ప్రాంతాలనే దిగి, ఇక్కడ ఈ కోట నిర్మించారు. ఈ కోటచుట్టూ ఈ మహాపట్టణం పెరిగిందట."

"తాము మన దేశం వచ్చినారా ఎప్పుడైనా?"

"లేదు. యువరాజు నిచటనిలిపి, ఎప్పుడైనా రావాలనీ, అక్కడి క్షేత్రాలన్నీ దర్శించాలని కుతూహలం. మేము ఇక్కడి రాజకుటుంబాలతో సంబంధ బాంధవ్యాలు నెరపుతున్నాము. మా తల్లిగారు అమరపుర మహారాజుగారి తనయ. నేడక్కడ మా మేనమామగారు రాజ్యం చేస్తున్నారు."

"తమ పోలికలు అన్నీ మన దేశంలోని ప్రభువుల పోలికలే."

"నేను మా తండ్రిగారి పోలిక. మా తండ్రిగారు మన దేశంలో పుట్టినారు. మా నాయనమ్మగారు ఆంధ్రదేశపు ఆడబడుచు. మా నాయనగారి పురుదుకోసం ఆ దేశమే వెళ్ళినారట! తాము మాకు అతిథులు కావటంవల్ల ధన్యులం."

బ్రహ్మదత్తప్రభువు ఓడలో ఉండడం మంచిదికాదని, తమ అతిథి భవనంలో విడిది చేయాలనీ కన్హ శాతవాహనుల మహారాజు కోరినారు. కాబట్టి బ్రహ్మదత్తప్రభువు ఆ అతిథి మందిరం ప్రవేశించారు. ఐంద్రదత్తుడు ఓడలోనికి పోయి బ్రహ్మదత్తుని సేవకునీ, వంటబ్రాహ్మణునీ, పెట్టెలనూ, ఆయుధ పెటికనూ పంపెను.

తనకోసం పూంగీప్రోలులో, విజయపురంలో ఆతురతతో ఉంటారు. ఉండని! మళ్ళీ సముద్రందాటి వెళ్ళడము జరుగునా? ఇంతవరకు తన ఓడ సురక్షితంగా రేవుచేరడమే ఆశ్చర్యం. మళ్ళీ సురక్షితంగా తిరుగు ప్రయాణం చేస్తుందని నమ్మకం ఏమిటి? ఒకవేళ తాను సురక్షితంగా తన దేశం చేరితే మృత్యుముఖాన్నుండి బయటపడిన వానిని చూచినట్లు చూస్తారు తన తల్లిగారు. శాంతిమూల మహారాజు వీరపురుషదత్త

యువరాజున్నూ ఆనందం పొందుతారు. మహారాజకుమారి శాంతిశ్రీ ఏమనుకొంటుంది? మహారాజు బలవంతం చేసి అప్పగించిన గురువు వదలినాడు అని ఆనందిస్తో ఉండే బాలిక, తాను తిరిగి వెళ్ళగానే మళ్ళీ దాపురించాడు ఈ పిశాచి అనుకుంటుంది. ఇంత గాటంగా తనకీ ఆలోచన ఎందుకు కలగాలని బ్రహ్మదత్తుడే ఆశ్చర్యం పొందినాడు.

ఓడ మునిగిపోవచ్చునన్న సమయంలో ఆ అద్భుత సుందరాంగి మోము స్పష్టంగా తనకు ప్రత్యక్షమయింది. తన ఆలోచనా పథాలలో ఆ బాలిక ఎప్పుడూ ప్రత్యక్షమౌతూ ఉన్నది. ఆమె దివ్యమధురవాణి తన హృదయాన్ని గగ్గోలు పరుస్తుంది. తాను ధర్మాభిరతుడే కాని చిత్తాభిరతుడు కానని అనుకున్నాడు. తన మనస్సు ఏలాంటి సమయములోను వికారం పొందలేదు. కాని ఆ లోకైకసుందరిని మహారాజు తనకు శిష్యురాలినిగా చేసినప్పటినుండి తన మనోగతే మారిపోయింది. తన్నేదో ఆనందమత్తత ముంచివేయడం సాగించింది. ఆ బాలికను చూడడము, ఆ బాలిక మాటలు వినడం జన్మకు సాఫల్యం చేకూర్చినాయి అన్న భావం ఏర్పడింది. శాంతి మూలమహారాజుతో జైత్రయాత్రకు వెళ్ళినప్పుడూ అంతే.

ఆమె స్వచ్ఛ సువర్ణాంగాలు, ఆమె మధురకంఠకాకలీస్వనాలు తనకు మతిని పోగొట్టేవి. కాని ఆ బాలిక మాత్రం తన్ను లెక్కచేయకుండానే సగౌరవంగా పాఠాలు చదువుకొనేది. బ్రహ్మదత్తప్రభువు ఆ బాలికాగతమైన మనస్సు మరలించుకొనే యత్నం మానివేసి ఆ భావమే తన్ను అమృత ప్రవాహమై ముంచివేయ, అందులో విచిత్రానందంతో తేలిపోసాగినాడు.

## 8

**త**న నౌక చిన్నదైనా ఏలాంటి గాలివాననైన ఎదుర్కోగలదని కొంత ధైర్యం పొంది నారు పూంగీయ స్కందశ్రీ ప్రభువు. నౌకానాయకుడు ఇంద్రత్తుడు నావికులలో అగ్రగణ్యుడు అనేది కూడా కొంత ధైర్యం సమకూర్చింది. అయినా వేసవికాలంలో గాలివానవస్తే అతిభయంకరంగా వస్తుంది. రాళ్ళవర్షంతో కలిసివచ్చే భయం కూడా ఉంది. బ్రహ్మదత్తుడు ఓడప్రయాణం చేసి ఎరగడు. అతడు మహాజ్ఞాని. యువకుడయినా పెద్దలందరూ గౌరవించే రాజ్యాంగవేత్త, ప్రజారంజకుడు, ప్రియదర్శి, ఉత్తమ బ్రాహ్మణుడు. శాంతిమూలమహారాజు కాయన అత్యంతప్రియుడు, మహారాజుకు బ్రహ్మదత్తప్రభువు అల్లుడు కావచ్చుననికూడ కర్ణాకర్ణిగా విన్నాడు.

తాను బ్రహ్మదత్తప్రభువును ఓడప్రయాణము చేయనివ్వకుండా ఉండవలసింది అని స్కందశ్రీ పూంగీయప్రభువు చెదిరిన మనస్సుతో సేవకుల పంపి రేవునుండి ఎప్పటి వార్తలప్పటికి తెప్పించుకొంటూ ఉండెను. ప్రళయంగా గాలివాన వచ్చి సముద్రతీరం దేశంమీద తాకిందనీ, సముద్రంలో ప్రయాణం చేస్తున్న ఓడలకిది ఎక్కువ మొప్పమనీ నావికులలో అనుభవంగల వారివల్ల స్కందశ్రీ ప్రభువునకు వార్తలందాయి. నేలమీద ముసురు వానగాలితో దినమున్నర ఉంది. ఆ వెనుక ఫెళ్ళున ఎండ కాసింది. ఈ ముసురు, ఝంఝూమారుతము సముద్రంమీద రెండుదినాలపైగా ఉంటుందని నావికులు స్కందశ్రీ ప్రభువునకు విన్నవించారు.

మూడు దినాలయినది, నాలుగు దినాలయినది, అయిదు, ఆరు దినాలయినది, సముద్రంనుండి ఏమీ వార్తలులేవు. గాలివాన విడిచినపిదప స్కందశ్రీ ప్రభువు తన యుద్ధనౌకలు నాల్గింటిని సముద్రం నాలుగుదిక్కులా చూచిరండని పంపినారు. ఒక ఓడ ఉత్తరంగానూ, ఒక ఓడ వాయువ్యంగానూ, ఒకటి ఆగ్నేయంగానూ, ఒకటి దక్షిణంగానూ బయలుదేరాయి.

ఓడలు బయలుదేరి మూడు దినాలయినది. అవి తిరిగి రాలేదు. తీరానికి ఇరవై ముప్పై యోజనాలదూరంలో ఏ ఓడయినా మునిగిపోతే నాలుగు దినాలకో, అయిదు దినాలకో శవాలూ శకలాలూ తీరానికి వస్తాయట. అలాంటి వానిని వెదకటానికి సముద్రతీరం పొడుగునా గూఢచారులను, నావికులను ఉత్తరంగా దక్షిణంగా పంపినారు స్కందశ్రీప్రభువు.

పది దినాలయినది, వార్తలు లేవు. ఇంక స్కందశ్రీప్రభువు విజయపురికి ఈ విషాదవార్త ఏలాగు పంపించకుండా ఉండగలడు? ఉన్న విషయాలన్నీ భూర్జపత్రంమీద లిఖించి ధైర్యం చెపుతూ స్కందశ్రీ పూంగీయ ప్రభువు శాంతిమూల మహారాజుకు నమ్మిన సందేశహరునిద్వారా నివేదించడానికి పంపినారు.

అంతఃపురంలో శాంతిశ్రీరాణికి రాకుమారి శాంతశ్రీకి బ్రహ్మదత్తుని ఓడగాలి పాలైంది అని తెలిసినప్పటినుండీ ఏదో భయ మావరించింది.

ఇచ్చట పూంగీయమహారాణి భర్తగారిని కలుసుకున్నది.

"ప్రభూ! ధనకప్రభువు క్షేమంగా తిరిగివస్తారా?"

"ఏమి చెప్పగలం దేవీ?"

"తాము కార్తాంతికులను కనుక్కోకూడదా?"

"మంచిమాట దేవీ ! వెంటనే జ్యోతిష్కుల పిలువనంపుతాను."

## 9

**అ**డవిస్కంద విశాఖాయనక బ్రహ్మదత్త ప్రభువు నౌకావిహారానికి వెళ్ళినాడనిన్నీ, సముద్రంలో ప్రళయ ఝంఝూమారుతము విసిరిందనీ, బ్రహ్మదత్త ప్రభువుగానీ ఆయన ప్రయాణించే ఓడగానీ జాడైనా లేదనీ పూంగీయ స్కంద విశాఖప్రభువు కమ్మ పంపగానే శాంతిమూల మహారాజు నిర్విణ్ణుడై నిముషములు మాటలాడలేకపోయినాడు.

బ్రహ్మదత్తప్రభువు ఈ ధనకదేశంలో శాతవాహనులతోపాటు రాజ్యంచేసిన ఉత్తమ బ్రాహ్మణవంశంలోవాడు. ప్రతీపాలపురపు ఇక్ష్వాకులకు స్నేహితులై, వారికి కుడిచేయిగా ఉండి వారు మహాసామంతులైనప్పుడు, వారికే సామంతులైనారు ధనక వంశంవారు. ప్రజ్ఞావంతులు, విజ్ఞానధనులను, పరాక్రమ శీలురను కనిన ఈవంశానికి మేటి కిరీటంలా బ్రహ్మదత్తుడు ఉద్భవించాడు.

సకల భారతావనియందూ ధనకరాజ్యమూ, ఇక్ష్వాకుల పాలనంలో ఉన్న కురవ, చోళ, ములక, ఆటవిరాష్ట్రాలూ రామరాజ్యంకన్న ఎక్కువగా పరిపాలించే విధానాలు ఏర్పాటు చేసిన రాజనీతివిశారదుడు ధర్మదత్తప్రభువు. తామా ధర్మదత్తుడు రామలక్ష్మణులా పెరిగినారు

తనకన్న కొలది సంవత్సరాలే పెద్ద అయినా ధర్మదత్తప్రభువు తనకు సర్వశాస్త్రాలలోనూ గురువై, మంత్రియై సేనాపతి అయినాడు. ధర్మదత్తు డిప్పుడు మహర్షి, తపసు చేసుకొంటున్నాడు. ఆయన తపస్సునకు వెళ్ళేటప్పుడు తన కుమారుని సన్యాసి కాకుండా చూడండనీ, వాడు ఇక్ష్వాకువంశ భారంవహించే శేషుడవుతాడనీ, వానివలన భవిష్యదాంధ్ర చక్రవర్తివంశం ఒకటి ఉద్భవిస్తుందనీ తెలిపినారు.

తాను, ధర్మదత్తప్రభువూ తమకు బిడ్డలు కలుగగానే వియ్యమంద నిశ్చయించు కొన్నారు. ధర్మదత్తునకు స్కందవిశాఖప్రభువు జన్మించినాడు. అతనికిచ్చి ఉద్వాహం చేయడానికి కొమరితకై తాను తపస్సు చేసినాడు. తనకు శాంతిశ్రీ కుమారికలుగగానే తననోములు ఫలించాయని ఆనందించినాడు. తన బాలిక సాధారణ బాలికవలెగాక విచిత్రస్వభావముగా పెరుగుచున్న కొలదీ, తన దురదృష్టానికి ఎంతవగచినాడు తాను! బాలిక విజ్ఞానవతియే అయినా, అర్ధచిత్తతలేని అమాయిక శిశువుగా పెరిగింది. ఏలాగైనా వారిద్దరూ ప్రేమించుకోవాలి. వారిద్దరూ ఆదర్శదంపతులు కావాలి అని ఆశిస్తూ ఉంది, బ్రహ్మదత్తుని తన బాలికకు గురువునే చేసినాడు. అయినా మహారాజు మనస్సు ఎందుకో శంకిస్తూనే ఉండేది.

ఇంతలో ఈనాడు ఆ బాలకుడు ఏమైనాడు? ఆ నౌక ఏమై పోయినది? తానెందుకు ఆ కుమారప్రభువును, ఆ సుందరమూర్తిని పూంగీప్రోలు పంపినాడు? అది ఏదో చెడు ముహూర్తమై ఉంటుంది. శాంతిమూలుని ఆవేదన వర్ణనాతీతమైనది. శాంతిమూలుడంత బాధ ఎన్నడూ పడలేదు. ఆ మహారాజు గంభీరుడు, విరాగి, అయినా నేడు బ్రహ్మదత్తప్రభువు నౌకలో విహారంపోయి గాలివానవల్ల ఏమయిపోయినాడో తెలియకుండా మాయమైనాడు అని వినగానే వికలమనస్కుడై పోయినాడు. ఆయన వెంటనే ఈ వార్త బోధిసత్వనాగార్జునార్య దేవులకు, మహర్షి ధర్మదత్తులవారికి తెలియ నంపెను.

ధర్మగిరిపై (నాగార్జునకొండపై) ఉన్న శ్రీ నాగార్జునిదేవులకీ వార్త పంపడానికి ఆయన సాహసించడానికి కారణం ఆ శతవృద్ధులైన పరమ శ్రమణకుడు బ్రహ్మదత్తుడంటే అత్యంత ప్రేమగలవారు. వారే బ్రహ్మదత్తుని ఉదంతం గురించి తనకు ఇదమిద్ధమని చెప్పగలవారు. ధర్మదత్తమహర్షీ అట్టిప్రజ్ఞావంతులే. ఇక ఈ కఠినవార్త ఏలాగు బ్రహ్మదత్తుని తల్లిగారికి వినిపించడం? మహారాజు ఆలోచనాధీనుడై మహారాణి సారసికాదేవికీ, కుసుమలతాదేవికీ, రాజకుమారి శాంతిశ్రీకి తాము వారివారిని అంతఃపురాలలో సందర్శిస్తామని సందేశం పంపినారు.

సారసికాదేవి పట్టమహిషి. ఆమెకడకు మహారాజు పోయినప్పుడు ఆ దేవి భర్తపాదాలకు నమస్కరించి ఉచితాసనంపై వారి నధివసింపచేసి, "మహాప్రభూ! తాము ఏదో ముఖ్యవిషయం మాట్లాడవచ్చినారు?" అని ఆమె అడిగినది. ఆమె మహారాజు మోముచూచి, అందున్న ఆలోచనాధీనత కనుగొని హృదయము ఝల్లుమన "మహాప్రభూ! తమ వదనంపై ఏదో విషాదచ్ఛాయ ప్రసరించి ఉన్నది?" అన్నది.

"అవును దేవీ విషాదవిషయమే!"

"ఏమది మహాప్రభూ?"

"మనం ఎరిగి ఉన్నంతవరకు మన ఓడలు ఎప్పుడూ నాశనంకాలేదు."

"చిత్తం."

"మన ఇక్ష్వాకు రాకుమారులు ధైర్యంగా ఓడ ప్రయాణాలు చేయగలరు."

"అవును దేవా! మా మాఠరీకుమారులు కళింగపట్టణాన్నుండి ఎప్పుడూ ఓడ ప్రయాణాలు చేస్తూనే ఉంటారు."

"అయితే, నేడు బ్రహ్మదత్తప్రభువు ఓడ ప్రయాణానికి వెళ్ళారు!"

"ఓడ ప్రయాణమా?"

"అవును. నేను పూంగీయప్రభువును, మీ ఆడబిడ్డను, రాకుమారీ, కుమారులను ఆహ్వానింప బ్రహ్మదత్తప్రభువును పంపాను."

"అయితే ఓడ ప్రయాణమేమిటి?"

"ఆయన కుదిచి కూర్చుండలేక నౌకావిహారానికి వెళ్ళినారు."

"అయితే మహాప్రభూ...."

"ఆ వెళ్ళడం మొన్న మన దేశంలో ముసురుపట్టలేదు. ఆ దినాన!"

"తిరిగి సురక్షితంగా వచ్చారా?"

"వస్తే నాకు ఈ ఆవేదన ఎందుకు దేవీ!"

"ఏమిటి విషయం విపులంగా చెప్పండి మహాప్రభూ!"

## 10

**శాంతి**శ్రీ రాకుమారికి బ్రహ్మదత్తప్రభువు కథనం వినిపిస్తూ మహారాజు ఆ బాలిక మోము జాగ్రత్తగా పరిశీలించ సాగినారు.

"ఏమిటి మహాప్రభూ! బ్రహ్మదత్తప్రభువు సముద్రంలో ఏమై పోయారో తెలియదంటారా?"

"అవును తల్లీ! వారిగతి ఏమైందో? ఆయన బ్రతికి ఉన్నాడో లేదో?"

"ఆ నౌక సురక్షితంగా ఉండకూడదా మహాప్రభూ!"

"ఉంటే ఈపాటికి ఏ తీరమో చేరిఉండదా?"

"అవతలితీరం చేరకూడదా?"

"చేరవచ్చును. కాని అంతటి అదృష్టవంతుడనా?"

"నాకు మంచిగురువు లభించారని సంతోషించాను నాన్నగారూ!" అంటూ రాకుమారి డగ్గుత్తిక తాల్చింది.

శాంతిశ్రీ 'నాన్నగారూ' అని తన్ను సంబోధించగానే శాంతి మూలుడు వెంటనే ఆశ్చర్యమూ, సంతోషమూ, విషాదమూ పొందినాడు, తన్ను ఇంతకుమున్ను తండ్రిగానే చూడని బాలిక, నేడు 'నాన్నగారూ' అని పలుకరించినది అన్న సంతోషముతోపాటు ఆ మార్పుతెచ్చుటకు కారణమైన బ్రహ్మదత్తప్రభువు ఏమైనాడో అని విషాదం కలిగింది.

"శాంతీ! మామయ్యగారు పూంగీయ స్కందశ్రీ ప్రభువులు వారిని వెదకడానికి తమ యుద్ధనౌకలను పంపారట."

"అలాగునా! వారి ఓడ సురక్షితంగా ఉంటుందని ఎందుకో నాకు తోస్తున్నది నాన్నగారూ!" అని శాంతిశ్రీ కళ్ళనీరు నింపింది.

"ఏమిటి తల్లీ! ఈ కంటినీరు?" అని శాంతిమూలమహారాజు ఆమెను తన హృదయానికి అదుముకొన్నారు.

శాంతిశ్రీ తండ్రి హృదయాన తలవాల్చుకొని తండ్రి మెడచుట్టూ చేతులు చుట్టి శరీరమంతా కదిలేటట్టు వెక్కివెక్కి ఏడ్చింది. ఆయన మనస్సులో కొమరిత చెప్పినట్లు బ్రహ్మదత్తప్రభువు బ్రతికే ఉన్నాడని తోచింది. తన్ను ఓగియార కౌగిలించికొనియున్న కుమార్తె హృదయాన నిండిన బ్రహ్మదత్తుడు తన హృదయాన చొచ్చి, తొంటికంటె తన కాత్మీయుడైనట్లు తోచి మహారాజు కన్నులు మూసుకొన్నారు. మహారాజు కొమరితను నెమ్మదిగా నడిపించుకొనిపోయి, ఆమె నచ్చటనున్న మంచపీఠముపై పరుండబెట్టి అక్కడే ఒక పీఠముమీద కూర్చుండినాడు. శాంతిశ్రీ చటుక్కున లేచి కూర్చుండెను.

"బ్రహ్మదత్తప్రభువు విద్య అనన్యము నాయనగారూ! ఆయనంత జ్ఞాని ఎవ్వరూ ఉండరు. నాకు బోధించిన గురువులలో ఉత్తములు."

శాంతిశ్రీ 'నాయనగారూ' అని మహారాజు శాంతిమూలుని ఎన్ని ఏళ్ళనుంచో అలవాటయిన కొమరితలా సంబోధిస్తున్నది. ఆ మాట పాటలా, దివ్య రాగంలా, పరమ మంత్రంలా శాంతిమూలుని చెవినిబడుతున్నది.

"కుమారీ! బ్రహ్మదత్తప్రభువు నీకు విద్యబోధించింది కొద్దిదినాలే కాదా?"

"కొద్దిదినాలయినా, పండు ఒలిచినట్లే ఆయన బోధించడం. మొదట నాకు ఈ గురువెందుకన్న భావం కలిగింది, కాని మొదటిపాఠం అవుతూనే ఆయన మాహాత్మ్యం అవగాహన అయిపోయింది."

శాంతిమూలునకు బ్రహ్మదత్తుడు పాఠాలు ప్రారంభించిన మొదటి దినాలు బాగా జ్ఞాపకం ఉన్నాయి. ఆ దినాలలో శాంతిశ్రీ తనకీ గురువెందుకని అన్నది. నేడు ఆ మాటలే లేవు! మహారాజు లేచి, కొమరిత నమస్కార మంది, ఆమెను ఆశీర్వదించి తన అంతఃపురానికి వెడలిపోయినాడు.

శాంతిశ్రీ కదలకుండా అలాగే కూర్చుని ఉంది. ఆమె చూపులు ఎదుటి వస్తువులమీద లేవు. ఆమె ఏదియో ఆలోచనాపథాలలో విహరిస్తున్నది. అప్రయత్నంగా ఆమె కంఠంలోనుండి ఒక పాట ఉదయించింది.

*"ఏమిది ఈ జననము మరణము*
*ఎవ్వరు ఈ పురుషులు స్త్రీలూ*
*ఎవ్వరు తండ్రి తల్లీ బిడ్డలు*
*ఎందుకు ఈ జగమేలా ఎవరికి*
*ఏమిది?........*
*గురు వేమిటికీ శిష్యుడేమిటీ*
*గురువులు నేర్పే చదువెందులకూ?*
*ఏమిది?........*

*ధర్మము ఏది, మర్మము ఎక్కడ?*
*కర్మరహితమే మోక్షము నరులకు?*
*ఏమిది?........"*

అప్రయత్నంగా ఆమె కళ్ళలో నీరు తిరిగినది. ఆమె మనఃపథాల నౌక ఒకటి ప్రత్యక్షమై నిర్మల నీలాకాశపథాల పక్షివలె తేలిపోతున్నది. ఆ పక్షి వంటి నౌకపై విష్ణువులా బ్రహ్మదత్తప్రభు వామెకు కనిపించినాడు. బ్రహ్మదత్తప్రభువు అలా కనిపించినాడేమి? శ్రీపరమశ్రమణకుని అందంతో సమమైన అందం. అదే కోలమోము, గడ్డం గుంటపడి మామిడిపండులా ఇద్దరికీ! ఆయన నుదురువంటిదే ఈయన నుదురు. ఎప్పుడూ పురుషుల రూపురేఖలనుగూర్చి ఆమె ఆలోచించినదిలేదు. బుద్ధవిగ్రహాలకున్న మోము బ్రహ్మదత్తుని మోము ఆబాలకు నయనపథాల మూర్తించి, నిత్యమైన శిల్పాలలా ఎదుటనే ఉండిపోయినవి.

ఆ బాలిక పద్మాసనాసీనయై యోగినిలా కూర్చుండి, కన్నులరమూతలుపడ

*"జ్ఞానదీప శిఖలు వెలుగ*
*మానవులే దేవులంట*
*ఆర్హత్వము పొందువారె*
*అందమైన మోమువారు*
*నావపైన గురుదేవుడు*
*నరుల నుద్ధరించు మూర్తి*
*నీలపథము జ్ఞానపథము*
*నీరపథము జీవయాత్ర!*
*విద్యలన్ని గరపకుండ*
*వెడలిపోయె గురుదేవులు."*

ఆ పాట ఆమె కెంతో స్వాస్థ్యమిచ్చినది. ఆమె ఆలాగున కన్నులు మూసుకొని భావాంబరమున సంచరింపసాగింది.

★ ★ ★

పంచమ భాగం

# బోధి సత్త్వుడు

బుద్ధత్వం పొందే ప్రతిదివ్యుడూ అనేక బోధిసత్త్వావతారాలు పొంది దీనమానవ సహాయం చేస్తూ అష్టమార్గాలు తన జీవిత విధానంచే బోధించి అవతారం చాలిస్తూ ఉంటాడు. సిద్ధార్థుడై, శాక్యసింహుడై, బోధిసత్త్వుడై, అర్హతుడై, బుద్ధుడైన సమంతభద్రుడు ఈ సంపూర్ణావతారం ఎత్తకపూర్వం అనేక బోధిసత్త్వావతారా లెత్తి, వితరణం, సత్యచింతన, ధర్మచింతనాది మహాగుణాల తన జీవితంలో ప్రదర్శించాడు. శాక్యసింహుడై, బుద్ధుడై లోకాన్ని ఉద్ధరించి తుషితలోకంలో ఉన్న వెనుక, ఆయన ఉత్తమశిష్యులలో మహోత్తముడైన మైత్రేయుడు బుద్ధావతారోన్ముఖుడయ్యాడు. అందుకై ఆయన బోధిసత్త్వుడై నాగార్జున దేవుడుగా అవతరించాడు.

నాగార్జునదేవుడే మహాసాంఘికవాదానికి తండ్రి. మహాసాంఘికవాదం అదివరకే ఉద్భవించినా, దానికి పుష్టికలుగచేసిన అవతారమూర్తి నాగార్జున దేవుడే. ఆ మహాపురుషుడు శుద్ధసాత్త్వికుడు. బౌద్ధధర్మమును మానవుల దుఃఖము, ఆర్తి, బాధతొలగించడానికై తథాగతుడు లోకానికి ప్రసాదించినారు. ఆలాగే వేదసంప్రదాయాదికాలు లోకానికి ప్రసాదింపబడినవి. లోకం ఎప్పుడూ సమ్యక్‌మార్గంమీద నడిచినప్పుడే లోకశాంతి. అందుకై పూజావైరుధ్యాలను మహాయాన ధర్మ ముపదేశించి సమన్వయంచేసినా డీ పరమపురుషుడు. అతడు అహింసా పరమావతారము. భారతదేశంలో మహాయుద్ధాలు చేశాడు. వారి బోధిసత్త్వగాథలు ప్రజానీకంలో ఎడారిలో చల్లనినీరులా ప్రవహించినాయి. ఆ సత్యమూర్తి నుండివెడలిన చంద్రికాకాంతి లోకం అంతా శాంతి కాంతులతో ఉత్తేజితం చేసింది.

ప్రజలు తమ సంప్రదాయధర్మాన్ని వ్యక్తిగతం అని సంపూర్ణంగా గ్రహించారు. ధర్మం పేరున దారుణాలు జరపడం మానివేసిరి. ప్రజలు స్కందుని, రుద్రుని, విష్ణుని, ఇంద్రుని, బ్రహ్మను, సూర్యుని, అగ్నిని, తథాగతుని దీపాల తిన్నెలయిన చైత్యాలను అరమరిక లేకుండా పూజచేస్తున్నారు. నాగార్జునదేవుడు శతవృద్ధయి పండులా తన ఆశ్రమంలో దివ్యమూర్తయి ఉన్నారు. దేశ దేశాలనుండి బౌద్ధభిక్షువులు, అర్హతులు, ఆచార్యులు, భదంతులు ఆ అవతారమూర్తిని దర్శించడానికి వస్తూ ఉంటారు. ఆలా దర్శించడానికి వచ్చినవారు దూరాన నుండే వారికి సాష్టాంగప్రణామాలిడి వెళ్ళిపోతూ ఉంటారు. కొద్దిమంది మాత్రమే ఆ బోధిసత్త్వావతారునితో మాట్లాడడానికి వీలు. ఎవరికి ఏ అనుమానంఉన్నా ఆ దివ్యరూపుని చూడగానే అవి రహితం అయిపోతవట. వచ్చిన భక్తులకు అతిథి సత్కారాలు నగర పంచాయతీ సంఘం చేస్తూ ఉంటుంది. ధర్మగిరిపై సంఘారామంలోనే అనేక అతిథిగృహాలున్నాయి. కొండక్రింద ఒక చిన్న గ్రామంలో ఉన్న భవనాలు అతిథులు ఉండడానికి కట్టినారు.

శ్రీ నాగార్జున దేవునకు బ్రహ్మదత్తుని నౌక గాలివానలో ఏమైనదో తిరిగిరాలేదని వార్త విన్పించినారు ముఖ్యశిష్యులు. వెంటనే ఆ దివ్యమూర్తి నవ్వి, "బ్రహ్మదత్తుడు చేయవలసిన మహోత్తమకార్యాలు ఎన్నో అలా ఉండగా ఏలా మాయంకాగలడు?" అన్నారట.

అంతే ఆయన అన్నమాటలు. వెంటనే ఆ మాటలు శాంతిమూల చక్రవర్తికి వార్త పంపించారు శిష్యులు. చక్రవర్తి ఆ మాటలు వినగానే ఎంతో ఆనందంపొంది, గుండెలలోనుండి బరువు తీసివేసినట్లయిపోవ ఆనందంలో ఆసనంపై చదికిలబడినాడు. ఆ యువకునియందు మహారాజుకున్న ప్రేమ అప్రతిమానం. ఆ మరునాడు శ్రీశైలంనుండి ధర్మదత్త మహర్షి శాంతిమూలునికి వ్రాసిన లేఖ అందింది.

"మహారాజా! బ్రహ్మదత్తుడు కారణజన్ముడు. అతని ఓడ జ్యౌతిష గణనం ప్రకారం ఒక విదేశం చేరింది. అతనికి ప్రస్తుతం గండం ఏమీలేదు. ఆ బాలుడు కొలది దినాలలో తమ్మువచ్చి కలుసుకుంటాడు. ఏది ఎట్లయినా కర్మ బలవత్తరము. కర్మను ఆచరించడము, ఆ ఫలము కర్మకే వదలి పెట్టడము భగవాన్ శ్రీకృష్ణుడు సెలవిచ్చిన స్థితప్రజ్ఞుని లక్షణము మహారాజా! మీరేమీ దిగులు పెట్టుకోవద్దు. అన్నీ శుభంగా పరిణమిస్తాయి. మీ జాతకమూ, బ్రహ్మదత్తుని జాతకమూ పరస్పర గాఢసంబంధంతో చాలాకాలం వరకూ ప్రయాణం చేస్తాయి. యువరాజు జాతకానికీ, అమ్మాయి శాంతిశ్రీ జాతకానికీ బ్రహ్మదత్తుని జాతకానికీ చాలా సంబంధం ఉన్నది."

ఈ కమ్మ శ్రీనాగార్జున దేవుల కడనుండి శుభవర్తమానం వచ్చిన నాలుగు ఘడియలకే వచ్చింది. ఇక శాంతిమూలుని సంతోషానికి మేరలేదు. ఆ దినమున ఏకారణం చేతనో అన్నట్లు భిక్షులకు, బ్రాహ్మణులకు వివిధ దానాలు చేయించారు. స్కంద దేవాలయాలలో, చైత్యాలలో పూజలు విరివిగా జరుప ఆజ్ఞలు దయచేసినారు.

మహారాజు వీరపురుషదత్తప్రభువును పిలిపించి "తండ్రీ! వెంటనే పూంగీప్రోలు వెళ్ళి అత్తయ్యగారినీ, మామగారినీ, బావగారినీ, మరదలునూ మన వసంతోత్సవాలకు ఆహ్వానంవేయి. నేను పవిత్రయజ్ఞం ఒకటి తలపెట్టినాను. ఆ విషయంలో మీకందరకూ ఇక్కడనుండి వార్త వచ్చేవరకు మీరు అక్కడే ఉండండి. బ్రహ్మదత్తప్రభువు ఓడ తిరిగి రావచ్చును" అని తెలిపినారు.

శుభముహూర్తం చూచి వీరపురషదత్త ప్రభువు సపరివారంగా పూంగీప్రోలు వెళ్ళినారు.

## 2

**ఆం**ధ్రదేశంలో బౌద్ధ, జైన, అర్షమతాలు మూడూ సమంగా ముందుకు సాగిపోతూ ఉన్నాయి.

ఆంధ్రులు ఎప్పుడూ స్వాతంత్ర్యప్రియులు పరివర్తనశీలురు. వారికి "కొత్తో వింత," అందుచే అర్షసంప్రదాయము విజృంభించి ఉన్నప్పుడు శైవము, కార్తికేయము, గాణాపత్యము, శాక్తేయము రుచిచూస్తూ ఉండేవారు. బౌద్ధధర్మాచార్యులు వచ్చి, బౌద్ధధర్మము

బోధిస్తే వెంటనే బౌద్ధధర్మాభిరతులై పోయారు. బుద్ధావతార కాలంనుంచీ సంప్రదాయంగా వచ్చే మార్గాలలో సాంఘికవాదం తీసుకువచ్చినవారు ఆంధ్రులే. సంప్రదాయవాదులగు వీరు స్థవిరవాదులన్నారు. ఆ వాదాన్నే "తెరవాదము" అనికూడా అంటారు.

వైశాలిలో బౌద్ధమహాసంఘ సమావేశం జరిగింది. అలాంటి సమావేశాల్ని "సంగీతి" అంటారు. ఆ సంగీతిలో పెద్దలందరూ సంప్రదాయవాదం గ్రహిస్తే యువజనులు బుద్ధదేవునే భగవంతుడని నమ్మి అవతారభావ మాయనకు కల్పించారు. వీరు ప్రజాహితులు గనుక మహాసాంఘిక వాదమని పిలుచుకొన్నారు. మహాసాంఘిక వాదంలో అనేక చిన్న చిన్నవాదాలు పుట్టుకువచ్చాయి. ఈ వాదాలన్నిటికీ ఆంధ్ర లేక ఆంధ్రవాదాలని పెద్దలు పేరు పెట్టినారు. శ్రీ నాగార్జునదేవుడే బౌద్ధయానానికి శంకరభగవత్పాదులు అద్వైతమునకు వలె దర్శనాలు రచించి శూన్యవాదానికి జనకులయ్యారు. ఇన్ని మార్పులు వస్తూ ఉన్నా ఆ దినాలలో దీక్షలు పుచ్చుకొనడం, దీక్షలు మార్చు కోవడం పెద్ద తప్పుకాదు. తండ్రి బౌద్ధుడు, కుమారుడు శైవుడు, తల్లి జైన ధర్మపరురాలు. కోడలు ఒకవైపు బౌద్ధ చైత్యానికి ఆయక స్తంభం వేయిస్తుంది. వేరొకప్రక్క స్కందపూజ చేయిస్తుంది. మీమాంసలు, జిజ్ఞాసలు, వాదాలు, బౌద్ధాచార్యులకు పండితులకూ, భిక్కులకూ, జైన సన్యాసులకూ మాత్రమే! నమ్మకాలలో తప్ప వివిధ వాదాలవారి సాధారణ జీవితాలలో తేడాలులేవు. జైనుడైనా, బౌద్ధుడైనా ఆంధ్రసంసారివేషం, జీవితమూ ఒక్కటే. ఈవల చైత్యపూజ చేస్తాడు, ఆవల శైవదేవాలయానికి వెడతాడు. మర్నాడు ఇంట్లో బిడ్డకు జబ్బు చేస్తే కొండదేవతకు బలులు పంపుతాడు.

ఆడవి స్కందవిశాఖాయనక బ్రహ్మదత్త ప్రభువు క్షేమంగా వస్తారని శ్రీ నాగార్జున దేవులూ, శ్రీ ధర్మధత్తమహాఋషి సెలవిచ్చినారన్న వార్త పూంగీప్రోలు చేరింది. వెంటనే వాసిష్టీ పూంగీయరాణి శాంతశ్రీదేవి పూంగీప్రోలు దేవత సాగరికాదేవి ఆలయానికి వేయి కొబ్బరికాయలు అర్పించింది. పట్టణ చైత్యాలన్నిటికీ ఒక్కొక్కదానికి వేయిచొప్పున దీపాలర్పించింది. బ్రహ్మదత్తుని జీవితంతో ఇక్ష్వాకువంశ భవిష్యత్తు గాఢసంబంధం కలిగి ఉన్నది అని ఆమెకు పూర్తిగా తెలుసును.

శాంతిశ్రీదేవి చాలా అందకత్తె. రాజనీతిలో మేటి. ఆమె అన్నగారికి కుడిచేయి. ఆమెచెల్లెలు హమ్మశ్రీదేవి చదువుకొన్నది. సంగీత, నాట్య, సాహిత్యాది విద్యలందు ప్రజ్ఞావంతురాలే కాని రాజకీయాలలో ఎప్పుడూ పాలు పుచ్చుకొనేదికాదు. రాజకీయాలు శాంతశ్రీదేవివే! శాంతశ్రీ చాణుక్యదేవుని అర్థశాస్త్రము, శుక్రనీతీ, గౌతమ ధర్మసూత్రాలు, ఆపస్తంభ బౌద్ధాయన సూత్రాలు పూర్తిగా చదువుకొన్నది. బౌద్ధమతగ్రంథాలన్నీ అవలోకించినది.

తన మేనల్లుడు, వాసిష్టీపుత్రి భట్టిదేవి కుమారిని తన పట్టపుదేవిగా చేయడం తమకు సమ్మతమే. ఈలాంటి క్లిష్టకాలంలో ఒక్కొక్క పురుషుడు ఇరువురు ముప్వురు భార్యలను చేసుకోవలసి ఉంటుంది. పట్టమహిషి ఎవరైతే నేమీ, ఆ విషయము రాజకీయమై! ఒకసారి రాజవంశం బలపూర్ణమైతే ఆ మీద స్త్రీ పురుషుల ప్రేమయే ప్రధానం

అవుతుంది. తాను ప్రేమించి చేసుకొన్నది స్కందశ్రీ ప్రభువును. తన కొమరిత మేనల్లుని ప్రేమించింది. మేనల్లుడామెను గాఢంగా ప్రేమించాడు. వారి విహహం నిశ్చయంకాక వాసిష్టి భట్టిదేవియే పట్టమహిషి కావచ్చుగాక. అయినా స్త్రీహృదయం అతి విచిత్రమయినది. ఒక స్త్రీహృదయం ఇంకొక స్త్రీకి తెలియడం కష్టం. తన బాలిక వనదేవత కానంత మాత్రాన అంత బాధపడడం ఎందుకు? తాను మాత మీ విషయంలో ఏమిచేయగలదు? ఇంతకూ ఆ యువతీ యువకులే మనస్సు స్థిమితం చేసుకోవాలి. చెల్లెలు హమ్మశ్రీ కొమరిత బాపిశ్రీకుమారిని త్వరగా రప్పించాలని ఆ దేవి అనుకొన్నది.

ముప్పైఏడు ఏళ్ళు వచ్చినా, వాసిష్టశాంతశ్రీదేవి వింశతి వర్షప్రాయ. పూర్ణయౌవన మధుర్యాంగి, దివ్యసౌందర్యోజ్వల శరీరలా ఉంటుంది. ఆమె నడకలో వయ్యారము, మాటలో గాంధర్వము, కన్నులలో దీప్తి ఏ మాత్రమూ తగ్గిపోలేదు. భర్తను భగవంతునివలె పూజిస్తుంది. అన్నగారంటే దేశకునికన్న ఎక్కువ భక్తి, ఇక్ష్వాకువంశం అంటే భగవదంశా సంభూతమనే ఆమె నమ్మకం. సిద్ధార్థదేవుడు ఇక్ష్వాకువంశంలోంచే ఉద్భవించాడు. ఇక్ష్వాకువంశంతో కొంచెం సమమైన వంశం శాతవాహనవంశం. ఇక్ష్వాకులకు మంచిదశలు పోవడంచేత, వారు ఇతరులకు సామంతులయ్యారు. ఇప్పుడు శాతవాహనులు నామకః చక్రవర్తులు. వారి చక్రవర్తిత్వం రక్షించేది తన అన్నగారు.

అన్నగారు శ్రీరామచంద్రుని అపరావతారము. అతిరథశ్రేష్ఠుడు. ధర్మాభిరహితుడు, రాజ్యనీతి విశారదుడు. ఆయనకు తాను ఆలోచన చెప్పునది కాదు. ఒక మహాకార్యంలో నిమగ్నులైనవారికే, ఆ పనిలోని ధర్మాలు, యుక్తాయుక్తాలు తెలుస్తాయి. అన్నగారు బ్రహ్మదత్తప్రభువుతో మంత్రాంగం సలుపుతారు. అవతారమూర్తులు నాగార్జునదేవులు ఏలాంటి క్లిష్టసమస్యనైనా నిమేషంలో తమ పవిత్రాలోచనతో విడదీస్తారు.

ఓహో! ఏమి ఆ అవతారమూర్తి ప్రతిభ! తన చిన్నతనంలోనే మొదటిసారి వారిని చూచింది. యవ్వనదశలో వివాహంకాక పూర్వం వారిని మరల దర్శించింది. తర్వాత ఏడాదికొకసారి వైశాఖపూర్ణిమ దినాన భక్తులందరితోపాటు వారి పాదాలకెదురుగా సాష్టాంగపడుతుంది. దేశదేశాలనుండి, చీనా సువర్ణద్వీపాలనుండి వేలకువేలు భక్తులా మహాపర్వదినాన వారి ఆశ్రమానికి వస్తారు. పూర్ణిమనాటి రాత్రి శుభమూహూర్తంలో వారి పూర్ణదర్శనము ఆకాశం క్రింద లభిస్తుంది. అనాడు వారిని దర్శంచుకొన్నంత మాత్రాన సర్వపాపాలు హరిస్తాయి. వారి కర్మ పరిపక్వమై పటాపంచలై నిర్యాణము చేకూరి తీరుతుంది.

ఈ ఆలోచనలతో ఆమెకు భక్తి పారవశ్యం కలిగింది. సప్తనాగఫణి ఛ్ఛత్రమూర్తిగా, మహాతేజోమండల మధ్యస్థుడుగా విన్యసింపబడిన నాగార్జున దేవుని విగ్రముకడకామె వెడలినది. శాంతశ్రీ పూజాగృహంలో స్ఫటిక శిలా విన్యస్తమైన బుద్ధనాగార్జునదేవుల విగ్రహాలున్నాయి. వేరొకప్రక్క స్కందదేవ విగ్రహమున్నది. శాంతశ్రీదేవి బౌద్ధనాగార్జున దేవుల విగ్రహాల కడ మోకరించి ఇక్ష్వాకు వంశాభ్యుదయాన్నికై ప్రార్థించింది. ఆ వెనుక ఆ దేవి మనస్సు నిర్మలమై ఏదో మహాభవిష్యత్తు ధవళ గజరూపాన ఆమె అంతర్నేత్రాల ప్రత్యక్షమయింది.

## 3

అంత వృద్ధుడయ్యూ నాగార్జునపుడు ముప్పదియేండ్ల దివ్యశరీరం కలవాడు. ఆయన మాటవణకదు, ఆయన వినికిడి అతినిశితము. ఒక ఏడు పై బడుతున్న కొలదీ ఆ అవతారపురుషుడు ప్రాపంచిక శక్తి మరీబలవత్తరమగుచూ ఉన్నది. ఆయన పండుకొనడు. అహోరాత్రము లరవై ఘడియలు ఏదో పరమయోగాన యోగాసనబద్ధుడై, సమభంగికా మూర్తియై, కైలాస పర్వతశిఖరంలా వెలిగిపోతూంటాడు.

ప్రతిదినము తెల్లవారుగట్ల ఆ అవతారమూర్తి లేచి ఆ కొండమీదనే ఉద్భవించే పాతాళగంగాజలంలో కృతావగాహులై, కాషాయాంబరము ధరించి యోగాసనముపైన కూర్చుంటారు. నిర్వకల్పమైన మహాసమాధిలోనికి పోయి ఆయన మూడుఘడియల కాలం అనంత విశ్వాత్మలో లీనమైపోతారు. యోగంలోనుంచి మరల ఈప్రపంచంలోనికి రాగానే ఆ భోధిసత్వుడు కన్నులు తెరిచెదరు. నలుగురు ఆంతరంగిక శిష్యులు ఆయన కన్నులు తెరవగనే ఎదుటకు వచ్చి సాష్టాంగపడి లేచి పద్మాసనస్థులై ఆ దేవుని ఆజ్ఞలకు నిరీక్షింతురు. ఒకరు తాటాకుల గ్రంథము, గంటముతో సిద్ధముగా నుందురు. ఇంకొకరు భూర్జపత్రము, మషీపాత్ర, తూలికతో సిద్ధముగా నుందురు. ఇరువురు ఏకసంధాగ్రాహులు.

స్వచ్ఛమై, మధురమై, గంభీరమైన శుద్ధాంధ్ర ప్రాకృత భాషలో ఆ మహాభాగుడు వారికి నూతన సూత్రములు, ప్రాచీనగ్రంథాలకు భాష్యాలూ, వ్యాఖ్యానాలూ ఉపదేశింతురు. నలుగురకు నాలుగు గ్రంథాలుపదేశింతురు. ఆ సమయంలో ఆయన పెదవుల వెడలిన మాటలు అమృతకిరణాలై లోకమంతా ప్రసరించును. ఒకరికి రాసాయనికి సూత్రములు చెప్పుదురు. ఇంకొక శిష్యునికి జ్యోతిష్యము. ఈ గ్రంథాలు భూర్జపత్ర లేఖకుడు తాళపత్ర లేఖకుడున్నూ వ్రాయుదురు. మతధర్మాదికాలు ఏకసంతగ్రాహులగు శిష్యులు విందురు. ఈ రీతిని సూర్యోదయాత్పరం ఒక యామంవరకు జరుగుతుంది.

రెండవయామమంతా వివిధదేశాలనుండి అనేకులు, వివిధ విషయాలలో ఈ అవతార పురుషుని పవిత్రాలోచన కోరివచ్చినవారికి ఒకరితర్వాత ఒకరికి ఆ బోధిసత్వులు ఆలోచన చెప్పుదురు. సూర్యుడు ఆకాశమధ్యస్థుడగు నంతవరకూ ఈ రీతిగా సాగుతుంది. ఆ వెనక ఇరువురు భిక్కులు వచ్చి ఆ పరమ పురుషునకు ఫలాహారం సిద్ధమాయెనని నివేదింతురు.

నాగార్జునదేవుడు దేశాలన్నీ పర్యటనచేసి తిరిగి ఆంధ్రభూమి వచ్చినప్పుడు పులమావి చక్రవర్తి తనకు నిర్మించి ఇచ్చిన ఆశ్రమమూ, ఆశ్రమమున్న పర్వతానికి దిగువ లోయలో ఉన్న అపర వనశైలసంప్రదాయ సంఘారామాశ్రమ విహారాదులూ, చైత్యాలూ ఏ మహాదాతలూ చూచే దిక్కు లేక దీనావస్థలో ఉన్నాయి. మహాసాంఘికులు ములకదేశంలో ప్రతిష్టానానికి ఉత్తరంగా ఉన్న భోగీరాశ్రమ భోగీరాశ్రమ సంఘారాశ్రమములకు అనేకులు వెళ్ళిపోయినారు.

సముద్రా లావల ఉన్న ద్వీపాలలో వలసలేర్పరచుకొన్న అనేకులతో భిక్కులు, భదంతులు, ఆచార్యులు సువర్ణ ద్వీపంలో త్రిలింగ మహానగరానికీ, కాకులానికీ, మలయ

ద్వీపంలోని కాంభోజదేశంలో కాకులనగరానికి, యువద్వీపంలోని పాండురంగ, అమరావతి, విజయాదినగరాలకూ పోయి సంఘారామా లేర్పరచి, చైత్యాలు నిర్మించి, ధర్మబోధ లోకమంతా వ్యాపింప చేస్తున్నారు.

నాగార్జునదేవుడు తిరిగిరాగానే ప్రజలలో మళ్ళీ భక్తి ప్రపత్తులు పెరిగినవి. చైత్యాలు బాగుచేసినారు. సంఘారామ భవనాలు పెరిగినవి. ఇతర దేశాల భిక్కులు వేలకు వేలు వివిధ సంఘారామాలలో వివిధ సంప్రదాయాల గురించి నేర్చుకొనడానికి రావడానికి ప్రారంభించారు. దేశదేశాలనుండి సాధారణ ప్రజలు యాత్రలుచేస్తూ నాగార్జున పర్వతాశ్రమానికి ఆంధ్రదేశం లోని వివిధ పవిత్ర క్షేత్రాలకూ విరివిగా రాసాగినారు.

నానాటికీ ఈ అవతారపురుషుడు తన ఆశ్రమం వదలిరావడం మానివేశాడు. ఆ దివ్యపురుషుడు రచించిన గ్రంథాలు వేలకువేలు ప్రతులు వ్రాసికొని భిక్కులు వివిధదేశాలకు తరలించుకు పోసాగినారు. ఆయన దర్శనమాత్రాన ప్రజలకు కలిగే పవిత్రానందం ఇంతా అంతా అనికాదు. ఆ మహాభాగుని నామం తెలియని భూభాగం ఈ జంబూద్వీపంలో ఎక్కడాలేదు. సువర్ణయవ కాంభోజ చీనాదేశాలలో ఆ బోధిసత్త్వుని గురించి అనేక అద్భుతాలైన గాధలు ప్రచారంలోనికి వచ్చాయి. ఈ దినం ఇక్కడుండి మరుక్షణం వేరొకచోట దర్శనమిస్తారని, పక్షిగామారి ఆకాశ మార్గాన ఎగిరిపోతారని, దర్శనమాత్రాన ఏలాంటి రోగాలైనా కుదిరిపోతాయనీ! ఒక్కొక్కప్పుడు ఆయన దేహం బంగారుమయమై ధగద్ధగాయమానంగా వెలిగిపోతుందనీ అనేక విచిత్రాలుగా చెప్పుకొని, ఆయన పేరు తలచుకొని ఉప్పొంగి పోతూఉంటారు.

## 4

**ఆం**ధ్రదేశం అంతా సర్వమత వ్యాప్తమై కలకలలాడిపోతూ ఉన్నది. బోధిసత్త్వ నాగార్జునదేవుని బోధనలు అర్షధర్మపరులైన బ్రాహ్మణ పండితులకూ నచ్చినవి. వారు కూడా తమ దర్శన వ్యాఖ్యానాలయందు నాగార్జున దేవుని వాదనలనేకం చేర్చుకున్నారు.

బ్రహ్మదత్తప్రభువు బోధిసత్త్వుని తలచుకుంటూ ఆయన బోధలీ సువర్ణ ద్వీపంలో ఎంత అద్భుత ప్రచారంలోకి వచ్చినవా అని ఆశ్చర్యపడుతూ తమ పడవమీద తిరిగి ప్రయాణం చేస్తూ వస్తున్నాడు. ఆ యువక ప్రభువునకు శ్రీ కృష్ణోపదిష్టమైన దివ్యగీత అంతా సంపూర్ణార్థంతో బోధిసత్త్వ నాగార్జునదేవుని కంఠప్రబోధితమై వినిపించింది. వారి నౌక శాంతవర్తనుడైన ప్రాక్సముద్రవీచీ నృత్యమూర్తియై తేలివస్తున్నది. ఆ నౌక ముందు తట్టుపై కూర్చుండి బ్రహ్మదత్తుడు ఎడతెగని సముద్రవీచికామాలలూ, అంతులేని నీరూ, బ్రహ్మాండచ్ఛత్రమైన ఆకాశము చూస్తూ విజ్ఞానవిశ్వాల ఊహించుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. పరమసుందరియైన శాంతిశ్రీ రాకుమారి ఆ యువకప్రభువు మనోనయనాల ప్రతిక్షణమూ ప్రత్యక్షమవుతున్నది. అవును; తాను సర్వము తెలుసును అనుకుంటూ గర్వించి చివరకు సంపూర్ణ గర్వభంగం పొందిన విషయం ఈ సముద్ర యానంలో పూర్తిగా గ్రహించాడు.

ఆ బాలిక శుద్ధసత్వమూర్తి అయినా అయి ఉండాలి, లేదా ఏదో మహా విచిత్ర భావమూర్తి అయినా అయి ఉండాలి. తాను మాత్రం ఆమెకు దాసుడు. ఆమె క్రీగంటిచూపుల మెలగవలసిన బానిస. ఈ మహారహస్యం సువర్ణ ద్వీప అమరావతినగరంలో కలిగింది. శివమహాక్షేత్రమైన ధాన్యకటకామరావతి పేరుపెట్టి నిర్మించిన ఆ మహానగరంలో ఒక స్థూపం ప్రక్క బోధిసత్వుడైన మంజుశ్రీ విగ్రహం చెక్కి ఉంది. ఆ మంజుశ్రీ విగ్రహంప్రక్క నిలుచుండి ఉన్న మూర్తిని బ్రహ్మదత్తుడు చూచినాడు. ఆ దేవీ విగ్రహ సౌందర్యం అనన్యం. యౌవనవతులయందే ప్రేమ. పడుచువాడు ముసలిఅవ్వను ప్రేమించలేదు. అప్పుడు శృంగారావిర్భావము ఏమవుతుంది? ముసలినాయకుడైనా పడుచు నాయికను ప్రేమించవలసిందే. ముసలి అవ్వను ప్రేమించాలంటే ఏ అమ్మగానో, అమ్మమ్మ, తాతమ్మగానో ప్రేమించవలసిందే.

అలాగే పడుచునాయిక ముసలివానిని చూచి ప్రేమిందగలదా? శకుంతల దుష్యంతుని ప్రేమించింది. రత్నావళి ఉదయనుని ప్రేమించింది. కాని వాళ్ళు కౌమార నాయకులు, ఆ కౌమారనాయకుల సౌందర్యం చూచి నవయౌవనవతి అయిన నాయిక ప్రేమించదు. ఆ నాయకునియందు విశిష్ట లక్షణాలో ఇంకా ఏవో ఉంటే అవి చూచి, విని ప్రేమించవలసిందే. కాని "ఓ సుందరాకార, ఓ జితమన్మథ" అని నవోఢ నలుబది సంవత్సరాల నాయకుని ప్రేమింపలేదు.

ప్రేమ మానవ జీవితంలోని ఒక మహోత్తమ జంతుస్వభావము. ఆకలి దప్పులులా ఈడు వచ్చిన పురుషునికి స్త్రీకీ పరస్పరం వాంఛ కలిగి తీరుతుంది. ఆ వాంఛను ఎవ్వరూ ఆపలేరు. మహర్షులైనా ఆ బాధనుండి తప్పుకోలేరు. తన పూర్వీకుడైన గాంధేయ రాజర్షి బ్రహ్మర్షి యగుటకై తపస్సుచేసి చివరకు మేనకకై తన్ను అర్పించుకొన్నాడు. పశుశక్తి అయినా ఈ వాంఛ ఆహార నిద్రా భయాలకంటె ఎన్నో కొన్నిరెట్లు మహోత్తమం కదా? ఆహార నిద్రాభయాలు వ్యక్తిగతమైనవి. స్త్రీగాని, పురుషుడుగాని, జంతువులుగాని, వ్యక్తిగతంగా వృద్ధిపొందేందుకు మాత్రం ఆహారం తీసుకొంటారు. విశ్రాంతికై నిద్రా, స్వరక్షణకై భయం; కాని జాతి వృద్ధికై సంయోగం. ఈ ధర్మమే మానవునిలో ఒక తపస్సయినది. వివాహకర్మ నిర్మించుకొన్నాడు. అది ఒక పవిత్రయాగమైనది. పరవళ్ళెత్తి ప్రవహించే వరదలకు గట్లు నిర్మాణమైనవి. చివరకు తపస్సయినది. పున్నామ నరకభావం ఉద్భవించింది. "ఓహో! ఎంత విచిత్రమైనవారు మహర్షులు!"

బ్రహ్మదత్తప్రభువునకు శృంగారభావం ఆకాశగంగ భూమికి అవతరించినట్లయింది. తనగంగ శాంతిశ్రీదేవి. ఆమెకు ఈ ప్రాపంచిన చైతన్యమేలేదు. హిమవత్పర్వత శృంగముల త్రుళ్ళింతలాడే గంగకుమాత్రం భూమిపై రక్తి చటుక్కున అవతరించిందా? ఆ గంగను శివుడు జటాజూటాలలోనికి ఆహ్వానించాడు. ఎంత అద్భుతభావం? పరమశివుడు వ్యోమకేశుడు. ఆ కేశాలు సగుణరూపమై జటలుకట్టినవి. ఆ జటలలో తేజోరూపిణియైన గంగ జలరూపంగా జేరింది. ఆ జలాలలో మంచుగడ్డలు. ఆ ప్రదేశానికే మనుష్యుడు వెళ్ళలేదు. హిమాలయ శిఖరాలా జటలు. ఆ శిఖరాలలో భాగీరథిగా, మందాకినిగా,

అలకనందగా, గంగాదేవి బహుప్రవాహమై ఉద్భవించి ప్రవహించి, ప్రయాగలో తన్ను తాను చేరుకుంటూ సర్వకళా రూపిణియై, యమునగా వచ్చి ప్రపంచంలో సంగమించి ప్రవహించి మహాసాగర మోక్షం పొందుతూ ఉంటుంది. తన పవిత్ర గంగామూర్తి శాంతిశ్రీదేవిలో శృంగారభావం ఏనాటికౌనా ఉద్భవిస్తుందా? నాగార్జునదేవుల మోము ఏదో దివ్యకాంతులతో వెలిగిపోయింది.

"గుణభద్రా! బ్రహ్మదత్తునికి భిక్షుకదీక్ష ఇవ్వలేను. ఆ ఉత్తమ పురుషుడు బౌద్ధధర్మం అర్హ ధర్మంలో లీనం కావించ ఉద్భవించినవాడు. ఆయన నన్ను చూడడానికి ఈ నగరం వస్తాడు. ఆ సమయంలో శాంతిమూలమహా రాజుకూడా నాదగ్గరకు వచ్చుగాక. వారు నన్ను చూచి వెళ్ళిన మర్నాడు, అమ్మాయి శాంతిశ్రీ రాకుమారిని మన ఆశ్రమానికి ఒకసారి తీసుకొనివచ్చి నా ఎదుట ప్రవేశపెట్టు." ఆ అవతారపురుషుని అస్పష్టమైన గంభీరవచనాలు ఆగిపోయాయి. గుణభద్రదాచార్యులు నెమ్మదిగా తలవంచి ఆ బోధిసత్త్వునికి నమస్కరించి వెడలిపోయినాడు.

భిక్షుకులు లోకవ్యవహారాలతో ఎందుకు జోక్యము కలుగజేసుకోవాలి? వారు సర్వసంగపరిత్యాగం చేసి, గుణాలను చంపుకొని, అష్టమార్గావలంబకులై నిర్వాణగాములై ముక్తిపొందాలి కదా అని గుణభద్రుడు రెండు మూడు మారులు భగవంతునితో మనవి చేసుకొన్నాడు. వారు చిరునవ్వు నవ్వి ఊరుకొన్నారు.

భగవానుడు బుద్ధత్వం పొందనున్న బోధిసత్త్వులు కావడంవల్ల వారి భావాలు, చేతలు సాధారణ మానవుల ఊహల కందవు. ఆ తథాగతులకడకు మహారాజ్యాధిపతులు ఆలోచనకై వచ్చేవారు. సామాన్యులుకూడా తమ కష్టసుఖాలు వారికి నివేదించి సందేహనివృత్తి చేసుకొనేవారు. నిర్వాణపథగాములైన వారికి ఈ ప్రపంచ సంబంధం లోహనిగళరూపమే అని గుణభద్రుని మతం. గుణభద్రాచార్యులు విజయపురంలోనికి వెళ్ళేవారు కారు. ఎల్లప్పుడు ఆత్మానాత్మ విచారణ చేసుకుంటూ, బుద్ధదేవుని మూర్తిని ధ్యానిస్తూ ఉండడమే ఆయన దినచర్య. ఆయన పూర్వాశ్రమంలో ప్రతీపాలపుర నగరవాసి. చిన్నతనంలో కృష్ణానదిపాలైన తల్లిదండ్రులు, భార్య మాయమైపోవడంవల్ల సంసారంరోసి, శ్రీ నాగార్జునదేవుని కడకు చేరి కొన్నాళ్ళకు బౌద్ధదీక్ష పుచ్చుకొని, ఆ అవతార పురుషుని ఒక్కక్షణమూ వదలని ఉత్తమ శిష్యుడు.

* * *

షష్ఠ భాగం

# ఇంకో చక్రవర్తి

"సకల ధరాతల ధురంధర భుజాస్కంధా, ఆది వరాహా, చతుస్సముద్ర ముద్రిత మహీమండలాఖండలా!" అని వందిమాగధులు పొగడుతూ ఉండగా హారీతీపుత్ర పులమావి ముసికనగరముందు ఆంధ్రచక్రవర్తిగా రెండవసారి సింహాసనం అధివసించారు.

మొదటిసారి పులమావి ధాన్యకటకస్థుడైన ఆంధ్రచక్రవర్తికి సామంతుడుగా మాత్రం సింహాసనం ఎక్కాడు. యజ్ఞశ్రీ ప్రజ్ఞా, శక్తీగల చక్రవర్తి. ఆయనధాటికి తాళలేక మహా సామంతులూ, సామంతులూ పాదాలకడ శిరస్సులు ఆనించి, తమ భక్తిని వెల్లడించారు. యజ్ఞశ్రీ యశశ్శరీరి కాగానే అనేక సామంతులహృదయాల్లో మళ్ళీ ఆశలుద్భవించాయి. వైజయంతి వారు, ముసికనగరం వారు, మాళవులు, భరుకచ్ఛులు, అందరూ ఎవరికి వారు చక్రవర్తులు కావాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

అప్పటినుండి పులమావి తగిన సన్నాహాలు చేస్తూ సైన్యాలు కూర్చుకుంటున్నాడు. భరుకచ్ఛం వారికడ తురంగాలు వేయి కొన్నాడు. ఆయుధాలను సమకూర్చ సాగినాడు. తనరాజ్యంలో బంగారం దొరుకుతుంది. దానిలో సగం ధాన్యకటకానికి పంపవలసినది. "ఈసంవత్సరం ఇంతే దొరికిం"దని "ఈ ఏడు వానలవల్ల బంగారుగనులలో పని బాగా జరుగలే"దనీ చక్రవర్తికి పంపవలసిన బంగారం నానాటికి తగ్గించివేశాడు. బంగారంతో అతని ధనాగారాలు నిండి పోతున్నవి. దానిని వెదజల్లడంవల్ల దక్షిణ దేశాలనుండి విరివిగా యుద్ధవీరులు వచ్చి తన సైన్యాలలో చేరుతున్నారు. దక్షిణాటవుల నుండి వేనకువేలు ఏనుగులపట్టి తెప్పించి వానికి శిక్షణ ఇస్తున్నాడు.

ఈ విషయాలన్నీ శాంతిమూలునికి వేగువస్తున్నాయి. బ్రహ్మదత్తునితో తాను ముసికనగరం వెళ్ళినప్పుడు ఆ యువకప్రభువు "మామయ్యగారూ!" అంటూ సంబోధిస్తూ తాను కట్టవలసిన కప్పం యావత్తూ కట్టివేస్తాడు. అట్టి పులమావి చక్రవార్తి కావలెనని ఆలోచిస్తున్నాడా? ఏమి పొగరు అని శాంతిమూలుడు తనలో తాను ఆలోచించుకొంటూ చిరునవ్వు నవ్వుకొన్నాడు.

బ్రహ్మదత్తుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తున్న శాంతిమూల మహారాజుకు ఆ అడవి ప్రభువు సురక్షితంగా ఓడతో పూంగీప్రోలు వచ్చి చేరాడని వార్త వచ్చింది. ఆయన ఆనందానికి మేరలేదు. దేశం అంతా ఉత్సవాలు చేయవలసిందని తన ఆజ్ఞగా వార్తలు పంపినాడు. బ్రహ్మదత్తుడంటే ఆదేశాలలోని ప్రజలందరికి దగని ప్రేమ, గౌరవమూ. అలాంటి బ్రహ్మదత్త ప్రభువు సముద్రంలో మాయమై పోయాడన్నప్పుడు దేశం అంతా గగ్గోలు పెట్టింది. నేడు ప్రజల సంతోషానికి మేరలేదు.

బ్రహ్మదత్తుని ఓడ రేవుకువచ్చి ఆగగానే రేవులోని నావికులందరూ గుర్తించి జయ జయ ధ్వానాలు చేసిరి, వివిధ నౌకానాయకులు, నావికులు నౌక వైపుకు పరుగులిడినారు.

చిన్న చిన్న పడవలలో అనేకులు నౌకచుట్టూ మూగినారు. నౌకపై పూంగీయజెండా, పసుపుపచ్చని కేతనమూ ఎగురుతూ ఉండడంవల్ల శుభము ఊహించి ఒక నావికుడు లేడిలా అతివేగంగా పరుగెత్తుకుంటూ కోటగోపురం కడకు వచ్చి అక్కడి రక్షకులతో శుభవర్తమానము తెచ్చానని చెప్పి, శరవేగంగా రాజభవన మహాకోట్య గోపురం దగ్గరకుపోయి, అక్కడి అంగరక్షకులతో చెప్పి, సభామందిరం ప్రక్కనున్న అంతఃపుర ద్వారంకడ ఆగి మహారాజునకు శుభవర్తమానం తెచ్చినానని తెలిపినాడు.

ఒక ద్వారపాలకుడు ఈ నావికుని వెంటబెట్టుకొని లోనికిగొనిపోయి, ఒక మందిరంలో నిలబెట్టి ఒక ప్రతీహారిచే మహారాజుగారికి శుభవర్తమానం విషయం మనవి చేయమని తెలిపినాడు. పూంగీయ స్కందశ్రీమహా రాజునకు వర్తమాన మందినది. వెంటనే వారు ఈ నావికుడున్న మందిరంలోనికి వచ్చినారు. నావికుడు సాష్టాంగపడి నమస్కరించి మహారాజుచే అనుజ్ఞాతుడై లేచి, "మహాప్రభూ! తప్పిపోయినదనుకున్న తమ నౌక వచ్చింది. ఆ ఓడ పసుపుపచ్చని జెండా ఎగురవేస్తూ వచ్చింది" అని మనవి చేసినాడు.

స్కందశ్రీ మహారాజునకు పట్టరాని సంతోషం వచ్చింది. తన మెళ్లో హారమూ, తన మొలలోని ఛురియా ఆ నావికునకు బహుమానమిస్తూ, అంతఃపుర పాలకుని రప్పించి ఆ నావికునకు వేయిపణాలు ఇప్పించినారు. మహారాజు వెంటనే తన కొమరుడు స్కందసాగరాయనునికీ శుభవార్త పంపినారు. స్కంద సాగరాయనకప్రభువు వెంటనే మహారాజు మందిరానకు రాగా వారిరువురూ చెరి ఒక రథంమీదా బయలుదేరి, మంత్రులు, సేనాపతులు వెంటరాగా తొందర తొందరగా ఓడరేవునకు వచ్చి చేరినారు. బ్రహ్మదత్తప్రభువు అప్పుడే ఓడనుండి దిగి తన విడిదికీ వార్త పంపడంవల్ల అక్కడనుండి వచ్చి పాదాలకెరగిన తన మంత్రిని సేనాపతిని చేతులుపట్టి లేపి తన హృదయానికి గాఢంగా అదుముకొన్నాడు. ఆ సమయంలో పూంగీయస్కందశ్రీ మహారాజూ, యువరాజు స్కందసాగరాయనక ప్రభువూ రావడం చూచినాడు. వెంటనే వేగంగా ముందుకుపోయి తాను స్కందశ్రీ మహారాజుపాదాల కెరిగినాడు. ఆయన బ్రహ్మదత్తుని లేవదీస్తూ,

"ప్రభూ! మీరు మళ్ళీ కనబడతారనుకోలేదు" అంటూ బ్రహ్మదత్తుని హృదయానికి గాఢంగా అదుముకొన్నారు. ఆ వెనుక స్కందసాగర ప్రభువూ స్కందవిశాఖాయనకప్రభువూ గాఢంగా కౌగలించుకొన్నారు.

## 2

శాతవాహన రథస్వామి అయిన పులమావి తానే చక్రవర్తి అని చెప్పుకొన్నా, పొగడించుకొన్నా శాంతిమూల మహారాజుకు అంతకోపం వచ్చి ఉండేదికాదు. కాని అతడు సార్వభౌమ సింహాసనం ఎక్కాడు అని తెలిసిన మర్నాడు నానాదేశ ప్రభువులకూ కప్పము కట్టవలసినదని శ్రీముఖాలు అందినవి. శ్రీ పులమావి శాతవాహనుడే సార్వభౌముడట. తన తండ్రి తాతలకుటుంబమే సరియైన చక్రవర్తి కుటుంబమట. యజ్ఞశ్రీ తన తండ్రిని మోసంచేసి సింహాసనం ఎక్కినాడట. అందుకని నేడు తాను సరియైన చక్రవర్తి అవడంవల్ల సింహాసనం ఎక్కినాడట. కాబట్టి సామంతులందరు ముసిక నగరం

వచ్చి చక్రవర్తి పాదాలకడ సాష్టాంగపడి తమ తమ కప్పాలను అర్పించవలసి ఉంటుందని ఆ శ్రీముఖంలో ఉన్నది.

శాంతిమూలుని కోపం మరీ మిన్ను ముట్టడానికి ఇంకొక కారణం కూడా ఉంది. పులమావి చక్రవర్తి ఒకసారి విజయపురంలో ఇక్ష్వాకు శాంతిమూలుని తనయ శాంతిశ్రీ రాకుమారిని చూచినారట. ఆ బాలిక తమకు తగిన పట్టమహిషి అని సార్వభౌముల దివ్య చిత్తానికి తోచినదట కాబట్టి ఇక్ష్వాకు శాంతిమూల ప్రభువు చక్రవర్తికి మామగారయ్యే అదృష్టాన్ని పొగడుకొంటూ తన కొమరితను కొనివచ్చి చక్రవర్తికి అర్పించవలసినది. ఇది సార్వభౌముల ఆజ్ఞ అని శాంతిమూల మహారాజునకు వచ్చిన శ్రీముఖంలో ఉంది.

శాంతహృదయుడు నిర్వికారుడు, అతిరథశ్రేష్ఠుడు అగు శ్రీ శాంతిమూలునకు రాజలేఖకుడు ఆ శ్రీముఖం చదివి వినిపించడంతో ఒక్కసారి పాలపొంగులా కోపం వచ్చింది. ఇంతలో మహాసభాప్రాంగణంలో శుభ కేతనధారియై పూంగీప్రోలునుండి వార్తాహరుడు వచ్చి దర్శనానికి అనుమతి వేడుకొంటున్నాడు అని ప్రతీహారి మనవి చేసినాడు.

మహారాజుకు కోపమంతా ఒక్కసారి చల్లారిపోయింది. అతి సంతోషంతో వెంటనే కొనిరావలసిందని ఆజ్ఞ యిచ్చినారు. ఆ వార్తాహరుడు వచ్చి మహారాజు అధివసించి ఉన్న సింహాసనం ఎదుట మోకరించి, లేచి, చేతులు జోడించి, "జయము జయము సార్వభౌములకు శ్రీ శ్రీ ధనకమహారాజు మహాసేనాపతి, మహాతలవరి, మహాదండనాయక, అడవిస్కంద విశాఖాయనక బ్రహ్మదత్తప్రభువులు తమకు వారి నమస్కృతులు సమర్పించు కొంటున్నారు. వారు సువర్ణదీవి దర్శించి, అక్కడ మహారాజులకు అతిథియై, ఆ ద్వీపంలోని శ్రీ తథాగత చైత్యాలను దర్శించి, నౌకను సురక్షితంగా నడుపుకొంటూ ఈ ఉదయమే పూంగీప్రోలు చేరినారు. అక్కడ మా ప్రభువులు సురక్షితంగా చేరినందుకు పూంగీయ మహారాజులు స్కందశ్రీ ప్రభువు సలుపదలచిన మూడుదినాల ఉత్సవాలకూ ఆగి, ఆ వెంటనే హుటాహుటి బయలుదేరివచ్చి తమ పాదాల సన్నిధిని ఉందుము" అని మనవి చేయు మన్నారు. జయము! జయము! అని మనవి చేసివాడు. శాంతిమూల మహారాజు ఆ వార్తాహరునకు తమ మెడలోని హారము బహుమతిగా ఇచ్చిరి.

బ్రహ్మదత్తుడు సురక్షితంగా తిరిగివచ్చినందుకు దేశం అంతటా ఉత్సవాలు చేయ రాజాజ్ఞలు వెళ్ళినవి. ప్రజలకు బ్రహ్మదత్తుడంటే అమితానురాగం. ఆ యువక ప్రభువు ప్రజలకై ఎన్నియో మహత్తర కార్యములు చేయించినాడు. చిన్న చిన్న ఏరులకు అడ్డగట్లు వేయించి, పెద్దపెద్ద చెరువులు నిర్మించాడు. గ్రామాదులలో మంచి నూతులు తవ్వించి తీయనిజలాలు సర్వకాలాలు అందరికీ అందునట్లు చేసినాడు. గ్రామగ్రామానికీ చక్కని రాజబాటలు నిర్మించినాడు. అనేక గ్రామాలలో సత్రములు, దారిపొడుగునా చలివేంద్రాలు, వైద్యశాలలు నిర్మించాడు. వైద్యులకు రాజస్వము లేర్పాటుచేసి హిమాలయ ఓషధులు అందునట్లు చూచినాడు. కర్షకులకు మంచివిత్తనాలు అందుబాటు చేయించి, కరవు ఎప్పుడన్నావస్తే ధాన్యాదులు బ్రజలకు విరివిగా పంచిపెట్టేవాడు. బ్రహ్మదత్తుడు తన సామంతరాజ్యంలోనూ, ఇక్ష్వాకు మహారాజ్యంలోనూ ఉన్న వేలకొలది గ్రామాలన్నీ తిరిగి ప్రజల క్షేమాదులు కనుక్కుంటూ ఉండేవారు. దేశం అంతటా విద్యాశ్రమాలు నిండి పోయాయి. ప్రతి గ్రామంలోను చిన్న బిడ్డలకు విద్యగరిపే బడులు ఏర్పాటయ్యాయి.

ఏ వార్త వచ్చినా గ్రామభేరీ నివాదవార్తా విధానంవల్ల ఉదయం ప్రారంభిస్తే, సాయంకాలానికి మూలమూలలగ్రామాలకు కూడా ఆ వార్త ప్రాకిపోతుంది. బ్రహ్మదత్త ప్రభువు క్షేమంగా పూంగీప్రోలు చేరారన్న వార్త అంతట అల్లుకోగానే దేశం అంతా సంతోషంతో పొంగిపోయింది. మహారాజు దేశంలోని బాలబాలికలకు పళ్ళూ, బట్టలూ పంచి ఇవ్వవలసిందని మంత్రులకు ఆజ్ఞనిచ్చారు. దేశం అంతా మూడురోజులు మహోత్సవాలు చేసుకున్నారు.

బ్రహ్మదత్తప్రభువు విజయపుర పర్వతగోపురం దగ్గిరకు వస్తున్నాడని ప్రభువునకు వార్తాహరులు చెప్పినారు. ఆ ప్రభువును ఎదుర్కొనేందుకు మహారాజు స్వయంగా యువరాజుతో, మంత్రులతో, సేనాపతులతో బయలు దేరినాడు. అప్పుడు శాంతిశ్రీ రాజకుమారి అంతఃపురంనుంచి తన గురువును ఎదుర్కొనేందుకు తండ్రిగారి అనుమతి వేడెను. మహారాజు సంతోషంతో ఒప్పుకొన్నారు. రాజకుమారి మూర్తి పొందిన సౌందర్యమువలె రథమును అధివసించి, చెలులు కొలువ తండ్రిగారి రాజభవనద్వారమువద్ద కలుసుకొన్నది.

భిక్షువులు, పండితులు, రథికులూ కొలువ మహారాజు శుభవాద్య పురస్కృతుడై తూరుపు గోపురంవద్దకు వెళ్ళినారు. ఆ పర్వతగోపురద్వారం ప్రజలతో నిండిపోయింది. వారందరూ ఆ గోపురద్వారం దాటి ఆ పర్వతరాజ పథము వెంటనే ఒక అర్ధగోరుతదూరం ముందుకు సాగిపోయినారు. ఇంతలో ఎట్టఎదుట ఆ మహారాజపథముపై ఒక మహా సైన్యము వస్తూ కనబడినది. శాంతిమూలమహారాజు తన వారిని ఆగుదని కోరగనే ఆ ప్రదేశం అంతా గుట్టలు, లోయలు, చరియలు, ఘనశిలలు, వృక్షాలు ప్రజలతో నిండిపోయాయి.

* * * *

ఇంతలో బ్రహ్మదత్తుడు, మహారాజు పూంగీయ స్కందశ్రీ ప్రభువు, పూంగీయ యువరాజు స్కందసాగరాయనక ప్రభువుతో రథములపై వస్తూ ఏనుగు నధివసించియున్న శాంతిమూలమహారాజుకు కనిపించినాడు.

## 3

ఇక్ష్వాకు శాంతిశ్రీరాకుమారి, పూంగీయ శాంతశ్రీ రాకుమారికను, పల్లవ రాణి అయిన హారీతి బ్రహ్మశ్రీ హమ్మశ్రీదేవి కొమరితలు బాపిశ్రీ, షష్ఠిశ్రీ రాకుమారికలను, అన్నగారయిన వీరపురుషదత్తుని, పూంగీయ ద్వితీయరాజ్ఞీ కుమార విష్ణుశ్రీ రాజకుమారుని బ్రహ్మదత్తప్రభువు వచ్చిన దినానే విందుకు పిలిచింది. రాజకుమారి ఇంతవరకు తన భవనానికి బంధువులను విందుకు పిలవడం ఎరగనే ఎరగదు. ఆమె పేరిటనే తల్లిదండ్రులే చుట్టాలను విందులకు పిలుస్తూ ఉండడమూ, తాముకూడా ఆ విందులకు రావడమూ జరిగేది. అలా జరిగిన విందు సమయాల్లో ఇక్ష్వాకురాజకుమారి అంటీముట్టనట్లు ఊరకుండేది. ఎవరన్నా పలకరిస్తే ప్రతివచనం ఇచ్చేది లేకపోతే తన విశాలమైన కళ్ళల్లో శైశవ దృక్కులు వికాసిస్తూ ఉండగా చూస్తూ కూర్చుండేది. వచ్చిన చుట్టాలు మహారాజుతో

మహారాణితో మాట్లాడి, తమలో తాము వేళాకోళాలాడి, చెలికత్తెల నాట్యాదికాలు, ప్రదర్శనాలు చూచి, తాము ఆనందించి మహారాజుకూ మహారాణికీ నమస్కరించి వెళ్ళిపోయేవారు.

వీణాగానం, నృత్యప్రదర్శనం అయిన తర్వాత అందరూ భోజనాలకు లేచినారు. అందరూ మేనత్త మేనమామ బిడ్డలే. భోజనగృహంలో అందరూ స్వర్ణపీఠికలపై కూర్చున్నారు. బంగారు కంచాలలో, బంగారు గిన్నెలలో అనేక విధాలైన శాకాలు, పచ్చళ్ళు, పప్పులు, పులుసులు, చిత్రాన్నాలు, ఆవుపాలు వడ్డనచేయు బాలికలు వడ్డించినారు.

వీరపురుషదత్తుడు పూంగీయ శాంతశ్రీని ఆ ఉదయం చూచినప్పటి నుండియు తన మనస్సు ఆనందపూర్ణముకాగా మాటలాడలేకపోయినాడు. ఆమె వైపు ప్రణయ పూర్ణములైన చూపులను పరసి, అంతలో మరల్చుకొన్నాడు. పూంగీయశాంతశ్రీ ఏమీ మాటలాడలేదు. దివ్య రేఖాసమన్వితుడు, బంగారుఛాయచే జగత్ప్రసిద్ధ సుందరాకారుడైన, తన ప్రియుని చూచి, అతని చూపులలోని బాధ నర్థము చేసికొన్నది. ఆమె కన్నుల నీరు తిరిగినది. ఇద్దరి హృదయాలూ పూర్ణమై యుండుటచేత ఇద్దరు ఈ సాయంకాలం శాంతిశ్రీ భవనానికి వచ్చినా పలుకరించుకోలేదు. ఇదంతా బాపిశ్రీ అర్థం చేసుకొంది. తన అక్క రాజకుమారుని ఎంత ప్రేమిస్తోందో, తానూ అంతే ప్రేమిస్తోంది. అయినా తానూ శాంతా జీవికాజీవు లవడంచేత ఒకరిమీద ఒకరికి ఓర్వలేనితనంలేదు.

వీరపురుషదత్తుడు బాపిశ్రీని గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఆమెలో పూంగీయశాంతను చూస్తాడు. శాంతలేని బాపిశ్రీ అతనికి కనపడదు. బాపిశ్రీ లేని శాంత అతనికి తోచదు.

ఇక్ష్వాకు రాజకుమారిక ప్రేమ అంటే ఏమిటి అని ప్రశ్నించుకొంటుంది. స్త్రీ పురుషుల కలయిక ఒక యజ్ఞంవంటి ధర్మకార్యమని ఆమె ఉద్దేశం. సంతానం కనడం భూమిలోనుంచి మొక్కలు ఉద్భవించడం వంటిది. గ్రంథాలలో తెలుపు ప్రేమానుభవం ఏలాంటిదో ఆమెకు అర్థం కాలేదు. తన మేనయత్తల కొమరితలు ఇద్దరూ తన అన్నగిరియందు తమకున్న ప్రేమను వర్ణించి చెప్పుకొన్నారు. ఈనాడు తనలో ఏదో వర్ణింపరాని ఉత్సాహం కలిగింది. ఏదో ఒక విచిత్ర సంతోషం కలిగింది. తానే తన ఉత్సాహానికి ఆశ్చర్యం పొందింది. తాను ఎందుకు బ్రహ్మదత్తుని ఎదుర్కొనడానికి వెడతానన్నదో, తానెందుకు పాదచారిణియై బ్రహ్మదత్తుని కడకు నడిచి వెళ్ళిందో? అలా వెళ్ళడంలో ఏదో ఆనందం అనుభవించింది. ఎందుకు తానా పనులుచేసిందో? ఎందుకు తన వదినగారిని భోజనానికి పిలిచిందో?

అన్నగారు మేనత్త కొమరిత శాంతను వనదేవతగా వరించక పోవడంవల్ల ఆమెకు కోపం వచ్చి పూంగీప్రోలు వెళ్ళిపోయిందనీ, తానీఏటి వసంతోత్సవాలకు పూంగీరాజ కుటుంబాన్ని ఆహ్వానించడానికి పూంగీప్రోలు వెళ్లు తున్నాననీ బ్రహ్మదత్తప్రభువు వెళ్ళిపోతూ తెలపడంవల్ల ఆమె విన్నది. కోపమంటే? ఒక మనుష్యునికి కోపం ఎందుకు? నేడు వీరంతా తన ఇంటికి విందుకు వచ్చినప్పుడు పూర్వస్నేహముతో మెలిగి సంతోషంగా ఉంటారని ఆమె కేలా తోచినదో? జరుపవలసిన తంతులన్నియు అంతఃపుర పాలకురాలు జరుపుతున్నది.

భోజనాలయి తాంబూలాలు వేసుకొన్నారు. విష్ణుశ్రీకుమారుడు వెళ్ళిపోయినాడు. అప్పుడు ఇక్ష్వాకు శాంతిశ్రీ కుమారి తన అన్నగారి చేతికి మల్లెపూలదండలు ఇచ్చి "అన్నగారూ! ఇది వదినగారల ముగ్గరితలలలోనూ ముడవండి" అన్నది. ఆమె మోములో, కన్నులలో హాస్య కాంతిలేదు. శాంతికాంతులు మాత్రము వికసిల్లి ఉన్నవి.

## 4

పులమావి వసంతోత్సవదినాన తన సర్వసైన్యాలను నడుపుకుంటూ వైజయంతి పురం వెళ్ళినాడు. వైజయంతి చూటుకుల శాతకర్ణులు పులమావి సైన్యాలతో వస్తాడని అనుకోలేదు. ప్రస్తుతము పులమావికి లోబడడమే ఉత్తమమనుకొని, చూటుకుల విష్ణుస్కంద మహారాజు, పులమావిని చక్రవర్తిగా ఆహ్వానించి కప్పములుగట్టి, యుద్ధయాత్రకు తనవంతు ఖర్చునిచ్చి, ఆయనకు వీడుకో లిచ్చెను.

పులమావి చక్రవర్తిగా అభిషేకించుకొన్నాడని వినగానే విజయశ్రీ శాతవాహన చక్రవర్తికి మిన్నుముట్టిన కోపం వచ్చింది. వెంటనే తన బావగారు ఇక్ష్వాకు శాంతిమూల మహారాజుకు "ఏమిటి కర్తవ్యం?" అని వార్త పంపినాడు. ఆ వెంటనే పులమావి కడనుండి విజయశ్రీ శాతవాహన చక్రవర్తికి శ్రీముఖం వచ్చింది. "నీకు రాజ్యార్హతలేదు. అన్యాయంగా యజ్ఞశ్రీ చక్రవర్తి అయినాడు. అయినా తన చక్రవర్తిత్వము తాను కాపాడుకోగలిగాడు. నువ్వు నీరుసుడవు, త్రాగుబోతువు. నీకు అంతఃపుర స్త్రీలను ఏలుకోవడం తెలుసును. నువ్వు మన్మథ సామ్రాజ్యానికి తగుదువు. దిగు సింహాపీఠం! భక్తితోవచ్చి శ్రీశ్రీ హారీతిపుత్ర పులమావి శాతవాహనస్వామి పాదాలబడితే నిన్ను సామంతునిగా ఉండనిస్తారు. లేకపోతే నువ్వు రాజద్రోహివి అవుతావు." ఈ విధంగా ఉంది ఆ శ్రీముఖం. విజయశ్రీ శాతవాహన చక్రవర్తి భయముచేతా, కోపంచేతా గజగజవణికిపోయినారు. ఆ శ్రీముఖాన్ని ఇత్తడి మందసంలో పెట్టి బంధించి, దానిని శాంతిమూల మహారాజుకు పంపినాడు.

ఇంతలో పులమావి వేయి ఏనుగులతో, ఇరవైవేల ఆశ్వికబలంతో, ఆరువేల రథాలతో, ఒక అక్షౌహిణి (లక్షా ఇరువదివేలు) కాల్బంతో బయలు దేరినాడని వార్త రాగానే విజయశ్రీ శాతవాహన చక్రవర్తికి గుండెల్లో రాయిపడింది. తన సేనాపతులకు సేనలన్నీ సిద్ధంచేయండని అజ్ఞలిచ్చినాడు. మహాభోజులకు, మహారథులకు, అభీరులకు పులమావిని ఎదుర్కొని బందీ చేయండని ఆజ్ఞలు పంపినాడు. తమ తమ సేనలతో ధాన్య కటకానికి రండని, మాఠరులకు, వాసిష్ఠులకు సాలంకాయనులకు, బృహత్పాలాయనులకు, ధనకులకు, పూంగీయులకు, బెళుకురాయనకులకు (చాళుక్యులకు), చూటుకులులకు, ఇక్ష్వాకులకు రాజాజ్ఞలు పంపినాడు. ఇంతలో వైజయంతీ శాతకర్ణులను ఓడించి పశ్చిమతీరాన్నే అభీరులపైకి పులమావి వెడుతున్నాడని వార్త వచ్చింది విజయశ్రీ చక్రవర్తికి.

శాతవాహనుల సైన్యాలు తప్ప ఇక ఏ సైన్యాలూ రాలేదు. విజయపురంలో ప్రతిసంవత్సరంకన్న ఈ ఏడు ఎక్కువ వైభవంగా వసంతోత్సవాలు జరుపుతున్నారు. అందుకని ఉత్సవాలు పూర్తికాగానే సైన్యాలతో వస్తున్నానని శాంతిమూలుడు చక్రవర్తికి వినతి పంపినాడు. విజయశ్రీ శాతవాహనునకు కోపం మిన్నుముట్టింది. తన రాజ్యానికి

భంగం వచ్చే సమయంలో, తన బావమరదికి వసంతోత్సవాలా? అని కాలుగాలిన పిల్లిలా విజయచక్రవర్తి తిరగడం మొదలుపెట్టినాడు.

భరుకచ్ఛాధీశులైన అభీరులు రాజనీతిలో అపరచాణుక్యులు. వాళ్ళకు పులమావి భగవత్ప్రసాదితమైన ఆయుధంలా కనబడ్డాడు. విజయశ్రీని నిరసించి, పులమావే నిజమైన చక్రవర్తి అని వారు లోకానికి చాటినారు. అభీరపతి, చక్రవర్తి పులమావిని ఎదుర్కొని లోక సమ్మోహనకరమైన ఉత్సవాలు చేయించి తన సైన్యాలలో అర్ధాక్షౌహిణిని పులమావితో పంపినాడు. అభీర సైన్యాలూ పులమావి సైన్యాలూ కలిసి మాళవదేశం మీదకు దండెత్తి వెళ్ళినవి. మాళవులు కొంచెం బలంగా ఉన్నారు కాబట్టి, పులమావిని ఎదుర్కొనడమా లేకపోతే, సాయం అవలంబించడమా? ఏలా సమకూర్చినాడో సైన్యాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. పులమావితో తుదకు సంధి కంగీకరించినారు.

పులమావి ఉప్పొంగిపోయినాడు. తనకు రాజకుమారి రుద్రభట్టారికను రాణిగా ఈయవలసిందని మాళవరుద్రసేన మహారాజుకు పులమావి రాయబారిని పంపినాడు. రుద్రసేనునకు రుద్రభట్టారికను పులమావికి ఉద్వాహం చేయడం ఇష్టంలేదు. ఈ విషయంలో ఆంధ్రచక్రవర్తికి త్వరలోనే వార్త పంపెదననిన్నీ, రుద్రభట్టారికాకుమారి వసంతోత్సవాలకు శ్రీపర్వతస్థమైన విజయపురికి వెళ్ళి ఉన్నారనియు ఆమె అచ్చటనుండి రాగానే వివాహ విషయం నిశ్చయం చేసుకోవచ్చుననియు, మాళవపతి పులమావికి బదులు చెప్పి పంపెను.

పులమావి ఉజ్జయినినుండి బయలుదేరేవేళకు చైత్రమాసం మధ్యదినాలు. అప్పుడే వేసవికాలం ఆరంభించింది. రాత్రిళ్ళుమాత్రం కొంచెం చలివేస్తోంది. సాయంకాలాలు మత్తుగా ఉంటున్నాయి. విజయపరంపరచే పులమావిని నిజంగా వీరత్వం పొదివికొన్నది. అతని సైన్యాలు ఉత్తమ శిక్షణపొంది అతివేగంగా సునాయాసంగా ప్రయాణం చేస్తున్నవి. ఉజ్జయిని నుండి ములకదేవానికి పిడుగువలె వచ్చిపడ్డాయి.

ప్రతిష్ఠానగరంలో రాజప్రతినిధి యువరాజు చంద్రశ్రీ శాతవాహన మహారాజు ఇంకా వసంతోత్సవం జరుపుతున్నాడు. వేయిపూవులైనారు వేయి బాలికలు. తాను దివ్యవసంతుడు. ఆ వేయిబాలికలలో కొంతమందిని ఒకనాడు గజరూపం వహింపుడని తాను వారిపై స్వారి వెడలినాడు. ఒక దినం కొందరు బాలికలు చిలుకరూపం వహిస్తే తాను మన్మథుడుగా ఊరేగినాడు.

## 5

**చం**ద్రశ్రీ యువరాజు మన్మథుడుగా, మధుమాసాదిదేవుడు వసంతుడుగా ఇలా చిద్విలాసాలలో తేలిపోతూ ఉన్నాడు. ఒకదినం అనేక మనోహర రూపాలు కలిగినవీ, వివిధపుష్పాలంకృతులూ అయిన నదీ నౌకలలో విహారం బయలుదేరినాడు. హంసలవలె, శుకాలవలె, మొసళ్ళవలె మూర్తితాల్చిన ఆ నౌకలలో తన ప్రియాసహస్రంతో విహారం బయలుదేరినాడు. కొందరు బాలలు నాట్యం చేస్తున్నారు. కొందరు గాత్రాలతో పాడుతున్నారు. కొందరు వివిధ వాయిద్యాలు వాయిస్తున్నారు. కొందరు అర్ధనగ్నలై వివిధ విలాస భంగిమాలలో ఉన్నారు. నౌకలు గోదావరిలో సాగిపోతున్నాయి.

ఇంతలో గోదావరి ఈవలావల గట్టుమీద వేలకువేలు ఆశ్వికులు పదాతులు తోచినారు. "పడవలు ఆపండి! ఏడీ చంద్రశ్రీ!" అన్న ఉరుములాంటి మాటలు వినబడ్డాయి. బాలికలంతా ఘొల్లుమన్నారు. ఆ సాయంకాలపు చిరు చీకట్లలో అనేకమంది బాలికలు కాగడాలుపట్టి ఉన్న వాళ్ళు "అమ్మయ్యో" అని కేకలు వేసి కాగడాలు నీళ్ళల్లో పారవేశారు. బాలలు కొందరు గజగజలాడుతూ అలా నిలుచుండిపోయినారు. తెడ్లువేసే బాలికలు తెడ్లువేయడం మానివేశారు. పడవలు నడిపే చుక్కాని బాలికలు మూర్ఛపోయారు. చుక్కానులు వదిలారు. లేదా భయంతో చుక్కానులు తమ ఇష్టం వచ్చినట్లు తిప్పినారు.

పడవలు ఒకదానికొకటి తగులుకున్నాయి. కొందరు బాలికలు పట్టుతప్పి నీళ్ళల్లో పడ్డారు. కొన్ని పడవలు జరిగిపోవడంవల్ల కొందరు బాలలు నీళ్ళుల్లో పడ్డారు. కొందరు ఉరకాలని నదిలో ఉరికినారు. గోలగోల నీళ్ళలోపడ్డవారు ఈదలేనివారు మునుకలు వేస్తున్నారు. వీళ్ళను రక్షించడానికి గట్టుమీదవారు ఏనుగులను దింపినారు. ఏనుగులు అనేకమంది బాలికలను తొండాలతో రక్షించి అందిస్తున్నాయి. ఈత వచ్చిన వీరభటులు, సేనాపతులు నీళ్లలోనికి ఉరికినారు. ఆశ్వికులు తమ అశ్వాల్ని ఉరికించినారు.

ఆ గడబిడ అంతా చల్లారి బాలికలను రక్షించడం, పడవలను ఒడ్డుకు పట్టించడం అంతా అయ్యేసరికి మూడుగడియలు పట్టింది. నలుగురు బాలికలు దొరకలేదు. దొరికినవారిలో ఇద్దరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. తక్కిన వారందరూ సురక్షితంగా ఉన్నారు. కాని యువరాజు చంద్రశ్రీ జాడ ఎక్కడా కనుపించలేదు. వెంటనే పులమావి దిట్టరులైన అపసర్పులను, సేనాధికారులను గోదావరి తీరాన్నే పంపినాడు.

తెల్లవారి ఆంధ్రశాతవాహన చక్రవర్తులూ, యువరాజులూ కొలువుతీరే మహాసభలో పులమావి శాతవాహనుడు మహాసింహాసనంపై అధివసించి, తన మంత్రులు, చంద్రశ్రీ మంత్రులు, తన సేనాపతులు, కొందరు చంద్రశ్రీ సేనాపతులు, బౌద్ధభిక్కులు, పండితులు కొలిచి ఉండగా తన మంత్రిని చూచి, "ఏమయ్యాడు చందశ్రీ?" అని అడిగినాడు.

"అన్నదాతా! మహాచక్రవర్తీ! చంద్రశ్రీ నిన్న సాయంకాలం గడబిడ ప్రారంభించగానే నీటిలోనికి ఉరికి తన అంగరక్షకురాండ్రయిన నలువురు దిట్టలైన స్త్రీలతో చల్లగా ఈదుకుంటూ, వారి నౌకాబలంతోకూడా వచ్చే చిన్న పడవ ఎక్కి తేలుకునిపోయాడట. అలా మూడుగోరుతాలు ప్రయాణంచేసి, గోదావరితీరంలో ఉన్న ఒక గ్రామంలో దిగి ఏనుగులపై ఎక్కి వెళ్ళిపోయాడట" అని మంత్రి మనవి చేసినాడు.

"అలాగా, చంద్రశ్రీ ఏనుగులమీద ఎక్కడికి పోయినాడో అది కనుక్కోడానికీ, ఆ దారిలో దొరికితే బందీచేసి పట్టుకురావడానికీ చారులను పంపలేదా మీరు?" చిరాకు నాట్యంచేసే మోముతో ప్రశ్నించినాడు పులమావి.

"చిత్తం! అన్నదాతా! ఆ ఏనుగు ఎటువైపు వెళ్ళిందో తెలియలేదట. ఇంకా చారులు కొంతమంది వేగంగల ఏనుగులపైన వెదుకుతున్నారు" సవినయంగా మంత్రి విన్నవించుకొన్నాడు.

చంద్రశ్రీ ధనాగారం పరిశీలిస్తే పూర్వంనుంచీ ఉన్న బంగారు ఆభరణాలు నవరత్నాలుపొదిగిన ఆభరణాలు చాలా ఉన్నాయి. ఫణాలరాసులు చాలా తక్కువ ఉన్నాయి.

పులమావి నగలన్నీ తాను తీసుకొని, నాణ్యాల రాసులలో ముప్పాతిక తాను సంగ్రహించి, తక్కినవి రాజ్యావసరంకోసం ధనాగారంలోనే ఉంచినారు. దాసీలలో అందమైనవారిని ఆరువందలముందిని తన అంతఃపురంలోనికి తీసుకున్నాడు. ధైర్యం బలాన్నిస్తుంది. యుద్ధ తంత్రం నేర్పుతుంది. బలం ఇంకా బలం చేకూరుస్తుంది.

పులమావి చరిత్ర అంతా వింటున్నకొలదీ విజయశాతకర్ణ చక్రవర్తికి మతిపోయింది. పులమావి తన చుట్టాన్ని ఒకరిని తన రాజప్రతినిధిగా ప్రతిష్ఠానంలో నిలబెట్టి వెంటనే తన సర్వసైన్యాలు కూర్చుకొని ఆగకుండా అతి వేగంగా మహారాజపథం వెంట ధాన్యకటకాభిముఖుడై బయలుదేరినాడు. పులమావి ఎక్కిన మదపుటేనుగుపై బంగారపు టంబారీ ఒకచిన్నగది అంత ఉన్నది. దాని నిండా హంసతూలికల పరుపులు పరచినారు. మెత్తని ఉపధానాలపై ఆనుకొని, తన వినోదునితో మాటలాడుచు పులమావి ప్రయాణం చేస్తున్నాడు.

"నానాటికి శాంతి పిచ్చి ఎక్కువై పోతున్నది నాకు."

"దానికి శాంతే విరుగుడు!" వినోదుడు పులమావి చేయి పట్టుకొని నాడి చూసినాడు.

"శాంతి పిచ్చికి శాంతి మందేమిటి నీ మొగం?"

"అలా అనకండి సార్వభౌమా! మీకు వైద్యసూత్రాలు తెలియవు. కామసూత్రాలూ చదువలేదు."

"వాత్స్యాయనుడు శాంతి మందు అని తెల్పాడా?"

"ఆ! ఉష్ణం ఉష్ణేన శీతలం అన్న సూత్ర ప్రకారం శాంత్యున్మాదానికి శాంతే మందు అన్నాడు."

"ఎవడు వాడు?"

"ఈ మహావైద్యుడు తమ వినోదుడు!"

"ఓరి మూర్ఖుడా!"

"ఉండండి. శాంతిదేవికోసం మీకు పిచ్చి, మరి శాంతిదేవిని తమచే సేవింపచేస్తే, ఆ పిచ్చికుదరదా?"

"ఓహో! అదా?"

"ఏమనుకున్నారు ప్రభూ!"

## 6

విజయపురంలో వసంతోత్సవాలు అద్భుతంగా జరిగినవి. వీరపురుషదత్తుని ఆనందమూ, పూంగీయ శాంతిశ్రీ బాపిశ్రీల ఆనందం వర్ణనాతీతము, పూంగీయ యువరాజు స్కందసాగరుడు వసంతుడయ్యాడు వీరపురుషదత్తుడు మన్మథుడయ్యాడు. వాసిష్టి శాంతిశ్రీ పుత్రిక శాంతశ్రీ రతీదేవి అయింది. స్కందసాగరుడు ఇక్ష్వాకు రాజవంశపు బాలికను వనదేవతగా ఎన్నుకొన్నాడు. ఈ సంవత్సరం ఉత్సవంలో జరిగిన వేడుకలు ఏనాడూ జరగలేదన్నారు. మాళవరుద్రభట్టారిక పారిజాతమయింది. బాపిశ్రీ మందారమయింది. షష్టిశ్రీ కమలపుష్పమయినది.

బ్రహ్మదత్తప్రభువు వేడుకలు చూస్తూ సువర్ణద్వీపంనుంచి తాను కొని తెచ్చిన లక్కవస్తువులు, పచ్చలూ, కెంపులూకూర్చిన హారాలూ, చిత్రచిత్ర వస్తువులు బాలికలకు బహుమతులిచ్చినాడు. వీరపురుషదత్తునికి కెంపులు పొదిగిన ఒరతోడి మణులుపొదిగిన సువర్ణద్వీప ఖడ్గమిచ్చినాడు. సువర్ణ ద్వీప మహారాజు ఆంధ్రచక్రవర్తికీ, ఇక్ష్వాకు మహారాజుకూ అనేక బహుమతులు పంపినాడు. శాంతిమూల మహారాజుకు పంపిన బహుమతులు వారి కిచ్చినాడు. ఇతరులకు ఖడ్గములు మొదలయిన ఆయుధములు బహుమతులిచ్చినాడు.

సువర్ణ ద్వీపంలో పనితనం అంతా గాంధర్వ శిల్పమూ, విధ్యాధరశిల్పము, ఆంధ్రశిల్పము విశ్వబ్రహ్మ శిల్పసమ్మిశ్రితము. ఆంధ్రశిల్పము సువర్ణద్వీప గాంధర్వశిల్పంలో రంగరింపయి ఒక నూత్న సౌందర్యం చేకూర్చుకున్న నూత్న సంప్రదాయం ఉద్భవించింది. ఆ శిల్పవస్తువులు వెలకు తెచ్చి పంచినాడు బ్రహ్మదత్తుడు. ఒకపెద్ద గార్మత్మతోపలం చెక్కి విన్యసించిన పరమసుందరమూర్తి మంతమయిన ధ్యానిబుద్ధ విగ్రహమొకటి ఎనిమిది అంగుష్టముల ఎత్తున్న దానిని బ్రహ్మదత్తుడు ఇక్ష్వాకు రాకుమారి శాంతిశ్రీకి బహుమతి ఇచ్చినాడు. ఆ విగ్రహము చూడడముతోనే శాంతిశ్రీ చైతన్యరహిత అయినది. ఆమె ఆనందం ఆకాశగంగవరకు ఉబికి పోయింది.

"గురువుగారూ! ఈ పవిత్ర విగ్రహాన్ని నాకోసమే సంపాదించినారా?" ఆ బాలిక మాటలు శిశువు మాటలవలె ఉన్నవి.

"అవును రాజకుమారీ! ఈ విగ్రహమును సువర్ణద్వీపవాసియైన సామంతప్రభువు ఒకపెద్ద గారుత్మకం చెక్కించి చేయించినాడు. నేను "పాగాను" మహానగరం వెళ్ళినప్పుడు, ఆ సామంతుని ఇంట అతిథిని. మేము మూడుదినాలు తత్త్వవిచారణ చేశాము. నా మాటలు అతనికి పరమ శ్రమణకుని బోధలా ఉందని ఆయన నా కీవిగ్రహం బహుమతి ఇచ్చాడు. ఈ పవిత్రమూర్తిని చూడగానే ఇది భర్తృదారికకు అని నేను మనస్సులో నిశ్చయించుకొన్నాను." బ్రహ్మదత్తుని మాటలలో చిరునవ్వు సౌరభంలా వెల్లివిరిసింది.

"ఓహో! ఈ పరమశిల్పం నాదగ్గర ఉండడానికి నేను తగుదునా గురుదేవా?" ఆమె మాటలు చిన్న మల్లి మొగ్గలులా వికసించాయి.

"నీకన్న దీనికింకెవరు తగుదురు రాజకుమారీ?" బ్రహ్మదత్తుడు గంభీరంగా అన్నాడు.

"అది మీహృదయంలోని అనుగ్రహం! సువర్ణ ద్వీపంలోని విశేషాలు నాకు తెల్పండి."

"నీకు జ్ఞానతృష్ట ఎక్కువ శాంతిశ్రీ కుమారీ!"

"కాని ఆ తృష్ణకు తగిన మెదడు లేదుకాదా అండి" అవనత వదనయై ఆమె పలికింది.

"నీకు మెదడులేదని ఎవరనగలరు రాజకుమారీ! గురువు నైన నేనెరు గనా?" బ్రహ్మదత్తుడు విషాదపూర్ణమైన చిరునవ్వు నవ్వాడు.

"మీరు ఓడమీద విహారంవెళ్ళి మాయిమైపోయారన్నప్పుడు నాకు భయమువేసింది. దినదినమూ నిద్రపట్టేదికాదు" ఆమె అనుద్వేగయై మాట్లాడింది. ఆమెలో శిశుత్వం తొణికిసలాడింది.

బ్రహ్మదత్తు డామెవైపు కొంచెంసేపు తీక్ష్ణపు చూపులు పంపినాడు, "భయం ఎందుకువేయాలి? నిర్వాణాభిముఖులకు భయం కలుగకూడదు" అన్నాడు.

"ఎందుకు భయంకూడదో నాకు తెలియదండి" ఆమె చిరునవ్వు నవ్వింది. చంద్రకాంతోపలంతో విన్యసించిన శిల్పానికి చైతన్యం వచ్చినట్లయింది. ఒకసారి వేయి ఉషస్సులు లోకాలను ఆవరించినట్లయింది. ఎఱ్ఱని ఆమె పెదవులు విడివడిన. స్తనవల్కలావృతాలయి, సుందరశ్రీ విలసితాలయిన వక్షోజఫలాలు ఉబికినవి. ఆమె రూపము జగన్మోహనము. చిరునవ్వు నవ్వినప్పుడామె విశ్వమోహనరూపం వెలిగిపోయింది. ఆమె మూర్తినుండి ఏవోదివ్య సౌరభాలు ప్రసరించినవి. బ్రహ్మదత్తుడు లోలోన వణికిపోయినాడు.

ఈ బాలికలో ఏదో విచిత్ర మహామధుర చైతన్యము ఉదయిస్తున్నది. ఆ బాలిక పర్వతద్వార గోపురప్రాంగణంలో తన పాదాలంటి కళ్ళకద్దుకున్నప్పుడు బ్రహ్మదత్తునకు వివశత్వము కలిగింది. ఆమె స్పర్శ తన్నట్లు వణికించివేయగలదు అనుకోలేదు. ఆమె దివ్యమధుహస్తాలు ఏదో అనన్యానుభూతిలా తన పాదాలను స్పృశించాయి. "ఓ బాలికా! సర్వలోక సౌందర్యా మృతకలశీ! నీ స్పర్శే చైతన్యరహితుణ్ణి చేస్తున్నదే, ఇంతకన్న ఇంకను అద్భుతమయిన వరము నాకు సన్నిహితమయితే నా భవిష్యత్తు ఏమయిపోగలదు?" అని అతని ఆత్మ ఎలుగెత్తి విశ్వసించింది. నేడు ఈ బాలిక అప్రతర్కితంగానే తన్ను అమృతకర్తరిలో ఉంచిన పోకను చేస్తున్నదు! బ్రహ్మదత్తునికి భరింపరాని ఆనందం కలిగింది. అతడు వెళ్ళి వచ్చెదనని సెలవు గైకొన్నా డానాడు.

ఆ ఆలోచనలన్నీ తన చిత్తస్థైర్యాన్ని ముక్కలు చేస్తూ ఉండగా బ్రహ్మదత్తుడు వసంతోత్సవాలకు వచ్చినాడు. ఆ ఉత్సవాలలో ఒకనాడు శాంతిశ్రీ రాకుమారి బ్రహ్మదత్తునికడకు చెలికత్తెలు కొలువు విచ్చేసి, "గురుదేవా! నన్ను రతీదేవిగా మీరు క్రిందటి సంవత్సరం ఎన్నుకొన్నారు. నేను ఎందుకో భయపడిపోయినాను. ఆ ఎన్నుకొనడం, భయపడడంలో ఉన్న భావం నాకు తెలియ చెప్పగలరా ప్రభూ?" అని ప్రశ్నించింది.

## 7

వసంతోత్సవాలు ప్రారంభించిన మూడవదినాన. పులమావి విజయ యాత్ర బయలుదేరిన వార్త విజయపురానికి అందింది. రాచనగళ్ళలో, పట్టణంలో గజిబిజి బయలుదేరినది.

"ఎవరీ పులమావి?"

"తాను వాసిష్ఠీపుత్ర పులమావిని అనుకున్నాడా?"

"ఏమిటి వీడి ధైర్యం?"

"ఏమో ఏ పుట్టలో ఏ పాము ఉందో?"

"మన చక్రవర్తి అసమర్థుడయితే పులమావి జైత్రయాత్రకు బయలుదేరుతాడు. పుల్లమామిడే గొప్పపండవుతుంది."

"మన మహారాజు ఏమిచేస్తాడో?"

"పులమావి పులుపు విరుస్తాడు."

ఈ రకంగా ప్రజలు విడ్డూరాలుగా చెప్పుకొంటున్నారు. విజయశ్రీ శాతవాహన మహారాజు ఒకదాని వెనక ఒకటిగా, మొసలిపట్టిన గజేంద్రుని వలె, ఆక్రందనలు పంపిస్తూ ఉన్నాడు.

శాంతిమూలుని సభలో అడవి స్కందవిశాఖాయనక బ్రహ్మదత్త ప్రభువు పూంగీయ స్కందశ్రీ మహారాజు, హిరణ్యకరాష్ట్ర ప్రభువు, స్కందచాళుక్యరాయనికప్రభువు, హమ్మశ్రీదేవి భర్త పల్లవప్రభువు, కులహాక ప్రభువు, బౌద్ధాచార్యులు, మహాఋషిసత్తములవంటి బ్రాహ్మణులు అందరూ చేరినారు. బ్రహ్మదత్తప్రభువు సభలో పులమావి దండ యాత్రనుగురించి తెలిసిన సంగతులన్నియు, మహారాజుగారి పక్షాన సభికులందరికీ తెలియజేసి, ఇప్పుడు కర్తవ్యమేమిటి అని అడిగినాడు.

**పూంగీప్రభువు:** మనం సైన్యాలనుకూర్చుకొని వెంటనే వెళ్ళి పులమావినీ, అతని సైన్యాలనూ నాశనం చేయవలసి ఉన్నది.

**కులహాకప్రభువు:** మహాప్రభూ! నా మనవి ఈ అదను తప్పితే పులమావిని నెగ్గే అవకాశం దొరకదని.

**చాళుక్యరాయనిక:** మహాప్రభూ! మనం తొందరపడడం మంచిదికాదు. జాగ్రత్తలో పులమావిని ఏలా ఎదుర్కొనాలో నిర్ణయించుకోవాలి.

**పల్లవప్రభువు:** ఈ విషయంలో మనం ఆలోచించదగినది ఒకటి ఉన్నది. ఈ పులమావికి ఎక్కడనుంచి వచ్చింది ఈ బలం? ఎలా వైజయంతిని లోబరుచుకోగలిగాడు? ఎలా మహావేగంతో భరుకచ్ఛానికి పోయినాడు? ఇందులో ఏదో రహస్యం ఉంది. అది తెలుసుకుని మనం అతన్ని ఎదుర్కొనాలి.

**యువరాజు వీరపురుషదత్తుడు:** చిన్న మామయ్యగారూ! మనం నెమ్మదిగా ఆలోచించుకొనే లోపలే పులమావి ధాన్యకటకం మీదకువచ్చి పడిపోడా? కాబట్టి మనం వెళ్ళివాడు భరుకచ్ఛంనుంచి ప్రతిష్ఠానానికి రాకుండానే ఎదుర్కోవాలి.

**బ్రహ్మదత్తుడు:** వెనుక ఒకసారి ఈ పులమావి మనపట్టణం వచ్చి వసంతోత్సవంలో పాల్గొన్నాడు. మళ్ళీ పెద్దవర్తకుడుగా ఈ పట్టణం చొచ్చి అంతఃపురాలలో నగలమ్మి నాడట. వాడి ఉద్దేశము చూచాయగా నాకు అర్థం అయింది. ఇంతకూ పులమావి బలం నాశనం చేయాలంటే దానికి వేరే మార్గం ఉంది. అతనికి వచ్చిన బలముకంటె అతని శక్తిసామర్థ్యాల కంటె ఇవతల చక్రవర్తి బలహీనత ఒక కారణం. ఆ బలహీనతవల్ల సామంతులంతా తిరగబడడానికి సిద్ధంగా ఉన్నారు. ఈతడు ఆ అదను చేజిక్కించు కొన్నాడు.

**చాళ్ళురాయనిక:** అయితే మీ ఆలోచన?

బ్రహ్మదత్తుడు ఒక నిమేషం ఆలోచించినాడు. చిరునవ్వు నవ్వు కొన్నాడు. "రాజకుమారి శాంతిశ్రీని అతడు భార్యగా వాంఛిస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు మనుష్యులు ఆకాశంపైన చంద్రుణ్ణికూడా కోరుతారు. అతడు తిన్నగా ధాన్యకటకం వెళ్ళడు.

సర్వసైన్యాలతో విజయపురంపై విరుచుకుపడతాడు. అప్పటికిగాని అతని సార్వభౌమ కాంక్షకు తృప్తి కలుగదు. అతనికీ తెలుసును. ఆంధ్ర సార్వభౌమునికి ఉన్న బలం అంతా ఇక్ష్వాకు మహారాజు అని. ఇక్ష్వాకులు ఓడిపోయి, వారి రాజకుమారి భార్యగా దక్కితే ఇంక చక్రవర్తి ఏమి లెక్క అని ఆలోచించాడు. అందుకనే చక్రవర్తి ఆయువు పట్టయిన ఇక్ష్వాకులను ఓడించి వారి బాలికను చెట్టబట్టితే మన మహారాజు పులమావికి కోటికోటల బలం అవుతారుగా!" ఆ మాటలని బ్రహ్మదత్తుడు ఇంకొక పర్యాయం సభికుల నందరినీ పరిశీలించి చూచాడు.

"నా ఉద్దేశంలో మనం మన సైన్యాలు కొన్నింటిని తీసుకొని ప్రతిష్ఠానంనుంచి వచ్చే మహారాజపథం వెంటనే ముందుకుపోయి, మహానగరపురానికి ఎగువను ఉన్న కొండలలో వ్యూహం పన్నాలి. తక్కిన సైన్యాలన్నీ మన నగరం కావలికి ఉంచాలి. ఆ ఉంచడంలో నగరానికి అయిదుగోరుతాలు దూరంనుంచీ సైన్యాలు కాపాడుతూ ఉండాలి. తక్కిన సేనలు నగరంలో కావలికాస్తూ అప్రమత్తులయి ఉండాలి." బ్రహ్మదత్తుడు సభ్యులనందరినీ ఒక్కసారి కలియచూచి మహారాజు వైపు తిరిగి తన చేతులు జోడించి, "మహారాజా! పులమావిని సంపూర్ణంగా ఓడించి ఇక్కడికి బంధించి తీసుకువస్తాము. మాకు సెలవు దయచేయ కోరుతున్నాను" అని ప్రార్థించాడు.

"ధనకప్రభు! మేమో?" మహారాజు చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"తాము నగరంలో ఉండాలని ప్రార్థన మహాప్రభూ! సరియైన జైత్రయాత్ర రాబోతున్నది. అప్పుడు తామే నాయకత్వం వహించవలసి ఉన్నది" అని బ్రహ్మదత్తుడు మనవి చేసినాడు. వెంటనే సభ్యులు జయజయధ్వానములు చేసినారు.

ఆ మరునాటినుంచి ఇక్ష్వాకు సైన్యాలు సమకూర్చ ఆజ్ఞలు వెళ్ళినవి. సర్వసైన్యాలకు మహాసేనాపతి స్కందశ్రీ మహారాజు. వారి క్రింద సేనా పతులు చాళుక్యరాయనికప్రభువు, బ్రహ్మదత్తప్రభువు, వీరపురుషదత్త యువరాజు, పల్లవప్రభువు, శాంతిమూలమహారాజుకు బాసటగా నగర రక్షక మహాసేనాపతి అయినారు. విజయపురం ఎదుట కృష్ణకీవల ఇక్ష్వాకు సైన్యాలు పూంగీయ సైన్యాలు సమకూడుటకు సన్నాహాలన్నీ బ్రహ్మదత్తప్రభువు స్వయంగా చూచుకొంటూ ఉండెను.

ఇక్ష్వాకు సైన్యాలు పులమావిని ఎదుర్కొనేందుకు సంసిద్ధమౌవనీ శాతవాహన మహారాజు తమసైన్యాలనన్నీ కులహాక ప్రభువు నాయకత్వము క్రింద పంపించి, తాము పులమావితో యుద్ధము కొంత సాగించిన వెనుక, ప్రక్కనుండి పులమావిని తాకవలసి ఉన్నదనిన్ని విజయశ్రీ చక్రవర్తికీ శాంతిమూలమహారాజు రహస్యవార్తను కులహాక ప్రభువునకిచ్చి పంపినారు.

## 8

**రా**జకుమారి శాంతిశ్రీ బ్రహ్మదత్తుని కోటకు ఒకదినాన తన రథముపై ఇరువురు చెలికత్తెలతో అంతఃపుర పాలకురాలితో విచ్చేసింది. ఆ ధనక ప్రభువు కోటయు మహారాజు కోటకు దీటయినదే. నగర గోపుర ద్వారాలు దాటి లోనికిపోగానే విచిత్రపుష్పవనము

దర్శనమిస్తుంది. పూలవనం మధ్యగా రథ్య ఉన్నది. పూలవనం దాటగానే అతిథిమందిరాలు రథ్య కీవలావల దూరంగా ఉన్నవి. అవిదాటి వెళ్ళగానే ఫలోద్యానమున్నది. అందు దేశదేశాల వెలయు ఫలవృక్షాలు మాలీలు పెంచుతూ ఉంటారు. ఫలవనం దాటగానే ఒక అందమైన సరోవరము ప్రత్యక్షమవుతుంది. ఆ సరోవరంలో పద్మాలు విలసిల్లుతూ ఉంటాయి. అందు రాజహంసలు సంగీతంలో తేలియాడే తాళాలులా ఈదుతూ ఉంటాయి. రథ్య రెండుపాయలై గుండ్రని ఆ సరోవరానికి ఈవలావలగా పోతుంది. సరోవరానికి అవలప్రక్క తెల్లనిపాలరాతితో నిర్మించిన దివ్యమందిర మాలిక ప్రత్యక్షమవుతుంది. ఈ మందిరాలు స్కందవిశాఖాయనక ప్రభువే నిర్మించినాడు. ఈ విచిత్రాలన్నీ చూస్తూ శాంతిశ్రీ మందిరాలవరకూ పోయి అక్కడ రథావరోహణం చేసింది.

రాజకుమారి వస్తున్నదని అంగరక్షకులు చూచి వెంటనే రాజమందిరంలోనికి వార్త అందిచ్చినారు. రాజకుమార్తె కోటకు వెనకవైపున నున్న గోపుర ద్వారంలోనుంచి వచ్చింది. ముఖద్వారం తూర్పుదెస ఉన్నది. రాజకుమారి వచ్చిన ద్వారము పడమటి గోపురము. శాంతిశ్రీ చెలికత్తెలతో రథం దిగగానే బ్రహ్మదత్తప్రభువు తల్లి నాగసిరిదేవి ఎదురువచ్చి శాంతిశ్రీని కౌగలించుకొని, దాసీలు దృష్టితీసే ఎఱ్ఱనీళ్ళు పట్టుకొనిరాగా, తానే స్వయంగా దృష్టితీసివేసి లోనికి నడిపించుకొనిపోయి, తన అంతస్సభా మందిరంలోనికి ప్రవేశపెట్టి ఆమెను బంగారు అసనంపై అధివసింప చేసినది.

"తల్లీ! మీరు మా కోటకు రావడం నా కెంత ఆనందమో నేను చెప్పలేనమ్మా!" అని నాగసిరిదేవి తన ఆనందం వెలిబుచ్చుతూ పలికింది. "మా గురువుగారు పులమావి జైత్రయాత్రను అరికట్టడానికి వెడుతున్నారు. ఆ సంగతి వారితో మాట్లాడాలని వచ్చాను మహారాణీ!" శాంతిశ్రీ ఏదో ఆలోచనాధీనయై ప్రత్యుత్తరమిచ్చింది.

"మనం బ్రాహ్మణులమైనా రాజధర్మం పూనినాముకాదా అమ్మా! ఈనాటిదికాదీవృత్తి మనకు ఈ దేశం అంతా అటవీయమై ఉన్నప్పుడు సాంఖ్యాయననులు ధనకదేశాలనికి రాజులై ఉండేవారు. మా అబ్బాయి పూర్వీకులలో ఒక మహారాజు, శ్రీశాతకర్ణి శాతవాహన చక్రవర్తి ఆజ్ఞ ప్రకారం, ఈ అడవిదేశం అంతా జనపదప్రదేశం చేసి ఇక్కడ రాజ్యం స్థాపించారు. అందుకే ఈ నగరానికి విజయపురం అని పేరు వచ్చిందట రాజకుమారీ!"

"ఎంత రాజధర్మం వహించినా బ్రాహ్మణధర్మము పునాది అయి ఉండాలికదా దేవీ!" శాంతిశ్రీ ప్రశ్న ఎంతో దైన్యపూర్ణమై ఉంది.

"అవును కుమారీ! నీ భావం నాకు అర్థమైంది. నువ్వు అబ్బాయితో మాట్లాడుతావా? ఇప్పుడే అతనికి వార్త పంపుతాను." ఆమె వెంటనే పరిచారికతో "మహారాజు తనయ శాంతిశ్రీదేవి ప్రభువుగారితో మాట్లాడుతారు గనుక ఇక్కడికి నేను రమ్మన్నానని చెప్పు" అని ఆజ్ఞ ఇచ్చింది.

నాగసిరిది స్ఫురద్రూపము. శాంతముట్టిపడుతుంది ఆమె తేజమున. ఆమె మాటలు జలజలా ప్రవహించిపోయే శైవాలినీ స్వనాలులా ఉంటాయి, విజయపురంలో ఉన్న మహిళాలోకం అంతా నాగసిరిదేవిని ఎప్పుడూ దర్శిస్తూ ఉంటుంది. ఎవరికి కష్టం వచ్చినావారా తల్లి దగ్గరకు వచ్చి తమ హృదయం ఆమెకడ విప్పుతారు.

“గురువుగారూ! ఈ యుద్ధాలు మానడానికి వీల్లేదా?” అని శాంతిశ్రీ బ్రహ్మదత్త ప్రభువు రాగానే వారిపాదాలకు వంగి నమస్కరించి ఎంతో ఆందోళనతో ప్రశ్నించింది. ప్రత్యూషారుణకాంతులు ఒకదానివెనుక ఒకటి వచ్చినట్లుగా ఆ బాలికలో నానాటికి ప్రత్యక్షమయ్యే ఏదో విచిత్ర చైతన్యోదయాన్ని పరిశీలిస్తూ అక్కజంపడుతున్నాడు బ్రహ్మదత్తుడు.

“యుద్ధాలు మనం కోరి తెచ్చుకుంటామా రాకుమారీ!” అతడు చిరునవ్వు నవ్వాడు.

“అది అల్లా ఉంచండి. పరమార్థం విచారిస్తే యుద్ధాలు అయినా ఒకటే, కాకపోయినా ఒకటే అని మీరు అనవచ్చును. అది స్థితప్రజ్ఞుల విషయం. దుఃఖంలోపడి కుళ్ళిపోయే ప్రజానీకానికి ఈ వేదాంతం చాలా భయంకరం కాదా అండి!” ఆమె మోము అద్భుతమైన కాంతితో నిండిపోయింది.

ఆమెను అత్యంత సమ్మోదంతో గమనిస్తూ బ్రహ్మదత్తుడు, “రాజకుమారీ, నువ్వు చెప్పిన విషయాలు సత్యదూరాలు కావు. అయినా ప్రస్తుతము మన ప్రపంచములో ప్రసరించి ఉన్న యుద్ధనీతి విచిత్రగతుల నడచి వచ్చింది. అది సముద్రానికి చేరబోయే నదివంటిది. దానికి సరియైన దారి కల్పించి సముద్రాన్ని చేర్పించాలి. అంతేకాని వెనక్కు నెట్టాలని బ్రహ్మాండమయిన ఆనకట్ట కట్టాలని ప్రయత్నం చేస్తే దేశం అంతా వరదలు నిండుతుంది. అంటే స్త్రీ పురుషులు ఆబాలవృద్ధంగా హింసావశులై తమ్ము తామే నాశనం చేసుకుంటారు. మనలో ఉండే హింసాబుద్ధి కీయుద్ధాలు నిదర్శనం.” ఆమె తన గురువును ఎంతో భక్తితో చూస్తూ ఆయన మాటలు విన్నది.

“యుద్ధాలు పూర్తిగా మానివేసి సంప్రతింపుల మూలంగా ఎందుకు సామరస్యం కుదుర్చుకోకూడదు ప్రభూ?”

“ఒకడు సామరస్యానికి కూడిరాకపోతే రెండవవాడు ఏమి చెయ్యాలి?”

“అందుకని ఉభయులూ నాశనం కావాలా? మనమే గెలుస్తామని నమ్మకమెట్లా? ఎవరు గెలిచినా నష్టం ఉభయత్ర తప్పదుకదా?”

“దేవతలుకూడా రక్షసులతో యుద్ధాలు చేయలేదా? రాజకుమారీ?”

“రాక్షసులు అంటే మనలోని రాక్షసత్వం కాదా అండి?” మానవునిలోని పశుత్వం నాశనం చేయడం కాదా అండి?”

“అందుకని ఉభయులూ నాశనం కావాలా? మనమే గెలుస్తామని నమ్మకమెట్లా? ఎవరు గెలిచినా నష్టం ఉభయత్ర తప్పదుకదా?”

“దేవతలుకూడా రక్షసులతో యుద్ధాలు చేయలేదా? రాజకుమారీ?”

“రాక్షసులు అంటే మనలోని రాక్షసత్వం కాదా అండి?” మానవునిలోని పశుత్వం నాశనం చేయడం కాదా అండి?”

"స్వామీ! తాము అశ్వారూఢులై ఎచ్చటికో పోతూ ఉండిరి. ఇంతలో ఏనుగంత సాలిపురుగొకటి వచ్చి, పెద్దపెద్ద మోకులవంటి తంతులతో మిమ్ము బంధించి వేసిందట!"

"చిత్రము!"

"ఆ వెంటనే ఒక మహాజ్వాల ఎక్కడనుండో అవతరించి ఆ తంతులను మండించి వేసిందట! నాకు మెలకువ వచ్చింది."

"కల శుభాంతమేకదా?"

"అయినా మీకు కష్టము వచ్చునుకదా ప్రథమంలో?"

"అది వ్రాసి ఉంటే తప్పించుకోగలమా?"

"మానవయత్నం విధివ్రాతను తప్పింపలేదా?"

"అయినా నా విషయంలో ఇంత ఆతురత ఎందుకు రాజకుమారీ?"

"మీరు నా దేశికులు."

"నీకు పూర్వం ఈ ఆతురత ఎవరి విషయంలోనూ ఉండేది కాదు గాదా?"

"నాకు ఏవో విచిత్రానుభూతులు స్వప్న ప్రపంచంలోవలె వస్తూంటాయి."

"ఇదీ ఒక స్వప్నానుభూతా?"

"నాకేమి తెలియును ప్రభు?"

## 9

**ఆం**ధ్రదేశానికి చక్రవర్తినంటూ బయలుదేరిన పులమావి మహావేగంగా సైన్యాలతో కొలవి మహాపథానికి ఉత్తరప్రదేశాలవరకూ వచ్చి అక్కడ దండు విడిసి, సేనాపతులతో ధాన్యకటకమునా ముందు ముట్టడించవలసినది, లేక విజయపురమునా? అన్న విషయం తేల్చడానికి సభ చేసినాడు.

మహాసేనాపతి "అన్నదాతా! విజయపురంవారు బలవంతులు, విజయపురం కైలాసంకన్నా బలమైనకోట. దానిని పట్టాలంటే శతవత్సరాలు పడుతుంది" అని వినయంగా మనవి చేసుకొన్నాడు.

"ధాన్యకటకం ముందు ముట్టడించాలని మీ ఉద్దేశమా మహాసేనాపతీ?" అని పులమావి పృచ్ఛ చేసినాడు.

"చిత్తం సార్వభౌమా!"

"కారణం?"

"ఒక కారణం అన్నదాతకు మనవిచేసి ఉన్నాను, రెండవ కారణం ధాన్యకటకం పట్టడం సులభమని నా మనవి."

"సులభమైనవి పట్టడంలో మన గొప్ప ఏముంది? పైగా బలపూర్ణమైన విజయపురం అలాగే ఉంటుంది అప్పుడు మాత్రం మనకు ఇక్ష్వాకులను నెగ్గడం కష్టసాధ్యమైన పనికాదా?"

"చిత్తం మహాప్రభూ! కాని ధాన్యకటకం మనం ముట్టడించినప్పుడు ఇక్ష్వాకు బలగాలు అక్కడకు వచ్చి తీరుతాయి. వాటిని అక్కడ సులభంగా జయించవచ్చు.

విజయపురకోట శ్రీ బోధిసత్వనాగార్జునులచే నిర్మితమయినది. మానవ దుర్భేద్యమంటారు పెద్దలు. అలాంటి వారిని పైకి కొనిరావటమే యుద్ధనీతి అని నా విన్నపం.

"విజయ శాతవాహనునకు బావమరది అవడంవల్ల ధాన్యకటకానికి సహాయంగా వచ్చి తీరుతాడు శాంతిమూలుడని నీ ఊహ. అతడు రాక ఏ బ్రహ్మదత్తునో పంపితే?"

"ధాన్యకటకం కబళించి పూంగీప్రోలు ముట్టడిస్తాముగాక మహాప్రభూ!"

"బాగుంది మీ ఆలోచన మహాసేనాపతీ! శిబిరాలు ఎత్తించి మహావేగంతో ధాన్యకటకం దారి పట్టించండి."

ఇంతట్లో ఒక సేనాపతి లోనికిరా అనుజ్ఞవేడినాడు. రావచ్చునని పులమావి కంచుకితో చెప్పినాడు. వెంటనే ఆ సేనాపతి లోనికి విచ్చేసి పులమావికీ మహాసేనాపతికి నమస్కరించి "అన్నదాతా! విజయపురం సైన్యాలు మనకు నాలుగు గోరుతాల (గోరుతము ఇప్పటి రెండుమైళ్ళు) దూరంలో ఉన్నాయని అపసర్పులవార్త. ఆ సైన్యాలు మహావేగంగా వస్తున్నాయట" అని కొంచెం వేగంగా మనవిచేశాడు.

పులమావీ, మహాసేనాపతీ ఒకరి మొగము ఒకరు చూసుకున్నారు. పులమావి వెంటనే "మహాసేనాపతీ, మన శిబిరాలు వ్యూహ రూపంగానే తీర్చి ఉన్నవి గనుక వెంటనే అర్ధచంద్రవ్యూహం రచించండి. లిప్తలలోపని జరగాలి." ఆ మాటలంటూ పులమావి కవచాదులు ధరింప లోనిశిబిరాలలోనికి పోయినాడు. మహాసేనాపతి తన శిబిరాలకు పోయి రణభేరీ వేయించి సేనలకు యుద్ధాజ్ఞలు ఆశ్వికవార్తాహరులచే అందింపచేయించెను.

రణభేరీలు, కాహళాలు నినాదాలు సంధానచేస్తున్నవి. సైనికులు, ఆశ్వికులు, రథికులు, గజయుద్ధవీరులు అతి వేగంగా తమతమ కవచాయుధాదుల ధరించి యథాస్థానాలకు పోతున్నారు. సైన్యం అంతా తెల్లవారేసరికి అర్ధ చంద్రాకృతిలో సిద్ధమైయున్నది. పులమావి తన మహాగజము అధివసించి అర్ధచంద్ర మధ్యస్థుడైనాడు. మహాసేనాపతి దక్షిణ శృంగాన, ఉపమహా సేనాపతి నామ శృంగాననిలిచిరి. ఎదుట రెండు గోరుతాల దూరంలో త్రిశూల వ్యూహరూపంలో ఇక్ష్వాకుసైన్యాలు నిలిచిఉన్నాయి.

బ్రహ్మదత్త ప్రభువు దక్షిణదళాధిపతిగా తన రథం మీదనిలిచి ఉన్నాడు. యుద్ధ ప్రారంభముహూర్తం ఇంకా రెండుఘడియలున్నది. పులమావికియుద్ధ ప్రారంభ ముహూర్తం ఒకఘడియా ఇరువదివిఘడియలు మాత్రమే ఉన్నది. తన మూహూర్తానికి సరీగా పులమావి సైన్యాన్ని ముందుకు సాగించాడు. పులమావి సైన్యాలు నెమ్మదిగా ముందుకు పోతున్నాయి. సైన్యం ఒక ఘడియకు పావుగోరుతము దూరంసాగింది. ఇంకా ముందుకుపోతున్నది. అంతకన్న అంతకన్న వేగం ఎక్కువైంది. ఎదుటసైన్యాన్ని తాకి చుట్టుముట్టవలసిందని పులమావి తన సేనాపతులకు ఆజ్ఞలు పంపినాడు. ఆ వేగం నూరు ధనువుల (ఇప్పటి ఆరడుగుల పొడవు) చొప్పున కొంచెం కొంచెం ఎక్కువవుతున్నది. సైన్యంలో భేరీలు, కాహళాలు తమ తమ ధ్వనులు వేగం వేగం చేస్తున్నవి.

ఇంతలో ఇక్ష్వాకు సైన్యాలు కదిలే శుభముహూర్తం వచ్చింది. ఒక్కసారిగా శుభవాద్యాలు మ్రోగినవి. ఇక్ష్వాకు సైన్యాలు మూడు ధనువులు మాత్రం ముందుకు నడవాలి. అక్కడ సైన్యమంతా ఆగవలెను. ముందు శ్రేణివారు కూర్చుండి బాణాలు

ఎక్కుపెట్టాలి. వెనక(శ్రేణివారు మోకాళ్ళపై నిలిచి బాణాలు ఎక్కుపెట్టాలి. ఆ వెనక(శ్రేణివారు నిలుచుండి బాణాలు ఎక్కుపెట్టి, శత్రువు నూరు ధనువుల దూరాన ఉండగానే, భేరీలు(మోత సంకేతంగా బాణాలు వదలాలి. శత్రువు ఏబది ధనువులు వచ్చేవరకు ఈ మూడు(శ్రేణుల వారూ బాణాలు వదులుతూనే ఉండాలి.

ఆజ్ఞల (ప్రకారమే పులమావి సైన్యాలు నూరు ధనువుల దూరం రాగానే ఇక్ష్వాకు సైన్యాలు ఒక్కసారిగా లక్షలకొలదిబాణాలు శత్రువులపై వదలినవి. ఒక(శ్రేణితర్వాత ఒకటి బాణాలపంక్తి సువ్వునవచ్చి వ(జ్రపాతాలులా శత్రుసైనికుల, ఆశ్వికుల, గజవీరుల తాకినవి. కదలి వస్తున్నందువలన పులమావి సైన్యాల బాణాలనే ఇక్ష్వాకు బలగాలు చెక్కుచెమర్ప వయ్యేను.

పులమావి సైన్యాలవీరులు వేలకొలది కూలిపోసాగినారు. పులమావి సైనికులు ఇన్నాళ్లు యుద్ధాలు చేయకుండా నెగ్గివచ్చినందున యుద్ధం చేయ గల మేటి సేనాపతుల, సేనల ఉద్ధృతం ఇప్పటికే చవిచూడసాగెను వేల కొలది పడిపోతూంటే, పులమావి సైన్యాలను ముందుకు నడుపుతూనే ఉన్నారాతని సేనాపతులు. కాని యుద్ధం వివాహయా(త్రగా భావించిన అతని సైనికులు చటుక్కున ఆగిపోయారు. ఇక్ష్వాకుల బాణపాతం గురితప్పని మహావేగంలో వస్తూనే ఉంది. పులమావి సైన్యాలలో చికాకు ఎక్కువైంది. భయం మొలకెత్తింది, అది వృక్షమయింది. పులమావి సైన్యాలు వెనక్కు తిరిగాయి. చిందర వందరయి సైన్యాలు మహావేగంతో తమ శిబిరాలున్న స్థలానికి పరుగులు పెట్టాయి. ఆ గడబిడ, అల్లరి, ఆ (త్రొక్కులాటలచే భూకంపం వచ్చిన వెనక ఒక నగరం ఉన్నట్లున్నదా (ప్రదేశం. కాని పులమావి సైన్యాలను ఇక్ష్వాకు సైన్యాలు తరుముకుని రావటంలేదు.

* * *

## సప్తమ భాగం

# భయంకరమూర్తి

ఆమె దేశికుడు యుద్ధమనివార్యమని శాంతిశ్రీని ఒప్పింపజూచినా ఆమె హృదయమో, బుద్ధియో ఏదో ఆ వాదనలకు లోబడలేదు. ఆమెలో హృదయముందని ఆమెకు తెలియదు. ఇతరులకునూ ఆ హృదయము వ్యక్తము కాలేదు. ఆమెకు స్వప్నాలు లేదు. పులకరింతలులేవు. తన్మయత్వము లేదు. ఒళ్ళు ఝల్లుమనే ఆనందంలేదు. ఆమె సౌందర్యం అరవిచ్చిన పారిజాతసుమము. ఆ సుమములో పరిమళములు మాత్రం విరియలేదు. ఇప్పు డా బాలిక గురువు మాటలను తలపోస్తూ ఉంది. ఆ రాత్రి నిద్రపట్టలేదు. తన మెత్తని పల్యంకముపై మేను చేర్చిన మరుని మేషముంలో గాఢనిద్రచే మైమరచే ఆ బాలిక పక్కపై ఇటూ అటూ దొర్లసాగింది.

ఆ తరువాత కన్నులు పూర్తిగా తెరచి ఆలోచనలు లేని ఆలోచన పథంలో విహరింపసాగింది. ఆమె ఏకసంతగ్రాహి. అలవోకగా విన్న పాటలు, గాథలు గూడా ఆమె మరచిపోదు. ఈనాడు ఆ పాటలు ప్రతి మలుపులో ఆమెకు ప్రత్యక్షం కాసాగినవి. ఒకనాడు ప్రతీహారిణి ఒకర్తు తాను ఉద్యానవనంలో తిరుగుతూ ఉండగా తన్ను గమనింపక ఒక పొదరింటి నీడలో కూర్చుండి పాట పాడుకొంటూ ఉంది. పొద ఈవల పక్క నుండి ఆ పాట తాను విన్నది.

*“నారాజు పెదవులెంతో రంగుకలవీ*
*నా పెదవి*
*గారాల ముద్దులా కరిగించ గలవీ!”*

ఒకరి పెదవులతో ఇంకోరి దేహం స్పృశించడం ముద్దు అని వాత్స్యాయన సూత్రాలలో ఉన్నది. తన్ను చిన్నతనంలో తల్లిదండ్రులు బుగ్గపై, నుదురుపై, తలపై ముద్దులు పెట్టుకునేవారు. అవి వాత్సల్యాత్మక చుంబనాలట! కాని స్త్రీ పురుషులు ఒకరిపై ఒకరు గాఢానురాగం కలవారయినప్పుడు ఒకరిపెదవులు ఒకరు చుంబింప వాంఛింతురట. స్త్రీ పురుషులలో కాక గాఢానురాగ ప్రశ్న ఎక్కడ ఉదయిస్తుంది? తనకు ఆనాటి తల్లిదండ్రుల ముద్దులు ఏమీ ప్రయోజనం లేనివిగా కనిపించాయి.

*ఎందుకా ముద్దులు? ఏమిటా ముద్దులు?*
*ఇప్పుడు తనకీ అలోచనలేమిటి?*
*“నారాజు తనెదకు నను చేర్చి అదిమికొనె*
*నా ఒడలు పులకించి నన్ను సిగ్గులుముంచె”*

సిగ్గు అంటే తనకు అర్థంకాలేదు. లజ్జావతి, త్రపాపూర్ణ అని బాలికలను సంబోధిస్తారు. అది భయమా? సంకోచమా?

*"నారాజు స్తనవల్కలము పాయగాజేసి*
*హారాలు చిక్కువడెనని వాని సరిచేసె"*

సరిచేయడంలో ఏముంది? పాటలో రచింపవలసిన వైచిత్ర్య మేమి కలదు?

**"నా ఒళ్ళు ఝల్లుమనె నాకళ్ల అల్లుకొనె**
**నా ఎడద ఫెళ్ళుమనె నా కోర్కెలుల్లసిలె"**

ఏమిది ఈ అల్లరి, ఈ ఝల్లుమనడము? ఈ ఆలోచన రాగానే ఆమెకు ఏదో వివశత్వము కలిగింది. కణతలు వేడి ఎక్కినవి. ఎప్పుడూ ఆకాశాభిముఖియై గుండెపైని చేయినిడి నిదురపోయే ఆ బాలిక భయంతో ఒక్కసారి బోర్లగిలపడి హంసతూలికలుగల వెన్నమెత్తని పరుపునకు గాఢంగా హత్తుకొన్నది. మనస్సులో తళుకు, ఒళ్ళు ఝల్లుఝల్లుమని జలదరించింది. ఏదో మత్తు ఆవహించింది. హృదయంలో ఏదో బాధ. ఆ బాధ తీర్చడానికై తన చిన్నారి బంగారు వక్షోజాలను ఉపధానానికి ఒత్తుకున్నది. ఆమె కన్నుల నీరు తిరిగింది. ఆమె చటుక్కున లేచి త్వరితముగ వాతాయన మార్గముకడకు పోయి మత్తుగావీచు వసంత మందమలయానిలాలను గుప్పున పీల్చుకొన్నది. ఆమెలో ఆవేదన ఎక్కువయినది. శరీరాంగములు పొంగిపోతున్నవి. కఠినమయిన వాతాయనశిల్ప ఫలకాలను తన హృదయమునకు హత్తుకున్నది, ఇంకను చెంపలు వేడి ఎక్కుతున్నవి. ఒడలు జల దరిస్తున్నది. రోమాంచిము శరీరమంతా విద్యుల్లతవలె ప్రాకిపోతున్నది.

ఆమె మందిరములో నిలువలేకపోయింది. పరుగు పరుగున మందిరాలు దాటి తన ఉద్యానవనంలోనికి పారిపోయి చంద్రశిలా నిర్మిత మయిన కేళాకూళికడ మెత్తని పచ్చికపై వాలిపోయింది. ఏమిది? తనకు దయ్యము పట్టినదా? ఆమె ఆ చల్లని పచ్చికపై దొర్లినది. లేచి ఇన్ని తెల్లనిపూలు మల్లెపొదలనుండి పుణికినది. అవి కన్నుల కద్దుకొన్నది. ఆమెకు ఆవేదన మరీ అధికమయినది. "అబ్బా ఏమిటీ బాధ భగవాన్ పరమశ్రమణకా!" అని అవ్యక్తంగా ఎలుగెత్తి అరచినది. ఎట్టఎదుట బ్రహ్మదత్తుడు తోచినాడు, అతడా? "గురూ! గురుదేవా!" అని ఆమె చుటుక్కున లేచి నిలుచున్నది ఆమెకు ఏదో శాంతి ఆవహించింది. "మీకొరకే ఎదురు చూస్తున్నాను ప్రభూ!" అని ఆమె తలవాల్చింది. ఏదో నిశ్శబ్దము, ఏమిటా నిశ్శబ్దమని ఆమె తలఎత్తినది. అక్కడ బ్రహ్మదత్తుడు లేడు.

## 2

ఎప్పుడు శాంతిశ్రీకి బ్రహ్మదత్తచ్ఛాయ గోచరించిందో ఆ బాలిక కేదో అద్భుతమైన పరమశాంతము సన్నిహితమైంది. ఆమె మోము ఆరుణార్ద్రా రాగపూర్ణమైనది. కాకలీకంఠంతో ఆ బాలిక జ్ఞప్తికి వచ్చిన పాట పాడుకుంటూ భవనంలోనికి నడచివచ్చింది.

*"ఇది ఎంతచిత్రమే*
*మదవతి పవిత్రమే*
*నా హృదయ రమణుదే*
*రచియించె ఈ ప్రతిమ*

*ఆ మూర్తి పోలికలు*
*ఏమానినిలో తోచు*
*ననుచూచి నవ్వెదవు*
*నాతీ నేనేమంటి?*
*ఆ చిత్రమూర్తిలో*
*తోచు నా బింబమని*
*ఏల ఊహింతువే*
*మేల మెందుకె నాతో*
*నాదు ప్రతిబింబాన*
*నన్నుమించెను సొగసు*
*సుంతైన నేగాను*
*సుందరమె ఆ మూర్తి !"*

ఏమిటీ ఈ పాటకర్థం? నేను నా గురువు హృదయంలో చిత్రింప బడలేదు గదా? ఇదేమి పిచ్చిభావము? హృదయంలో చిత్రమేమిటి? ప్రణయవశులగు యువతీ యువకుల హృదయాలలో పరస్పరమూర్తులు చిత్రితమవుతాయట. ఆ చిత్రాలు ఉత్ప్రేక్షలట. ప్రకృతిలోని వంకరలు చిత్ర కారుడు దిద్ది శ్రుతి చేస్తాడట. స్వరశ్రుతిసమ్మేళనం చేసి సంగీతతపస్వినీ తపస్వులు ప్రకృతి ధ్వనులలో నుండి గాంధర్వం ఉద్భవింపచేసారట. సంగీతమేమిటి? చిత్రలేఖనమేమిటి? కవిత్వమేమిటి? అవి కాముని చేతి ఆయుధాలు. వీనివల్ల జగజ్జీవి వంచితుడౌతాడేగాని, అవి ఉత్తమ నిర్వాణ సాధనా లెట్లా అవుతాయి?

కాని ఒక్కసారిగా ఈ దినమున అవి తనకు ఏదో ఆనందం కలుగ జేస్తున్నాయి. ఆనందం అంటే పులుపు అంటే తీపి అంటే అనుభవించినవారే తెలుసుకుంటారు. ఈ దినాన పాటకై తనహృదయం? పొద్దుపొడుపు పూవులా తిరిగిందే. ఆ నిండుజవ్వనికి ఏమీ అర్థం అవటంలేదు. ఆమె తన భవనంలోకి వెళ్ళడం మానివేసింది. భయపడిన హరిణిలా అంతా కలియచూచింది. ఈ పది నిమేషములలో మబ్బుకప్పిన చంద్రుని వెన్నెలలా ఆమె శాంతి మాయమయింది. ఆ బాలికాహరిణము ఇటూ అటూ చూసింది. కళ్ళు చెదిరినాయి. అపరిచితమయిన ఒక నూత్న స్పందనము దిశలనుండి తుంపరలు కురుస్తున్నది. ఆ అనుభూతి సుఖమా, దుఃఖమా? ఆమె తన్ను తాను మనోదర్పణంలో చిన్నబిడ్డలా చూచుకొన్నది.

లోకంలో ఆనందం వెన్నెలలా ప్రతివస్తువునూ స్పృశిస్తుంది అన్న సత్యం ఆమెకు గోచరించింది. వెన్నెల స్పృశించిన వస్తువు వేరు, వెన్నెలలో ఉన్న వస్తువు ప్రక్కల, అడుగున చీకటి ఉండుగాక. ఆ చీకటికి నీడ అని వేరే అర్థం వస్తుంది. ఆ వెన్నెలకున్న వ్యక్తిత్వంవలెనే నీడకూ వ్యక్తిత్వం వస్తుంది. బ్రహ్మదత్తప్రభువు తనకు చంద్రుడా? అది ఏమి వెఱ్ఱి ఆలోచన అని ఆమె అనుకుంది. ఇలా ఆమె మనస్సులో అనుకోవడం ఎవరూ వినలేదు కదా? ఆమె నలుదిక్కులు పరికించింది. ఇదీ అర్థంలేని ఆలోచనే. ఈ ఆలోచన ఎందుకు కలగాలి? అంతఃకరణ ప్రవృత్తులే లేని ఆ బాలిక జీవిత ప్రదేశానికి చిత్తవికార మహానది పొంగి

వరదలు పొర్లి వచ్చినట్లు, విరుచుకు పడినట్టు, నెమ్మదిగా ప్రవహించినట్టు వస్తున్నది. ఉన్నట్టుండి ఒక దినం తన తండ్రి మహాసభలో పాడిన ఒక మహాకవి పద్యము ఆమె ఎదుట తోచినది.

*"ప్రేమ అన్నది ఒకదివ్య ధామమగును*
*ప్రేమికు లనిమిషులు వారి వీక్షణములె*
*తపము, చుంబనములె అమృతము, బళిర*
*అద్భుతాలింగనమె వారి యజ్ఞఫలము"*

ఈ పద్యము చదువుకొని ఆమె తెల్లబోయింది. తెరవెనక నర్తకిలా భావము వ్యక్తావ్యక్తమై ఆమెకు తోచినది. ఆమె "బ్రహ్మదత్తప్రభూ! ఈ ఆవేదనాపూర్ణాలయిన సంశయాలను మీరే పరిష్కరించాలి" అనుకొన్నది వెంటనే ఆమె హృదయము అతివేగంగా స్వనించినది. ఆమె కేదియో ధైర్యము కలిగింది. ఆమె తన భవనంచేరి అంతఃపుర రక్షకురాలిని పిలిచింది.

"నువ్వు మన అంగరక్షకదళములు రెంటిలో ఒకటి సిద్ధం చేయించు. భవన రక్షకదళాలు మూడింటిలో రెండు సిద్ధంచేయించు. రథాలు, ఏనుగులు మహారాజుగారిని నే నర్థించినట్లు వారికి ఇదిగో నా చిటికెనవేలి ఉంగరము ముద్రవేసిన అభ్యర్ధనము కొనిపో! రేపు ఉదయం మన చిన్నసైన్యం ప్రయాణానికి అనుమతికోరు. పులమావితో యుద్ధానికిపోయిన మనసైన్యాలను, ముఖ్యంగా మా గురువుగారిని, కలుసుకోడానికి వెడుతున్నానని వారికి మనవిచేయి" అని ఆ బాలిక మహాసామ్రాజ్ఞిలా ఆనతి ఇచ్చింది. చిన్నతనాననుండీ ఆ బాలికను తల్లిలా పెంచిన ఆ అంతఃపుర పాలకురాలు తెల్లబోయి "చిత్త" మని మాత్రమనగలిగినది. శాంతిశ్రీ తన విద్యామందిరము లోనికిపోయి చిరునవ్వు నవ్వుకొంటూ అప్పుడప్పుడు ఆశువుగా,

*"యుద్ధమేమిటి వ్యూహమేమిటి?*
*యుద్ధమున మారణము లెందుకు?*
*శత్రువేమిటి మిత్రుడేమిటి*
*జీవజాలములో?*
*"విజయ మెందుకు ఓట మెందుకు?*
*విజయ మొందగ సైన్యమెందుకు?*
*సైన్య ముఖమున రథములెందుకు*
*అశ్వస్త్రాలున్?*
*"చంపువా డెవ్వండు? వానికి*
*చంపబడు నావీరవరునకు*
*చావునకునూ బ్రతుకునకునూ*
*భేద మేముందో?*
*"గురువాక్క దే తీర్చగల డీ*
*బరువెక్కిన హృదయ వేదన,*
*నరునిపొదివిన కష్టజాలము*
*కర్థమేముందో?"*

## 3

**యు**ద్ధం ముగియ సమయం సూర్యాస్తమయం. యుద్ధం ఆపే విరామ కాహళాలు మ్రోగినవి. ఇక్ష్వాకులు వ్యూహరచన నిపుణతవల్లా, యుద్ధాన వారు చూపిన నేర్పువల్లా పులమావి సైన్యంలో పదివేలమంది సైనికులు, రెండువేలమంది అశ్వికులు నశించారు. ముప్పదిఅయిదు కథాలు నుసి నుసి అయిపోయాయి. పదిహేను ఏనుగులు పర్వతాలు కూలిపోయినట్లు కూలిపోయాయి. ఘోరాపజయం అయినట్టు సిగ్గుపడి పులమావి సైన్యాలను వెనుకకు నడిపించుకుపోయాడు. శిబిరాలను చేరి పులమావి తన ముఖ్య సైన్యాధిపతిని పిలిపించి ఆలోచన ప్రారంభించాడు.

"మనం ఈ దినాన ఓడినట్టేకదా?" పులమావి హేళనగానూ కోపం గానూ ప్రశ్నించాడు తన సేనాధిపతిని.

"మహాప్రభూ! జయాపజయాలు ఒకదినం యుద్ధాన్ని పురస్కరించుకొని చెప్పలేము కదా?"

"వేదాంతమా మీరు మాట్లాడేది?"

"మహాప్రభువులు వేళాకోళం చేస్తున్నారు. అన్నదాతలకు నామనవి ఇది–మన సైన్యాలకు సంఖ్యాధికం ఉన్నది. మన సైన్యాలలో మగటిమి గల వీరు లనేకులున్నారు. మొదటిదినం కొంచెం మనకు నష్టము ఎక్కువ అయిన మాట నిజం. దినదినమూ మనకు కలిగిన నష్టాలచే సగంసేన నష్టమయినా ఒక వారం దినాలలో ఇక్ష్వాకు సైన్యాలు నాశనం కావా ప్రభూ!"

"ఎంత చక్కగా ఉన్నది మీవాదం మహాసేనాపతీ!" అని పులమావి వెటకారంగా నవ్వినాడు.

మహాసేనాపతి తెల్లబోయి "నా ఉద్దేశం తమకు మనవిచేసి ఉన్నాను. తమ ఆజ్ఞకు ఎదురుచూస్తున్నాను."

"పులమావి ఇంక ఆ ధోరణి రాకూడదని అనుకున్నాడు." ఇదివరకు యుద్ధాలలో ఆరితేరిన ప్రజ్ఞాశాలి. యజ్ఞశ్రీ శాతకర్ణికడ శిక్షణపొందిన సేనాపతి. తాను బంగారంతో ముంచెత్తి ఈతణ్ణి మహాసేనాపతిగా ఉండడానికి ఒప్పించాడు. ఈతని లోటులేదు.

"మహాసేనాపతీ! మనం ముందుకర్తవ్యం ఆలోచించుకోవద్దా?" పులమావి చిరునవ్వు నవ్వినాడు.

"ముందు ఈ దినంవలె మనంవెళ్ళి ఇక్ష్వాకులను తాకక, వారిపై విరుచుకు పడినట్టు ముందుకుపోయి రెండునూర్ల ధనస్సుల దూరంలో సైన్యాలను ఆపు చేయించాలి. వింటి అమ్ములవారిని ముందుకుంచాలి. సైన్యాలను మూడుభాగాలుచేసి గరుడవ్యూహం పన్నాలి."

"సేనాపతీ! రేపటిదినం మీరే సంపూర్ణనాయకత్వం వహించి సేనలు నడపండి. మేము మా యుద్ధగజంపై అధివసించి సేనామధ్యస్థులమై యుద్ధ విధానం పరిశీలిస్తూ ఉంటాము" అని పులమావి నవ్వుతూ మహాసేనాపతిని వీడ్కొలిపినాడు.

* * * *

శాంతిశ్రీ మహారాజుకుమారి తన అంగరక్షకులకు తారానికను నాయకురాలి నొనర్చినది. అమెను తన కుడిదిక్కున, యశోదనాగనిక ఎడమదెసను నిలిపినది. ఇరువురు కత్తిసాములో, సాముగరిడీలో, మల్ల ముష్టియుద్ధాలలో, ధనుర్యుద్ధంలో అందెవేసిన సుందరీమణులు. ఏ మగవాడైనా వాళ్ళిద్దరితో కత్తియుద్ధానికి తలపడడు. వారిరువురకూ భయంలేదు. వారు ప్రాణానికి వెరవరు. రాకుమార్తెను కంటిరెప్పలులా కాపాడుతూ ఉంటారు. కోపం వస్తే ఆడపులులే, ఆనందంగా ఉంటే అందాల అల్లరిపిల్లలు.

తారానిక యశోదనాగనిక గ్రామం వెళ్ళి వచ్చినప్పటినుంచీ నాగదత్త వీరుని తలంపని నిమిషంలేదు. ఆమె కళ్ళలో కాంతి హెచ్చింది. ఆమె వక్షము మరీ ఉప్పొంగి పోతున్నది. ఆమె మూర్తి మరీ అందం తాల్చింది. ఇవన్నీ అంగరక్షకీ నాయిక పరిశీలించి ఈమెకు ప్రేమదయ్యము ఆవేశించింది అని నిశ్చయానికి వచ్చింది. ఈ వీరసుందరి హృదయం చూరగొన సమర్థు డెవ్వడు తల్లీ! అని ఆమె ప్రశ్నించుకొంది. తారానికా, యశోదనాగనికా చాలా స్నేహంగా ఉంటూ ఒక్కనిమేషమైనా ఒకరిని ఒకరు వదల లేకుండ ఉండిరి. పైగా ఈ మార్పంతా యశోదనాగనిక ఊరు వెళ్ళి వచ్చినప్పటినుండీ వచ్చింది. అదీగాక పని విడుపు వచ్చినా యశోద అంతఃపురం వదలి వెళ్ళేదికాదు. ఇప్పుడు తారానిక ఇంటికి పోతున్నది.

యశోదకు అన్నగారొకరున్నారు. అందాలవాడు. మిసిమి వయసువాడు. వీరుడు. బ్రహ్మదత్తప్రభువు అంగరక్షకబలంలో చిన్ననాయకులలో ఒకడు. యశోద ఊరు తారానిక వెళ్ళినప్పుడు నాగదత్తుడు, ఆమె కలుసుకుని ఉంటారు. ఆ విషయం ఎప్పుడు ఊహించుకొందో వెంటనే అంతఃపురాధి కారిణి తారానికను రప్పించింది.

"తారానికా భర్తృదారిక యుద్ధరంగాభిముఖియై వెళుతూ ఉంది. ఆమె చూట్టూ ఉండే ఎనమండుగురు అంగరక్షకురాండ్రలో నిన్ను ముఖ్యనుచేయుమని నాకాజ్ఞ ఇచ్చింది. నీ ఉద్దేశం?"

"అంత అదృష్టానికి నేను తగుదునా? నా ప్రాణాలు పోవాలి. దేవిగారి వంటిమీద ఈగ వాలడానికి!"

"నీ ప్రాణాలు పోయిన వెనుక నువ్వేమి చేయగలవు?"

"నా ప్రాణాలు పోగొట్టుకోను, అమ్మగారిమీద ఈగనూ వాలనివ్వను."

"అలా ఉండాలిదీక్ష! ప్రణయవిలాసినులు మాత్రం అంగరక్షకురాండ్రుగా ఉండకూడదు. ప్రతిఅంగరక్షకురాలిని నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. ప్రతి బాలికా నిజం చెప్పాలి."

"చిత్తం."

"నువ్వు ఎవరినైనా ప్రేమిస్తున్నావా?"

".... ................................"

"మాట్లాడవేం?"

"చిత్తం! ప్రేమిస్తున్నానమ్మా!" ఆమె మోము వైవర్ణ్య మొందింది.

"ఎవరిని?"

## 4

నేను ప్రేమిస్తున్నాను అని తారానిక అనగానే, అంతఃపుర రక్షకురాలు పకపక నవ్వుతూ, "ఎవరిని? " అని ప్రశ్నించింది. తారానిక తలవాల్చుకొని "నాగదత్తుని" అని అస్పష్టంగా పలికింది. "ఎవరా నాగదత్తుడు?" పరిపాలకురాలు బుద్ధశ్రీ మాటలు కొంచెం కటువుగా ఉన్నట్లున్నాయి. "యశోదనాగనిక అన్నగారు." తారానిక తలఎత్తి సరే ఏమవుతుందో చూద్దాము అన్నట్లుగా మాట్లాడింది. "అదే నేనూ అనుకున్నాను. సరే నువ్వువెళ్లు. ఏ విషయమూ తర్వాత మాట్లాడుతాను" అన్నది ఆ అంతఃపురపాలకురాలు బుద్ధశ్రీ. తారనిక ఆలోచనా హృదయంతో వెళ్ళిపోయింది. నాగదత్తుని ప్రేమ అంతా ఆమెకు జ్ఞాపకం వచ్చింది. సాల గ్రామంలో జరిగిన వసంతోత్సవపు వేడుకలన్నీ ఆమెకు స్ఫురణకు వచ్చాయి. శైవాలినీప్రాంత విలాసక్రీడ అంతా జ్ఞాపకం వచ్చింది తారానికకు. ఆమె ఒళ్ళు ఝల్లుమన్నది.

నాగదత్తుని ప్రేమ తన్ను సుడిగుండంలా ముంచెత్తింది. నాగదత్తుడు తారానికకు తెలియకుండా తన మేనమామను విజయపురం తారానిక తండ్రి కడకు పెళ్ళిరాయబారం పంపించినాడు. ఆమె తండ్రి గౌతమస్వామి చాలా సంతోషకరమైనదనీన్నీ త్వరలో శుభముహూర్తాన ప్రధానం చేసుకోవలసి ఉంటుందనీ చెప్పినాడు. మేనమామ పూర్ణనాగుడు సంతోషంతో తిరిగి వచ్చి మేనల్లునికీ, బావగారికీ, తన అక్కగారికీ రాయబార ఫలితం వర్ణించాడు. నాగదత్తుని సంతోషానికి మేరలేదు. తల్లీ కొడుకూ, చెల్లెలూ తారానికకు సంతోషం కలిగించే ఒక విచిత్రవ్యూహం పన్నినారు.

తారానిక ఉదయస్నానం నిర్వర్తించి బొట్టుపెట్టుకొంటున్నది. చెంపలకు పుప్పొడి అద్దుకొంటున్నది. ఆ సమయంలో నగలమంజూష ఒకటి పట్టుకొనివచ్చి "కాబోయే తన కోడలుకు అత్తగారు ఈ భూషణమందసము బహుమానమట. రేపటినుంచి వసంతోత్సవాలు వస్తున్నాయి. ఆ ఉత్సవాలకు తారానికి వనదేవికావాలి" అంటూ "నీకిమ్మన్నది" అని యశోద గబ గబ వెడలిపోయినది. ఇంతలో నాగదత్తుని అన్నగారి కొమరిత వచ్చి, "పిన్నీ! ఈ చీరెలూ పల్లెలూ మా తాతయ్య తనకు కాబోయే కోడలికని ఇవ్వమన్నారు. ఇవి తీసికో తారపిన్నీ" అని చెప్పి అక్కడ ఆచీనాంబరాలమూట రత్నకంబళిపై ఉంచి పారిపోయింది. కొంతసేపటికి నాగదత్తుని అన్న కొమరుడు వచ్చి "పిన్నమ్మా! మరే మా నాన్న ఈ బంగారుకంకణాలు మా మరదలుకు బహుమతి అని నీకిమ్మన్నారు" అని అవి ఆమె ఒళ్ళో ఉంచి తుఱ్ఱుమన్నాడు.

అతడు వెళ్ళడమేమిటి వాని చిన్నతమ్ముడు వెంటనే అక్కడకు వచ్చి "ఇదిగో, తూలు, పిన్నాయీ! మలే మలే! మా బాబాయి ఈ ముత్తాల హోలం తన బారియకు బగుమతిత. నీకేఁబాబాయేఁ ఇమ్మన్నాలు." తారానికి మెళ్ళో హారంవేసి, "నేను వెల్లుతున్నాను, నన్ను ఒక్కసారి పెత్తుకోవూ! అది మా బాబాయికి ఇవ్వాలిత" అన్నాడు. తారానిక ఆ బాలుని గబుక్కున ఎత్తుకుని హృదయానికి గాఢంగా అదుముకుని ముద్దులతో ముంచెత్తింది. "నన్ను పిన్నాయి పెత్తుకుందోయి" అంటూ పారిపోయాడు. తారానికి

ఏమిటో ఆలోచిస్తూ కూచున్నది ఇంతలో వసంతోత్సవపు విందుకు రమ్మందంటూ యశోద వచ్చింది.

"ఇందతా ఏమిటీ యశోదా?" అని తీవ్రంగా అడిగినట్లు అడిగింది.

"ఏమో నాకేమి తెలుసును?"

"తెలియకుండా నువ్వు ఆ నగలపెట్టె ఏలాపట్టుకు వచ్చావు?"

"మా అమ్మ చెప్పినట్లు అదిచేశాను."

"అంతేగాని నీకేమీ తెలియదు?"

"మా మేనమామ విజయపురం నుంచి వచ్చాట్ట!"

"వచ్చి?"

"వచ్చినవార్త విన్పించాట్ట."

"ఏ వార్త ?"

"వివాహం వార్త!"

"ఏ వివాహం?"

"మా అన్నయ్య వివాహం!"

"ఎప్పుడుట?" గబుక్కున ఆమె గుండెలల్లో రాయిపడింది. మళ్ళీ ఇదంతా తన్ను మాయచేసేడే అని అర్థం అయి పకపక నవ్వువచ్చింది.

"ప్రధానం త్వరలో అవుతుందట!"

"ఎవరి ప్రధానం!"

"నీ ప్రధానం!"

"నా ప్రధానమేమిటి!"

"నీ ప్రధానమేనట. మీ నాయనగారు మా మాయయ్యచేత శుభవర్తమానం పంపించారు."

"ఎప్పుడూ?"

"నిన్న సాయంకాలం మా మామయ్య విజయపురం నుంచి రాలేదు మరీ?"

"మా నాన్నగారిని ఎందుకు కలిశారు? ఏలా కలిశారు?"

"మా అన్నయ్య, మా నాన్నగారు ఆలోచించి మా మామయ్యను నీ పెళ్ళి విషయం కనుక్కోడానికి పంపారు!" యశోద పక పక నవ్వింది.

"నా పెళ్ళి విషయం మీకందరికీ అవసరం ఎందుకూ?" తార దొంగకోపం అభినయించింది.

"మా అన్నయ్యకు కాబోయే పెళ్ళానివిగనుక!"

"ఎవరన్నారూ ఆ ముక్కంట?"

"నువ్వు!"

"నేనా?"

"నేనూ!"

"నువ్వా?"

"నువ్వూ, నేనూ!"

"ఇదేమిటి?"

"మా వదినకు ఒక ముద్దు" అని తారానికను యశోదనాగనిక గాఢంగా కౌగిలించుకుంది. తారానిక యశోదను కౌగిలించుకొంది.

## 5

ఆనాటి విషయాలన్నీ తారానికకు జ్ఞాపకం వచ్చినవి. ఆమె మోము ఆనందంతో అరుణరాగ సుందరమై వెలిగినది. ఇంతలో యశోదనాగనిక పరుగున అక్కడకు వచ్చి.

*"చిన్న వదినా!*
*చిన్నారి వదినా!*
*కన్న వదినా!*
*కమ్మని వదినా!*
*ఏమిటే నువు కలలు కంటావూ*
*వదినా!*
*మిలమిలలాడేవూ?"*

అని పాడి, ఆడుతూ వచ్చి తారానికకడ వాలింది.

*"ప్రియుడు దొరకని బాలికటా,*
*బాలిక అందంకూర్చిన విధిటా*
*అటు ఇటు ఆడీ*
*అల్ల రిచేసి,*
*ప్రియుడు ఎక్కడని*
*వెదుకుతున్నదటా!"*

అని పాడుతూ తారానిక లేచి నాట్యంచేయ సాగింది

*యశోద :* *ఎవరు విన్నా నవ్వి పోదురూ!*
*ఎవరు కన్నా తెల్లపోదురూ*
*ప్రణయ తాపమున బాదావలీయై*
*బాలిక ఒక్కతె నాట్యమాడితే*
*ఎవ్వరూ వినినా,*
*ఎవ్వరు కనినా*

*తారానిక :* *ప్రేమసంగతీ తెలియని బాలిక*
*ప్రేమామృతమును క్రోలని ముగుదా*
*ప్రణయవిషయములు మాటలాడితే*
*ప్రజలు చూచితె ముక్కునవ్రేలుగ*
*ఫక్కున నవ్వుతు పగలబడుదురూ*
*ఎవ్వరూ వినినా,*
*ఎవ్వరు కనినా?*

*యశోద: బాలిక అవడం ప్రణయం కొరకే*
*ప్రణయం తెలియని బాలిక ఉంటే*
*వీరురాలు గంభీరురాలు! అల*
*మారునైనా తూల్చును వాల్చును*
*ఎవ్వరు వినినా,*
*ఎవ్వరు కనినా?*

ఇద్దరూ విరగబడి నవ్వుకొన్నారు మంచంమీద దొర్లుతూ ఒకరితో నొకరు మల్ల యుద్ధం చెరపుతున్నట్లు. నటించారు. ఆ వెనుక ఇద్దరు లేచి చీరెలు సవరించుకొని, వల్లెవస్త్రములు వయారించుకొని సడలిన స్తనదుకూలాలు బిగించుకొని, రత్నకంబళులపై కూరుచుండి తలకట్లు దువ్వుకుంటూ మాటలాడుకొన ప్రారంభించారు.

"చిట్టివదినా! బోధిశ్రీదేవి, 'యశోదా! నిన్ను తమకు అంగ రక్షకురాలిగా వియోగించుమని భర్తర్శదారిక ఆజ్ఞ ఇచ్చినారు. అలా ఏర్పాటు చేయకముందు కొన్ని సంశయాలు బాపుకోవాలి. నువ్వు ఏ బాలకునైనా ప్రేమిస్తున్నావా?' అని ప్రశ్నించింది. నాకు ఆపుకోలేనంత నవ్వు వచ్చింది. నిన్నూ ఆ ప్రశ్న అడిగిందా?" అని యశోద తారానిక వంక చూస్తూ అన్నది.

"ఆ, అడిగింది. వదినా! అడిగితే అవునని నిజం చెప్పేసి ఊరు కొన్నను." తారానిక ఇటూ అటూ పరికించి మరీ చెప్పింది.

"మా అన్నయ్యను ప్రేమిస్తున్నాననే చెప్పితివా ?"

"ఆ!"

"అప్పుడేమంది బోధిశ్రీదేవి?"

"ఏమంటుంది? ఆలోచించి చెబుతానంది."

"ఎప్పుడూ?"

"ఎప్పుడా? ఆ తర్వాతనట! నువ్వు ఆమె ప్రశ్నకు ఏమి ప్రత్యుత్తరమిచ్చావు?"

"నేను ఎవ్వరినీ ప్రేమించటంలేదని, నీవూ మా అన్నయ్య ప్రేమించుకోవడం తెలుసుకుని, అడిగిందేమో ఈ ప్రశ్న!"

"అయితే కావచ్చును. ఈమె మనిద్దరినే అడిగిందా? అందరినీ ఈ ప్రశ్న లడిగిందంటావా?" అని తారానిక ఆలోచనాధీనయై ప్రశ్నవేసింది.

"ప్రేమిస్తే అంగరక్షకత్వానికి అడ్డంవస్తుందని కాబోలు!"

ఇద్దరు బాలికలూ ఏదో ఆలోచనలో మునిగినారు. ఒక విఘటిక గడచినవెనుక యశోదనాగనికను చూచి తారానిక "వదినా! నేను పోయి రాజకుమారి దర్శనం చేసుకుంటాను. ఆమెతోనే మాట్లాడుకుంటాను" అన్నది. యశోదనాగనిక "సరే వెళ్ళిరా! నేను నాగదిలో కూర్చుని ఉంటాను. మన వంతు తరువాతకదా వచ్చేది" అంటూ తన గదిలోనికి వెళ్ళిపోయింది.

తారానిక వెళ్ళి రాజకుమారి దర్శనం అర్థించింది. రాజకుమారి రావచ్చుననీ అనుమతి ఇచ్చింది. తారానిక వెంటనే లోనికిపోయి రాజకుమారి పాదాలకు నమస్కరించి నిలుచున్నది.

"భర్తృదారికా! నేను తారానికను తమ అంగరక్షకురాలిని!"

"అవును నిన్ను ఎరుగుదును, నువ్వు బ్రహ్మదత్తప్రభువు అంగరక్షకులలో ఒకరైన నాగదత్తుడు అనే యువకుణ్ణి ప్రేమిస్తున్నావని, మీ వివాహం వైశాఖమాసంలో కావచ్చునని విన్నాము, నిజమేనా?" అని శాంతవదనంతో ఏ భావాలు వ్యక్తంగాని చూపులతో రాజకుమారి శాంతిశ్రీ ప్రశ్నించింది.

"చిత్తం!"

"సరే నీవు రావచ్చును.... వెళ్ళు - పాలకురాలికి ఆజ్ఞ ఇత్తును."

తారానిక సంతోషంతో వంగి రాజకుమారి పాదాలంటి వెడలిపోయింది. ఆమె ఉప్పొంగిపోయింది. ఎంతవిచిత్రము.... పురుషుని పేరయినా తలవని ఈ బాలిక, నిర్వికార వర్తనఅయిని ఈ దేవి తనకు అనుమతి ఏలా ఇచ్చినది? నిరుడు వసంతోత్సవాలలో బ్రహ్మదత్తప్రభువు ఈ బాలికను రతీదేవిగా ఎన్నుకుంటే విచారంతో కుంగిపోయింది. అదివరకు విచారమూ ఎరుగదు, కోపమూ ఎరుగదు, దయా ఎరుగదు. అంతఃకరణ ప్రపత్తులే లేవన్నారు. అలాంటిది ఈ ఏడు వసంతకాలంలో ఈ రాజకుమారి కలకలలాడుతూ దివ్యపథాలనుండి దిగివచ్చిన త్రిజగన్మోహినిలా వసంతోత్సవంలో విలసిల్లిపోయినదట. ఓహో! ఏమీ రాకుమారి సౌందర్యం !తామెవ్వరూ ఆ బాలికను తేరిపార చూడలేరు. ఆమెకు తన వసంతోత్సవం కళ్ళకుకట్టినది. తన ప్రియుడు నాగదత్తుడు వసంతదేవుడైనాడు. ఆ మనోహరుని విశాలఫాలం, గరుడనాసిక, కండలుకట్టిన విశాలవక్షము, ఆ గోమూర్ధకటి, ఉన్నతమూర్తి, తుమ్మెదరెక్కల మీసాలతో పుష్పాలంకృతుడై వెలిగి పోయినాడు.

## 6

సాలగ్రామ వసంతోత్సవం అతివిచిత్రంగా ఏర్పాటు చేశాడు నాగదత్తుడు. రాత్రులు కాగడాల వెలుతురున చంద్రోత్సవం జరిగింది. మధు మాసదేవుని అలంకార విధానం మార్చినాడు. వనదేవిగా తారానికను ఎన్నుకొనడమే ఒక అద్భుతకల్పన. ఒక మోడుచెట్టును ఉత్సవంచేసే స్థలంమధ్య పాతినారు. అక్కడక్కడ వట్టిగంపలు నిలువెత్తున మోడుగా ఉన్నవి. మధ్యను ఒకధాన్యపు పురి ఏమీ అలంకరణ లేకుండా ఉంది. ప్రజలందరూ ఈ ఉత్సవం చూడడానికి వీలుగా ఎత్తయిన మంచెలు చూట్టూ కట్టించినాడు. శుభముహూర్తం రాగానే మూడేళ్ళనుండి అయిదేళ్ళవరకూ ఈడుగల ఇరు వదిమంది బాలికలు ఆకులతో, లతలతో అలంకృతులైనవారు పాడుకుంటూ వచ్చారు.

*"చలిచేత వణికామె*
*మలిసంజ పోయినదె*
*తొలిప్రొద్దు ఉదయింప*
*తూరుపున ఎరుపెక్కె*
*ఏడె మా మధురాజు*
*ఏడమ్మ తెలుపరే!"*

*అని అందరూ పాడినారు.*

*"అమ్మా కప్పవే*
*అదరిపాటే నాకు*
*ఏదో భయమౌతాది*
*ఎటుపోవనే నేను!"*

*అని ఒక మూడేళ్ళబాలిక పాడింది.*

*"భయ మెందుకమ్మా?*
*బాలలార మనకూ*
*భయమెందుకమ్మా ?*
*జయ మొందు శుభ*
*శకునమాయె అదుగో*
*మగువలార మధు*
*మాసరాజు లేడ!*
*భయమెందుకమ్మా?*
*దూరమందు ఏదో*
*తొగరురంగు తోచె*
*చిట్టిపాప బోసి*
*చిన్నారి పెదవిపై*
*భయమెందుకమ్మా?"*

ఆ ముగ్గురు బాలలు నాట్యం పూర్తిచేయగానే, ఎఱ్ఱనిమొగ్గలుగల లతలు అలంకరించి బంగారురంగు వస్త్రాలు ధరించిన పన్నెండు సంవత్సరాల బాలికలు ఎనమండుగురు నలువైపులనుంచీ నాట్యమాడుతూ ప్రవేశించారు. వారి వెనుక బాలురు పది పన్నెండు సంవత్సరాలవారు ఎనమండు గురు తెల్లని మొగ్గలతో లతలతో అలంకరించినవారు ఎనమండుగురు నీల వస్త్ర శోభితులు వచ్చిన్నారు. ప్రతివానిచేతిలో ఒక బొమ్మనాగలి ఉంది. ప్రతి బాలిక చేతిలో రంగులతో అలంకరించిన మృత్తికాకలశ మొకటి ఉన్నది.

*బాలికలు : దిశలమమ్మా మేము*
*దెసల బాలికలం*
*బాలురు : దెసలకై ఎదురేగు*
*పసుల కాపులమూ*
*మేము*
*మిసిమి భూమినిదున్న*
*మేటి హాలికులం!*
*మేము*
*హాలికులం*

బాలికలు: కలిమిచ్చు భూమాత
కన్నతల్లీ మాకు

అనుచు బాలికలు, బాలకులు కలిసి నృత్యవిన్యాసాలు నెరపదొడగిరి.

**7**

వసంతుడు ; భూతమ్ము వలె తమము భూమియంతా నిండె
భూతజాలమ్ము నిశ్చేతనములై పండె
తొలకరించే సృష్టి వెలుగు వెల్లువలలో
మొలకచీకట్లేల అలముకొనెనో?

మన్మథుడు ; జగతికి శుభమూ ప్రేమయితే
భగ భగ పొంగుతు ద్వేషమ్మో
కాలకూటమై వ్యాపిస్తె
మూలమూలలకు మండిస్తే
బూడిదకాదా
మోడై పోదా విశ్వమ్మూ లోకమ్ము.

వసంతుడు ; సత్యరూపమౌ ప్రేమశక్తిని
నిత్యమే నే చేసివేతును
సృష్టిధర్మము నాదుజన్మౌ
అష్టదిక్పాలకులె సాక్షులు.

మలయమారుతుడు ; నీవులేకే నేనులేను
నిన్ను పొదివి నేనువత్తును
అందుకే నన్ గంధవహుడని
అందరును ప్రేమింతురయ్యా!

మన్మథుడు : ప్రేమబలమును నీచులెరుగరు
ప్రేమబలమె అహింసరూపము
ప్రేమశక్తే దైవశక్తీ
ప్రేమనిత్య వసంతమూ.

వసంతుడు చీకట్లను పారదోలుతాడు.... కాపు బాలురు అచ్చటచ్చట ఉన్న లతలను పూవులను ధరించుకొంటారు.

బాలురు : వసంతదేవా వచ్చేవా?
వసుధకు ప్రాణములిచ్చేవా?
మలయ : ఉత్సాహంలో ఉప్పొంగండీ
ఉర్వినినిండే నవయౌవనులూ

ప్రేమించేటి ముహూర్తమొచ్చే
ప్రేమవాహినుల తేలండీ!

మన్మథుడు : పూలశరాలూ విసిరివేసెదా
తూలిపోకుడీ నవయౌవనులూ
ఏదోబాధా తీయని గాథా
వేదనముంచే అన్వేషణలూ

బాలురు : వసంతదేవా రావయ్యా!
వసుధకు ప్రాణములీవయ్యా!

వసంతుడు ఆనందనృత్యంచేసి బాలుర కడకువచ్చి వారిపై ఆశీర్వాద హస్తముంచి.

"భయమేలనయ్య
బాలకులు మీకూ
దయకలిగె వరమిత్తు
తలలెత్తి తెల్పుడీ!

బాలురు : మాకేమి కావాలొ
మనసులకు తట్టదే
హృదయాలు ఉప్పొంగు
కదిలేను కాంక్షా

మన్మథుడు : తెలుసునయ్య
తెలుసునయ్య
తేటతెల్లమై
పాటుపోటులై
యువతినికోరే యువకులురండీ
రండమ్మా బాలికలూ
దండలనే వేయండీ
తలపులతో పొంగండీ
వలపులతో కరగండీ.

గలగల నాట్యమాడుతూ బాలికలు వత్తురు. బాలురు. బాలికలూ కలిసి ప్రణయ నృత్యం సలుపుతారు. బాలికల జట్టునాయిక రతీదేవి. ఆమె ప్రక్క గంధవతీ. రతీ మన్మథుని కడకూ, గంధవతి మలయమారుత కుమారుని కడకూ నాట్యాన వచ్చి వారితో కలిసి నృత్యం సలుపుతారు.

రతి : నాథ, మన్మథా
నర్మ మధురమూర్తి
ఎన్నాళ్ళకో నిన్ను
కన్నార కాంచితిని!

మన్మథుడు : ప్రణయినీ నాతనువు
భగ్నమని మండగా
రూపరహితుడనై
రోదించిపోయాను
ఇంతలో నాశక్తి
ఇలనిండె దెసనిండె
విశ్వమంతా నిండి
శాశ్వతమ్మయి నిలిచె!

రతి : నాథ మిముగానకే
భాధపడి కూలితిని
రోదించి రోదించి
రుద్రునే తిట్టితిని
దేవతలు విచ్చేసి
దీనులై నిలిచారు
"తల్లీ! నీ నాథుండు
ఎల్లఎడ నిండాడు
తిరిగి వచ్చేనమ్మ
తిరిగి వచ్చేను
ప్రతియేడు మధుమాస
ప్రారంభమందు
ఈ రహస్యము నెరిగి
ఓ రతీ నీవు
ఆమనితో వేచి అరయు" మన్నారు!

మన్మథుడు : అదుగో దేవీ వసంత దేవుడు
అచ్చట దీనత కూర్చున్నాడు
చేష్టలు దక్కి
చిన్న తనముతో
అతడే చిహ్నము నిత్యసృష్టికీ
అతడే కలిపెను మనలనిద్దరా
కనుగొందామె కాంతా రావె
కలకలనవ్వుల తేలించెదమే!

రతి, మన్మథులు : ఏమోయి ఆమనీ
ఈ రీతి నున్నావు

ఆనందనృత్యాల
అఖిల లోకమ్మలరు

గంధవతి, మలయమారుతుడు : మధుమూర్తి ఈ రీతి
మనసు కలతైతే
మా ఒడలు వేడెక్కి
మరిగిపోయేము!

బాలికలు, బాలురు : ఆమనికి శోకమూ
ఆశ్చర్యమయ్యే
ఆమనికి దుఃఖమే
అంత్య కాలమ మాకు.

## 8

వసంతుడు ఆ త్రిభంగాకృతి పీఠముపై అధివసించి ఆవేదన అభినయిస్తు ఉందును. రతీ మన్మథులు, గంధవతీ మలయమారుతులు, బాల బాలికలు వసంతుని అనునయించే నాట్యం చేస్తూ, పాటపాడగానే ఆ దివ్యమూర్తి,

"వికల మొందె హృదయమయ్య
శకలమయ్యె ఆనందం
తెలియరాని భావమొకటి
నిలువెల్లా కూల్చేనో!"

అని పాడుతూ తలవంచాడు.

రతి : ఈ రీతినే నా దుఃఖం
ఏదుజగాలను నిండీ
మండించెను గరళమ్మయి
మసిచేసెను మాంగల్యము

మన్మథుడు : ఓయి వసంతా ఉపశమించుమా
నాయికలేనీ నాయకుడీవే!
దేవీసహితుడు దేవుడె పూర్ణుడు
దీనుడు ఒంటిగ ఉంటే అమరుడు
లక్ష్మి హృదయమునలేని విష్ణువు
లలితార్థాంగుడుకాని శివుండు
తలపులకయినా అందని భావము
తపసులనయినా చేరని మోక్షము

రతి : గంధములు లేనట్టి పూవులు
కాంతిరహితుడు సూర్యబింబము
ప్రాణసతి లేనట్టి వ్యక్తే

*మలయమారుతుడు : నాకు జన్మేలా*
*నాదుప్రేయసి నన్ను చేరని నాదుజన్మేలా?*

*గంధవతి : ప్రియుని కౌగిలివీడి బ్రతుకే లా నాతికి*
*ప్రేమ ఈయని వరములుండేలా ?*

*బాలురు : వలపువేడియ కౌగిలే*
*బ్రతుకుమార్గపు వెన్నలా*
*ప్రణయనీమృదులా ధరమ్మే*
*ప్రాణమిచ్చే అమృతమే*

*బాలికలు : నాథుని హృదయము జీవాధారము*
*నాథునిప్రేమే ఆత్మాధారము*

*వసంతుడు : మీమీ మాటల*
*మించెను దుఃఖము*

*అందరు : దుఃఖమేలా ఆమనీ*
*దోయిలింపుము భూమినీ!*

వసంతదేవుడు సమభంగాకృతియై, పద్మాసనాసీనుడై చిమ్ముద్రాంకిత హస్తుడై కన్నులరమూతలుగా తపస్సు అభినయిస్తాడు.

*ఆకాశవాణి : నీ తపసు ఫలియించెనోయీ ఆమనీ*
*చేతనుడవై నిలువుమోయీ*

*అందరు : ఏదోవెలుగూ ఏదో సౌరభ*
*మేదోదర్శన మదె వచ్చెన్!*

రంగస్థలానికి మధ్యగా ఉన్న ఒకపెద్దగంపతేలి మాయమయిపోతుంది. ఆ స్థలంలో తారానిక వనదేవి వేషాన సహస్రదళ పద్మం మధ్య కూర్చుండి ప్రత్యక్షమౌతుంది. వసంతుడు కన్నులు నెమ్మదిగా తెరుస్తూ పులకరం అభినయిస్తాడు. ఎదురుగా వనదేవిని చూస్తాడు.

*"ఓహో! ఏదో ఆనందం*
*ఆహా! అలమెను నన్నూ*
*ఎవరో ఈ దివ్యదర్శనము*
*ఎవరో ఈ పరమ దర్శనము*
*సౌందర్యాలూ మూర్తించినవీ*
*సర్వమునన్నిటు ముంచెత్తినదీ*
*ఆపలేను నా చివరవాంఛితమును*
*ఓపలేను ఈ విరహవేదనను*

*వనదేవి కన్నులు తెరుస్తూ : ఎక్కడనుండీ ఇక్కడతేలితి*
*ఏమయ్యెను నా ప్రాణేశుండూ*

*ఆమె అంతటా కలియ చూచి, వసంతదేవుని కనుగొనును.*

*మన్మథుడు : వేశాను వేశాను పూలబాణాలూ*

*రతి : వలపుబందాలతో కట్టివేశాను.*

*గంధవతి : క్రమకాంక్షల వీరి కలయనింపాను.*

*మలయ : కాంక్షలో నునుమొగ్గ విరియ జేశాను.*

వనదేవి ఆసనంనుండి దిగి తూలుతూ నాట్యమాడుతూ ముందుకు వస్తుంది. ఆమె చుట్టూ గంభీర శృంగార తాండవం చేస్తాడు వసంతుడు. ఆమె వారిస్తూ, నీవెవరవంటుంది. అభినయంలో వసంతుడు దివ్యప్రణయ విలాసతాండవోద్వేగాన ద్రుతగతితో ఆమెను సమీపిస్తాడు.

*వసంతుడు : నినువిడిచి మనజాల*
*కనుతెరచి చూడవే!*
*వనదేవి : వ్రీడావతిని నేను*
*చూడవో ఆమనీ*
*వసంతుడు : నీ హృదయమున నన్ను*
*దాచుకొంటాను.*

ఇరువురు అద్భుత నాట్యమొనర్చి ఒకరి కౌగిలిలో ఒకరు కరిగి పోతారు. తక్కిన వారంతా అనుగుణంగా నాట్యం చేస్తారు.

* * * *

ఈ పవిత్ర సంఘటన తారానికకు జ్ఞప్తికిరాగా, నవ్వుకొంటూ శాంతిశ్రీ మహా రాజకుమారి రథం ప్రక్కనే అశ్వారూఢురాలయి వస్తూ ఉన్నది.

## 9

రెండురాత్రిళ్ళు పగళ్ళూ ప్రయాణంచేసి శాంతిశ్రీకుమారి సైన్యమూ ఆ వెనుక వీరపురుషత్తుని సైన్యమూ బ్రహ్మదత్తప్రభువు సైన్యమును చేరారు. బ్రహ్మదత్తుని సైన్యాన్ని చేరేసరికి తూర్పున ఉషాబాల కెంపుచీర ధరించి తాండవిస్తున్నది. ఆమెకు వెనుకనే దిశాబాలికలు అరుణవస్త్రాలతో హంగు చేస్తున్నారు.

శాంతిశ్రీ వచ్చేసరికి ఆమె సైన్యాలకై విడిదులు ఏర్పాటై శిబిరము నిర్మాణమై ఉన్నది. చక్రవర్తి ఆశ్వికవార్తాహరులను ఇదివరకే పంపి ఉన్నారు. శాంతిశ్రీకుమారి తన శిబిరంలో ప్రవేశించి స్నానాదికాలు నిర్వర్తించి, ఎఱ్ఱచీర ధరించి స్తనదుకూలము అలంకరించి, శిరస్త్రాణతనుత్రాణములు ధరించి, గుఱ్ఱమెక్కి అంగరక్షక బాలికలు వెంటరా, కొందరు సేనాపతులు దారిచూప బ్రహ్మదత్తుని శిబిరానకుపోగానే అంతకుముందే బ్రహ్మదత్త ప్రభువు రాయబారానికై ఒక్కడే పులమావి స్కంధావారానికి వెళ్ళినారని అక్కడి దళపతులు ఆమెకు మనవిచేసినారు.

వెంటనే రాకుమారి తిరిగి తనశిబిరానికి వెళ్ళిపోయింది. ఆమెకు ఎందుకో నిరాశా విసుగు కలిగినవి. ఎన్నడూ ఆమె విసుగుచెంది యెఱుగదు. ఆశలే లేని ఆ రాకుమారికి నిరాశపొంద కారణమేమి ఉండగలదు? ఆమె కవచం విప్పి తన యోగాసనాన కూరుచుండి మనస్సును ఏకముఖం చేయాలని ప్రయత్నించింది. ఆలోచనలు ఒకదానివెంట ఒకటి తరుముకు వచ్చాయి. ఆమె ఎన్ని ఘటికలు అలా నిశ్చలత్వానికై ఎదురు చూస్తూ కూరుచుందో! సేనా నాయిక శిబిరమూహూర్త ఘంటికలు మ్రోగుతున్నాయి.

బ్రహ్మదత్తుడు పాఠాలు చెబుతూ కనబడతాడు. ఒక వసంతోత్సవంలో తానే ఏదో భయపడి పారిపోతున్నట్లు కనబడుతుంది. సముద్రం కల్లోలావృతమై ప్రత్యక్షమౌతుంది. అందులో ఒక చిన్న ఓడ మునిగి పోయేటంత స్థితిలో దూరంగా తోస్తుంది. బ్రహ్మదత్తుడు నవ్వుతూ దర్శనం ఇస్తాడు. ఏదో మాట్లాడ బోతాడు. బ్రహ్మదత్తుడు యుద్ధానికి వెడుతూ మూర్తించాడు. ఆ దృశ్యం మాయమైపోతుంది. యుద్ధంలో రక్తసిక్తాంగుడై పడిపోయి ఉంటాడు.

"ఓ" అంటూ శాంతిశ్రీ లేచింది. ఒక అంగరక్షకురాలు పరుగెత్తు కొనివచ్చి "రాజకుమారీ! ధనకమహారాజలవారిని బంధించినామని పులమావి వద్ద నుంచి వార్త వచ్చింది" అని రొజుతూ చెప్పింది.

"ఏమిటీ? ధనక ప్రభువును బంధించడమే?" ఆమెకు ఏమీ అర్థం కాదు. మోము వివర్ణమైనది.

ఇంతలో వీరపురుషదత్త యువరాజు వేగంగా చెల్లెలి శిబిరంలోనికి వచ్చి "చెల్లీ! బ్రహ్మదత్తప్రభువు రాయబారానికై వెళ్ళితే పులమావి వారిని పట్టుకొని బంధించాడట. ఆ విషయం కమ్మఁవాసి స్వహస్తాంకితమైన ముద్ర పంపించినాడు" అనుచు ససంభ్రమంగా మాట్లాడినాడు. పదిలిప్తలు జరిగినవి. శాంతిశ్రీ తిరిగి గంభీరత తాల్చింది.

"అన్నయ్యగారూ! రాయబారిని ఎట్లా పట్టుకోగలరు?"

"రాయబారి వస్తున్నాడని వార్త పంపి మరీవెళ్ళినాడట బ్రహ్మదత్త ప్రభువు!"

"రాయబారిని ఎల్లా పట్టుకొన్నారు అన్నయ్యగారూ?" శాంతిశ్రీ ఏదో ఆశ్చర్యమూ, ఏమీ అర్థంకాని వైకల్యమూ మోమును ఆవరిస్తూ ఉండగా అడిగింది.

"రాయబారిని ఏ రాజూ రాజనీతి ప్రకారము బంధింపకూడదు. అలా బంధించినవాడు రాజుకాడు. వాడు నీతి బాహ్యుడు" అని వీరపురుషదత్తుడు తన గుప్పిలి ముడిచి పులమావి శిబిరంపై ఆడిస్తూ అన్నాడు.

శాంతిశ్రీ చటుక్కునలేచింది. ఆమె అన్నగారికి నమస్కరించింది. ఆమె మోమున చూడనలవికాని భయంకరరేఖలు తోచినవి. ఆమె అచ్చట ఉన్న ఖడ్గపు వరలోనుండి ఖడ్గము తీసినది. కవచము ధరించలేదు. శిబిర ద్వారము కడకుపోయి "గుఱ్ఱము" అని కేక వేసింది. అచ్చట కావలికాయు రక్షకదళ బాలికలలో ఒకర్తై పరుగునపోయి సూతుని శాంతిశ్రీ ఎక్కే అత్యుత్తమాజానేయాన్ని కొనివచ్చేటట్టు చేసింది. ఆమె గుఱ్ఱంమీదకు ఉరికింది.

"శాంతీ! ఇదేమిటమ్మా ! ఎక్కడికీ ప్రయాణం" అని కేకలు వేస్తూ వీరపురుషదత్తుడు బయటకు పరుగిడి వచ్చినాడు. శాంతిశ్రీ అన్నగారి మాటలు వినిపించుకొనలేదు. తన రక్షకభటురాండ్రుకు యువతీదళాలు ఒక నిమేషంలో సిద్ధం కావాలని ఆజ్ఞ ఇచ్చింది. యువతీ సైన్యాధికారిణియైన ప్రౌఢయోర్తు అచ్చటికి అచ్చటికి అశ్వారూఢయై వచ్చింది. శాంతిశ్రీ ఆజ్ఞ వినగానే ఆమె వీపున వ్రేలాడు శంఖం ఎడమచేత ధరించి "భోం భోం, భోంభో" ఊదింది. ఊదిన మరుసటిక్షణంలో వేయిమంది యువతులు అశ్వాలు అధిరోహించి సాయుధులై విచ్చేసిరి. శాంతిశ్రీ అన్నగారి వంక చూడలేదు. ఆమె ఆ సమయంలో దుర్నిరీక్ష ప్రతాపమూర్తియై విరాజిల్లినది. వీరపురుషదత్తుడే ఆమెను తేరిపారచూడలేకపోయినాడు. శాంతిశ్రీ తన సైన్యానికి ముందుకు సాగండి అన్నట్లుగా చేయి ఊపి, వేగంతో సాగిపోయింది. ఆమె వెనుకనే సాగిపోతోంది ఆమె సైన్యం.

వీరపురుషదత్తుడు ఏమీ అర్థము కాక తానూ తన సైన్యాలను సిద్ధము చేసి రెండుఘటికలు జరిగిపోయేసరికి సైన్యాన్ని కూర్చుకొని ముందుకురికినాడు. అతని సైన్యం ముందుకు సాగగానే సేనాధిపతి కొంపలు మునిగి పోవునను భయంతో తన యావత్తు సైన్యాన్ని సిద్ధంకండని ఆజ్ఞ ఇచ్చెను. శాంతిశ్రీ భయంకరమూర్తియై సింహవాహన అయిన ఆదిశక్తివలె ముందుకు మహావేగంతో పురోగమనంచేస్తూ హిమాలయపర్వతంనుంచి విరుచుకుపడిన గంగానదిలా విజృంభించింది. ఆమెను ఎవ్వరూ తేరిపార చూడలేరు. పులమావి ఆయుధోపేతలైన స్త్రీలు తమ మీదకు వస్తూ ఉండడం చూచి ఆశ్చర్యము చెందెను. ఆ వనితా సైన్యానికి శిరస్సై వస్తూన్న బాలికను చూచినాడు. విస్తుపోయి నిలిచినాడు.

## (10)

**శాం**తిశ్రీ పులమావిని గాంచి చిరునవ్వు నవ్వుకుంది. "ఓహో! మీరా నూత్నచక్రవర్తులు, రాయబారులను బందీచేసే ధర్మమూర్తులు!" అని నవ్వింది శాంతిశ్రీ. పులమావి కళ్ళు కోపంతో ఎఱ్ఱబారాయి. "ఎవరురా అక్కడ? ఈ తుచ్ఛరాలిని బందీచేసి మా దాసీజనంలో చేర్చు. ఈ పిచ్చి దానితో వచ్చిన ఈ దండును బంధించి సేనాపతులు పంచుకోవలసిందని మా ఆజ్ఞలందించు" అని దండతాడితభుజంగంలా రోజినాడు. "ప్రచండికా! ఈ దుడుకు మనుష్యుని బంధించు!" అని ఆమె ఆజ్ఞ ఇచ్చింది. ప్రచండిక ముందుకుపోయి, పులమావిని చేయిపట్టుకుని బరబర శాంతిశ్రీ రాకుమారికడకు లాగికొనివచ్చి ఒక్కవిదిలింపున క్రిందకు పడద్రోచినది. అక్కడఉన్న సేనాపతులు 'ఆః ఆః!' అంటూ తమ ప్రభువును రక్షించడానికి ముందుకురికారు. శాంతిశ్రీ చుట్టుఉన్న నాగనికా తారానికాది అంగరక్షక బాలలు కత్తులుతీసి మహావేగంతో సేనాపతులను తలపడినారు.

ఒక్కసారిగా శాంతిశ్రీ యువతీసైనికులు పులమావి శిబిరాలను చుట్టు ముట్టినారు. పది నిమేషాలలో పులమావి అతని అంగరక్షకులు సేనాపతులు పరివారజనము ఆ వీరాంగనులకు పట్టుబడిపోయినారు. శాంతిశ్రీ బంధితులను అంగరక్షక బాలలకు అప్పగించి తాను పులమావి సభాశిబిరంలో ప్రవేశించి అక్కడ సింహాసనముపై

అధివసించింది. పులమావివైపూ సేనాపతుల వైపు తీక్ష్ణంగా చూస్తూ "మాలో ఏఒక్కరికి గాయమైనా పులమావితల ఎగిరిపోతుంది. మాగురువు శ్రీశ్రీ బ్రహ్మదత్తప్రభువును మాకు అప్పగించండి. ఆ వెనుక నువ్వు శ్రీశాతవాహనచక్రవర్తికి నీయావత్తు ధనమూ అర్పించాలి. ప్రయాణానికి తగిన ధనంమాత్రం మేము ఇస్తాము. నీ సైన్యంతో వెంటనే బయలుదేరి నీదేశం పో!" అని సూర్యమండల మధ్యస్థ కాంతి పుంజమువలె ప్రకాశించి పోయినది.

అప్పుడా పరమాద్భుత దివ్యసుందరిని చూచి "ఈ బాలిక నాశించికాదా తానీ జైత్రయాత్ర ప్రారంభించింది" అని అనుకున్నాడు పులమావి. ఆతనికి భయమునకు బదులు నవ్వు వచ్చినది. ఈ బాల ఏమిచేయగలదు? తానీ బాలికను ముసికనగరానికి కొనిపోయి ప్రియురాలిని చేసుకొన్ననాడు తన జన్మ ధన్యమగునని పులమావి ఉప్పొంగినాడు. ఈమెకు కోపం వెన్నెలకు తావి అబ్బినట్లు విలసిల్లుతున్నది అని కన్నులరమూతలు వేసుకొన్నాడు.

ఇంతలో స్కంధావారమంతా ఒక్కసారి హోరుమని అలజడి బయలుదేరింది. అప్పుడు శాంతిశ్రీకుమారి అంగరక్షకురాలయిన తారానిక లోనికివచ్చి.

"జయము! జయము! భర్తృదారికా. యువరాజు వీరపురుషదత్తుల వారు లేళ్ళగుంపులో ప్రవేశించి సింహంలా సైన్యంతో ఈ పులమావి స్కంధావారంపైకి ఉరికినారు. స్కంధావారం అంతా చెల్లాచెదరై పోతున్నది. వేరొక దెసనుండి బ్రహ్మదత్తప్రభువు సైన్యాలు తలపడినవి. ఏమి ఆజ్ఞ?"

"ఆజ్ఞ ఏమి ఉన్నది? మనసైన్యాలను వెంటనే మనరథాలను యుద్ధ సన్నద్ధంచేసి, శంఖాలు ఊది, కేకలువేసి 'పులమావి బందీ అయ్యాడు. మీరు యుద్ధం ఆపండి. లేకపోతే పులమావి మృత్యువు తథ్యము' అని చాటించు!" అని శాంతిశ్రీ కత్తి తళతళవలె మాట్లాడింది.

## 11

**ఒ**క అరఘడియలో యుద్ధం ముగిసిపోయింది. బ్రహ్మదత్తుని పట్టినానని గర్వపడిన పులమావి తానే పట్టుబడిపోయినాడు. ఏ భటుడూ యుద్ధం చేయడానికి సాహసించలేదు. ఏ సేనాపతీ యుద్ధం సాగించండి అని ఆజ్ఞ ఇవ్వడానికి సాహసించలేదు. పులమావి సేనలో. అంతపెద్ద ఎత్తూ ఇంత సులభంగా ఈడ్చుకుపోయింది! ఏది ఎట్లా అయిందో ఎవరికీ స్పష్టంకాలేదు. ఒక్కబిందువైనా రక్తం ఎందుకు ప్రవహించలేదో ఎవరికీ అర్థంకాలేదు.

ఈ మాయంతా రాజకుమారి శాంతిశ్రీదన్నారు. శాంతిశ్రీ ప్రళయ యుద్ధం చేసిందన్నారు. యువరాజు వీరపురషదత్త ప్రభువుని యుద్ధచమత్కృతిలోని మహత్తిది అని అనేకులు నొక్కి చెప్పినారు. కొందరు అన్నా చెల్లెలూ ఈ విచిత్రవిధానము అల్లినారని అనుకొన్నారు. మరికొందరు బ్రహ్మదత్తప్రభువే ఈ ఎత్తంతా ఊహించింది. తన ఎత్తుప్రకారం తాను ముందు పట్టుబడి తర్వాత ఈ విధమైన నాటకం అంతా ఆడించాడని ఆనందంతో నవ్వుకొన్నారు.

పులమావి ధనం అంతా పట్టుబడింది. సైనికుల ఆయుధాలన్నీ సంగ్రహించి నాడు వీరపురుషదత్తుడు. పులమావి పొడిగుడ్లుపడి వంచినతల ఎత్తకుండా తన్నుబంధించిన

శిబిరం వదిలి రావటంలేదు. ఇంత దురదృష్ట సన్నివేశం ఏలా జరిగింది? ఏలా వచ్చింది తనకీ ప్రమత్తత? స్త్రీ అని ఆ బాలికను లోనికి రానివ్వలేదు; ఆమె తన శిబిరంలో బయలుదేరినప్పటినుంచీ పులమావికి గూఢచారులు ఎప్పటి వార్త అప్పటికే తెస్తూ ఉండిరి. ఆ బాలిక శాంతిశ్రీ! శాంతిశ్రీ జగదేకసుందరి, త్రిభువలనైకమోహిని, ఆ దివ్యసుందర మూర్తి శాంతమూర్తి. ఆమెకు లోకజ్ఞానంలేదు. ఆమె తనంతట తాను కోరి తన స్కంధావారానికి వస్తూఉంటే వంట యింటి కుందేలవుతున్నదని మురిసిపోయినాడు. ఆమె ఇష్టపడినా పడకపోయినా వివాహం జరగవలసిందే! ఇంతట్లో శాంతిశ్రీయే వచ్చివాలింది. ఆమెనూ ఆమె వెంటవచ్చే స్త్రీ పరిచారికామండలినీ స్కంధావార గోపురంలో నుండి రానియ్యవలసిందని స్కంధావారమహాపాలకునకు ఆజ్ఞ ఇచ్చి ఉన్నాడు. ఆ కారణంచేత శాంతిశ్రీ నిరభ్యంతరంగా లోనికి రాగలిగింది.

వీరపురుషదత్తుడు తన చెల్లెలిదళాలకు గోరుతదూరం వెనుకగా ఉన్నాడు. ఎప్పుడు తన చెల్లెలు లోనికి పోగలిగిందో, ఇందులో ఏదో అనుమానించవలసిన విషయం ఉందనుకొన్నాడు. వెంటనే తన సైన్యాన్ని రెండు పాయలుచేసి స్కంధావారం చుట్టు ముట్టాలనీ, ఘనరూపమయిన దళాలుగా ఒక ఘటిలో స్కంధావారాన్ని తాకవలసిందని ఆజ్ఞ ఇచ్చాడు. కొందరు చారులకు ఇక్ష్వాకు సైన్యాలను మహావేగంతోవచ్చి స్కంధావార గోపుర ద్వారానికి ఇరువైపులా తాకి తనవెనుక బలంచేయవలసిందని వార్త పంపినాడు.

శాంతిశ్రీ రాజకుమారి పులమావిని బంధించిందని విన్ననూ పులమావి సేనాపతులు నమ్మలేదు. కాని వీరపురుషదత్తుని సైన్యాలు మహావేగంతో తమ స్కంధావారం లోనికి చొచ్చుకు వచ్చినాయని తెలియగానే కింకర్తవ్యతామూఢులై పదిక్షణికాలు సందేహించారు. ఇంతలో వేగులు ఇక్ష్వాకులసైన్యం వచ్చి తమ స్కంధావారం చీల్చి లోనప్రవేశించిందని తెలుపగానే యుద్ధం విఫలమనీ వృథా సైనికనష్టం లెక్కకు మించిపోతుందనీ నిశ్చయానికివచ్చి యుద్ధం చేయవద్దు అని తమసైన్యాలకు ఆజ్ఞలు వేగంగా పంపించినారు.

బ్రహ్మదత్తప్రభువును ఒక ఆభీరసేనాపతి దర్శించి, “ప్రభూ! మీరిక మా బందీకారు. రాయబారిగా వచ్చిన వారిని బంధించకూడదని మేమెంత మనవి చేసినా సార్వభౌముడు....”

“సార్వభౌములా!” అని బ్రహ్మదత్తప్రభువు ఆశ్చర్యంతో ప్రశ్నించినాడు.

“శ్రీ పులమావి సార్వభౌములు ప్రభూ !” అని సేనాపతి బ్రహ్మదత్తునికి నమస్కరిస్తూ మనవి చేసినాడు.

“ఓహో! అవును ఏమి జరిగినదిప్పుడు?” అని బ్రహ్మదత్తుడు చిరునవ్వుతో ప్రశ్నించినాడు.

“ఏమి ఉన్నది మహారాజా! ఇక్షాకు శాంతిశ్రీ రాకుమారి తన స్త్రీ సైన్యంతో వచ్చి చక్రవర్తి శిబిరం ముట్టడించింది. ఇంతలో వీరపురుషదత్త యువరాజుగారూ, తక్కినయావత్తు ఇక్ష్వాకు సైన్యమూ వచ్చి మమ్ము కత్తి ఎత్తకుండా చేసినారు.”

“అలాగా!”

“చిత్తం.”

"సరే మనం వెళ్ళి శాంతిశ్రీ రాకుమారినీ, వీరపురుషదత్త ప్రభువునూ దర్శించగలంలెండి" అని చిరునవ్వుతో ప్రభువు లేచినాడు. మౌనమూర్తియై రెప్పవాల్చక శాంతిశ్రీ రాకుమారి పులమావివైపు తీక్ష్ణంగాచూస్తూ సింహాసనం అధివసించి ఉన్నది. పులమావి ఆమెవైపు రెప్పఎత్తి చూడలేక పోయినాడు. అతనికిలోన నిర్వచింపరాని భయం ఆవేశించింది. ఏమిటీ బాలిక? ఆమె పిచ్చిదా? పిచ్చివారు ఏమి చేసినా చేస్తారు అనుకున్నాడు పులమావి.

ఆమె దివ్యసౌందర్యం ఆ భయంకరమూర్తిమత్వంవల్ల ప్రళయతాండవోద్యోగియగు రుద్రుని తాళగతిలా ఉన్నది. ఎవ్వరినోటను మాటలేదు. అక్కడ ఉన్న రక్షకయువతులు ప్రాన్పడి నిలిచి ఉన్నారు. అందరికీ ఏదో భయం ఆవహించింది. తొందరగా ఇంతలో వీరపురుషదత్త ప్రభువులోన ప్రవేశించి "చెల్లీ !" అని పిలచి అర్థాంతంలో ఆగిపోయినాడు. ఆ యువకునకు ఒక్కసారి మంచుగడ్డలమధ్య పడినట్లు హృదయము జిమ్ముమన్నది. అతడు తెల్లబోయి అల్లానే నిలుచుండిపోయినాడు. మరుసటి నిమేషంలో బ్రహ్మదత్త ప్రభువు నెమ్మదిగా ఆ గుడారములోనికి ప్రవేశించి చిత్రించిన మహాచిత్రంలా ఉన్న ఆ దృశ్యము చూచినాడు. ఆయనకు ఒక నిమేషంలో ఏదో ఒక పరమాద్భుతము ప్రత్యక్షమైనట్లు తోచింది. చిరునవ్వు నవ్వుతూ ఆ ప్రభువు,

"వీరపురుషదత్త మహారాజా ! ఏమిటా అత్యంతాశ్చర్యకరమైన విషయం? శిష్యురాలా! రాజకుమారీ! ఏమిటి అలా క్రోధఘూర్ణిత అపరాజితాదేవిలా పీఠము అధివసించి ఉన్నావు?" అని ప్రశ్నించినాడు. బ్రహదత్తుని మాటలు చెవిసోకగానే శాంతిశ్రీ నిద్రలేచిన బాలికవలె దీర్ఘమైన నిట్టూర్పు పుచ్చి కన్నులు మూసికొన్నది. "శాంతిశ్రీ! శాంతిదేవీ!" అనే బ్రహ్మదత్తుని పలుకులు సామగానంలా ఉన్నాయి శాంతిశ్రీ కన్నులు అరమూతలుగా తెరిచి "గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" అంటూ పూర్ణవిస్ఫారితనేత్రాల ఆమె ఇటునటు చూచింది. "తారానికా! ఇదంతా ఏమిటే? ఎక్కడ ఉన్నామే?" అని అడుగుతూ ఇటునటు చూచి, కనుగొని, "గురుదేవా! మీరెక్కడనుండి వచ్చినారు?" అంటూ పీఠంమీదనుంచి లేచి వచ్చి గురుదేవుని పాదాలపై వాలిందా బాలిక.

★ ★ ★

## అష్టమ భాగం

# అస్తమయం

సూర్యదేవుడు ఎల్లబారి, వృద్ధుడై, నెమ్మదిగా అపరాంబోధిలోనికి జారిపోయినాడు. అతనివెంట అరుణకాంతులు చేరిచేరి ముద్దకట్టి పశ్చిమ సముద్రతరంగాలతో కలిసి క్రిందికి దిగిపోయినవి.

*"క్రుంకినది సూర్యకాంతీ*
*కోటివెలుగుల దివ్యకాంతీ*
*క్రుంకినది సూర్యకాంతీ*
*దినమంత వెలిగింది*
*జగమంత బ్రతికింది*
*నూత్న సృష్టులచేసి*
*నూత్న జీవుల నిచ్చి*
*క్రుంకినది సూర్యకాంతీ*
*కోటివెలుగుల దివ్యశాంతీ*
*తూర్పు పడమటి అలల*
*తోచినది ఒక వెలుగు*
*హిమనగ శ్వేతాగ్ర*
*మమృతబిందుల కురిసి*
*క్రుంకినది సూర్యకాంతీ కోటివెలుగుల దివ్యకాంతీ"*

క్రుంకినది సూర్యకాంతీ అన్నపాట దెసదెసలు ప్రసరించినది. పులమావి పట్టుబడ్డాడు. బందీగా ధాన్యకటకనగరానికి తీసుకువస్తున్నారు. కోల కొలది పణాల బంగారురాసులు చక్రవర్తి కోశాగారానికి వస్తున్నవి అన్న వార్త వినగానే చక్రవర్తి అతి సంతోషాన లేచి అతిత్వరితగమనాన అంతఃపురం వీడి సభాభవనానికి వస్తూ మధ్యమందిరంలో ఒక బౌద్ధధర్మకలశ శిల్పవిన్యాస స్తంభం ఎదుట హృదయస్పందన మాగిపోయి ఇంద్రహస్త వినిర్ముక్త వజ్రాఘాతంవల్ల కూలిన మహాపర్వతంలా కూలిపోయినాడు. సేవకులు, వందులు, పారిపార్శ్వకులు, అంగరక్షకులు హాహాకారాలతో శ్రీశ్రీ విజయ శాతవాహన చక్రవర్తి కడకు ఉరికినారు.

చక్రవర్తి నోటరక్తంనురుగులు వస్తున్నాయి. వైద్యుడు అని కేకవేసినాడొక కంచుకి. సేవకులు పరుగెత్తి ముందుమందిరంలోఉన్న రాజవైద్యుని కొనివచ్చారు. చక్రవర్తి ఈ లోకము వీడిపోయినాడు. దేహాన సమస్త నాడులు ఆగిపోయాయి. రాజవైద్యుడు అమృతాదులు ఉపయోగించినాడు. చక్రవర్తి చనిపోయినది నిశ్చయము. అంతఃపురాన హాహాకారాలు మిన్ను ముట్టినవి. ధాన్యకటకనగరం దుఃఖసముద్రంలో మునిగిపోయినది.

శ్రీముఖ శాతవాహన చక్రవర్తి సకల భారతవర్షానికీ చక్రవర్తి అయిన ఆంధ్ర మహారాజు. అప్పటికి అనేక శతాబ్దాల నాటినుంచీ ఆంధ్రదేశం యావత్తూ పాలిస్తున్న ఈ శాలివాహనమహారాజు వంశపరంపరలో విజయ శాతవాహన మహారాజు తనువు చాలించాడు. విజయం పొందిన్నీ భరింపలేక పోయినాడు మహారాజు.

పులమావిని బందీచేసి ధాన్యకటకానికి కొనివచ్చినారు వీరపురుషదత్తాదులు. శాంతిశ్రీ విజయపురం వెళ్ళిపోయింది. పులమావి సైన్యాలు చెల్లాచెదరై దళాలు దళాలుగా విడిపోయి వెనక్కు వెళ్ళిపోయినాయి. కొన్నిదళాలు ఇక్ష్వాకుసైన్యంలో చేరిపోయినాయి. విజయశాతవాహన చక్రవర్తి నిర్యాణమందినాడు అన్న వార్త చేరగానే ఇక్ష్వాకుశాంతిమూల మహారాజు దేవిరులతో కుమార్తెతో పరివారంతో ధాన్యకటకనగరం హుటాహుటి విచ్చేసినాడు.

విజయశాతవాహన మహారాజు తనయుడు చంద్రశ్రీ పితృయజ్ఞ మొనర్చి సింహాసనం అధివసించాడు. రాజ్యం కొద్దికాలమే ఉన్నా విజయశాతకర్ణి అంతా ఇక్ష్వాకు శాంతిమూలుని సహాయంవల్ల పోయిన సామంత రాజ్యాలన్నీ తిరిగి సముపార్జించు కొన్నాడు. చంద్రశ్రీయే చక్రవర్తి అని శాంతిమూలుడు సర్వరాష్ట్రాలలోనూ ధర్మాజ్ఞప్రచురం చేయించాడు. విజయశాతకర్ణికన్న చంద్రశ్రీ రాజ్యం మరింత క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవలసి ఉన్నది. చంద్రశ్రీ చుట్టూ ఎప్పుడూ శుష్క దేహసౌందర్యాల గాజుపూసలవలె వెలిగే వేయిమంది యువతులుంటారు. ఆంధ్రదేశాల ప్రసిద్ధివహించిన మందిరాలు స్వర్ణ రజత స్ఫటిక శిలాకలశాల ధళధళలాడుతూ ఆ మందిరాలన్నిటిలో ప్రత్యక్షమౌతూ ఉంటవి. రాజ్యపాలనా? అవసరంలేదు. ప్రజాపాలనా అవసరంలేదు. చక్రవర్తిత్వం రావడం తన భోగలాలసత్వానికి మెరుగుపట్టి నట్లవుతుందనే అతని ఉద్దేశం.

చంద్రశ్రీ మూర్తిలో బలంలేదు. అతని పురుషత్వం ఆడవారిని నగ్నంగా చూచి వారినగ్నతను స్పృశించి ఫలసిద్ధి పొందుతూ ఉంటుంది.

వాళ్ళతోపాటు తానూ నగ్నతలో నాట్యం చేస్తాడు. వినరాని ఊహించరాని విధానాల వాళ్ళ నగ్నత్వం దర్శిస్తాడు. మహత్తరమైన శాతవాహన వశాంభోధిలో జన్మించి పూర్ణచంద్రులైన మహారాజుల కాంతుల నీడంతా కూడి ఈ నీచ శాతవాహనునిలో మూర్తించింది అని ప్రజలు చెప్పుకొనేవారు.

## 2

**శాం**తిమూల మహారాజు ధనువుపైన నాలుగు అంశాల (ఆరడుగుల నాలుగంగుళాలు) పొడవుగల పురుషుడు. స్ఫురద్రూపి. సాహసంలో శార్దూలం, విక్రమంలో సింహం, వితరణలో గంగిగోవు. జ్ఞానమూర్తీ రాజ్యనీతి విశారదుడూ అయిన ఆ మహాసామంత వృషభుడు, తన ద్వితీయ భార్య మేనల్లుని సుస్థిరంగా సింహాసనారూఢుని చేయ నిశ్చయం చేసుకొన్నాడు. పూంగీప్రోలు ప్రభువొకనాడు శాంతిమూలుని దర్శనానికి వచ్చాడు, "బావగారూ! ఈ మహదాంధ్ర సామ్రాజ్యానికి శిరోభూషణంగా గాజుపూస ఉండాలని మీ ధృఢసంకల్పమా ?" అని గంభీరముద్రవహించి సగౌరవంగా ప్రశ్నించాడు.

"గాజుపూస అన్న నిశ్చయమేముంది బావగారూ?"

"రత్న పరీక్షకులు ఉన్నారు కారా?"

"ఎవరా పరీక్షకులు?"

"తామే!"

"నేనెప్పుడు పరీక్షించాను బావగారూ?"

"ఆ గులకరాయి పుట్టినప్పటినుంచీ తాము పరీక్షిస్తూనే ఉన్నారు."

"రత్నాలగనిలో గులకరాయి ఏలా పుడుతుంది?"

"నాకు కారణం తెలియదుకాని ఏలాగో పుట్టింది అన్న విషయం తథ్యం."

"గాజుపూసనే శిరోరత్నాన్ని చేయవలసిన ధర్మం ఆసన్నమైనప్పుడు, ఆ గాజుపూసనే మెరుగుపెట్టి వెనకాల తళుకుపెట్టి పొదగవలసి ఉన్నది."

"అది ధర్మం అని నిర్ణయించిన వారెవరు?"

"నా హృదయం!"

ఆ మాటలో శాంతిమూలుని మహోత్తమ పవిత్రహృదయమంతా పుంజీభవించి దుర్నిరీక్షకాంతితో ప్రజ్వలించింది. పూంగీయ స్కందశ్రీ మహారాజు మారుమాట అనలేక పోయినాడు. బావగారిని చూస్తున్న ఆయన కన్నులలో అకుంఠితభక్తి తాండవించింది. ఆయన బావగారికి తలవంచి నమస్కరించి వెళ్ళిపోయినాడు.

ఇందులో తనకు మాత్రం తర్కించవలసిన అవసరం ఏమీలేదు. స్వామి కార్య పరాయణత్వం సామంతుల ధర్మం అనుకొన్నాడు శాంతిమూలుడు. ఆంధ్రదేశాన్ని శాతవాహనులు తప్ప ఎవరు శాసించగలరు? విశ్వామిత్ర సంతతివారగు ఆంధ్రు లేనాడో ఇక్కడకువచ్చి రాజ్యం స్థాపించారనికదా పూర్వగ్రంథాలు చెప్పింది. నిశుంభాసురుని సంహరించిన ఆంధ్ర విష్ణువు శాతకర్ణులకు పూర్వీకుడు. ఈ దినాన కాకపోతే రేపయినా ఎవరో అటువంటి ఉత్తమ పురుషుడు, గౌతమీపుత్రశాతకర్ణివంటి మహాచక్రవర్తి ఉద్భవించి తీరుతాడీ వంశంలో అనుకొన్నాడు శాంతిమూలుడు.

శాంతిమూలుడు పీఠం అధివసించి ఉండిన్నీ ముందుకువంగి ఉపధానంపై మోచేయి ఆనించి, చేతిలో నుదురునుంచి వదినిమేషాలు ఏదో ఆలోచనల పాలయిపోయినాడు. తాను విజయపురం వెళ్ళడానికి వీలులేదు. ఒక్కలిప్త మాత్రం ఏమరుపాటయినా చంద్రశ్రీ ఏలాగో తనపుట్టి తానేముంచి వేసుకు తీరగలడు. ప్రమత్తత ఏ మాత్రమూ పనికిరాదని శాంతిమూలుడు నిశ్చయించుకొన్నాడు. తలఎత్తి నిట్టూర్పువిడిచి, మళ్ళీ సమభంగా కృతియై ఎవరో ఆ మందిర కవాటందగ్గిరకు వచ్చినట్లు గ్రహించి, "ఎవరక్కడ, ఆ వచ్చిన వారిని రానీ!" అని కేక వేసినాడు. లిప్తలో ఒక ప్రౌఢాంగన లోనికి అడుగిడింది. ఆమె పూంగీయ శాంతిశ్రీదేవి. పూంగీప్రోలు మహారాణి శాంతిమూలుని చెల్లెలు శాంతిశ్రీ! శాంతిమూల మహారాజు "ఏమమ్మా ఈలా వచ్చావు?" అని నవ్వుతూ ప్రశ్నించినాడు. "అన్నయ్యగారూ! నమస్కారం." ఆమె పాదాభివందన మాచరించింది. శాంతిమూల మహారాజు పెద్దచెల్లెల్ని ఆశీర్వదించాడు.

"అన్నయ్యగారూ! దేశం అరాజకం అవుతుందని నేను భయపడుతున్నాను."

"అదేమిటమ్మా! భయానికి కారణమేముంది?"

"అన్నయ్యగారూ! యజ్ఞశ్రీ శాతకర్ణి చక్రవర్తి నిర్యాణమందినప్పటినుంచీ దేశంలో శాంతి ఉందా? రాచరికం ఉందా?"

"రాక్షసుల పరిపాలనమంటావా ఇది!" అన్నాడు శాంతిమూలుడు.

"నీరసుడయిన పురుషుడు, రాక్షసునికన్న హీనం. రాక్షసుడు రాజ్యం చేస్తే రాజ్యం ఉంటుంది, ధర్మం ఉండకపోవచ్చుగాక. నీరసుడు రాజ్యం చేస్తే అరాజకమే, ప్రజా నాశనమేకాదా ప్రభూ?"

"అరాజకాన్ని మనం రానిస్తామా పూంగీయరాణీ" శాంతిమూలుని మాట గంభీరత తాల్చింది

"చక్రవర్తి ధర్మ మేమవుతుంది?"

శాంతిమూలుడు క్షణం మౌనం తాల్చి "చక్రవర్తి సేవకులు సామంతులు అందరిదీ అధర్మం" అంటున్న శాంతిమూలుని మోమున మందహాసోషస్సులు నర్తించినాయి.

## 3

బ్రహ్మదత్తుడనుకొన్నాడు: రాజకుమారి అంత శక్తిస్వరూపిణి అయినదేమి? ఎక్కడనుంచి వచ్చిందీమెకు ఈ విచిత్ర సాహసము? జన్మచే యోగినియు, జడీభూతయు అయిన ఈ పడుచు ఇలా రౌద్రమూర్తియై పులమావి మీద విరుచుకుపడి ఇక్ష్వాకు విజయానికి మూలకారణ మయిందది. దీనికంతకూ తానే నిజమైన హేతువనుకున్నాడు. ధర్మమార్గాన్ని ఎరుగనివారు అరుదుగా ఉంటారు. మానవజీవితం తమస్సునుండి వెలుతురుకు హింసనుండి అహింసకు వెళ్ళడానికి సర్వకాలాల ప్రయత్నంచేస్తూ ఉండాలి. ఏమరుపాటుతనం తామసిక పథాలకు తిరిగి నెట్టి వేస్తుంది. మనుష్యుని ఉత్తమసిద్ధి కోసము తామసిక పదముపనికిరాదు.

పులమావి ఏలాటి చక్రవర్తి? సార్వభౌమత్వం భూపతులను ఓడించి సామంతులుగా చేసుకోవడంలేదు. ఎవడయితే ధర్మం నాలుగు పాదాలా నడిపించగలడో వాడే చక్రవర్తి. దేహబలాన్నే నమ్మినవాడు భూపతికాడు, వాడు రాక్షసుడు. ప్రభువు సగం దేవుడు. పులమావి ధర్మం మూడుపాదాలయినా నడిపించగలిగిన రాజుకు విష్ణుత్వం వస్తుంది. పులమావి అయినది మొదలు చక్రవర్తి ధర్మాన్ని ఒక్క పాదమయినా నడపదలచుకోలేదు.

బ్రహ్మదత్తుడు చూస్తూ చూస్తూ ఏలా ధర్మచ్యుతి కానివ్వగలడు? రాయబారిగా వెళ్ళి పులమావి హృదయం మార్చి వెనుకకు మరలించాలని నిర్ణయించుకొన్నాడు. వలదని సేనానాయకులు పెక్కుమంది చెప్పినా బ్రహ్మదత్తుడు చిరునవ్వునవ్వి ఊరుకొన్నాడు. శుభముహూర్తము చూచి పులమావి శిబిరానికి బ్రహ్మదత్తుడు బయలుదేరినాడు. పులమావి ఆ ధనక ప్రభవుని గౌరవంగా ఎదుర్కొన తన మంత్రుల పంపి, లోనికిరా, ఆసనం చూపి, కుశలప్రశ్నచేసి 'వచ్చిన పని ఏమి' అని పృచ్ఛ చేసినాడు.

"మహారాజా! తాము శాతవాహనులయ్యూ చక్రవర్తిమీదకు దండెత్తి రావడం అనుచితము. కట్టెకొట్టటానికి ఉపయోగించే గొడ్డలిని రాజ్యనాశనానికి ఉపయోగిస్తారా? ఇందరు యుకులు, వీరులు, మీ కాంక్షలకు ఆహుతై పోవలసిందేనా?"

"జగత్కళ్యాణమే మేము కోరుతున్నాము. దీనిలో కొంత నష్టమున్న మాట నిజం. అంతా భగవంతుని ఇచ్ఛచొప్పునే జరుగుతుంది."

"ఇక్ష్వాకులబలం మహోన్నతము వారు ఎవ్వరికీ భయపడరు. అయినా ధర్మానికి కట్టుబడి ఉన్నారు వారు."

"అది ధర్మంకాదు. వట్టి నీరసత్వం! నీరసుడయిన సార్వభౌముని సింహాసనం ఎక్కించడంకన్న నీచధర్మం ఏముందీ?"

"యజ్ఞశ్రీ శాతకర్ణి కుమారుడు సింహాసనం ఎక్కడం తప్పా మహారాజా!"

"తప్పుగనుకనే మేము సార్వభౌమ సింహాసనం అధిష్ఠించాము విజయశాతకర్ణిని ఏమని సింహాసనం ఎక్కించినాడు శాంతిమూలమహారాజు? నీరసుని సింహాసనం ఎక్కించి తామే రాజ్యంచేయాలనీ, వీలయితే సార్వభౌముని తుదముట్టించి తామే చక్రవర్తి కావచ్చునని కాదూ?"

బ్రహ్మదత్తుడు చాలా బాధపడినాడు. ఎంత విషం ఉన్నది పులమావిలో! బ్రహ్మదత్తుని మోమున పరిహాసరేఖలు ప్రసరించినవి."పులమావి మహారాజా! ఇక్ష్వాకులు మిమ్ము చక్రవర్తిగా ఒప్పుకొనరు. మీరు విజయ శాతకర్ణి సార్వభౌమునిపైకి ఎత్తి వెళ్ళకుండా ఇక్కడే ఎదుర్కొన్నారు. శ్రీశాంతిమూల మహారాజు వీరవిక్రమమూర్తి యుద్ధంలో నేడు అయనను ఎదుర్కొనే మేటి భారతవర్షంలో ఎవ్వరూలేరు. కాని వారు ఉత్తమ ధర్మమూర్తులు. జననష్టానికి వారు ఎంతో బాధపడతారు. కాబట్టి చక్రవర్తిత్వం పరిత్యాగం చేసి మీరాష్ట్రానికి మీరు వెళ్ళిపొండి."

"ఏమిటీ!"

"మీరు కోపపడకండి. అహింస లోకంలో పరమధర్మము. ప్రతి మానవుడూ పరబ్రహ్మే! ఎవరి మోక్షము వారు పొందే అవకాశము ఎవ్వరూ అడ్డు పెట్టడానికి వీలులేదు. ఏమనుష్యుడూ ధర్మచ్యుతుడు కాకూడదు. ఒక మనుష్యుడు ధర్మచ్యుతుడు అవుతోంటే అలా కాకుండాచూసే ధర్మం పక్కనున్న మనుష్యులందరిపైనా ఉన్నది. ప్రభూ! నామాట వినండి. వెనక్కు వెళ్ళండి. లేకపోతే సముద్రతరంగం ఒడ్డున విరిగినట్టు మీ అదృష్టం ఈ పొలికలనులో విరిగిపోతుంది!"

బ్రహ్మదత్తునిమాట వినగానే పులమావి మండిపోయాడు. "బ్రహ్మదత్తప్రభూ! తమ్ము బందీచేసి ధర్మాన్ని ఇంకా నాశనం చేస్తున్నాను. ఏమవుతుందో చూడండి!" అంటూ "ఎవరక్కడ?' అని కేక వేసినాడు. "చిత్తం!" అంగరక్షక సేనాపతి అక్కడకు వచ్చినాడు. "బ్రహ్మదత్త ప్రభువును బందీ చేసినాము; వారికి విడిది ఏర్పాటుచేయమని నా ఆజ్ఞ సేనాపతికి చెప్పు.' ఇదంతా జ్ఞాపకం వచ్చింది, ధాన్యకటకనగరంలో బ్రహ్మదత్తుడు తన విలాసమందిరంలో ఒంటగా కూర్చుండి ఆలోచించుకొంటూ ఉన్న సమయంలో.

శాంతిశ్రీ ఎంత విచిత్రంగా సంచరించింది. ఆమె కీశక్తిరూపం ఎలా వచ్చింది! ఇందుకు కారణం గురుభక్తి మాత్రంకాదు. తనపై ఆమెకు పరమాద్భుతంగా ప్రేమ మొలకెత్తింది. ఆ రహస్యం ఆమెకే ఇంకా తెలియలేదు.

ఆకాశానికి అంటే పాలరాతికొండలు పగిలి అమృతసరస్సు వారలు కట్టి ప్రవహింపసాగింది. అందమై శుష్కమైన జీమూతాలు చల్లబడి మహావర్షం కురియ నారంభించింది. శాంతిశ్రీ హృదయాన్ని దివ్యదీపమై వెలిగించింది ఏదో పవిత్రానుభూతి. శాంతిమూల మహారాజు దీక్ష తీగెలు సాగింది. ఫలసిద్ధినందబోతున్నది. తన తపస్సు సిద్ధినందే శుభముహూర్తము ఏతెంచినది. శాతవాహన సామ్రాజ్య సూర్యుడు అస్తమించే భయంకర మూహూర్తము, స్కందవిశాఖుని హృదయసామ్రాజ్యంలో పూర్ణచంద్రులు ఉదయించే దివ్యమూహూర్త మాసన్న మవుతున్నదా?

ఆయన మోమున వెలుగునీడలు తారాడసాగినవి. ఆ ప్రభువు హృదయం ప్రేమతో నిండిపోయినదని ఆయనకే వ్యక్తమయింది. అమృత ప్రవాహం హృదయాన నిండడం ప్రారంభించింది. చిరువాకలు కట్టింది. పరవళ్ళెత్తుతున్నది. శాంతిశ్రీ తన పురుషార్థసిద్ధి. ఆ బాలిక జగదేక సుందరి. పరమాద్భుత చరిత్ర! ఆమె గడ్డకట్టిపోయిన అమృతము. నేడు తన అదృష్టంకొలదీ అమృతం తరిగి వరదలై వచ్చింది. కృష్ణవేణ్ణలా పొంగివచ్చింది. ఆకాశంలో వెన్నెలే వర్షాలు కురిసింది.

*"నీవు బధిరవాదేవి? ఈ నిర్మల ప్ర*
*శాంత వాసంతయామినీ సమయమందు*
*గాఢరాగరాగాలాప కంఠుడైన*
*నన్ను వినవు ? గాంధర్వప్రసన్నుడగుచు*
*కరిగి, చిరినరాల పులకరాల తేలు*
*అమృతకిరణుండు, పారవశ్యానకలగి*
*లాస్యయుతలైరి ఆశాచుభాస్యలు - చెలి!*
*ఏల కరుగదు నీయెద? ఇంచుకంత*
*కరగ దెచ్చటిదీ నిర్వికార జడత?*
*"ఏనాడు తపసు సలిపానో*
*నాదేవి*
*ఈనాడు నను చేరినావే!*
*ఇది ఒక్క స్వప్నమో*
*మదికోరు మోక్షమో*
*సర్వసిద్ధులు కూడి*
*సారూప్యమైతోచె*
*ఏనాడు....*
*సౌందర్య శిఖరితము*
*సఖియ నీ సుమమూర్తి*
*ఆనందమున కవధి*
*అతివ నీ మధుమూర్తి*
*ఏనాడు....*

*నీలోనచేరెనే*

*పాలసంద్రపు సుదులు*

*నిన్ను వెలిగించెనే*

*నింగి తారకలెల్ల*

*ఏనాడు....”*

బ్రహ్మదత్తుడు ఉప్పొంగిపోయాడు. వయసువాడు సన్యాసికావడం పతనానికి సులభమైన దారి అన్నారు. బ్రహ్మచర్యంనుంచి సన్యాసాని కెగిరే ముందు గార్హస్థ్యసౌధ మెక్కాలి. గృహస్థధర్మం లేకుంటే సృష్టి కొనసాగదు. కనుకనే సృష్టిధర్మం నెరవేర్చని మనుష్యుడు పున్నేమనరకంపాలగు నన్నారు. బౌద్ధమతం ఈ పవిత్రాశయాన్ని నాశనంచేసి, అందరు భిక్కులవాలనడంవల్లనే అనర్థహేతువై తానే నాశనమయింది.

ఇప్పుడుకదా శాంతిమూలమహారాజు తన్ను రాజకుమారికి గురువుగా నియోగించిన పరమార్థము గోచరించింది. శిష్యురాలు పుత్రిక అనే ధర్మం కొన్ని సందర్భాలలోనే వర్తిస్తుంది. ఉదయనప్రభువు దేశికుడై వసంత నేనను వరించిన ఉత్కృష్టచరిత్ర నెరిగియే మహారాజు తన్నీ గురుత్వమున నియోగించెను.

ప్రపంచంలో సౌందర్యానికి మనుష్యుడు ముగ్ధుడవుతాడు. అమృతత్వం కోరే మనుష్యునికి సౌందర్యోపాసనే సులభమార్గం.

*“లోకంలో వెన్నెల అంతా*

*ఏ కారణమో కానీ*

*నా హృదయంలో రాసికట్టె*

*నా జీవితమంతా వెలిగె*

*ఎవరో ఈ సుందరబాలిక*

*ఏలనో నన్ను వరించెను.*

*నా జన్మార్థము ఈనాడే*

*నా కవగతమై తోచిందీ!”*

అతడొక నిట్టూర్పు విడిచి ఇదంతా విరహమా, ఆనందమా అనుకున్నాడు. మనస్సు మనస్సు, అగ్నీ నీళ్ళులా ఎదుర్కొనువచ్చును. అమృతమూ సోమరసమూలా పరస్పరం లీనమైపోనూ వచ్చును. దేహాలు వేరు అన్నది ఈ విచిత్ర సాంగత్యానికి ఏమి అడ్డు?

*“వెన్నెలలు కాసేను*

*వీచె మలయానిలుడు*

*దివ్యామృతమ్మేదొ*

*నవ్యమై హృదినిండె*

*వెన్నెలల మర్మమ్ము*

*వీచు గాలుల మర్మ*

*మే విచిత్రార్థమ్మొ*

*ఈ జంటలో ఉంది.”*

శాంతిమూల మహారాజు విజయపురం కుమారునికి అప్పగించి తాను సకుటుంబంగా ధాన్యకటక మహాపట్టణం విచ్చేసి అక్కడ తన నగరు ప్రవేశించినారు. ధాన్యకటకం, ధనకటకం, వైభవకటకం, సర్వసంపద్రత్నఖని. ధాన్యకటకం రెండు యోజనాలపొడవు అర్ధయోజనం వెడల్పూగల పట్టణం. ధాన్యకటకం దక్షిణాపథానికి హృదయమే. ధాన్యకటకం చుట్టూ ఉన్న ప్రదేశాలలో పండని పంటలేదు. దొరకని ఖనిజం లేదు. రత్నంలేదు. ధాన్యకటకం విజయశాతవాహనునికి పూర్వం వేయిసంవత్సరాలనుండీ ప్రసిద్ధికెక్కినది.

సింధునది తీరవాసులైన అసురులు హిమాలయాది పర్వతాల లోయలలో నివసించే శుద్ధసత్త్వులైన ఆర్యులధాటికి నిలువలేక సముద్రయానాన పడమటితీరం వెంబడినే ప్రయాణమై నర్మద, తపతి, శబర్మతి నదీముఖాల, తీరాల వలస రాజ్యాలేర్పరచుకొంటూ, తృణజలకాష్ట సమృద్ధిగల తీరద్వీపాలలో నివాసాలు ఏర్పాటు చేసుకొంటూ, కన్యాకుమారి అగ్రందాటి తూర్పు తీరానకు కొందరూ సింహళద్వీపం కొందరూ పోయిరి. సింహళద్వీప నదీ తీరాలయందు, కావేరి, వేగై, వేణ్ణాది నదీముఖాలందూ, కృష్ణవేణ్ణా గోదావరీ మహానదీ ముఖాలలోనూ రాజ్యాలేర్పరుచుకొన్నారు.

ఆ అసురులు మహాశైవులు, వృషభేశ్వర సంప్రదాయంవారు. వారు శ్రీకాకుళము మొదలైన పట్టణాలు నిర్మించి ఉత్తమ నాగరికతను వృద్ధిచేసారు. సింధునదీతీరమున నివసించిన ఈ సుమేరులే హిమాలయానికి ఉత్తరంగా ఉన్న మహామేరు (పామేరు) పాదనదీ కంతాల ఉత్పన్నమైన ప్రథమ ఆర్యజాతివారు. అందుకనే వారికి పూర్వదేవతలు అని పేరు వచ్చింది. తదుపరి ఆర్యఋషులు రామాయణకాలంలో దక్షిణాపథానికి వచ్చి ఆశ్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదివరకే రాజ్యాలు స్థాపించు కొన్న అసురుల కది ఇష్టంలేకపోయింది.

దక్షిణాపథానికి అసురులుకాని ఆర్యులుకాని రాకపూర్వం అనాది జాతుల మనుష్యులు నరమాంసం, జంతువుల పచ్చిమాంసమూ తింటూ గుహల్లో, చెట్లలో, పొదల్లో నివాసంచేస్తూ ఉండేవారు. వాళ్ళల్లో పిశాచులు, పొలను దిండ్లు నక్తంచరులూ మొదలైనవారు వివిధజాతులవారు–తుట్ట పెదవులు, సొట్టముక్కులు, తారునల్లటి శరీరాలు, ఉంగరాలజుట్టు గలవారు – ఉండేవారు.

అసురులూ, ఆర్యులూ రాకపూర్వం తూర్పుసముద్ర ఉత్తర ఈశాన్య దిశలనుండి, సముద్రతీరం వెంబడి నడుస్తూనో, చిన్న చిన్న నావలమీద ప్రయాణం చేస్తూనో గంధర్వ, గరుడ, నాగ, యక్షాదులు – పసుపు, ఎరుపు రంగుల జాతులవారు – తండాలు తండాలుగా వచ్చి తూర్పుతీరం పొడుగునా, గంగా బ్రహ్మపుత్రా మహానదీతీరాలలోనూ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. గంధర్వుల ఆదిమనివాసం హిమాలయాల ఉత్తరాన. శాంతిమూలుని కాలంనాటికి అక్కడ ఉన్నవారి పేరు చీనావారు. అక్కడ గంధర్వనాగరికత బహుముఖమై ప్రశస్తి పొందింది.

భరతదేశానికి వలస వచ్చినవారిలో గంధర్వులు హిమాలయ పాదనదీ తీరాలలోను వంగదేశంలోనూ ఎక్కువమంది నివాసాలు రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. తూర్పు

హిమాలయాలలోని విద్యాధరులు, మధ్యహిమాలయాలలోని సిద్ధులు సాధ్యులుకూడ దక్షిణానికి వలస వచ్చినారు. వీరందరూ నాగరికత గలవారు. గరుడులు, కిన్నరులు, కింపురుషులు మధ్యరకం నాగరికత కలవారు.

నాగగరుడాది గంధర్వజాతులవారికీ రాక్షసాది నరమాంసాశన జాతివారికీ యుద్ధాలు జరిగినంతట దండకారణ్య మధ్యప్రదేశాలకు రాక్షసులను గంధర్వజాతులవారు తరిమివేశారు. ఈ నాగాదిజాతులకు గోండులు, నాగులు, వానరులు, కోదులు, శబరులు, చెంచులు, కోయలు, భిల్లులు, ధోంబీలు, సంతాలులు, వేప్చాలు, ఘూర్కులు, భూతాలు అనే పేర్లు అనేకం వచ్చాయి.

అసురులు బాగా నాగరికత కలవారు. వారు నదీముఖాల వలసలేర్పరచుకుంటోంటే, వారికీ ఈ గంధర్వజాతులవారికీ ఘోరయుద్ధాలు జరిగి అసురులు గంధర్వ జాతులను అడవులలోకి తరిమివేశారు. వారంతా శాంతిమూలుని కాలంనాటికి దండకాటవి సరిహద్దులలో నివసిస్తున్నారు.

అసురాంధ్రుల ముఖ్యపట్టణాలు శ్రీకాకుళం, పాదగయ, శంబరదీవి, మహాబలిపురం మొదలైనవి ఆర్యులు శ్రీకాకుళం పట్టుకొని ప్రతిపాలపురం మొదలైనవి జయించిరి. రానురాను ఆంధ్రవిష్ణువు వంశస్థులైన శాతవాహనులు అటు నాగులనూ, అడవులలోని
రానురాను ఆంధ్రవిష్ణువు వంశస్థులైన శాతవాహనులు అటు నాగులనూ, అడవులలోని
రాక్షసజాతులనూ, అసురజాతులనూ ఏకంచేసి ఆంధ్రసామ్రాజ్యం మహాభివృద్ధి కావించారు. అప్పుడే శ్రీకాకుళం నుంచి కృష్ణవేణ్ణకు ముప్పఅయిదు గోరుతాలు ఎగువకుపోయి అక్కడ ధాన్య కటకం నిర్మించారు. గోదావరి తీరంలో పశ్చిమాన అసురులు నిర్మించిన ప్రతిష్ఠానపురం పట్టుకొన్నారు. ముసికనగరం వైజయంతి మొదలైన ముప్పది మహానగరాలు నిర్మించారు.

శాంతిమూల మహారాజు ధాన్యకటకం ప్రవేశించి తాత్కాలిక నివాసం ఏర్పరచుకొన్న కారణం – మేనల్లుని చక్రవర్తిత్వం సురక్షితం చేయడానికీ. శాంతిమూలుని మహాభవనం కోటకి ఎగువను ఆర్ధగోరుతం దూరంలో ఉన్నది. చక్రవర్తి చంద్రశ్రీ మేనత్తభర్త శాంతిమూలుని బలవంతం వల్ల అప్పుడప్పుడు మహాసలికు వస్తూ ఉండినా, మధువుల మత్తువల్ల. సభలో ఏమి జరుగుతున్నదో ఆయనకు తెలియదు. సభాకార్యక్రమం నడిపించేదంతా మహామంత్రి.

శాంతిమూలుడు చంద్రశ్రీ సార్వభౌముని సన్మార్గంలోనికి దింపాలని ప్రయత్నం చేసెను. ఏమి లాభం లేకపోయింది. హీనమతులైన అంతఃపుర వనితలను శాంతిమూలుడు వెలుపలికి పంపించివేసెను. అంతఃపురవాసం వదిలించేందుకు – వేటకనీ, దేశం చూడడానికనీ, తీర్థాలలో క్రుంకులిడడానికనీ – చంద్రశ్రీని శాంతిమూలుడు దేశం నలుమూలలా త్రిప్పుతూ ఉండేవాడు. కాని చంద్రశ్రీ పురుషకారహీనుడై మరల ధాన్యకటకం చేరుతూ ఉండేవాడు.

శాంతిమూలుడు బ్రహ్మదత్తుని చంద్రశ్రీ చక్రవర్తికి గురువుగా నియమించి "ఏలాగయినా సార్వభౌముని మనుష్యునిగా చెయ్యాలి ధనకప్రభూ!" అని కోరినాడు.

"మొక్క చచ్చిపోయిన వెనుక అమృతం పోసినా తిరిగి బ్రతుకుతుందా మహాప్రభూ!" అన్నాడు బ్రహ్మదత్తుడు. "మీ దగ్గర అమృత సంజీవినీ విద్య ఉన్నది నాకు తెలుసును" అన్నాడు శాంతిమూలుడు గంభీరంగా.

## 4

ఆనాటినుంచీ బ్రహ్మదత్తప్రభువు చక్రవర్తికి గురువయ్యెను.

"మహాప్రభూ! ఈ విశ్వం అంతా పాలసముద్రం నిండి ఉంది."

"పాలసముద్రం ఏమిటయ్యా! మన చుట్టుపక్కల ఎక్కడ పాలు లేందే!"

"పాలసముద్రం అంటే పాలు కాదండి."

"పాలంటే నీరా లేకపోతే నూనా?"

"పాలసముద్రం అంటే వెలుగుసముద్రం అన్నమాట మహాప్రభూ!"

"పాలంటే వెలుగా! వెలుగంటే ఏమిటి? మరి రాత్రిళ్ళు వెలుగు లేదే?"

"తక్కువ వెలుగూ, ఎక్కువ వెలుగూ ఉంటవి. చీకటి అంటే తక్కువ వెలుగు. ఎక్కువ వెలుగు లేకపోవడం; చీకటి కణాలు ఒక్కటే. తక్కువశక్తిగలవి చీకటి కణాలు అవుతాయి."

"కణాలేమిటి? భోజనకణాలు అన్నమాట ఎరుగుదుము. అగ్నికణాలు ఎరుగుదుము. వెలుగుకణాలు ఏమిటయ్యా వెఱ్ఱివాడా?"

"చిత్తము. సృష్టిలో మన చూపు కెదురుగా ఉన్న వస్తువులన్నీ పాంచభౌతికాలు! అవి మనం చూపుతో, స్పర్శతో, రుచితో, వాసనతో, వినికిడితో తెలుసుకోకలిగినవి. అవి నిజంగా మన ఎదుట ఉండనక్కర లేదు."

"మన ఎదుట కాకపోతే మనవెనకాల ఉండవచ్చునన్నమాట! అదాభౌతికం ? అయితే మొన్న మేము లాక్కొచ్చిన అమ్మాయి భౌతికమే! ఊఁ. తర్వాత...."

"మహాప్రభూ! ఈ భౌతిక వస్తువుల్ని విభజించగా ఇంక భాగించ లేనంత భాగం వస్తే దాన్ని అణువంటారు."

"ఎవరంటారు?"

"మనుష్యులు."

"ఎవరు భాగిస్తారు?"

"మనుష్యులే!"

"అలా భాగించపోతే?"

"నిజంగా భాగించనక్కరలేదు. భాగించారనుకోవాలి ప్రభూ!"

"ఊరికే అనుకొంటే భాగాలయిపోతాయా ధనకరాజా?"

"అలా చేస్తే వాటిని అణువులంటాము."

ఈలా సాగింది చక్రవర్తిగారి చదువు. ఆ రాత్రి చంద్రశ్రీ శాతవాహన సార్వభౌముడు, తనప్రియురాలగు మాళవసుందరిని ఒళ్ళోకూర్చో పెట్టుకొని, ముద్దులిస్తూ తన విద్యా కృషినిగూర్చి మాటలు సాగించినారు.

"బ్రహ్మదత్త ప్రభువు ఏమిటో చెబుతాడు. అణువంటే ఎవరి క్కావాలి. కణమంటే ఎవరిక్కావాలి? ఏమంటావు అందాలదానా?"

"నిజమే మనోహరా! అయితే బ్రహ్మదత్తప్రభువు చాలా తెలివయినవాడా?"

"బాగా చదువుకున్న వారంటారు. ఏం లాభం? ప్రేమ అంటే ఏమిటో తెలియని వాడూ; మధుపానం రుచి ఎరుగనివాడూ, చదువుకున్నా చదువుకోనివాడే!"

"బాగా చెప్పినారు సుందరాకారులైన మీరు,"

"నేను నిజంగా సుందరుణ్ణేనా రతీదేవీ?"

"మీరు నా మన్మథులు."

"ఏదీ ఒక.. ...."

"ఒకటికాదు పది."

"నేను మన్మథుణ్ణంత అందంగా ఉంటానా?"

"కాదన్న వారి మొగం మీద పసుపునీళ్ళు చల్లనా? అయితే ప్రాణేశ్వరా! బ్రహ్మదత్తుడు అందమైనవాడంటారు."

"ఎవరంటారు?"

"అంతఃపురంలోని స్త్రీలంతానూ."

"ఏమిటీ! ఆ దుర్మార్గుడు నా అంతఃపురానికి వచ్చాడా? త్వరగా చెప్పు."

"అదేమిటి దివ్యసుందరాకారులైన చక్రవర్తీ! అంతఃపుర స్త్రీలంటే దాసీజనం. వాళ్ళుతప్ప బ్రహ్మదత్తుణ్ణి చూచే వాళ్ళెవరుంటారు?"

"అయితే దాసీలకుమాత్రం బ్రహ్మదత్తుని మాట రావలసిన అవసరం ఏమి వచ్చిందీ?"

"ఏదో మాటమీద మాట వచ్చి శాంతిమూల మహారాజు కొమార్తె శాంతిశ్రీ దేవిని గురించి సంభాషణ వచ్చింది. ఆ బాలికకూ బ్రహ్మదత్త ప్రభువేకదా గురువులు?"

"ఏమిటీ! మాకు తెలియదే! శాంతిశ్రీ సౌందర్యం ఈ లోకాల్లో ఇంకోచోట లేదట!"

"అవునులెండి ప్రభూ! ప్రపంచంలో అందరూ మీకు సౌందర్యవతులే."

"అంటే నా ఉద్దేశం ఎంత శాంతిశ్రీఅయినా నీముందు తీసికట్టు అనే."

"ఈ బ్రహ్మదత్త ప్రభువు శాంతిశ్రీని, శాంతిశ్రీ ఈ ప్రభువును ఒకరినొకరు ప్రేమించుకొంటున్నారట!"

"ఏమిటీ? చక్రవర్తి గర్జించినంత పని చేశాడు. ఆ మాళవిక చటుక్కున మూతి ఆడిస్తూ ఘల్ ఘల్ మని చక్రవర్తి ఒడిలోనుంచి లేచింది.

మాళవిక ఉజ్జయినీపురంలో ఉన్న ఒక క్షుద్ర క్షత్రియ స్త్రీ కొమరిత. ఆ బాలిక అందం ఆనాడు ఆర్యావర్తంలో ఎక్కడా లేదని ప్రతీతి. ఆమెను వరిస్తూ వేలకు వేలు మహారాజులు, సామంతులు, సేనాపతులు మొదలగు వారు వచ్చారు. చంద్రశ్రీ చక్రవర్తిని కాగానే ధాన్యకటక నివాసియైన ఒక వర్తకుడు చక్రవర్తి మెప్పించి వేంగీనగరంలో ఉన్న ఒక స్వర్ణగిరిని స్వర్ణం తవ్వడానికి గుత్తకు పుచ్చుకొనదానికి నిశ్చయించుకొన్నాడు.

మాళవికను మహారాజులు, సామంతులు ఉంపుడుకత్తెగా, ఏ ఖడ్గ వివాహానికో కోరినారు. కాని ఆంధ్రవర్తకుడు సముద్రశ్రీ కోటి పణాలిచ్చి ఆ బాలికను కొనివచ్చి చక్రవర్తికి రెండవభార్యగా పెండ్లి చేసినాడు. మాళవిక అందం నడివేసవికాలంనాటి మల్లెపువ్వుల అందం. మేఘాలలో మెరుపు అందం. సముద్రగర్భంలో పగడాల అందం. ఆ బాలిక వచ్చినప్పటి నుంచీ ఆరునెలలపాటు చంద్రశ్రీ తక్కిన అన్ని విషయాలూ మరచిపోయినాడు. మాళవిక అందాన్ని చక్రవర్తి అనేక విధాలుగా వర్ణించాడు.

*"మల్లె పువ్వులప్రోవు మందారములప్రోవు*
*మావి ఫలముల రసము పైడి గిన్నెలపోత*
*మాళవిక నారాణి మాదేశ సామ్రాజ్ఞి*
*మాళవిక నాదేవి భువనైక సుందరీ!"*

అని చంద్రశ్రీ చక్రవర్తి పాడినాడు.

ఆ బాలిక ఉప్పొంగిపోయి చక్రవర్తి ఒళ్ళోవాలి "నేను సామ్రాజ్ఞినా?" అని దీనంగా అడిగింది.

"అవును నువ్వు సామ్రాజ్ఞివి. రేపు చక్రవర్తి సింహాసనం అధివసించేటప్పుడు నువ్వు పట్టమహిషిగా కాకపోయినా రెండవరాణిగా నా సింహాసనం మీద కూర్చుండ వలసిందే! లేకపోతే నేను సింహాసనం ఎక్కనే ఎక్కను."

మాళవిక చక్రవర్తి ఒడిలో ఒదిగిపోయింది. ఇంతలో ఆ బాలిక లేచి దాపున బంగారుపళ్ళెంలో ఉన్న చేమంతిపూలు దోయిలించి,

*"జయము జయము చక్రవర్తి*
*జయము ఆంధ్రసామ్రాట్టుకు*
*జయము జయము వీరమూర్తి*
*జయము దేవ జయము జయము"*

అని పాడుతూ ఆ పూవు లా ఆంధ్రసార్వభౌమునిపై చల్లింది.

## 5

బ్రహ్మదత్తప్రభువు ఉదయం తన నగరిలో స్నానసంధ్యానుష్ఠానాలు తీర్చి భగవద్గీత శిష్యులకు బోధించే సమయంలో, ఇక్ష్వాకు శాంతిశ్రీరాకుమారి అక్కడకు విచ్చేసి, ఆ మందిరంలో ఒక యవనికాభ్యంతరాన అధివసించి దేశికుడుపదేశించు పాఠం వింటూ కూర్చుంది.

బ్రహ్మదత్తు దావిషయం గ్రహించనేలేదు. విద్యార్థులకు కర్మయోగ ముపదేశిస్తూ "మనుష్యుడు తానే పరమేశ్వరుడు అన్న విషయం గ్రహించాలి. గ్రహించడం అంటే ఆ మాటల అర్థం తెలుసుకోవడం కాదు, చేతలలో, నిద్రలో, మెలకువలో ఆ అనుభవంతో సంచరించినప్పుడే అహం బ్రహ్మజ్ఞానం కలిగిందన్నమాట. ఫలాపేక్షారహితమైన ఆ ధర్మపూర్ణ సంచరణే కర్మయోగం."

"గురుదేవా! ధర్మనిర్ణయం ఎట్లా?" అని యవనికాభ్యంతరం నుండి మధురమైన వాక్కులతో ఒకప్రశ్న వినబడింది. శిష్యులందరూ చకితులయి ఆ తెరవైపు చూచారు. బ్రహ్మదత్తుడు చిరునవ్వు నవ్వుతూ ముఖం వికసించి కాంతులీనగా "రాకుమారీ! నీ ప్రశ్న ఉత్తమమయినది" అని ప్రతివచనమిచ్చి శిష్యులవైపు తిరిగి "ఏమయ్యా! ఒక నూతన స్వరం వినేసరికి మీరంతా ఆశ్చర్యంతో చూసినారు. అది మీ కర్మయోగంలో లోటు తెలియజేస్తుంది" అని రాకుమారివైపు తిరిగి....

"ధర్మం అంతే స్వధర్మం. పరధర్మం భయావహమయినది. స్వభావ విలసితమైన స్వధర్మం నిర్ణయించేది తాను. దేశకాల పాత్రముల కనుగుణంగా ధర్మాన్ని మలచికొని, నిష్కామంగా ధర్మాచరణం చేయాలి" అని తెలిపినాడు.

"సత్యమనగా ఏది ప్రభూ!"

"సత్యం ఏది అని నిర్ణయించే ముందు, సత్యం అనేది ఏలా మనుష్యులలో ప్రతిఫలించిందో, ఆ ప్రతిఫలం ఏ కార్యరూపంగా పరిణమించిందో గ్రహించి ఆ విధంగా కర్మ ఆచరించవలసి ఉన్నది."

"ఆ కర్మలు ఏవి గురువుగారూ?"

బ్రహ్మదత్తప్రభువు చిరునవ్వుతో "రాజకుమారీ! అహింసావ్రతము సత్యకర్మ. మాటలలో అసత్యము చెప్పకుండుట, మానవసేవ సత్యకర్మ!"

"ప్రభూ! యుద్ధము అహింస అవుతుందా ?"

"కాదు."

"కాకపోతే అర్జునునికి శ్రీకృష్ణభగవానుడు యుద్ధం చేయవలసింది అని ఏలా బోధించారు?"

"చక్కని ప్రశ్న రాకుమారీ! యుద్ధము అహింసకాదు. హింస కాబట్టి అది అసత్యం. కాని ఎవరయితే స్థితప్రజ్ఞుడయి తాను యుద్ధం చేయడం సంపూర్ణంగా స్వధర్మ నిర్వహణం అని యెంచి చేస్తాడో ఆనాడతను అహింసావ్రతం ఆచరిస్తున్నాడన్నమాటే!"

"స్థితప్రజ్ఞత్వం ఏలాగు, అది ఏమిటి?"

"స్థితప్రజ్ఞునికి అరిషడ్వర్గములు నాశనమయి పోవాలి. దేహము వేరు, తాను వేరు అన్న సంపూర్ణజ్ఞానం రావాలి."

"అంటే భగవంతుడూ తానూ ఒకటే అని తెలిసినవాడన్న మాట?"

"అవునమ్మా. అంటే యుద్ధం అహింసాబుద్ధిచే ఆవరించేవాడు స్థితప్రజ్ఞుడు. శ్రీకృష్ణభగవానులు తదితరులకు యుద్ధం నిషిద్ధమన్నారు. స్వధర్మ నిర్వహణార్థంకాని హింసాస్వరూపమయిన యుద్ధం మనుష్యుని పతితుణ్ణి చేస్తుంది. ఆహారనిద్రాదులలో మనుష్యుడు పశుసమానుడు.... ఆహారనిద్ర భయములలో భయమే యుద్ధస్వరూపము పొందుతుంది" అని బ్రహ్మదత్తుడు కన్నులరమూసినాడు. శాంతిశ్రీ ప్రశ్నకు అతడు పొందిన సంతోషం శారదా పూర్ణిమలా విరిసిపోయినది.

"రాజకుమారీ! శ్రీకృష్ణభగవానుని గీతోపదేశమందలి అహింసా పరమార్థం బుద్ధభగవానుడు బాగా అర్థం చేసుకొన్నాడు కాని ప్రతి మనుష్యుడూ ప్రతిస్త్రీ సన్యాసం పుచ్చుకోవాలనడమే ఆ తథాగతుడు చేసిన తప్పు."

"తథాగతుడే తప్పుచేయునా గురుదేవా?"

"తప్పు అంటే సర్వకాలాలకు సమన్వయించని విధానమని నా ఉద్దేశం."

"సంసారంలో ఉండి నిర్వాణం ఏలా పొందగలరు?"

"సంసారంలో లేకపోయినా, మారజయం పొందనివారు నిర్వాణం ఎలా పొందగలరు?"

"మారవిజయం అందరికీ సాధ్యం కాదంటారు."

"అవును. జంతుధర్మాలు ఆహారనిద్రాభయాదులు. ఆహారం బ్రతకటానికి, నిద్ర శ్రమ తీర్చుకోడానికి, భయం జాతినీ వ్యక్తినీ రక్షించడానికీ, నాల్గవది జాతిని వృద్ధి చేయడానికి. ఈ జంతుధర్మాలు ఎవ్వరూ మానలేరు. ఏదో ఉగ్రమైన తపస్సుచేసేవారే మానగలుగుతారు. నిష్కామకర్మ అంటే ఈ నాలుగు ధర్మాలు నిష్కామంగా ఆచరించగలగడమే."

"ఈ జంతుధర్మాలు నెరవేరుస్తూ వాని ఫలం ఎలా వదులుకోగలడు మానవుడు?"

"ఆత్మజ్ఞానం సంపాదించుకొని కర్మఫలాన్ని దహించుతూ మనుష్యుడు జీవితమార్గం నడవాలి."

"ఆకలివేస్తే అన్నం తింటాడు."

"అవును."

"అన్నం తినగానే తృప్తి పొందుతాడు."

"అవును."

"ఆ తృప్తి మనస్సుకు. ఆ మనస్సుకే లోబడినవాడు ఇది నాకు కాదు అని ఏలా అనుకోగలడు గురుదేవా?"

"ఈ మనస్సు, దేహం నేను కాను అనే విచారణవల్ల."

ఆమె మౌనం వహించింది. ఆమె తెర ఈవలకు వచ్చి తనదేశికునకు పాదాభివందన మాచరించి వెడలిపోయినది. శిష్యులందరూ లేచి వెళ్ళిపోయినారు.

బ్రహ్మదత్తుడు చిరునవ్వు నవ్వుకొంటూ.... విచిత్రమే! ఇంత బోధిస్తూ ప్రతిక్షణము ఈ బాలికను తాను ప్రేమించడంలేదా? ఆమె దేహాన్ని, మనస్సును, హృదయాన్ని, జ్ఞానాన్ని, ఆమె అహంకారాన్ని, ఆత్మను సర్వస్వమూ తాను ప్రేమిస్తున్నాడు. ఇంకోవంక తత్త్వజ్ఞానాన్ని బోధిస్తున్నాడు. జ్ఞాన నిశితత్వంవల్ల మేధకు తార్కికంగా ప్రతివిషయమూ గోచరిస్తోంది. కాని అసలు సత్యమేదో, తనకు అనుభవానికి వచ్చిందో, లేదో అతనికి తెలియదు. ఆ దారివెంట తన ఆత్మేశ్వరి అయిన ఈ బాలిక తన్ను నడిపించుకొని పోగలదా?

## 6

**శాం**తిశ్రీ వెళ్ళిపోయింది. కాని ఆమె సర్వస్వమూ బ్రహ్మదత్తుని పాదాల కడనె ఉంచిపోయినది.

*"ఒక మొయిలు వాలింది*
*ఉత్తుంగ నగముపై*

ఒకని పాదము మ్రోల

ఱ్ఱాలి తన్నర్పించి

ఒక నికుంజము పూలు

సర్వమ్ము వర్షించె

లలిత చంద్రోపలము

నిలువునా కరిగింది

పూర్ణచంద్రుని వెలుగు

పూతమై ప్రసరింప"

ఆ బాలిక ఈ పాట పాడుకొంటూ తాను రచించే చిత్రఫలకస్తమూర్తికి ఎదురుగా నిలుచుండి పోయినది. అప్పుడామె రూపుతాల్చిన సౌందర్య సర్వస్వం అంత అందాలు కూరిచికొన్న ఆమె తనూరేఖలు ఇదివరకు ఆ అందాలకు మధురత్వ మీయలేకపోయినాయి.

"నే నెవరినో తెలియదాయె

ఓ గురూ!

నీ వెవ్వరో ఎరుగనైతి

ఎన్నేళ్ళుగా నిద్ర

నిన్ను తెలియగలేక

ఈ బ్రతుకు గడిపానొ

నేనెవరినో తెలియదాయె

ఓ గురూ!

నీవెవ్వరో ఎరుగనయ్యా!

కటిక చీకటిగాగ

కలలేని రాత్రయ్యె

ఈనాటికేగదా

ఇందుబింబముతోచె

నే నెవరినో తెలియదయ్యా

ఓ గురూ!

నీ వెవరవో ఎరుగనయ్యా!

పరిమళమ్మే లేని

పసరు మొగ్గను నేను

నీదు కిరణస్పర్శ

నిలువుగా వికసిస్తి

నేనెవరినో తెలియదయ్యా

ఓ గురూ!

*నీవెవరవో ఎరుగనయ్యా!*
*నితము తెలియని నాకు*
*మతికలదంతేగాని*
*ఓ ప్రభూ నీ చేయి*
*నా బ్రతుకు నడదివ్వె*
*నే నెవరినో తెలియదయ్యా*
*ఓ గురూ!*
*నీ వెవరవో ఎరుగనయ్యా!*

చిన్ననాటినుంచీ శాంతిశ్రీకి సర్వవిద్యలూ ప్రతిభాయుక్తంగా వచ్చేవి. కాని లలితకళలలో సృష్టి ఆమె ఎరగదు. గురువు ఒక చిత్రము చూపి ఈ విధమైన చిత్రము లిఖించు అంటే అయిదు క్షణికాలలో ఆమె ఆ చిత్రం పూర్తిచేసి చూపించేది. ఈ విషయాన్ని గూర్చి ఒక పాట ఈ రీతిగా వ్రాయి అంటే ఆ బాలిక రెండు క్షణికాలలో రచించేది. ఆ పాటలో జీవములేకపోయి గురువు చెప్పిన భావాలన్నీ అందమైన భాషలో గీతికా రూపంలో కూర్చబడి ఉండేది. ఈ రాగిణీ, ఈ రాగము, ఈ తాళము, ఈ మూర్ఛన, ఈ గ్రామము, వీనితో ఈ రాగంలో, ఈ తాళంతో, ఈ విధంగా పాడాలి అని చూపిస్తే ఆమె అదే విధంగా చేయగలిగేది. చిన్న బిడ్డలచే రామాయణము బుద్ధచరిత్ర కంఠోపాఠము చేయిస్తారు. వాని అర్థము బిడ్డలకేమి తెలుసును? కాని వారు పెద్దవారై రసజ్ఞులు అయిననాడు వాని అందాలు తెలిసికొన్నట్టులు ఇక్ష్వాకు శాంతిశ్రీ ఈ మధ్యనే తాను ప్రజ్ఞతో నేర్చుకున్న సర్వలలితకళలలో ఉండిన దివ్యత్వాన్ని అర్థం చేసుకోగలిగింది. ఆనాటి నుంచీ ఆమె రచించే గీతికలు, విన్యసించే చిత్రాలు పరమసౌందర్య వికసితాలై ప్రజ్వలించిపోతున్నవి.

ఒక పురుషుని సన్నిధిని ఒక స్త్రీ సర్వకాలము నివసింపగోరడం ప్రేమ అని ఆ బాలిక అర్థంచేసుకొన్నది. తాను బ్రహ్మదత్తుని సాన్నిధ్యము సర్వకాలాల వాంఛిస్తున్నది. ఓహో! తానీనాటికికదా ఇంత ఉత్కృష్టానుభవ నిధిని పొందగలిగింది అని ఆమె ఉప్పొంగిపోయింది.

"తారానికా!" ఆమె పిలుపు తెలతెలవారే పులుగు కువకువ అయినది. వెంటనే తారానిక ఆ రాజకుమారికడకు పరుగిడి వచ్చింది. "తారానికా! నీకు ప్రేమ అంటే ఏమో తెలుసును కాదూ?" రాజకుమారి అడిగిన ప్రశ్నకు తారానిక సిగ్గుపడి మోము కెంపువార తలవంచేసింది. రాజకుమారి మోములో నిశ్చలతతో రంగరించిన ఏదో ఒక ఆవేదన ఉన్నది. "తలవంచుకొంటావు, వాత్స్యాయన మత ప్రకారం అది త్రప అంటారుకాదూ! తారానిక ఇంకా ఆశ్చర్యంపడి పోయినది. ఏమిటీ భర్తృదారికమాటలు!

## 7

**పు**లమావికి సార్వభౌమత్వము పోయింది. బందీగా ఒక పెద్దభవనంలో బోనులోని సింహంలా తిరుగుతున్నాడు. ఆ భవనంచుట్టూ, యమునికైనా వెఱవని కఱకువీరులు

కాపలాకాస్తున్నారు. కాని పులమావి నిస్పృహ చెందలేదు. శాంతిమూలుని హృదయమూ, చక్రవర్తి చంద్రశ్రీ శాతవాహనుని నికృష్టతా అన్నీ పూర్తిగా పులమావికి తెలుసును. పులమావి చూట్టాలైన ప్రభువులు చాలా మంది ధాన్యకటకంలో ఉన్నారు. పైగా ముసిక నగరంనుంచి అనేకమంది అపసర్పులు మారువేషాలతో నిండిపోయారు. ఏలా వచ్చిందో పులమావికి ఆ బంధనలోనుంచి పారిపోయే విధానం! అయిదు దినాలలో సొరంగం ఒకటి మారుమూల మందిరాలలో నుంచి బంధనాగారానికి చొచ్చుకువచ్చింది. ఆరవదినాన ఉదయమే ఇక్ష్వాకు చారులకు ఆ మహామందిరంలో పులమావి కనబడలేదు.

పులమావి మాయమైనాడన్న సంగతి శాంతిమూల మహారాజుకు చారులు పరుగెత్తుకుని వెళ్ళి నివేదించుకున్నారు. ఇక్ష్వాకుల అపసర్ప నాయకుడు విచారణ చేసి పులమావి రాత్రికి రాత్రే సొరంగము దారిని మాయమై పోయాడనీ, పులమావి బందుగులూ, అపసర్పులూ ఈ ఏర్పాటంతా కావించారనీ మనవి చేసుకున్నాడు. శాంతిమూల మహారాజు ఒక చిరునవు మాత్రం నవ్వి ఊరకున్నారు. అపసర్ప నాయకుని విషాదమంతా మాయమై ఆశ్చర్యము అతనిని ముంచివేసింది.

"ఓయి రాహులశ్రీ! చంద్రశ్రీ చక్రవర్తి విరోధులు దేశమంతటా ఉద్భవించారు. ఆలాంటప్పుడు పులమావి పారిపోవడంలో ఆశ్చర్యమే ముంది? మనం అతనిని బందీగానూ ఉంచలేము, ఇంకోవిధంగా శిక్షించడానికీ వీల్లేదు. పారిపోయి మళ్ళీ సేనలను సమకూర్చుకుంటాడు. యుద్ధం కాకతప్పదు, అందులో అతడు నాశనం కాక తప్పదు. మీ చారుల్ని ముసికనగరం పంపించి పులమావి కార్యక్రమం యావత్తూ మా కెప్పటికప్పుడు తెల్యచేస్తూ ఉండవలసింది అది ఒకటి. రెండవది - ఈ ఊళ్ళో పులమావి పక్షం వాళ్ళెవరున్నారో వారి జాడ యావత్తూ గ్రహిస్తూ మా కెప్పటివార్తలప్పుడు అందజేస్తూ ఉండండి. ఇవి వెంటనే జరగవలసిన పనులు." శాంతిమూలుని ఆజ్ఞ శిరసావహించి నమస్కరించి రాహులశ్రీ అపసర్పనాయకుడు పని విన్నాడు. శాంతిమూలుడు తన రెండవరాణి, చక్రవర్తి మేనత్త కుసుమలతాదేవికడకు వెళ్ళినాడు.

కుసుమలతాదేవికి ఇప్పుడు ముప్పది సంవత్సరాలుంటాయి. అందంలో కుసుమలతే! రాణులందరితో తలలో నాలుకలా ఉండి శాంతిమూలునికి తగిన రాణి అనిపించుకున్నది. యజ్ఞశ్రీ శాతకర్ణి చక్రవర్తి తెలివితేటలన్నీ పుత్రునికి రాక కొమరిత అయిన కుసుమలతకు అబ్బినవంటారు. భర్తకు నిజమైన మంత్రి ఈ దేవేరి. చక్రవర్తి కొమరితనని గర్వంలేక ఆమె పట్టపురాణి మాఠరిగోత్రజ అయిన సారసికాదేవిని భక్తితో పూజిస్తూ ఉంటుంది. సారసికాదేవికన్న కుసుమలతాదేవే రాజకుమారి శాంతిశ్రీని పెంచింది. ఒకసారి గర్భంపోయి సారసికాదేవికి ప్రాణంమీదకు వచ్చినంత జబ్బు చేసినప్పుడు కుసుమలతాదేవి స్వయంగా పెంచిన పాలదాదికన్న ఎక్కువ ప్రేమతో సవతికి పరిచర్య చేసింది. కుసుమలతాదేవి పరిచర్యే సారసికాదేవి ప్రాణం రక్షించింది.

పట్టపురాణి కుసుమలతాదేవిని కన్న చెల్లెకన్న అధికంగా ప్రేమిస్తుంది. ఆడబిడ్డలయిన వాసిష్టి శాంతిశ్రీదేవి వాసిష్టి హమ్మశ్రీదేవులు పెద్దవదిన గారంటే భక్తిగా, ప్రేమగా ఉంటారు. చిన్నవదినగారంటే ఆపేక్ష, స్నేహమూ, ప్రేమా మూడూ రంగరిస్తారు.

ఏవరెవరికి ఎప్పుడు ఆలోచన కావలసినా రాజ కుటుంబాల స్త్రీలు కుసుమలతాదేవి కడకు రావలసిందే! యజ్ఞశ్రీ సార్వభౌముడే కుసుమలతను ఆలోచన అడిగేవాడు.

నేడు శాంతిమూలుడు కుసుమలతాదేవి నగరికి తాను వస్తున్నట్లు వార్త పంపి రథమెక్కి ఆమె నగరుకు చేరినాడు. పట్టపురాణి అంతఃపుర నగరున్నూ, రెండవరాణి కుసుమలతాదేవి నగరున్నూ మహారాజు హర్మ్యాలతో కలిసే ఉన్నాయి. మహారాజు మహాహర్మ్య పంక్తికి వెనుక భాగంలో ఏడు పెద్దహర్మ్యాలున్నాయి. అన్నీ కలిసి ఉన్నాయికాని దేని అందం దానిదే. ఈ హర్మ్యాలలో తక్కిన రాణులు నివసిస్తూఉంటారు. కులహాకుల శివనాగశ్రీదేవి, వాసిష్ఠుల రంతుశ్రీదేవి, గౌతమగోత్రజ అయిన ఆయన శ్రీదేవి, పల్లవుల ఆడబడుచు నదీశ్రీదేవి, చాళుక్యుల ఆడబడుచులు పండిత శ్రీదేవి, శివనాగశ్రీదేవి, బాపిశ్రీదేవి ఉంటారు. చక్రవర్తి తండ్రి పురుషశ్రీ మహారాజు భార్యలు సునీతిశ్రీదేవి, స్కందశ్రీదేవి, వింధ్యాటవీశ్రీదేవి, మిత్రశ్రీదేవి, సమశ్రీదేవులు అందరూ విజయపురంలో వేరు వేరు హర్మ్యాలలో ఉంటారు.

శాంతిమూలునికి సవతిచెల్లెండ్రు పదహారుగురు ఉన్నారు. శాంతిమూలుని తల్లి వాసిష్ఠి సునీతీదేవి. ఆమెకు శాంతిమూలునితోపాటు శాంతిశ్రీ, హమ్మశ్రీలు జన్మించారు. ఆ మహాప్రభువునకు సవతిచెల్లెళ్ళు నాగవసుశ్రీ, నాగశ్రీ, స్కందశ్రీ, స్కందకోటిశ్రీ, మహాశారసిశ్రీ, రతుమతిశ్రీ, మూలశ్రీ, అంతకోటిశ్రీ, మాదునిశ్రీ, నాగశ్రీ, రామశ్రీ, గోలశ్రీ, దేవిశ్రీ, బుద్ధిశ్రీ, స్కందశ్రీ, సతీశ్రీ, ప్రజాపతిశ్రీ దేవులు. ఈ చెల్లెళ్ళందరిని, మాళవ, ముసిక, ప్రతిష్ఠాన, నాగపర్వత నగరాది మహాసామంతులకు ఇక్ష్వాకు శ్రీపురుష మహారాజు వివాహం కావించారు.

శాంతిమూలుడు కుసుమలతాదేవి వచ్చి నమస్కారం చేయగానే ఆశీర్వదిస్తూ, భార్యను లేవనెత్తి బిగియార హృదయానకు చేర్చినాడు. వారిరువురూ పోయి ఆ అభ్యంతర మందిరంలోని ఆసనం అధివసించారు.

"దేవీ! పులమావి పారిపోయాడు."

"అవును ప్రభూ! నాకు ఈ ఉదయమే వార్త వచ్చింది. అతడు పారి పోవడం ప్రస్తుత స్థితిలో చాలా ఉత్తమమని నాఉద్దేశం."

"రహస్యంగా ఉన్న విరోధికన్న ఎదుటనున్న విరోధి ఉత్తముడు!"

"ఈతడేమి చేయగలడని ప్రాణేశ్వరుల ఆలోచన?"

"మళ్ళీ సైన్యాలు పోగుచేస్తాడు?"

"అప్పుడు?"

"ఎదురుగుండాపోయి హతమార్చవచ్చును."

"నా ఉద్దేశం అతడు పారిపోలేదనీ, ఈ పట్టణంలో ఎక్కడో దాగుకొని ఉన్నాడనీ."

"అదేమిటి దేవీ! నీవు ఆ విధంగా ఎట్లా ఆలోచించగలవు?"

"ఇక్కడనుండి ఒక్కసారిగా పారిపోతే అతడు దొరకటానికి ఎన్నో వీళ్లున్నాయి."

శాంతిమూలుడు ఆలోచనాపరుడయ్యాడు.

## 8

కుసుమలతాదేవి చెప్పినట్లు పులమావి ధాన్యకటక నగరంలో ఒక రహస్యస్థలంలో దాగిఉన్నాడు. అతని వేషమూ మారిపోయింది. ముసిక నగరంనుంచి ఆయన సామంతులు, మంత్రులు, సేనాపతులు అపసర్పనాయికులు, చారులు అనేకులు వచ్చారు. స్వర్ణరాసులు కొనితెచ్చారు. ఆ రహస్యమందిరంలో పులమావి ఇరువురు చారులు, నాయకులతో మాట్లాడు చున్నాడు. వారిరువురు పులమావికి సాష్టాంగనమస్కారంచేసి వెళ్ళిపోయారు.

ఆ రాత్రి పులమావి మారువేషంతో కొందరు అనుచరుల గూడి శ్రీకాకుళం వర్తకానికి పోయేవానిలా ప్రయాణం సాగించినాడు. ధాన్యకటక నగరం వెలుపల ఒక అర్ధగోరుతదూరంలో పులమావి జట్టును కొందరు రాజభటులు ఆపివేసినారు. "మీరు ఎవరు" అని రాజభటనాయకుడు వారిని ప్రశ్నించినాడు. పులమావి చారులలో ఒకడు వర్తకనాయక వేషంవేసి ఉండెను. పులమావిమాత్రం సేవకుని వేషంలో ఉన్నాడు. వణిక్కుల నాయకుడు "అయ్యా మా ఓడ ఒకటి యవద్వీపం వెడుతున్నది. దానిని సాగనంపడానికై నేను శ్రీకాకుళం వెడుతున్నాను" అన్నాడు.

"మీ ఓడ పేరు?"

"ఆనంద శ్రీ!"

"అలాగేకాని, మీరు ధాన్యకటకంలో ఎన్నాళ్ళనుండి ఉంటున్నారు? జన్మస్థల మెక్కడ?"

"మాది కాందూరునగరం. మేము ఇప్పటికి ఎనిమిది సంవత్సరాల నుంచీ ధాన్యకటకంలో వర్తకం చేసుకుంటున్నాము."

"ఈ విషయాలన్నీ తెలుసుకునేవరకూ మీరు ధనకరాష్ట్ర ముఖ్యనగరం గురుదత్త పురంలో ఉండవలసివస్తుంది. ఇంక మీతో ఉండేవారి చరిత్రలు ఒక్కొక్కరివే తెలియ జేయండి." ఇదివరకే చుట్టుప్రక్కల గ్రామాలలోను ధాన్యకటకనగరంలోనూ నివసిస్తూ వచ్చిన వారందరి చరిత్రలు ఆ వర్తక నాయకుడు మనవిచేసుకున్నాడు. పులమావి దగ్గరకువచ్చి ఈతడు తనకుటుంబ సేవకుడైన ధర్ములుని తనయుడైన నగధరుడనే పేరుకలవాడనిన్ని ఇంతప్పటినుంచీ తన యింటిలోనే పెరిగి తన పిల్ల లతోపాటు చదువుకొన్న బాలుడనిన్నీ తెలిపినాడు. ఇప్పుడీ బాలుని తండ్రి వృద్ధుడవడంచేత తనకు సేవకుడయ్యాడనీ మనవి చేసినాడు.

ఆ దినాలలో నిజం తెలుసుకునే విధానాలు కొన్ని ఉన్నాయి. రాజభట దళాధిపతి తెలివైన అపసర్పనాయకుడు. ఎదుటున్న మాయవణిక్కునితో ఏవేవో ఈమాటా ఆమాటా మాట్లాడుతూతూ చటుక్కున "నగధరా!" అని పిలిచాడు. కాని పులమావి అదృష్టవంతుడు గనుక వెంటనే "చిత్తం!" అని ఆ రక్షకభట దళనాయకుని కడకు వచ్చాడు. పులమావి అదృష్టం పండింది. రక్షకభటుడు మీరు గురుదత్తపురం వెళ్ళవచ్చును అని వెళ్ళిపోయాడు.

పులమావి గురుదత్తపురం వెళ్ళి అక్కడ అతిజాగ్రత్తగా ఉండవలసి వచ్చింది. సాహసం కలవాడినే లక్ష్మి వరిస్తుంది అని అతని మతం. ఉత్తమ కార్యాలకే ఆ సాహసాన్ని

వినియోగిస్తే ఈ పులమావి మహారాజ్యం విస్తరించి తన పేరు శాశ్వతంగా నిలుపుకొని ఉండును. అతడు చక్రవర్తిపదవి ఆశించడం తప్పుకాదు. కాని ఆ పదవికి పోయేమార్గం రాక్షసత్వంతో నిర్మించుకోజూచాడు.

పులమావి ఆలోచనలు గాటమైపోయాయి. వానిలో సుడిగుండాలు ఉద్భవించాయి. ప్రళయ ఝంఝలు వీచసాగాయి. గురుదత్తపురంనుండి మారువేషాలు వేసుకొని అందరూ మాయమయ్యారు. వీరు మారువేషాలు వేసుకుని మాయమైనారని అపసర్పనాయకుడు శ్రీ రాహులునకు తెలియును. అయినా మహారాజు శాంతిమూలుని ఆజ్ఞచొప్పున ఏమీ ఎరుగని వానిలా ఊరుకొన్నాడు.

పులమావి మాయమైపోయాడు. కొన్నినాళ్ళకు పులమావి తన రాజధాని నగరం ముసికలో ప్రత్యక్షమై సింహాసనం అధివసించాడు. నెలదినాలు తన ధనాగారం నింపుకొన్నాడు. సైనికులను ప్రోగుచేసుకొన్నాడు. నెలదినాలు ముసికలో వైభవోపేతమైన ఉత్సవాలు జరిగాయి.

పులమావి మాత్రం కనుబొమలు ముడిచి తన పరాభవ దావానలాన్ని ప్రతీకార వాంఛచే ప్రజ్వలింపజేస్తున్నాడు. తన దురవస్థకు శాంతిశ్రీ మూలకారణం. అంత ప్రేమించి, ఆమెను సామ్రాజ్ఞిచేయ ప్రతిజ్ఞపూని, మహాపురుషుడైన తాను ఆమెకోసం జైత్రయాత్రను కూడా ప్రారంభించాడు. అలాంటి సందర్భంలో ఆ వగలమారి, సైంధవునివలె తన అదృష్టానికి అడ్డుపడి, పులమావి అభీష్టాన్ని భగ్నముచేసింది. అతని హృదయంలో ఒక్కటే ఆలోచన. ధాన్యకటకం నాశనం చేయడం, ఇక్ష్వాకువంశాన్ని నిర్మూలనంచేయడం, ఇక్ష్వాకు శాంతిశ్రీని పట్టికొనిరావడం. అతని మోములో నవ్వులే – అతని హృదయంలో శాంతిలేదు. అతని పళ్ళు ఎప్పుడూ బిగుసుకొనే ఉన్నాయి. అతని ముక్కుపుటాలు ఎప్పుడూ విస్తరించే ఉన్నాయి. అతని కళ్ళలో కెంపులు తళతళమంటున్నాయి.

"ధర్మంరీత్యా పులమావే చక్రవర్తి!" "మధుపాన మత్తతలో ఒడలు తెలియక పొర్లే మనుష్యుడు చక్రవర్తి కాజాలడు!" "ఇక్ష్వాకులు చక్రవర్తి వంశీకులు కారు. వారు తెరమీద బొమ్మలునడిపే ఆటగాళ్ళు. దీనిని ఏ సామంతుడు అంగీకరించలేదు." "స్త్రీలోలురైన రాజులను బలవంతులైనవారు వధించి ధర్మరాజ్యం స్థాపించి తీరాలి"–ఈ విధంగా స్నేహముఖాలు ప్రతిసామంతునకూ పులమావి పంపించినాడు.

ఎక్కడోఉన్న ధాన్యకటకప్రభువు సకల దక్షిణాపథానికి సార్వభౌముడుకావడం మహారాజ్యాలైన వైజయంతికి, సౌరాష్ట్రానికీ, మాళవానికీ, శాతవాహనరట్టుకు, ములకదేశానికి, కళింగాలు రెండింటికీ, హూంగీయ రాజ్యాలకు, వేంగీరాజ్యానకూ, క్రముక రాష్ట్రానికి తలవంపులు అని పులమావి పంపిన దిట్టరులైన పండితులు రాయబారులుగా దేశదేశాలకు పోయి బోధిస్తూ ఉండిరి.

పులమావి నాశిక, సహ్యామలయ, వ్యాఘ్రనది, ప్రతిష్టాన, వైజయంతి, నాగపర్వతాది సంఘారామాలవారికి ఉత్తరాది సంఘారామాలవారికీ రహస్యంగా రాయబారాలను పంపి శ్రీ విజయసార్వభౌముడు, శ్రీ చంద్రశ్రీ సార్వభౌముడూ, శాంతిమూలుడూ బౌద్ధధర్మనాశన కారకులనిన్నీ బౌద్ధధర్మ ప్రతిష్ఠాపన తిరిగి చెయ్యడమే తన సంపూర్ణోద్దేశమనీ, తన నగరంలో

సువర్ణగిరి సంఘారామంలో ప్రియదర్శి అశోకచక్రవర్తి లిఖించిన దివ్య శిలాశాసనంలోని పవిత్రదేశాలు పునరుద్ధరించడమే తన ఆశయమనీ వారికి మనవి చేసుకుంటూ వారి సంపూర్ణ సహాయం అర్థించాడు.

చంద్రశ్రీశాతవాహన సార్వభౌముడు బ్రహ్మదత్తునిచెంతచదువునేర్చు కుంటున్నాడు. ఆంధ్రప్రాకృతం చదువనూ వ్రాయనూ నేర్చెను. చిన్న చిన్న గంథాలు చదువుతున్నాడు. మాళవిక ఆయనతోబాటు బ్రహ్మదత్తుని శిష్యురాలై చదువు ప్రారంభించింది. ఆ సమయంలో శాంతిమూల మహారాజు విజయపురంలో అగ్నిష్టోమం సంకల్పించారు. ఇక్ష్వాకులు హారితసగోత్రజు లైన ఉత్తమ బ్రాహ్మణక్షత్రియులు. ఆ దినాల్లో ఆంధ్రవేశం అంతా బ్రాహ్మణులూ, శూద్రులూ – రెండే జాతులు. శూద్రులలో ఉప్పరులు, చాకళ్ళు మొదలైన వారుండేవారు. ఆనాడు ఆంధ్రదేశంలో క్షత్రియులులేరు. బ్రాహ్మణులలో రాజ్యాలు పాలించేవారు బ్రాహ్మణ క్షత్రియులు (వీరు తరువాత వచ్చిన నియోగులకు పూర్వీకులయ్యారు – కొందరుసచ్ఛూద్ర క్షత్రియులయ్యారు. సచ్ఛూద్ర క్షత్రియులు అయిపోవడానికి కారణం బౌద్ధమతానికి తర్వాత వచ్చిన జైనమతమే.)

శాంతిమూలుడు విజయపురంలో అగ్నిష్టోమం చేయగానే, ధాన్యకటకంలో చక్రవర్తి చేత అఖండోత్సవం ఒకటి చేయించ సంకల్పించాడు. శాంతిమూలమహారాజు నిత్యాగ్ని హోత్రి. అగ్నిష్టోమానికి అన్ని ప్రయత్నాలు జరుపుటకు బ్రహ్మదత్తప్రభువు తన పరివారంతో విజయపురం వెళ్ళినాడు. బ్రహ్మదత్తుడు వెళ్ళిన నాలుగురోజులకు శాంతిమూల మహారాజు భార్యలతో పరివారజనంతో బయలుదేరి చంద్రశ్రీ సార్వభౌముని బయలుదేర దీసినాడు. చక్రవర్తి అఖండసైన్యంతో దాసీజనంతో, మహారాణులతో విజయపురం వేంచేసినాడు. ఆయన అధివసించవలసిన మదగజంపైన చంద్రశ్రీ ప్రయాణం చేయలేదు. అదివరకే శాంతిమూలుడు ఏనుగుపైన ఒక అంగరక్షక ప్రభువు వేషంతో ప్రయాణం చేసినారు. చక్రవర్తి గజరాజుపై ప్రయాణం చేసింది ఒక బాలవీరుడు, అతని ప్రియురాలు.. ఆ బాలవీరునికి చంద్రశ్రీ పోలిక ఉన్నది. అతనితోఉన్న యువతి మేలిముసుగులో ఉన్నది. మూడుదినాలు ప్రయాణాలు సలిపి చక్రవర్తి సైన్యమూ, పరివారమూ విజయపురం చేరినారు.

చక్రవర్తి విడిది చేసింది శాంతిమూల మహారాజు అభ్యంతర ప్రాసాదములో. చక్రవర్తి బ్రహ్మదత్తుని శిష్యుడై నప్పటినుంచీ కొంచెం తెలివిని సముపార్జించడం ప్రారంభించాడు. జీవితం అంటే భయం, కొంచెం భక్తి ప్రారంభమైనవి. రాజ్యవ్యవహారాలు తెలిసికొనడం రాజు, మంత్రి, ధర్మము, ప్రజలు, ముఖ్య నగరము, దుర్గము, సమితులు, సైన్యమూ, సంధి, విగ్రహము, మిత్రలాభం, రాయబారము, ధర్మవిచారణ, యాత్ర, రాజపథములు నదులు, కాల్వలు, చెరువులు, సముద్రము, వర్తకము, వైద్యము, ఖనిజములు, ఏనుగులు, రథములు, అశ్వములు, పశువులు, రహస్యచారులు మొదలగు ఎన్నియో విషయాలు బ్రహ్మదత్తుడు చంద్రశ్రీ చక్రవర్తికి ఉపదేశింప ప్రారంభించినాడు. చక్రవర్తికి ఒక అంగరక్షకుని వేషం వేసి నాగదత్తుని జత చేసి, తాను అప్రమత్తుడై బ్రహ్మదత్తప్రభువు విజయపురం అంతా తిప్పుతూ రాజ్యనిర్వహణ విధానం నేర్పసాగినాడు.

చంద్రశ్రీకి ఒక్కొక్కప్పుడు కోపం వచ్చేది. ఒకసారి విసుగు జనించేది. అయినా ఓపికతో బ్రహ్మదత్తుని దేశికత్వాన అన్నీ నేర్చుకుంటున్నాడు. రాత్రి ఒంటిగా మాళవికతో కూడి ఉన్నప్పుడు "దేవీ! మమ్ము ఈ శాంతిమూలుడు, బ్రహ్మదత్తుడూ వేపుకొని తింటున్నారు. నాకీ చక్రవర్తిత్వ మెందుకు, సుఖభోగాలు దూరమయినపుడు? శుష్కమైన జ్ఞానం నాకు నూరిపోస్తే ఏమి లాభం?" అని విచారవదనముతో పలికినాడు.

"మహాప్రభూ! మీరు చక్రవర్తులు. మీకు అన్నీ తెలియకపోతే ఏలాగ?"

"తెలియకపోతే ఇబ్బంది ఏమి? మంత్రులు చూసుకోరూ?"

"అందువల్ల మీరు పేరుకు మాత్రమే చక్రవర్తి అనిపించుకొంటారు."

"కావలసిందే పేరేకదా?"

"బ్రహ్మదత్త ప్రభువు ఈ జాగర్తలన్నీ ఎందుకు పడుతున్నాడను కొన్నారు?"

"ఛాందసుడు!"

"కాదు మహాప్రభూ! ఆయన తమ ప్రాణంకోసం ఈ జాగ్రత్తలన్నీ చేస్తున్నారు."

"ఏమి జాగ్రత్తలో! మాతండ్రిగారు బతికి ఉన్నప్పుడు మాతాతగారి కాలంలోనూ నేను ధాన్యకటకం అంతా నిర్భయంగా తిరిగేవాడిని."

"యువమహారాజత్వం వేరు – చక్రవర్తిత్వం వేరు మహాప్రభూ!"

"చక్రవర్తిత్వం అంటే ఈ బాధలేనన్నమాట ?"

"చక్రవర్తిత్వం అంటే మీ ఇష్టం వచ్చిన స్త్రీలతో మీ ఇష్టం వచ్చిన అమృతాలు సేవిస్తూ ఉండడము కాదు."

"దేవీ! నువ్వు కూడా నీతిబోధ మొదలు పెట్టుచున్నావు"

"మహాప్రభూ! తమ ధర్మం తమకు...."

చంద్రశ్రీకి కోపం మిన్నుముట్టిపోయింది.

## 9

"**అ**వును మహాప్రభూ! ఏకారణంచేత నైతే నేమి నేను తమ జీవితంలో భాగస్వామిని అయ్యాను. జీవితమంటే వివిధరత్నాలంకరణ, అనేకమంది దాసీలచేత సేవచేయించు కోవడమూ అద్భుతమైనందుకూ వస్త్రాలు లిప్తలిప్తకూ మార్చుకోవడమూ, వలచిన పురుషుని చేతుల్లో సవిలాసంగా తేలిపోవడమూ అనుకున్నాను. ఒక చక్రవర్తి పరిపాలనంవల్ల దేశం శాంతితో సుభిక్షమై ఆనందమనుభవిస్తుందని బ్రహ్మదత్తప్రభువు సెలవిచ్చారు. శాంతికీ, ధర్మాచరణకూ చక్రవర్తి భరతవర్షంలో ఏకైక చిహ్నమన్నాడు. బ్రహ్మదత్తప్రభువు ముక్కలు వింటూంటే మనం చేస్తున్న దేమిటి దైవమా అని దిగులు పట్టుకుంది."

అందమైన మాళవికచేతులు నమస్కారముద్రలో ఉన్నాయి. ఆమె కన్నులనీరు తిరుగుతున్నది. తలవంచుకని ఆ బాలిక నెమ్మదిగా నడుస్తూలోని అంతఃపురంలోకి వెళ్ళిపోతూంటే చంద్రశ్రీ శాతవాహన సార్వభౌముడు రెండంగల్లో ముందుకురికి, ఆ బాలికను తన కౌగిలిలో పొదివిపట్టుకుని, చటుక్కున ఆమె ఎదుట మోకరించి "దేవీ, దేవీ, క్షమించు. చక్రవర్తిత్వ మంటే ఇంత భయంకరమైనదని తెలిస్తే, నన్ను చక్రవర్తిగా

చేయకండయ్యా అని శాంతిమూల మహారాజును ఒప్పించి ఉందును" అని ప్రాధేయ పూర్వ కంగా అన్నాడు. "అయినా నేను సార్వభౌమ సింహాసనం ఎక్కడానికి ముఖ్యకారణం నువ్వు!" అని తలవాల్చుకున్నాడు. మాళవిక భర్త రెండు చేతులు పుచ్చుకుని లేవదీసి, "క్షమించండి మహాప్రభూ! మనం ఇద్దరం భగవంతుని చేతిలో ఆటబొమ్మలు" అన్నది.

మాళవికకు ఏదో భయం ఎక్కువైనది. చక్రవర్తి భోజనమును పరీక్షకుడు పరీక్షించిన వెనుక తానుగూడ పరీక్షించడం సాగించింది. రాత్రిళ్ళు కోడికునుకుపోతూ భర్తను పదిసార్లు కనిపెడుతూ ఉంది. అంతఃపురందాటి భర్తను ఎక్కడికీ వెళ్ళవద్దంటుంది. సాయుధుడైన బ్రహ్మదత్తునితో తక్క చక్రవర్తిని ఎక్కడికీ వెళ్ళనీయదు. ఇతర రాణులెవరన్నా అనుమానమే. తారానిక యశోదనాగనికలు ఆమెకు కుడిచేయి, ఎడమచేయి అయినారు. నాగదత్తుడు, అతని మిత్రులు నలుగురు ఆ మందిరములకు దారి ఇచ్చే బాహ్యామందిరములో ఇరువురి తరువాత ఇరువురుగా సర్వకాలముల కావలికాస్తూ ఉండవలసిందే. శాతవాహ నాంతః పురాలలో ఇటువంటి జాగ్రత్త లెప్పుడూ ఎవరూ పడవలసిన అవసరం లేకపోయింది. మహాపద్మనంద, మౌర్యకాణ్వాయనాదుల అంతఃపురాలలో ఇంతకు పదిరెట్లు జాగ్రత్తలు పడేవారట. రాణులందరకు మాళవిక మీద కోపం ఎక్కువై పోయింది. వాసిష్టియను పెద్దరాణి, తక్కిన రాణులు శాంతిమూలమహారాజుకడకు తమ ఆంతరంగిక పరిచారికలను రాయబారం పంపారు.

"చక్రవర్తి కడకు ఏ రాణి వెళ్ళడానికి వీల్లేకుండా ఉన్నది. ప్రాణనాథుని ప్రాణాలు కాపాడే బాధ్యత ఒక్క మాళవికదేనా? మాకులేదా? ఈ దుర్భర స్థితి ఎంతకాలం భరిస్తాము? మహారాజా! మీరు మాకు ఏడుగడ. చక్రవర్తికి హానిచేసి మా ఒడిలో ఐశ్వర్యాలు మూటకట్టుకోము. తమకు మేమంతా విశ్వాస్యలము తమ నిర్ణయానికి మేమంతా బద్ధురాండ్రము" అని రాయబారం శాంతిమూల మహారాజు కడకు చేరింది.

శాంతిమూల మహారాజు ఆ వృద్ధపరిచారికలను చూచి "చక్రవర్తికి తక్కిన మహారాణులతో అవసరంలేదట, మాళవికాదేవి తమకు సన్నిహితయట. ఈ విషయం అంతా చక్రవర్తితో మాట్లాడి మాహారాణులకు మళ్ళీవార్త పంపుతానని మనవి చేయండి. ఇంక వెళ్లవచ్చును" అని తెలిపినారు. అంతఃపురంలోనే చక్రవర్తి కత్తిసాము మున్నగునవి నేర్చుకుంటున్నారు బ్రహ్మదత్తునితో.

ఒకదినం చక్రవర్తి తన మందిరాలకడనున్న వనంలో బ్రహ్మదత్తుని శుశ్రూషలో విలువిద్య నేర్చుకుంటున్నారు.

**చక్రవర్తి:** ప్రభూ! మీకు రాని విద్య ఉన్నదా?

**బ్రహ్మ:** నిజానికి నాకే విద్య రాదు మహాప్రభూ!

"అన్ని విద్యలూ మీకు అద్భుతంగా వచ్చును."

"విద్యయొక్క అవధి భగవంతుడు. మనశక్తి ఈలోకాన్ని దాటి వెళ్ళలేదు. అలాంటిది విద్యలు వచ్చినవి అనుకోవడం వట్టి మూర్ఖత మహాప్రభూ!"

"అయితే విద్య నేర్చుకోవడమే మానెయ్యాలి. ఏ విద్యా పూర్తి కాకపోతే ఎందుకు చెప్పండి?"

"విద్యలు పూర్తిచేయాలని ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నంలో కొంతవరకయినా వెళ్లగలం.... ఆ తర్వాతి విద్య ఆపైజీవితంలో, ఈలా విద్య పూర్తి అయ్యేవరకూ జన్మలు ఎత్తుతూ ఉంటాము."

"మనకు క్రిందటి జన్మము జ్ఞాపకం ఉండదే. ఇంక ఏ విద్య క్రిందటి జన్మలో ఎంతవరకూ వదిలివేశామో ఎలా జ్ఞాపకం ఉంటుంది స్వామీ ?"

"ఒక నెలదినాల క్రిందట తాము జేసిన పనులు తాము అనుభవించిన అనుభవాలు మనకు జ్ఞాపకం ఉంటాయా మహాప్రభూ!"

"ఆ! నేనో క్రొత్తమధువు త్రాగితేచాలు, అన్నీ జ్ఞాపకమే!"

"తక్కిన వేళల్లో?"

"ససేమిరా, మా మెదడుకు ఏవీ అంటవు; మా మెదడు అటువంటిది. ఒక్కముక్కైనా జ్ఞాపకం ఉండదు."

"కొందరు పూర్వజ్ఞానపరులకు క్రిందటి జన్మ బాగా జ్ఞాపకం ఉంటుంది. మనకు జ్ఞప్తి ఉన్నా లేకపోయినా వెనుకటి కర్మ సంబంధం దానిపని అదే చూచుకుంటుంది. నిన్నటి భోజనంలో ఎక్కువతక్కువలు మనకు జ్ఞప్తి లేకున్నా దాని ఫలితం అనుభవానికి వస్తూనే ఉంటుంది."

"నిన్న మంచి మధుసేవించకపోతే ఈ దినం గొంతుకంతా ఎండి పోయినట్లు ఉంటుంది, ఆమోస్తరంటారు."

"చిత్తం."

"అయితే బ్రహ్మదత్తప్రభూ! మేము వెళ్ళి మహాఋషీ నాగార్జునాచార్యులవారిని దర్శనం చేసుకురావాలని ఉంది."

"చిత్తం! నేను ఏర్పాటు చేస్తాను."

"ఆయన మూడువందల సంవత్సరాలనుంచీ బ్రతికి ఉన్నాడంటారు నిజమా ప్రభూ?"

"చిత్తం! మాతాతగారెరుగుదురు వారిని. మా ముత్తాతగారు వారూ కలిసి చదువుకున్నారట."

"ఎవరు చెప్పారు ఆ విషయం?"

"మా తాతగారే!

"మీ తాతగారు ఇప్పుడు బ్రతికి ఉన్నారా?"

"పోయి అయిదేళ్ళు మాత్రం అయింది ప్రభూ!"

"అయితే మీ నాయనగారు వెళ్ళి శ్రీశైలంలో తపస్సు చేస్తున్నారట, ఎందుకని?"

"తపస్సు ఆత్మజ్ఞానంకొరకే"

"అదిగో మళ్ళీ ఆత్మజ్ఞానమని కొత్తగా అంటున్నారు. మీ బోటి వాండ్ల దగ్గర నేర్చుకోవడం ఎందుకొరకయ్యా?"

"జ్ఞానం రెండువిధాలు – ఒకటి లౌకికం, రెండోది పారలౌకికం."

"మీకీ రెండూ తెలుసునా?"

"మొదటిది ఏ కొంచెమో తెలుసు."

"తాను వలచిన యువతిని ప్రేమించటంకూడా జ్ఞానమేనా?"

"వలపు మొదలైన చిత్తవికారాలన్నీ జ్ఞానసాధనలే."

"అయితే మాళవికకూడా నాకు గురువే."

"ఒక్క మాళవికాదేవియేకాదు. సమస్తలోకము గురువే అవుతుంది తెలియనేరిస్తే."

"ఆ నేర్పు ఎటువంటిదో ?"

"మనం ఏ పనిజేస్తున్నా, దాని స్వరూపాన్ని, అది యిచ్చే ఫలితాన్ని విచారిస్తూ చేయాలి."

"మాళవిక వల్ల మాకు సుఖం కలుగుతున్నది."

"చిత్తం. ఆ సుఖస్వరూపాన్ని ఇంకా తరచాలి మహాప్రభూ."

## 10

**ఆ**వల శాంతిమూలుడు అగ్నిష్టోమం ప్రారంభించాడు. ఈ యాగము వసంతకాలంలో ప్రారంభమయింది. వసంతకాలంలో అయిదుదినాల జరిగే యాగమిది. దేశదేశాలనుండి ఋత్విజులు వచ్చినారు. దేశదేశాలనుండీ బ్రాహ్మణ్యము వచ్చిపడింది. విజయపురానికి రెండుయోజనాల దిగువనున్న సత్రశాల అను పవిత్రయాగస్థలంలో శాంతిమూలుడీ క్రతువును ఆరంభించాడు. ఆ యాగశాల ప్రదేశమంతా మహాపట్టణమై పోయింది. చతుశ్శాలలు, శాలలు, వందల కొలది వీధులు, వేలకొలది ఇళ్ళు, పందిళ్లు, పాకలు నిర్మించాడు. వైద్యశాలలు 'మంచినీళ్ళశాలలు' భోజనశాలలు నిర్మాణమైనవి. అనేక విధములైన అంగళ్ళు వచ్చినవి. ఎక్కడ చూచినా జనమే. రథ్యలను పల్లవభోగ పలకరాతితో నిర్మాణం చేసినారు. దేశదేశాలనుండి కూరగాయలు, పప్పుదినుసులు, పాలు, పెరుగులు, నేతులు దినదినమూ దిగుమతి అయిపోతున్నాయి. యాగమైన తరువాత శాంతిమూల మహారాజు బ్రాహ్మణులకు భూరిసంభావనలు ఇచ్చినాడు. మహా పండితులకు, ఋత్విజులకు, ఋషులకు లక్షలకొలది సువర్ణరాసులుపోసి తన మేనల్లుడగు చక్రవర్తిచే దానాలు ఇప్పించినాడు.

ఆరవదినమందు చక్రవర్తి దానాలు రాత్రిపడిన మూడుఘటికలవరకు ఇచ్చి నిర్ణీత కాలానికి ఆపి, తన విడిదికి వెళ్ళడానికి బయలుదేరినాడు. రథమువెంట మెరికలవంటి అంగరక్షకులున్నారు. ఇంతలో ఎక్కడనుంచి వచ్చారో ఆ మహారాజరథపథము వెంట అయిదారువందలమంది బ్రాహ్మణులు తమ శాలువలు క్రిందకు జారవిడిచి సంపూర్ణ కవచధారులై ప్రత్యక్షమైనారు. కత్తులదూసి చక్రవర్తి రథంమీదకురికినారు. అంగరక్షకులు అప్రమత్తులయ్యే ఉన్నారు. వాళ్ళు విరోధుల మొదటి ఉరుకునకు వెనుకకేగినా మరునిమీషంలో ఫలకాలతో ఆపుకుంటూ కత్తులు దూసి తలపడినారు. ఆ చుట్టుప్రక్కల శాలలలోనుంచి ఇంకా అయిదారువందలమంది ఈ సంకుల సమరంలోకి "జయ పులమావి చక్రవర్తీ జయీభవ" అంటూ దుముకినారు. అంతా అల్లకల్లోలమైపోయింది. మహారాజ రథసారథిగానున్న నాగదత్తుడు రథం ఆపి తన స్నేహితులైన అంగరక్షకులకు గురుతుగా శంఖం మూడుసారులు ఊది హెచ్చరికచేసి ఎడమచేత ఫలకము పుచ్చుకొని,

కుడిచేత పొడుగాటి భల్లం తీసి, రథముకడకు వచ్చే విరోధినెల్ల ఒక్కొక్కపోటుకు కూలుస్తున్నాడు. తోటి అంగరక్షకులు రథంమీదికురికి చక్రవర్తిని రక్షించుకొంటున్నారు.

కాని శత్రువుల దండు దొంగచాటుగా మీదపడి తాకిందిగనుక మహారాజ రక్షకులు కొంతదారి ఈయవలసి వచ్చింది. అందుకనే ముప్పదిమంది శత్రువీరులు రథంమీదకు రాగలిగారు. అంగరక్షకులు నూరుగురే ఉన్నారు. అయినా వారిలో ఒక్కొక్కడు పదిమంది మహావీరులను హతమార్చగల మేటి. కాబట్టి నాగదత్తుడు, అతనితోబాటు ఇంకో అయిదుగురూ శత్రువులలో పదిమందిని హతమార్చారు. రథంమీద ఉన్న ఈ అయిదుగురు అంగరక్షకులకు చంద్రశ్రీ శాతవాహన చక్రవర్తి కత్తితీసి తోడయినాడు. అన్ని వైపులా జాగ్రత్తగా చూస్తూలోనికి ఎక్కబోయే వీరుణ్ణి తల నరుకు తున్నాడు. లోపలికి వేగంతో వచ్చే బాణాలకు ఫలకం అడ్డుపెట్టుతున్నాడు. గుఱ్ఱాలను పేరుపెట్టి పిలుస్తూ అదలిస్తున్నాడు. ఇంతలో బ్రహ్మదత్తుని సైన్యం శంఖాలు పూరిస్తూ ఆ సంకుల సమరభూమికి నలుముఖాల నుండీ వచ్చి క్రమ్మినది.

యుద్ధం చటుక్కున ఆగిపోయింది. కాని ఎక్కడనుండి వచ్చినదో ఒకబాణం చక్రవర్తి కంఠత్రాణమును చీల్చి కంఠములోకి దూసుకుపోయింది. చక్రవర్తి "అయిపోయినది మాపని" అని కేకవేస్తూ నిలువునా ఆ రథం మీదనే కూలిపడిపోయినాడు. ఆ వెంటనే బ్రహ్మదత్తుడు గుఱ్ఱముమీద నుంచి రణరంగాన ఉరికినాడు. యుద్ధం గడబిడలో కాగడాలన్నీ ఆరిపోయినవి. ఉన్న పదికాగడాలూ రథం దగ్గరకు వచ్చాయి. చక్రవర్తి నిర్జీవియై రథంమీద పడిపోయి ఉన్నాడు.

విరోధులలో మూడువందలు మృతినందినారు. ఏబదిమందికి దిట్టంగా గాయాయి తగిలినవి. చక్రవర్తి అంగరక్షకులలో ఎనుబదిమంది ప్రాణాలు కొల్పోయినారు. తక్కిన వారిలో పదిమందికి గట్టిగాయాలు తగిలినాయి నాగదత్తుడు రక్తసిక్తాంగుడై ఉన్నాడు. అతడు ఒక్కడూ ఏబదిమందిని హతమార్చినాడు. అతనితో పాటు ఇరువురుమాత్రం సజీవులై ఉన్నారు.

బ్రహ్మదత్తుని సైన్యాలు ఎన్నో దివిటీలను వెలిగించెను. బ్రహ్మదత్తుని వైద్యులు ఆ యజ్ఞనగర మధ్యంలో పడిపోయిన శత్రుపక్షం వీరులకు తమ వారికీ గూడ వైద్యం చేయసాగించిరి.

## 11

**చ**క్రవర్తి మరణించాడని తెలియగానే శాంతిమూలుడు విహ్వాల చిత్తంతో పామరునివలె నచ్చటికి పరుగిడినాడు. వైద్యశాలలో తల్పగతమై యున్న చక్రవర్తి శరీరాన్ని తన హృదయానికి పొదివికొని కన్నుల నీరు కారిపోవగా శాంతిమూలుడు "మహాప్రభూ! సకలభారతానికీ చక్రవర్తి! అస్తమించినావా?" అంటూ వాపోయినాడు. ఆ దుఃఖము శాంతిమూలుని నిలువున కదల్చివేసింది. బ్రహ్మదత్తుడు ఆ తల్పందాపునే మోకరించి ఉన్నాడు. శాంతిమూలుని దుఃఖం గమనించి బ్రహ్మదత్తుడు లేచినాడు. "మహాప్రభూ! అవబృధస్నాతులై పవిత్రులైన మీరు పామరునిలా దుఃఖించడం ఉచితం కాదు."

శాంతిమూలుడు కన్నీరు తుడుచుకొని విషాదవదనంతో బ్రహ్మదత్తుని చూచి "దుః ఖంకాక ఏముంది ధనక ప్రభూ! మాతండ్రి తాతలు శాతవాహన వంశాన్ని తరతరాలుగా సేవచేస్తూ ఉండిరి. మా మూల పురుషుడు కోసల దేశం పద్మనందులపాలి బడినప్పుడు దక్షిణకోసలం చేరుకున్నాడు. అక్కడ నుండి శ్రీకాకుళంచేరి అచట శాతవాహనుల కొలువులో చేరాడు. ఆనాటి నుంచి శాతవాహనులు మాకు గురుతుల్యులయ్యారు. వారి కొలువులో రాజ్యాలు స్థాపించాము. ఆంధ్రసామ్రాజ్యం విస్తరింప చేశాము. శ్రీముఖ సార్వభౌముని సైన్యాధ్యక్షుడై మా పూర్వీకుడొకడు నందుల పాటలీపుత్రాన్ని విచ్ఛిన్నంచేసి, శ్రీ ముఖునికి కుడిచేయి అయి ఆయన్ను సకల భారతానికీ చక్రవర్తిని చేసెను. ఈనాటితో ధారావాహికంగా వచ్చిన శాతవాహన మహావంశము అస్తమించి పోయినది. మా చిరబాంధవ్యం నేటితో తీరిపోయింది. ఇందరం ఉండి చక్రవర్తిని రక్షించుకోలేకపోయాము. శాతవాహనులకు వజ్రకవచమైన ఇక్ష్వాకు వంశం నా మూలాన అసమర్థమై పోయింది" అని అస్పష్టవాక్కులతో అన్నాడు.

ఈ మాటలన్నీ వింటూ ఆ ధనకప్రభువు శాంతిమూలునికి నమస్కరిస్తూ, "మహాప్రభూ! ఈ యపరాధం మా అందరిదీని. విధివిలాసం ఇలా ఉంది. గతాన్ని విస్మరించండి. ముందు చేయవలసినది ఆలోచించండి. ఇది పులమావి పన్నినమాయ. వెంటనే అతనిని శిక్షించవలసి ఉంది" అని తెలిపినాడు.

"శిక్షిస్తే లాభం ఉందా ధనకప్రభూ! అంతరించిన శాతవాహన వంశాన్ని ఏలా పునరుద్ధరించగలం.... చివరకు పులమావినే మనం చక్రవర్తిగా అంగీకరించుదామా అని ఊహ కలుగుతూంది."

"హంతకుడైన పులమావిని చక్రవర్తిగా ఎట్లా చేయగలము?"

"అవును ధనక ప్రభూ! మరి శాతవాహన వంశాన్ని పునరుద్ధరించే మార్గమో?"

ఇంతలో ఆస్థానవైద్యుడు అక్కడకు వచ్చి శాంతిమూలునికి నమస్కరించి "మహాప్రభూ! నాగదత్తునికి మెలకువ వచ్చింది మహాప్రభువుల దర్శనము, ధనక ప్రభువుల దర్శనము కోరుతున్నాడు" అని మనవిచేసినాడు. మహారాజును, బ్రహ్మదత్తప్రభువులేచి నాగదత్తుని పరుండబెట్టిన గదిలోనికి పోయినారు. నాగదత్తుడు యుద్ధం ఆగిపోగానే, ఒంటినిండా తగిలిన గాయాలచే, రథంమీదనే విరుచుకుపడిపోయినాడు.

ఆంధ్రవైద్యులు జగత్ప్రసిద్ధి నందినవారు. వారి చికిత్సాపద్ధతి ఆశ్చర్య కరమైనది. శల్యవైద్యమున వారు సిద్ధహస్తులు. శాంతిమూలుడు సత్రశాలలో నెలకొల్పిన వైద్యశాలలన్నీ ఈ రాజవైద్యుని అధికారంలో నడచుచుండెను. ఆయన వైద్యమువల్ల నాగదత్తుడు రెండుఘటికలలో తేరుకున్నాడు.

నాగదత్తుడు నీరసంగా ఉన్నాడు. అతని ఒంటినిండా కట్లుకట్టి ఉన్నాయి. శాంతిమూల మహారాజుకూ బ్రహ్మదత్తునికీ నమస్కారం చేసినాడు నాగదత్తుడు.

**శాంతి** : ఏమి నాగదత్తా! ఏలా ఉన్నది?

**నాగ** : మహాప్రభూ! చక్రవర్తిని రక్షింపలేని వాని క్షేమంతో ఏమి పని?

**శాంతి:** ఎవరు ఏమి చేయగలరు? నీవు నీ ధర్మము మహాభక్తితో నిర్వహించావు. నీలోటు ఏమీలేదు.

**నాగ:** మహారాజా! చక్రవర్తిని రథం దిగవలదని ఎంతో బ్రతిమాలినాను. కాని ఆ మహాప్రభువు డాలూ కత్తీ తీసుకుని సలిపినయద్ధ మప్రతిమానం. వారు ఇరువదిమందిని హతమార్చినారు. ఆ యుద్ధంలో వారు పడిపోలేదు మహాప్రభూ! ఎక్కడనుంచో వచ్చిన దొంగపోటు వారి ప్రాణం చూరకొన్నది.

**బ్రహ్మ:** ఆ బాణము రాగితో చేయబడింది, చిన్నది. ఒక చిన్న ధనస్సుతో దగ్గిరనుండి అతిజాగ్రత్తగా ఆలోచించి వేసిన బాణమది. ఆ దుర్మార్గుని పట్టుకొన్నాము. కోపవివశుడనై, వాణ్ణి నూరుఖండాలుగా నరికి వేసినాను మహారాజా! ఈ తొందరపాటుకు క్షంతవ్యుడను.

**నాగ:** మహాప్రభూ! సార్వభౌములు పడిపోగానే నేను వారికడకు ఉరికి వారి తలను నాతొడపై పెట్టుకొన్నాను. వారు కళ్లుతెరిచి చిరునవ్వుతో నన్ను చూచి "ఏమయ్యా నాగదత్తా! ఇప్పటికి నేను మనుష్యుణ్ణి. నాజన్మ తరించింది...... ఈ పుణ్యయజ్ఞవాటిలో నా ప్రాణం ఆహుతియ్యగలుగు తున్నాను. మా వంశం నాతోసరి. పాపం మాళవిక దుఃఖం ఎవ్వరు తీరుస్తారు? మా మామయ్యగారిని ఈ సామ్రాజ్యానికి మేము మా తరువాత చక్రవర్తిగా నిర్ణయిస్తున్నాము. ఇది మా ఆజ్ఞ అని చెప్పినారు మహాప్రభూ! చిరునవ్వు నవ్వుతూనే మామయ్యగారికి నమస్కారాలు, మా గురువులకు నమస్కరాలు అని చెప్పు అని ప్రాణాలు వదిలినారు మహాప్రభూ!" శాంతిమూలునికి మళ్ళీ కళ్ళనీరు తిరిగినది. ఆయన తలవాల్చుకొని తూలుతూ గదివీడి వెళ్ళిపోయినాడు.

## 12

*"అస్తమించెను శాతవాహన పవిత్ర*
*రాజవంశము, ధాన్యపుర మహదాంధ్ర*
*వైభవము కృష్ణవేణ్ణా ప్రవాహమందు*
*మునిగిపోయె, భరతలక్ష్మి మోముమాసె"*

అనే విషాదగీతము ఆ వైద్యశాలా ప్రాంగణంలో భట్టొకడు పాడినాడు.

మాళవికాదేవి చక్రవర్తి కళేబరముచెంత ఒళ్ళు తెలియని మూర్ఛలో పడి ఉంది. లేచినా జ్ఞానములేనిచూపు ఆమె మనస్సూ ఆత్మా ఈ లోకంలో లేవు. భోజనానికి లేవదు. స్నానం చేయదు, మాటలేదు. శాంతిమూల మహారాజు నడుముకట్టుకొని సార్వభౌముని కళేబరమున్న మహాశాలా ద్వారంలో కావలి ఉన్నారు. వారికి మూడుదినాలనుండి భోజనంలేదు. చక్రవర్తి శరీరాన్ని మహావైద్యులు ఓషధీయుక్త తైలాలతో తడిపి సార్వ భౌమాలంకారాలతో ఉంచినారు. మూడుదినాలు మహాసామంతుడు, సామంతులు, రాష్ట్రపతులు, మహాసేనాపతులు, సేనాపతులు, మాహామంత్రులు, సచివులు, చూట్టాలు, వర్తకచక్రవర్తులు, పండితోత్తములు, అర్హతులు, ఆచార్యులు, భిక్కులు వేలకొలదిమంది వచ్చి చూచిపోతున్నారు. వందులుతలలు వంచి ఆ మహాశాల కెదురుగా ముప్పొద్దులా విషాదగాథలు పాడుతున్నారు.

*"ఎచట నిదురించితివి సార్వభౌమా*
*ఎచట మేల్కొందువోయీ*
*కన్నాకువై భూమి*
*కన్నాళ్ళు ప్రోచితివి*
*ఏదేశమేగెదవో*
*ఈ రీతి మమువిడిచి*
*ఎచట......"*

*వేరొక వంది :*

*"సదసుల హృదయుడు*
*మృదుమధుర జీవి*
*పూత చరిత్రుండు*
*పుణ్యుడు దివ్యుడు*
*బాసెనయా ఈనాడూ*
*మాసె ధరిణివల్ల కాదూ!"*

అని కంటినీటితో పాడినాడు.

నాల్గవదినాన చక్రవర్తిని నాలుగులక్షల ప్రజలు దుఃఖాశ్రులు విడుస్తూ ఉండగా బ్రాహ్మణులు అగ్ని సంస్కారంకోసం లేవనెత్తినారు. సార్వభౌముని దేహం కదలబోతుండగా "మహాప్రభూ! వెళ్ళిపోతావా? నన్ను వదలి ఎలా వెళ్ళగలవు?" అని కేకవేసి మాళవిక నిర్జీవయై నేలమీద నొరగిపోయింది. ఆ పుణ్యాంగనకు భర్తృసహగమనం లభించింది. వెంటనే అందరు ధాన్యకటకం చేరినారు. శాంతిమూలమహారాజు పవిత్ర కృష్ణవేణ్ణా తీరమందు సార్వభౌమునికి ఉత్తమలోక ప్రాప్తికై గోభూహిరణ్యగజ దానాదులు చేసి పితృయజ్ఞం నిర్వర్తించెను.

ఆంధ్రదేశ వాసులయిన ప్రజలు, రైతులు గ్రామగ్రామాన దుఃఖంతో నిండిపోయారు. ఈ వంశం భూమి పుట్టినప్పటినుంచి రాజ్యంచేస్తూ ఉన్న దనే వారు నమ్మినారు. పులమావి ఇంతటి దుష్కర్మపాలయి ఏమీ బావుకుందామనుకున్నాడు అన్నారు. పులమావిని సింహాసన మెలా ఎక్కిస్తా మని రౌద్రహృదయులయ్యారు. "ఇదయ్యా దేశంలో అరాజకత్వం. చక్రవర్తి లేకపోతే భూమిలో ధర్మం నశిస్తుంది అవి వేద ప్రామాణ్యము" అని బ్రాహ్మణోత్తములు ధర్మవాక్యాలు పలికినారు. ఏదో మహాఝంఝు పుట్టే ముందువలె దేశమంతా నిమ్మకు నీరుపోసినట్లుగా ఉంది.

శాతవాహనవంశం అంతరించింది. ఆంధ్రవిష్ణువుసుండి ఉద్భవ మందిన ఈ వంశం, విక్రమార్కుని ఎదిరించి నాశనం చేసిన ఈ వంశం, సకలభారతానికీ సార్వభౌమ సింహాసన మెక్కిన ఈ వంశం, ద్వీపద్వీపాల ధర్మప్రచారం చేయించి వన్నె కెక్కిన ఈ వంశం, లోకం అంతా సర్వకళలచే దీపింపచేసిన ఈ వంశం అస్తమించింది.

★ ★ ★

## నవమ భాగం

# ప్రజా కంఠము

గ్రామగ్రామాలలో ప్రజలు సభలు చేసినారు. పంచసభ్యుల్ని తమ పక్షాన ధాన్య కటకానికి ప్రయాణం కమ్మన్నారు. ఒక్కసారిగా నేల ఉప్పెన పొంగినట్లు గ్రామగ్రామాలలో ఆబాలగోపాలములోనూ ఆవేశం పొంగులు వారింది.

ధనకసీమ, వజ్రభూమి, పూంగీయ విషయము, క్రముకరాష్ట్రం, వేంగీ విషయం, బృహత్ఫాలాయన విషయం, దక్షిణకళింగ, దక్షిణకోసల, చోడ విషయం, చాళుక్య విషయం, కొరవిరాష్ట్రదులలోని వేలకొలదిగ్రామాల నుంచి గ్రామపెద్దలు బయలుదేరినారు. గుఱ్ఱపు బళ్ళమీద, ఎద్దులబళ్ళమీద, గుఱ్ఱాలపైన, ఏనుగులపైన, కాలినడకల బయలుదేరినారు. దారిలో భజనలు చేసుకుంటూ, ఇతర గ్రామాలవారిని సంప్రదిస్తూ, ధాన్యకటకం చేరవస్తున్నారు. నలవైపులనుండి వస్తున్నారు. శివుని, విష్ణుని, తథాగతుని, తీర్థంకరులను ప్రార్థిస్తూ వస్తున్నారు. కొందరు క్షుద్రదేవతల భజనలు చేస్తున్నారు.

ఆ నడివేసవిలో ఎండనక, ఏరనక, కొండనక, అడవనక గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, వస్తున్నారు. ధాన్యకటకానికి అప్పుడే కొన్ని గ్రామాలవారు చేరారు. మాళవికాదేవి అపరాజితయే అన్నారా ప్రజలు. ఆమె పేరున గుడి సంకల్పించినారు. ఆమె పేరున కృష్ణఒడ్డున పూజలు చేయించినారు. ముత్తయిదువులకు వాయినాలిప్పించినారు. వేలకువేలు జనులు కోటలోనికిపోయి శాంతిమూలమహారాజు దర్శనం కోరినారు. మహారాజు, మంత్రులు, సేనాపతులు, బ్రహ్మదత్తప్రభువు, పూంగీయ మహారాజు, బృహత్ఫలాయన ప్రభువు, వేంగీపురసాలంకాయన ప్రభువు, పిష్టపుర వాసిష్ఠప్రభువు, చళుకనాటి చాళుక్యరాయనిక ప్రభువు మున్నగువారితో ఎడతెగని మంతనముంటున్నారు. ప్రజలందరూ ఏకకంఠంతో "జయ శాంతి మూలచక్రవర్తీ!" అని అరచినారు,

*"జయ ఇక్ష్వాకుచక్రవర్తీ జయ"*
*"జయ విజయపుర సింహాసనాధీశా!"*

అన్న విజయ నాదాలు ఆశావిలసితాలై, ఉప్పొంగి దెసలావరించినవి. ప్రజల జయధ్వానాలు వినగానే శాంతిమూలుని మోము వైవర్ణ్యం పొందింది. పూంగీయ, ధనక, చళుక, సాలంకాయనాది ప్రభువుల మోములు పద్మాలులా వికసించాయి. ఆ గ్రామగ్రామాల ప్రజలు, పెద్దలు ముందుకు వచ్చినారు. ఆ పెద్దలలో ఒక ముదుసలి మహారాజులందరూ నిలుచుండి ఉన్న సభాప్రాంగణంలోనికి పోయినాడు. శాంతిమూలమహారాజుకు సాష్టాంగపడి నమస్కరించాడు, లేచి తక్కిన మహారాజులకు నమస్కరించాడు.

"మహాప్రభూ! తాము ఆంధ్రప్రభువులైన మీరందరు ఈ పెద్దవాని మాట వినండి. నా కంఠంలో నుంచి వచ్చే మాటలు కోట్లకొలది గొంతుకలలో నుంచి వచ్చినవే. శ్రీబుద్ధదేవులు భక్తులతో ఈ జంబూద్వీపం తిరిగే కాలం ముందునుంచీ, శ్రీరామచంద్రుడు

ఈ దక్షిణాపథాల సంతరించినకాలం ముందునుంచీ ఈ భూమిలో ఉన్న ముఖ్యమైనదీ పవిత్రమైనది ధర్మం ఒకటి తమతో మనవి చేసుకుంటున్నాను. దేశం ప్రజలది; ప్రజలేదేశం. ఉత్తముడు, పవిత్రజీవి, వేదవేదాంగ సంపన్నుడు ధర్మం నాలుగు పాదాలా నడపగల అతిరథుడు బ్రహ్మర్షి సమానుడైన పురుషుణ్ణి ఆద్యసభలు రాజుగా ఎన్నుకొనేవి. రాజు భూమి రక్షణార్థం, ప్రజారక్షణార్థం ధర్మపాలనార్థం, దుష్టశిక్షణార్థం. అలాంటి భూమీశుడు దేశంలో ధర్మమూ శాంతీ నెలకొల్పి ప్రజలను రక్షిస్తున్నందుకు మాకు వచ్చిన రాబడిలో ఆరోభాగం ఇస్తూ ఉంటిమి, ఇన్ని యుగాలు, ఇదంతా ప్రభువులకు మనవి ఎందుకు చేస్తున్నానంటే ఈ మహావిషమ స్థితిలో దేశదేశాలప్రజలు తమ పవిత్రకర్తవ్యము ఊహించి తమ ధర్మం నిర్వర్తించడానికి శాంతిమూలమహారాజు కడకు వేంచేశారు" అని కొంత విశ్రాంతి తీసుకొనడానికా అన్నట్లు ఆగినాడు. శాంతిమూలునికి బ్రహ్మదత్తునికి తక్కిన ప్రభువులకూ ఆ శతవృద్ధు చెప్పబోయే మాటలు తెలుసును. అయినా బ్రహ్మదత్తుడు ఆ వృద్ధుని వంక మందహాసంతో చూస్తూ.

"తాతగారూ! తామంతా నిర్వహించబోయే ఆ ధర్మం ఏమిటి? శ్రీరామచంద్రుడు ప్రజాభిప్రాయాన్ని తలదాల్చినట్లు శ్రీ శాంతిమూల మహారాజులున్నూ తమ అభిప్రాయాన్ని పరిపాలిస్తారు" అని తలవంచి, చేతులు జోడించి ప్రజలందరివైపు తిరిగి నెమ్మదిగా తెలిపినాడు. అక్కడి పెద్దలందరూ జయజయధ్వానాలు చేసినారు. అది విని ఆ అఖండ ప్రజాసమూహం అంతా జయజయధ్వానాలు చేసింది. ఆ జయధ్వానదుంధుభి లోకాలు నిండిపోయినది –

ఆ వృద్ధుడు "స్వామీ, ధనకప్రభూ! తాము సెలవిచ్చినది ఎంతయినా సమంజసము. మా హృదయం తమ అందరికి మనవి చేసుకుంటున్నాను. శాతవాహనవంశం ధర్మం నాలుగుపాదాలా నడిపిస్తూ రాజ్యం చేసింది. ఆంధ్ర విష్ణువు వంశం నేటివరకు ఒక్క మహాప్రవాహంలాగా ప్రవహించి వచ్చింది. నేటికి మా దురదృష్టంవల్ల ఆ వంశంలో ఎవ్వరూ రాజగుటకు తగినవారు కనపడలేదు. మాకు శ్రీయజ్ఞశ్రీ సార్వభౌముని తర్వాత వారి పుత్రులు వారి మనుమలు నామమాత్ర సార్వభౌములు అయినారు. దేశం నిండా కుట్రలు, ధర్మక్షతి ప్రబలినవి. ధర్మం సాక్షిగా శ్రీరామచంద్రుని సాక్షిగా తథాగతుని సాక్షిగా శ్రీ శాంతిమూల సార్వభౌముడు ఈ జంబూద్వీపానికి చక్రవర్తి కావాలి. "జయశ్రీ శాంతిమూల సార్వభౌమా జయ! విజయీభవ!" అని ఆ వృద్ధుడు వణికిపోతూ కేక వేసినాడు. ఆ ప్రజాసమూహం ఐక్యకంఠంతో భగవంతుని వాక్కుగా జయ జయ ధ్వానాలు సలిపింది.

## 2

**శాం**తిమూలునికి కొమరిత మాటలు వింటూంటే ఆశ్చర్యం అంతంతకు అధికం కాజొచ్చింది. కొమరిత తెచ్చిన రహస్య వార్తలమాట అలా ఉంచి, ఆమెలో కలిగిన ఈ మార్పు, వ్యవహారం పట్ల ఆమె శ్రద్ధ పరమాద్భుతమై కనిపించింది. అన్నిటియందు విజ్ఞానంతో సంచరిస్తోంది. అదీకాక ఈ బాలిక ద్వారా వచ్చిన వార్తలు అపసర్పగణ నాయకులు తెచ్చిన వార్తలకన్న స్పష్టంగాను, అధికంగాను ఉన్నాయి.

"తల్లీ! నీ వార్తలన్నీ చాలా ముఖ్యాంశాలను తెలుపుతున్నాయి. వాని విషయంలో నేను తగు శ్రద్ధవహిస్తాను."

"నాన్నగారూ! ప్రజలందరూ ముక్త కంఠంతో తాము సర్వభారతానికీ ఏకచ్ఛత్రాధిపత్యం వహించకోరుచున్నారని నలుమూలలనుండి వార్తలు వస్తున్నాయి."

"అవును తల్లీ! రాజపదవే ముళ్ళదారి, ఇంక సార్వభౌమపదవి కత్తుల దారే!"

"అయినా ఎవరో ఒకరు ఆ కత్తులదారి శుభ్రం చేస్తూ ధర్మం నిలబెట్టవద్దా నాన్నగారూ?"

"బుద్ధభగవానుడు రాజ్యం వదిలివేసి ఎందుకు ధర్మపథం కనుక్కోవడానికి వెళ్ళినాడు తల్లీ!"

"ఈ ప్రపంచంలోని దుఃఖాలను నాశనం చేయడానికి సన్యాసమొక్కటే మార్గం కాదుకదా? జగజ్జీవులు ప్రపంచ వాసనలు వదులుకోలేరు. వాళ్ళకోసం, ఉత్తములు ధీరోదాత్తులు రాజ్యాధిభారాలు వహించి ధర్మం నాలుగుపాదాలా నడపేందుకు సిద్ధంకావాలి అని మా దేశికులు సెలవిచ్చారు."

"ఎవరు? అర్హతాచార్యులా?"

"కాదు నాన్నగారూ! శ్రీ బ్రహ్మదత్తప్రభువులు!"

తండ్రికడ సెలవు పొంది, ఆ సౌందర్యనిధి, అద్భుత జ్ఞానసంపన్న శాంతిశ్రీకుమారి తన అంతిపురానికి వెళ్ళి తన గురువు బ్రహ్మదత్తుడు తనకై ఎదురుచూచే విద్యామందిరం చేరుకున్నది. బ్రహ్మదత్త ప్రభువు చిరునవ్వుతో "రాజకుమారీ! రాత్రి ఎన్నిసార్లు త్రిస్థాయిలూ, త్రికాలాలూ, అభ్యాసం చేశావు?" అని పృచ్ఛచేసినాడు. "వేయిసార్లు త్రిస్థాయిలూ, త్రికాలాలూ వీణమీద అభ్యాసం చేశాను. వేయిసార్లు కంఠంతో. వేయిసార్లు రెండూకలిపి చేసాను" అని ఆనందంతో వికసించిన మోముతో పలికింది.

"అలా కృషి చేసినట్లయితే ఏలాంటి విద్య అయినా నిముషంలో కరగతమైపోతుంది, రాకుజమారీ!"

"నాకు కొన్ని అనుమానాలున్నాయి గురుదేవా! మీరు నాట్యమూ నాట్యాను బంధాలయిన సంధితాదులూ యజ్ఞయాగాది క్రతువుల కాలంలో ప్రదర్శితమయ్యే ఉత్తమ విద్యలన్నారు...."

"అవును."

"కాని మారదేవుడు తన కొమరితలను ఆ విద్యలలో ప్రజ్ఞాపూర్ణలుగాచేసి బుద్ధదేవుని తపస్సు విఘ్నం చేయడానికి వారిని ప్రయోగించినాడుకదా?"

"నీ అనుమానం సమంజసమైనదే. నాట్యమూ, గాంధర్వమూ, శిల్పమూ ఇవన్నీ ఉపవేదాలు అనే భావం ఋషులకాలంనుంచి ఉన్నది. యజ్ఞయాగాది క్రతువులు పశుహింసాత్మకాలని మహాశ్రవణకుడు సెలవిచ్చినాడు. ఛాగాదులను కుక్కుటాదులను, మీనాదులను అనేకులు భోజనానికై ఉపయోగిస్తున్నారు. యాగాదులు చేసేటప్పుడు బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులు కూడా మేకను, గుఱ్ఱమును, చివరకు నరుణ్ణికూడా యాగపశువును చేశారు."

"చిత్తం."

"అలా యజ్ఞపశువును చెయ్యడంలో హింస ఉండదని వారి మతం"

"యాగానికి చేసినా, భుక్తికోసం చేసినా హింస హింసే అవుతుంది గాని అహింస ఎలా అవుతుంది?"

"యజ్ఞకర్తలు పశువును ప్రాపంచిక వాంఛలకు ప్రతీకగా ఎంచి, దానిని హింసిస్తారు. అంతే."

"మీరు ఎంత చెప్పినా నా హృదయంలోని అనుమానం పోవడం లేదు,

"ఆ వాదం అలా ఉంచు, అది ఉపమానం కోసం తీసుకువచ్చాను. యాగంలోని హింస ఎటువంటిదో, కళాప్రదర్శనమూ అలాంటిదే."

"విపులం చేయరూ?"

"నాట్యాదులు ఆనందంకోసం ఉద్భవించాయి."

"ఏలాగు?"

"చిన్నబిడ్డల గంతులు, ఆనందంవల్ల వచ్చాయి. ఆ గంతుల్లోనుండి నాట్యం ఆవిర్భవించింది. జగల్లీల ఒక మహాదివ్యనాట్యం. భగవంతుడే ఆ మహానటుడు. ఆనందం సుందరమైన కదలికవల్ల వ్యక్తమవుతుంది. అట్టి కదలికే నాట్య ప్రారంభం."

"ఆనందము తుచ్ఛమూ ఉత్తమమూ కూడా కావచ్చుకాదా అంది?"

"అవును. కాబట్టే మనుష్యుడు ఉత్తమానందం కోరాలి. ఉత్తమానందమే మనుష్యునికి ముక్తిమార్గము. నీచానందము అధఃపతనానికి కారణం. కాబట్టి ఉత్తమానంద రూపమైన విద్యలు ఉత్తమ విద్యలు. ఈ ఉత్తమ విద్యలను మార్గంచేసుకొని ముందుకు పోయేవాడు మోక్షం పొందగలడు. సర్వజీవితమూ ఈ ఉత్తమానంద భావంలో నింపి కర్మ ఆచరించేవాడే తపస్వి."

## 3

"**సం**గీతం పాడేవారు, నాట్యం చేసేవారూ కూడా తపస్వులేనా ప్రభూ?"

"అవును శాంతిశ్రీ! రసోన్ముఖులైన స్త్రీపురుషులలో హృదయార్ద్రత సంపూర్ణంగా ఉంటుంది. ఆర్ద్రహృదయం నిర్మలంగా ఉంటుంది. కాని మనస్సు అతి చంచలమైనది. కాబట్టి ఏమాత్రం నిగ్రహం లేకపోయినా పతనం కలుగుతుంది."

"అలాంటి విద్యను ఉపాసించకపోవడమే ఉచితం కదా?"

"అదే తప్పుభావం. ధర్మములన్నీ ఆనందజనితములే, సత్యము, అహింస బ్రహ్మచర్యము, యోగము ఇవన్నీ. వీని కన్నిటికి నిగ్రహం అవసరమే. ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా నిముషంలో పతనం కలుగుతుంది. అందుకని అవి మానుతామా?"

"చిత్తం."

"కాబట్టి మానవ కర్మలలో ఉత్తమోత్తములైన ఈ కర్మలు చతుర్విధ పురుషార్థాలకూ ఉపయోగిస్తున్నాము.

"ఆనందమాత్ర ప్రయోజనమైన విద్యలు చతుర్విధ పురుషార్థాలకూ ఏలా ఉపయోగించగలము ప్రభూ?"

"మనుష్యునికి ఆనందం ఆ అనుభవంవల్ల వస్తుంది. ఆ అనుభవం వర్తమానం కావచ్చు, వెనుకటి అనుభవం స్మృతీకావచ్చు. ఇతరుల అనుభవ సందర్శనంవల్లగాని ఇతరులు ఆనందంవల్లగాని తమలో విజృంభించే ఆనందాన్ని ఉపయోగించి లలితవిద్యను ఉద్భవింపచేస్తే వానిని దర్శించడంవల్ల ఆనందం కలుగుతుంది. ఈ ఆనందం ఉత్తమరూపమైనప్పుడు అది మనలోని కల్మషాలను కడిగివేస్తుంది. మనుష్యుడు నిర్మలుడై కళాసృజనవల్ల సంగీతాది విద్యలను ఉత్తమ స్వరూపాలనుగా చేస్తాడు. ఆనంద కారణం ఉత్తమమయితే దాని ఛాయలు సంగీత, శిల్ప, కావ్యాదివిద్యలోనూ ఉంటాయి. అందువల్లనే అవి చతుర్విధ పురుషార్థ సాధనాలు అవుతాయి."

"మనుష్యుడు తుచ్ఛభావాత్మకంగా ఈ కళలను సృష్టిస్తే అవి ఆనంద మీయవు అంటారా గురుదేవా?"

"రాజకుమారి!దైహికమైన తృప్తిని సూచించే ఆనందం ఉత్తమానందం కాదు. అంటే మన భోజనాన్ని గూర్చిన కవిత్వం ఉత్తమంకాదు."

మీరు చెప్పినది అవగాహన అయింది. తమకు నా పాట ఒకటి వినిపించాలని కొన్ని దినాలనుండి వాంఛిస్తూ, లజ్జచేత ఊరుకొన్నాను."

"నీకు లజ్జ ఏమిటి రాజకుమారీ! ఏవయినా లోట్లు ఉంటే నేను పరిష్కరింప ప్రయత్నింపవచ్చుగదా?"

"వినండి,"

ఆ బాలిక మోము త్రపచే అరుణమైనది. ఆ దివ్యసుందరి మోము చూచి బ్రహ్మదత్తుని హృదయము ఆర్ద్రతవహించి కొట్టుకోజొచ్చినది. శాంతిశ్రీ తలవంచుకొనే, అతిమధురమైన కలకంఠంతో తోడిరాగణి ఆలపించింది. తోడిరాగణీ విరహాన్ని సూచిస్తుంది. ఆ రాగిణీదేవి విపంచి మీటుతూ, తన్నను సరించే పెంపుడులేడి తన కళ్ళలోకి దీనంగా చూస్తూ ఉండగా రమణీయ ప్రదేశంలో విరహాసనాసీనయై ఉంటుంది.

*"మేఘమా ఎచటికే*
*మెరుములీనుచు యాత్ర*
*విద్యుల్లతాంగి నీ*
*వెలుగు లెవ్వరికొరకు?"*

ఆమె కంఠము రుద్ధమైపోయినది. ఆమె కన్నులవెంట రెండు అమృత బిందువులు రాలినవి.

## 4

బ్రహ్మదత్తుడు శాంతిశ్రీ వైపు చూడకుండా ఏదో గ్రంథము చూస్తున్నట్లు నటించి "లలితవిద్యలు సాధారణప్రజలకు అర్థం కావాలా వద్దా?" అని ప్రశ్నించినాడు.

"సాధారణ ప్రజలకు అన్నీ అర్థం కాగలవా? ధర్మసూక్ష్మాల వంటివి అందరికి ఏలా అర్థం అవుతవి?"

"సాధారణ ప్రజలు ఆచరణలో పెట్టలేని ధర్మాలు కొద్దిమందికే పనికి వస్తాయి. కాబట్టి సాధారణ ప్రజలు ఆచరించవలసిన ధర్మాలు వేరు. మేధావంతులు ఆచరించవలసిన ధర్మాలు వేరూనా."

"ధర్మాలు వేరుగా ఉండవు ప్రభూ! ధర్మం ఒక్కటే! ఆచరణలో పెట్టే విధానంలోనే తేడాలుంటాయి. అన్నం తింటే కడుపు నిండి ఆకలితీరి, బలం పట్టుతుందని అందరికీ తెలుసును. కాని అన్నతత్వం ఎటువంటిదీ, అన్నంలో ఉండే ప్రాణశక్తి ఏలా వచ్చిందీ మొదలైన విషయాలు అందరికీ తెలియకపోవచ్చు."

"అయితే అన్నం వండడం, దానిని తినడం అందరికీ ఒకటేకాదా?"

"ఆ రెండూ అన్నం తినడంలో భాగాలే. కాని కంచంలో, ఆకులో, మట్టిమూకుడులో తినడమనే భేదాలుంటాయి."

"కాబట్టి?"

"కాబట్టి ఉత్తమ విద్యలు సాధారణ మనుష్యులు అర్థం చేసుకోలేరు."

"అవి ఆచరణలోనూ పెట్టలేరు."

"వారి శక్తికి తగినట్లు ఆచరణలో పెట్టుకున్నారు కాదా ప్రభూ! పల్లెటూరి పదాలు, పల్లెటూరి ఇండ్ల అలంకరణలు. కావడి చిందు, గంగా యాత్ర మొదలైన పల్లెటూరి నాట్యాలు లేవా? అవీ అందమైనవే. వాటిలోనూ రసవత్తరఘట్టాలున్నాయి."

"వారికి విద్య అక్కరలేదని వాదించగలవా?"

"ఏలా వాదించగలను? వారికే ముఖ్యంగా విద్య ఉండాలి. వారి కోసమే రాజ్యాలు. వారికోసమే ధర్మాలు, నీతులు. వారికోసమే గుళ్ళు, గోపురాలు, చైత్యాలు, గుహలు. వారికోసమే వైద్యం ఆచారం!"

"కాబట్టి ప్రజలే భగవంతుడని శాస్త్రాలు చెప్పుతున్నాయి. ఆ ప్రజలకోసం వివాహం ఉద్భవించింది. వివాహం అనే ఉత్తమ సంస్కారం లేకపోతే మనుష్యుడు పశువే!"

"సాధారణ మనుష్యులుకాక కొంచెం జ్ఞానవంతులైనవారు ఆ సంస్కారం మానివెయ్యవచ్చుకాదా గురుదేవా?"

"ఆ! ఎందుకు మానివేయకూడదు? కళ్ళుతెరచి అన్నీ తెలిసి నిప్పులో ఉరికే మనుష్యుణ్ణి అడ్డం పెట్టేవారున్నారా? మనస్సును దేహాన్ని వికలం కాకుండా కాపాడుకోవడం తోటే సరిపోతుంది సన్యాసంలో, ఇంక మార్గాష్టకము ఆచరణలో పెట్టేదెప్పుడు? అందుకని ఆర్షధర్మము సన్యాస ధర్మాన్ని చాలాదూరంగా ఉంచింది."

శాంతిశ్రీ "గురుదేవా! మనం చాలాసేపు మాట్లాడినాము. ఇంక నేను సెలవు తీసుకుంటాను" అని తలవంచి నమస్కరించి ఆ బాలిక సెలవు పుచ్చుకొన్నది."

తన గురువు ఈనాడు ఇటువంటి బోధ ఒనర్చినాడేమిటి అనుకుంటూ శాంతిశ్రీ తన అంతఃపురానికి వెళ్ళిపోయింది. అచట పల్యంకాసనంపై మేనువాల్చి లోకాంతాలకు పరువులైతే ఆలోచనలను కూడతీసికొన ప్రయత్నించింది. ఇంతలో యశోదనాగనికా తారానికలు ఆమెకడకు వచ్చినారు. వారిరువురు ఇప్పుడు రాజకుమారికడకు రావడానికి అనుజ్ఞ వీడ అవసరం లేదు. అనుజ్ఞ ఇచ్చే వారే వారు. ఈ ఇరువురు రావడంతోనే

శాంతిశ్రీకి ఏదో ఆనందం వచ్చింది. "యశోదా! ఏమిటీ వార్తలు? తారా! మీ నాయనగారు క్షేమమా?" అని వారిరువురను ప్రశ్నించింది. తారానికా, యశోదా మంచి అందాలు సేకరించుకొన్నారు. వారి మోములలో ప్రజ్ఞాకాంతులు ద్విగుణీకృతం పొందినాయి. ఆ యిరువురతో ముచ్చటలాడుచు కాలక్షేపంచేయడం శాంతిశ్రీకి అలవాటయిపోయింది.

## 5

విజయనాగుడు సార్థకనాముడు. బుద్ధదేవ సంతతారాధన తత్పరుడు. ప్రతిసంవత్సరమూ నాగార్జున సంఘారామము, విజయపుర సంఘారామాలు, ధాన్యకటక, ప్రతీపాలపుర, ఘంటకాశాల సంఘారామాలు, నాగశైల, శైలారామ సంఘారామాలు వెళ్ళి వస్తూంటాడు. తండ్రితో తల్లితో కలసి వారణాశి మృగవన సంఘారామాలు బోధిగయ మొదలయిన క్షేత్రాలు ఒక సంవత్సరము సందర్శించి వచ్చినాడు. జీమూతవాహననాగుడు ధాన్యకటక మహాచైత్యానికొక బుద్ధదేవ విగ్రహం చేయించి అర్పించినాడు.

అతని చుట్టు ఎందరో బౌద్ధులు. ఏధర్మం ఏచ్చినా మొదట పెద్దలలో వస్తుంది. వారిని అనుకరించేవారు సాధారణప్రజలు. ప్రజలు అనుసరించి భక్తితో ఆధర్మంలో పూర్తిగా స్నాతులయ్యేసరికి, పెద్దలలో కొత్తధర్మాలు వస్తూ ఉంటాయి. ఆంధ్రదేశంలో ఉన్నతవంశాల వారిలో మార్పులు వస్తున్నాయి. బౌద్ధారాధన తత్పరతపోయి మళ్ళీ ఆర్షధర్మంలేచి హృదయ పీఠాలు అలంకరించింది. కాని ప్రజలలో బుద్ధారాధన ఇంకా చలింపలేదు. ప్రతిగ్రామం మధ్యా చిన్న చిన్న బుద్ధచైత్యాలున్నాయి. పెద్దగ్రామాలలో పెద్ద చైత్యాలు చిన్న సంఘారామాలు ఏర్పాటై ఉన్నాయి.

శాంతిమూలుని కాలంనాటికి ధాన్యకటకంలో మహాసంఘారామంలో ఇతర సంఘారామాలలో పదివేలకుపైన భిక్కులున్నారు. ఈ భిక్కులు దేశాలు తిరుగుతూంటారు. ఎందరో భిక్కువేషం మాత్రంవేసి సంసార సుఖాలు అనుభవిస్తున్నారు పతితులైన ఈలాంటి భిక్కుల జీవితాలవల్ల బౌద్ధధర్మం అంటే యువకులలో నిరసన బయలుదేరి వారు పెద్దలను ఆక్షేపింప నారంభించారు. నాగదత్తు డాలాంటి యువకులలో ఒకడు. అతడు పట్టణవాసి, చదువుకున్నాడు. "ఏమిటీ భిక్కుధర్మం! కాషాయవస్త్రాలు కట్టితే కామం పోతుందటయ్యా బావగారూ?" అని సంక్రాంతి పండుగకు ఇంటికి చెల్లెలితో చేరిన నాగదత్తుడు కృష్ణాతీరమైన వినయనాగుని రాళ్ళరేవుగ్రామం వెళ్ళినప్పుడన్నాడు. వినయనాగుని తన ఇంటికి తీసుకొని పోయి తన అందాల చెల్లెలిని చూపించాలని అతని తలపు. వినయనాగుడు అందమయినవాడే. అతని చదువు పల్లెటూరి చదువు; ఛాందసుడు, బౌద్ధధర్మం అంటే ప్రాణం ఇస్తాడు. ఇవన్నీ చూచి యశోద ఏమనుకుంటుందో అని అతని భయం. అయినా యశోద చిన్నతనాన్నుంచీ బందుగులయిన ఈ రెండు కుటుంబాలూ వియ్యమొంద పెద్దలు జీమూతవాహన నాగుడూ నాగదత్తుని తండ్రీ నిశ్చయించుకొన్నారు. అయినా నాగదత్తుని వల్లనే వివాహమహోత్సవం ఆగింది. యశోద విజయపురం రాజకుమారి చెలికత్తెగా వెళ్ళింది.

పెద్దలు ప్రేమలూ గీమలూ నమ్మరు. నాగరికులయిన చిన్నలు ప్రేమే వివాహానికి గట్టిపునాది అంటారు. నాగదత్తుడు ఈ విషయం పెద్దలతో అంతగా వాదించ దలచుకోలేదుగాని చెల్లెలినీ వినయనాగునీ యాదాలాభంగా కలుసుకొనేటట్లు చేసి చెల్లెలి హృదయం ఏలా ఉంటుందో కనుక్కోదలచు కొన్నాడు. నాగదత్తుడూ, వినయనాగుడూ రెండెడ్లబండి ఎక్కి సాలగ్రామం వచ్చినారు. వినయనాగుడు సంక్రాంతి పండుగకు సాలగ్రామంలో నాగదత్తుని ఇంటనే విందులు ఆరగించుటకు వచ్చాడు. వినయనాగుణ్ణి చూచినకొద్దీ నాగదత్తునికి ఆనందము ఇనుమడిస్తూ ఉంది. ఆంధ్ర ప్రాకృతంలో బాగా చదువుకున్న ఆ బాలునికి ప్రకృతే గురుపీఠం వహించింది. తెలుసుకోవాలని ఉండాలి గాని, లేకపోతే బృహస్పతి పూనుకున్నా చదువు గోరుతం దూరంలోనే ఉండి పోతుంది జిజ్ఞాసకలవానికి ప్రతిరాయీ, ప్రతి ముళ్ళపొద చదువు చెప్పే గ్రంథంగా ప్రత్యక్షమవుతుంది.

వినయనాగుడు ఆలోచనాపరుడు. ఎప్పుడూ ప్రతి విషయాన్నిగూర్చి ఏదో తర్కించు కొంటూనే ఉంటాడు. కనుకనే గురువులయిన భిక్కులు అతని విద్యాపారంగతునిగా ఒనర్చి వదిలారు. ఈ విషయాలన్నీ నాగదత్తుడు గ్రహించాడు. తాను నాగరుడూ, గడుసరీ అయినా వినయనాగునితో జ్ఞానం విషయంలో వెనుకంజే!

వినయనాగుడు కొంచెం సిగ్గుపడ్డాడు మొదట. మౌనంగా కూర్చుండేవాడు. సంక్రాంతి పండుగనాడు భోజనాలయి కూర్చున్నారు. తాంబూలాలు వేసుకుంటున్నారు మగవాళ్ళంతా. సావడిలో దక్షిణభాగం కొంచెం ఎత్తుగా ఉంటుంది. ఆ భాగం అంతా చక్కని రత్నకంబళ్లు పరిచి ఉన్నాయి. గోడల పొడుగునా కృష్ణాముఖద్వార బృహత్పలాయన రాష్ట్రపు రంగులబొమ్మల దుప్పట్లు వేసి కుట్టినవి ఉన్నాయి. మధ్య, తాంబూలరజిత కరండాలు, లక్కపళ్ళేలు ఉన్నవి. పల్లవభోగాన్నుంచి వచ్చిన వెన్నలాంటి రాతిసున్నపు డబ్బీలు ఉన్నవి.

అందరు తాంబూలాలు వేసుకున్నారు. ఇంకా ఆకులు కావాలేమోనని నాగదత్తుడు చెల్లెలు యశోదను ఇంకా మరి రెండు నాగులేటి తమలపాకు బొత్తులు తెమ్మని పిలిచాడు. యశోదా తారానికలు భోజనానికి పోబోతున్నారు. అన్నగారి మాటలు విని, యశోద ఏమీ ఆలోచించుకోకుండానే తమలపాకుల కట్టలు రెండు పట్టుకువచ్చి అక్కడ పళ్ళెంలో పెట్టింది. ఆమె వినయనాగుని, వినయనాగుడు ఆమెను ఒక్క క్షణికం చూచుకున్నారు. యశోదకు మోము లజ్జారుణితమైపోయింది. వినయనాగుని మోము ఎరుపెక్కింది మొదటిచూపులోనే వారిరువురకూ ప్రణయజ్వరం ఆవహించలేదు. కాని వారిరువురూ ఒకరినొకరు ఏదో గౌరవంతో చూచుకొన్నారు.

యశోదతో నాగదత్తుడు వినయనాగుణ్ణి పొగడుతూ మాట్లాడాడు. అది యశోదకు ఓ విధంగా నచ్చినది. ఎంత రాచనగళ్ళలో నివసించనా హృదయంలో యశోద పల్లెటూరి పిల్ల! సంక్రాంతి రోజులలో బంతిపూలు పొలం నుండి పుణుకుకొని వచ్చి తలలో తురుముకొనుట ఆ బాలికకు ఇష్టము. చెరువులలో నీలి కలవలంటే ప్రాణం యశోదకు. అడవి మొల్లలు, తంగేటిపూవులు, జపాకుసుమాలు, మొగలిపూలు తానూ పొదలలోనికి ఎగబడి తీసుకొని అలంకరించుకొనేది చిన్నతనంలో. ఆ నీలికలువలు గుబాళించినవి

నేడు.... వినయనాగుని చూపులలో అతని స్నిగ్ధసౌందర్యంలో కృష్ణా జలాలలోతు యశోద హృదయంలో ప్రతిఫలించింది.

## 6

వినయనాగుడు పండుగ అనంతరం తాను వెళ్ళిపోవ సంసిద్ధుడైనాడు. కాని నాగదత్తుడూ, అతని తండ్రీ కదలడానికి వీలులేదని పట్టుబట్టారు. తారానిక వినయనాగుని "అన్నగారూ! మీరు ఇంకా నాలుగు రోజులపాటు ఇక్కడ ఉండండి. నా ఉద్యోగం ఇక్ష్వాకు రాజకుమారికడ. వారంతా ధాన్యకటకంలో ఉన్నారు. అయినా వారి అనుమతిమీద మేము ఇంతదూరం వచ్చాము, అని ప్రార్థించింది" వినయనాగుడు మెత్తబడినాడు.

ఆమె హృదయాంతరంలో ఒక ఆలోచన ఉంది. ఇంతవరకూ యశోదా వినయులు విడిగా కలుసుకోలేదు. వారిని మాయచేసి ఒకచోట కలపాలి. అప్పుడు ఇద్దరూ. ఒకరిమీద ఒకరికి ఉద్భవించి పెరుగుతూన్న ప్రేమను వ్యక్తం చేసుకునేటట్లు చేయాలని నిశ్చయించు కొన్నది. తనకూ నాగదత్తునికీ వివాహం కావడానికి ఎన్ని ప్రతిబంధకాలు వచ్చాయి? ముఖ్యమైంది రాజకుమారీ బ్రహ్మదత్తుల అనుజ్ఞ కావలసి ఉన్నది. ఉన్న పరిస్థితులపై తానుగాని, తన ప్రియుడుగాని రాజకుమారినీ, ధనకప్రభువునూ అనుజ్ఞలు వేడడానికి వీలులేకపోతున్నది. తారానిక రాజకుమారికడ ఉన్నప్పుడు నాగదత్తుడు ఆమెను కలుసుకొన కూడదు. ఇంటికి వెళ్ళినప్పుడు మాత్రం అక్కడ నాగదత్తుడు కలుసుకొనవచ్చును.

విజయపురంలో ఉన్నప్పుడు నెలకు ఒకసారి మాత్రము తండ్రిగారి ఇంటికిపోయి చూడవచ్చును. కృష్ణచతుర్దశి, అమావాస్య, శుక్లపాడ్యమి, శుక్ల చతుర్దశి, పూర్ణిమ, కృష్ణపాడ్యమి–ఈ దినములు వారికి పని విడుపు. తారానికా యశోదలు పూర్ణిమ దినాలు మూడూ ఉపయోగించు కొనేవారు. ఆ మూడు దినాలు నాగదత్తుడు తారానిక యింటివద్దకు వచ్చేవాడు. ఆ మూడుదినాలు వారు ముప్వురు తోటలలోనికిపోయి వంటలు చేసుకొని, భుజించి, కృష్ణానదిలో విహారానికిపోయి, వర్షం కురుస్తూ ఉంటే ఇంటికడనే కూర్చుండి చదరంగమాడుకొని, పాటలు పాడుకొని ఉప్పొంగిపోయేవారు. నాగదత్తుడు రసికుడు, తారానిక ఆనందపూర్ణ, వారిరువురకు ప్రణయశ్రుతి యశోద, నాగదత్తుడు–

*"వన్నె చిన్నె పిన్నదాన చిన్నారి వయసుదాన*
*నన్ను చూచినవ్వవే పొన్నపూల సొబగుదాన*
*మల్లె మొగ్గ పన్ను దాన*
*నల్లకల్వ కనులదాన*
*మేలమాడి పోవకే* *॥వన్నె చిన్నె॥*

*చుక్కమినుకు ఒదలిదాన*
*అక్కున ఒదుగురూపుదాన*
*మక్కువలనుచూపవే జిక్కవలజంటదాన"* *॥వన్నె చిన్నె॥*

అని పాడినాడు. ఆమె తిప్పుకుంటూ నడచి వచ్చి,

*"తగదోయీ, తగదోయీ ఒగలమారి చిన్నవాడ*
*నగిపోరా విన్న కన్న నలుగురు ఊరూవాడా?*
*సెగలు పొగలు చిమ్ముకుంటు*
*రగిలే చూపులకోపులు*
*మగవారల ఆగడాలు*
*పగటివేళ కాగడాలు"* ॥తగదోయీ॥

అతని ధూర్తత నివారించింది. ఇవన్నీ జ్ఞాపకం తెచ్చుకొని తనలో తాను మురిసిపోతూ తారానిక కుట్ర ప్రారంభించింది. వినయనాగుడు మెత్తబడి సరేనన్నాడు. వినయనాగుడు ఆగిపోయినాడని యశోదకు తెలిసి సిగ్గూ పడింది, ఆనందమూ చెందింది. తారానికతో "వదినా! మనం ధాన్యకటకం త్వరగా పోవద్దా?" అన్నది. "త్వరగానే వెళ్ళాలి. ఈ రోజు కనుము, రేపు ముక్కనుము ఆ తర్వాత మామయ్యగారు మంచిరోజు చూచి పంపుతారు" అన్నది.

## 7

**క**నుమునాడు బాలికలందరూ కలిసి సౌందర్యపారమితను పూజించడానికి, బళ్ళు కట్టుకొని కృష్ణ ఒడ్డున "రాళ్ళరేవు"కు తెల్ల వారగట్లనే బయలుదేరినారు. నదీతీరపు ఊళ్ళ నుంచి ఈ పూజకు బాలికలు కృష్ణ ఒడ్డుకు వస్తారు. సెలయేళ్ళకు, నదులకు, చెరువులకు బాలికలు తెల్లవారగట్లనే చేరి స్నానాలుచేసి, చక్కని ఉడుపులు ధరించి, తలలు దువ్వుకొని, కేశసౌభాగ్యం వివిధ రూపాలుగా అలంకరించుకొని నగలు ధరించి పూవులు పత్రాలు ధరించి, పళ్ళను నైవేద్యంగా పట్టుకు వెళ్ళుతారు. చుట్టుప్రక్కల అశ్వద్ధ వృక్షం ఉంటేసరి. లేకపోతే అశ్వద్ధశాఖను కృష్ణ ఒడ్డునే పాతి చుట్టూ అలికి ముగ్గులు పెట్టి పూజలు చేస్తారు. షోడశోపచారాలు సలిపి, చుట్టూ పాటలు పాడుతూ నాట్యం చేస్తారు. రాళ్ల రేవుకుపోయి కృష్ణలో స్నానం చేసి యశోదా తారానికల ఇతర బాలికలు పూజలు పూర్తిచేసి, పాటలు పాడుతూ నాట్యం చేస్తున్నారు.

*"సౌందర్యదేవతా!*
*అంద వే మాపూజ*
*మాబ్రతుకులోచేరు*
*మధురమగు అందాలు*
*సౌందర్యదేవతా!*
*సౌందర్యదేవతా*
*మందారపూవలై నందనోద్యానమై*
*అమ్లాన సుమములై*
*అలరు మాబ్రదుకులు*
*సౌందర్యదేవతా!*

*సౌందర్యదేవతా*
*మారూపు వెన్నెలై మాసొబగు తారలై*
*అమృతకలశము ప్రేమ*
*ఆనందమై బ్రతుకు*
*సౌందర్యదేవతా!*
*సౌందర్యదేవతా*
*జలజలా ప్రవహించు*
*సెలయేరు మావిద్య*
*కలలోని పురుషుడే*
*నిలుచు మా ఎదుట నే*
*సౌందర్యదేవతా!"*

అని పాడినారు. కంకణాల గలగలలు తాళమై కాళ్ళ మంజీరాల గజ్జెల చప్పుడు మృదంగనాదమై వారి నాట్యానికి హంగు చేసినవి.

ఇంతలో ఒక చిన్న బాలుడు యశోదకొంగులాగి "అత్తా నిన్ను తొందరగా... ఎవరికో జబ్బుచేసిందట.... రమ్మన్నారు" అని చెప్పినాడు. యశోద చకితయై కళవళపడుచు గబగబ ఆ బాలుని వెంట పరుగిడి, నులివెచ్చ ఉదయపు టెండలో పోయినది. ఆతడు ఒక మామిడి తోపులోనికి యశోదను తీసుకువెళ్ళి అక్కడ ఆమెకు కనబడకుండా మాయమైనాడు. యశోద "విజయా! విజయా! ఏడమ్మావాడు? ఈ తోటలోనికివచ్చి ఎక్కడ మాయమయ్యాడు?" అని కేకవేస్తూ ఉండగా అక్కడకు వినయనాగుడు పరుగున వచ్చి "ఏలా ఉంది కాలు నీకు" అంటూ రోజుకుంటూ అడిగినాడు.

"నాకు కాలు ఏలా ఉండడమేమిటి?" అని యశోద భయపడుతూ, సిగ్గుపడుతూ అన్నది.

"నువ్వు పడడం కాలు విరగడం?"

"నేను పడలేదే!"

"నేను నమ్మను! నవ్వు నన్ను చూచి సిగ్గుపడుతున్నావు!" అంటూ వినయనాగుడు వంగి ఆమె ముందు మోకరించి "ఎక్కడ కాలు దెబ్బతిన్నది?" అని ప్రశ్నించినాడు.

"నాకు దెబ్బతగులలేదండీ!" అంటూ యశోద పరుగెత్తింది. ఆ అందమైన రూపంతో ఆ ఉదయకాలంలో ఆ బాలిక లేడిలా పరుగెత్తుతూ ఉంటే వినయనాగుడు తెల్లబోయి ఒక్కనిముషం నిలుచుండి తనకోసం ఆ బాలిక వంకబెట్టి అన్న కొమరుని పంపినదని ఊహించుకొని, ఆనందంతో మోము వికసించగా "ఆగు! నీ కాలు విరగడం నిజం! నిజం!" అంటూ వేగంగా పరుగెత్తి యశోదను అందుకొని సువ్వున చేతుల్లోకి ఎత్తుకుని.... "కాలు ఎక్కడ విరిగిందో చూపు దొంగా?" అన్నాడు.

మాయచేసి వినయనాగుడు తన్ను రప్పించుకొన్నాడని యశోద ఆనంద పూర్ణయైకూడా, మాయచేసినందుకు కొంచెం అంటే కొంచమే కోపం తెప్పించుకొని, "మీరే దొంగలు, మా అన్నయ్యగారి చిన్నబ్బాయిని ఎవరికో జబ్బు చేసిందని చెప్పమని

పంపి నన్నిక్కడకు రప్పిస్తారా? ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?" అని మొగం తిప్పుకుంది. అతడు ఆమెను క్రిందికి దింపకుండా "నేనా దొంగను?" అన్నాడు. "మీరే!" "కాదు నువ్వే!" ఇద్దరూ పకపక నవ్వుకొన్నారు. ఇదంతా తారానిక నాగదత్తులు వేసిన ఎత్తు అని ఇద్దరూ అనుకొన్నారు. ఈ అదను దొరికిన దేలాగు దొరికింది అని అంతత్రపాపూర్ణ హృదయంగల వినయనాగుడు యశోదను ఒక గున్నమామిడి నీడలోనికి తీసుకొనిపోయి కూర్చుండబెట్టెను. ఆమె ప్రక్కనే అతడధివసించి,

"యశోదా! నేను వట్టిపల్లెటూరివాణ్ణి" అన్నాడు.

"నేనూ అంతే!"

"నువ్వు రాజకుమారికకు చెలికత్తెవు."

"ఎవరైనా వివాహంకాగానే...." ఆమె సిగ్గుతో కళవిళపడి మందహాసంచేసి తల వాల్చుకుంది. అతడూ నవ్వుతూ "అవును యశోదా! పెళ్ళి అయిన వెనుక అత్తవారింటికి పంపిస్తారన్నమాట నిశ్చయమే. అయితే నువ్వు ఎంత చిన్నతనంనుంచో పట్టణవాసంలో రాచనగళ్ళలో పెరిగిన దానవూ, నువ్వు బాగా చదువుకొన్నావూ, నాగరికతలో మునిగి తేలినదానవు నేను పల్లెటూరి మొరకుమానిసిని నేను నీ కలవపూవు చేతిని ఆశించడం ఆకాశంలోని చంద్రుని కోరటమే!" అని మనవి చేసుకొన్నాడు.

"నేను పల్లెటూరిదాన్ని, మీరు బాగా చదువుకున్నవారు. మీ బోటులు ఎక్కడ ఉన్నా జ్ఞానవంతులే!"

"ఇంతకూ....?"

"మా అన్నయ్య ఇష్టమే నా ఇష్టం."

"మీ అన్నయ్య మనసారా మన దాంపత్యం కోరుతున్నాడు."

"అయితే మా అన్నయ్య ఇష్టమే!"

ఎంత సిగ్గుతో కుంగిపోయేవారికైనా ప్రేమ విషయం వచ్చే సమయానికి ఎక్కడి సిగ్గు అక్కడే మాయమౌతుంది. వినయనాగుడు "యశోదా, నేను కృష్ణ ఒడ్డున కూర్చుండి ఆ నీలపులోతులలో నీ కళ్ళు చూచేవాడిని!" అని ఆమె వంక తమితోకూడిన చూపులతో చూస్తూ అన్నాడు. యశోద తలవంచి గడ్డి మొక్కలు పీకుతున్నది.

"మా పొలాలగట్ల వసంత ప్రారంభంలో వికసించే మోదుగ పూలల్లో నీ పెదవులు దర్శించాను!"

ఆ బాలిక దీర్ఘవినీల పక్ష్మాల నెత్తి వినయనాగుని చూచి చిరునవ్వు నవ్వుకొని కన్నుల మూసికొన్నది. ఒకసారి తన ప్రియురాలిని ఎత్తుకొని హృదయాని కదుముకొన వినయనాగునికి ధైర్యమూ రసికతా... వానాకాలం నాటి సెలయేళ్ళలా... ఎందుకు పొంగదూ!

"యశోదా! నువ్వు మా రాళ్లరేవుగ్రామంలో ఎలా కాపరం చేయగలవు?"

"కృష్ణాతీరం అద్భుతం, రాళ్లరేవు అందమైన గ్రామం!"

వినయనాగుడు ఒక్కసారిగా యశోదను హృదయానకు హత్తుకొన్నాడు. ఆమె మోమెత్తి ఇటుచూచి, అటుచూచి, మొదట సిగ్గుపడుతూ, ఆ వెనుక ధైర్యంతో ఆమె

పెదవుల్ని ముద్దు పెట్టుకొన్నాడు. యశోద చేతులూ అప్రయత్నంగా ఆ యువకుని మెడచుట్టూ చుట్టివేశాయి. ఇంతట్లో వీరిద్దరూ కూర్చున్న గున్నమామిడి వెనక కొంతదూరంలో "పక పక"మని నవ్వు వినబడింది. చటుక్కున ఇద్దరూ లేచి ఒకరికొకరు దూరంగా వెళ్ళిపోయినారు. యశోద గున్నమామిడి నీడనుంచి తుర్రున పిట్టలా ఎగిరి పోయింది.

వినయనాగుడు ఎంత చూచినా ఎవ్వరూ కనబడలేదు. అయ్యయ్యో మంచి రసకందాయపు పట్టులో విఘ్నేశ్వరుడు చూచినాడురా అనుకుంటూ, అయినా నయమే. తనవారి కళ్ళపడితే తన్నేమి అనుకుంటారో అనుకుంటూ హృదయం పూలపాటలు పాడుతూండగా తోటపైకి వచ్చి, కృష్ణ ఒడ్డునే కట్టివేసి ఉన్న బళ్ళ దగ్గిరకు వెళ్లినాడు. ఆ బళ్లు తోలుకు వచ్చిన వారిలో నాగదత్తుడు కూర్చుండి వంటలు చేయిస్తున్నాడు. అడపిల్లలందరూ వంటపనులలో గడబిడలు చేస్తున్నారు.

అందరూ వంటకు సిద్ధం. అందరూ కూరలు తరిగేవారే! అందరూ బియ్యం కడిగేవారే. ఒకరికొకరు అడ్డం. నాగదత్తుడు వాళ్ల అల్లరి హంగామా చూచి, "అందరూ వంటకు సిద్ధమయితే మాకు ఈ పూట భోజనం వచ్చిందన్నమాటే!" అన్నాడు తారానిక అందుకుని "మీకు భోజనం లేదులెండి" అన్నది.

ఎక్కడనుంచి వచ్చిందో యశోద "మా అన్నయ్యకు ఇప్పుడే వండిపెట్టనంటున్నావు! పెళ్లయితే వరస ఉపోషాలు కాబోలు" అంది.

"ఆ! నువ్వు మీ ఆయనకు నిత్య వనసంతర్పణలు గున్నమామిడి క్రింద వండిపెడిదువుగానిలే!" అంది.

యశోద చూచిందిరా బుద్ధదేవుడా అని తెల్లబోయి వెలి మందహాసంతో నవ్వుకుంది. వినయనాగుడు తనకేసి చిరునవ్వుతో తారానికా నాగదత్తులు చూడడం గమనించాడు.

*"గున్నమామిడి చెట్టుక్రింద చిన్నదీ*
*నన్ను మేలమాడి తియ్యంగ నవ్వినాదీ!"*

అని పాడినాడు వినయనాగుడు ఏమైతే అయిందని తెగించి. అందరూ గొల్లు మన్నారు.

## 8

ఆ రాత్రి నాగదత్తుడూ, అతని తండ్రీ, వినయనాగుడూ, నాగదత్తుని అన్నగారూ అందరూ కూర్చుండి మాట్లాకుంటున్నారు.

**వినయనాగుడు:** సంపూర్ణవిద్యావంతులూ, అతిరథులూ అయినా మహారాజుకు నాగదత్తుడు ఆంతరంగికుడయ్యాడు. నేను పల్లెటూరివాడను మామగారూ.

**గ్రామణి (నాగదత్తుని తండ్రి):** అవునయ్యా ఎవరు ఈ మహారాజులు, భూమీశులు, భూపతులూను? నువ్వూ భూమీశుడవూ భూపతివే ! అయితే నీకూ భూమికీ సర్వకాల సంబంధం, మహారాజుకూ భూమికీ నీ వ్యాజాన సంబంధం!

**వినయ:** వారి చదువు?

**గ్రామణి:** మహారాజులకు కాకుండా చదువుకున్న వారు వేలకొలది లేరా?

**గ్రామణి:** నీ బలమూ, నా బలమూ మనబోటి ఇతరుల బలమూ కలిసి అతిరథత్వం అవుతుంది. నాగదత్తుడు ధనకమహారాజుకు ఆంతరంగికుడు కావడమంటే ఇంతే.

**వినయ:** మీ మాటలు పరమాశ్చర్యకరంగా ఉన్నవి.

**గ్రామణి:** ఆశ్చర్యం ఏమిటి వినయా! మీనాన్నా నేనూ ఈ చుట్టు ప్రక్కల గ్రామాలలో పెద్దల పంచాయితీలలో సభ్యులం. మాకు తెలియదా? రాజు ప్రజాబలానికి చిహ్నం, ప్రజాధర్మానికి సేవకుడు.

**వినయ:** వారు ప్రతిభావంతులూ ప్రతాపవంతులూను.

**గ్రామణి:** ప్రతిభేకాదు, వారిజన్నే పూర్వజన్మ సుకృతం. యజ్ఞం చేసే మహర్షి ఉద్ధండ పండితుడు కావచ్చు. కాని ఆయన యజ్ఞం చేయడానికి ఋత్విజూలూ, బ్రహ్మకావాలి. అలాగే రాజ్యపాలనచేసే రాజుకు మనమందరం బలమూ, శక్తీ ఇస్తాము.

**నాగదత్తుడు:** అయితే నాన్నా! బ్రహ్మదత్తప్రభువు ఉత్తమ విద్యావంతుడైన బ్రాహ్మణుడు.

**గ్రామణి:** కారని అన్నానురా, ఆయన దేశానికి రాజయి చదువుకోకుండా ఉంటే ధర్మపరుడెలా అవుతాడు? రేపు నువ్వు ప్రభువైనా అంతే. చదువు ఎక్కకపోతే గద్దె ఎక్కటం మానాలి.

'ప్రజాకంఠం మహారాజు కంఠం' అని వినయనాగుడు అనుకున్నాడు. ప్రజాబలమే మహారాజుశక్తి "మనం ఈ కాలపువాళ్లము. భవిష్యత్తు ఎల్లా ఉంటుందో బావగారూ!" అన్నాడు వినయనాగుడు నాగదత్తునితో.

"ఉత్తమభావాలు మనస్సులో ఉంచుకొని జీవితం సాగించేవారికి ఎప్పుడూ భయంలేదు బావగారూ!"

"ఎక్కడిదీ వేదాంతం బావా!"

"మా ధనకమహారాజు మహాపండితుడు, మహాకవి, వేదాంతి. ఆయన జీవితం తలచుకుంటే ఏ రామచంద్రప్రభువో జ్ఞాపకం వస్తాడు."

"బుద్ధధర్మం యావత్తూ మరచిపోయాడు బావా!"

"శ్రీరామచంద్రుడు ఆంధ్రదైవం అంటారు మాప్రభువులు బ్రహ్మదత్తులవారు."

"బుద్ధదేవుడు శ్రీరామచంద్రుని వంశమేనట కాదూ?"

"అవును. మనకూ ఇక్ష్వాకులకూ సంబంధం ఉంది, ఆ వంశంవారు ఇక మనకు చక్రవర్తులు కావాలి బావగారూ!"

"మీ ఆలోచన చాలా బాగుంది. 'శ్రీ శాంతిమూల మహాప్రభువును చక్రవర్తిగా ఉండుడు' అని ప్రార్థిస్తూ ప్రజలు అందరూ ఐక్యకంఠంతో కోరినారు. మహారాజు ఏమీ మాట్లాడరు."

"శాంతిమూల సార్వభౌములకు రాజ్యక్షాంక్ష లేదు. ఎవరు చెప్పినా ఎవరు ప్రార్థించినా వారిలో ఉన్న అనుమానం వీడటంలేదు."

వినయనాగుడూ యశోదా తారానిక పుణ్యమా అని అప్పుడప్పుడు కలుస్తూనే ఉన్నారు. యశోద వినయనాగుని హృదయానికి మత్తు ఎక్కిస్తోంది. ఋష్యశృంగుడైనా- మనస్సు హరించగల మానిని వస్తే-వెన్నలా కరిగిపోతాడు.

వినయనాగుడు భోజనంచేసి గదిలో కూర్చుండి వినయపీఠికం చదువు కుంటున్నాడు. పదిక్షణికాలు మంచముపై మేనువాల్చి నిదురకూరినాడు. లేచి మోము కడుగుకొని శుభ్రమైన వస్త్రాలు ధరించి పరిమళముల లందుకొని, తల దువ్వుకొని, చీనాంబరము తలకు జుట్టుకొని మంజీర కంకణ కేయూరహారమేఖలాది భూషలు ధరించి, తిలకం తీర్చి నాగదత్తునితో కలిసి పొలం వెడదామని గదిలోనుంచి బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆ సమయంలో యశోదలోనికి వచ్చి "మీకేదో కావాలన్నారట, తారానిక పంపింది" అని తలవాల్చికొని తెలిపింది. అతడు ఆనందహృదయంతో,

"అవును వావాలి!"

"ఏమి కావాలి?"

"నువ్వే కావాలి!"

"నేనా! అమ్మో! ఇది కుట్రా!"

"ఉండు ఉండు వెళ్ళిపోకు! నిజంగా పని ఉంది. కాసిని మంచి నీళ్ళు కావాలి యశోదా!"

"వట్టినీళ్ళెందుకు. ఉపహారం పట్టుకువస్తాను వెళ్ళి!"

"త్వరగా!"

"ఏమంత త్వర?"

"ఘడియలు ఘడియలు నిన్ను ఒదలి ఒంటిగా ఉండనా?"

✶ ✶ ✶

దశమ భాగం

# వీరాంగనా సైన్యయాత్ర

ఆ మర్నాడు అంగరక్షణీదళం కూర్చుని రథారూఢూరాలై సాలగ్రామం వచ్చింది శాంతిశ్రీరాకుమారి. ఆమెకు తారానికా యశోదా అతిసన్నిహితులయ్యారు. ఇక్ష్వాకు శాంతిశ్రీతోపాటు పూంగీయశాంతశ్రీయు, బాపిశ్రీ, షష్టిశ్రీరాకుమారి కూడా రథాలధివసించి వచ్చినారు.

తమ చెలిక త్తైలందరికి రాజకుమారికలు విలువిద్యా, కత్తిసాము, గుఱ్ఱపుస్వారి, రథచోదకత్వమూ నేర్పినారు. వారి గజములకు మాత్రము మావటీంద్రనే వుంచుటకు నిశ్చయించుకొన్నారు. గండరగండనాశనీ బృందము గజసాహిణిలుగా సిద్ధమైనది ఈ రహస్యము పూంగీయశాంతశ్రీ బాపిశ్రీలే ఏర్పాటు చేసినారు. ఇక్ష్వాకు శాంతిశ్రీ రాజ కుమారికి చాలా నెలల వరకు ఏమీ తెలియలేదు. ఆ రాకుమారికలు యిద్దరు శాంతిశ్రీ జీవితంలో సేనానాయకత్వం గుప్తమై ఉన్నదనీన్నీ, పులమావిని నిరుత్తరుణ్ణి చేయడంలో ఆ శక్తే పైకి విజృంభించిందనీ నిశ్చయానికి వచ్చారు. ఇక్ష్వాకు శాంతిశ్రీ కడ దిట్టమైన అంగరక్షణీ బలం ఉంది. ఆ బలం అంతా ఉపయోగించి దానికి సహాయంగా తమ చెలులను, పరిచారికలను దిట్టరులైనవారిని ఏరి సిద్ధం చేశారు. అంతా సిద్ధం అనుకోగానే ఆ బాలికలిద్దరూ తమ వదినదగ్గరకు వచ్చి ఈమాటా ఆమాటా ప్రారంభించారు. కొంతసేపటికి పూంగీయ శాంతశ్రీ ఇక్ష్వాకు శాంతిశ్రీని చూచి,

"వదినా! నువ్వు ఆ పులమావిని అంతచిత్రంగా ఓడించగలిగావు! యుద్ధనిర్వహణ శక్తి ఎప్పుడు అలవరచుకొన్నావు?" అని ప్రశ్నించింది.

**ఇక్ష్వాకు శాంతిశ్రీ:** నేను యుద్ధనిర్వహణ నేర్చుకోవడం ఏమిటి నా కేమీ తెలియదు!

**పూంగీయ శాంత:** ఈ మాటలకేమిలే వదినా.

**ఇ. శాంతి:** నిజంగా నేను ఏలా చేయగలిగానో? నాకే ఆశ్చర్యం వేస్తుంది తలచుకుంటే!

**బాపిశ్రీ:** ఏది ఎట్లా అయితే ఏం ! మాకో రూఢివార్త తెలిసింది వదినా. దాని విషయం నీ ఆలోచనకు వచ్చాము.

**ఇ. శాంతి:** నా ఆలోచన ఏమిటమ్మా?

**బాపిశ్రీ:** ఆ రాక్షసుడు పులమావి నిన్ను వివాహమాడితీరుతాడట. నువ్వు వప్పుకోనంత వరకూ దేశంలో ఉన్న కన్యలకు ఉపద్రవం కలిగిస్తూ ఉంటాడట. అలా దినానికో బాలికను బలాత్కరిస్తాడట. ఆ విషయమై మామయ్యగారికి గడువుపెట్టి రాయబారం పంపాడట.

**ఇ. శాంతి:** ఏమిటీ పులమావి ఇంతపనికి తెగిస్తాడా? ఎప్పుడు వచ్చింది గడువు రాయబారం?

**పూం. శాంత:** నిన్న సాయంకాలం వదినా! అందుకని నీ దగ్గరకు ఆలోచనకు వచ్చాను.

నువ్వు దిట్టమైన అపసర్పులను ఏర్పాటు చేశావు. నీకు ఎప్పటి వార్తలు అప్పటికి తెలుస్తాయి. మామయ్యగారు మాట్లాడక ఊరుకొన్నారని మా నాన్నగారు చెప్పినారు. వాడు నిన్ను పెళ్ళిచేసుకోక వదలడట.

**ఇ. శాంతి:** నాకు పెళ్ళే అవసరంలేదు వదినా! పైగా ఆనాడు నేను పులమావిమీదకు ఎందుకు వెళ్లానో నా కింతవరకూ ఏమీ అర్థంకాలేదు. నాయనగారికన్న నాకు ధర్మరక్షణ కర్తవ్యాన్ని గూర్చి ఎక్కువ తెలుసునా? నాకు హింస అంటే ఏమీ సరిపడదు. అందులో మనం స్త్రీలం. మనకు మించిన ఈ గొడవ లెందుకు?

**పూం. శాంత:** వదినా! నువ్వు చెప్పినవన్నీ నిజమే! కాదనను గాని మనం అందరమూ విజయపుర ప్రాంతాలకు విడిదిచేసి....

**బాపిశ్రీ:** పులమావిపైన యుద్ధయాత్ర నడిపేనారివలె బీభత్సం కల్పిద్దాం పులమావి హృదయంలో!

**పూం. శాంత:** మన సైన్యంతో బయలుదేరామంటే చాలు.

ఇక్ష్వాకు శాంతిశ్రీకి తన మేనత్తల తనయల ఇద్దరి హృదయమూ నిముషంలో అర్థమైంది. వారికి యుద్ధం చేయాలని కుతూహలంగా ఉంది. పులమావి ఎలాగో నాశనం అయితేనేగాని తన జనకుడు శాంతిమూలమహారాజు సార్వభౌమ సింహాసనం అధివసించడానికి ఒప్పుకోరని వీరిద్దరూ నిశ్చయించుకొని పులమావిపై మహాజైత్రయాత్రకు తన్ను ప్రోత్సహిస్తున్నారని గ్రహించింది. ఆమె చిత్తవృత్తి వెలుగునీడలుగా పరిభ్రమిస్తున్నది. ఏమి బుద్ధిపుట్టిందో మేనత్తల కొమరితలు చెప్పింది ఆలోచించింది.

"శాంతిశ్రీవదినా, బాపిశ్రీవదినా, సరే మీదళాలను ఆయత్తం చేయండి. నేను నా దళాలతో వస్తున్నాను. పెద్దత్తయ్యగారు మనకు నాయకురాలయ్యేటట్లు ప్రార్థించుదాము. అందరము కలసి విజయపురం వెళ్ళి పులమావి విషయం అంతా తెలుసుకొని అతనిమీద జైత్రయాత్ర సాగిద్దాము."

అప్పటినుంచి సిద్ధమై తండ్రిగారిని విజయపురం వెళ్ళడానికి అనుమతి అడిగి, మేనత్తను ఒప్పించి వారందరితో బయలుదేరింది. యశోదా తారానికలతో అంగరక్షిదళాని వెంటబెట్టుకొని పోవాలని సాలగ్రామం చేరింది.

## 2

**శాం**తిశ్రీ రాకుమారి తన మేనత్త కూతళ్ళతో వచ్చిందని వినగానే యశోదనాగనికా, తారానికి గంతులువేసి కంగారుపడి పరుగెత్తినారు. ఆ వెళ్లడం శాంతిశ్రీ శిబిరంలోకిపోయి ఆమె పాదాలకెరిగినారు. శాంతిశ్రీ ఇద్దరిని ఒకేసారిగా నిలిధంగా హృదయాని కదుముకొంది. ఆ ఇద్దరిని వెంట తీసుకొని ఆ బాల ఒక పెద్దశిబిరంలో ఆసనాన అధివసించియున్న పూంగీయ శాంతశ్రీ, బాపిశ్రీ, షష్టిశ్రీల కడకు పోయింది. తారానికా యశోదా ఆ ముువ్వురు రాజకుమారికలను బాగా ఎరుగుదురు వీరిదనీఖిరూ వారు ముువ్వురకు రండప్రణామాలు చేశారు. వాళ్ళు ముువ్వురూ ఈ బాలికలను దరికి చేరదీసి తమకడనె కూర్చోబెట్టుకొన్నారు.

**పూంగీయ శాంతశ్రీ:** తారానికా! మేమంతా జైత్రయాత్రకు బయలు దేరాము.

**తారానిక, యశోద:** (ఆశ్చర్యంతో) జైత్రయాత్రకే?

**బాపిశ్రీ:** అవునక్కా! మీరును కవచాదులు ధరించి, సిద్ధంకండి.

**యశోద:** మా కవచాదులు ఈలిన్యకటకంలో ఉన్నాయి.

**ఇక్ష్వాకు శాంతిశ్రీ:** మీ కవచాదులు, మీ ఇతర వస్తువులు కూడా పట్టించుకు వచ్చాను.

వారిద్దరికీ మరీ అచ్చర్యం కలిగింది.

**యశోద:** మనము యుద్ధానికి వెళ్ళడం అంటే?

**షష్ఠిశ్రీ:** (యవ్వనం అంకురించబోతున్న బాలిక) యశోదా! మన మహిళలమే కత్తిగట్టి యుద్ధానికి వెడుతున్నాము. వెనుక అర్జునునివంటి వీరుణ్ణే ప్రమీల ఓడించింది. మనం ఒక అధర్మపరుణ్ణి, రాక్షసుణ్ణి ఓడించబోతున్నాము.

**తారానిక:** రాజకుమారిగారు ఈడున చిన్నలయినా సాత్రాజితివలె మాట్లాడారు.

**యశోద:** ఇక్ష్వాకులకోడలు కైకేయిలానే మాట్లాడారు.

**ఇక్ష్వాకు శాంతిశ్రీ:** మా శాంతిశ్రీవదిన కౌసల్య, మా బాపిశ్రీ సుమిత్ర కాబోలు. మా అన్నయ్య దశరథుడా?

**షష్ఠిశ్రీ:** మనం యుద్ధానికి సిద్ధమై ఉన్నాము. మా పెత్తల్లి సేనా నాయకురాలు.

**పూంగీయ శాంతశ్రీ:** రండి అమ్మగారి దగ్గరకు పోదాము. ఆమెతో ఆలోచించాలి.

**యశోద:** మన అపసర్పబలం మనతో ఉండాలికదా....

**బాపిశ్రీ:** అంతమాత్రమే పురుషులు మనతో ఉండడానికి వీలు.

**యశోద:** అయితే మా అన్నయ్య మనతో రావాలి. ధనకప్రభువుల అనుమతి పొందవలసి ఉంటుంది.

**షష్ఠిశ్రీ:** మా అన్నయ్యగారి దగ్గరకువెళ్ళి వారి ఆశీర్వాదమంది మనలను దారిలో వచ్చి కలుసుకోమను.

హెచ్చుతగ్గుగా రెండువేలమంది అశ్వసాహిణులు, మూడువందల మంది గజసాహిణీలు, రెండువందలమంది రథిక రమణీబృందము, వేయి మందిగల వృషభశకట వాహినీదళం, నాల్గువేలమంది పదాతినులతో వీరనారీ సైన్యం బయలుదేరింది. సర్వసేనాపత్ని ఇక్ష్వాకు శాంతిమూలుని చెల్లెలు పూంగీయ మహారాణి వాసిష్ఠిపుత్రి శ్రీ శాంతిశ్రీదేవి.

ఈ సైన్యం దినానికి మూడుపర్యాయాలు విడుదులు చేయడమూ, గ్రామాలలో స్త్రీలకు బోధించడం, దిట్టరులైన స్త్రీలను తమ దళంలో నేర్చుకోవడము. పురుషులెంతమంది వచ్చి చేరుతామన్నా శాంతిశ్రీదేవి ఒప్పుకోలేదు. ఒక మహారథమెక్కి రణసైన్యాధ్యక్షురాలై ముందుగా ఆమె వెళుతూ ఉంటే వెనకనే పదాతినీ దళమునకు బాపిశ్రీ నాయకయై వస్తున్నది. ఆ వెనుకనే ఎద్దు బండ్లదళము తారానిక ఆధిపత్యాన నడుస్తున్నది. సేనాధ్యక్షురాలికి కుడివైపున ఇక్ష్వాకు శాంతిశ్రీరాజకుమారి అశ్వసాహిణీదళం నడపుచు ప్రయాణిస్తున్నది. ఆమె వెనుక, యశోదనాగనిక రక్షకత్వాన ధనుర్వీరాంగ నాదళం నడచుచున్నది. పూంగీయ మహారాణి శాంతిశ్రీదేవి ఎడమవైపున ఆమె కొమరిత శాంతశ్రీ

రాకుమారి గజయుద్ధాధిపత్నియై హిమాలయంవలె ఉన్న మహాగజం ఎక్కి సాగిపోతున్నది. నాగదత్తుడు, మరికొందరు పడుచువాండ్రు మారువేషాలతో ఎప్పటి సంగతులు అప్పటికి శాంతిశ్రీదేవికి తెలియజేస్తున్నారు. వీరాంగనా సైన్యము పదిదినాలలో పదియోజనాలు నడిచింది. సైన్యం నానాటికి పెరుగుచున్నది. ఎందుకు ఈ సైన్యం బయలు దేరిందో ఎవరికీ తెలియకుండా కుండిన నగరంలో మహాధాతువును పూజించి, వ్యాఘ్రనదీ సంఘారామం చేరి ఆ వెనుక వేణుసంఘారామం దర్శించి రావాలని వార్తలు మాత్రం ప్రబలజేసారు. సైన్యం సంఖ్య పదివేలకు మించి పోయింది. రెండుమూడు దినాలలో కుండినపురం చెంత విడిది చేసినారు.

ఆంధ్ర వీరాంగనలు సౌందర్యవతులు, దిట్టరులు, సకలకళా కోవిదులు, కుండినపురాధినాథుడు – ఇక్ష్వాకుల ఆడపడుచు పూంగీయమహారాణి బుద్ధక్షేత్ర యాత్రా గమనయై స్త్రీ సైన్యంతో వస్తుందని విన్నప్పుడే ఆశ్చర్య మంది పరివారజనంతో ఆమెకు ఎదురేగి ఆహ్వానించినాడు. వారికి ఊరి చివర ఒక గోరుతం దూరంలో విశాలమయిన మామిడి తోపులలో స్థలం చూపించాడు. ఆ మామిడి తోపుల ప్రక్కనే ఎడతెగని నిర్మలజలంతో కూడిన ఏరు సంగీతం పాడుకుంటూ ప్రవహిస్తున్నది. కుండిన నగరం చుట్టూ వివిధ జాతుల తోటలు ఆ ప్రదేశం అంతా సస్యశ్యామలమై ధనధాన్య సమృద్ధమై ఆంధ్రదేశ పురీమణులలో ప్రసిద్ధి కెక్కినది. నగరానికి ఎగువగా ఒక పెద్ద చెరువు నిర్మించారు. నదిలోనుండి ఒక పాయ ఎప్పుడూ చెరువులోనికి ప్రవహిస్తూ ఉంటుంది.

## 3

**కుం**డిననగరం రుక్మిణీదేవి పుట్టింటి వారిది. విదర్భదేశం యావత్తు ఇప్పుడు ఆంధ్రసామ్రాజ్యంలో భాగము... కుండిననగరంలో పూసలహారాలు, గాజులు అద్భుతంగా చేస్తారు. మట్టిపనిలో ఈ నగరాన్ని మించినది లేదు. అచ్చటి అరజానెడు, పావుజానెడు మట్టిబొమ్మలు వ్యాఘ్రసంఘారామ గుహాకుడ్య విరచితచిత్రాలతో సమంగా, ధాన్యకటక పూర్వశైల సంఘారామ శిల్పాలతో సమంగా, జగత్ప్రసిద్ధి నందినవి. బుద్ధుడు, బోధిసత్వుడు, మాయాదేవి మొదలయిన విగ్రహాలెన్నో చేస్తూ ఉండేవారా నగరంలో.

స్ఫటిక శిలలు, గంద్రఇసుక కరగించి అందులో కొన్ని రసాయని కాలు కలపి గాజు తయారు చేసేవారు. ఆ గాజుతో కంకణాలు పాత్రలు, అద్దాలు, పూసలు మొదలయినవి రంగులు కలిపి పోతపోసి వానికి తళుకు ఇస్తారు. ఈ గాజు పరిశ్రమ విదర్భ దేశంలో ఇక్ష్వాకుల కాలంనాటికి రెండు వేల సంవత్సరాలనుంచి ఉన్నది ఈ దేశం కొండలలో ఇనుము, రాగి, సత్తు దొరుకుతుంది. గోదావరీ నదీప్రాంతంలో బ్రహ్మాండమయిన అడువులున్నాయి. ఆ అడవి కలపతో అతివేడి వచ్చే మంటలుచేసి గాజూ లోహజాతులూ కరిగిస్తూ ఉంటారు ఉక్కు పరిశ్రమకు కుండిన నగరం (ఇప్పటి కొండాపురం) గాజు పరిశ్రమకువలెనే ప్రసిద్ధికెక్కింది కత్తులు, ఖడ్గాలు, పరశువులు, భల్లములు, శతఘ్నులు, ఛురికలు, కవచాలు, శిరస్త్రాణములు నిర్మించేవారు.

రామాయణ కాలంలో దండకాటవి-పాండవ కాలంలో విదర్భ దేశమై నేడు ఆంధ్రమహా సామ్రాజ్యమున చేరిన కుండిన నగరంలో తన వీరాంగనా సైన్యంకోసం లక్ష సువర్ణ ఫణాలు ఖర్చుపెట్టి ఆయుధాలు, కవచాదులు సేకరించింది. వాసిష్టీపుత్రి పూంగీయ మహారాణి శాంతిశ్రీదేవి. కుండిన నగరంలో నెలదినాలు విడిది చేసింది వీరాంగనా సైన్యం.

కుండిన నగరంలో తన చెల్లెలు, ఆమె కొమరిత, తన చిన్న చెల్లెలు హమ్మిశ్రీదేవి తనయలిద్దరూ, తన ఏక పుత్రికా స్త్రీ సైన్యం నడుపుకుంటూపోయి విడిదిచేసి ఉన్న విషయమూ, ఆ సైన్యం బయలుదేరిన విషయమూ అన్నీ శాంతిమూల మహారాజుకు ఎప్పటికప్పుడే తెలుస్తున్నది. కాని ఆ మహారాజు మాటలాడడు. బ్రహ్మదత్తుడు మహారాజు నిశ్చలతకు ఆశ్చర్యంపడుతూ ఉన్నాడు. బ్రహ్మదత్తప్రభువు మహారాజు ఏమిచేయునో అని కనిపెట్టుకొని చూస్తున్నాడు. పూంగీయ మహా సామంతాదుల ఆశ్చర్యానికి మేరలేదు. పూంగీయ స్కందశ్రీ మహారాజు కడకు ఆతని రాణి వచ్చి స్త్రీ సైన్యసమేతంగా తాను బౌద్ధ పుణ్య క్షేత్రాలు చూచి వస్తానని అనుమతి కోరింది. రాజు సరేనన్నాడు.

వాసిష్టి శాంతిశ్రీ జగత్ప్రసిద్ధి చెందిన సుందరి. అన్నగారితో సమంగా అన్ని శాస్త్రాలు చదువుకొన్నది. ధీసంపన్న, రాజకీయ పరిజ్ఞానపూర్ణ. స్కందశ్రీ పురుషులలో సుందరుడు, ప్రసిద్ధవీరుడు. శాంతిశ్రీ అతనిని తానే కోరి వివాహం చేసుకొన్నది. స్కందశ్రీకి భార్య తెలివితేటలలో మూడవవంతు లేవు. పైగా ఆ జగదేకసుందరి తనకు దేవేరియై శృంగారా నందకలశాంబుధీస్నాతుణ్ణి చేసేది, వారిరువురి అనుకూల దాంపత్యము జగత్ స్తుత్యమై కావ్యవిషయమై గానం చేయబడేది. వ్యవహారదక్షయైన భార్యమాటకు స్కందశ్రీ మహారాజు జవదాటి ఎరుగడు. ఆమె తన్ను విడిచి పుట్టింటికైనా వెళ్ళలేదు, ఇరువురు కలసి వెళ్ళేవారు. ఇరువురు కలసి వచ్చేవారు. రెండుసార్లు పురిటికి వెళ్ళింది. ఆ రెండుసార్లు పూంగీయ రాష్ట్రపతి భార్యతో విజయపురం వెళ్ళినాడు.

అలాంటి శాంతిశ్రీ నేడు తన కొమరితను తీసుకొని బౌద్ధక్షేత్ర యాత్రకు పోవడం ఆ మహారాజుకు ఆశ్చర్యమూ, బాధా, దుఃఖమూ కలిగించినది. కాని ఈ విషయములో ఏదో పరమరహస్యం ఉందని అతడు తలపోసికొన్నాడు. అయినా తమకందరకు నాయకుడు మహాసామంత శ్రేష్ఠుడూ, మహారాజరాజేశ్వరుడు కావలసిన వాడూ అయిన తన బావగారు మాట్లాడక ఊరుకుంటే తానేమి చేయగలడు?

ఆ దినం మహాసామంతులు సభ చేశారు. చక్రవర్తి సింహాసనంపై ఎవ్వరు అధివసించిలేరు. కుడివైపు ఆసనంపై శాంతిమూలుడు కూర్చుండి ఉన్నారు. వేంగీపుర సాలంకాయనుడు, ప్రతీసాలపుర బృహత్పాలాయనుడు, కాంచీపుర పల్లవుడు, పిష్ఠపురపు మాధవుడు, కళింగపుర వాసిష్టుడు, సంగమపుర చాళుక్యుడు, ధనకరాష్ట్రపతి బ్రహ్మదత్తుడు, పూంగీయ స్కంద ప్రభువూ సభ తీర్చి ఉన్నారు.

**ధనకప్రభువు:** శాంతిమూల మహాప్రభూ! మనవారందరూ కుండినపురంలో విడిది చేసి ఉన్నారు.

**స్కందశ్రీ:** నారీసైన్యం పదిహేను వేలవరకూ వృద్ధిపొందిందట.

**శక్తిశ్రీ సాలంకాయన:** స్త్రీలు యుద్ధసన్నద్ధలై అలా వెళ్ళడం మన ఆచారంకాదు ఇక్ష్వాకు మహాప్రభూ!

**మహాశ్రీ బృహత్పాలాయన:** ఇది తాము పంపించినదా?

**ధనకప్రభువు:** మన వారి ఉద్దేశం మహారాజుకు తెలియదు.

**వాసిష్ఠి ఉదయశ్రీ:** మా మరదలు శాంతిశ్రీదేవి సేనానాయకురాలై ఆ సైన్యాన్ని నడుపుతున్నదట.

**మాఠరగోత్రజుడు ఆనందశ్రీ:** మా మనుమరాండ్రందరూ కూడా ఉన్నారని వినికిడి.

## 4

**శాంతిమూలప్రభువు:** మహాప్రభువులందరికీ నా మనవి ఒక్కటే ఉంది. పూంగీయ మహారాజ్ఞి బౌద్ధదర్మాభిరత. ఆమెకు బౌద్ధక్షేత్రాలన్నీ దర్శనం చేయాలని కోరిక పుట్టింది. ఆమె పూంగీయమహారాజు అనుమతి అడిగి తనకడ ఉండే నారీ సైన్యాన్ని వెంటబెట్టుకొని యాత్ర ప్రారంభించింది. ఇందులో మనం భయపడవలసిన పని ఏముంది? ఆమెకూ రాజకుమారికలకూ సైన్యానికీ ఆపత్తు ఏదన్నా వస్తుందంటే వెంటనే మనసైన్యం శరవేగంతో అక్కడకు వెళ్ళి వాళ్ళకు సహాయం చేస్తుంది.

**మాఠరిప్రభువు:** మహాప్రభూ! ఆపద వచ్చినవెనుక మనకు తెలియడ మెప్పుడు? మన సైన్యాల్ని పంపడమెప్పుడు?

**ధనకప్రభువు:** మహాప్రభూ! నన్ను వెంటనే సైన్యాలతో వారికి సహాయంగా వెళ్ళుమంటే....

**వాసిష్ఠిప్రభువు:** నేను సిద్ధంగా....

**సాలంకాయనప్రభువు:** నేను వెంట....

**బృహత్పాలాయనప్రభువు:** నేనూ అంతే!

**శాంతిమూల:** మీ కందరికి నా హృదయపూర్వకమైన కృతజ్ఞత!

**పూంగీయ మహారాజు:** మహాప్రభూ! మాకందరకూ వెంటనే అనుజ్ఞ ఈయ కోరుతున్నాను.

**శాంతిమూలమహారాజు:** (చిరునవ్వునవ్వి) నేను మూడుదినాలపాటు ఆలోచించి తమకందరికి మనవి చేస్తాను. నేను మూడు దినాలు వ్యవధి ఎందుకు అడిగానో అదిన్నీ మనవి చేస్తాను.

మహారాజు ఈ మాటలు అనగానే సభ సమాప్తమయింది. మహారాజులందరు దగ్గరిచుట్టాలు. అందరు ఈ విచిత్ర సన్నివేశం ఎప్పుడూ ఎరుగము అనుకున్నారు. శాంతిమూలుడు తిన్నగా పట్టపురాణి మాఠరీ సారసికాదేవి అంతఃపురానికి వెళ్ళినాడు. సారసిక భర్తపాదాలు కడిగి నీళ్లు తలపై జల్లుకుని, పూజించి ఆ పూవులు తలలో పెట్టుకున్నది.

**సారసికాదేవి:** అవధారు!

**శాంతి:** దేవీ! అమ్మాయి మేనత్తతోకలిసి వెళ్ళింది. మా చెల్లెలు ఈ ప్రయాణం ఎందుకు తలపెట్టిందో?

**సార:** ప్రభూ! వదిన హృదయంలో ఉన్నదే మా అందరి హృదయంలో ఉంది.

**శాంతి:** విన కుతూహలం కలిగినది.

**సార:** ధర్మం విచ్ఛిన్నం అయిపోతున్నదని అందరి హృదయాలలో భయం ఉద్భవించింది.

అతడు కొంత సేపాగి,

**శాంతి:** ధర్మం విచ్ఛిన్నం అవడం ఎలా సాధ్యం?

సారసిక చటుక్కున భర్త పాదాలకడ చతికిలబడింది. ఆ అరడుగుల మహోన్నత రూపుడు, శాంతిమూలుడు దేవిని ప్రేమతో లేవదీసి తన ప్రక్క సింహాసనంమీద కూర్చుండబెట్టుకున్నాడు.

దేవి తలవంచి, "ప్రభూ! నాకు ఏమీ కాంక్షలు లేవు. అది మీకు తెలుసును" అన్నది.

"దేవీ! అది నాకు నువ్వు చెప్పాలా? నీ హృదయం ఈనాటి స్త్రీలలో ఎవరికి ఉంది?"

"నేను సామ్రాజ్ఞిని కావాలని ఆశించుటలేదని హృదయేశులే బాగా ఎరుగుదురు."

శాంతిమూలుడు పల్చని బంగారు శలాకవంటి తన మహారాణిని అవభృథ స్నాతయైన సారసికాదేవిని తన హృదయానికి అదుముకొన్నాడు.

"ఎవరైనా నీకు ఇసుమంతైనా కాంక్ష ఉందని అనగలరా, దేవీ?"

"కాని ధర్మరక్షణకోసం తాము చక్రవర్తి సింహాసనం అధివసించి తీరాలి. ధర్మసంస్థలు, బ్రాహ్మణ వంశాలు, ప్రజాకోటి క్షేమంగా ఉండాలంటే, దేశంలో కాటక మహారాక్షసి అవతరించకుండా ఉండాలంటే, తాము చక్రవర్తులు కావాలి. ఈనాడు మన కందరు చుట్టాలు. రేపు వారిలో వారు రాజరాజాధిపత్యం కోసం యుద్ధాలు చేయవచ్చును. మహా ప్రభూ! ఇవన్నీ మేము ఆలోచించాము. మా వదినగారు తాను చేసేపనికి సహాయం చేయమని మాత్రం మమ్ము కోరింది. మా పరిచారికలలో దిట్టమయిన వారి నందరికి తాను వీరాంగనలుగా శిక్షణ ఇచ్చింది. బిడ్డల నందరిని తీసుకువెళ్ళింది. ఆమె అంటే మా కందరికి సంపూర్ణ విశ్వాసం. అంతకన్న నాకు ఏమీ తెలియదు ప్రభూ!" శాంతి మూలుడు విశాలమైన తనఫాలాన బొమలు ముడివడ ఆలోచించి ఒకసారిగా చిరునవ్వు నవ్వినాడు.

## 5

**వీ**రాంగనాసైన్యం మహావేగంతో ప్రతిష్ఠానపురం చేరింది. ఆ మహానగరంలో ఇప్పుడెవ్వరూ చక్రవర్తి ప్రతినిధిగా లేరు. ఒక సేనాపతి గండర గండలయిన వీరులతో కాపలా కాస్తున్నాడు. శాంతిమూల మహారాజు చెల్లెలూ, మేనకోడళ్ళూ, ఆయన కొమరితా సైన్యాలతో వ్యాఘ్రానదీ సంఘారామం వెళుతూ వచ్చారని ఆ సేనాపతి – భోజుడయిన కుమారదేవుడు విన్నాడు. ఏమి చెయ్యాలో అతనికి తోచలేదు. ఏ కారణంచేతనో స్వామికడనుండి ఎట్టి వార్త రాలేదు.

తమ్మందరినీ మోసంచేసి ఓడించిన ఇక్ష్వాకు శాంతిశ్రీ రాకుమారి ఈ స్త్రీ సైన్యంలో ఉంది. స్త్రీలసైన్యం రావడమే చాలా కొత్తగా ఉంది కుమార భోజునికి. అలాంటిది ఆ

రాక్షసి కూడా 'ఆ స్త్రీలలో వస్తున్నది. తానేదయినా తెలివితక్కువ పనిచేసి ఓడిపోతే ఇంక' ఆడవాళ్ళతో ఓడిపోయాడు కుమార భోజు'దని లోకం అంతా అవహేళన చేస్తుంది. ఒకవేళ నెగ్గినా ఏమివుట్టి మునుగుతుందో? ఏమీచేయకుండా ఊరుకొంటే ఎందుకు ఊరకొన్నావు అని అడగవచ్చు.

పూంగీయ మహారాణి శాంతిశ్రీ కుమారభోజుని గడబిడ నిమిషంలో గ్రహించుకుంది. తన సైన్యాలముందు సప్తవాద్యాలు భోరుకొల్పించి తిన్నగా రాజనగరుకు నడిచింది. పట్టణంలో ఉన్న సైనికులు ప్రజలు ఈ వీరాంగనా సైన్యాన్ని ఆశ్చర్యపూరిత హృదయులయి చూస్తున్నారు. శాంతిశ్రీదేవి, శాంతశ్రీ, ఇక్ష్వాకు శాంతిశ్రీ, బాపిశ్రీ, షష్ఠిశ్రీ రాజకుమారికలు కూడరా కోటలోనికి ప్రవేశించింది. ఆమెకు కుమారభోజు దెదురయి మోకరించి నమస్కరించినాడు. అక్కడే మదగజాలు దిగి ఆమె ఆ బాలికలతో అంగరక్షణీ జనంతో కుమారభోజుని చూచి "కుమారభోజ సేనాపతీ! మీరు ఇంత వరకు శాతవాహన చక్రవర్తులకు రాజభక్తితో సేవ చేసినారు. ఇప్పుడు వారిని కాదని ఈ మహా దక్షిణాపథాన్ని ముక్కలు ముక్కలు చేసిన వారితో చేరి రాజద్రోహమూ, దేశద్రోహమూ చేస్తారా?" అని ప్రశ్నించింది. కుమార భోజుడు ఆశ్చర్యం పొందినాడు. అతడు ఏమి ప్రత్యుత్తరం ఈయాలో ఆలోచించుకోలేక పోయినాడు.

"కుమారభోజ సేనాపతీ! మాకు భోజులెప్పుడూ స్నేహితులు. వారు ఈ దేశ గౌరవమూ, ధర్మరక్షణా అనేవి మరచిపోయి, ఈ మహారాజ్యాన్ని విచ్ఛిన్నం చేయదలచు కోరు. మీరు మాపక్షం చేరండి. పులమావి ఇచ్చే గౌరవం కన్న మేము ఎక్కువగా మిమ్ము గౌరవిస్తాము. ఇక్ష్వాకుల బాలికలు సౌందర్యవతులు. మా అన్నయ్యగారి నాల్గవదేవి కొమరిత విజ్ఞాశ్రీ రాకుమారిని మీరు వివాహంకండి. మీరు మాలో చేరండి. ఇది నా కోరిక!" అని శాంతిశ్రీదేవి తెలిపినది. కుమారభోజ సేనాపతి యౌవనం మళ్ళీ కౌమారదశ అందుకోబోయే ఇరువది అయిదేళ్ళ ఈడునాడు. యుద్ధజీవనంగా పెట్టుకొని, వివాహం చేసుకోకుండా జీవిస్తున్నాడు. అతని మందిరాలలో విలాసినులు ఇరువురు ముర్వురు ఉన్నారని అందరు ఎరుగరు.

"కుమారభోజ సేనాపతీ! నాకు మీ భావం రెండు ఘడియలలో తెలుపండి. కాదని మాపై కత్తికడతానంటారా మిమ్ము ఇప్పుడే బందీచేస్తాము. ఎదిరిస్తే మీ సైన్యాన్ని నాశనం చేస్తాము" అని గంభీరంగా శాంతిశ్రీ మహారాణి వ్రాక్కుచ్చినది. అ మాటలనడంతోటే ఇరువురు రక్కసులవంటి స్త్రీలు వచ్చి కుమారభోజుని రెండు రెక్కలు పట్టుకున్నారు. మూడవస్త్రీ వచ్చి ఆయన కత్తిని ఒరనుండి పెరికి శాంతిశ్రీదేవి పాదాలముందు పెట్టింది. సేనాపతి అంగరక్షకులు కన్ను తెరిచి మూసేలోపల ఇరువదిమంది కఱకు స్త్రీలు వారినందరినీ బంధించారు.

పూంగీయ శాంతశ్రీ కత్తిపై నెత్తి నిలిచిన వెంటనే వందిమాగధురాండ్రు తమ కత్తులెత్తి "జయజయ సకల దక్షిణాపథపతీ! శ్రీశ్రీ శాంతిమూల సార్వభౌమా జయజయ" అని అరచినారు. ఆ అరపు గుర్తుగా రెండు విఘడియలలో కోటలో ఉన్న సైనికులందరినీ

ఆ వీరనారీమణులు బంధించారు. కోట బయటనున్న గజ తురగ పదాతిదళాలు నగరంలో గోదావరితీరంనుండి మెట్టవరకూ సంచరించుచు, అక్కడక్కడ ఉన్న సైన్యాలను బందీచేసి నగరం అంతా ఆక్రమించినవి. శాంతిశ్రీ మహారాణి వెంటనే మహాసభకుపోయి రాజప్రతినిధి సింహాసనం అధివసించింది.

## 6

**పూం**గీయ మహారాణి శాంతిశ్రీదేవి ప్రతిష్ఠానంలో స్థిరనివాసం పెట్టుకుంది. అక్కడనుండి ఇక్ష్వాకు శాంతిమాలుని పేర రాజ్యపాలన ప్రారంభించింది. ఆ చుట్టుప్రక్కలనున్న పర్వత నగరాలు అనేకం ఆమె పట్టుకొని లోబరచుకొన్నది. కొన్ని సైన్యాలతో ఇక్ష్వాకు శాంతిశ్రీ రాకుమారి నాసిక మహానగరం ఆక్రమించుకొన్నది. ఆమెతో తారానిక యశోదలున్నారు. మరికొన్ని సైన్యాలతో పూంగీయరాకుమారి శాంతిశ్రీయు, బాపిశ్రీయు వాతాపి నగరం పట్టుకొని అక్కడ నివాసం ఏర్పాటు చేసుకొన్నారు.

ఈ వార్తలు పులమావి వినగానే నిరుత్తరుడయిపోయినాడు. ఇక్ష్వాకు స్త్రీలు మగవీరులా! వీళ్లకు బుద్ధి చెప్పకపోతే నగరం తర్వాత నగరం లోబడిపోతున్నది. శాంతిమూలుడు దద్దమ్మయి ఆడవాళ్ళను పంపిస్తున్నాడా? అందుకే కాబోలు వెనక తనమీదకు ఆ పిచ్చిది శాంతిశ్రీ రాకుమారి ఎత్తి వచ్చింది. ఈ ఆలోచనలు మతి పోగొట్టినవి పులమావికి. అతనికి వెఱ్ఱికోపం వచ్చింది. మళ్ళీ జాగ్రత్తగా సిద్ధంచేసిన సైన్యం అంతటిని వెంటనే కదిలించాడు. జయభేరి వేయించి అతివేగంగా వెళ్ళదలచినాడు. ఈ యువతుల నందరిని కలిపి మానభంగం చేయాలనుకున్నాడు. కళ్ళలో ఎరుపుకాంతులు వేసవి సూర్యమండలాలులా వెలుగుతున్నవి. మహోర్మురులవల్ల సముద్రకల్లోలాలులా కనుబొమలు ముడులు పడిపోయినాయి.

నూతనాయుధాలు, నూతనయుద్ధవిధానాలు సమకూర్చుకున్నాడు. తానే సర్వసేనాధ్యక్షుడు. మహావేగంతో పులమావి కొండలుగడచి, నదులుదాటి, అడవులు సమంచేసి, మూడులక్షల మహాసైన్యంతో ఉప్పెన పొంగినట్లు, దావానలం విజృంభించినట్లు నాసికపై విరుచుకు పడినాడు. నాసిక వింధ్యపర్వత బాహువైన సహ్యపర్వతాలలో ఉంది. ఆ కొండలోయలన్నిటికడ దిట్టరులైన సైనికుల నుంచాడు. ఆ సైన్యాలన్నీ ఒకలక్ష బలగం, తాను నాసికను ముట్టడించింది ఒకలక్ష సైన్యంతో.

శాంతిశ్రీరాకుమారి పులమావి వస్తున్నాడని వినగానే చిరునవ్వు నవ్వుకొన్నది. ఆమెకు భయం కలుగులేదు. ఆమెలోని శిశుత్వం మాయమయింది. ఏదో ఆనందం పొడమినది. ఒక పౌరుని పిలిచి "స్వామీ! మీరు మా రాయబారిగా పులమావి దగ్గరకు పొండి. అహింస పరమవ్రతం మా కని అతనికి నా మాటగా తెల్పండి. 'హింసనే ఆరాధిస్తూ రాక్షసుడు కాదలచుకున్న తన్ను మా ధర్మమే నాశనం చేస్తుంది అని చెప్పండి" అని పంపినది.

అతడు 'ఇదేమి రాయబారమురా' అనుకొనుచు తిన్నగా పులమావి దగ్గరకుపోయి రాయబారమంతా విన్నవించాడు. వెనుక పులమావి ఓడినపుడు ఇటువంటి రాయబారమే.

అప్పుడు బ్రహ్మదత్త మహారాజు స్వయంగా వచ్చాడు ఇప్పుడీ శుంఠయెవడో వచ్చినాడు. వీళ్ళను ఆదరించక వెంటనే విషపు పురుగులను నాశనం చేయాలి అని యెంచి "ఓయీ సేనాపతీ! ఈవెట్టి వానిని స్కంధావారంమధ్య కోటలోని వారికి కనపడేటట్లు ఎత్తైన మంచెపై తలతెగవేయించు. కోటలోని వారికి నా ఆజ్ఞగా ఇట్లు తెల్పు."

"మీరు ఆడవాంఢ్రమాటలు వినక, కోటను మాకు ఒక జాములో స్వాధీనం చేయవలసినది. అలా చేయకపోతే ఈ నగరం యావత్తూ గోదావరిలో కలిపి, మగపురుగు లేకుండా హతమార్చి, ఆడవాళ్ళని మా సైనికులకు ఉంపుడు కత్తెలుగా ఇచ్చివేస్తాము. లేదా ఇక్ష్వాకు శాంతిశ్రీ ఒకర్తె మాకు ఈలోపల ఉంపుడుకత్తెగా రావలసినది. ఆమె రానని నిరాకరిస్తే నగరవాసులు ఆమెనుపట్టి పట్టి బందీగా అప్పగించవలసినది" అని ఆదేశించెను. ఈ ఆజ్ఞ కోటలోవారికి వినబడేటట్లు పులమావి మాగధులు వినిపించారు.

ఒక క్షణికం గడిచింది. రెండు క్షణికాలు గడచినవి. పదునైదు విఘటికలు గడచిపోయినవి. కోటగోడలనుండి ఒక తాడు నిచ్చెన క్రిందకి వాలింది. ఆ గోడలపైన ఎవరూ కనపడలేదుగాని ప్రతి లగ్గలపత్రం వెనుకా ధనుస్సు ఎక్కుపెట్టి వీరాంగనలు గరుడుని చూపులతో విరోధుల గమనిస్తూ గాలయినా పీల్చకుండా శిల్పాలులా ఉన్నారు. తాడు నిచ్చెనకడ ఒక యువతి తెల్లని దుస్తులు ధరించి సంపూర్ణభూషణ భూషితురాలై కనపడింది. ఆమె అతివేగంగా నిచ్చెననుండి కందకము వరకు దిగి, నీళ్ళలో ఉరికింది. ఆ నీళ్ళలో ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చింది. ఒడ్డుకు రాగానే ఒకసైనికు డామెకుచేయి అందిచ్చి లేవదీయబోయినాడు. వెంటనే ఒక నిశితమైన బాణం సువ్వున వచ్చి చాచిన ఆతని చేతిని దూసుకుపోయింది. ఆ భటుడు కెవ్వున కేక వేసెను కత్తులుదూసి పదిమంది భటులు ముందుకురకబోతే బాణాలు వచ్చి వారివక్షముల నాటుకున్నాయి. అందరూ ఆగిపోయారు. ఆ యువతి తోడనే గట్టెక్కి తడిబట్టలు తన దివ్య సౌందర్యమును ఇనుమడింప జేయగా, నడుమున కట్టుకొన్న మైనపుసంచి ముడి సడలించి అందులోనుండి ఒక శాలువ తీసి కప్పుకుంది.

"మీరంతా మా జాగరూకత చూచినారుకదా! నా జోలికి ఎవ్వరూ రాకండి. నేను చక్రవర్తి శాంతిమూల సార్వభౌముని తనయను. నాతో మాట్లాడి, నన్ను బందిగా పట్టుకు వెళ్ళదలచుకున్న పులమావి దగ్గరకు నాకు దారిచూపండి" అని కత్తి తళుకులవలె మాటలాడింది. మహాశరమును చూచిన వారివలె ఆమెను చూచిన వారు గజగజ లాడిపోయినారు. సేనాపతి ముందు దారి చూపుచుండగా శాంతిశ్రీరాకుమారి అదృష్ట దేవతలా, విధినిలాసములా, మహామంత్రములా, మహర్షి శాపములా అతని వెనుకనే నడిచి పోయింది. పులమావి గుడారములోకి వెళ్ళగానే రక్కసిమూకలా ఆడవాళ్ళు కొందరు ఆమె చేతులు గట్టిగా పట్టుకున్నారు. ఆమె నడుముచుట్టూ కత్తికట్టారు, బాకు ఉందేమో పరీక్షించినారు. పులమావి ఆమెవైపు రెప్పవాల్చకుండా చూస్తూ నిలుచుండినాడు.

## 7

"**దీ**న్ని నా శయ్యాగృహంలో చేతులూ, కాళ్ళూ కట్టివేసి నోట్లో గుడ్డలు కుక్కి దెసమొలగా ఉంచండి" అంటూ పులమావి పళ్లు బిగించి, కళ్ళ వెంట పైశాచికకాంక్షలు

కక్కుతూ ఆజ్ఞ ఇచ్చినాడు. శాంతిశ్రీని ఆ పైశాచికాంగనలు బరబరలోని గుడారములోనికి లాగికొనిపోయారు. ఆమె కన్నులు మూసికొని, వారేమి చేసినా మాట్లాడక ఊరకొన్నది. ఆ బాలిక వస్త్రాలన్నీ ఒలిచివేసినారు. స్వచ్ఛ హిమాలయ శిఖరంపై బంగారు కిరణాలు ప్రసరించినట్లున్న ఆమె దేహంలో చైతన్యమేలేదు. ఆ పైశాచికాంగనలు ఆ బాలికను మంచంపై వెల్లకిలా పరుండబెట్టి చేతులు తలవైపు రెండుకోళ్లకూ, కాళ్లను దిగువవైపు రెండు కోళ్లకూ కట్టివేసిరి.

ఆమె దివ్యసౌందర్యం పందులవంటి ఆ ఆడవాళ్లకు రాక్షసత్వాన్ని ఎక్కువ చేసింది. కొందరు స్త్రీ లామెను కసికొద్దీ గిల్లినారు. ఆ బాలిక కన్నులు మూసుకొనే ఉన్నది. మాటలేదు. ఆమె మోము నిర్మల నీలాకాశంలో పూర్ణ చంద్రబింబంలా ఉన్నది. ఆమె మోము ధవళకాంతి ప్రజ్వలిత హిమాలయశిఖరంలా ఉంది. ఆమెమోము వేదమంత్రంలా ఉన్నది, ఆమె మోము బుద్ధదేవ పవిత్ర హస్తతలంలా ఉన్నది. ఆ స్త్రీలు తమ పని నిర్వర్తించి వెళ్లిపోయారు. ఒకతెపోయి సార్వభౌముని ఆజ్ఞ నిర్వర్తించినామని మనవిచేసింది పులమావితో. పులమావి ద్రాక్షసారాయం సేవిస్తూ అభ్యంతరమందిరంలో తాను సాధించబోయే మహావిజయానికి తగిన బలం చేకూర్చుకొంటున్నాడు. అతని కళ్లు చింతనిప్పులులా ఉన్నాయి. మనుష్యమాంసం తినబోయే రాక్షసుని హృదయంలా అతని కామకాంక్ష వికటతాండవం చేస్తున్నది.

దొరికింది రాక్షసి! ఎక్కడకు పోతుంది? ఎవ్వరు అడ్డంరాగలరు, మహాశక్తిమంతుడైన పులమావిని అవమానించి ఎవరు బ్రతుకగలరు? అతడు ఒంటినిండ సువాసనద్రవ్యాలు పులుముకున్నాడు. దాసీలు అందిచ్చిన సువాసన తాంబూలం నమిలివేశాడు. పైనున్న ఉపవీతం అవతల గిరవాటు వేసినాడు - నడుముననున్న మణులుపొదిగిన పిడిగల బాకును తీసిదూరంగా నిసరివేసినాడు. రొమ్ము విరిచి ముందుకుచూచి, "ఒసే దాసీ! మేము అందంగా లేమటే?" అన్నాడు.

"మీరు లోకాద్భుత సుందరులండీ చక్రవర్తీ!"

"అయితే మమ్ము ఎందుకు ఆ రాక్షసి పెళ్లి చేసుకోనంటుంది?"

"అది వట్టి పిచ్చిదండి సార్వభౌమా!"

"ఛీ దుర్మార్గురాలా! ఇప్పుడు మేము గాంధర్వంగా వరించబోయే పడుచును పిచ్చిదంటావా?"

"శాంతిశ్రీ రాజకుమారి కాదండి పిచ్చిది, నేనండి" అంటూ వణికిపోయింది.

"నువ్వుకాదు మేము పిచ్చివారము. ఈ శాంతిశ్రీ అందంగా ఉంటుందా?"

"చిత్తం సార్వభౌమా!"

ఆ దాసీదాని భుజంమీద చేయివేసి, తూలుతూ "దారి చూపించు మాకు" అన్నాడు. ఆమె జాగ్రత్తగా పులమావిని ఆ నగ్నసుందరిని కట్టి ఉంచిన శిబిరం కడకు తీసుకొనిపోయింది. ఆ శిబిరం రెండుగదులుగా విభజింపబడియున్నది. ఆ శిబిరం పులమావి స్వయంగా నిద్రించే డేరా. ఆ డేరా పట్టుతోకుట్టి ముత్యాల అంచులతో, చిత్రములతో

అలరారుచున్నది. ఆ డేరాలోనికి పులమావి ప్రవేశించినాడు. తాను నిద్రించే ప్రదేశానికి తెర ఈవల నిలుచున్నాడు.

"నేను వస్తున్నాన్. నీ అందమైన దేహం నా స్పర్శతో ముడుచుకు పోతుందా?" అంటూ తెరలోనికి అడుగిడబోయి "ఆ! బుద్ధప్రభూ" అంటూ కుడిచేయి గుండెమీదవైచి నొక్కుకుంటూ తూలి విరుచుకుపడిపోయినాడు. దాసీది 'సార్వభౌమా! సార్వభౌమా' అంటూ క్రింది రత్నకంబళిమీద పడిపోయిన పులమావి దగ్గర కూర్చున్నది పులమావి కళ్లు తిరిగిపోతున్నాయి. నోట రక్తం వస్తున్నది. 'అయ్యో చక్రవర్తికి జబ్బు చేసిం' దంటూ పొలి కేకలు పెట్టింది. దాసీలెందరోపరుగిడి వచ్చారు. అక్కడేఉన్న ఒక పల్యంకంపై పులమావిని పండుకొనబెట్టిరి. వైద్యుడు పరుగునవచ్చి చూచాడు. పులమావి దేహంలో ప్రాణంలేదు. ఒకదాసి తెర ఒత్తిగించి పడకగది చూచింది. తల్పంపై నగ్నసుందరిలేదు.

## 8

"ఏమిటి నువ్వు శాంతిశ్రీవా?" అని పులమావి రాణి ఆ బాలికను అడిగింది.

"అవునమ్మా అవును. నన్ను నీ భర్త ఏమీ చేయలేదని సంపూర్ణ నమ్మకం. నన్ను పరమశ్రమణకుడు ఎప్పుడూ రక్షిస్తూనే ఉంటాడు."

ఎప్పుడు దాసీలు శాంతిశ్రీని నగ్నునుచేసి పల్యంకానికి కట్టిపోయినారో ఆ వెంటనే పులమావిరాణి ఆ శిబిరంలోకి చక్కావచ్చింది. ఆ బాలిక పాండ్యుల ఆడబడుచు. భర్త దుర్నీతి ఆమెను దహించి వేస్తున్నది. ఇక్ష్వాకు రాజులకు లోబడి రాజ్యం చేసుకోవలసిందని ఆమె భర్తకు వేయివిధాల చెప్పి చూచింది. కాని ఆ దుష్టబుద్ధి ఆమె ఆలోచన ఆవగింజంతైనా వినలేదు.

ఆ శ్వేతశ్రీదేవి శాంతిశ్రీ రాకుమారిని చూచి కన్నులనీరు తిరుగ ఆమె కట్లన్నీ విప్పి వేసి ఆమె సౌందర్యానికి తానే ఆశ్చర్యపడుచు తాను తెచ్చిన చీర కట్టి మేలిముసుగువైచి తన శిబిరంలోనికి తీసుకుపోయినది. ఇంతలో 'పులమావి మహావాతంచేసి పడిపోయినాడు' అని ఒక దాసీ పరుగున వచ్చి తెలిపినది.

రాణి "అయ్యో" అంటూ ఆ వెంటనే పరుగుపరుగున పులమావి శయన శిబిరానికి వచ్చి వాలింది. పులమావిపై వాలి అతడు విగతజీవుడైనాడని వెంటనే గ్రహించినది. "ఏమయ్య! ఏమిటిది?" అని వైద్యుని ప్రశ్నించినది. వైద్యుడు తలవాల్చినాడు. ఆమె "పరమశివా" అని విరుచుకు ఆ శవముమీదే పడిపోయింది. శాంతిశ్రీ రాకుమారి కదలక రెప్పవాల్చక అటులనే చూస్తూ నిలబడిపోయింది. అప్పుడు తృణావర్తంలా, సుడిగుండంలా, మండుతున్న కొరివిలా ఒక బాలిక ఆ గదిలోనికి పరుగెత్తుకొని వచ్చింది.

"నా ప్రభువు చనిపోయినాడా? ఈ రాక్షసి, ఈ తాచుబాము, విషపుకుండ నా మహారాజును చంపిందా? ఓసీ! రాక్షసీ నువ్వెందుకు దాపరించావే! మొదటినుండీ నీ కోసం మా చక్రవర్తి, మా జగదేకవీరుడు వెఱ్ఱివాడై పోయినాడు. ఓసి పిశాచీ, ఢాకినీ! నా చక్రవర్తిని పొట్టబెట్టుకున్నావా?" అంటూ మొలనుంచి బాకును సువ్వునలాగి శాంతిశ్రీపై బడింది. శాంతిశ్రీ మాటలాడలేదు. చిరునవ్వుతో అలాగున నిలుచున్నది. ఆ నూత్న

బాలిక శాంతిశ్రీపై ఉరకడంతోడనే గర్భగుర్విణి అయిన మహారాణి భర్త శవంపైనుండి చటుక్కునలేచి, 'ఆగు' అని అరచింది. ఆమె కన్నుల నీరు కారిపోతున్నది. ఆమె గజగజ వణికిపోతున్నది.

"ఆగు" అన్న మాటకు ఆ బాలిక ఆగిపోయినది.

"ఎవరు నువ్వు?"

"నేను మహారాజునకు నూత్నరాజ్ఞిని."

"చెల్లీ! మనకర్మవల్ల సంభవించిన ఈ విపత్తుకు శాంతిపుంజమైన శాంతిశ్రీ రాకుమారి కారణమా? నువ్వు వెళ్ళు రాకుమారీ! మమ్ము మా దుఃఖం దహించి వేయనీ" అని పలికి నెమ్మదిగాలేచి ఆ కొత్తబాలిక దగ్గరకుపోయి "చెల్లీ రా. మనం భక్తితో సహగమనంచేసే సన్నాహాలు చేసుకోవాలి" అన్నది.

శాంతిశ్రీ ఒక్క ఉరుకున మహారాణి కడకువాలి "మహారాణీ! నువ్వు నిండు చూలాలివి. సహగమనచితాగ్ని ఎలా అధివసించగలవు? అది దోషం. నువ్వు శిశుహత్యా దోషానికి పాలుబడతావా?" అని అడిగింది. మహారాణి తెల్లబోయి ఆగిపోయింది. "మహారాణి! నీకు పుట్టుబోయే కుమారుని దుర్విధివిపాకాన కాల్చివేస్తావా? నీ భర్తకూ నీకూ గతులువద్దా?" అంటూ శాంతిశ్రీ నిశ్చల లోచనాంచలాల అశ్రుబిందువులు దొరగగా ప్రశ్నించింది.

వైద్యుడు "మహారాణీ! శాంతిశ్రీ మహారాజకుమారి మనవి పాటించండి. ఈ గర్భస్థ శిశువును నాశనం చేయడానికి మీకు ఏమి అధికారం ఉంది?" అని మనవి చేసినాడు. ఇంతలో గుమ్మం దగ్గరనుండి "మహారాణీ! పులమవి మహారాజు సింహాసనానికి కూడా ధాన్యకటక సింహాసనం గతిపట్టించకు" అని గంభీర వాక్యాలు వినబడేసరికి అందరు సంభ్రమాన గుమ్మంవైపు తలఎత్తి చూచినారు. గుమ్మందగ్గర దివ్యకాంతితో తేజరిల్లుతూ బ్రహ్మదత్తప్రభువు నిలిచి ఉన్నారు. శాంతిశ్రీ "గురుదేవా! మీరెప్పుడు వచ్చినారు" అని అడిగి ఆయన పాదాల వాలినది. బ్రహ్మదత్తుని వెనుకనుండి "మహారాణీ! ధర్మానికి బద్ధురాలవై కుమారుని ధర్మస్వరూపునిగా పెంచటం మీ కర్తవ్యం. రాజధర్మాన్ని ఉల్లంఘించకండి" అని శాంతిమూల మహారాజు ముందుకు వచ్చారు. మహారాణి తలవంచుకొని 'అలాగే' మౌనాంగీకార సూచకంగా శాంతిమూలునికి ప్రత్యుత్తర మిచ్చింది.

★ ★ ★

ఏకాదశ భాగం

## నాగార్జున పర్వతం

# శాంతిమూల చక్రవర్తి

ఇక్ష్వాకు శాంతిమూలుడు ధాన్యకటకంలో ఆలోచనాపరుడై యుండగా నాగార్జునదేవుని కడనుండి "కుమారా! నీవే చక్రవర్తిని కావాలి. నేను స్వయంగా మిమ్ము పట్టాభిషిక్తులచేసి సిద్ధలోకానికి వెళ్ళిపోతున్నాను.

*"బుద్ధం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి*
*ధర్మం శరణం గచ్ఛామి*
*- నాగార్జున"*

అని కదంబపత్ర విరచితమైన శ్రీముఖం వచ్చింది. వెంటనే శాంతిమూలుని మోము విప్పారినది. సర్వసైన్యాలకు తాను అధ్యక్షుడయి మహావేగంతో ప్రతిష్ఠానం బయలుదేరినాడు. చవుకరాయనిక ప్రభువును, బృహత్పాలాయనప్రభును ముసికనగరంపైకి పంపినాడు. సాలంకాయనప్రభువును మాళవం పంపినాడు. అతివేగంతో ప్రతిష్ఠానం వచ్చి చెల్లెలి స్త్రీ సైన్యాలను వెంటబెట్టుకొని పూంగీయప్రభువును ప్రతిష్ఠానంలోఉంచి, నాసిక చేరుకునే సరికి పులమావి అంతకుముందే ప్రాణం వదిలినాడని తెలిసినది.

పులమావికి మహావైభవంగా భవంగా అంత్యక్రియాలు జరిపి, నిండుసభలో పులమావి చక్రవర్తిగా నిర్యాణమందినాడని ప్రకటించినాడు. పులమావి రాణిని సంరక్షింపుమని చెల్లెలికి అప్పగించినాడు. నాసికనుండి కొమరితను చెల్లెలిని వీరాంగనాసైన్యాన్ని తిరిగి విజయపురం పంపినాడు. అక్కడ నుండి సర్వసైన్యాలతో కూడుకొని భరుకచ్ఛమూల మాళవ, మగధ, విదేహ, కోసల, వంగ, కళింగ విజయ యాత్ర సలిపి విజయపురం చేరెను.

ఒక శుభముహూర్తాన శ్రీనాగార్జునదేవుల పాదసమీపాన సర్వశుద్ధుల నంది శాంతిమూలుడు ఆ దివ్యమూర్తికి సాష్టాంగపడినాడు.

శుద్ధసత్వమూర్తియై ఆ పరమఅర్హతుడు చిరునవ్వుతో "నాయనా! నాతల్లి ఆంధ్రి. నేను విశ్వామిత్ర గోత్రుడను. సర్వవేదాలను మూర్తించు కొన్న గాయత్రిని కనుగొన్న వంశం మాది. ఏనాడు ఏ సాంప్రదాయం చెడిపోయినా ఆ సంప్రదాయానికి నూత్నజీవం పోసేందుకు ఉద్భవించిన వంశంమాది. సర్వశాస్త్రసమన్వయం, సర్వధర్మ సమన్వయం, సర్వసంప్రదాయ సమన్వయం లోకానికి అవసరమయిన దిప్పుడు. అర్షధర్మం సమన్వయించినాను. భౌతిక సత్యం ఆధ్యాత్మికసత్యంలోనిదే అని రసవాదంవల్ల

నిరూపించినాను. కుమారా! నీ వంశము చాలాకాలం ఆంధ్రదేశాన్ని ఏలబోదు. కాని లోకోద్ధరణ చేయడంలో తనపాత్ర తాను నిర్వహించి సర్వాంధ్రంలో కలిసి పోతుంది. మీ వంశీకుడే ఒక మహాపురుషుడు కాకతీ భక్తుడు ముందు ఉద్భవించి సామ్రాజ్యం స్థాపిస్తాడు. నేను కొద్దిదినాలలో నీకు పట్టాభిషేకం చేసి హిమాలయాభిముఖుడనయి వెళ్ళిపోతాను. బుద్ధంశరణం గచ్ఛామి” అని తెలిపినాడు.

నాగార్జునదేవుడే ఒక దివ్యమూర్తంముంచి తాను అపర శైలాశ్రమమునుంచి దిగివచ్చి, సర్వరాజన్య సర్వ అర్హతాచార్య సర్వమహాపండిత ఋషి, కాపాలిక మహాప్రజా సమక్షంలో శాంతిమూలుని సర్వభూమండలానికి సార్వభౌమునిగా అభిషేకం చేసినాడు. కుసుమలతా సారసికాదేవులు ఇద్దరూ చెరి ఒక వైపున మహారాణులయి అధివసించినారు.

పాండ్యులు, చోళులు, కేరళులు, నాగులు, ఆభీరులు, మాళవులు, కోసలులు, వైదేహులు, వాసిష్ఠులు, మాఠరులు, చాళుక్యలు, సాలంకాయనులు, బృహత్పాలాయనులు, గాంగులు, మాగధులు, నేపాళులు మొదలగు మహారాజులు, రాజప్రతినిధులూ సార్వభౌమ పట్టాభిషేకానికి వేంచెసినారు.

ఉత్సవాలు దివ్యంగా జరిగినాయి. శాంతిమూలుడు సార్వభౌముడు కాగానే వీరపురుషదత్త మహాప్రభువును బాసటగా ఇచ్చి అశ్వమును వదిలినాడు. ఆ అశ్వమును ఎవ్వరును పట్టుటకు సాహసించలేదు. వీరపురుషదత్తుడు లక్ష్మణునివలె, అర్జునునివలె సర్వదేశాలు దిగ్విజయంచేసి అశ్వాన్ని నడిపించుకొని వచ్చినాడు. వీరపురుసదత్త పార్థునకు బ్రహ్మదత్త కృష్ణుడు సారథి యాయెను.

వీరపురుషదత్తునకు బ్రహ్మదత్త దనకప్రభువు, భగవద్గీతయు, బ్రహ్మసూత్రాలు పాఠముచెప్పి వ్యాఖ్యానించినాడు. వీరపురుషదత్తుడు విజయపుర అశ్వముతో చేరగానే బ్రహ్మదత్తుని పాదాలకెరిగి “ప్రభూ! నేను తరించాను నాజన్మ పావనమయినది. కాని తన వ్యాఖ్యానంతో అద్వయమయిన సత్యం నాకు గోచరించింది. బౌద్ధగురువులయిన అర్హతాచార్యుల బోధకిప్పుడు సమసన్వయం కుదురుతున్నది” అని మనవి చేసికొన్నాడు. బ్రహ్మదత్తుని గీతావ్యాఖ్యానం బ్రహ్మదత్త భాష్యమని లోకంలో ప్రసిద్ధి వడసినది.

## 2

**అ**నేక అగ్నిష్టోమాది క్రతువులొనరించిన శాంతిమూలుడు వాజపేయమూ, అశ్వమేధ క్రతువుల నొనర్చినాడు. బ్రాహ్మణులకు అనేకాగ్రహారాలు, మహాదానాలూ, హిరణ్యకోటులు, గోసహస్రాలు, హయసహస్రాలు అర్పించినాడు. ఈ క్రతువులు కాగానే అర్షసంప్రదాయంగా సర్వభూచక్రానికి శాంతమూలుని చక్రవర్తిగా అభిషేకించినారు. బ్రహ్మదత్తప్రభువు తండ్రి, విజ్ఞానశ్రీ దేవదత్త మహర్షి వసిష్ఠులై అశ్వమేధ వాజపేయాదులు జరిపించి శాంతిమూలుని చక్రవర్తిగా అభిషేకించినారు.

మహారాజు యువరాజుగా, విజయపుర మహారాజుగా వీరపురుషదత్తుని అభిషేకం చేసేముందు వాసిష్ఠీ భట్టిదేవి నిచ్చి విజయపురంలో ఆఖండ వైభవంగా వివాహం చేసినారు. వారిరువురకూ యౌవరాజ్య పట్టాభిషేకం జరిగింది. మహోత్సవాలు జరుగుతున్నాయి. బ్రహ్మదేత్తుడు ఆ ఉత్సవాలలో సంపూర్ణంగా నిమగ్నుడై ఉన్నాడు.

ఆ ఉత్సవాలలో ఒకనాడు సాయంకాలం తారానిక రథమెక్కి బ్రహ్మదత్తప్రభువు మహాభవనానికి వచ్చి ప్రభువు దర్శనం కోరింది. ఆ ధనకప్రభవు అప్పుడే స్నానంచేసి వచ్చి తన విద్యామందిరంలో పీఠం అధివసించి యుండెను. తారానిక వచ్చి సాష్టాంగపడి "మహాప్రభూ! తాము వెంటనే అంతఃపురానికి రావలసిందని మహారాజకుమారి నన్ను పంపింది" అని మనవి చేసినది.

"ఎప్పుడు?"

"వెంటనే ప్రభు!"

"నేను జపం చేసుకోవలసి ఉంది."

"మా భర్త్రుదారిక ఇలా అన్నారండి. 'మా దేశికులు జపానికి పోయే వేళ అయినా వారిని వెంటనే కొనిరా' అని"

"సరే వస్తాను. నీవు పో!"

తారానిక వెళ్ళిపోయింది. బ్రహ్మదత్తుడు 'ఏమి పుట్టి మునిగినదో' అని సందేహించుచు తల్లికి నమస్కరించి ఆశీర్వాదమంది ఆమె మోమున వెలిగిన చిరునవ్వున కర్థమేమా అని ఆలోచిస్తూ రథమెక్కినాడు.

## 3

**ధ**నకప్రభువు మహావేగంతో మహారాజకుమారి భవనానికి వెడలినాడు. ఆ రథంవెంట తారానిక రథం ఉన్నది. రెండు రథాలూ లోనిప్రాంగణాలకు వెళ్ళిపోయినవి. మహాభవనము ఎదుట ఆగినవి. స్కందవిశాఖప్రభవు నెమ్మదిగి తారినిక దారి చూపగా లోనికి వెడలినాడు. సభాభవనాలు దాటి విద్యా మందిరంలోనికి ఆ మహాసామంతుని కొనిపోయినది. లోన నిశ్చలంగా శాంతిశ్రీ నిలిచి ఉన్నది. ఆమె ఎదుట బ్రహ్మదత్తప్రభువు చిత్రము లిఖించిన ఫలకము కుడ్యమును అలంకరించి ఉన్నది.

బ్రహ్మదత్తుడు రాగానే శాంతిశ్రీ పరుగున వచ్చి ఆ ప్రభునిపాదాల వాలినది. ఆ ప్రభువు చిరునవ్వుతో "మహారాజకుమారీ! నీకు సర్వవిద్యలూ కరతలామలకములగుగాక" యని ఆశీర్వదించెను. తారానిక వచ్చి రాజకుమారిని లేవనెత్తి "మహారాజా! తాము సింహాసనముపై అధివసించండి. మాభర్త్రుదారిక ఈ ఆసనం అధివసిస్తారు" అని పలికినది. బ్రహ్మదత్తుడు ఒక ఆసనం అధివసించినాడు. రాజకుమార్తై ఇంకో ఆసనం అధివసించింది.

"రాజకుమారీ! ఎందుకు నన్ను రప్పించింది?"

రాజకుమారి మౌనం వహించింది.

"నీ హృదయంలో ఉన్నది దేశికులకడ చెప్పవచ్చుకాదా?"

రాకుమారి నేలచూస్తూ నిలబడింది.

"ప్రభూ! నేను భిక్షురాలినికా మీ అనుమతి నీయ ప్రార్థిస్తున్నాను."

"భిక్షుకురాలా?"

అవునని రాకుమారి తలవంచే ఊపినది.

"తప్పక కావచ్చును. కాని...."

"ఆజ్ఞ ఇవ్వవచ్చునుగాదా?"

"ఇవ్వవచ్చును, సమయము వచ్చినప్పుడు,'

ఇప్పుడు ఎందుకు ఇవ్వకూడదు?"

"మీ తండ్రిగారు దగ్గిర ఉండగా గురువులు ఈయకూడదు. పెళ్ళి అయిన స్త్రీకి అనుమతి ఈయవలసింది భర్త. విధవ అయితే కుమారుడు. ఎవరూ లేకపోతే గురువు. పెళ్ళికాని బాలికలకు తండ్రి. తండ్రి తరువాత తల్లి. వీరుకాక ఇంకొకరు కన్యకు అనుమతి ఈయకూడదు."

శాంతిశ్రీ మౌనం వహించింది. ఆమె దేశికులు సన్యాసానికి ఆజ్ఞ ఇస్తారు అనుకొన్నది. కాని ధర్మశాస్త్రప్రకారం అలా దేశికులు పనికిరాదని అంటారని ఆమె ఏ మాత్రమూ అనుకోలేదు. ఆ రాజపుత్రి ఇంచుక తడవు నిర్వికారయై నిలిచినది. పొడముచున్న కన్నీటిని రెప్పలతో అప్పళించినది. వెనుదిరిగి ఏగబోయి ఆగినది. ముందునకూగి వెనుకడుగు వై చినది. తటాలున బ్రహ్మదత్తుని పాదాలవాలి "మీరు నాకు దేశికులుకాదు, భగవంతులు. నేను నాకు తెలియక మిమ్ము ప్రేమించాను. శూన్యమయిన ఏదోలోకంలో చైతన్యంకాని చైతన్యంలో తిరుగుచుంటిని. చదివిన విద్య ఒక విధంగా అగ్రాహ్యమై ఉండేది. ఇంతలో మీరు నాకు దేశికులయినప్పటినుండీ ఏదో నాలో నూతనచైతన్యం అంకురించి, క్రమంగా నా జీవితం అంతా నిండి పోయింది. ప్రభూ! తాము నన్ను వనదేవతగా ఎన్నుకొంటిరి. ఎన్ను కొన్నందుకు ప్రథమంలో విపరీతానందం, వెంటనే తీరని వ్యథ అరంభించినవి అంతకుమున్ను అట్టి అనుభవాలు ఎరుగను. ఈ బాధలూ, ఈ సంతోషాలూ ఏమిటని ఆశ్చర్యపొందినాను. చికాకుపడినాను, ఏడ్చినాను, గంతులు వేసినాను మీరు కనబడక మనలేకపోతిని. మీరు నన్ను ప్రేమిస్తున్నారేమో అని ఆనందమందాను, బాధపడినాను. ప్రేమించుటలేదని నిశ్చయించి దుఃఖించినాను. మీరు సముద్రంలో మునిగిపోయినారన్న వార్తనా జన్మను మూలవంతటా కదిలించివేసింది. ఒకనాడు నేను జైనులవలె నా దేహం నాశనం చేసుకుందామనిపించినది.

"ఇంతలో మీరు తిరిగివచ్చినారని తెలిసి నాలో ఉద్భవించిన ఆనందము వర్ణనాతీతము. ప్రభూ! మీరు బందీ అయినారని విని క్రుంగి పోయాను. ఇంతలో నన్ను మించిన కోపం ఆవహించి పులనూవిని నాశనం చేయ సమకట్టినాను.

"దివ్యమూర్తీ! నేను మిమ్ము సంపూర్ణంగా ప్రేమిస్తున్నాను. మీ పరిచర్యకుగాని ఈ బ్రతుకు ఇసుమంతయినా అవసరంలేదు. మీరు వేదాంతము నాకు బోధించినారు. లోకమంతా పరిత్యజించి సన్యాసులయి వెడలిపోతారని భయమావహించి మీకన్న ముందుగానే దీక్ష పుచ్చుకోవాలని నిశ్చయించాను. ప్రభూ! ఈ నా ప్రేమ అవధిరహితం. సర్వదివ్యభావాలనూ అధిగమించి పోయినది. సర్వధర్మాలను దాటిపోయింది. మీరు నన్ను భార్యగానన్నా స్వీకరించండి. లేదా నాకు భిక్షుణి ధర్మదీక్షకు అనుమతి నివ్వండి. ఇదంతా నాయనగారికి మనవి చేసి వారి అనుమతిమీద మీకు నివేదించాను" అని మాటలంతకన్న అంతకన్న అస్పష్టమైపోగా మనవి చేసి కనులనీరు దొరలిపోగా, ఆ ధనకప్రభువు పాదాల వాలిపోయినది.

ధనకప్రభువు ఆశ్చర్యమందినాడు. ఆనందముచే అతని మోము ఉదయారుణకాంతి రంజిత హిమాచలశృంగంలా వెలిగిపోయినది. ఆతడును ఆమె కడ మోకరిల్లి "దేవీ! నేను నిన్నింత చిన్ననాటినుండి ప్రేమించినాను. చిరుబాలికవైన దినాలలో నిన్ను ఏకాంతాన పూజించుకొంటిని. నీవు నా హృదయస్థదేవీమూర్తివి.

"నీవు ఈ లోకంతోపాటుకాక శాపవశంచే నరజన్మ తాల్చిన దేవతవలె నుంటివి. నీ కరగ్రహణము చేయలేని, నీ సాన్నిధ్యం పొందలేని నేను భక్తుడుగా జీవితం గడుపు దామనుకొన్నాను. దేవీ! ఇంతలో నీకు గురువైనాను. నేను నా సర్వస్వముతో ప్రేమిస్తూ- నీ సాన్నిధ్యవరానికే పరమేశ్వరునికి హృదయంలో సకమాలింగిత భూతలుణ్ణి అవుతూ - ఆ మహదానందంతో నీకు పాఠాలు చెప్పినాను.

"దేవీ! నీవు నన్ను ప్రేమిస్తున్నావన్న నిశ్చయమూ కలిగింది. లేదేమోనన్న భయమూ కలిగేది. నా జీవితేశ్వరివి... నా ఆరాధ్యదేవతవు! నాకు ఈ దినం అతి పవిత్రం!"

## 4

**శాం**తిశ్రీ కన్నుల నీరు తిరిగిపోయినది, ఆమె ఆనందంతో ఉప్పొంగినది. కన్నులనీటిలో తళతళ మందహాస కాంతులు ప్రసరించినవి. ఇరువురును ఒకరి కన్నుల నొకరుచూస్తూ, ఒకరిచేతులు నొకరు పట్టుకొనిలేచినారు. "ప్రభూ!" అని శాంతిశ్రీ "దేవీ!" అని బ్రహ్మదత్తుడు! ఆ పైన వారికి మాటలు లేవు. అయస్కాంతాకర్షణచేవలె ఒకరికొకరు దగ్గరకు మరియు దగ్గరకు వచ్చినారు. మరునిమేషాన శాంతిశ్రీ బ్రహ్మదత్తుని కౌగిలింతలో గాఢంగ ఇమిడిపోయింది. ఆ పరమసుందరి అతని పెదవులకు పరిమళామృత పూర్ణాధరోష్ఠము అందిచ్చినది. అతడు సర్వసృష్టిని మరచి ఆ పెదవి నాఘ్రాణించినాడు. ఆ బాలికను సువ్వున ఎత్తుకొనిపోయి, బ్రహ్మదత్తుడు అక్కడనే ఉన్న ఒకపీఠం అధివసించి ఆమెను ఒడిలో కూర్చుండబెట్టుకొని ఆమె చిబుకము, కపోలాలు, ఫాలము స్పృశించినాడు.

"ఇంతటి ప్రేమ నీలో దాచుకొని, రత్నగర్భలా ఏమీ తెలియని దానిలా ఉంటివేమి దేవీ!"

"మీరు మాత్రం గాఢప్రణయమూర్తులై ఉండిన్నీ, అమృతాన్ని తనలో దాచుకొన్న సముద్రంలా ఎంత గంభీరంగా ఉన్నారు, ప్రభూ!"

"శిష్యురాలు గురువునకు మాటకు మాట ప్రతిచెప్పవచ్చునా?"

"చెప్పకపోతే చదువు చదువనేరనిదాన నవుతానుకదా?"

వారు తమ కౌగిలి విడిపోయి ఒకరిచేయి ఒకరు అందిపుచ్చుకొని తిన్నగా నడిచి మందిరాలు దాటి చక్రవర్తి హర్మ్యాలలోనికి దారిపట్టినారు. దారి పొడుగునా దాసదాసీజనము, కంచుకులు, ద్వారపాలకులు అందరూ ఆనందమయులై నడిచిపోయే యువతీయువకుల్ని చూచి, వంగి నమస్కరిస్తూ ఆనందాశ్చర్యాలక లోనవుతూ "అమ్మయ్యా! ఎంతటి ఆనందం కనుల బడింది!" అని ఒకరి కొకరు సైగలు చేసుకుంటున్నారు.

ఈ యువద్వయం అలా తిన్నగా చక్రవర్తి మందిరాని కరిగిరి. వారిని గాంచి ద్వారపాలకుడు లోనికరిగి, సాష్టాంగముగా నమస్కరించి, లేచి చేతులు కట్టుకొని

"మహాప్రభూ! బ్రహ్మదత్తప్రభువు, భర్మదారికా చేయి చేయి పట్టుకొని మహాప్రభువుల దర్శనార్థము వస్తున్నారు" అని మనవి చేసినాడు.

శాంతిమూలుని హృదయం ఒక్కలిప్త గతితప్పింది. చెంత గ్రంథ పఠనం చేస్తున్న పండితుని "ఉండండి స్వామీ" అని నిలిపి, పీఠంనుండి లేచినాడు. ఆయన మోమంతా ఆనందంతో వెలిగిపోగా గంభీరంగా నడుస్తూ ఆ మందిర కవాటం దగ్గరకు వచ్చేసరికి అప్పుడే బ్రహ్మదత్తుడూ శాంతిశ్రీయున్నూ వచ్చినారు.

చక్రవర్తి ఎదురుపడగనే వార్కొక్షణికం చకితులై "జయము జయము మహాప్రభువులకు" అని మోకరిల్లినారు. "దీర్ఘాయుష్మాన్‌భవ! సత్వర వివాహప్రాప్తిరస్తు బహుసంతాన ప్రాప్తిరస్తు!" అని చక్రవర్తి ఆశీర్వదించినారు. ఆ వెంటనే వారిరువురను లేవదీసి చెరియొక ప్రక్క అక్కునచేర్చి, "శాంతీ! ఈనాటికి నాకు నువ్వు ఆనందం సమకూర్చినావు తల్లీ!" అన్నారు. "బ్రహ్మదత్తప్రభు! ఈ నాతల్లిని, నీ బ్రహ్మవిద్యలా కాపాడుకో నాయనా!" అని చక్రవర్తి కొమరిత చేయిని బ్రహ్మదత్తుని చేతిలో పెట్టినారు.

ఆ సాంఖ్యాయనస గోత్రజుడు, భరద్వాజుడు ధనకప్రభువు హారీత గోత్రజ మాఠరీపుత్ర శాంతిశ్రీకుమారి చేయి పట్టుకొని పట్టమహిషి అంతఃపురంలోనికి పోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో వీరపురుషదత్తుడు పూంగీయ శాంతిశ్రీయు అచ్చటికి చేయిచేయి పట్టుకుని వచ్చినారు. చక్రవర్తి ఆశ్చర్యంతో లోనికిపోయేవారు పోక అట్లే నిలిచిపోయినారు. ధనక ప్రభువు, శాంతిశ్రీయు నిలిచిపోయినారు. వారిరువురూ చక్రవర్తి పాదాలకడ మోకరించినారు. పూంగీయ శాంతశ్రీ "మామయ్యగారూ! మీరు మా వివాహం జరుప నా చిన్నతంలోనే మాట ఇచ్చారు. బావగారికి పట్టమహిషి వచ్చింది. ఇంక మా వివాహానికి అభ్యంతర మేమిటి? నేను బావగారిని విడచియుండలేను" అని తలవంచుకొని నిర్భయంగా చెప్పినది. "సౌభాగ్యవతివై వర్ధిల్లు తల్లీ! ఈ శాంతికికూడా వివాహం నిశ్చయమైంది. మీరూ మహారాణుల ఆశీర్వాదం పొందండి" అని చెప్పి ఆనందంతో వారి తలలపై చేయినిడి, మోకరించిన ఆ యువతీ యువకులను పైకి లేవదీసినారు.

## 5

**నా**గార్జునదేవుడు శాంతిమూల సార్వభౌమునికి పట్టాభిషేకం చేసి మరల కొండమీద తన ఆశ్రమానికి వెళ్ళిపోయినారు.

ఆ మహర్షి శాంతిమూలునికీ బ్రహ్మదత్తునికీ ఇక్ష్వాకు రాజకుమారి శాంతిశ్రీకీ, మహాసామంతులకు, సేనాపతులకు, అర్హతులకు, ఆచార్యులకు, దేవదత్తాది ఋషులకూ నూరుమందికి తన యాశ్రమమునకు రావలసిందని ఆహ్వానము లంపెను.

నాగార్జున దేవుడుంచిన ముహూర్తమునకు ఆహ్వానితులందరు కొండ ఎక్కి స్నానాదికాలు చేసి భిక్కులందిచ్చిన శుభ్రవస్త్రాలు ధరించి మహర్షి మందిరంలోనికి పోయి సాష్టాంగ నమస్కృతు లాచరించి, వారి అనుజ్ఞను ఉచితాసనాలపై అధివసించినారు.

"మీకందరికీ నా ఆశీర్వాదాలు. నేను ఈ దేహం చాలిస్తున్నాను. శాంతిమూల చక్రవర్తీ! నేను భూలోకంలో చేయవలసివచ్చిన కార్యాలన్నీ చేశాను. ఇంక సిద్ధలోకం వెళ్ళవలసిన శుభమూహూర్తం వచ్చింది. ఈ ఆశ్రమాదులు చైత్యాలు అభివృద్ధిపొంది

మళ్ళీ దేశంలో బౌద్ధ సంప్రదాయం విజృంభిస్తుంది. పిమ్మట నెమ్మది నెమ్మదిగా ఆర్షధర్మంలో కలిసి దానికి నూతన జీవంపోస్తుంది. శాంతిమూల ప్రభూ! నీ కొమరితను నేను పెట్టిన ముహూర్తాన అడవి స్కంద విశాఖాయన బ్రహ్మదత్త ధనకప్రభువునకు ఇచ్చి వివాహం చేయండి. ఈ బాలిక బౌద్ధధర్మానికి చేసేసేవ శాశ్వతమౌతుంది. దేవదత్త మహర్షీ! నీ కొమరుని భాష్యగ్రంథాలు లోకానికి ఆర్షధర్మాన్ని తెలియజెప్పే వెలుగులవుతవి. నాకు మీరందరు ఇక అనుజ్ఞ ఇప్పించండి. త్రిరత్నములు మిమ్ము కాపాడుగాక" అంటూ దివ్యగంభీర స్వరాలతో పలికినారు.

అనేకులకు కన్నులనీరు తిరిగినది. అందరు మహర్షికి తుదిమారు మ్రొక్కి సంభ్రమాశ్చర్యములతో ఆ మందిరం వీడి వచ్చినారు.

ఇదివరకే భిక్షులు, అర్హతులు, ఆచార్యులు ఆ దేవునికడ ఆశీర్వాదాలు పొందినారు. భిక్షుకులు నిర్వికారభావంతో ఆ మందిరానికి కవాటాలు బిగించినారు. మందిరం చుట్టూ ధూపములు వెలిగించినారు. వేయి ఆవునేతి దీపాలు వెలిగిపోతున్నవి.

*"ఓం మణి పద్మిహం. బుద్ధం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి"*

అని భిక్షులు కోటితుమ్మెదల ఝూంకారముతో పాడజొచ్చిరి. కొంతసేపటికి తలుపులు తెరచినారు. ఆ మందిరంలో ఏదో పరమశాంతి పాల సముద్రం వలె ప్రవహించి ఉన్నది. ఒక పరమపవిత్ర కాంతిన్ని నాగార్జునదేవుని పీఠముమీద వెలుగుతున్నది. నాగార్జునదేవులు లేరు. లోనికి వచ్చిన శాంతిమూల చక్రవర్తి మొదలగువారికి భక్తిభావము ముసురుకు వచ్చింది. వారందరా పీఠానికి సాష్టాంగమై నాగార్జునావతారాన్ని హృదయంలో కొలిచినారు.

మూడు దినాలకు నాగార్జునదేవుడు బుద్ధగయలో ప్రత్యక్షమై బౌద్ధ దేవాలయంలో మూడు దినాలున్నారన్నారు. ఆ వెనుక మూడుదినాలకు ఆ భగవంతుడు మృగవనంలో, ఆ వెనుక వేణువనంలో, ఆ వెనుక లుంబినీ వనంలో ప్రత్యక్షమై మూడేసి దినాలున్నారట. నాగార్జునదేవుడు పెట్టిన శుభముహూర్తంలో ఇక్ష్వాకు శాంతిశ్రీ రాజకుమారికకు ధనకస్కంద విశాఖా యనక ప్రభువునకూ వివాహం అయినది. ఆ సాయంకాలమే పూంగీయ యనక ప్రభువునకూ వివాహం అయినది. ఆ సాయంకాలమే పూంగీయ శాంతశ్రీ రాకుమారికీ మాఠరీపుత్ర వీరపురుషదత్త యువమహారాజుకూ వివాహమైనది. ఇక్ష్వాకు శాంతిశ్రీ 'అడవి శాంతిశ్రీ' అని బిరుదము వహించింది. స్కందవిశాఖ శాంతిశ్రీ దంపతులు ఇరువురు మహాతలవరులు, మహాదండనాయకులు మహాసేనాధికారులు, మహాసామంతులయ్యారు. యువరాజుకు పూంగీయ శాంతిశ్రీ రెండవ యువరాణి అయినది.

తాను చక్రవర్తికాగానే ఇక్ష్వాకు శాంతిమూల మహారాజు చూటశాత కర్ణులను, ముసికదేశ శాతవాహనులను ప్రతిష్ఠానపతులను పూర్తిగా లోబరచుకొనినాడు. మహారాజ్యమంతా రాష్ట్రములూ ఆహారములుగా విభజంపబడినది. ఆహారపతులను అమాత్యపతులనేవారు. మహాతారకుడు చక్రవర్తి కడనుండే ముఖ్యోద్యోగి. మహామాత్యుని తరువాతివాడు. అతని వెనుక మహాఅధ్యక్షుడు, మతధర్మాధికారులు, ఆ వెనుక భాండాగారికుడు చక్రవర్తి సర్వసంపదలు చూచేవాడు. హిరణ్యకుడు ధనకోశాధిపతి,

బుద్ధభిక్షుక చైత్యవిహార సంఘాధిపతి, మహామంత్రులు, నిబందకారుడు శాసనాలు, భూమి అమ్మకాలు, వర్తకంలో వస్తువుల అమ్మకాలు మొదలయినవి చూచేవాడు. చక్రవర్తి ఆజ్ఞలను ప్రతీహారులు కొనిపోయి ఆయా అధిపతులకు అందిస్తూ ఉండేవారు.

రాజ్యంలో బ్రాహ్మణులు, క్షత్రియబ్రాహ్మణులు అను కులాల వారుండేవారు. రాజ్యాలు పాలించే బ్రాహ్మణులు క్షత్రియ బ్రాహ్మణులు. వారికింకా బ్రాహ్మణత్వం పోలేదు. అలా బ్రాహ్మణత్వం పోగొట్టుకున్న వారు పూర్తిగా క్షత్రియులై పోయేవారు. వీరు, హాలికులని, మూర్ఖకులని, గోపాలురని మూడు కులాలుగా ఉండేవారు. కుమ్మరులు, చాకళ్ళు మొదలయినరు శూద్రులు.

శాంతిమూల చక్రవర్తి పరిపాలన ప్రారంభించడమేమి సర్వదక్షిణాపథ మందూ నిమ్మకు నీరుపోసినట్లు అద్భుతమైన శాంతి అవతరించింది. సర్వధర్మాల వారూ అడ్డంకులులేక ఆనందంతో నిజధర్మమందు మెలగేవారు. శాంతిమూల చక్రవర్తిని ధాన్యకటకంలో సింహాసనం అధివసింపవలసిందని మహాసామంతులందరూ కోరినా శాంతిమూలుడు పనికిరాదన్నాడు.

"శాతవాహన వంశం పాలించిన పవిత్రదేశం మనకు దివ్యక్షేత్రం."

"నేనూ నా పుత్రులు వారి సంతానమూ ఎప్పటికీ ఆంధ్రభృత్యులం.

ఇక్కడనుండే సర్వదక్షిణాపథాన్ని పరిపాలింతుముగాక" అని నిండుసభలో సెలవిచ్చినాడు. బ్రహ్మదత్తప్రభువును మహాసేనాపతి మహామాత్య సింహాసనంపై చక్రవర్తి అభిషేకించినారు. పూంగీయ శాంతశ్రీ వివాహం కాగానే శ్రీ వీరపురుషదత్త యువ మహారాజునకు ఇరువురు దేవులతో ప్రతిష్ఠాన నగరంలో యువరాజ పట్టాభిషేకం జరిగింది. పట్టాభిషేకం అవుతూనే వీర పురుషదత్తుడు తన సామంతులతో ఉజ్జయిని వెళ్ళి రుద్రసేనక్షాత్రప రుద్రసింహ మహారాజు కొమరిత రుద్రభట్టారికను వివాహము చేసుకొన్నాడు. ఆ ఉత్సవం పరమాద్భుతంగా జరిగింది.

## 6

**అ**డవి శాంతిశ్రీ బ్రహ్మదత్తుడు పాలీ గ్రంథము చదువుకొను విద్యామందిరానికి తొందరగా వెళ్ళినది. తనదేవేరి మంజీరనిక్వణశ్రుతి చెవుల సోకగానే ధనకప్రభువు పుస్తకము కన్నుల కద్దుకొని పేటికాంతమందుంచి లేచి నిలుచుండి గుమ్మమువంక చిరునవ్వుతో ఎదురు చూస్తున్నాడు. ఇంతలో శాంతిశ్రీదేవి గుమ్మం దగ్గర ప్రత్యక్షమయినది.

"ప్రభూ! ఎప్పుడూ చదువే?"

"నువ్వు నా జీవితంలోకి వచ్చి నా చదువు అంతా ఆపివేశావు దేవీ!" ఆమె కోపం నటించే అతని చెంతజేరి నల్లత్రాచువంటి వేణీబంధము కేలబూని గిరగిర త్రిప్పుతూ జంకించినది.

"శాంతీ! నువ్వు నా యెదుట ఉన్నా, లేకున్నా హృదయానికి శాంతి లేదు."

"బాధలన్నీ మీరొక్కరే కాబోలు పడేది?"

"రా, ఇలా వచ్చి నా అంకమందు"

"అక్కర ఉన్నవారు తామే...."

"అలాగా" అంటూనే రెండంగలలో బ్రహ్మదత్తుడు సువ్వున వచ్చి శాంతిశ్రీని ఎత్తుకొని ఆమె మోము మూర్కొనుచు తీసుకొనిపోయి పీఠంపై కూర్చుండి ఆమెను ఒడిలో ఇమిడించుకొన్నాడు.

"ఇంతటి సౌందర్యం అంతా నువ్వే ప్రోగుచేసుకొంటే లోకంలో స్త్రీలంతా బెంగపెట్టుకోరూ?"

"మీ సౌందర్యంముందు నేను...."

"వింధ్యపర్వతంముందు హిమాలయం అనికాదూ?"

"మాటలు నేర్చిన మగవాళ్ళతో ఎవరు ప్రత్యుత్తరాలు ఇవ్వగలరూ?"

"మాటలు నేర్వని బాలికకు ప్రత్యుత్తరం ఇవ్వడం ఓడిపోవడమే!"

"పోనీలెండి. నేను కళ్ళుమూసుకుంటాను, నాకు ఎంతోకోపం వస్తోంది!"

"ఇదేమిటి లోకం అంతా చీకటైపోయింది. నా హృదయం ముడుచుకు పోయింది."

"మీరు మరీని!"

"ప్రాణేశ్వరీ! నువ్వు నాకు మరీ మరీ!"

"నాకు ఈ అడవి ఇంటిపేరు ఎంతో గంభీరమై, ఆనందపూర్ణమై ఉన్నదండీ!"

"అడవి ఇంటిపేరు విని మా చెల్లెళ్ళు నవ్వలేదూ?"

"నవ్వలేదుగాని, నవ్వు ఆపుకొని పైకి తేలనీయక మా వదిన శాంతశ్రీ ఏమన్నదో ఎరుగుదురా?"

"చెప్పు ఆత్మేశ్వరీ!"

"కొంచెం వంగండీ. చెవిలో చెప్పుతాను."

"ఇక్కడ ఎవరున్నారు, రహస్యం వినడానికి?"

"మీ పెదవులు వింటాయి. అవి నాకు ఊపిరాడనీయవు"

"ఇందులో నీ అభ్యంతర మేమిటి? పెదవులకు పెదవులకు చుట్టరికం.

నా కన్నులు నీ అందాన్ని జుఱ్ఱుకొంటవి. నా ముక్కు నీ దివ్యసౌరభాన్ని త్రాగుతుంది. నా చేతులు నీ దేహాన్ని వదలవు. నా హృదయం నీ హృదయాన్ని వదలదు. నా ఆత్మ నిన్ను పూజిస్తుంది."

"ఇంక నాకు మిగిలింది ఏమిటి?"

"ఆసి దొంగ" అని ఆమెను బిగియార కౌగిలించుకొన్నాడు.

✶ ✶ ✶

# నీరాజనము

తారానికకు నాగదత్తునికి విజయపురిలో వైభవంగా వివాహం జరిగింది. ఇక్ష్వాకుస్వామి శాంతిమూల చక్రవర్తియు, బ్రహ్మదత్తప్రభువు, ఆడవి శాంతిశ్రీయు వివాహాన్ని ఉభయపక్షాల ఉండి వైభవంగా నడిపించినారు. చక్రవర్తి నాగదత్తుని చళుక రాష్ట్రాధిపతి చళుకరాయనిక మహాప్రభువునకు బాసటగా ఉండి పనిచేయవలసిందని ముదల యిచ్చినాడు.

వీరి వివాహమైన కొలది దినాలకు యశోదనాగనిక వివాహమైనది. ఆ వివాహము సాలగ్రామంలోనే జరిగింది. ఆ వివాహానికి సార్వ భౌముడు, మహాప్రభువులు, మహామంత్రి, మహాసేనాపతి, బ్రహ్మదత్తుడు, మహాతలవరులు, దండనాయకులు మొదలగువారెందరో వెడలినారు. విజయపురము విజయపురమంతా అచ్చటనే ఉన్నది. గ్రామం చుట్టూ మహాప్రభువులంతా శిబిరాలు తీర్చినారు. చుట్టుప్రక్కల గ్రామాలవారు వేలకొలది వివాహానికి వచ్చినారు. యశోదనాగనికభర్తను శతగ్రామాధికారిని చేసినాడు చక్రవర్తి. వివాహము ముగిసినది. అడవి శాంతిశ్రీ ధనకమహారాణి భర్తనుచేరి "ప్రభూ! మీరు వెంటనే బయలుదేరండి. మనమిద్దరము కలిసి తీర్థయాత్రలు చేసి వద్దాము" అని ప్రార్థించినది.

"ఏయే తీర్థాలు దేవీ?"

"మనం సప్తదీవులు తిరిగిరావాలని నేను కోరటంలేదు. మనదేశంలోని దివ్యక్షేత్రాలన్నీ తిరిగి వద్దాము."

ఆమె అతని ఒడిలో ఒరిగిపోయింది. భర్త మెడచుట్టూ తన చేతులు బిగించింది. అతని కళ్ళలోనికి జగన్మోహనాలైన తన చూపులు పరపింద. అతడు వివశుడై,

"ప్రాణేశ్వరీ! నువ్వు బౌద్ధధర్మాభిరతవు. నేను ఆర్షధర్మాచరణ వ్రతుడను. అందుచేత మన యాత్ర చాలా పెద్దదవుతుంది కాదూ?"

"అవును మనం ఇద్దరమే, హిమాలయాలలో, లోయలలో, చరియలలో తెల్లని మంచు వెన్నలా పడేచోటులలో, గడ్డలా పేరుకుపోయే సీమలలో, నదులు, సెలయేళ్ళు, నదీకంఠాలు గలగలలాడగా సుందరశ్రీ చెలువారు ప్రదేశాలలో దేవతలు చరించు దివ్యభూములలో తిరిగివద్దాము రండి."

"మధురాతి మధురాలైన నీ మాటలు వింటూ ఉంటే...."

"నేను వట్టి స్వప్న బాలికలా ఉన్నానా?"

"నువ్వు నా దివ్యస్వప్నానివి. నువ్వు నా కోటితపస్సుల ఫలం."

"ఇదా మీ వేదాంత పరమార్థం!"

"నీ ముందు, నీ త్రిజగన్మోహన సౌందర్యం ముందు నా వేదాంతాలు మంచులా కరిగిపోతాయి."

"నా సౌందర్యం అతితీక్ష్ణమైన ఎండ వంటిదా?"

"నీ సౌందర్యం అతిసురభిళమైన పూర్ణిమా సుషమ."

"అందుకే కాబోలు నన్ను 'వెన్నెలా' అని పిలువసాగినారు."

"నిన్ను ఏ పేరు పెట్టి పిలిచినా తనివి తీరదు."

"నన్ను మించిపోతుంది నా పేరనా?"

"నీ పేరునే నీవు ఎప్పుడూ మించిపోతున్నావు."

"చూడండీ! ఇంతవరకూ నన్ను పొగడిపొగడి వదిలారు. అది అలా ఉంచండి. కాని ఒక విషయంలో మీరు అసత్యదోషం సలుపుతూ ఉండడంవల్ల మీ వర్ణన కూడా నమ్మకూడదేమో అనిపిస్తుంది ప్రాణప్రియా!"

"నేనా అసత్యదోషం చేసేది?"

"అవును!"

"ఏలాగు?"

"మిమ్ములనుగూర్చి మీరు చెప్పుకోనే చెప్పుకోరు."

"ఏమని?"

"బుద్ధిలో అమితాభబుద్ధునివంటివారని, నా హృదయం ఆత్మ నిండిపోయి ఉన్నారని"

"నీకే ఇదంతా తెలిసినప్పుడు నేను చెప్పకపోతే అసత్యదోషం ఎట్లా అవుతుంది? నువ్వు ఎలాంటిదానవో నాకు చెప్పాలా?"

"మీ సౌందర్యం అతిలోకం."

"దివ్యజ్యోత్స్నకాంతులు ప్రసరించే నీ చూపులు నా చూపులలో వాలుతూ ఉంటే వర్ణనాతీతాలై, స్విన్నాలై అమృతప్రవాహాలై, జపాకుట్మలా లైన నీ పెదవులు మాటలాడుతూ కదులుతూ ఉంటే శాంతీ! నాలో ఉన్న ధైర్యం పటాపంచలై పోతున్నది నిన్ను నా హృదయంలో దాచుకుని, నాలో లయించుకోలేక పోతున్నానుదేవి!"

"నేను మీలో అణువును ప్రభూ! మీరు నన్ను శివునిలా అర్ధదేహ మాత్రం ధరించినా, విష్ణునిలా హృదయంలో ధరించినా, బ్రహ్మలా నాలుకపై ధరించినా నాకు తృప్తితీరదు. నన్ను మీ ప్రతి అణువునా లయించి పోనివ్వండి ప్రభూ! దినానికి ఏవోకొన్ని క్షణికాలైనా విడిచి ఉండవలసి వస్తూ ఉంటే ఆ క్షణికాలు పదీ నాకు యుగాలై పోతున్నాయి ప్రభూ!"

"శాంతీ! ఇప్పటికీ – 'నువ్వు ధనకకుటుంబానికి కోడలుగా వచ్చావనే నమ్మకం చాలక, వట్టి స్వప్నమేమో' అని భయపడుతూ ఉంటాను."

అతడామెను తన దృఢబాహువులతో కర్కశంగా కౌగలించుకొన్నాడు. ఇద్దరు ఆనందంతో ఉప్పొంగిపోయినారు. ఒకరి కౌగిలో ఒకరు లయమై పోయినారు.

*ఓం అసతోమా సద్గమయ*
*తమసోమా జ్యోతిర్గమయ*
*మృత్యోర్మా అమృతం గమయ*
*బుద్ధం శరణం గచ్ఛామి*
*ధర్మం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి.*

**సమాప్తం**

# అంశుమతి

• చారిత్రాత్మక నవల •

227

Blank Page

# అంకితం

నా గృహలక్ష్మి

**చిరంజీవి సౌభాగ్యవతి సుభద్రకు**

Blank Page

# అంశుమతి

## • చారిత్రాత్మక నవల •

శ్రీఆంధ్ర సామ్రాట్టు వేంగీమహానగర స్వామి, మహారాజు మంచన భట్టారకదేవుని ఏకైక పుత్రిక అంశుమతీ కుమారి గోవూరు గోపాద క్షేత్రమునందు స్నానము చేయుచున్నది. ఆ బాలికతో పాటుగ నామె చెలి మాధవీలతా కుమారియు నదియందు గ్రుంకులిడుచున్నది. రాజ పురోహితుడు 'అఖండ గౌతమీస్నానమహం కరిష్యే' అని ప్రారంభించి, 'దశాపరేషాం దశపూర్వేషాం' అను మంత్రములతో రాజకుమారికను గోదావరీ స్నానము పూర్తి చేయించెను.

గట్టుపైన తనకై నిర్మించిన శిబిరములోనికి బోయి, యాబాలిక యుచితవేషము ధరించి, చెలులు కొలుచుచుండ నీవలికివచ్చి, అక్కడచేరిన భూదేవు లందరకు సంభావనలు సమర్పించినది. ఆ వెనుక స్యందనమెక్కి, విడిది చేసియున్న మహాభవనమున బ్రవేశించినది.

పదునెనిమిది వత్సరముల ఎలప్రాయమున నున్న ఆ బాలిక లోకోత్తరసుందరి యని ప్రసిద్ధిగాంచినది. ఆనాటి రాజకుమారు లెందరో ఆమెను వివాహమాడ వాంఛించి శ్రీ మంచన భట్టారకమహారాజు కడకు రాయబారములంపు చుండిరి. కాని యా బాలిక ఏ కారణముననో యా రాయబారములలో నొక్కటినైనను అంగీకరించలేదు.

అంశుమతీ కుమారి జాతకమున నేదియో గ్రహ దోషము వచ్చినదని రాజ జ్యోతిష్కుడు నారసింహభట్టు పండితులు సెలవిచ్చినారు. అందులకు, గోవూరు గోపాద క్షేత్రమున గోదావరీ స్నానము చేయుచు, నుత్తమ బ్రాహ్మణులచే గ్రహజపము లొనరింప జేయుచు, దానాదు లర్పింపవలయునని నారసింహభట్టు నిర్ణయించినారు.

'ఆ దోషము గ్రహచారమువలన కలిగినది. తమ రాజ్యమునకే ముప్పు తెచ్చును. గ్రహశాంతి చేయించినచో నా యుపద్రవము తీరిపోవును' అని రాజగురువు వచించినాడు.

'అటుల దోషము తీరిపోయిన అమ్మాయి జాతక మెట్లుండు నందురు గురుదేవా?'

'రాజకుమారి జాతక ముత్కృష్టమైనది. ఆమెకు మహారాజు భర్తగా లభించును. ఆమె గర్భమున కులదీపకుడైన సుపుత్రు డుద్భవించి, సామ్రాజ్యాధిపతి యగును.'

రాజగురువే గోవూరునందు రాజకుమారికచే గోదావరీ స్నాన వ్రతము చేయింప నేర్పాటయ్యెను. వ్రతము నలుబది దినము లొనరింపవలసి యున్నది.

సాగరు లపవిత్రము సలిపిన భూమిని పవిత్రను సేయుటకు భగీరథుడు హిమవ న్నగమున దప మాచరించి, ఆకాశగంగను మెప్పించెను. ఆమె భూమి నవతరించుట కనుగ్రహించినను, ఆమె దిగివచ్చు నురవడి నాపగల వారెవ్వరు? కావున భగీరథుడు

మరల నుగ్రతప మొనర్చెను. ఆ తపమునకు మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమయ్యెను. ఆ మహేశ్వరుడు తన జటాజూటము విప్పి భూమికి మహావేగమున వ్రాలి వచ్చు మందాకినీ నదిని తన జడలలోనికి గ్రహించినాడు. ఆ దివ్యనదిలో నొక పాయను మాత్రము పరమేశ్వరుడు భూమిని పూతమొనరించుటకై వదలినాడట. అప్పటినుండియు గంగను జటాజూటమున ధరించి శివుడు గంగాధరుడైనాడుజ భగీరథుడు గంగను భూమి నవతరింపజేయుటచే నా దివిజనది భాగీరథియైనది.

ఉత్తర భారతదేశమునందు ఈ మహోత్తమసంఘటన జరిగిన కొన్ని యుగములకు, పరమశివుని యవతార మొక్కటి వింధ్యపర్వతము దాటి దక్షిణాపథమునకు వచ్చి, పశ్చి మాద్రియందు ప్రత్యక్షమయ్యెను. అచ్చట నా శంభు దేవుడు త్ర్యంబకేశ్వరుడై వెలసెను. ఆ దినములందే దండకారణ్యమున నేటి గోవూరు ప్రాంతమున గౌతమమహర్షి తన యాశ్రమము నిర్మించుకొని తపం బాచరించుకొనుచుండెనట. ఆ ప్రదేశమున మాత్రము వర్ష మెల్లప్పుడు కురియుచుండెనట. ఆ వానలే పంటల కాధారములట. కావున ఆ సీమ నాదిమ నివాసులగు ఆంధ్రు లుపాయమును బన్ని గౌతమమహర్షి యాశ్రమములోనికి గోవు నొకదానిని తోలిరట. ఏనాటి కానాడు పండు వరి చేను నాగోవు మేసిపోవుచుండ గౌతముడు దాని తరిమివేయ నొక దర్భపుల్లను విసరినంత మహర్షి తపోబలంబున నాయావు మరణించి నేలంగూలినది.

గోహత్యా మహాపాతకము గౌతముని జేరవచ్చినది. ఆ పాపమును నాశనము జేసికొనుటకు నా ఋషిసత్తముడు దీక్షతో తపమ్మొసలుప బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. త్ర్యంబ కేశ్వరమునకు జని యచ్చటవెలసిన పరమశివుని జటలో నున్న గంగను గొనిరా బ్రహ్మ అతని నియమించెనట. గౌతము డా త్రినేత్రుని వేడి యభ్రగంగలో వేఱొక పాయను గొని వచ్చెను. గోహత్యాపాతకము నాశనము జేసినది గావున గోదావరి యనియు, గౌతముడు కొనివచ్చెనుగాన గౌతమి యనియు నా దివ్యనదికి బ్రసిద్ధనామములు వచ్చినవి. గోవు చనిపోయిన ప్రదేశము గోపాద క్షేత్రము. అచ్చట వెలసిన మునిపల్లె గోవూ రయినది.

రాజకుమారి గోదావరీస్నాన వ్రతము నిర్విఘ్నముగ సాగుచున్నది. ఆ సాయంకాలమున నొంటిగా భవనోద్యానమున నాభాల విహరించుచు నూత్న పరీమళ మూర్తియై అప్పుడే యా వనవాటికను బ్రవేశించిన వసంతదేవుని నవ్యవిలాసముల గమనించి “మాధవీ! యిటు ర” మ్మని చెలిని బిలచెను. ఆమె మాటలోని తొందరపాటును యిష్టసఖి, “ఏమి రాజకుమారీ! ఏదియో వింత గనినట్లుంటి” వనుచు బరుగిడి దఱిచేరెను.

“మాధవీ! ఈ మల్లెపొద మొగ్గలు దొడిగినది. ఆ గున్న మామిడి లేబూత నలంకరించుకొనుచున్నది. వాయు దేవుడు గంధవహు డగుచున్నాడు చూచితివా.”

“రాకుమారీ! ఏ సంవత్సరమున కా సంవంత్సరము వచ్చు వసంతదేవు డొకడా లేక యనేకు లందువా?”

“ఓసి వెఱ్ఱిదానా! వసంతుడు నిత్యయౌవనుడు నిత్య లీలావిలాసుడు. ప్రాతః కాలమున నుదయించి ముప్పది గడియలు నభోమండలమున బరిభ్రమించి సాయంకాల మస్తాద్రిని జేరు సూర్యభగవాను డొక్కడందువా వేవు రందువా?”

"ఒక్కడే అందును."

"ఈ నవ్యత్వ మాలోచించియే దివ్యకవులైన కాళిదాసాదులు తమ గీతామృత ధారల మాధవదేవుని పలుగతుల కీర్తించిరి."

ఈ వనీకన్యను వరించి యీ మాధవదేవుడు వచ్చినాడు. మా రాజకుమారిని..."

"ఛీ! మూర్ఖురాలా! నోరుమూయుము."

"క్షంతవ్యను. మాధవదేవుని రాకచేగదా ఈ నికుంజములు పుష్పభరితము లాయె ననుకొనుచు తొందరలో నటులంటిని.

ఆమాటలకా రాచకన్నియ కోపము నటించి చెలిపై అవతంస కుసుమము విసరినది. మాధవి కిలకిల నవ్వుచు నా పుష్పవాటికి నెందో మరుగై పోయినది.

## 2

ఒక యుత్త మాజానేయము నధిరోహించి పడుచువాడొకడు మహావేగముతో వేంగీనగరమునకు బశ్చిమముగా నిరువది యోజనముల దూరమున 'మధ్యదుర్గ' మను గ్రామమును దాటి వచ్చుచుండెను. ఉత్తమలక్షణ సమన్వితమైన యా ధవళ పారశీకాశ్వ మెట్టి రౌతునైనను సరకు గొననిది. అట్టిదయ్యు నా యాజానేయము తన కధిక ప్రియము గూర్చు నా యువకుని మనస్సు గ్రహించి, యనువర్తించుచుండెను. గడియ కైదుయోజనముల వేగముతో నా యాశ్వికుడు మధ్యదుర్గమునకు బదిగోరుతముల దూరము ప్రయాణము చేసివచ్చెను. కొండలు, లోయలు, నదీకంఠములు, కొండ దొనలు, కొలకులతో నిండిన యా ప్రదేశము గంభీరారణ్య మధ్యదేశము.

బాలకుడైన యా యాశ్వికు డాగిన మహారాజ పథము ప్రక్క సువిశాల గిరిపాద ప్రదేశమున్నది. అందు శిబిరము లేర్పరచుకొని మహాసైన్య మొకటి దండు విడిసి యున్నది. ఆ బాలకు డచటికివచ్చి, యాగునప్పటి కిరువురు సైనికులు పరుగిడి వచ్చి, చేతులు జోడించి వంగి అతనికి నమస్కరించిరి. ఒకడు గుఱ్ఱము కళ్ళెము పట్టుకొనెను. వేరొకడు కత్తిదూసి సగౌరవముగా విగ్రహమువలె నిలుచుండిపోయెను. ఆతడు గుఱ్ఱముపైనుండి ఛంగున భూమికురికి యా శిబిరములోనికి విసవిస నడిచి పోసాగెను. చక్కని మార్గములు తీర్చియున్న స్కంధావారములోనికి వేగమున బోవు నాబాలకుని దారిపొడుగునను యోధవీరు లందరు బొమ్మలవలె నిలబడి వీరనమస్కారము లర్పించుచుండిరి.

ఇంతలో నా స్కంధావారాధిపతియైన సేనాధిపతి వేగమున నెదురై వీరనమస్కార మర్పించినాడు. ఏదియో యాలోచించుకొనుచు, నా బాలకుడు స్కంధావారమధ్యమున బంగరు గుడారమువైపునకు నడక సాగించినాడు అతని వెనుక సేనాపతియు నా బాలకునిపై భక్తియుతములైన చిరు నవ్వుల బరపుచు ననుసరించినాడు. బాలకు డా గుడారము చేరబోవుసరికి నచ్చట బారులుదీరి మాగధులు వందులును "జయ! జయ! ఉత్తమ చాళుక్యా! జయ! జయ! కదంబమహారాజ గర్వాపహరణ! జయ! జయ! బిరుదాంక భీమ! జయ! జయ! రాష్ట్రకూట గోవిందరాజ గర్వాపహరణ! జయ! జయ! త్రిమహారాష్ట్రక ప్రభూ! జయ! జయ! విషమసిద్ధి దివ్యబిరుదాంకా! జయ! జయ! విష్ణువర్ధన మహారాజా!" అని జయ ధ్వానములు సలిపిరి.

ఇట్లు విష్ణువర్ధన మహారాజును పట్టవర్ధన వంశతిలకుడగు కాలకంపనుడను సేనాపతియు నా గుడారములోనికి బోయినారు. విష్ణువర్ధన మహారాజు సువర్ణాసన మధివసించి, "కాలకంపన ప్రభూ! ఆసన మధివసింపు" డని గౌరవముట్టిపడు మాటలతో సేనాధిపతికి పీఠము జూపినాడు.

విష్ణువర్ధనుడు రాజపరమేశ్వర, సర్వసిద్ధి బిరుదాంక, సత్యాశ్రయ శ్రీపృధ్వీవల్లభ వాతాపినగర చక్రవర్తికి జిన్నితమ్ముడు. అన్నగారి కన్న నెనిమిదేండ్లు చిన్నవాడై నేటి కిరువదెనిమిది సంవత్సరముల ప్రాయమువాడై యున్నను, రూపమున బాలకునివలె నుండెను. ఆతడు నాలు గడుగుల పదనొకం డంగుళముల పొడవువాడు. వాతాపినగర చాళుక్య చక్రవర్తు లందరును నారడుగుల పొడవువారు. చాళుక్య రాజపుత్రులలో నిట్టి పొట్టివా డెన్నడును బుట్టలేదని ప్రజలనుకొను చుందురు. ఆ పొడవునకు సరితూగు నంగములు కలిగి చారుశరీరి యగుటచే విష్ణువర్ధన నామములు గలవారున్నారు. వాతాపి చక్రవర్తుల మూలపురుషుడే విష్ణువర్ధనుడు. అందుచే గాబో లీతనిని గుబ్జ విష్ణువరథనుండని పిలుచు కొందురు.

పచ్చని బంగారుచాయ, పదునారేండ్ల వయసు మిసిమిచే వెలుగు నాతనిమోమున నూనూగుమీసలు గాంచినవారాతని బాలకు డనియే యనుకొందురు. అయినను విష్ణువర్ధనుని శరీరాంగకము లుక్కుతో నిర్మించినవి. ఇనుప గుదియనైన నాత డుంగరమువలె వంచివేయునట. పొడగరులై రాక్షసులవంటి దిట్టరులు విష్ణువర్ధను నవలీలగ నోడించవచ్చునని యాతనితో ముష్టి మల్లయుద్ధముల దలపడి మూడు నిమేషములలో ప్రాణములు కడబట్టి, బ్రతుకుజీవుడా! యనిదాసోహ మందురట.

ఆతని బాణప్రయోగములు, ఆతని కత్తివ్రేటులు విద్యుద్వేగములు. శార్ఙకోదండ వినిర్ముక్త బాణములవలె తీవ్రములు. విష్ణువర్ధనుడు భయమన్న నెఱుంగడు. తానోడి పోదునన్న సంశయ మెన్నడును నాతనికి బొడమలేదు. సైన్యము నడుపుటలో, వ్యూహమును బన్నుటలో, నెదిరి బలములను దాకుటలో కుబ్జవిష్ణువర్ధనుడు ప్రజ్ఞావంతుడగు సేనాపతి. తన బలముకన్న శత్రువులసైన్య మెంత యధికమైనను యుద్ధ నిర్వహణమునందు బగతురు తన కెప్పుడును తక్కువ వారను నమ్మక ముండుటచేతనే విష్ణువర్ధనుడు మేకలమందపైబడు సింహమువలె బ్రళయ ప్రభంజనమై వైరులపై విరుచుకొని పడును.

**కాలకంపనుడు:** మహాప్రభూ! సార్వభౌములు తమ చిన్నన్నగారైన సత్యాశ్రయ శ్రీ జయసింహ మహారాజును సురాష్ట్ర, కుకుర్త, అనుప – అపరాంత దేశములకు మహారాజుగా జేసి పట్టము గట్టినారు. తాము కుంతల దేశమును జయించినారు. అశ్మక నడంచినారు. రాష్ట్రకూటులను బాదాక్రాంతులుగ జేసినారు. వనవాసి దేశమునకు దాము ప్రతినిధులై యుండిరి. మరి, అడుగడుగునకును నద్భుతగులు నీ పూర్వ సముద్రతీర రాజ్యములకు బుద్ధి చెప్పుడని ఇప్పుడేల వారు పంపిరో నా కవగత మగుటలేదు మహాప్రభూ!

**విష్ణువర్ధనుడు:** సేనాధిపతీ! అన్నగారు దివ్య ప్రతిభావంతులు. వారి హృదయము అవగతము సేసికొనుటకు బృహస్పతులైన జాలరు. రాజ్యములు సుస్థిరములై ప్రజలు రామరాజ్యము లనుభవింపవలెనని ఎప్పుడును వారు గోరుచుందురు.

**కాల:** మహాప్రభూ! నాకు సార్వభౌములు హృదయమిప్పుడు దిజ్మాత్ర మవగతమైనది. చిన్న చిన్న రాజ్యములు దురాశచేతను, గర్వముచేతను సంతతమును దమలోదాము యుద్ధములు సలుపుచుండును. అందువలన ప్రజలకు నష్టములు కలుగును. సార్వభౌముల కది యిష్టము లేదు. ఈ తూర్పుతీర ప్రదేశములందు శాంతి యడుగంటిపోయిందని చక్రవర్తులై దేండ్ల క్రిందటనే జైత్రయాత్ర సలిపిరి గదా!

**విష్ణు:** ఎవరి రాజ్యములు వారు సుఖముగ బరిపాలన చేసుకొనిచుండినచో నీ యశాంతి దుస్స్వప్నము వలె దేశము నావరించి యుండెడిది కాదు.

**కాల:** చిత్తము.

**విష్ణు:** అన్నగారు పిష్టపురమునకు బోయి తిరిగి యా నగర మాక్రమింపుమనిరి.

**కాల:** మహాప్రభూ! తమకొౕక మనవి చేయవలెనని యుండియు ధైర్యము చాలక యూరకుంటిని. మనము మధ్య దుర్గము కడనే గోదావరీనదీ మధ్యస్థ పట్టిస ద్వీపమునకు బోవు రాజపథము ననుసరింప వలసియుండినది కదా!

**విష్ణు:** సేనాధిపతీ! తాము కొంచెమోపిక పట్టియుండుడు. నాకాజ్ఞ యిచ్చునప్పటికి పిష్టపురము ననేయున్న మన రాజప్రతినిధి పృధ్వీధ్రువ రాజేంద్రవర్మ పల్లవసైన్యములతో దలపడుటకు గృష్ణాతీరమునందలి ధనకటక నగరమున కేగెనని, మధ్యదుర్గముకడనే వేగు వచ్చినది కదా!

**కాల:** అగును మహాప్రభూ! ఏ యుద్ధమునందైనను దాము దీర్ఘమాలోచించియే యుద్ధ విధానము నిర్ణయింతురు.

**విష్ణు:** కాలకంపన ప్రభూ! నా చిన్నతనమునుండియు దామే గురువులై. సంగ్రామ విద్య నాకు నేర్పినారు. కంటికి రెప్పవలె నన్ను గాపాడినారు. మా జనకులు శ్రీ సత్యాశ్రయ కీర్తివర్మ వల్లభ చక్రవర్తులు మహేశ్వర సన్నిధానము జేరుకొని నప్పటికి మే మన్నదమ్ములము చిన్నవారమగుటచే మా పినతండ్రి శ్రీ మంగలేశ చక్రవర్తి మాపై బ్రయోగించిన కుట్రలనుండి మమ్ము రక్షించి తండ్రివలె గాపాడినారు!

విష్ణువర్ధనుని మాటలు వినుచున్న కాలకంపన ప్రభువు కన్నులు చెమరించినవి.

## 3

**అం**శుమతీకుమారి శుక్రవారమునాడు దోషాపహరణ స్నాన మాచరించిన పిదప శుభ్రవస్త్రధారిణియై, సర్వభూషణాలంకృతయై యిష్టసఖులు గొలిచిరా నంగరక్షక వీరాంగనలు, వీరులు కావలిగాయ దాను విడిదిసేయు భవనము నంటియున్నట్టియు, గోదావరీతీరమున కనతిదూరమున నున్నట్టియు గోమాతృ దేవాలయమునకు వోయి షోడశోపచార యుక్తమైన యష్టోత్తరశతనామ గోమాతృదేవీ సమార్చన సలుపుచుండెను.

విష్ణుకుండినులకు గోదేవి కులదైవము. మహారాజులు మహారాణులు రాజకుమారులు రాజకుమారికలును సమస్త విష్ణుకుండిన వంశజులును గోవూరు పుణ్యక్షేత్రమున గోమాతృ దేవాలయమునఁబూజలు సలుపవలయును. ప్రథమ విష్ణుకుండిన చక్రవర్తియగు మాధవవర్మ మహారాజుచే నటులా గోదివ్యాలయము ప్రతిష్ఠింపబడినది. ఆతడా దివ్యాలయమును బ్రతిష్ఠించుటకొౕక ప్రబలకారణము సంఘటిల్లినది. మాధవవర్మ

చక్రవర్తి దిగ్విజయమొనర్చి, పల్లవుల జయించి, కృష్ణాతీరమున నుత్తమక్షేత్రముల నొకటియగు విజయవాటిక యందు సర్వమల్లికేశ్వరుని అర్చించుటకై సకుటుంబముగా విడిదిచేసి యుండెను. మహారాజున్న నెలదినములును నా నగరవాసులును పరిసర గ్రామప్రజలును మహోత్సవము లొనరించుకొనుచుండిరి.

ఎచ్చట జూచినను వీధినాటకములు, తోలుబొమ్మలు, పుణ్యకథా కాలక్షేపములును జరిగినవి. మహారాజు నగరవాసులకు బరిసర ప్రాంతవాసులకును గూడ పంచభక్ష్య పరమాన్నములు పెట్టించుచుండెను. ఇంటింట దోరణములు, వీధివీధుల నూరేగింపులును, దేవాలయముల, జైనాలయముల, బౌద్ధ సంఘారామముల దేవతల పూజలు, భిక్కుల యర్చనలు వైభవముగ జరుగుచుండెను. పానశాలలయందు వివిధ పరిమళయుక్తములు రుచ్యములునగు పానీయములను వివిధ మద్యములను సేనాధికారులు, నర్తకీబృంద నృత్య వినోదములయందును, మధుర సంగీత సమారోహముల యందును గాలము నానందమయ మొనర్చుకొనుచుండిరి.

యువరాజు బ్రహ్మణ్యుడును, ఉత్తమవ్రతుడే అయినను విధినిర్ణీతమై కాబోలు, దేవాలయముల జరుగు బూజల బాల్గొనక, విలాస లాలసుడై పానగృహముల నుండి అనేకవర్ణములచే ధళధళలాడుననియు, వివిధ పరిమళములచే ఘుమఘుమలాడు చున్నవియు, జక్కని రుచులచే నోరూరించుననియు, మధురమత్తతచే నానందమును గల్గించుననియునగు నామద్యములందన భవనమూనకు దెప్పించుకొని యిష్టజనముల గలసి యవి సేవించుచుండెను. రాజకుల మర్యాదలను మీఱి యాతడు భ్రష్టబుద్ధి యయ్యెను.

ఒకనాడు యువరాజు దేవవర్మ తీక్ష్ణమైన మద్యమును సేవించి యతిమత్తతతో లోకమును మరచి, రెండుత్తమాశ్వముల బూన్చిన తన విహార రథ మెక్కి సూతుని వెనుక నుండుమని తానే రథము నడుపుచు విహారాయత్త చిత్తుడై కన్నుమిన్నులు గానని మహావేగమున విజయవాటికా వీధుల బోసాగినాడు. అంగరక్షకులు లేరు. త్రోవలందు జన సమర్ధమును సర్దు నాశ్వికులు ముందులేరు. సూతుడు వెనుక నుండి "భద్రము మహాప్రభూ! భద్రము మహాప్రభూ!" యని యరచినను దేవవర్మ చెవి కెక్కుటలేదు.

దేవవర్మ యట్టహాసము చేయుచు, ప్రజలు భీతచిత్తులై హాహాకారములు సేయుచు భారిపోవుచుండ, మత్తుతో మఱియు నుప్పొంగి, కశిచే జురుక్కుమని యశ్వములకు రెండాఘాతము లంటించెను. ఆ యుత్తమాశ్వము లదలించుటయేని సహింపనివి. ఆ కులీనములు క్రోధముచే గట్టుతప్పి మహావేగముగ బరుగిడ జొచ్చెను. ఆ వేగమున కింకను బొంగి, "ఇంకను వేగ మింకను వేగ" మని ఆ యువరాజ జరవ జొచ్చెను.

రాజకుమారుని రథము పోవు వీధిలో పూంగీ రాష్ట్ర సంజాతయైన పెద్దజాతి యావు తనవత్సమును గలసి ఆలమందలతో గూడి నగర భావ్యా దేశమున బచ్చికబీళ్ళ మేసి, తిరిగి యజమాని యింటికి బోవుచుండెను. అందమైన యా కోడెదూడ తెల్లని కాంతులీనుచు గాళ్ళకు గట్టిన గజ్జెలు, మెడ నలంకరించిన చిఱుమువ్వలు మ్రోగుచుండ, గంతులిడుచు తల్లి కాళులసందున దూరుచు, జెంగున ముందు కురుకుచు బ్రక్కకురుకుచు దన చిన్న గంగడో లాలిపోవ దల్లితో నడుచుచుండెను.

కామధేను వంశమున బుట్టిన యా గోమాత మృదులమైన తన తేనెకన్నుల ప్రేమకాంతులు వెలిగిపోవ, ముట్టెతో దన వత్సమును బుజుకుచు, మందగమనమున నడచుచుండెను. ఇంతలో మహా ప్రళయమువలె రాజకుమారుని రథ మావీధి బడినది. ప్రజల గగ్గోలు, పరుగులు, కొందరు పడి దొరలి ప్రాణములు దక్కించుకొనుట, ఇట్లా వీధియంతయు నల్లకల్లోలమై పోవుచుండెను.

వేయి పిడుగుల పాటువలె ఘర్ఘరావములతో నా రథమువచ్చి మాయమైపోయెను. "అంబా" యని ఆ కోడెదూడ యరచుచు నేల పడియున్నది. దాని యొడలంతయు రక్తము చిమ్ముకొని వచ్చుచుండెను. వీపును బొట్టయు దెగి మాంసపుగండలు వెలువడియుండెను. "అంభా" యని యా వరచుచు గన్నుల నీరుగార నా దూడచుట్టు దిరుగ దొడగినది. ఆ గోమాత తన శిశువు గాయములనుండి స్రవించు, రక్తస్రావము నాప యత్నించును. తన బిడ్డను ముట్టెతో బైకెత్తి యథాపూర్వముగ నడిపింపజూచును. "అంభా" యని యరచును. తలయెత్తి రథము పోయిన దిక్కుజూచును. తన చుట్టును, పడిపోయిన తన దూడ చుట్టును జేరిన జన సమూహము వైపు దీనదృష్టుల బరపును. ఆ నోరులేని సాధు జంతువు హృదయమున నేమోప్రళయము వచ్చిపడినది. "నా బిడ్డయిట్లు పడిపోయినదేమి? నా బిడ్డను లేవనెత్తి మఱల నడిపించువారు లేరా" యన్నట్లు "అంభా అంబాయని అరుచుచునేయున్నది.

ఆ దూడ యఱపు నంతకన్న నంతకన్న సన్నగిల జొచ్చినది. విలవిల కాళ్ళు తన్నుకొని, యాలేగ ప్రాణములు విడిచినది. గర్భనిర్భేద్యమగు మహారావము సలుపుచు నా గోపురంధ్రి యా లేగ ప్రక్కనే కూలబడిపోయినది.

## 4

**ఆ**నాటి సమారాధన లన్నియు నిర్వర్తించి. తానును భోజనాదికము గావించుకొని, యొక ముహూర్తము విశ్రమించి, తృతీయ యామాంతమున దాను నివసించుచున్న సామంతుని కోటలోని సభాభవనమున శ్రీవిష్ణుకుండిన మాధవవర్మసార్వభౌముడు గొలువు దీరినాడు. సామంతులు నితర రాష్ట్రముల రాయబారులు పరివేష్టించి యున్నారు, వేద పారాయణ, ధర్మార్థ నిర్వచన, పురాణపఠన, కవిప్రశంసలయిన పిదప గాయకులు పాడిరి. ఆటకత్తెలాడిరి. మహామంత్రి యేవియో రాజకీయ విషయములు సార్వభౌమునితో మనవి చేయుచుండిరి.

ఆ సమయమున సభాప్రాంగణ మంటపమునందు ధర్మఘంటిక "ఖంగు" "ఖంగు" మని మ్రోగనారంభించెను. ఆ ధర్మ ఘంటికకుఁ గట్టిన రజ్జువు ధర్మస్తంభము మీదనుండి, ప్రాకార కుడ్యము మీదనుండి, సభాభవన గోపురము ప్రక్కగ వ్రేలాడుచుండును. రాజోద్యోగు లెవరైన నన్యాయము చేసినచో, ధర్మమునకు గాని వాటిల్లినపుడు తనకు ధర్మము దయచేయింపవలసినదని యెవరైనను ప్రభువునకు ఆ ఘంటారావముచే విన్నవించు కొనవచ్చును.

ఆ విన్నపమునకు గాలనియమము లేదు. రాత్రియైన బగలైన ప్రభువు కొలువుదీరి యున్నను లేకపోయినను నా రాష్ట్ర ప్రభువులైనను, ఆతడు లేనిచో ఆ రాష్ట్ర రాజ ప్రతినిధి

అయినను వెంటనే యావిన్నప మందికొనుటకుగాను మాధవవర్మ మహారాజు ధర్మ ఘంటిక నిట్లు మ్రోగించుట కేర్పాటు చేసినాఁడు. తన సామంతులందరును దన వలెనే యా విధాన మవలంబింప వలయును. తాను ధర్మపాలనమున నప్రమతుడు. ఈ రీతిని బూర్వ ప్రభువు లనేకులు ధర్మపాలన చేయుచుండిరట.

నే డా ఘంటానినాద మొక్కసారిగ సభయంతట మారుమ్రోగగనే, సభాభవనము చిటుక్కున నిశ్శబ్దత వహించినది. ఘంటమ్రోగుచునేయున్నది. మాధవవర్మ మహారాజు సింహాసనమునుండి లేచినాడు. సభయంతయు లేచినది. సింహాసన వితర్దికా సోపానముల నుండి దిగి, మహారాజు విసవిస నడచుచు సభా సింహద్వారము దాటి, ధర్మఘంటికా మంటపముకడ నిల్చినాడు. "ధర్మమును నిలబెట్టు"మన్నట్లు ఘంట మ్రోగుచుండెను ఎత్తిన తల దించి, మాధవవర్మ మహాప్రభువు గోపురము దిక్కునకు నడచినాడు ప్రభువువెంట మహామంత్రి, అతని ననుసరించి సేనాపతులు, వారివెనుక రాయబారులు, మహారాజున కీవల నావల బండితులు, వారికిటునటు నంగరక్షకులు, అందరివెనుక తక్కువగల సభయంతయు నిలబడినది.

మహారాజు గోపురము దాటి భవన ముఖస్థలమునకు వచ్చెను. ఆ విశాల ప్రదేశమున వేలకువేలు ప్రజలు, స్త్రీలు, పురుషులు, వృద్ధులు, శిశువులు, కన్నులనీరు నించుచు జేతులు జోడించి నిలచియున్నారు. ధర్మఘంటికా రజ్జువును బాగులు నుత్తమకులజయైన గోవొకటి నిలచియున్నది. ఆ గోవువెనుక రక్తసిక్తాంగమైన కోడెదూడ శవమును మోయుచున్న ఒక గృహస్థు నిలచియున్నాడు. మహాప్రభు వట్లునిలుచుండి, "ఏమిది గోమాతయే, త్రాటిని లాగుచుండుట! ఆ తల్లికేమి ధర్మహాని సంఘటిల్లినది? ఈ త్రాడులాగ నా గోమాత కెవ్వరు నేర్పిరి?" అని ప్రశ్నపరంపరల బ్రజలనుద్దేశించి పలికినాడు.

అప్పుడొక పెద్ద ముందుకు వచ్చి, "ఆ త్రాటిని లాగ నీ గోమాత కెవరును నేర్పలేదు మహాప్రభూ. ఈ యావు ఇచ్చటకు వచ్చుననియేని మే మనుకొనలేదు. ఈదూడ రథము క్రింద బడి ప్రాణము కోల్పోయినది. ఈ యావు పడిన బాధ వర్ణనాతీతము. ఇంతలో నాగోవు యజమాని వచ్చినాడు. ఈయా వుత్తమజాతిదని రోధించినాడు. తన కోడెదూడ యుత్తమలక్షణ సమన్వితమట. దానిని దమకుటుంబము వారందరు అల్లారు ముద్దుగ బెంచుకొనుచుండిరట. ఆ యజమాని పడువేదనను మేము చూడలేకపోతిమి. ఆతడా దూడకళేబరము నెత్తికొని తనయింటికి దీసికొపోవుచు 'దల్లీ! నందినీ! రా, అమ్మా! అని పిలిచినాడు. కాని యాలోచనాధీనవలె కదలినదికా దీయావు. ఇంతలో నీ గోమాత కోట కభిముఖియై రాసాగినది.

"ముందు నీ యావు. వెనక నా దూడ శవమును మోయుచు నా యజమాని, అచ్చట జరిగిన దుస్సంఘటన జూడం జేరిన మేము, ఇటుల నాయావు దిరిగిన దిక్కునకు నడచుచు వెంట వచ్చితిమి. కోటగుమ్మము దాటి. అంతర్ద్వారము దాటి, యీ గోపురమునొద్ద నున్న ధర్మరజ్జువుకడ కీ తల్లి వచ్చి దానిని గ్రహించి లాగ నారంభించినది. జరిగిన వృత్తాంతమిది మహాప్రభూ!" యని విన్నవించినాడు.

మహారా జాశ్చర్యమును సంభ్రమమును నందినాడు. ఇంతలో నాతని మోము గంభీరత దాల్చెను. "ఇదియే ధర్మసభ! ఇచ్చట ధర్మము సంస్థాపింపం బడుగాక" యని మహారాజనెను.

"ధర్మమేవ జయతు, ధర్మమేవ జయతు" అని ప్రక్కనున్న పండితులు, దీప్తకంఠములతో పలికినారు. "ధర్మసంస్థాపనాదీక్షిత శ్రీవిష్ణుకుండిన మాధవవర్మ సార్వభౌమా! జయతు జయతు!" అని సభ్యులందరు జయవాక్యములు నినదించిరి. ప్రాడ్వివాకులు ముందునకు వచ్చి సాక్ష్యవిచారణ ప్రారంభించిరి. ఒక యర్థ ఘటికలో విచారణ పూర్తి యయినది.

యువరాజు దేవవర్మ "దోషి" యని నిర్ధారింపబడినది. మహాప్రభువు ధర్మజ్ఞులయిన పండితులవైవు చూచినాడు.

"యువరాజు దేవవర్మ యొనరించిన యా తప్పిదమునకు మరణమే దండనము. ఈ గోమాత దెక్కలకు వాడి యంచులుగల యుక్కుదెక్కలను తగిలించి శ్రీ యువరాజుల వారిని బరుండబెట్టి, భూమిని బాతిన మేకులకు గట్టి, ఈ గోమాతచే దొక్కించి మరణము నర్పించుటయే వానికి శిక్ష!" యని, పండితులు కరుణముగ మనవి చేసి, 'తాము దయార్ద్రహృదయులు!" యువరాజొనరించిన ఇది మొదటి తప్పిదము. వారికి మహాప్రభువు వేరొకశిక్ష విధించి, ఈ యజమానికి దగు పరిహార మిప్పించుట రాజధర్మమును మించిన పరమధర్మమని మనవి చేయుచున్నాము" అని పండితులు మౌనము వహించిరి.

"మహారాజా! యువ మహారాజును క్షమించుటే పరమ ధర్మమని మే మందరమును దమకు మనవి చేయుచున్నా" మని అక్కడ జేరిన ప్రజ లందరు నేకకంఠమున నరచిరి.

సార్వభౌముడు చలించలేదు. "రేపు ఉదయము విష్ణుకుండిన వంశజుడు, దేవవర్మకు మరణశిక్ష పురబాహ్య స్థలమున విధింపబడును. ఇది మా ఆజ్ఞ! మహాదండ నాయకులు మా విధించిన ఈ శిక్ష దేవవర్మ తల్లిదండ్రుల సమక్షమున నిర్వహింప మేము ఆనతి నిచ్చుచున్నాము" అని గంభీర ధ్వనుల పలికి తలవంచుకొని, వెనుకకు తిరిగి, తిన్నగ నభ్యంతర మందిరములలోనికి వెడలిపోయెను.

విజయవాటికా నగరమంతయు నా వార్త ప్రాకిపోయెను. ప్రజలట్టుడికిపోయిరి.

## 5

దేవవర్మ నడుపుకొని పోయిన యా రథమట్లు వాయువేగమున పరుగిడుచుండ, యువరాజుకు పూర్ణముగ మత్తెక్కి ఆ రథముపైన పడిపోయినాడు. సూతుడశ్వహృదయము నెరిగిన ప్రజ్ఞావంతుడగుటచే, యువరాజొరిగిపోవగనె, ముందున కురికి, యువరాజు చేతులనుండి జారిపోయిన పగ్గముల నందుకొని, తీయని మాటల జెప్పుచు, గుఱ్ఱముల ననునయించుచు, అశ్వశాంతి మంత్రము పఠించి. వాని వీపులపైన దక్షిణ హస్త తలముచే నిమిరినాడు. నురుగులుగ్రక్కుచున్న యాతురగములు రెండును భయముతీరి వేగము తగ్గించి, నెమ్మదించి చివర కాగిపోయినవి.

సూతుడు వానిని పూర్తిగ సేదదీర్చి, వెనుకకు త్రిప్పి రథము కోటలోనికి గొనిపోయెను.

రాజకుమారుడు విడిదిచేసిన హర్మ్యము మ్రోల నా రథమాగగానె సర్వ సేనాధిపతియు, మహాదండనాయకుడును ఇరువురు రక్షక భటులతో వచ్చి, రాజకుమారుని రథము నుండి దింపి లోనికి గొనిపోయిరి. మహా దండనాయకుడు, మహా సేనాపతియు గత్తులు దూసియే యుండిరి.

ఆ రాత్రి వారిరువురు యువరాజును ఆయన భవనముననే బంధించి రాజాజ్ఞను బరిపాలించువారై యప్రమత్తత గావలి కాచిరి.

రాజవైద్యుడు వచ్చి యువరాజునకు వైద్యోపచారయులు చేసినాడు. ఆ యుపచారములచే యువరాజునకు మత్తువీడి పూర్తిగ మెలకువ వచ్చినది. తాను బరుండిన పల్యంకముపై లేచి, కూర్చుండి, ఆ దాపున గత్తులు దూసి నిలుచుండిన మహాదండ నాయకుని మహాసేనాధిపతిని నాశ్చర్యమున దిలకించుచు "ఏ, ఏ, ఏమి జరిగినది... జరిగినది... జరిగినది! మహాసేనాధిపతీ! వైద్యులవారు వచ్చిరెందుకు?" అని చేతులును, బెదవులును వడంక ప్రశ్నించినాడు.

రాజకుమారునికి మత్తు వదలిపోయినను, మధుపాన జనిత నిస్సారము వీడలేదు. మరల వైద్యుడు నీరసము వదలుటకు దోనెలో నొక కుప్పె నరగదీసి అది తమలపాకున కెత్తి మహారాజ కుమారునకు సేవింపనిచ్చెను. మందు కంఠము దిగిన రాజకుమారునకు గొంచెము సత్తువ వచ్చినట్లయినది. తాను దన యభ్యంతర పానశాలయందు మధువు సేవించిన విషయము స్ఫుటాస్ఫుటముగ గోచరించినది.

**రాజకుమారుడు:** ఏమి జరిగినది మహాసేనాపతీ!

**మహాసేనా:** తాము రథము నెక్కి వీధుల వెంట స్వారీచేయ నారంభించినారు.

**రాజవైద్యుడు:** తామే స్వయముగ గుఱ్ఱముల దోలినారు.

**రాజకుమారుడు:** అది నా కేమియును దెలియదు.

**మహాసేనా:** గుఱ్ఱము లవశములై పరుగిడసాగెను.

**రాజకుమారుడు:** అయ్యయ్యో! ఎంత తెలివితక్కువ పని! మహారాజు పరమ శివారాధన సేయుచుండ నాబుద్ధి పెడదారినిబట్టి మధువు సేవించితిని. జైత్రోత్సవముల దప్ప నెన్నడును నట్టిపని చేసి యెరుగను. మహాసేనాపతీ! నా మూర్ఖత వలన నెవరికయిన బ్రమాదము వాటిల్లలేదుగదా?

**మహాసేనా:** ప్రమాదమే సంభవించినది ప్రభూ!

**రాజకు:** ఆ! ఏమిటా ప్రమాదము॥ ఎలాటిదా ప్రమాదము!

**మహాదండ:** ఒక యావుదూడ తమ రథము క్రిందబడి మరణించినది.

**రాజకు:** అయ్యయ్యో! ఎంతదోష మెంతదోషము!

**రాజవై:** ప్రభువులు కొంచెము శాంతింతురు గాక. తాము ధర్మనిర్వహణము సేయు సమయ మాసన్నమైనది.

**రాజకు:** నేనేమి ప్రాయశ్చిత్తము చేసికొన్న, ఆ దోషము శాంతించును? నేను పశువుకన్న నీచుడనైతిని. క్రూరమృగము లాహారమునకై ఇతర జంతువుల దినును. నేను రాక్షసుడనై నిష్కారణముగ గోవధ చేసినాను.

**మహాసేనా:** ప్రభు! ఎన్నడు జరుగని వింతయే మన నాగోవు స్వయముగ వచ్చి ధర్మరజ్జువును లాగినది.

రాజకుమారుడు చఱ్ఱున మంచమునుండి లేచెను. "నేనెట్టి దండమునకైనను బాత్రుడను. నన్ను మహారాజు కడకు గొనిపొందు. మహాప్రభువును ధర్మవిచారణ సేయుడని కోరవలసియున్నది.

**మహాదండ:** ప్రభూ! ధర్మవిచారణ జరిగినది. తమకు......

**రాజకు:** ఆ! జరిగినదా! శుభము. శిక్షనందుకొనుటకు త్వరపడుచున్నాను.

**రాజవై:** శాంతింపుడు ప్రభూ! తమకు నిర్ణయింపబడిన శిక్ష యుదయమే నిర్వహింపబడును. సర్వప్రజాసమక్షమున, తన సుతుని గోల్పోయిన యా గోవే తమకు శిక్ష విధించును.

**మహాదం:** గోసమక్షమున దాము నేర మొనరించుటచే మహారాజు, మహారాణులవారి సమక్షమున, నాగోవు తమకు దండన నిర్వహించును.

**రాజకు:** అయ్యయ్యో! నే జేసిన తప్పునకు నాయన గారును, నమ్మగారును గూడ బాధ నొందవలసి వచ్చినదే! దీనికి నివృత్తిలేదు. ఈ పాపమునకు మరణమే దండనము.

**మహాసే:** మహాప్రభూ! తమకు... తమకు... ఆ..., ఆ దండనమే విధించినారు.

**రాజకు:** ధన్యోస్మి! ధన్యోస్మి!

ఆ మఱునా డుదయము నగర బాహ్యస్థలమున నగర వాసులును పరిసర గ్రామవాసులును వేన - వేలు చేరిరి. అనేకులు రాజభటులు విచ్చుగత్తులతో గావలి కాయుచుండిరి. ఇంతలో రాజకుమారుని దోడ్కొని రథముపై మహాసేనాపతియు, మహా దండనాయకుడును, ధర్మాధికారులును వచ్చి నారు. ఒకవైపున గోవును, యజమానియు, సాక్ష్యములిచ్చిన వారును గలరు. కింకరులు గొందఱు గోవు డెక్కలకు బదునుగల యంచులున్న యుక్కుడెక్కల దొడుగుచుండిరి. మహారాజు విష్ణుకుండిన మాధవవర్మయు, మహారాణియు రథ మెక్కివచ్చిరి.

మహారాణి వదనమున నెత్తురుచుక్క లేదు. ఆమె కన్నుల నీరు కారిపోవుచుండెను. చక్రవర్తి తన దేవేరిని జేయిపట్టి నడిపించుకొనుచు వధ్యస్థలమునకు జేరినాడు. మహారాణిని జూచి ప్రజల కనుల శోకాశ్రువులు వరదలు కట్టసాగెను. రాజకుమారుడు కనకదుర్గాంబ గుడి మొగమై చేతులు జోడించి "సర్వమంగళ మాంగళ్యే! శివే! సర్వార్థ సాధకే! శరణ్యే! త్ర్యంబకే! దేవీ! నారాయణి! నమోస్తుతే!" అని ప్రార్థించుకొన్నాడు.

ఆ గోమాత బెదురుచూపులు చూచుచు దన డెక్కలకు నుక్కుడెక్కల దొడిగించు కొనినది. వేలకొలది జనులక్కడ జేరినను, గాఢనిశబ్దత యా జన సమూహము నావరించినది. రాజకుమారుడు వధ్యస్థలమున బండుకొనినాడు. తలవరులు మహారాజ కుమారుని త్రాళ్ళతో గట్టిగ గట్టి పెట్టిరి. మాధవవర్మ విష్ణుకుండిన మహారాజు మొముగ్గైలాస శిఖరమువలె స్వచ్ఛమై, ధర్మకాంతులు ప్రసరించుచుండెను. ఒక్కసారి మహారాజు చేయి నెత్తగానే కొమ్ము లూది, వీరాంగములు మ్రోగించినారు. భటులా ధేనువును రాజకుమారుని పైకి దోలినారు.

త్వరితగతి నాయావు రాజకుమారుని కడకు నడచి వచ్చినది. ఒక్కక్షణము మోరనెత్తి చూచినది. మఱు క్షణము రాజకుమారుని జూచి తలవాల్చినది. "అంభా" యని యరచుచు నాయావు గదలక అట్లే నిలచిపోయినది.

ఆ గోవును రాజభటులు ముందుకు నెట్టినారు. అదలించుచు దోలినారు. ఆ గంగిగోవిసుమంతయేని గదలలేదు. మఱల "నంబా" యని యరచినది. రాజకుమారు నొడలంతయు ముట్టెతో నా ఘ్రాణించినది. ఆ గోమాత కన్నుల గిఱ్ఱున నీరు దిరిగినది. కంటి నీటితో గోమాత నాలుక చాచి రాకొమరుని చేతులు, మోమును నాక జొచ్చినది. రాజభటులు గోవును మఱల గట్టిగ గ్రోసినారు. ఆవు వెనకకు దిరిగి కోపపుజూపు చూచి, మెల్లగ దన యజమానుని యొద్దకు బోయినది. ప్రజలందరు హర్ష నినాదములు, జయ ధ్వానములు సేయుచు "మహాప్రభూ! ధర్మసంస్థాపనమైనది. గోమాత దానిని బాలించినది. ధర్మమేవ జయతు! ధర్మమేవ జయతు!" యని యరచుట సాగించినారు.

గంభీరానన నిశ్చలుడై నిలుచున్న మహారాజు కన్నుల నీరు దిరిగినది. కదలక నిశ్చేష్టయై చేతలు మాని నిలుచున్న మహారాణి, "తల్లీ! కనకదుర్గా! నీవే నమ్మా! గోమాతవు!" అనుచు గుప్పగ గూలిపోయినది. పరిచారిక లామె కడకు బరుగిడివచ్చి మోమున నీరు చల్లి, పరిచర్య లొనరించుచుండిరి. గోవు యజమానియు గొందరు సాక్ష్యమిచ్చిన వారును రాజకుమారు నొద్దకు బరుగిడి వచ్చి కట్లు విప్పి వేసిరి.

అప్పుడు పరమేశ్వరుడు బంగారు వర్షము గురిపించినాడని ప్రజలు చెప్పుకొనిరి.

ఆ గోవును మాధవవర్మ విష్ణుకుండిన మహారాజు లక్ష ఫణము లిచ్చి కొనెను. ఆ గోమాతను తమ కులదైవముగ నెంచికొని వేంగీపురమునకు గొంపోయిరి.

ఆ గోదేవి పదునైదు వర్షములు జీవించి పరమపదించిన వెనుక మాధవవర్మ మహారాజు గోపాదక్షేత్ర గోదావరీతీరమున, దాని కగ్నిసంస్కార మొనర్చి, ధాన్యకటకపు బాలరాతితో నుత్తమశిల్పిచే గో విగ్రహము నొకదానిని విన్యసింప జేసినారు.

చక్కని దేవాలయ మొక్కటి గోపాద క్షేత్రమున నిర్మించినారు. అందా విగ్రహమును బ్రతిష్ఠించినారు. రాజకుటుంబపు స్త్రీ పురుషులందరు ప్రతివర్షమున నా గోమాతకు మహోత్సవములతో పూజ లర్పించుచుందురు. ఆ గోమాతకు బుట్టిన వత్సములన్నియు నా వంశమువారికి బూజనీయములు.

## 6

విష్ణుకుండిన మహారాజకుమారి అంశుమతీబాల ఒకనాటి సాయంకాలము కోటిలింగాల క్షేత్రమునుండి తన నౌకపై నెక్కి, గోపాదక్షేత్రమునకు వచ్చుచున్నది. రాజనౌక రాజహంస స్వరూపమున విన్యసింపబడినది. పడవ వాండ్రు తెరచాపలను విప్పుటచే నా నౌక రెక్కలను జూచి మానస సరోవరమునందు విప్పుకొన్న రాజహంసవలె నిర్మల నీలప్రవాహయగు గౌతమీ కూలంకషపై తేలికొనుచు వేగమున గోవూరు వైపునకు వచ్చునుండెను. సూర్యదేవుడు నిరవద్య (నిడదవోలు) పురమువైపున దిగి పశ్చిమాశా తలమున మాయమై పోయినాడు. కాశ్మీర కుంకుమ వర్ణదీధితు లాకాశ మెల్లెడను గ్రమ్ముకొన్నవి.

"నీలవర్ణముగాని, రజనీ గర్భాంతరిత కాలవర్ణముగాని, సంధ్యారుణరోచిస్సుగాని, ఏది యీ యాకాశమునకు సహజవర్ణము! శతసహస్ర శంఖ ప్రమాణ దూరములుగల యీ నిరవధికాంబరమున నెచటెచట నే వర్ణములు పొదివి కొని యుండునో ఎవరు నిర్ణయింపగలరు! ఎంత విచిత్ర మీ వర్ణముల మార్పు! మానగరదైవము చిత్రరథస్వామీ విరాలంబ మార్గానువర్తియై, తాను సృష్టించిన కాలములోనే, సర్వదా యానము చేయుచుండవలయును. సూర్యాస్త మయము, మఱల సూర్యోదయము. నిత్యుడై కదలక యేక ప్రదేశస్థుడైన సూర్యుడు కదలుచున్నట్లు గనబడుట ఎంత విచిత్రము!"

"ఉత్తమ బ్రాహ్మణ క్షత్రియవంశము విష్ణుకుండిన వంశము. అయ్యది తనతో సమాప్తమైనది. దూరస్థులైన జ్ఞాతులెవ్వరో యుండిరట. చిన్న చిన్న సామంతులై వారిని వీరిని గొల్చుచుండిన విష్ణుకుండిన నగరవాసులైన యా జ్ఞాతు లేమాత్రమును బ్రజ్ఞ లేనివారట." ఈవిధమున నాలోచించుకొనుచున్న అంశుమతిని "ఏమమ్మా! భర్తృదారికా! ఏ మాలోచించుచుంటి" వని మాధవీలత రాజకుమారిని బ్రశ్నించెను.

"ఏమని చెప్పుదు మాధవీ! ఒక దానికొకటి పోల్చరాని రూపములు! ఒక ఘటిక నొక ఘటిక తరుముకొని వచ్చినట్లు, కాలప్రవాహమువంటి యాలోచన లసంబద్ధములై నా హృదయమును జొచ్చి వచ్చుచున్నవి."

"ఆలోచనా మధ్యస్థుడై ఎవరో యొక యువకమూర్తి నీకు గోచరించుటలేదా?!"

"ఓసి వెఱ్ఱిదానా! ఎవరే ఆ యువకమూర్తి? లోకమూర్తి సూర్యుడే నవ్యుడును వృద్ధుడును! ఈ యనంతాకాశమున పూర్వమేది? పశ్చిమమేది?"

"నారసింహదేశికుల శుశ్రూష వేదాంతమార్గమున బట్టించుచున్నదా నిన్ను?"

"వెఱ్ఱిదానా! ఈ దేశ కాలములందు బద్ధులగువారికి వేదాంతముకూడనా?"

"ఏమో! నీమాట లెప్పుడును నన్ను ముంచుకొని పోవునేగాని కాలు నిలువద్రొక్కు కొననీయవు."

"గోదావరిలో మునిగి కొట్టుకొనిపోవుచున్నట్లుందును గాబోలు నేమి?"

రాజకుమారి నావను వెంబడించి, పరివారమును రక్షక భటులును ఉన్న పడవ లెన్నియో వచ్చుచుండెను. పరిచారి కాజన మున్నపడవ రాజకుమారి నౌకను వెన్నంటియుండెను. ఆ నావనుండి జవ్వని ఒకతె మృదుమధుర కంఠమెత్తి పాడుచుండెను.

*"గోదావరీ మాత*
*కొండలెన్నో గడచి*
*ఆ దారు లారేవు*
*లావనములను నడచి,*
*ఈ క్షేత్రముల మధ్య*
*ఈ నీరముల రథ్య*
*సాక్షాత్కరించినది*
*సర్వమంగళ రీతి,*
*పాడవే గౌతమికి*
*ప్రణతు లొసగిన పాట,*

*గాథరాగమ్ములో*
*కాకలీ స్వరముతో*
*పాడవే గౌతమికి*
*ప్రణతు లొసగిన పాట!*

*ఏ పర్వతోద్భవమొ*
*ఈ వాహినీ మాత*
*ఏ జడల విడివడెనొ*
*ఏ సీమ పుణ్యమున*
*పాడవే గౌతమికి ప్రణతు లొసగే పాట!*
*ఏ చెలియ గూర్చుకొని*
*ఏ చెలిమి దలచుకొని*
*వడినడల చిరునడల*
*పయనించు కడలికై*
*పాడవే గౌతమికి*
*ప్రణతు లొసగే పాట!"*

ఆ పాట నానందముతో వినుచున్న రాజకుమారి హృదయము హర్షముచే పులకరించినది. ఏవేవో దూరములు, ఏవేవో భావములు, నపారములై యస్పష్టములై, యా బాలికను దేల్చుకొని పోయినవి. గోదావరిలో స్నానములు, జపములును నాచరించు వారికి గోదావరీమాత రహస్యము లుపదేశించునేమో? కొండ పుట్టిల్లైన నది, కొండలను గూడ ఛేదించుకొని, యెన్ని సీమలు, దేశములు గడచి, రండురం' దని సర్వకాలమును నాహ్వానముచేయు సముద్రునిలో లీనమైపోవుచున్నది. "భర్తృదారికా ఈ సాయంతనమంతయు మీ యాలోచనలే మీకు. కాని నేను బ్రక్క నుంటినను మాట మరచిపోవుచున్నారా" యని రాజకుమారిని మాధవి ప్రశ్నించినది. ఆ మాటలకు అంశుమతీ కుమారిని మాధవి ప్రశ్నించినది. ఆ మాటలకు అంశుమతీ కుమారి పక పక నవ్వినది.

చీకట్లు క్రమ్ముకొని వచ్చుచున్నవి. గోవూ రింకను క్రోశపాద మాత్రము దూరమున్నది. గాలి మందగించుటచే నావికులు తెరచాపలను దింపివేసి తెడ్లను వేయ నారంభించిరి, అనుసరించియున్న సైనికుల నౌకలలో బడవ పాటలు ప్రారంభమై గోదావరిపై నెగురు జలపక్షుల కల కలారావములతో సమ్మిశ్రితము లగుచుండెను. ఇంతలో నెట నుండి తారసిల్లినవో పది పదునైదు పడవలు, రాజకుమారి పడవల కెదురై చుట్టి క్రమ్ముకొని వచ్చినవి. ఒక్కసారిగా బిడుగులు పడ్డట్లు రణగుణ ధ్వని ప్రారంభమైనది. "కొట్టుడు! పొడువు" దను కేకలు, పడవను బడవతాకిన చప్పుడు, పరిచారికల యాక్రందనములు, గోదావరీగర్భము గగ్గోలైపోయినది.

రాజకుమారిక నావను నాలుగు పడవ లొక్కసారి చుట్టుముట్టినవి. ఎవరో ముష్కరులు పదిమంది యా నౌకపై కురికిరి. "ఏమిది! ఏమిది!" యని రాజకుమారి

విభ్రమము చెందుచుండగనే యా దుండగీంద్రు అంశుమతీ కుమారిని, మాధవిని నెత్తుకొని, ప్రక్కనున్న యొక పడవలోనికి ఢాకినులవంటి యాడువాంఁడ్ర చేతుల కందిచ్చిరి, రాజకుమారీ మాధవీలతల నోళ్ళకు నాఢాకినులు గుడ్డలు గ్రుక్కి కాలుసేతులు గట్టివైచి, నౌకాంతర్భాగములోనికి గొంపోయిరి. ఆ పడవ తన్ను మఱి మూడు పడవ లనుసరింప మహావేగముతో ధవళగిరి క్షేత్రము దెసకు బోదొడంగెను.

## 7

శ్రీశైల పవిత్రప్రదేశంబులకు దక్షిణమునున్న చళుక రాష్ట్రము నేలు ప్రభువులు చాళుక్యులు. సాతవాహనులకు సామంతులై సాతవాహన మహారాజ్య మంతరించిన వెనుక చళుకరాష్ట్ర ప్రభువు లిక్ష్వాకులకు సామంతులైరి. ఇక్ష్వాకులతో వారు సంబంధ బాంధవ్యముల నెఱపుచుండిరి. పల్లవుల తోడను, కందరూరు (గుంటూరు) ప్రభువులైన యానందుల తోడను, ధాన్యకటక ప్రభువులైన ధనకులతోడను, విష్ణుకుండిన నగరస్వాములైన విష్ణుకుండినులతోడను, వేంగీ రాష్ట్రధిపతులైన సాలంకాయనులతోడను, క్రముక రాష్ట్ర ప్రభులైన బృహత్ఫలాయనులతోడను, పూంగీరాష్ట్రాధిపతులైన పూంగీయుల తోడను, ఇక్ష్వాకులకు సామంతులై చాళుక్యులు వృద్ధిపొందుచుండిరి.

ఇక్ష్వాకుల రాజ్య మంతరించగనే పల్లవులు విజృంభించిరి. సామంతు లందఱును స్వతంత్రులైరి. చాళుక్యులను తమ స్వాతంత్ర్యమును బ్రకటించుకొని మహారాజ చిహ్నామగు 'భట్టారక' శబ్దమును వహించిరి. వారికిని పల్ల వులకును యుద్ధములు సాగినవి. చివరకు త్రినయన పల్లవమహారాజును చాళుక్యమహారాజు ఓడించెను. కాని యాతడు యుద్ధరంగమున వీరమరణము నందెను. చాళుక్య మహారాజ్ఞి వనవాసి కదంబుల యాడుపడుచు. ఆమె యప్పుడు నిండు చూలాలు. విష్ణుశర్మయను రాజపురోహితు, డామహారాణి, సహగమనము సేయ నుద్యమింప దత్ప్ర యత్నమును మాన్పించి, రహస్యముగ నామెను గొనిపోయి వాతాపినగరమున దన బందుగుల యింట దాచెను. ఆమెకు చాళుక్య విష్ణువర్ధనుడుద్భవించినాడు.

బాల్యమునుండియు విష్ణువర్ధనుఁడు వీర విక్రమ విహారుడై, విష్ణుశర్మ గుప్తముగా గొనితెచ్చిన రత్నభూషలను మార్చి ధనము సేకరించుకొని, యా కుంతల దేశమున వాతాపినగరము దనకు ముఖ్యనగరముగ నొనర్చుకొని, సైన్యముల సమకూర్చుకొని, నెమ్మది నెమ్మదిగ రాష్ట్రకూటుల రాజ్యమునుండి జయించిన యా భూభాగమున చాళుక్య రాజ్యము నిర్మించినాడు. చాళుక్య విష్ణువర్ధనుడు పరమ బ్రహ్మణ్యుడై, విష్ణుభక్తుడై, వరాహ లాంఛనమును గ్రహించినాడు. తన రాజ్యమును తూర్పు పడమరలకును, దక్షిణోత్తరములకును విస్తరింప జేయసాగెను. వాతాపి నగరమే యాయనకు రాజధాని యాయెను. పల్లవ సామ్రాజ్యములోని భాగము లన్నింటిని నాతని వంశీయులు చాళుక్య రాజ్యములో గలుపుకొనసాగిరి.

చాళుక్యరాజ్య మంతకంతకు విస్తరించి ప్రథమ పులకేశి కాలమున, బాట, సౌరాష్ట్ర, అవంతి, అశ్మిక, అపరాంత, కుంతల, ములకరాష్ట్రములు మొదలైననన్నిటిని దనలో

విలీనము గావించుకొని, మహాసామ్రాజ్యమైనది. రాష్ట్రకూటులు, వైదర్భులు, ఆంధ్రచోళులు, ఆంధ్రభోజులు పులకేశి చక్రవర్తి పాదముల దమకిరీటముల సమర్పించినారు.

ప్రథమ పులకేశి దివంగతుడైన వెనుక చాళుక్య సామ్రాజ్యమున గొన్నివిపత్తులు సంభవించినను, సామ్రాజ్య బలమిసుమంతయు హీనము కాలేదు.

ప్రథమ పులకేశి మహారాజునకు మనుమడైన ద్వితీయ పులకేశి మహారాజును నాతనితమ్ము లిరువురును బాలకులై యున్న దినములలో, మంగళేశ మహాప్రభువు రాజప్రతినిధియై రాజ్య మేలినప్పుడు చాళుక్య సామ్రాజ్యమున నెన్నియో కుట్రలు తలలెత్తినవి. మంగళేశుని యనంతరము ద్వితీయపులకేశి వాతాపినగర సామ్రాజ్య సింహాసన మధిరోహించి, చాళుక్య సామ్రాజ్య రాష్ట్రములన్నియు తిరిగి జయించి, తన రాజ్యముపై దండెత్తివచ్చిన యార్యావర్త చక్రవర్తియైన హర్ష సామ్రాట్టును వింధ్యారణ్య ప్రదేశములలో నోడించి, వెనుకకు దరిమివైచెను, తన విజయమునకై బుద్ధభగవాను నర్చించుచు వ్యాఘ్రనదీ గుహా సంఘారామములో (అజంతాలో) నొక నూతన గుహను నిర్మించి, సంఘారామ భిక్కులకు దానమిచ్చెను. తానర్పించిన గుహలో దన విజయమును బ్రజ్ఞాపూర్ణులయిన చిత్రకారులచే విన్యసింప జేసెను. ఆ చిత్రమున బారసీక రాయబారులు వచ్చి మహారాజును సందర్శింపుచున్నట్లుగూడ విన్యసింపబడెను.

తూర్పు తీరమున చిన్న చిన్న రాజ్యములు బ్రబలి యంతఃకలహములు మెండైనవి. కళింగ నగరాంధ్రగాంగులు, వేంగీనగర విష్ణుకుండినులు, కాంచీపుర పల్లవులు, దక్షిణ కోసలులు నొకరిపైనొకరు తలపడని సంవత్సరమే లేదు. ద్వితీయ పులకేశి యీ యరాజకము నడచుటకు కళింగముపై దండు విడిసినాడు. పిష్టపురమున కళింగుల సామంతుల నోడించి, యా నగరమును స్వాధీనము చేసికొనెను.

అంతటితో నూరుకొనక పులకేశి గాంగరాజధాని దంతనగరము వఱకు బోయి గాంగులను దాసోహమ్మనిపించి, వారిచే గప్పములు గొని, బ్రాహ్మణు లనేకులకు భూరిదానము లిచ్చి దానశాసనములు వేయించెను.

ఆ వెనుక పులకేశి మహాప్రభువు వేంగీపురము జొచ్చి, విష్ణుకుండిన మాధవవర్మ కొమరుడు మంచన భట్టారకునికడ వేంగీనగరమున కప్పముగొని తన సర్వసేనాపతులలో నుత్తముడగు పృథ్వీధ్రువ రాజేంద్రవర్మను ప్రతినిధిగా నుంచెను. పులకేశి పృథ్వీవల్ల చక్రవర్తి చోళ, పాండ్య, గంగవాటి గాంగుల, వనవాసి కదంబుల నోడించి సామంత సుంకములుగా ధనరాసులు గొనుచు వాతాపిచేరి అశ్వమేధ మొనరించెను. ఆ అశ్వముతో చిన్న తమ్ముడు విష్ణువర్ధన మహారాజు వెడలినాడు.

విష్ణువర్థనుడు వనవాసినగరమున రాజప్రతినిధియై ప్రజలన్ని సౌఖ్యము లనుభవించుచు నానందించుచుండ జల్లని పాలనము సల్పి రాజ్యమేలుచుండెను. ఇంతలో తన ప్రియానుజుడు విషమసిద్ధి - విష్ణువర్ధన ప్రభువును రాజధానీ నగరమునకు రావలయునని చక్రవర్తి యాహ్వానమంపినాడు. విష్ణువర్థనుడు హుటాహుటిప్రయాణమై సర్వకాలముల తన్ను అనుసరించియుండు కాలకంపనుని వెంటబెట్టుకొని వాతాపి నగరము వచ్చి చేరినాడు.

## 8

"నీవు దక్క మాతృభూమియైన యాంధ్రదేశమున శాంతిని నెలకొల్పు వారింకొకరు లేరు తమ్ముడా!" యని విష్ణువర్ధనుని భుజముపై తన దక్షిణహస్తమునుంచి పులకేశి బల్కినాడు. తమ్ముని చూడగనె చక్రవర్తికి గన్ను లానందమున జిగురించును. తన పుత్రులకన్న జిన్న తమ్ముని నెక్కువ ప్రేమతో బెంచుకొన్నాడు చాళుక్య సమ్రాట్టు. అన్నగారి యడుగు జాడలనె పూజించు విష్ణువర్ధనుడు తన కిరువదివేల బలగముండిన జాలునని కాలకంపనుని వెంటబెట్టుకొని విజయయాత్రకై వెడలుచుండును.

"విష్ణువర్ధనా! పిష్టపురదుర్గము కొండపై నిర్మింపబడకపోయినను నభేద్యమగుగోట కావున నానగరమునే నీవు రాజధానీనగరము సేసికోని యాంధ్ర సామ్రాజ్య మొకటి పునర్నిర్మాణము సేయుమని నిన్నాశీర్వదించుచున్నాను."

"మహాప్రభూ! పరమమాహేశ్వరులైన మీ ఆజ్ఞయే నాకు శ్రీరామరక్షయు, మంత్రప్రసాదమును."

"తమ్ముడా? నీవు రూపమున జిన్నవాడవయినను విక్రమమున, విజ్ఞానమున బెద్దవాడవు. నాయనా! నీ వేల నింతవఱకు వివాహము చేసికొన నిరాకరించినాడవో నా కేమాత్రమును రహస్యము గోచరింపలేదు. రాజన్యులు సురూపలై యుత్తమగుణాన్వితలైన తమ బాలికల నీకర్పింప నాకు బంపు రాయబారములు లెక్కింప నలవిగాదు గదా! నీ వన్నింటికి బెడమొగము బెట్టితివి. నీ యిష్టానిష్టము లన్నియు హృదయమునకు సంబంధించినవి. అందు నేనేమి జోక్యము గలుగ జేసికొనగలను!"

"అన్నయ్యగారూ! అస్పష్టమైనను దమయిచ్చను గ్రహించి, తదనుగుణవర్తినై ధన్యుడ నగుట నా పవిత్ర వ్రతము. వివాహము చేసికోనని నాకు ప్రతిజ్ఞ లేదు. హృదయమునందు దాగియున్న యొకానొక కారణముచే నా వివాహ మింతవరకును పొసగుటకు వీలులేకపోయివది. హృదయగతమగు ఆ వ్రత మేనాటికి సఫలమగునో ఆనాడు నా పాణిగ్రహణ మహోత్సవము తామే పెద్దలై జరిపింప సంభవింప గలదు. అంతవఱకును నన్ను క్షమింపుడని మాత్రము వేడుకొనుచున్నాను."

పాదముల కెఱగిన తమ్ముని సార్వభౌముఁడు భుజముల బట్టి లేవనెత్తి గాటముగ గవుగలించుకొనెను.

"సత్వరమున విజయుడవై నాకు వార్త పంపుము విష్ణువర్ధనా!" అని పులకేశి తమ్ముని కన్నులలోనికి దీక్ష్ణమైన చూపులు బరపి, మందహాసవదనుఁడై యాశీర్వదించెను.

విష్ణువర్ధనుడు సైన్యముల నడుపుకొనుచు బూర్వదిశాభిముఖుడై యాత్ర సాగించినాడు.

మధ్యదుర్గ గ్రామము నీడి, యాంధ్రమహాదేశము పలు తావులనుండి వేగుల రప్పించుకొనుచు, నచ్చటచ్చట స్కంధావారముల నిర్మింపించి, సైన్యముల నిలుపుచు బ్రయాణమున వేగము తగ్గింపకయు, సైన్యముల నలసట నొందింపకయు, నాతడు జైత్రయాత్ర సాగించుచుండెను.

వేంగీరాష్ట్ర పశ్చిమారణ్యములజొచ్చి విష్ణువర్ధనుడు తన సైన్యము నుత్తరదిక్కునకు మరలించినాడు. పిష్టపురమును దిరిగి యాక్రమించుకొనిన గాంగులు విష్ణువర్ధనుడు వేంగీనగరముపై పోవుచున్నాడని నమ్మిరి. వా రట్లు నమ్ముటకే యా యువప్రభువు కాలకంపను నాలోచన పెడచెవిని బెట్టి, వేంగీనగరమునకే తన సైన్యముల నడిపించుకొని పోవుచున్నట్లే నటించినాడు. చాళుక్య సైన్యములు ప్రథమముననే వేంగీనగరమును ముట్టడించినచో శాంతచిత్తుడును దుర్బలుడును నగు విష్ణుకుండిన మహారాజు త్వరలో లోబడునని పిష్టపురమున నుండిన గాంగులును, గాంచీపురమున నుండిన పల్లవులును అనుకొనిరి, వేంగీపురమున విష్ణువర్ధనుడు నిలిచి యున్నచో వారందరు ముట్టడింతురేమో యన్నభయము కాలకంపనునికి గలిగినది. ఆభావమా యువరాజు గ్రహింపకపోలేదు. కాని యాతడు తన రహస్యాలోచనల నేరికిని దెలియనీయడు. కాలకంపనుడును సర్వసైన్యములును గూడ విష్ణువర్ధనుడు వేంగీపురాభిముఖుం డయ్యెననియే తలంచిరి. ఇప్పుడు చటుక్కున నా మహారాజు తనసైన్యముల నుత్తరపు దిక్కునకు ద్రిప్పి కీకారణ్యములమధ్య నడిపించుకొని పోవునప్పుడు కాలకంపనునికి విష్ణువర్ధనుని హృదయ మర్థమైనది.

ఉన్నట్లుండి యొకరాత్రి చాళుక్య సైన్యములు పట్టిసమున కెదురుగనున్న తాళగ్రామము చేరుకొన్నవి. ఆ యుదయమే నిశితబుద్ధిగల చాళుక్యచరులు గొందఱు గోదావరీతీరమున నున్న కొన్ని గ్రామములలో నొకరికితెలియకుండ మరొకరికడ పడవలను తెప్పలను మాటలాడి యుంచినారు. ఆ నడిరేయి పడవలు దెప్పలును దాళగ్రామమువైపు జేరినవి. అప్పుడే యచటికి విచ్చేసిన చాళుక్య సైన్యములు నిశ్శబ్దముగ నావలియొడ్డునకు జేరినవి.

ఆవలి రేవు చేరుటేమి చాళుక్యసైన్యములు సువేగమున దమ ప్రయాణములు సాగించినవి. గాంగుల సైన్యము లన్నియు పిష్టపురమున లేవు. గోదావరీతీరము పొడవునను నా సైన్యములు కావలికాయుచుండెను. విష్ణువర్ధనుడు వేంగీపురమును బట్టుకొనిన వెనుక గోదావరిని దాటి, కళింగమును జేరకుండ జేయుటయే వారి తలంపు. విష్ణువర్ధనుడు ప్రయాణమాపక, పోయిపోయి పిష్టపురమును ముట్టడించెను.

## 9

**పి**ష్టపుర నగరము చుట్టును మూడు మహాకుడ్య శ్రేణులున్నవి. ఉత్తుంగములైన నలుబదిరెండు గవను (బురుజు) లున్నవి. నగరము చుట్టును త్రవ్వని అగడ్తయై హేలానది ప్రవహించును. వర్ష కాలమునందు దప్ప ఇతర సమయములందీ నదిలో నీరుండక పోవుటచే బిష్టపుర ప్రాచీన మహారాజులైన మాఠరులును, వారివెనుక సాలంకాయనులకు, విష్ణుకుండిసులకును సామంతులైన రామకాశ్యపులును హేలానదికి (నేటి యేలేరు) ఆనకట్టలు గట్టి, పంద్రెండు నెలలును లోతుగా నీరుండునట్లు చేసిరి. ఈ నది కుపశాఖలు నగరము నందు బ్రవహించుచు నొక్కొక శ్రేణికి నగడ్తలుగా నేర్పడినవి. బాహ్యా కుడ్యశ్రేణికన్న నెత్తైన మధ్యకుడ్యశ్రేణియు, నంతకన్నను నెత్తైయున్న యంతర్భిత్తికా శ్రేణియు

నొకదాని కొకటి కాపుగాయు చుండును. బాహ్యకుడ్య శ్రేణికి నలుబది రెండు గవనులు, మధ్యకుడ్య శ్రేణికి ముప్పదియారు గవనలును, లోని కోటగోడకు బదునారు గవనులు గలవు. ఒక్కొక్క గవ నొక్కొక్క కోటవలె నిర్మింపబడినది. ప్రతికుడ్యోపరిదేశమున నేనుగులు, రథములు గూడ బోగల మార్గములున్నవి. గవనులలో గోటగోడలపైన బృహత్పాషాణ పాతన యరత్రములు, (పెద్ద రాతిబండలను విసరు యంత్రములు) ప్రచండాగ్ని బాణముల విసరు యంత్రములునున్నవి.

కుబ్జ విష్ణువర్ధన మహారాజు సైన్యములతో బిష్టపురమును ముట్టడించునప్పటికి గోటగోడలపై లక్షలకొలది ధనుర్ధారులైన వీరులు కిటకిటలాడుచుండిరి. మొదటిగోడపై విలు కాండ్రును, కాగిన నూనె పోయువారును, సూరేకారము గంధకముతో సిద్ధముచేసిన యగ్ని బాణముల నుపయోగించు వారును అప్రమత్తులై యుండిరి. రెండవ గోడపైన శతఘ్నులును, నూరు వాడిగల కత్తులు పొదిగిన పెద్దదూలము నుపయోగించు సైనికులు, సేనాధిపతి యాజ్ఞకై వేచియుండిరి. మూడవదియగు లోనిగోడపైన భయంకరమైన పాషాణ పాతనయంత్రములు, చిన్న చిన్న కొండలంత రాళ్ళనైనను క్రోశము రెండు క్రోశముల దూరము విసరివైచుటకు నాయత్తముగ నున్నవి.

విష్ణువర్ధనుడు తన రెండులక్షల పదాతులను, పదివేల యాశ్వికులను, రెండువేల రథికులను అయిదువందల యేనుగులను గోటకు యోజన దూరమున జుట్టును వ్యూహము లేర్పరచి, యింత దుర్భేద్యమగు కోటను సులభముగబట్టు మార్గ మాలోచించుచు, నెక్కిన గుఱ్ఱమును దిగక, కాలకంపన మహారాజుతోడను, ఆయన కొమరుడగు జయనంది తోడను, పిట్టపిడుగగు బుద్ధవర్మతోడను పిష్టపురదుర్గమునకు చక్రబంధమల్లి నస్కంథా వారముచుట్టును తిరుగుచుండెను.

ఎట్టి దుర్గమదుర్గమునైనను విష్ణువర్ధను దవలీలగ బట్టగలుగువాడు. నున్న వి ప్రపాతములు గలిగి, యనేక కుడ్య సంరక్షితములై మహోన్నతములైన పర్వతము లందలి కోటలనైన నా చాళుక్యుడు సుఖముగ బట్టుకొన గలుగుటచే 'విషమసిద్ధి'యను బిరుదమును సముపార్జించెను. విషమ సిద్ధి చాళుక్యు నెరిగిన వారెవ్వరును దిట్టములైన కోటలు తమ కున్నవనియు నా కోటలలో దలదాచుకొని, తమ్మురక్షించుకొనవచ్చుననియు విసుమంతయేని ధైర్యము వహించియుండెడివారు కారు.

పులకేశివల్లభు డేబ్బదివేల యేనుగులను నిరువదివేల శతఘ్నియంత్రములను, నొక లక్ష యగ్ని బాణ యంత్రములను బ్రయోగించి పిష్టపుర దుర్గమును బట్టుకొనం గలిగెనట. ఆ పులకేశి వాతాపినగరము చేరినప్పటి నుండియు దానార్ణవ గాంగ యువరాజు, చాళుక్య సైన్యములు దక్షిణమునకు బోవగనే, పిష్టపురము తిరిగి పట్టుకొనెను. కోటి కర్షక పణములు వెచ్చించి మరల నాకోటను బాగుచేయించెను. పృథ్వీ మహారాజునకు "భట్టారక" నామము సమర్పించి, తన తోటి మహారాజని యాతని వేయి విధముల బొగడి, కళింగరాజ్యములోని కొన్ని విషయములను(భూభాగములు) గూడ నాతనికి ధారాదత్త మొనర్చి పృథ్వీమహారాజు కొమరునకు దన చెల్లెలు జాహ్నవీకుమారి నిచ్చి, వివాహముచేసి రామకాశ్యపులకును గాంగులకును గల సంబంధముల నెక్కువ చేసెను.

తన సైన్యములనేకముల బృధ్వీ మహారాజు సైన్యములతో గలిపి, పిష్టపురదుర్గమును మరియు దుర్గమము చేసెను.

కావున బృధ్వీమహారాజు తన కోటను ముట్టడించిన కుబ్జ విష్ణువర్ధనుని సైన్యమును జూచి, పకపక నవ్వుకొనెను. అంతటి మహాసైన్యములతో వచ్చిన పులకేశి చాళుక్యుడు పదునైదు దినములకుగాని పిష్టపురమును పట్టలేకపోయినాడు. "ఈ మట్టగిడస పొట్టివాడు ఈ యీంగ సైన్యముల దెచ్చి, యుక్కుగుండును తినదలచినాడు కాబోలు" నని తనకడనున్న దానార్ణవ సేనాపతి కుంభకకర్ణుని వంటి కుంభమిత్రునితో నవ్వుచు బలికెను.

**పృధ్వీ:** కుంభమిత్రా! కుబ్జ విష్ణువర్ధనుడు సూదులను బాణములుగ వేయునటకాదా!

**కుంభ:** మహాప్రభూ! సూదులనెట్టు బాణములుగ వేయిదురు!

**పృధ్వీ:** నీవు ధనువున్నర పొడుగు వాడవు. పొడగరులమైన మేము నీకడ పొట్టి వారముగ గన్పింతుము. నీ ఉపయోగించు గద ఒక ముప్పాతిక ధనువు పొడవు గలది. నేనుపయోగించు గద నీ దానికన్న చిన్నది. నీ జానెడంత మనిషి యెంత గద నుపయోగించును?

**కుంభ:** ఆలాగునా అండీ! వ్రేలెడంత గద నుపయోగింపవచ్చును.

**పృధ్వీ:** కావుననే కుబ్జ విష్ణువర్ధనుడు సూదులను బాణములుగ నుపయోగించునని వింటివి.

**కుంభ:** ఆ సూదు లెంతదూరము పోవునో మహా ప్రభూ!

**పృధ్వీ:** మూరెడు దూరముపోవును.

**కుంభ:** అయినచో ఆ మహారాజు వాని నుపయోగింపనేల?

**పృధ్వీ:** అతడు పిల్లవాడు గావున ఆటకై యవి యుపయోగించునంట.

**కుంభ:** అంత చిన్న పిల్లవాడు యుద్ధమున కెట్లు వచ్చెను మహాప్రభూ!

ఈ రీతిగ పృధ్వీ మహారాజు కుబ్జ విష్ణువర్ధనుని కుంభ మిత్రుని యెదుట హేళన చేసెను.

ఆవగింజంత మాత్రమె మెదడున్న కుంభమిత్రునకు ఆ అవహేళన మర్థము కాలేదు.

## 10

పృధ్వీ మహారాజుకు కుంభమిత్రునకు సంభాషణ కోటలోపలి గోడపై జరుగుచున్నప్పుడే, అశ్వారూఢులై కుబ్జ విష్ణువర్ధనుడును, ఆయన నను గమించిన కాలకంపన ప్రభువును, ఆతని కొమరుడు జయనందియు దమ సైన్యముల వెనక నొక తోటలో నిలుచుండి యింకొక సంభాషణ నెరపుచుండిరి.

**విష్ణువర్ధనుడు:** కంపనప్రభూ! బలముచే నీ కోటను పట్టుకొనవలె నన్నచో నన్నగా రుపయోగించిన బలమునంతను ఉపయోగించవలసియుండును, మన సైన్యముతో నీ కోటను జయింప యత్నించుట కొండద్రవ్వి నెత్తి నెత్తుకొన జూచుట వంటిది.

**కాలకంపనుడు:** అగును, మహాప్రభూ! దీనికి దగు నుపాయమును దామే పన్నవలయును.

**కుబ్జ:** ఈ పృథ్వీమహారాజు కాలనేమివంటివాడు. జిత్తులమారి, స్వామిద్రోహి. ఈతని వలన నటు కళింగ రాజ్యమును, ఇటు విష్ణుకుండిన రాజ్యమును రెండును మోస గింపబడినవి.

**జయనంది:** మహాప్రభూ! ఇంతవరకు నొక పెద్దయుద్ధమైన చవిచూచి యెరుగను. మా చేతులు నిదురపోవుచున్నవి. మాకు సెలవిందు. మూడు కోటగోడలు గలిగిన యీ త్రిపురమునకు మేము పురహరుల మయ్యెదము.

**కుబ్జ:** త్వరపడకు మయ్యా! గుమ్మడికాయంత పండు నిచ్చి మ్రింగమందును, అపు డేమిసేతువు?

**జయ:** అది మెత్తని పండా, గట్టి పండా మహాప్రభూ!

**కుబ్జ:** పండు మెత్తని దగుటలోనను, గట్టిదగుటలోనను ఏమున్నది?

**జయ:** మెత్తని దగుచో ముక్కలు చేసి మ్రింగవచ్చును.

**కుబ్జ:** గట్టిదయినచో?

**జయ:** దానిని ముక్కలుగా కోసి, నమలిమ్రింగ వలయును?

**కుబ్జ:** కావున ముక్కలు చేయుట పండు ఎట్టిదైనను సమానమన్నమాట!

**జయ:** చిత్తము.

**కాల:** కావున నీ కోటను బట్టుటకు, గోటసంరక్షకుని ఏకాగ్రతను జెదరగొట్టవలెనని మహాప్రభువులు –

**కుబ్జ:** అదియే నా త్రిప్పికొట్టు తంత్ర ప్రయోగము. కోట బాహిరముననున్న మనపై శత్రువుల దృష్టి కేంద్రీకరింపబడి యున్నది. మనమేమి పన్నాగములు పన్నినను, శత్రువులు దానికి ప్రతిని బన్నుచునేయుందురు. కావున, కోట లోపలనొక సంక్షోభమునకు వారి దృష్టిని మరల్ప గల్గినచో వారి యేకాగ్రత ద్విముఖమగును. రెండు ముఖ్యములున్న దానిని బహుముఖములుగా మార్చుట మతిసులభము.

**జయ:** లో మన మెట్లు సంక్షోభమును స్పృజింప గలము మహారాజా?

**కుబ్జ:** ఓపిక పట్టుము.

ఆ రాత్రి చాళుక్యసైన్యము లన్నియు నప్రమత్తతతోనే మహారాజు నాజ్ఞ కొఱకు నెదురు చూచుచుండినవి.

నడిరేయి యగునప్పటికి బదివేల రెండెడ్ల బండ్లను ఎద్దులవిప్పివైచి ఒక్కొకబండి నెనిమిదిమంది వీరుల చొప్పున లాగికొనుచు, సార్ధయోజనము చుట్టుకొలతగల కోటచుట్టును మూడు యోజనముల వృత్తముగా నాక్రమించిన చాళుక్య సైన్యములను కుబ్జవిష్ణువర్ధనుల యాజ్ఞగా జయనంది కొని వచ్చెను. ప్రతిబండిపైనను దిట్టములైన దూలముల నడ్డముగా, నిలువుగా గట్టించినాడు జయనంది. చక్రములకు వాని వెడల్పునకు సరిపడు పొడుగుగల సన్నని గట్టి దూలములను గట్టించినాడు. ఇవన్నియు విషమసిద్ధి మహాప్రభువు నాజ్ఞలే! ఒక్కొక బండి క్రిందుగా నలుగురు విలుకాంద్రును, నెనిమిదీ మంది బండిని వెనుక నుండి త్రోయుటకును నుండుటకు మహా ప్రభువు నాజ్ఞ.

ఈ బండ్ల వెనుక శిలాపాతనయంత్రములు, నగ్నిబాణ యంత్రములు, శిలా చక్రయుక్తము లైనవి, రథములవలె బోవుటకుగా సిద్ధము చేయబడినవి.

కోటలో నర్ధరాత్రి భేరీ నినదించిన గడియకు పుర మధ్యమునఁ బెద్ద గగ్గోలు బయలుదేరెను. నిదుర గూరిన ప్రజలందరు నొక్కసారి మేల్కొనిరి. అటనట కొన్ని యిండ్లంటుకొని పోయినవి. హాహాకారములు మిన్నుముట్టెను ఇంతలో శత్రువులు కోటలో బ్రవేశించిరను గందరగోళము నగరమంతయుఁబ్రాకిపోయినది. కోట గోడలపై నచ్చటచ్చట "శత్రువులు ప్రవేశించినారు, శత్రువులు ప్రవేశించినా" రనుకేకలు రణభేరీ నినాదములు నొక్కుమ్మడిగ నుద్భవించినవి. ఎక్కడేమి జరుగుచున్నదియు నేరికిని దెలియలేదు.

ఉన్నట్లుండి నగర పూర్వగోపుర మహాకవాటములు తెరుచుకొనిపోయినవి. ఆ ద్వారమున శత్రువు లాక్రమించి నారిని అక్కడకు దొందరపాటుగ వచ్చిన పృధ్వీమహారాజు కనుగొని మఱల వేగముగ వెనుకకు దానెక్కిన యశ్వమును బరుగెత్తించుచు రాజప్రసాద గోపురము కడకు జేరెను. ఈ సంక్షోభమునకుఁగారణ మేమైయుండునో యని తికమక పడుచు దన పట్టపుటేనుగు నెక్కబోవు పృధ్వీమహారాజునకు ఉపసేనాధిపతి తూర్పుద్వారము శత్రువుల వశమయ్యెనని మనవి చేసినాడు. కోటగోడలపైన అమర్చిన శతఘ్ని యంత్రాదికముల నుపయోగించుడని యాజ్ఞ నిడువారైన లేకపోయిరి. శత్రువుల వైపునుండి యంత్రము నుపయోగించు రంగురంగుల బాణాసంచులు వచ్చి కోటగోడమీద సైనికులను, ముట్టడించువారికి స్పష్టముగ జూపుచున్నవి.

తూర్పుద్వారమునుండి చాళుక్యసైనికులు తండోప తండములుగ కోటలోనికి గట్టుతెగిన ప్రవాహమువలె రా జొచ్చిరి. ఆ సైన్యమును నడుపుకొనుచు చాళుక్యవిష్ణువర్ధనుండు నారాయణహస్త వినిర్ముక్త చక్రములె, తూర్పు గోపురద్వారములను మూటిని దాటి నగరములోనికి వచ్చి పడెను. అతనితో సమముగ కేతనముధరించి అంగరక్షక దళాధిపతి బుద్ధవర్మ వచ్చుచుండెను. "కుజ్జ విష్ణువర్ధనుడు! కుబ్జ విష్ణువర్ధనుడు!" అను నినాదములు మిన్నుముట్టగనే యాతని వేగము నడ్డగించువారుగూడ నాయుధములు విడిచి, జోహారు లొనర్చిరి.

ఇంతలో నుత్తర గోపురద్వారములు మూడును దెరచుకొని పోయినవి. అవియు చాళుక్య సైనికుల హస్తగతములైనవి. ఆ ద్వారములనుండి యేనుగులనడుపుకొనుచు సేనాధి పతి కాలకంపన ప్రభువు, లోనికి జొచ్చుకొని వచ్చినాడు.

యుద్ధప్రారంభమున గగ్గోలు బయలుదేరిన ప్రథమ క్షణములందు కోటగోడలమీది సైనికు లేమిచేయుటకును దోచక, మ్రాన్పడిపోయినను, శత్రువులమీదికి వారందు బాటులోనున్నను, లేకపోయినను నగ్నిబాణములు గండశిలలు ప్రయోగింపసాగిరి.

చాళుక్యసైన్యములందుండి యెద్దులేని బండ్లు వానియంతటనవే నడుచుచు వచ్చుచున్నట్లు, వానిలో మందు కాగడాల వెలుతురులో గోటగోడలమీది సైనికులకుగన్పడి యీవిచిత్ర మేమని వారు చూచుచుండగనే వానికి నాతిదూరమునశిలలు నగ్ని బాణములు విసరివేయు యంత్రములు వచ్చుచుండెను.

నగరములో గగ్గోలెక్కువైనది. లోపలనుండియే చాళుక్యసైనికులు కోటగోడలపై వచ్చి పడుచుండిరి. చాళుక్య సైనికులాక్రమించుకొన్న ప్రతి కుడ్య గోపురమునను రంగుల

బాణాసంచులు వెలుగ నారంభించినవి. ఎడ్లులేని బండ్లు మఱియు దగ్గరకు వచ్చినవి. రాళ్ళగట్టిన నిచ్చెనత్రాళ్ళను యంత్రములద్వారా చాళుక్యసైనికులు కోటగోడలపైకి విసిరి వైచిరి. పృధ్వీమహారాజు సైన్యములుగాని, కళింగ సైన్యములుగాని, కోటగోడల నుండి, యా వచ్చు బండ్లపైన నెన్నియస్త్ర ప్రయోగములు చేసినను ప్రయోజనము లేకపోయినది. శత్రువులు పూర్తిగ నగరము నాక్రమించిరని నినాదములు బయలు వెడలినవి.

రాచకోట ముందు నేనుగు నెక్కిన పృధ్వీమహారాజు చుట్టును చాళుక్యసైన్యములు క్రమ్ముకొన్నవి. తన యుత్తమ ధవళాజానేయము నెక్కి చాళుక్యవిష్ణువర్ధను డెదుట ప్రత్యక్ష మైనాడు. వచ్చుటయేమి, యా పిశాచపు బొట్టివాడింద్రుని వజ్రాయుధమువంటి బాణమును ప్రయోగించినాడు. అది చువ్వున వచ్చి, పృధ్వీమహారాజు కుడిభుజమున నాటుకొని పోయినది. ఇవి సూదులని హేళనచేసి తినే యని అనుకొనుచు నా అంబారిపైననే ఆ రాజు త్రెళ్ళిపడిపోయినాడు. ఆతని సైన్యము లెక్కడి వక్కడ చాళుక్య సైన్యములకు లోబడిపోయెను.

## 11

**పి**ష్టపురము వశమయిన వెనుక చాళుక్యవిష్ణువర్ధనుడు ఆ నగరమంతయు మరల బాగుచేయించుటకును, కృత్రిమాగ్నులచే, ముట్టడిచే నష్టపడిన ప్రజలకు పరిహార మిప్పించుటకును, కాలకంపన ప్రభువునకు అనుమతి నిచ్చెను. తన సైనికులకు బహుమానము లిచ్చి, వారిని తృప్తిపరచెను.

ఒకనాడు విష్ణువర్ధనుడు ఆలోచనామందిరమున సింహాసన మధివసించి యుండెను. అప్పుడు కాలకంపన ప్రభువును జయనందియు సమీపించి "మహాప్రభూ! శత్రువుల చిత్తె కాగ్రతను ఎట్లు భేదించగలిగినారో, నా కిప్పటికీ అర్థము గాలేదు" అని, వినయముగ బ్రశ్నించినారు.

విష్ణువర్ధనుడు నవ్వుచు జయనందితో, "ఓయి వెఱ్ఱివాడా! నేను వాతాపి నగరము నుండి బయలుదేరినప్పుడు పిష్టపురదుర్గ వ్యవహారము నేమియు నెఱుగక బయలు దేరితి నను కొంటివా! అన్నగారు ఈ దుర్గమ దుర్గమును బట్టలేదా! అన్నగారి సేనాధిపతుల కీ కోటసంగతి పూర్తిగ దెలియదా! ఈ దుర్గమునందున్న ప్రత్యంగుళ భాగమును, అందలి రహస్యము లన్నింటిని, మున్నే తెలిసికొంటిని. అన్నగారు బహు పరాక్రమముచే దీనిం గెలిచిరి. నేను గంభీర రహస్యోపాయముచే దీని సాధింపదలచితిని. వాతాపినగరమునుండి సైన్యములతో యుద్ధయాత్ర సాగించుటకు మున్నే వేవురు జైన సన్యాసులు, నాలుగు వేల భిక్షకులు, రెండుమూడు వేల పల్లె ప్రజలు వచ్చిరి. ఒక వేయిమంది వర్తకులు, మూడువేల గుఱ్ఱములగొని ఆస్మిక వణిజులటుల వచ్చిరి. వివిధ వేషములతో బదివేలమంది దిట్టరులైన మన సైనికులాయా వేషములతో నీ నగరమున వచ్చి చేరిరి. ఆటగాండ్రుగా దళవాయులు వచ్చిరి. తోలుబొమ్మల యాటకాండ్రుగా సేనాపతులు చేరిరి. శివదాసులుగా గూఢచారులు వచ్చియుండిరి. కొందరు విరోధుల సైనికులను మన పక్షమునకు ద్రిప్పివేసిరి. మన సైనికులు చాలామంది, పృధ్వీమహారాజు సైన్యములో జేరవచ్చినట్లు వచ్చిరి. అన్నగారితో చేసిన యుద్ధములో పిష్టపుర సైన్యము లెన్నియో మడిసినవి గదా!

**కాల:** కావున లోపల లొటారము పైకి బటారముగ పిష్టపురము సిద్ధమైనదా మహారాజా?
**కుబ్జ:** ఈ కోటను జేరవచ్చిన వారును, ఒకరి మంత్రాంగ మింకొకరు ఎరుగకయే యిచ్చటకు వచ్చిరి. కాని, యిట వారు కలుసుకొనునట్లు పాయములుపన్ని పంపినాను.

కాలకంపన ప్రభువును వారి కుమారుడు జయనందియు పొందిన యాశ్చర్య మపారము.

అప్పుడు కుబ్జ విషువర్ధనుడు "కంపనప్రభూ! ఒక పక్షము దినములు మన సైన్యములను విశ్రాంతి తీసికొననిండు. ఈ రాష్ట్ర ప్రజలు విష్ణువర్ధన చాళుక్య నుత్తమ పరిపాలన మెట్టిదో చవిచూచెదరు గాక" యని మందహాసవదనుడై పలికెను.

"ఈ లోన శత్రువులు బలమును కూడదీసికొనరా మహాప్రభూ?"

"అటుల నగుటయే ఉత్తమముకాదా కంపనప్రభూ! యుద్ధనీతి ద్వివిధము. విగ్రహమున శత్రురాజుల నందరిని చీలదీసి వేరువేరుగా నొకరొకరిని నాశనము సేయు టొక విధానము. శత్రువు లందరను నేకముగావచ్చి, అప్పుడు వారితో దలపడి శత్రుని శ్శేషము సల్పుట రెండవ విధానము!

"మొదటి విధానము సులభమును ఉత్తమము గాదా మహాప్రభూ!"

"నూతన రాజ్యము స్థాపించునాడు రెండవది మహోత్తమము. అట్లుకానిచో, శత్రునిశ్శేషము జరుగక, మఱల మఱల గుట్రలు తలయెత్తుచుండును. విడివిడిగా నోడిపోయిన శత్రువులు మనమందరము గలిసినచో, విజయము మనదే యై యుండెడిదని యాలోచించుకొందురు. రాజ్యమున సంక్షోభములు తప్పవు."

కాలకంపనుడు తన ప్రభువు యుద్ధనీతికి నాశ్చర్యమందెను. ఆ మరునాడు కుమార విష్ణువర్ధన ప్రభువు నిండు పేరోలగంబున గొలువుతీర్చియుండ దీనవదనయగు నొక బాలిక సింహాసన వేదికా సోపానపాదపీఠకు కడకు పరుగిడి వచ్చి సాష్టాంగముపడి "దేవా! రక్షించుము! రక్షించుము!" అని యరచి, మూర్ఛపోయెను.

తమ కష్టముల నివేదించుకొనుటకు రాజదర్శనార్థ మెవరు రాఁదలచుకొన్నను వారికెట్టి యాటంక ముండరాదని విష్ణువర్ధను నాజ్ఞ. కాలకంపన ప్రభువు తన యాసనము నుండి దిగ్గునలేచి, యా బాలికకడకు బోయి, మోకరించి "బాలిక మూర్ఛపోయినది. మహాప్రభూ!" యని విన్నవించి వెంటనే పన్నీరము కొనిరండని దౌవారికుల కాజ్ఞయిచ్చెను.

విష్ణువర్ధనుని చిన్నతనము నుండియు బెంచినవారిలో నొకడగు రాజవైద్యు డింతలో నచటకు వచ్చి, యా బాలిక ననాయాసమున నెత్తుకొని, రాజసభామందిరమునకు వెనుక నున్న యాలోచనా మందిరమునకు గొంపోయి, యచట నొక మంచాసనముపై బరుండబెట్టి నాడి పరీక్షసేయు చుండెను. వైద్యుని వెనుకనే విష్ణువర్ధనుడు కాలకంపన ప్రభువును వచ్చిరి. పన్నీరులు గొని పరిచారికలును వచ్చి చేరిరి.

"మహాప్రభూ! బాలిక మూర్ఛపోయినది. అదిగో! యామెకు మెలకువ వచ్చినది. ఒక కలికమును బెట్టెదను. అంతలో నీమెకు పూర్తిగ మెలకువ వచ్చి యధాస్థితి నందు" నని ఆ వైద్యుడు విష్ణువర్ధనునితో విన్నవించుచు కలికము బెట్టెను. "ఆ! ఆ!" యని యా బాలిక యొక్కసారిగా లేచి కూరుచున్నది.

"ఏమియు భయము లేదు. పరుండు మమ్మ! నేను వైద్యుడను. వీరుగో మహాప్రభువులు. అదే వారు కాలకంపన ప్రభువులు. తేనెతో రంగరించిన ఈ మందు సేవించి స్వాస్థ్యమునంది యా వెనుక మహారాజుతో నీవు చెప్పుకొనునది మనవి చేసికొమ్ము" అని యావైద్యుడు చల్లని మాట లాడుచు ధైర్యము చెప్పెను.

"మూడు దినములనుండి తిండి లేకుండటచే దల తిరిగి మూర్ఛ వచ్చినది మహాప్రభూ! అందుకు క్షంతవ్యను. రాజకుమారి! మా రాజకుమారి! మహాప్రభూ!..." ఆమె కంఠము రుద్ధమై మాటలాడలేకపోయినది. ఆమె కన్నుల జలజల నీరు ప్రవహించినది. విష్ణువర్ధను డా బాలికవైపు చూచుచు, "మీ రాజకుమారిక?" అని సాంత్వనముగ ఆమె కంఠము!

"మహాప్రభూ! మా మహారాజకుమారి యీ యంతఃపుర మందిరములలో నభ్యంతర కారాగారమునందు మూడు దినములనుండి పస్తుపడియున్నది. ఆ పిశాచులు మమ్ముపెట్టిన బాధలు–" ఆమె కన్నులనుండి మఱల బాష్పప్రవాహములు పొరలివచ్చినవి.

విష్ణువర్ధనుడు గంభీరస్వరమున "కాలకంపన ప్రభూ! మీరు వెంటనేపోయి ఈ దుష్ట సంఘటన మేమో కనుగొని రండు ఆరాజకుమారికకు సకలోపచారములు చేయింపుడు...రాజవైద్యునివైపు తిరిగి "వినయ దీక్షితులవారూ! మీరును కంపన ప్రభువు ననుసరించుడు. ఆ రాజకుమారికకు మీ వైద్య మవసరముండునేమో యని నాకు దోచుచున్న"దని వహించినాడు.

"మహారాజా! నా కిప్పుడు సత్తువ వచ్చినది. ఈ పరిచారికల సహాయమున నేను మా రాజకుమారి కడకుబోయిన తరువాత తమతో నన్నియు మనవి చేసికొందు" నని యా బాలిక మంచాసనము పై నుండి లేచినది. విష్ణువర్ధనుడు దయార్ద్రదృక్కుల నామెపై బరపుచు, "అటులనే పోయిరమ్ము" అని యామె కానతి యిచ్చినాడు. పరిచారికల సహాయ మక్కర లేకయే యా బాలిక లేచి, విష్ణువర్ధనునకు నమస్కరించి, యభ్యంతర మందిరము లోనికి వెడలిపోయినది.

విషువర్ధనుడొక్కడు అచటనున్న సుఖాసనముపైనధివసించినాడు. ఎవరీ రాజకుమారీ! పరిచారికలకన్న నికృష్టముగా జూచి, యామెను బంధించిన మహాపాపి ఎవడు? ఒక్కొక్కప్పుడు మానవుడు నరపిశాచియే యగును. మనష్యుని కాంక్ష లనంతములు. మానవ ధర్మముకై, పురషార్థ సాధనమునకై తమ జీవితములు సమర్పించు మానవులేపాటి గలరు! దురాశా పిశాచగ్రస్తుడైన మనష్యుడు హీనాతిహీనముగ సంచరించును అని యాలోచించుకొనుచు నా బాలిక స్థితి యెట్లున్నదో తెలిసికొనుటకై తొందరపడుచుండెను.

ఇంతలో రాజవైద్యుడును, కాలకంపన ప్రభువును నచ్చుటకు విచ్చేసినారు.

**వైద్యుడు:** మహారాజా! ఆ బాలిక వేంగీపుర విష్ణుకుండిన మహారాజు నేక పుత్రిక. అంశుమత్యభిధాన. ఆమె జాతకమునందు గొన్ని గ్రహదోషముల బరిహరింప వారి రాజగురు వామెను మాఘస్నాన వ్రతశీలను జేసెనట. ఆ రాకుమారి నాలుగు దినముల పూర్వము వఱకు గోవూరు నందు విడిది తీర్చి గౌతమిలో స్నాన వ్రతమును సంపూర్ణము

సేయుచుండినది. ఆ సాయంకాలము కోటి లింగాల క్షేత్రమున నున్న సర్వ బ్రాహ్మణ్యమునకు వివిధ దానము లర్పించి తిరిగి, తన రాజనౌకపై గోవూరు జేరబోవు సమయమున, నామెను, చెలియైన నీ బాలికను ఎత్తుకొని, ఇచ్చటకు దెచ్చి, రాజాంతః పురాంతర కారాగారమున బంధించిరట!

**విష్ణు:** ఎవరా నరరూప నిశాచరులు? కంపన ప్రభూ! మీరీ విషయమంతయు నామూలాగ్రముగ విచారించి, యా దుర్మార్గులెవరో కనుగొనుడు.

**కాలకంప:** మహాప్రభూ! ఆ బాలికను గొనివచ్చిన నీచులు కాళింగులే! నే నపచెడే యీ రాణివాస పరిచారకులను దీవ్రముగ బ్రశ్నించితిని. గాంగులకు విష్ణుకుండిన రాజ్యము నంతను గబళింపవలెనను దురాశ గలిగినది.

**విష్ణు:** ఆ దురాశ ఈనాటిది కాదు గదా!

**కాల:** విష్ణుకుండిన మహారాజున కీమె యొక్కతయే సంతానము. ఈ బాలికను వివాహ మాడినచో నల్లుడైన కళింగునకు ఆంధ్ర సామ్రాజ్యమంతయు దత్తమగును గదా?

**విష్ణు:** అయినచో రాకుమారి హస్తమును కళింగనగర మహారాజర్థించి యుండవచ్చునుగదా!

**కాల:** ఈ రాకుమారి కళింగ యువరాజు చిత్రము చూచి తనకా యువకుడు తగిన వరుడు గాడని నిస్సంశయముగ దెలిపివైచెనట.

**రాజవైద్యు:** అదే కారణము మహాప్రభూ! తన్ను వరించదని యెప్పుడు నిర్ధారితమయ్యెనో, కళింగ యువరాజప్పుడే ఈ బాలికను దస్కరించి కొనిపోయి, బలత్కరించి వివాహము చేసికొన నిశ్చయించి, ఈ దౌర్మార్గ్యమున కొడిగట్టినాడు.

**విష్ణు:** కాలంపన ప్రభూ! విష్ణుకుండిన రాజకుమారి స్వస్థత నొందగనే, వారిని సగౌరముగా గోవూరు కంపి వేయుడు. మూడు దినములలో మన సైన్యములు కళింగ నగరాభిముఖములైయజేయ్యములై జైత్రయాత్రను సాగించుగాక!

**కాల:** చిత్తము మహాప్రభూ!

## (12)

**వి**ష్ణువర్ధనుడు ప్రతి యుషస్సునను దప్పకలేచి తన యుత్తమాశ్వము నధిరోహించి, కొన్ని గోరుతముల దవ్వు అశ్వయానము చేసి తిరిగివచ్చి, యోగాసనాదు లొనరించి, యా వెనుక స్నానము సలిపి సంధ్యావందన మాచరించుకొనును. ఆపై నాతఁడుద్యాన వనవిహారము సేయును. పిష్టపుర మాతని హస్తగతమైన నాల్గవ నాడాతడు తన యలవాటు చొప్పున రాజోద్యానమున విహరించుచు, నా వన మధ్యస్థమైన కృత్రిమ సరోవర సోపానమున గూర్చుండి అలవోకగా నేదియో పాడుకొనుచుండెను. విష్ణువర్ధను డెంత వీరవిక్రముడో యాతని కంఠమంత మధురమై బాలకుని కంఠమువలె పంచమ శృతు లీనుచుండును.

ఆరోగ్యము పూర్తిగా గోలుకొన్న అంశుమతీ రాజకుమారి నిత్యాభ్యస్తమైన యుదయకాల విహారమునకై అప్పు డొంటరిగ నా ప్రదేశమునకే విచ్చేసెను.

ఎవరో యొక బాలుడు, చాళుక్య మహారాజు పరివారములోనివాడు, వన విహారమునకై వచ్చి యానందమున బాడుకొనుచున్నాడని యా బాలిక యనుకొన్నది.

ఆమె కదలక యచ్చటనే నిలుచుండి యా మనోహర గాంధర్వము నాలకించుచు నానందము ననుభవించుచుండెను.

ఏమి యా బాలుని భక్తి పారవశ్యము! ఎంత సుందరముగ నున్నాడు! ఈతని జూచినంతనే తన హృదయ మేలనో యార్ద్రతనొందుచున్నదని తలపోయుచు నటనే నిలుచున్నది. పాట ముగించుచునే విష్ణువర్ధనుడు తన సమీపమున నెవరో నిలుచుండిరని గ్రహించి యా వైపునకు జూపులు పరపెను. అప్రతిమాన సౌందర్యవతియగు బాలికయోర్తచట నిలుచుండు టాతడు చూచి, తాను కూరుచుండిన మెట్టుపై నుండి లేచి–

"ఎవరు మీరు? ఇచ్చటికి వచ్చినారు?" అని ప్రశ్నించినాడు.

"మీరెవరు? ఇది శుద్ధాంతోద్యానవనము. ఇందు పరపురుషులెవ్వరు ప్రవేశింపరే" ఆమె యతడు బాలకు డనియే యెంచెను.

"రాణివాసము వా రెవ్వరిచట లేరుగదా యని ధైర్యమున నిటకు వాహ్యాళికై వచ్చితిని."

"మీ మహారాజు రాణివాస మింకను రాలేదా?"

"మా మహారాజనగా?"

"మీరు చాళుక్య శ్రీవిష్ణువర్ధన మహారాజు పరివారములోనివారు కారా?"

"అవును! అవును! అయినను పరివారములోని వాడను కాను."

"అనిన?"

"అవును, పరివారములోని వాడనే కాని, గట్టిగ నాలోచించిన కాను కూడను."

"మీ మాటలు స్వవచనవ్యాఘాతదోషయుక్తములు."

"మరి – మరి – నేను రాజబంధువుడను."

"అదియా! అందుకనియా! మీరింత గజిబిజిపడినారు?"

"మీ రెవ్వరు? శ్రీగాంగరాణివాసమువారా? పరస్త్రీతో నిర్భయముగ మాట్లాడు చుంటిని, క్షంతవ్యుడను."

"మీరుకాదు, మాటలు ప్రారంభించినది నేను. అయినను నేను గాంగరాణివాసపు బాలికనుగాను. నేను – నేను – నేను శ్రీవిష్ణుకుండిన రాజకుమారిక చెలియను. శ్రీవిష్ణుకుండిన మహారాజులకు నేను సమీపబంధువును."

"క్షమింపుడు. నేనెంతయో తప్పిద మొనరించితిని."

"ఇందు దప్పేమి యున్నది? మీరును నేనును రాజబంధువులమైనను పరివారజనములోని వారము. మీ నామధేయము నాకు దెలియవచ్చునా?"

"నన్ను ప్రియదర్శి అని మీరు పిలువవచ్చును. మీ మహారాజకుమారి క్షేమముగ నున్నారా? సంపూర్ణారోగ్యము నందినారా?"

"వారు సంపూర్ణారోగ్యము నందినారు. మఱల గౌతమీస్నాన వ్రతమునకు దొందరగ బోవలయునట. ఈ యైదారు దినములు వారు వ్రతము మానివేయవలసి వచ్చినందుకు ప్రాయశ్చిత్తములు జరుపుకొనవలయునేమో! శ్రీ విష్ణువర్ధన మహారాజ కుమారుల

ప్రతాపముచే నరకము  వంటి యీ కారాగారమునుండి మాకు విముక్తి ప్రసాదింప బడినది. ఆ మహారాజునకు మా రాకుమారి యెంతయు గృతజ్ఞురాలు.”

“మా మహారాజు కళింగనగరముపై జైత్రయాత్రకు బోవుచున్నాడు. మీ రాజకుమారిని సర్వ మర్యాదలతో గోవూరు పురమునకు గొనిపోవ నాజ్ఞయిచ్చిరి.

ఇంతలో దూరమునుండి “మహారాజకుమారీ! మహారాజకుమారీ!” యని మాధవి కేకలు వినవచ్చినవి.

“ప్రభూ! ఇక సెలవు. మహారాజకుమారిని మాధవి కాబోలు పిలుచుచున్నది. నన్ను కిరణవతి యని మీరు పిలువవచ్చును” అని అంశుమతి చిరునవ్వు నవ్వుచు “మీకు నాయీడు ఉండునని అనుకొందును. భగవంతుడు మీ మహారాజును సర్వవిధముల రక్షించుగాక!” అనుచు నంశుమతి విసవిస నడిచిపోయినది.

ఓహో! ఏమి యీ బాలిక సౌందర్యము. జగన్మోహిని. విష్ణుకుండిన మహారాజునకు సామంతుడైన ప్రభు వెవ్వరికో యీమె తనయయై యుండవచ్చును. ఏమి మధుర కంఠము! ఆమె మాటలు కోకిల పులుగు కువకువలువలె దేనియలు చెమరించినవి. తానింతవరకు స్త్రీల నెవ్వరి నిటుల పలుకరించి యుండలేదు. ఈ బాలికకు వివాహమై యుండ నేరదు. అయినచో రాజకుమారికి సఖిగా నెట్లు రాగలుగును?

అందరివలెనే యీ బాలయు దన్ను బాలకు దనుకొనినది. ఆమె యీడెంత యైయుండును! పదునేడు పదునెనిమిది వర్షముల పడుచుప్రాయము. ఈ బాలిక తన్ను బదునెనిమిది వత్సరముల బాలుడని యెంచినది కాబోలు, అని ఆ యువమహారాజు మనస్సు కొంచెము ఖిన్నమయ్యెను.

తన వంశమున నేరును బొట్టివారు ఉద్భవించలేదట. తాను బూర్వజన్మమునందే కుబ్జుని జూచి పరిహసించెనో యీ జన్మమున నిట్లుద్భవించినాడు. కాని తాను మరుగుజ్జు మాత్రము గాదు. బాలకునివలె గన్పించును. అయినను తన పూర్వకర్మము వలననో, భగవంతుని కృపవల్లనో సంభవించిన ఈ వామనత్వమున కీ పది సంవత్సరములనుండియు తన మనస్సు అప్పుడప్పుడు దుఃఖము నందుచు దన్ను గుజ్జువానిగ నెంచినవారి నెల్లరను ద్వేషించుచు నానాటికి గర్కశత్వమును దాల్చినది.

తనలోని క్రోధమునకు దానే భయపడిపోవువాడు. ఆ క్రోధము తన్నే దహించివేయు ననుకొన్నాడు. లోక మసహ్యా మయిపోయినది. లోకప్రఖ్యాతి నంది, చతుస్సముద్ర వేలాయత మహాసామ్రాజ్యమును పాలించుచున్న పరమ బ్రహ్మణ్యుడైన తన అన్నగారు తన్నపరిమిత ప్రేమతో హృదయమునకు హత్తుకొని నప్పుడా ప్రేమ కరుణచే జనించిన దనుకొని తా నెంతయో  బాధ నందినాడు. తన పెద్దతమ్మునికన్న జిన్నతమ్మునిపై నెక్కుడు ప్రేమ గలుగుట కీ మరుగుజ్జుతనమె కారణమని యాతడు పొందిన వేదన వర్ణనాతీతమై పోయినది. అన్నగారు, చిన్నన్నగారు నిరువుర దనపై జూపుప్రేమకు గారణము, జాలిగాదని యెన్ని యో సారులు నిర్ధారితమైనను ఆ యనుమాన మప్పుడప్పుడు పీడించుచునే యున్నది.

కాని, యీ బాలిక, యీ పరమసుందరి, దివ్యగాత్ర తనకారీతి ప్రత్యక్షమైన మఱుక్షణమునుండి తన జీవితమున నేదియో అమృతశాంతి యలముకొన్నట్లయినదీ. ఏ సామంతుని కొమరితయో యీ బాలిక!

## 13

**గౌ**తమీ కార్తీక స్నానవ్రతమును సమాప్తము గావించి విష్ణుకుండిన రాజకుమారి అంశుమతి వేంగీపురము చేరుకొన్నది. స్నానవ్రత మాహాత్మ్యమో, మరియే కారణమో అంశుమతి గోవూరునుండి వచ్చిన నాటనుండియు నానందముచే గలకలలాడిపోవు చుండెను. ఆమె యెప్పుడును నెవియో పాటలు పాడుచునేయుండును. తానేర్చిన నాట్యకళా వైదుష్యమంతయు వెల్లి విరియ తా నాడును, చెలికత్తియల నాడించును. సన్నిహిత భాంధవియగు మాధవిచే నుషాబాల వేషము వేయించి, తా ననిరుద్ధుడై యవరోధ జనము నెదుట నుషాపరిణయ నాటకమును బ్రదర్శించినది. ఉష యాంధ్రుల యాడుబడుచు. ఉషకు బడమటి నుండి యనిరుద్ధుడు వేంచేసినాడు! ఆమె తనలో నవ్వుకొన్నది. ఏమి తనకీ యానందము!

ఆ నాటక మెంతయో రక్తిగట్టినది. మహారాణి తన కొమరిత నాట్యకౌశలమున కెంతయో పొంగిపోయినది. సంజ్ఞాదేవి హైహయుల యాడుబడుచు. కోనదేశాధిపతి యగు హైహయ మాధవవర్మమహారాజు సూర్యోపాసకుడు. బిడ్డలకై సూర్యు నారాధించి, కొమరితయగు సంజ్ఞాదేవిని, కొమరు డాదిత్యవర్మను బడసెను. హైహయులు విష్ణుకుండి నలును దగ్గఱి బంధువులు. సంజ్ఞాదేవి విష్ణుకుండిన యువ మహారాజు మంచన భట్టారకునికి ఉద్వాహము గావింపబడి యువరాణి యయినది. నేడు రాణి.

మహారాణి కొమరిత నంతఃపురమునకు గొనిపోయి తన మాంగళ్యమందిరమున గాశ్మీర దుకూలాంబర రత్న కంబళముపై నధివసించి, యుపధానముల నానుకొని, కొమరితను దగ్గఱగ గూర్చుండ బెట్టుకొన్నది.

"తల్లీ! మహారాజు నీ వివాహ విషయమున బెంగగొని యున్నారు. అనువైన సంబంధముల నన్నింటిని వలదంటివి. కళింగ గాంగులు, కాంచీపుర పల్లవులు, వాతాపి చాళుక్యులు బలవంతులై విష్ణుకుండిన వేంగీరాష్ట్రములకు శత్రువులై యీ రాజ్యమును హరింప గంకణము ధరించినారు" అని కొమరిత వైపు విచారము కుములుకొను తన మోమును తిప్పినది.

"అమ్మగారూ! నాయనగారు ధీరశాంతులు. వారికి యుద్ధమన విముఖత్వము. వారు సర్వధర్మప్రియులు. తాము చిత్రరథస్వామి భక్తులయ్యు, జైనులను, బౌద్ధులను, శైవులను, బూర్వమీమాంసకులను సమానప్రేమతో నాదరించుచున్నారు. వివిధ ధర్మావలంబములైన సంస్థలకెల్లను నెన్ని గ్రామములు ధనరాసులు దానము లీయలేదు!"

"అవును తల్లీ! వారు నీ కొఱకై తమ రాజ్యమునే దానమిచ్చుటకు సంసిద్ధులుగా నున్నారు గదా!"

"నేను బాలకుడనై పుట్టకపోవుట నాయనగారికి మఱియు నానందము సమకూర్చినది కాబోలు. ఆ యీ సంభాషణలలో వారాభావమును వెల్లడించుచునే

యున్నారు. కాని, నేను మాత్రమెన్నియో మారులు పురుషుడను కాక పోతిననియు, విష్ణుకుండిన మహాసామ్రాజ్యమును సుస్థిర మొనర్పజాలక పోతిననియు దుఃఖించితిని. ఏమి రాజ్యములు, ఏమి రాజులు! కాకులవలె గ్రద్దలవలె సైన్యములు సమకూర్చుకొని యనిత్యమును, గల్మశమునగు కీర్తికై యొకరి తల నొకరు నఱుకుకొనుచు, నొకరి రాజ్య మొకరు హరించుచున్నారు."

"అవును కన్నతల్లీ! నీవు బాలకుడవై పుట్టవలెనని వాంఛించినట్లీ నీ వేషమే నిదర్శనము. ఎంత జక్కగ నభినయించితివి. నాకు నీవు బాలకుడ వయియే జనించితి వేమో యని యొక నిమేషమాత్ర మనిపించినది. నీ వన్నట్లు రాజ్యము లెప్పుడును పాపకరములు. అహింసావ్రతమే ముక్తికి నిజమైన మార్గము. ఇతరులకు హానిచేయుట కన్నదన్ను దాను హింసించుకొని జినదేవలోకము నార్జించుట పరమధర్మమన్నారు..."

"ఏమిటా మాటలు జననీ! నే నీ వారము దినముల నుండియు నే కారణముననో ఆనందము నందుచు బొంగిపోవుచున్నాను. నా కీ పొడియారిన వేదాంతపు మాట లెందుకు? నా వివాహము విషయమై మాట్లాడుటకు దీసికొని వచ్చినారు. నే నొక పరమపురుషునికై యెన్ని యుగముల నుండియో యెదురు జూచుచున్నట్లుగ దోచెడిది. నేడు నాకా మహాభాగుడు పిష్టపురమున దర్శన మిచ్చినాడు. వాతాపి చాళుక్య సామంతులలో నొక ప్రభువు కుమారు డాతడు. పిష్టపుర రాణివాసపు టుద్యానమున నా వీరుని దర్శనమును హఠాత్తుగ బొందగలిగితిని"

"ఏమిటి? కన్నతల్లీ! ఎవరిని దర్శించితి నంటివి?"

"నా చేయిని గ్రహించి, నన్నీ లోకయాత్రలో దివ్యపథములకు గొనిపోగలిగిన నా నాయకుని సందర్శించితిని."

"అదేమి తల్లీ! ఒక సామాన్య సామంతుని నీవు వలచినావా! ప్రేమించినావా!"

"అవును అమ్మగారూ! అవును. అది ప్రేమయో, వలపో, నాకు దెలియదు, ఆతనికి నేనా పవిత్రక్షణముననే నా హృదయమును, నా సర్వస్వము నర్పించుగొంటిని. ఆయన సామాన్యుడగు సామంతుడైనను, చక్రవర్తియైనను నా కాతని స్థితితో నవసరము లేదు. ఆతడు చాళుక్య యువరాజైన విష్ణువర్ధన మహారాజుతో గలసి కళింగ గాంగ మహారాజులపై దాడి వెడలినాడు. నా హృదయ మాతని కర్పించితినమ్మా."

ఆ బాలిక మహారాణి కంఠమును బిగియార గౌగిలించి యామె హృదయమున దన మోము గాఢముగ నదిమి కొనుచు "అమ్మా నా కే మహారాజును, జక్రవర్తియు వలదు. నా కేడుగడయైన యా ప్రియదర్శి నిర్వక్ర పరాక్రములని నా హృదయమున వెంటనే స్ఫురించినది." అని డగ్గుత్తికపడ్డ మాటలతో నా బాలిక తన హృదయరహస్యమును వెల్లడించెను.

మహారాణి నిరుత్తరయై యేమియు మాట్లాడనేరక తన కూతురును హృదయమునకు గాఢముగ హత్తుకొన్నది. మఱునాడు నారసింహభట్టుపండితులవారిని విష్ణుకుండిన మహారాజు తమ యాలోచనా మందిరమునకు రప్పించుకొనిరి.

"గురుదేవా! ఈనాటి కమ్మాయి హృదయ మార్ద్రత నందినది. చాళుక్య యువమహారాజు ననుచరుడైన యొక సామంత యువకు నమ్మాయి వరించినదట. నాయాశలు భగ్నము లైన"వని దీనదృష్టుల జూచుచు మహారాజు పలికెను.

నారసింహభట్టు పండితు లాశ్చర్యము వెలిబుచ్చుచు "ఇదేమి ప్రభూ! ఈ సంఘటన యెట్లు ఘటిల్లినది?"

"అమ్మాయిని దుర్మార్గు లెత్తుకొనిపోవుట. గోపూరు నందున్న తా మెఱుగుదురు గదా! వారు గాంగులై యుండవలెను. కళింగగాంగ యువరాజుపై నాకు బూర్తిగ ననుమాన మున్నది. పిష్టపురమునుండి గాంగుల దరిమి, యా నగరమును చాళుక్య విష్ణువర్ధన మహారాజు స్వాధీన మొనర్చుకొన్నప్పుడు, అమ్మాయిని జెర విడిపించిన కొలది దినములకు నామె చాళుక్య సామంతుడైన యువకు నొకని జూచినదట. ఆ ముహూర్తముననే యాతడే తనకు గాబోవు భర్త యని నిర్ణయించుకొన్నదట. తాము దక్క యితరు లెవ్వరును మాకు సరియగు నాలోచన సెప్పువారు లేరు."

"మహాప్రభూ! మీరు నన్ను ప్రశ్నించిన యీ సమయమే మిక్కిలి యుత్తమము. రాజకుమారికి ఆ యువకుడే భర్త యగును. ఆతడే భావి యాంధ్రసామ్రాట్టు.

"చాళుక్య విష్ణువర్ధన యువమహారాజు కళింగాధిపులను బూర్ణముగ నోడించి వారి నుండి ప్రాభృతము గైకొని యతివేగమున వేంగీరాష్ట్రముపై నెత్తి వచ్చుచున్నాడట."

"మహాప్రభూ! నేను మంత్రాంగమున నాలోచించినను జ్యౌతిష పరముగ విచారించినను దమ రాజ్యములో యుద్ధము పొసగనేరదు. పులకేశి మహారాజు వచ్చినప్పుడును దాము వారితో యుద్ధము సేయరైరి. మి మ్మా ప్రభువు పదచ్యుతిని జేయలేదు. సరిగదా, మీ రాజ్యమును సుస్థిరము సేయుటయే తన తలంపనియు మీ సహాయార్థము మాత్రమే తాను తన సేనాపతియగు పద్వీరాజేంద్రవర్మ నిచ్చట నుంచితి ననియు దెలిపిరిగదా! ఆ భావమునకు నేడేమియు భంగము జరుగదు."

"ఏ దెట్లు జరుగునో చిత్రరథస్వామి యిచ్ఛ."

## 14

**వేం**గీనగర మారు గోరుతముల పొడవును, నాలుగు గోరుతముల వెడల్పును గలిగిన మహానగరము. ఈ నగరమును నిర్మించినవారు సాలంకాయన ప్రభువులు. సాలంకాయనులు శాతవాహనులలో నొక శాఖవారు. సాతవాహన శ్రీముఖ చక్రవర్తి, రాజబంధువగు కాన్వసాలం కాయనుని ఆంధ్ర కళింగరాజ్యపు టెల్లల కాపాడ, రాజ ప్రతినిధిగా నియమించి, గోదావరీతీరమున నొక దుర్గము నిర్మించుకొని, గోదావరీ తీరమును సంరక్షింప నాజ్ఞాపించెను.

గృధ్రవాడ విషయములో నాలుగు యోజనముల పొడవు మూడు యోజనముల వెడల్పు కలిగిన మహాసరస్సొకటి సొంపారి యున్నది. ఆ సరస్సులో ననేక చిన్న చిన్న నదులు సంగమించుచున్నవి. వేయి జల శకుంత సంతానజాతు లా కొలనులో నివసించుచు నిత్యకలకలారావ సంగీత మాలపించుచుండును. షోడశ పత్రములు, ద్వాత్రింశత్

పత్రములు, శతపత్రములు నగు కమలములును, రంగురంగుల కలువ పూవులును ఆ సరస్సునకు అలంకారములై పరీమళములు వెదజల్లుచుండును.

ఆ కొలని పడమటి తీరమున పద్మానది సంగమించిన తీరభూమిని రెండు యోజనముల పొడవును, నొక యోజనము వెడల్పును గల నగరమును కాన్హసాలం కాయనుడు నిర్మించినాడు.

సాలంకాయనుల కులదైవము చిత్రరథస్వామి. శాతవాహన సామ్రాజ్య మంతరించిన వెనుక యిక్ష్వాకులతోబాటు సాలంకాయనులు రాజచిహ్నమైన 'భట్టారక' శబ్దమును వహించిరి.

విష్ణుకుండిన మంచనభట్టారక మహారాజు, కొమరిత అంశుమతి శత్రువుల బారినుండి తప్పించుకొని క్షేమముగ వేంగీపురము చేరినందులకు చిత్రరథస్వామిని స్వయముగ నర్చింప సకల సామంత సేనాధిప రాజోద్యోగి సహితముగ పాదచారియై దేవాలయమునకు బయలుదేరెను. సింహ లాంఛిత విష్ణుకుండిన పతాక మెగురుచుండ, నా ధ్వజమును మోయుచు పట్టపుటేనుగు ముందు నడువ, వందిమాగధులు, నా వెనుక వేత్రహస్తులు 'జయజయ' ధ్వానములు సలుపుచు బారులుతీర్చి నడుచుచుండిరి.

వారివెనుక గంగా గోదావరీ కృష్ణా జలములు గల స్వర్ణకుంభముల వహించిన ధవళవృషభముల నడిపించుచు, వేదమంత్రములు పఠించుచు బ్రాహ్మణులు నడుచు చుండిరి. వారి ననుసరించి, ముఖపతులు, దళపతులు, సేనాపతులు నడచుచుండిరి. సకల రత్నాలంకారయుక్తమైన సామ్రాజ్య శ్వేతచ్ఛత్రము పట్టి ఛత్రధారులు నడచుచుండ నా ఛత్రము క్రింద మహారాజు, రాజగురువు కైదండగొని, మదగజమువలె గంభీర యానమున నడచుచుండెను. మహారాజు వెనుక సామంతులును, రాజబంధువులును ననుగమించుచుండిరి. పూజాద్రవ్యములు గ్రహించి బ్రాహ్మణ పుణ్యస్త్రీలా వెనుక వచ్చుచుండిరి. ఎద్దులబండ్లు శతపత్రములు మోసికొనుచు వచ్చుచున్నవి.

మహారాణియు రాజకుమారి అంశుమతియు శిబికలపై బరిచారికాజనములు గొలిచిరా జిత్రరథస్వామి కొలువునకు వెడలుచుండిరి. దేవాలయ ప్రాంగణము, ప్రదక్షిణపథము, కల్యాణమండపము, ముఖమండపము, గర్భాలయమును మనోహరా లంకారములతో ధగధగ వెలిగిపోవుచుండెను నాగస్వర కాహళ, ముఖవీణ భేరీ భాంకారాది మంగళవాద్యములు, దశదిశల నింపివేయుచున్నవి. ఒకవైపున నాట్యాంగనలు నాట్యకళావైదుష్యమును బ్రదర్శించుచుండిరి.

మూలవిరాట్టైన చిత్రరథస్వామి నవగ్రహ, అష్టదిక్పాలకాది పరివారదేవతలతో ఛాయాసంజ్ఞాసమేతుడై యా దేవాలయమున వేంచేసియుండెను. క్షేత్రపాలకుడైన కొలని భట్టారకేశ్వరుని యుపదేవాలయ మామహాక్షేత్రము నందున్నది. ఒకచో గొందరు బ్రాహ్మణు లాదిత్య మంత్రమును జపించుచుండిరి.

దేవాలయమంతయు నొక మహారథమువలె నిర్మింపబడినది. ముఖమండపము ముందు, నేనుగులంత పెద్దవియైన యేడు రాతిగుఱ్ఱములు గంభీర శిల్పాకృతిగలవి, ఆకాశమున నెగిరి పోవుచున్నట్లు విన్యసింపబడినవి. వాని దోలబోవుచున్నట్లు గరుడాకృతిని ననూరుడు మునిమండప పరోభాగస్థమగు నొక చిరువేదికపై అధివసించి యున్నాడు.

చిత్రరథస్వామికి వైభవముగ బూజలు జరిగిపోయినవి. ఆ దినమున మహారాజు రాజబంధుల కందరకును విందు చేసినాడు. బ్రాహ్మణులకు షోడశోపచారములును షోడశ మహా దానములును నలిపినాడు. ఆ మహానగరమునం దుండుజనాలయ సంఘారామాదులలో బౌద్ధ సంఘారామ చైత్య జినాలయ సంఘారామాదులలో బౌద్ధ సంఘారామ చైత్యాలలో బుద్ధదేవ జినదేవార్చనలు, భిక్షుక భక్తజన సమారాధనలు, సంఘారామములకు దానములు విష్ణుకుండిన మహారా జర్పించినాడు.

## 15

ఆ సాయంకాలము చాళుక్య విష్ణువర్ధనుడు తన సైన్యములతో గోదావరిని దాటి, గోపాదక్షేత్రమున దండు విడిసియున్నాడనియు కోనరాష్ట్రమునుండి హైహయు లా యువరాజును సందర్శించి, సామంతప్రాభృతములను సమర్పించినారనియు, మంచన భట్టారక మహారాజునకు వార్త వచ్చినది. ఆ విష్ణుకుండినమహారాజు చాళుక్య యువరాజు రాకకు దమ యానందము వెలిబుచ్చుచు, నగరమంతయు బ్రజ లలంకరింప వలెనని యాజ్ఞ దయచేసినాడు. చిత్రరథస్వామి మహోత్సవముల కొఱకు బట్టణ మిదివరకే సుందరతరముగా నలంకరించుకొన్నారు నగరప్రజలు.

ఆ మరునాటి యుదయముననే వేంగీమహాపురమున కుత్తర గోపురముకడకు విష్ణువర్ధనుడు తన సైన్యముల నడిపించుకొని వచ్చెను. నగర బాహిరోద్యానముల సైన్యములకన్నింటికి శిబిరము లేర్పరుపబడినవి. యువమహారాజు నంగరక్షక బలముమాత్రము పిష్ణువర్ధనునితో నగరము బ్రవేశించినది.

గోపురద్వారము కడనే విష్ణుకుండిన రాజ్యమహామంత్రి ఆదిత్యకీర్తియు, రాజగురువగు నారసింహభట్టులవారును, సర్వసేనాధిపతియగు విజయేంద్రగోపుడును రాజోద్యనులతో, సామంతులతో నెదుర్కొని జయములు బలికినారు. బ్రాహ్మణులు విష్ణువర్ధనునకు బూర్ణ కుంభ మిచ్చినారు. లాసికలు చాళుక్యునకు నారతు లెత్తినారు. చాళుక్య యువమహారాజునకు మహాక్రీడామందిరమును విడిదిగ నేర్పాటుచేసినారు. ఆ సాయంకాలము కోటలో, రాజసభామందిరములో విష్ణువర్ధన యువమహారాజునకు మంచన భట్టారక మహారాజు స్వాగతమిచ్చి తన యర్ధసింహాసనమున గూర్చుండబెట్టు కొనినాడు.

"చాళుక్య యువమహారాజా! తమ యన్నగారు చాళుక్య చక్రవర్తి పధ్వీవల్లభ పులకేశి మహారాజాధి రాజులును, తమ చిన్నన్నగారు ఘూర్జర మహారాజు జయసింహ మహాప్రభువును క్షేమముగ నున్నారని తలంతును."

"అన్నగార లిరువురును క్షేమము మహాప్రభూ! కళింగగాంగులు నాతో యుద్ధ మొనరింపకయే సామంత ప్రాభృత మర్పించుట నాకు వింతగనే కన్పించినది. అయినను జాగ్రత్త కొఱకు బిష్టపురమున నొక మహాసైన్యముతో నాకు బితృసమానుడగు కాలకంపన ప్రభువును నిల్పియే వచ్చినాను."

"అవును మహాప్రభూ! కాళింగు లెప్పుడును దురాశ కలవారు. మా రాజ్యమునకును, వారి రాజ్యమునకును తీవ్రమైన పోరాట మెన్నండును లేదు. గోదావరీనది సరిహద్దుగ నేర్పరచుకొనుచు, నెన్నియో పర్యాయములు వేంగీ రాజ్యమునకును, కళింగరాజ్యమునకును సంధి జరుగుచుండెడిది ఆ సంధిని భగ్నపరచినవా రెప్పుడును గాళింగులే. యువ మహారాజా! మీరు మా వేంగీనగరమును దమ యావాస నగరముగ జేసికొనుడు. ఇచ్చటనుండియే తా మటు ఈశాన్యమున గళింగగాంగులను, దక్షిణమున బల్లవులను అణచి యుంచువచ్చును."

"కృతజ్ఞుడను మహాప్రభూ! విష్ణుకుండిన సామంతులే కొందరు తిరుగుబాటులు చేయుచున్నారు. గృధలవాడ రాష్ట్రాధిపతి పల్లవ వంశీయుడు. తాను కాంచీపుర పల్లవ మహారాజునకును, నిటు తమకును గప్పము కట్టక, తాను భట్టారక శబ్దము వహించి స్వాతంత్ర్యము బ్రకటించుకొన్నాడని వేగువచ్చినది. అట్టి వారందరు తిరిగి తమకు గప్పము గట్టగలరు."

ఈ విధముగ గుశల ప్రశ్నము లనేకములు జరిగినవి. ఆ వెనుక విష్ణువర్ధనునకు మహారాజు సగౌరవముగ వీడ్కోలిచ్చెను. ఆ రాత్రి విష్ణువర్ధనుడు తన విడిదియం దొంటరిగ గూర్చుండి వివిధాలోచనములకు లోనయ్యెను. తాను విష్ణుకుండిన మహారాజుకడ గప్పము గైకొనుటయా! మానుటయా! తాను పిష్టపురమునా, లేక విష్ణుకుండిన నగరమునా స్థిరనివాసము చేసికొనుట! పల్లవులకు బుద్ధిగరపుటకు దాను కాంచీపురమువఱకు బోవలయునా, లేదా! అప్పటి కైదు సంవత్సరములకు పూర్వము పల్లవులు, చోళులు, పాండ్యులు నందరును 'దాసోహ'మ్మని కప్పములు గట్టుకొన్నారు తన అన్నగారికి.

అన్నగారు "తమ్ముడా! ఎప్పుడో యొకనాడు ఆంధ్ర మహాసామ్రాజ్య భాగమైన చళుక రాష్ట్రమునుండి వచ్చిన వారమే మనము. ఆంధ్రరాజులు పౌరుషవంతులు. వాతాపి నగరమున నుండి ఆంధ్ర రాజ్యములను లోబరుచుకొని యుండుట యెంతటి వీరుడైన వానికిని దుస్సాధ్య మగుచున్నది. పెద్దతమ్ముడు జయసింహప్రభువు ఘూర్జరమున సుస్థిరమగు రాజ్యమును నెలకొల్పి యున్నాడు. నీవు తూర్పుతీరమున మూడవ చళుక్య రాజ్యమును స్థాపింపుమయ్యా! నీకు శ్రేయమగును" అనుచు దన్నాశీర్వదించినారు. తానట్టి రాజ్యమును నిర్మింపగలుగునా!

తనకు సరియైన సైన్యమున్నచో, నెదిరి యెట్టి దిట్టయైనను యుద్ధమున దా నసమాన విజయ మొందగలడని యాతని కెప్పుడును ధైర్యమే. తా నింతదనుక నన్నగారికి ప్రతినిధిగమాత్ర మున్నాడు. రాజప్రతినిధిగనుండి పాలించుట వేరు, స్వతంత్ర రాజ్యమును స్థాపించి పరిపాలించుట వేరు.

ఇంతలో నాతనికి బిష్టపుర రాజోద్యానమున గనబడిన బాలిక స్మృతికి వచ్చెను. ఆతడు పొట్టివాడై యెప్పుడును బాలకుడుగ గన్పించుటచే దన బందుగులు తనయందు గనబరుచు బాలభావమువలన నాతని హృదయమున నాలోచనలెప్పుడును సుడిగుండములు తిరుగుచుండును. ఈ భావ సంఘాతముల వలననే యొకరిద్దరనిన తప్ప మనుష్యులన్న నాతనికి బరమజుగుప్స. ఇంక స్త్రీలన్న నాతనికి మరియునేవము.

సాధారణ రాజకుమారులు పరిచర్యలన్నియు దాసీజనముల వలననే పొందుదురు. విలాసవతులును, నందకత్తెలను నగు బరిచారిక లా రాజకుమారుల కనుసన్నల మెలగు చుందురు. కాని విష్ణువర్ధనుడు శైశవమునందే తన్ను బెంచు దాదులను నిరసించువాడు. ఆడువా రాతని కంట బడగూడదు. అట్లని యాతడు స్త్రీవిద్వేషియు గాడు.

ఇట్టి చిత్తవృత్తి గలిగిన విష్ణువర్ధను డెటుల పిష్టపురమున నాబాలికను బలుకరింపగలిగినాడో యాతనికే ఆశ్చర్య మొదవినది. కళింగ జైత్రయాత్రా దినములలో, నప్పుడప్పు డా బాలిక యాతని మనఃపథమున బ్రత్యక్షమగుచుండెడిది. ఆ భావము నాతడు వెంటనే సాలెగూటి దారములను దులిపివేసినట్లు దులిపివేసికోనువాడు నేడు వేంగీపుర మునకు వచ్చుటచే గాబోలు తన యంతర్వృత్తియం దట్లు చొచ్చుకొని యా బాలికను గూర్చిన తలపులు వచ్చుచున్నవి. ఆ బాలిక యిప్పు డేమి సేయుచుండును! రాజకుమారితో మంతనము సలుపుచుండును గాబోలు. మహారాజులకు మాత్రమే అనన్య సౌందర్యవతులగు బాలిక లుద్భవింతురను కొననక్కరలేదు. తక్కువలోతుగల సముద్ర భాగములందే అనన్యమైన ముత్తెములు దొరకును.

ఏమిటికో యీ యాలోచనలు తనకు! తనకును నా బాలికకును నేమి సంబంధము! తూర్పుతీర రాజ్యములలో బలవత్తరము పల్లవసామ్రాజ్యము. అది యెప్పటికప్పుడు పొంగుచు నుప్పెనవలె బైకెగయుచు, బ్రాంతీయరాజ్యములపై విరుచుకొని పడుచుండును. పల్లవులవలన నెన్ని రాజ్యము లస్తమించిపోలేదు! త్రినయన పల్లవుడుగదా, తన ముత్తాత తాతగారైన విజయాదిత్యునితో యుద్ధములు చేసి యనేక పర్యాయములోడి తుద కాతని జంపివేసెను ఏమైనను బల్లవులు దండార్హులు. వారిని గాంచీపుర రాజ్యములోనే బంధించి వేయవలసి యున్నది. ఆతడొక నిట్టూరుపు విడిచినాడు.

## 16

**చా**ళుక్య విష్ణువర్ధనుడు రాజోద్యానమున వివిధాలోచనల పాలయిన సమయముననె, అంశుమతీకుమారి తన యంతఃపురసౌధోపరిభాగమునందు రత్నకంబళముపై నధివసించి, దిండ్లనానుకొని, యా ఫాల్గుణ శుద్ధ దశమీచంద్రు నవలోకించుచు, వెన్నెలలు చెట్లకొమ్మలపై ఆకులపై నృత్యము చేయుట గనుగొనుచు నాలోచనాధీనయైనది.

తండ్రిగారికి విష్ణువర్ధన మహారాజును జూడగనే మనస్సార్ద్రత జెందినదట! ఈ మహావిక్రముడు తన కల్లు డైనచో విష్ణుకుండిన చాళుక్య వంశ సంజాతులైన మహాపురుషు లుద్భవించి, లోకోత్తరమైన మహదాంధ్ర సామ్రాజ్యము నిర్మింతురని యాశించుచుండిరట!

అందుకు తల్లిగారు “ఒకనాడు యావదాంధ్రసామ్రాజ్యము జగద్వైభవముగ నేలిన విష్ణుకుండిన వంశమునకు జివరికొమ్మగ నుద్భవించిన అంశుమతి యొక సాధారణ సామంతబాలుని పరిణయమాడుట తమ రాజవంశమునకు దీరని కళంక” మని పలికిరట.

ఈ సంభాషణ మంతయు దన యాంతరంగికురాలగు చేటిక యోర్తు తనకు నివేదించినది. ప్రత్యూషము నుండియు దా నానందముచే నుప్పొంగిపోయినది. ఏదియో

శుభము తనకు సన్నిహిత మగుచున్నదని దినమంతయు దన కంతర్వాణి బోధించి నట్లయినది. చిత్రరథస్వామి పూజలో దివ్యతేజస్స్వరూపుడైన యా దేవుడు జాజ్వల్యమాన కాంతులు ప్రసరించుచు దనకు బ్రత్యక్షమైనట్లైనది. ఇంతలో జలిపిడుగువలె దన తల్లిదండ్రుల సంభాషణ తెలియవచ్చినది. ధర్మహృదయ యగు స్త్రీకి దనకు గారాని పురుషునియందు మనస్సు లగ్నమగు టెట్లు!

"రాజకుమారీ! ఒక్కరు నేమి సేయుచున్నారమ్మా! పరిచారిక లెవ్వరు నుండరాదని యాజ్ఞ పెట్టితిరట" యనుచు చెలి మాధవీలత యచటకు వచ్చినది.

"మాధవీ! వచ్చితివా! పరిచారికల పొడిమాటలు నాకు విసువు గలిగించుచున్నవి. ఆకాశమును, జంద్రుడును మన కందిచ్చు భావములు నిశ్శబ్దములయ్యు మధురములు గదా!"

విష్ణువర్ధనమహారాజు మన మహాసభకు వచ్చినప్పటి వైభవమును జూచుటకు మీరు రాకపోతిరి!"

"అవును మాధవీ! విష్ణువర్ధన మహారాజుతో గలిసి యా బాలకుడు వచ్చునో రాడో! నా హృదయమంతయు నీకు సంపూర్ణముగ దెలిపికొనియుంటిని. నా హృదయ మిసుమంతయేని దెలియని తల్లిదండ్రులు నన్ను విష్ణువర్ధన మహారాజున కీయ సంకల్పించినారట!"

"ఔనమ్మాఔను. మనము గోపూరునుండి వచ్చినది మొదలీ విషయమును గురించి యంతఃపురము నందు భాషించుచున్నారట. రాజుల రహస్యము లన్నియు బరి చారికలకు దెలియకుండుటెట్టు! మహారాజున కిది గాటమగు గోర్కెగా బరిణమించినది. మహారాణియు దలయూపిరట. నారసింహభట్టులవారు, మహారాజుగారి యాలోచన లెస్స యనిరట. విష్ణువర్ధన మహారాజు మన నగరమునకు విచ్చేయుటయు నందుకు శుభశకునమట! కాని, వీరందరికి నొక పరమరహస్యము తెలియదు."

"ఏమిటది?"

"అది నాకనుమాన మాత్రము సుమా రాజకుమారీ!" నే నది తమకు విన్నవించుట మంచిది కాదేమోయని సందేహించుచున్నాను."

"మాధవీ! నీవును నేనును జిన్నతనము నుండియు నొక్కచో బెరిగిన వారము. ఒక గురువునొద్ద విద్య నేర్చిన వారమును. ఒకచో బండుకొంటి మొకచోట నిదురగూరితిమి. నీకును నాకును రహస్యము లెక్కడున్నవి!"

"అవునమ్మా అవును. కాని, యెంత స్నేహము సల్పినవారమైనను తమతమ ప్రణయవిషయముల నొకే మార్గమున నెట్లు సంచరించగలము! నాకు దెలిసిన విషయము నే ననుమానించుచున్న విషయమును నీ హృదయమున నినుపముల్లువలె గ్రుచ్చుకొను నేమోయని భయము నందుచున్నాను."

"ఆ రహస్య మెప్పుడైన నాకు గంటకమగునుగదా! ఈ పూట దాని బారినుండి నీవు తప్పింతువు. రేపది వేఱొక మార్గమున నాకు ఎదురగును. నా ప్రాణమిత్రమవగు నీ నోటనుండి యా మాటవిని యా బాధ నీ సమక్షమున ననుభవించుట నాకు సుకరమగును."

"ప్రాణసఖీ! ఈ రహస్యము నీకు బాధ గలిగించునది కాదు. దీని నంటివచ్చు పరిణామములు నీకు బాధా కరములు గావచ్చును. అదే నా యాలోచన. విష్ణువర్ధన మహారాజు చాలా పొట్టివాడు. తాను చాళుక్య చక్రవర్తికి దమ్ముడగుటచే నేరాజకన్య యైన దన్ను వివాహమాడుటకు సమ్మతించునేగాని, ఇసుమంతయుదన్ను బ్రేమించబోదని భయము వారిని పీడించుచున్నదట. అందుకని ఆ మహారా జింతవరకును వివాహము చేసికొనుటకు నిరాకరించెనట. ఈ విషయము మన పరిచారికలలో గనకాంగి యనునది గ్రహించి నాకు జెప్పినది."

"ఈ విషయము దానికెట్లు తెలియవచ్చినది?"

పిష్టపురము విష్ణువర్ధనుని హస్తగతమైన రెండవ దినమున మన పరిచారిక లందరును గోవూరునుండి పిష్టపురమునకు వచ్చిరి గదా!"

"అవును."

"ఆ వచ్చినవారిలో గనకాంగియు నున్నది. విష్ణువర్ధను సంగరక్షక దళపతులలో నొక డామె కీ రహస్యము తెల్పినాడట."

"ఇది నిజమైనచో నాకు బాధ యెట్లగును?"

"నిజమైనచో నీకు బాధగలుగదు. ఇది వట్టియూహా జనితమైనచో నీ మనస్సంకటమునకు బరిమితి యుండదు."

"విష్ణువర్ధన మహారాజంత పొట్టివాడా!"

"అవును! అందుకనియే వారికి కుబ్జవిష్ణువర్ధనుడని పేరు వచ్చినదట."

"అందుకనియే కాబోలు–"

"ఏమిటందుకనియే కాబోలు? నాతో జెప్పగూడదు కాబోలు"

"నీకు జెప్పక దాచగలనా! పిష్టపురమును చాళుక్యులాక్రమించిన నాలుగు దినములకు గదా నాకు బూర్తిగా బలము కలిగినది! ఒక దినమున నేనంతఃపురోద్యానమున విహరించుచుంటిని. అప్పుడొక యిరువది యిరువదొక సంవత్సరముల యీడుగల యువకు నొకని దర్శించితిని, ఆయన నామము 'ప్రియదర్శి' యట."

"ఇదంతయు నాకు దెల్పితివి కాదటమ్మా!"

"ఆతనియందు నా మనస్సు లగ్నమైనదని చెప్పితిని. ఆ మహాభాగుడును దన యీడుకు దగిన పొడుగరి కాడు, అదియే నేను తెల్పునది."

"నీ యుద్దేశము విష్ణువర్ధన మహారాజు తాను బొట్టి వాడగుటచే తన పరివారమున గూడ బొట్టివారినే చేర్చు కొనుచున్నాడని.......!"

"పొట్టిపొడుగులకును బ్రేమకును సంబంధమేమి చెలీ!"

"ఇంతకును నెవరో యీ సామంతరాజకుమారుడు!"

ఆకసమున జిరుమబ్బులు పొడసూపినవి. అవియు వెన్నెలలో దడియుచు దెల్లందనమును దాల్చినవి. ఇంతలో "భర్తృదారికకు భోజనమునకు వేళయైనది, వడ్డనకు నాజ్ఞ వేడుచున్నాను" అని పరిచారిక యొకర్తు మనవిచేసికొన్నది. "వచ్చుచున్నాము. వడ్డనకు సన్నాహములు చేయవచ్చు" నని పరిచారికకు సెలవిచ్చి యంశుమతి లేచినది. మాధవీ లతయు లేచినది.

## 17

విష్ణువర్ధనుడు మహావేగముతో సైన్యములను నడిపించుకొనుచు రెండుదినములలో గృష్ణాతీరమునకు వచ్చి విజయవాటికను బ్రవేశించెను. ఆ నగరమున వేంచేసియున్న మల్లేశ్వరస్వామిని గనకదుర్గాంబను అర్చించి, బౌద్ధ సంఘారామములకు నివేదన లర్పించి, యా సాయంకాలముననే కృష్ణ దాటెను.

కాలకంపనప్రభువుకుమారుని పట్టవర్ధన జయందిని దనకు బ్రతినిధిగ గొలది సైన్యములతో విజయవాటిక యందుంచి విష్ణువర్ధనుడు ఇంకను మహావేగమున కర్మకరాష్ట్ర భాగములైన వెలనాటిని, గొండపడమటి రాజ్యమును, గొండతూర్పురాజ్యమును, పోక రాష్ట్రమును జయించు కొనుచు, దక్షిణమునకు సాగినాడు. విష్ణువర్ధనూ నెదురులేని యా వేగమున సామంతు లొకరి వెనుక నొకరాతనికి పాదాక్రాంతు లగుటయ బల్లవ మహారాజగు రాజేంద్రవర్మ కెప్పటి కప్పుడు వేగు వచ్చుచునే యున్నది. మహేంద్రవర్మ రెండవ పులకేశి నెదిరించి యోడిపోయినాడు. పులకేశి పృథ్వీవల్లభునకు దాను గప్పము గట్టినాడు. ఆతడు మహా విక్రముడు. ఇప్పుడు మహేంద్రవర్మ కుమారుడు యువమహారాజు నరసింహవర్మ యనేక దిగ్విజయములు గాంచుచు దక్షిణమున జోళులను, పడమట గాంగువాడి రాష్ట్రమున దక్షిణ గాంగులను, వనవాసి కదంబలను, వాతాపిచాళుక్యులను, ఉత్తరమున విష్ణుకుండినులను దమదమ రాజ్యపుటెల్లలలో నిలువరించి, దండ్రి మహేంద్రవర్మ మహారాజు కాంచీపురమున సుఖ సంవిధానమున రాజ్యముసేయు నరువు చేసినాడు.

యువమహారాజు చాళుక్య విష్ణువర్ధనుండు కృష్ణదాటి పల్లవ సామ్రాజ్యమును బ్రవేశించి నిరవరోధవేగమున వరదలు పొంగిన గంగవలె బ్రవహించి వచ్చుచున్నాడు. ఆ రాష్ట్రములకు నంగరక్షకదళాధిపతి బుద్ధవర్మను సామంత పట్టాభిషిక్తుని చేసినా డతడు. వనవాసి కదంబులును, కందనోలు చాళుక్య రాజప్రతినిధి పులకేశి పృథ్వీవల్లభ మహారాజు మూడవ కుమారు డాదిత్యవర్మయును గలసి పల్లవరాజ్యముపై నెత్తిరాగా, యువరాజు నరసింహవర్మవారి నెదిరించుటకు వెడలియుండెను. ఆ సమయముననే పిట్టపిడుగు వలె నీ గుజ్జురాజు పల్లవ రాజ్యమును సగముభాగమాక్రమించుకొని విక్రమసింహపురము వరకును వచ్చినాడు. పల్లవ మహారాజు మహేంద్రవర్మ వృద్ధుడు. ఆ మహారాజు సేనాపతులలో వ్యూహరచనా సమర్థుడై, విష్ణువర్ధను నెదుర్కొను పోడిమి గల వీరు డెవ్వడును లేడు.

మహేంద్రవర్మ గత్యంతరములేక విష్ణువర్ధనుడు కాంచీపురముపై విరుచుకొని పడనున్నాడని, కుమారుడైన నరసింహవర్మకు వేగు పంపినాడు. నరసింహవర్మ అడకత్తెరలో పోకయై గజిబిజి పడిపోయెను. ఈ వైపు కదంబులను, ఆదిత్యవర్మను జయింపకుండ విష్ణువర్ధన చాళుక్యు నెదిరించుటకు బోయినచో వీరును వారును గూడ గాంచీపురముపై నొక్కసారిగ విరుచుకొని పడుట సంభవించును. తానును తన సైన్యములును హతులై నాశన మందవలసి వచ్చును. కావున దనకు గర్తవ్యము? కదంబులను, జాళుక్యులను నోడించుటయే. ఆ వెనుక విష్ణువర్ధనుని పని పట్టించవచ్చును.

ఆ యాలోచననే నరసింహవర్మ తండ్రికి వేగు బంపినాడు. విష్ణువర్ధనుడు పుట్టెడు బుద్ధుల పొట్టివాడనియు జండ విక్రముడనియు నాతని ధాటిని నీ సమయమున నెవ్వరు నాపలేరనీయు గావున విష్ణువర్ధనుని సగౌరవముగ దండ్రిగా రాహ్వానించి కొంచెము పెద్దమొత్తమును సమరాజోప గ్రాహ్యముగ నర్పించుచదనియు, నుత్తముడైన యతిథి వచ్చినప్పుడు సేయదగు వినోదములన్నియు జేయింపుడనియు గుమారుడు నరసింహవర్మ తండ్రికి రహస్య సందేశ మంపెను.

కావున విష్ణువర్ధనుడు విక్రమసింహపురమునకు వచ్చునప్పటికి నగరపాలకులు, రాజప్రతినిధియైన సేనాపతియు, విష్ణువర్ధను నెదుర్కొని, సర్వోపచారముల నతని కర్పించుచు గోటను ప్రవేశపెట్టిరి. మూడుదినములైన వెనుక పల్లవ ప్రధానియు రాజపురోహితుడును, పల్లవ మహారాజు ప్రేమతో విష్ణువర్ధను నాహ్వానించుచున్నట్లున్న లేఖను గొనివచ్చిరి.

విష్ణువర్ధనున కేదియో అనుమాన ముదయించెను. చాళుక్యులకు నిత్యవిరోధియైన పల్లవేంద్రు డొక్కడు తన్నిట్లు సగౌరవముగ నాహ్వానించుటలో నంతరార్థమేదియో యుండవలెనని యాతడనుకొనెను. ఇంతలో నాతని మనసున మెరుపు మెరిసినట్లు పల్లవ రాజు తన కంపిన యాహ్వానమున కర్థము గోచరించినది. తనయన్న పులకేశి చక్రవర్తి మూడవ కుమారుడు పదునారేండ్లవాడయినను వీరవిక్రముడు. ఆ బాలకునోడించి, తొల్లిపరాభవము దీర్చుకొనవలెనని పల్లవ యువరాజు నరసింహవర్మ కందనోలుపై (కర్నూలు) దండు వెడలినాడు. ఆదిత్యవర్మ మేనమామలైన కదంబులను సహాయమడిగి సైన్యముల రప్పించుకొన్నాడు.

చాళుక్యులను స్నేహితులుగ మహేంద్రవర్మ పరిగణించినచో, యువరాజగు నరసింహవర్మను కుమారుడగు నాదిత్యవర్మపై బంపుటేల! దీనికి బ్రతి తాను కాంచీ పురముపై దండెత్తుటమాని, పడమటకు జైత్రయాత్ర మరలించి తొందర తొందరగ బ్రయాణము సాగించుచు బది దినములలో, గందనోలు ముట్టడించి, యుద్ధము సాగించుచున్న నరసింహవర్మపై బడుటయే! అనుకొనుట యేమి ఆతడట్లొనరించినాడు.

నరసింహవర్మ చేయునదిలేక పరాజితుడ నైతినని ఖడ్గమర్పించినాడు. విష్ణువర్ధను డన్నకుమారు నాదిత్యవర్మను గలిసి, యాతని గాఢముగ గౌగిలించుకొని, నరసింహవర్మ ఖడ్గము నాతనికి బహూకరించెను.

విష్ణువర్ధనుడు తన ద్వితీయోపసేనాధిపతి ఇంద్రదత్తుని సైన్యాధిపతిగజేసి, విక్రమసింహపురమున (నేటి నెల్లూరు) గాపుంచినాడు. మూడువంతుల సైన్యమును విక్రమపురము ననే యుండ నేర్పాటుచేసినాడు. ఏనుగులు, గుఱ్ఱములు, భూషణములు విష్ణువర్ధను నకర్పించి, నరసింహవర్మ కాంచీ పురమునకు దరలిపోయినాడు. విష్ణువర్ధను డాతని వెనుకనే చళుక రాష్ట్రమున నధిపతియొద్ద కప్పముగొని, పదునైదు దినములలో విక్రమ సింహపురము తిరిగి వచ్చెను.

పల్లవులతో దనకు విరోధము లేదనియు, వోక రాష్ట్ర మునకు దక్షిణమున పల్లవులు నిరాటంకముగ బరిపాలించ వచ్చుననియు దన యన్నగారు చాళుక్య చక్రవర్తి తన్నాంధ్ర

చాళుక్య రాజ్యమును స్థాపింప నాశీర్వదించి పంపినాడనియు, దక్షిణకళింగము, వేంగీ రాష్ట్రము, పోకరాష్ట్రము నీమూడు రాష్ట్రములను గలిపి వేంగీపురము రాజధానిగ దన రాజ్యమును స్థాపింప బోవుచుంటిననియు, విష్ణువర్ధమడు పల్లవులకు సందేశ మంపినాడు.

## 18

**ఉ**త్తర కళింగరాజధానియైన కళింగ నగరమున కళింగ యువరాజగు దానార్ణవు డంశుమతీరాకుమారిని పిష్టపురమున నా బాలికకు దెలియకుండగనే తానుజూచిన విషయము నొక్కడు దన యభ్యంతరమందిరమున గూరుచుండి యాలోచించుకొను చుండెను. ఆమె జగదేకసుందరి. ఆమె సర్వకళాభిజ్ఞ. శారద రాకాపూర్ణిమనుగూడ నలుపుసేయగల కాంతిగలది. ఆమెను వివాహమాడ తాను గాఢముగ సంకల్పించుకొని యుండెను. తాను విన్నది, తాను జూచిన దానిలో సహస్రాంశమైన లేదని పిష్టపురమున రాణివాస మందు బంధింపబడిన యా బాలికను జూచినప్పుడే యనుకొన్నాడు. విష్ణువర్ధనుడు వచ్చి పిష్టపురము ముట్టడించు గడబిడలో నాత డా దుర్గమునుండి తప్పించుకొని కళింగమునకు పారిపోయినాడు.

విష్ణుకుండిన మంచనభట్టారకునకు గొమరులులేరు. ఆ ప్రభువునకు దరువాత సింహాసన మెక్కగల సన్నిహిత జ్ఞాతులును నెవ్వరులేరు. ఒక్కగానొక్క కొమరిత మాత్రమున్నది. ఆమెను వివాహమాడినవారి కారాజ్యము హస్తగతమగును. కావుననేకదా పల్లవయువరాజు నరసింహ వర్మయు నా బాలికను నర్ధాంగిని జేసికొన వాంఛించు చున్నాడు. ఆ మఱుగుజ్జు విష్ణువర్ధన చాళుక్యుడుగూడ నిట్టి కాంక్షతోడనే తూర్పుతీరమునకు వచ్చియుండవచ్చును. లేనిచో, నంత పటాటోపముగ పిష్టపురమును బట్టినట్లు నంశుమతిని విడిపించినట్లును నాటకమాడు టెందులకు! విష్ణువర్ధనుడు వేంగీపురముపై దాడి వెడలుచున్నాడని తాననుకొనుటవలన గదా తాను బ్రమత్తుడై యుండినాడు! అందు వలననే కళింగసైన్యములును బ్రమత్తములై యుండినవి.

చోళులను బాండ్యులను ననేక యుద్ధముల నోడించిన పల్లవ యువరాజు నరసింహ వర్మయు నోడిపోయినాడని, వేగు వచ్చినదిగదా! అందువలన పొట్టిచాళుక్యునకు గర్వము మెండైనది. ఉత్తరదేశ చక్రవర్తి శిలాదిత్యహర్షవర్ధను నోడించగల మేటి పులకేశి పృధ్వీవల్లభు నెదుట తనతండ్రి నిలువలేనిమాట నిజము కావచ్చును. కాని ఈ కుబ్జుడు గూడ బ్రతాపము నెరపుటయేనా? అంశుమతీ బాల వానినెట్లు వరించును! రాయబారములు నిష్ఫలములైన మీదనె తానిట్లు బలవంతముగ నామె నెత్తుకొని వచ్చుట కేర్పాటు చేయవలసి వచ్చినది. తానా బాలను వివాహమాడినచో గళింగ గాంగ సామ్రాజ్యము కృష్ణాతోయముల నొరసి మహదాంధ్ర సామ్రాజ్యమగును.

తాను కళింగసైన్యము గట్టిపరుపవలయును. ఇంకను బెక్కుసైన్యముల బెంచవలసియున్నది. గాంగుల ప్రతాప మెట్టిదో, చాళుక్యు డిప్పటికైన జవి చూచునుగాక!

ఈ రీతిగ దానార్ణవుని హృదయమున నంశుమతీ కుమారి విశ్వరూపమెత్తినది. మున్ను శ్రీకృష్ణుడు రుక్మిణి దెచ్చినట్లాతడు అంశుమతీ బాలను గొనిరా నిశ్చయించెను.

భారతీయస్త్రీ దాను వివాహమాడిన భర్తను ప్రేమించి తీరును. బలవంతముగనైనను నంశుమతీకుమారిని వివాహ మాడగల్గినచో దన యదృష్టము మిన్నుముట్టును.

ఒకనాడు దానార్ణవుడు తన యాంతరంగిక మిత్రుడగు కుంభమిత్రుని బిలచి, "మిత్రమా నీవు అంశుమతీ రాకుమారిని పిష్టపురమును జేర్చునపుడామె దగ్గరి బందుగు రాలును, నందమున నామెకు మాత్రమే తీసిపోవు మాధవీలతకాకుమారిని జూచియుంటివి గదా! ఆమెనుగూర్చి నీ వేమాలోచించుచుంటి"వని ప్రశ్న జేసెను.

"నేను ఏమాలోచించు చుంటిని! ప్రభువులయాజ్ఞ నేరవేర్చుటయే నా యాలోచన."

"అవును. నీవు ప్రభుభక్తి పరాయణుడవు, అయినను నా బాలికను జూచితివిగదా యని యడుగుచున్నాను."

"చూచితిని ప్రభూ! మీరు అంశుమతీ రాకుమారిని బ్రేమించి మీదేవేరిని జేసికొన దలంచినారు గదా! అయినచో మాధవీకుమారి ప్రసక్తి యేమున్నది?"

"నీవు మాధవుడవు గావలయునయ్యా!"

"నేను గుంభమిత్రుడను మాధవుడుగా నెట్లు కాగలను ప్రభూ?"

"ఓయి కుంభకర్ణబలుడా!"

"ఔను నేను కుంభకర్ణుడనే, నలువురి గుంభకర్ణుల నా భుజముల మోచికొని సముద్రమున బారవైచి రాగలను."

"అది కాదయ్యా మిత్రమా! మాధవుడన్న వసంతుడని. అతని భార్య మాధవి."

"అటులనా మహాప్రభూ! అర్థమైనది. నేను మాధవిని వివాహమాడెదను గాక!"

"మేము నీకై యుద్దేశించిన యా బాలికను నీవు గొనిరావలయును. ఆమె యొక్కరిత వచ్చుట గౌరవభంగము. కావున నీ వంశుమతిని గూడ గొనిరావలయును. ఇందు నీ కేమియు నడ్డు రాగూడదు. అట్లు వచ్చిన వారిని హతమార్చుము. ఆ పొట్టిచాళుక్యుని పని నే బట్టించెదను. ఆ కుబ్జుడు వేంగీనగరము వీడి వచ్చునట్లు నే జేసెదను. నీవు తాడిచెట్టునైన విరచి మొగము కడుగుకొను పరాక్రమవంతుడవు... దిట్టలగు వారిని పదిమంది బంటుల గొనిపొమ్ము. ఎటుల దరలించి తెత్తువో ఆ యిరువురి బాలలను! ఇది నా యాజ్ఞ."

"ప్రభూ! మీరు సముద్రమున నురుకుమన్న నురికెదను. ఆ సముద్రమును ద్రాగివేయమన్నను అట్ల చేసెదను. సాధారణ దళపతి కొమరుని నన్ను మీరు చేరదీసి ప్రియమిత్రునిగ జేసికొన్నారు. మీపై నింతవఱకును నీగనైన వ్రాలనిచ్చితినా?"

"కావున నీవు మూడు ఆరైనను, ఆరు మూడైనను నా బాలిక లిరువురను గొని తేవలసినదే."

"ఇదిగో పోవుచున్నాను, మహాప్రభూ!"

## 19

వేంగీపురము నానుకొనియున్న కొల్లేటికి దిగువభాగమునకు "జలసీమ" యనిపేరు. ఆ సరస్సు అతిపురాతనము. భూమితోడనే పుట్టిన దందురు. జలసీమలో నిత్యమును

బంగారు పంటలు పండుచుండును. ఈ సీమనంతను బరిపాలించు సామంతుడు బృహత్పాలాయనుండైన పృధ్వీశవర్మ. పృధ్వీశవర్మ కిరువురు కొమరులును నొక కొమరితయు గలరు. ఆ కొమరితయే మాధవీలతాకుమారి.

వేంగీరాజ్యము నిప్పుడు పాలించుచున్న మంచనభట్టారక మహారాజు కన్న బృధ్వీశవర్మ యయిదారేడులు పెద్ద. చాళుక్య విష్ణువర్ధనుడు వేంగీనగరము వచ్చునప్పటికి గృష్ణా సముద్ర సంగమతీర సీమలోని సామంతుడొకడు దిరుగుబాటు చేయుటచే పృధ్వీశవర్మ వాని నణచుటకు బోయెను. మాధవీలతాకుమారి కలతీర్థ (కలిదిండి) పట్టణమునకు దన తండ్రి వచ్చినాడని తెలిసి తన కుటుంబముతో గొన్ని దినములు గడుపనెంచి కలతీర్థ నగరమునకు బయనమయ్యెను. స్నేహితురాలగు నంశుమతీకుమారిని గౌగలించుకొని ఆమెచే వల్లె యనిపించుకొని పరివారముతో బడవల నెక్కికొల్లేటిపై బ్రయాణము సాగించెను. ఆ సరస్సునందనేక ద్వీపములున్నవి. అందగ్నికులజులైన పల్లెవారు నివసించుచు జేపల పట్టి వేంగీనగరమున అమ్ముచుందురు. ఆ సరస్సున యానము సల్పు బడవల నన్నిటిని వారే నడుపుదురు. ఈ యగ్నికులజు లందఱకు గడు గూర్చువాడు పృధ్వీశవర్మ మండలేశుడు.

మాధవీలతాకుమారి యట్లు ప్రయాణముచేసి "జలకంఠేశ్వరుడు" వెలసిన ద్వీపము జేరెను. ఆ దేవుని దేవేరి జలదుర్గ. ఆ దేవి దేవాలయ మా ప్రక్కనే యున్నది. మాధవీలత యచటికి వచ్చునప్పటికి జెల్లెలికెదురై యామె యన్న త్రినయనేశ్వరుడు భార్యాపుత్రాదులతో నటకుజేరెను. మాధవీలత వదినగారికిని అన్నగారికిని పాదములకు నమస్కరించినది. వదినగారా బాలికను దన హృదయమున కద్దుకొన్నది. మేనల్లుంద్ర నిరువురను మేనగోడలిని నామె యెత్తుకొని ముద్దాడుచుండ బెద్దమేనగోడలు జలదుర్గాంబిక "అత్తయ్యగారూ! వేంగీపురములో బిన్నిగారు, అమ్మమ్మగారు, తాతయ్యగారును క్షేమమా?" యని పలకరించెను.

మాధవీలత పక్కున నవ్వుచు, "ఎంత జాణవమ్మా! ఈ యొప్పిద మెవరు నేర్పిరమ్మా నీకు!" అనునంత, నా యెనిమిదేడుల బాలికయు నత్తగారిని జూచి చిఱునవ్వు నవ్వుచు "నేను మీ కోడలనుగానా?" అని యెదురు ప్రశ్నవేసెను. అందఱును బకపక నవ్విరి.

దేవాలయమున బూజలైన వెనుక యందఱునుగలసి కలతీర్థపట్టణమునకు బోయి చేరిరి. ఆ పట్టణము చుట్టును తోటలే. పండ్ల తోటలు, కాయగూరల తోటలు, పూవుల తోటలును.

మాధవీలత యిరువుర బరిచారికల వెంట దీసికొని నగరము చుట్టునున్న తోటల దిరుగుట కెంతయు ముచ్చట పడును. ఒకనాడాతోటలో నా ఫాల్గుణమాసపు మలయ మారుత మనుభవించుచు సాయంకాలమందు చెలులతో మాధవీలత యొక మామిడిచెట్టు క్రింద గూర్చుండి యుండెను. ఏలనో యామెకు జటుక్కున మనోనేత్రముల కొక విగ్రహము ప్రత్యక్ష మయ్యెను. పిష్టపురమునందు దన చెలి మూడు దినము లుపవాసము లొనరించి యొడలు తెలియక పడిపోయినప్పుడు తాను వేగిరపాటుతో భయముతో సిగ్గంతయు విడచి విష్ణువర్ధన ప్రభువుకడకు బరుగిడిపోయినది.

తాను భర్తృదారిక స్థితిని భయము నిండిన మాటలతో నా మహారాజునకు జెప్పునప్పు డాతని పీఠముదాపున నిలబడి సమున్నతాంగుడై, గంభీర తేజస్వియై, తన దిక్కుదయార్ద్ర దృష్టిని బరపి, తన్ను కులీనయగు బాలిక యని గ్రహించి చూపులు క్రిందికి వాల్చివేసిన యొక పురుషమూర్తి యీనాడు తన మనో గగనమున దళుక్కుమని మెఱసినాడు. ఆ సంభ్రమస్థితిలో నాత డెవడో తనకు దెలియకపోయినను యా పురుషపుంగవు విగ్రహము మాత్రము మనస్సున స్పష్టముగ జిత్రింపబడినది. ఆతని గూర్చి యాలోచించుటకే యా బాలిక సిగ్గుపడినది. అట్లాలోచించుట తన చెల్లి గ్రహించునేమో యని ఆమె చకిత యగుచుండెడిది. తన రాజకుమారికి బరిచర్యలు సేకూర్చుటలో నిమగ్నయైన యా బాలిక హృదయమునుండి యా పురుషవిగ్రహము గుప్తమైపోయినది. నే డా పూరుషుడు మఱల దోతెంచుటకు గారణమేమి!

ఆమె కన్ను లర్ధనిమీలితము లైనవి; మెల్లగ బూర్ణ నిమీలితము లైనవి. మరల గన్నులు పూర్తిగ దెరచినంత నాబాలికయెదుట, లోనిమూర్తియే బ్రత్యక్షమగుట చూచి, వగటికల యనుకొనుచు గలలు దిరుగు కన్నులతోడనే యామూర్తి నామె తిలకించుచుండెను తన వెనుక కొలది యలికిడి యగుట గ్రహించి, వెనుకకు దిరిగి, పరిచారిక లిరువురు నిలబడియుండుట నామె కనుగొన్నది. మఱల మోము త్రిప్పి యెదుట జూడ నామూర్తి తన్ను దీక్షణముగ జూచుచు నిలిచియుండుట గననయ్యెను. ఆమె యాశ్చర్య మందుచు చటుక్కున నిలుచుండెను.

అప్పు డా యువకుడు చిరునవ్వు నవ్వుచు "రాజకుమారీ! క్షంతవ్యుడను. ఇది శుద్ధాంతజనముల తోటయని అనుకొనలేదు. నన్ను "జయనంది" యందురు. ఈ పట్టణపు దోటలు బహు సుందరములును, ఫలపుష్పపూర్ణములును, కనుగొన నా కెంతయో ముచ్చటపుట్టి యొంటిగా నీ తోటలోనికి వచ్చితిని. నేను సెలవుతీసికొనెద" నని యా యువకుడు మనవి చేసినాడు.

"చేయరాని పనిజేసి క్షమార్పణవేడుట పశ్చిమదేశముల వారి యాచారము కాబోలు" నని మాధవీలత కొంచెము చురుకుగనే పై కన్నది.

ఆ యువకుడు కలత నొందని మోముతో జిరునవ్వు నవ్వుచు, "మేము చేయరాని పనుల జేసెడివారమని యేకవి గ్రంథము వ్రాసినాడు? అని ప్రత్యుత్తర మిచ్చెను.

"క్షమించదగినవా రెవరో తెలిసికొనక క్షమించుటెట్లు?" అని మాధవీలత తలవంచుకొనియే పలికినది.

"మా జనకులు పట్టవర్ధన కాలకంపన ప్రభువులు, శ్రీ విష్ణువర్ధన మహారాజాధి రాజులకు సర్వసేనాధిపతులు. నేనా మహాప్రభువు ఉపసేనాధిపతులలో నొకడను."

"ఓహో యెంత చరిత్రయున్నది! తోటల దిరుగుటను గూర్చి యావల నాలోచింతము. చాళుక్యసేనాపతులకు దమ ప్రభువును యుద్ధమున వదలి తోటలు, పేటలు, బాటలును జూచుట యలవాటు కాబోలు!"

"అంతియ కాదు ఆ తోటలో నీటుకత్తెలగు రాకొమరితల దర్శించుటయు నలవాటు."

"మాటలలో గోటలును గోడలును దాటు పోటు మానుసులు గూడ నుందురని నేటి కెరిగితిని."

ఆ బాల చటుక్కున దిరిగి చిరునవ్వున పరిచారికలతో నాసందె చీకటులలో విసవిస నడచి మాయమైపోయినది.

## 20

శ్రీచాళుక్య విష్ణువర్ధనుడు తన ద్వితీయోపసేనాపతియైన ఇంద్రదత్తునికి విక్రమ సింహపురమున సామంత పట్టాభిషేక మొనర్చి యప్రమత్తుడవై పల్లవుల గనిపెట్టి యుండుమని యానతిచ్చి, తన సైన్యమున నెక్కువభాగము నాతని పాలనమున నుంచి యుత్తరాభిముఖుడయ్యెను.

గిరిపశ్చిమరాష్ట్ర (కొండవీడు రాష్ట్రము) సామంతుడైన బుద్ధవర్మ, విష్ణువర్ధను భగవంతునిగ నెంచి పూజించును. ఆతడు నాదెండ్లను తన రాజధానిగ జేసికొనెను. తన మహాప్రభువుత్తరాభిముఖుడై వచ్చుచున్నాడని తెలియగనే యెదురుగ బోయి కుబ్జ విష్ణువర్ధనుని సర్వసార్వభౌమ లాంఛనములతో దన రాజధానీ నగరమున కాహ్వానించెను.

"మహాప్రభూ! తాము రెండవ త్రివిక్రములు, తమ యానతి చొప్పున నీ రాష్ట్రముల, నీ సీమల శత్రుకంటక శూన్యముచేసి, మేఘములు లేని రాత్రివలె నొనర్చితిని. షోడశకళాపూర్ణ చంద్రులై పాండవవంశ కులతిలకులగు తామీ విశాలాంధ్ర మహా రాజ్యమునకు సామ్రాజ్యపట్టాభిషేక మొనరించుకొనవలసియున్న"దని మనవి చేసినాడు.

కుబ్జవిష్ణువర్ధనుని మోము కాంతివంతమై వెలిగిపోయినది.

"బుద్ధవర్మప్రభూ! విక్రమసింహపురమున నింద్రదత్త ప్రభువు నివే మాటల ననినాడు. అన్నగారీ యా రాజ్యములు దిగ్విజయము కొఱకు జయించినారు. వారి యానతి ననుసరించి మే మిచ్చట సామ్రాజ్యము స్థాపించెదమనుమాట నిశ్చయము."

"మహాప్రభూ! అనుగ్రహింపబడితిని."

"మన విజయము లన్నిటికిని సకలాంధ్రసామ్రాజ్యమును బరిపాలించు శ్రీశైల మల్లికార్జునదేవ వరప్రసాదమే కదా మూలకారణము!"

"చిత్తము మహాప్రభూ!"

"భ్రమరాంబికా ద్వితీయ మల్లికార్జునదేవునకు మనము సర్వపూజలు నొనరింప వలెను. కాని, యాపరమశివునకు మల్లికార్జున నామ మెట్లు వచ్చినదో!"

"అది యిచ్చట చరిత్రప్రసిద్ధము మహాప్రభూ! మహా కోసల ప్రభువులైన సోమవంశీయులు తమ అన్నయ్యగారు పృధ్వీవల్లభసార్వభౌములకు గప్పము గట్టిరిగదా!"

"అవును"

"ఆ కప్పము గట్టినది సోమవంశ చంద్రగుప్తుని కొమరుడైన హర్షగుప్త మహారాజు. చంద్రగుప్త మహారాజు కొమరిత చంద్రావతి. ఆ దేవి పుట్టిననాట నుండియు మహాశివుని భక్తురాలై, యోగినీవేషము ధరించి, సర్వకాలములయందు శివపంచాక్షరి జపించుకొనుచు లౌకిక ప్రపంచము మఱచి యుండెడిదట."

"అంత యనన్యభక్తియుండవలెను. అప్పుడే జన్మము తరించును."

"ఆ చంద్రావతికి సర్వకాలములయందును శ్రీశైల దేవుడైన యర్జునేశ్వరస్వామి ప్రత్యక్ష మగుచుండెడివాడట. చంద్రగుప్తమహారాజు ఆంధ్రసార్వభౌముడైన శ్రీ విక్రమాశ్రయ గోవిందవర్మ విష్ణుకుండిన మహారాజునకు దన కొమరిత నిత్యము నర్జునేశ్వరు నర్చించుట కనుమతిని వేడుచు రాయబారమంపెనట."

"అవును! పవిత్ర శ్రీశైలక్షేత్రము వారి రాజ్యముననే కదా యుండినది!"

"చంద్రావతి తగుపరివారముతో శ్రీశైలక్షేత్రము చేరినదట. ఆమె చంద్రావతి, సోమవంశజ, చంద్రగుప్తుని తనయ. ఆమె వెన్నెలయే రూపొందిన మల్లికా కుసుమములను మాలలుగ రచించి జంద్రచూడుని జటామకుటముపై నలంకరింప సంకల్పించినదట."

"ఓహో! ఏమి విచిత్ర చంద్రికాభావము!"

"మహాప్రభూ! శ్రీశైలగిరిపై మల్లికా నికుంజములు పెంచినారు పరిచారికలు. బొడ్డుమల్లెలు, జంటమల్లె, సదా మల్లెలు, గుత్తులు గుత్తులై రాసులు రాసులై యా కొండను రజతాద్రి తుల్యముగ జేసినవట.

"ఇది యంతయు మహాపవిత్రమైన గాదయే."

"చంద్రావతీదేవి భక్తికి బరమశివుడు కరుణించి యామెకు స్వప్నమున సాక్షాత్కరించి, "చంద్రావతీ కుమారీ! విష్ణుకుండిన మహారాజు గోవిందవర్మకు నా యంశమున మాధవవర్మ జనించినాడు. ఆతని నీ వుద్వాహ మయ్యెదవు గాక! ఇది మొదలు వట్టి యర్జునేశ్వరుడుగా గాక మల్లికార్జునుడుగా బ్రసిద్ధి గాంతు"నని యనుగ్రహించి యంతర్ధాన మయ్యెనట. విష్ణుకుండిన మంచన భట్టారకుని తల్లి యేయా చంద్రావతీదేవి."

"ధన్యుడను. ఈ గాథయే సర్వపాపహరణము. మనము శ్రీ మల్లికార్జునదేవు దర్శనము నెంతేని తొందరగ జేసికోవలెను."

శ్రీశైల పుణ్యక్షేత్రము శిఖరము దర్శించినంతనే యెట్టి పాపాత్ములైనను బుణ్యమూర్తులై తేజోవిలసితు లగుదురట. ఎంత దివ్యక్షేత్రమిది! అని చాళుక్యుడు మనస్సున నా శ్రీశైల పుణ్యపర్వతమునకే జోహారు లర్పించుకొన్నాడు.

చాళుక్యులు మొదటనుండియు శివభక్తి పూరితులు. వారు పరమమాహేశ్వరులే యగుదురుగాక. ఆ దీక్ష అతని బులకితుని జేసినది.

*"హే!*
*నాగభూష! నందివాహా!*
*నిన్ను దెలియ, నిన్ను కొలువ*
*నన్నుబోటి వారలేడ*
*నాగశయన మిత్ర! దేవ!*
*వేగరావ! నన్ను బ్రోవ!*
*నాగభూష! నందివాహన!"*

అని యా ప్రభువు మధురదీప్త కంఠమెత్తి పాడుకొనినాడు.

కుబ్జ విష్ణువర్ధనమహారాజు శ్రీశైల మల్లికార్జున దేవుని దర్శించి వైభవోపేతముగ బూజ లొనరించినాడు. ఆ సమయమున మండలేశ్వరుడు బుద్ధవర్మ తన మహాప్రభువు క్షేమమునకై మహాదానము లెన్నిటినో చేసినాడు.

## 21

జయనంది తాను మాధవీలతాకుమారిని వరించినట్లును, ఆమె తల్లిదండ్రులు నా రాజకుమారియు తమ సంబంధమున కత్యంతహర్షితులై యామోదించిరనియు దండ్రికి రహస్యలేఖలు పంపినాడు. అరువదియైదు వర్షముల వృద్ధుడైన కాలకంపన ప్రభువు తన కీసంబంధ మత్యంతము నభీష్టమనియు దాను మహారాజు ననుమతిని వేడుచు నుత్తరము పంపుచుంటిననియు, గొమరునికి వార్త పంపినాడు.

పట్టవర్ధనరాజ పురోహితుడు లేఖలుగొని వేంగీపురమునకు వచ్చినాడు. ఆతడు వచ్చిన మూడుదినములకు గుబ్జ విష్ణువర్ధనమహారాజు ససైన్యముగ వేంగీపురమును జేరినాడు.

తన ప్రాణహితుడగు జయనంది బృహత్పాలాయన రాజకన్యకను వివాహమాడుట తనకు నత్యతానందమును సమకూర్చు విషయమని, విష్ణువర్ధనుడు జయనందిని తన సమ్ముఖమునకు రావించుకొని యాతని నాశీర్వదించెను.

**జయ:** మహాప్రభూ! తాము బృహత్పలాయన రాజకన్యకను జూచియున్నారు.

**విష్ణు:** అవును, పిష్టపురమున నామెను జూచితిని గదా! ఆమె పేరు, మాధవీలతాకుమారి కాదా?

**జయ:** చిత్తము.

**విష్ణు:** మిత్రమా! నీ వెంతయో అదృష్టశాలివి. ఆ బాలిక గుణరూపసమన్విత, ఆమెకు విష్ణుకుండిన రాకుమారి యనిన నెంతభక్తి!

**జయ:** ప్రభూ! చాళుక్య కులదీపకులు – తమరు...

**విష్ణు:** అయినచో...

**జయ:** చాళుక్యవంశము, చంద్రవంశము.

**విష్ణు:** మంచిది!

**జయ:** ఆ చంద్రవంశమున బూర్ణ చంద్రులు మీరు.

**విష్ణు:** నాచుట్టును చంద్రికలు లేవుకదా!

**జయ:** మహాప్రభూ! ఆ చంద్రికాదేవికై లోకమెల్ల నెదురు చూచుచున్నది.

**విష్ణు:** నేను అమావాస్య చంద్రుడను.

**జయ:** పాప ముశమించుగాక! మహాప్రభూ! తాము రాకాచంద్రులగుట కొక అంశువుమాత్రము లోటైనది.

**విష్ణు:** ఆ యంశువును శివుని జటాజూటమునుండి కొనివత్తువా.

**జయ:** మీ శిష్యులము కై లాసమునకైన బోగలము.

జయనంది విష్ణువర్ధనునికడ సెలవు గైకొని వెడలి పోయెను. విష్ణువర్ధను డా సంభాషణమునే తలచుకొనుచు దన జన్మము రాకాపూర్ణిమగ నెట్లు మారునని యను

కొన్నాడు. చంద్రావతీదేవి గాధ యెంత పవిత్రమైనది. విజయవాటిక నింద్రకీలమున దపమాచరించిన యర్జునునకు బ్రత్యక్షమైన పరమేశ్వరుడు 'అర్జునేశ్వరు' డైనాడు. చంద్రావతిదేవి మల్లీపుష్పముల బూజించిన యా శ్రీశైలేశ్వరుడు మల్లికార్జునుడైనాడు. భగవంతు డెంత భక్తవత్సలుడు!

ఆలోచనాధీనుడై విష్ణువర్ధనుడు తన భవనోద్యాన వాటిక బ్రవేశించినాడు. ఒంటిగా నుద్యానవనమున సంచరించుచు నా సాయంకాలము విరియబూచిన మల్లెపొదలను జూచి యొక్క నిట్టూర్పు విడిచినాడు. చంద్రకిరణములు భూమిని వ్రాలి, కాకుసుమములైన వట! కవులెంత మతి లేనివారో యని యనుకొనినాడు. ఒక బొద్దుమల్లె నతడు కోసి, కన్ను లరమూతలువడ నాఘ్రాణించుచుండెను.

తన వెనుక నెవరో వచ్చినట్లు పదముల చప్పుడుకాగా నాతడు చటుక్కున వెనుదిరిగెను. పిష్టపురమున దానుజూచిన బాలిక యెదుట నిలిచియున్నది.

"మీరా!"

"నీవా!"

"చాళుక్యమహారాజు వచ్చెను, గాన మీరు తప్పక దర్శన మీయగలరనియే నే నిచ్చటకు వచ్చితిని."

"అదెట్లు సంభవము?"

"తమకు దోటలన్న నిష్టమని గ్రహించితిని."

"అవును, నాకిష్టమె! రాజసేవకులకు మాకు వనవిహార మొనర్చుటకు దీరిక యెక్కడిది!"

"ప్రభూ! పూవులు పూయని ప్రదేశము లోకమున నుండునా!"

"ఆ! మరుభూములు. నా బ్రతుకే మరుభూమి."

"అట్లనకుడు ప్రభూ! అంతర్విచారణోన్ముఖులైనవారి కొక్కొకపు డిట్టి విషాద భావములు గ్రమ్ముకొను చుండును."

"రాజకుమారీ! మీ మహారాజకుమారి సేవను వదలి నీవెట్లు రాగలిగితివి?"

"దుఃఖభూయిష్టమైన యీ లోకములో నిట్టియుత్తమ స్నేహములే యానందము నిచ్చునవి. మనుష్యుడు స్నేహమును వాంఛించును. అందుకై పరితపించును."

"తమ తల్లిదండ్రు లెవరు?"

"నాకు దల్లిదండ్రులు లేరు. అన్నగార లిరువురున్నారు. వారువారి పనులలో నిమగ్నులై యుందురు. నేను 'దేశమ్మకాకి'నై యిట్లు తిరుగుచుందును."

"అదేమి ప్రభూ! విష్ణువర్ధన మహారాజులు ప్రేమార్ణవులని చెప్పుకొందురే!"

"అది నాకేమి లాభము! వారు నాకింత యాశ్రయ మిచ్చిరి. వారితో వచ్చుట వలన, నా యావేదన తీరునట్లు దేశము తిరుగుట కనువైనది."

"సర్వసౌందర్యములును రూపొందిన యా బాలిక మోము చంద్రకాంతులు ప్రసరించి, యామె నొక దివ్యభామిని యనిపించినవి. ఆమె పెదవుల క్రీడాభరిత మందహాసములు విరిసినవి. ఆమె దోసెడు మల్లికాకుసుమములు కోసికొని విష్ణువర్ధనుని

కడకు వచ్చి "ప్రభూ! తామొక్క మల్లికాకుసుమమే కోసికొన్నారు. ఈ పూమొత్తము లన్నింటిని గ్రహింపుడు. అప్పుడే మీకీ పూవుల రహస్యము హృద్గతము కాగలద"ని తలవాల్చి పలికినది.

విష్ణువర్ధను డామెను చెయెత్తి వారించి "రాజకుమారీ నీవు విష్ణుకుండిన రాజకుమారి చెలియలవు. నేనెవరైనది నీకు బూర్ణముగ దెలియదు. నేను పొట్టివాడను. నాకిప్పు డిరువదెనిమి దేండ్లున్నవి, అయినను నాగుజ్జుదనము వలన నొకబాలకునివలె గన్పట్టుదును. నీవు నన్ను బాలకునిగా దలచి నిస్సందేహముగ నాతో మాటలాడుచుంటి వేమో" యని యాతడు సవిచారముగ బల్కినాడు.

## 22

విష్ణువర్ధనుని మాటల కంశుమతీకుమారి యిసుమంతయు గలత నందలేదు. ఆమె సునిశ్చల మనస్కయై అటులనే నిలుచుండెను. మోమున చిరునగ వింతేని జెదిరిపోలేదు.

"ప్రభూ! నేను కులీనను. ప్రేమకు బొట్టి పొడుగు లాలంబనములు గావు. నిర్మల హృదయమే యాలంబనము. తొలిసారి మిమ్ము పిష్టపురమున జూచినప్పుడే నా హృదయ కుసుమమునకు మీరే తావియని దివ్యభావము స్ఫురించినది."

విష్ణువర్ధనుని ఆశ్చర్యమునకు మేరలేదు. "రాకుమారీ! నీవు విష్ణుకుండినుల చుట్టమవు. మీరు బ్రాహ్మణక్షత్రియులు గదా! ఇక నే నెట్టి కులమువాడనో! హీనవంశజులు గూడ సామంతులు కావచ్చును గదా! అదియును గాక! నే నొక సామంతుడను, సైనికుడను."

"ప్రభూ! సామంతత్వముగాని మహారాజాధికారము గాని అంతఃకరణ వృత్తికి నుద్దీపనమెట్లగును! నిజమును గోచరింప జేయునది అంతస్సాక్ష్యము. నాకా పిష్టపురముననే సత్యము దర్శన మిచ్చినది. నే నచ్చటనుండి నా తల్లిదండ్రుల కడకు వచ్చిన తోడనే వారికి బ్రభువుల గురించి నివేదించితిని వారి యనుమతి పొందితిని. మా కులగురువు నారసింహ భట్టువారును నందు కనుమతించి నన్నాశీర్వదించినారు"

"ఎవరు రాకుమారీ! నీ తల్లిదండ్రులు? నేను దిగ్భ్రమ నందుచున్నాను."

"ప్రభూ! నేను మంచనభట్టారక మహారాజు తనయను, నన్నంశుమతి యందురు."

"ఏమీ! మీరు మహారాజు తనయ అంశుమతీ కుమారికలా!"

ఆత డొక్కనిమేష మక్కడుండలేక, వేగమున మోము వెనకకు ద్రిప్పి చూడకయే వెడలిపోయినాడు. అంశుమతీ కుమారి తెల్లబోయి, రిచ్చవడి యచటనే నిలుచుండి పోయెను.

అప్పుడు మాధవీలత పకపక నవ్వుచు నామె కడకు వచ్చి "దొంగా! ఎంతపని చేసితివమ్మ? నా కిసుమంత యేని జెప్పక నీహృదయ – చోరుని గలియుటకు దొంగవలె నిచటకు వచ్చితివా?"

"నేను దొంగనగుటెట్లు మాధవీ? మన పరిచారికలతో నిచ్చటకు బోవుచుంటినని చెప్పియే వచ్చితిని."

"నీతో జెప్పి వచ్చుటకు నీవు కనబడవైతివి. వారి గలసికొనగలనని నమ్మకమున్నది. కలిసి కొంటిని."

"ఆయన యెవ్వడో తెలియునా నీకు?"

"ఎవ్వరైన నేమి! ఉత్తమ చరిత్రుడు"

ఆ బాలిక లిరువురు నంతఃపురములోనికి వెడలిపోయిరి.

"ఇదియిది" యని తెలియరాని యాలోచన లెన్నియో యుద్భవించి యాప్రభువును గలతవెట్టుచుండెను. తానెవ్వరో ఆ బాలిక యెరుగునా! విష్ణుకుండిన రాజకుమారి జగదేకసుందరియని విని, తనయన్నగారు వివాహము చేసికొమ్మని తన్నెన్నిసారులో కోరినారు. కాని తన రాజ్యమున దన్ను ప్రేమింపవచ్చు నాడది యుండునా! ప్రేమలేని వివాహమును తానెట్లొప్పుకొనగలడు! కాని యీబాలమాటలలో నసత్యము గోచరించదు. తన కెట్లీ సందిగ్ధావస్థ తీరును.

స్వచ్ఛజీవనయగు విజనప్రదేశపుష్పము నొకదానిని సేకరించగలిగితినని కొంత యానందపులకితుడనైన మాట నిజము. కాని యీపుష్పము రాజోద్యానమున ఉద్భవించినదేకదా!

* * * *

ఆ రాత్రి మాధవీలత మంచనభట్టారక మహారాజు కడకు బోయి, మహారాజును దర్శించి వారితో నంశుమతీ కుమారి కుబ్జ విష్ణువర్ధనునే ప్రేమించుచున్నదనియు నాతడొక సామాన్య సామంతు డనుకొనియే ఆయనను బ్రేమించిన దనియు, నా ప్రేమకు విష్ణువర్ధన చాళుక్యుడును సముఖుడై యున్నట్లు భావించవచ్చుననియు, నాతడును అంశుమతి యొక సామంతుని కొమరితయని తెలిసియు ననుకూలుడుగ నుండెననియు నా సామంతనమే తాను విష్ణుకుండిన మహారాజు పుత్రికనని యంశుమతి విష్ణువర్ధనునికి దెలిపెననియు జెప్పెను.

మహారాజు నానందమునకు మేరలేకపోయెను. వెంటనే యామహారాజు తన దేవేరి మందిరమునకు బోయి "దేవీ! నేనింత కాలమును వృధాభయములకులోనై గురువుగారిని జాతకము లడుగుచుంటిని. అమ్మాయి ప్రేమించినది విష్ణువర్ధనమహారాజు" అని తెలిపెను.

"మహాప్రభూ! విష్ణువర్ధనమహారా జిందుకు సుముఖుడేనా!"

"సుముఖుడైనట్లు సౌభాగ్యవతి మాధవీలత చెప్పుచున్నది."

మహారాజు యంతఃపురపు బరిచారికలకు సంతోషమున బహుమతు లర్పించినది. మంచెన భట్టారక మహాప్రభువు ఉదయమున సకలాలయములయందును నర్చనలు జరిపింపుమని తన యాంతరంగికుడగు గంచుకికి నానతి యిచ్చెను. ఆ రాత్రి యెవరికిని నిదుర పట్టలేదు.

మరునాడు సాయంకాలము బంగారు నీరెండలు తోటలలో దోబూచులాడుచు బరుగులిడుచున్నవి. ఆకసమున బసిమిరంగు కుంకుమరాగమలముకొనుచున్నది. సాయంకాలము సకలవర్ణములకు నిలయము సంధ్యా నటేశ్వరుని తాండవక్రీడా

దివ్యసుముహూర్తము! సంధ్యాకాలముల దివ్య లోకమునకు మర్త్యలోకమునకు రాచబాటలు నిష్పన్న మగునట.

విష్ణువర్ధను డా దిన మెట్లు గడపెనో! ఏ రాజ కార్యము, లెట్లు నిర్వహించెనో! ఏ సామంతుల కే యాజ్ఞా పత్రములు పంపెనో! కాని, సాయంకాలము వలదనుకొని నను ఆతడు నిన్నటి తోటలోని పోయినాడు. ఆ మల్లికా నికుంజములనే తారసిల్లినాడు. మల్లియలలో మహాత్మ్య మేమైె ఉన్నదా! యనుకొనుచు నాతడు నవ్వుకొనినాడు. అంశుమతీదేవి శీతాంశుమతియా! చండాంశుజ్వాలయా!

ఆపొదల దాటి, క్రీడాశైలము దాటి, కృత్రిమ సరోవరము దాటి, కేళాకూళులుదాటి గుబురులుగ బెరిగిన గున్న మామిడి తోటలోనికి బోవ విష్ణువర్ధనుడు సంకల్పించునప్పటికి నా మామిడితోటలోనుండి అంశుమతీ రాకుమారియు మాధవీలతయు నాయన కెదురైనారు. ఆ బాలిక లిరువురు విష్ణువర్ధనునికి నమస్కరించినారు. ఆ ప్రభువు తడబడుచు బ్రతినమస్కార మిచ్చినాడు. ఇంతలో నా తోటలోనుండి కుంభకుర్ణునివలె భయంకరుడైన యొక మానిసియు నార్గురు రాక్షసులను బోలు ముష్కరులును పరుగున వచ్చి వీరి ముప్వురను జుట్టు ముట్టిరి.

## 23

విష్ణువర్ధనుడు సింహమువలె మారిపోయినాడు. ఆతడు నిరాయుధుడు. మొలనున్న రతనాల పిడిగల ఛురిక తప్ప వేరాయుధము ప్రభువుకడ లేదు. బాలిక లిరువురు నాయన ప్రక్కకురికిరి, విష్ణువర్ధనుడు కన్నుల నగ్నివర్షము కురిపించుచు "ఎవరు మీరు? ఈ రాజాంతఃపురోద్యానమున కేల వచ్చిరి?" అని తరిగిన లోహపుధారవంటి వాక్కుల బ్రశ్నించినాడు. అవి యెంత మెల్లగ నున్నవో అంత భయంకరములు.

"నీవా! కుబ్జవిష్ణువర్ధనుడవా! మా మహారాజు దానార్ణవు విరోధివా! అవునురా! నే నీ మాధవీలతను బెండ్లి యాడెదను. ఆమెను భగవంతుడు నాకోసము సృష్టించెనని మా ప్రభువానతి యిచ్చినాడు." అని యెనిమిదడుగుల పొడవున కొండవలెనున్న దానార్ణవుని బంటు కుంభమిత్రుడు పలికినాడు.

"ఓరీ! గౌడ మహిషమా" విష్ణువర్ధనుని మాటలు పిడుగులవలె జ్వలించినవి.

"ఈ కుంభమిత్రు డపరఘటోత్కచుడు అని మాప్రభువు పలికెనే! ఈమాటకు నిన్ను నాయెడమచేతితో బురుగును నలిపినట్లు నలిపెదను."

వారింకను చుట్టుముట్టిరి. కుంభమిత్రుడు చెట్టువలెనున్న తన గదనెత్తి విష్ణువర్ధనునిపై కురికెను.

"మీరు వారు పట్టుకొనినను గడబిడ పడకుడు" అని తల త్రిప్పకుండగనే విష్ణువర్ధను డా బాలికలకు చెప్పి మొల నున్న ఛురికను దీసి, ఆ భయంకర నిశాచరునితో బోరు సలుప నిలచినాడు.

ఆ కిరాతులలో నలుగురు చటుక్కునవచ్చి విష్ణువర్ధనుని వెనుకనున్న యా బాలికల చేతులను బట్టుకొనినారు.

విష్ణువర్ధనుని గుంభమిత్రుడు గదతో ముక్కలుచేయుటకు దాని నెత్తిన క్షణముననే "ఛీ! రాక్షసుదా! నాప్రభువు పైననే గదనెత్తుట" అని అంశుమతీకుమారి యాడుపులియై యొక్క విదల్పున దన్నదిమిపట్టిన చేతులు విదల్చుకొని, విష్ణువర్ధనుని ముందున కురికి, యా ప్రభువును వెనుకకు నెట్టి వేసినది. కుంభమిత్రుడు కన్నులింతలు చేసికొని, "ఆ! నిన్ను బూవులలోబెట్టి కొనిరమ్మని నా ప్రభువు సెలవిచ్చినాడు. ఒక్క క్షణమున్నచో నీవు తుత్తునియలైపోయి యుందువు" అని యరచి యెత్తినగద నట్లనే యుంచినాడు. ఆ క్షణికమాత్ర సమయములో విష్ణువర్ధనుడు ఛంగున కుంభమిత్రుని కంఠముకడ కురికి, తన ఛురికను నాతని భుజమున పిడివరకును దింపి వేసినాడు,

"అమ్మో" యని, చేతిగద జారిపోవ, నెడమచేతితో గుంభమిత్రుడు కుబ్జవిష్ణుని బట్టుకొనబోయినాడు. విష్ణువర్ధను దచటలేడు. కుంభమిత్రుని నడుమున గట్టిన మహాఖడ్గము విష్ణువర్ధనుడు చఱ్ఱునలాగి వేసి, యెంతవేగమున ముందున కురికెనో, యంతవేగమున వెనుక కురికినాడు. ఆ ఖడ్గము విష్ణువర్ధను నంతయున్నది. ఆ మహావీరుడు రెండుచేతుల నాఖడ్గమును మెఱుపు వేగమున బ్రయోగించుచు, దిరిగి యంశుమతిని బట్టుకొని యెత్తుకొని పరుగిడిపోవు ముష్కరుల వెన్నాడెను.

అంత కొక్కక్షణము ముందుగనే మాధవీలతకు నోట గుడ్డలు గ్రుక్కి నలుగురు ముష్కరు లెత్తుకొని పారిపోవుచుండిరి. విష్ణువర్ధనుని వేగము నిరుపమానము. అంశుమతిని బట్టిన యొకని తల దుల్లిపడిపోయెను. తక్కిన యిరువు రామెను క్రింద జారవిడచి, పలాయనమంత్రము పఠింప నుద్యుక్తులైరి కాని యొకని చేయి తెగిపడినది. రెండవవాడు రెండు తుండెములై పడిపోయినాడు.

ఆ ఖడ్గమును భుజమున ధరించి మఱుక్షణమున చిందువువలె నా ప్రభువు తోట ద్వారమును దాటి ప్రక్కతోటలో బరుగిడిపోవు ముష్కరులను సమీపించినాడు. అచ్చట విష్ణువర్ధను నిరువదిమంది విరోధులు ముట్టడించిరి.

పడిపోయిన యంశుమతి చివ్వునలేచి విష్ణువర్ధన మహారాజు విడిది చేసిన భవనము దిశకు బరుగెత్తెను. ఆమె కేకలు విని, జయనందియు గొంద రంగరక్షకులును దోట లోనికి బరుగిడి వచ్చిరి. "మహాప్రభూ! – దొంగలు – రక్తము ఎత్తుకొనిపోయిరి" అని చెప్పుచునే అంశుమతి మూర్ఛపోయినది.

జయనంది అంగరక్షకు నొకని జూచి రాకుమారి కుపచారము సేయ బరిచారికల బిలువు మన చిప్పి శంఖ మూదుమని దళవాయి నొక్కని కాజ్ఞ యిడెను. ఆతడప్పుడే శంఖము తీయుచున్నాడు.

"భోం, భోం, భోం," అని శంఖధ్వానము దెసలు నిండినది. అచ్చట కావలియున్న అంగరక్షక సైనికులు జయనంది కడ కురికిరి. జయనంది వేగముగ మామిడితోట వైపునకు బరుగిడ నారంభించెను. అతని వెనుక అంగరక్షక సైనికు లర్ధచంద్ర వ్యూహముగ బరుగిడ నారంభించిరి.

శంఖధ్వానము లొకటి కొకటి యుప్పందించుకొనినట్లు ఆ తోటల నావరించి, మహికుడ్యమున కావలను "భోం భోం" అని నినదింప సాగినవి. ఎచ్చోటు జూచినను నంగ రక్షక సైన్యములు నిండిపోయినవి.

## 24

మాధవీలతాకుమారి నెత్తుకొనిపోవు ముష్కరులు తాము నిర్దేశించుకొన్న స్థలము కడకు పరుగిడి పోవుచుండిరి. వారా బాలిక కదలకుండ రజ్జువులచే గట్టివేసిరి. నోట గుడ్డను గ్రుక్కిరి.

సరిగ వారచ్చట చేరబోవునప్పటికి చాళుక్యాంగ రక్షక దళములు వారిని చుట్టముట్టినవి. వారు తమ ఆయుధముల బారవేసి, తలలు వాల్చి నిలిచిపోయిరి. మాధవీలతాకుమారికట్ల నొక్కవృద్ధసేనాపతి విప్పి, నోటి గుడ్డలాగి వేసినాడు.

విష్ణువర్ధన ప్రభువు బలమెట్టిదియో కాని కుంభమిత్రుని మహాఖడ్గమును తూలికవలె త్రిప్పుచు, ఏటుకొక ముష్కరుని తీతకొక రాక్షసుని ఆ వీరాధివీరుడు హతమార్చు చుండెను.

కుంభమిత్రు డెడమచేత, కుడిభుజమున దిగిన విష్ణువర్ధనుని ఛురికను లాగివేసి రక్తము చిమ్మన ప్రవహింపుచు దన్ను తడిపివేయుచున్నను లెక్కజేయక రోజుకొనుచు, నెడమచేత గదను ధరించి, విష్ణువర్ధనుని కడకు బరునికి వచ్చెను.

విష్ణువర్ధనుని జుట్టిముట్టినవారు నలుగురైదుగురు హతమారినారు. ఆ ప్రభువునకు రెండుచోట్ల గాయములు తగిలినవి.

కుంభమిత్రు డాప్రభువుని వెనుకనుండి పొడిపొడిచేయ గద నెత్తినాడు. ఆ గండరగండ డక్కడ లేనేలేడు. తన కున్న బలమంతయు నుపయోగించి ఒక్క యురుకున ఒక మామిడిచెట్టు మొగ కావీరు దురికినాడు. ఆ చెట్టునకు వీపాన్చి రోజుచు ఖడ్గమునెత్తి తనకడకు వచ్చు ప్రతివానిని తెగటార్ప సిద్ధముగ నుండెను. కుంభమిత్రుడు తన గదను గిరగిర నెడమచేతితోడనే త్రిప్పుచు, పాము మాపులు విష్ణువర్ధనునిపై బరపుచు, నొక్కొక్క అడుగున నా ప్రభువును దరియుచుండెను.

ఆ సమయమున సింహగర్జన నొనరించుచు జయనంది పరుగున వచ్చినాడు. "ఎవడురా నా రాజును ఎదుర్కొన్నది" అని జయనంది అరచి వజ్రపాతమువలె కుంభమిత్రుని దాకినాడు.

విషువర్ధనుని అంగరక్షకులు రామబాణ వినిర్ముక్త మృత్యుశరములవలె వచ్చి ఆ ముష్కరులపై దలపడినారు.

కుంభమిత్రుని తల ఎగిరి భూమిపై పడినది.

జయనంది, నిశ్చలుడై చెట్టుమొదల నిల్చియున్న చాళుక్యుని కడ మోకరిల్లి కన్నుల నీరుతిరుగ "మహా ప్రభూ! తమ కెంతటి యాపత్తు తెచ్చినాను. నా ప్రమత్తతయే దీనికి గారణ" మనచు దన యుత్తమాంగ మా ప్రభువు పాదముల కాన్చినాడు.

విష్ణువర్ధనుడు చిరునవ్వున జయనంది నెత్తి, తన హృదయమున కదుమునొన్నాడు.

అతని హృదయమున యంశుమతి దివ్యదేవియై సాక్షాత్కరించినది.

ఇంతలో ఒక వైపునుండి మాధవీలతాకుమారియు, మరియొక వైపునుండి అంశుమతీకుమారియు, నచ్చటకు బరుగిడి వచ్చిరి.

* * * *

పులకేశి మహాప్రభువు కడకు నారసింహభట్టులవారు సకల పరివారసమేతులై విష్ణుకుండిన మంచన భట్టారకు నేక పుత్రిక నంశుమతీ దేవిని చక్రవర్తి ప్రియానుజులైన శ్రీసత్యా శ్రయ విషమసిద్ధి విష్ణువర్ధన మహారాజున కుద్వాహ మొనరింప ననుమతి వేడుటకు వచ్చినారు. తన కత్యంత ప్రియతమమగు నా యానందవార్తను విని, పులకేశి పృధ్వీవల్లభుడు సింహాసనమునుండి దిగివచ్చి నారసింహభట్టు పాదములకు నమస్కరించి, ఆయన హస్తము గ్రహించి, తన యర్ధసింహాసనమున గూర్చుండబెట్టు కొనెను.

**నార:** మహారాజాధిరాజా! సకలభూమండలాఖండలా! మా మహారాజు తమ కూతురి నిచ్చి విష్ణువర్ధన మహారాజులకు వివాహము చేసిన వెనుక తృతీయాశ్రమస్వీకారము చేయుదురట. విష్ణుకుండిన సింహాసనమున కంశుమతీ దేవియేకదా అధికారిణి. ఆమెకు గాబోవు భర్తయైన విష్ణువర్ధన మహారాజు వేంగీ సింహాసనాసీన స్వత్వుడగును. తమ జామాతకు మా మహాప్రభువు మూర్ధాషేక మొనర్చి తాము శ్రీశైలమునకు దపస్సుచేయ బోవునట. తమ యాజ్ఞకు నేను నిరీక్షించుచున్నాను.

పులకేశి మహారాజు "మహాతపస్వీ! ఈశుభవార్తకై యిన్ని సంవత్సరములనుండియు నెదురు చూచుచుంటిమి. వివాహ పట్టాభిషేకములకు మాప్రతినిధులుగ మా పుత్రులందరును, మా మహారాణియు విచ్చేయుదురుగాక! మాయనుంగు దమ్ముని మనస్సు వశీకరింపగల బాలిక యీ రేడులోకముల లేదను కొంటిమి. అంశుమతీ మహారాజకుమారి అమృతాంశుమతియే!"

వేంగీరాష్ట్రమున మహోత్సవములు యుగయుగములు కవులు కావ్యములు రచింప దగునంత వైభవముగ జరుగుచున్నవి.

శ్రీసత్యాశ్రయ చాళుక్యకులాభరణ పరమమాహేశ్వర పరమభట్టారక, లాట, మాళవ, సురాష్ట్ర, కుంతలాది సకలభువన రాజన్యకిరీటాంచిత రత్న కాంతినీరాజిత పాదసరోరుహ, పరమబ్రహ్మణ్య, సర్వసిద్ధి పలకేశి పృధ్వీవల్లభ చక్రవర్తి యనుగుతమ్ముడు, శ్రీసత్యాశ్రయ పరబ్రహ్మణ్య పరమమహేశ్వర అపరత్రివిక్రమ, చాళుక్యకులాభరణ, విషమసిద్ధి కుబ్జ విష్ణువర్ధన మహారాజునకును; జనాశ్రయ, పరమబ్రహ్మణ్య పరమభట్టారక, పరమభాగవత, శ్రీవిష్ణుకుండిన మంచనభట్టారక, మహారాజాధిరాజు నేకతనయ యంశుమతీదేవికిని, విష్ణునకు లక్ష్మికిని జరిగినంత మహావైభవముగ వివాహము జరిగెను.

ఆ శుభముహూర్తముననే శ్రీపట్టవర్ధనకులతిలక, కాలకంపన మహాసామంత ప్రభువు కొమరుడు జయనంది ప్రభువునకును, కలతీర్థ మహాసామంత, బృహత్పాలాయన పృధ్వీశవర్మ ప్రభువు కొమరిత మాధవీలతాదేవికిని వేంగీపురముననే వైభవమున వివాహము జరిగెను.

ఆంధ్రమహాభూమి నింకొక్క శుభముహూర్తమున పాళికేతన మెగురుచు దనకాంతుల నింపినది. యజ్ఞవరాహ దేవుడే ఆ మహారాజ్యమును సంరక్షింప లాంఛన రూపమున వెలసినాడు. చాళుక్యుల వెల్లగొడు గంధ్రభూమి నంతయు గప్పినది. పంచ మహాశబ్దము లవతరించినవి. గంగాయమునా కలశములు వెలసినవి. ప్రతిధక్కా ధ్వానములు మారుమ్రోగినవి. మకరతోరణయుక్తమై చాళుక్యపతాక, కాంతసింహాసనముల

వెలిగిపోవుచుండ, నాసింహాసన స్వర్ణ సోపానపంక్తి నెక్కుచు, కనకదండయుక్తుడై, కాలకంపన మహారాజు కుడివైపున నిలువ, జయనంది బుద్ధవర్మలు వింజామరలు వీవ, పృధ్వీశవర్మ దవళచ్ఛత్రము ధరింప, నుత్తమ త్రయీపాఠులు, గంగాయమునా పవిత్ర జలములు నిండిన సకల రత్నఖచితస్వర్ణ కలశములు ధరించి, యీవలావలనిలువ ఉత్తమ చాళుక్య కుబ్జవిష్ణువర్ధన మహారాజు పరమభట్టాగకుడై ఆంధ్రచాళుక్య సామ్రాజ్యమునకు బట్టాభిషిక్తుడయ్యెను.

## సమాప్తం

Blank Page

# సాహితీ హిమాలయోత్తుంగ శృంగం

హిమాచల శిఖరాలవలె, గంగా యమునా నదులవలె శాశ్వతత్వం పొందిన ఉత్తమ సాహిత్య స్రష్టల్లో అడివి బాపిరాజు గారు అగ్రశ్రేణిలోని వారు.

బాపిరాజుగారిది విశిష్టమైన వ్యక్తిత్వం. త్రివేణి సంగమంవలె, సంగీత, సాహిత్య, చిత్రలేఖనాలు బాపిరాజులో కలగలిసిపోయాయి.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు బాపిరాజుగారిని గురించి చెప్పిన పంక్తులు కొన్ని చదివితే చాలు బాపిరాజుగారి వ్యక్తిత్వం అర్థమవుతుంది.

"అతడు గీసిన గీత బొమ్మై
అతడు పలికిన పలుకు పాటై
అతని హృదయములోని మెత్తన
అర్థవత్కృతియై

అతడు చూపిన చూపు మెఱుపై
అతడు తలచిన తలపు వెలుగై
అతని జీవికలోని తియ్యన
అమృత రసధునియై"

ఈ పంక్తులు బాపిరాజుగారి హృదయ స్వరూపాన్ని మన కన్నుల ముందు నిలబెడతాయి.

"హృదయములోని మెత్తన" "జీవికలోని తియ్యన"

ఈ రెండు మహాగుణాలు బాపిరాజుగారిని మహా మానవునిగా తీర్చిదిద్దాయి.

ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఏ నవలైనా తీసుకుని చదివితే ఆయనకు ఎన్నెన్ని విషయాలు తెలుసో అర్థమవుతుంది. తలస్పర్శిగా తెలిసిన వ్యక్తి ఆయన.

"హిమాలయోత్తుంగ శృంగం
నీ బ్రతుకు
ఉమాపతి నాట్యరంగం"

అని గాంధీజీని గురించి గానం చేస్తుంటే తన్మయులమై వినేవాళ్ళం. శరత్ పూర్ణిమా చంద్రికా ధవళమైన బాపిరాజుగారి హృదయం నభూతో నభవిష్యతి.

దాశరథి కృష్ణమాచార్యులు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజ్ఞాన భవన్, 4-1-435,
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.